UNIVERSAL LIBRARY
OU_204610
UNIVERSAL LIBRARY

# Osmania University Library

Call No T81 6 A41B — Accession No. G.T-264

Author అల్లమరాజు సుబ్రహ్మణ్యకవి.

Title [illegible] . 1912

This book should be returned on or before the date last marked below

శ్రీ

# భద్రాపరిణయము.

(పద్యకావ్యము.)

అల్లమరాజు సుబ్రహ్మణ్యకవిప్రణీతము.

ఇది

బ్రహ్మశ్రీ

పురాణపండ మల్లయ్యశాస్త్రులుగారిచే

వ్రాయఁబడినవ్యాఖ్యానముతో

శ్రీపీఠికాపురసంస్థానాధీశ్వరులయనుజ్ఞను

పిఠాపురమునందలి

శ్రీ విద్వజ్జన మనోరంజనీ ముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడియె.

1912.

Copy Right] [Registered.

# వ్యాఖ్యాతృవిజ్ఞాపనము.

విద్వాంసులారా!

శ్రీపీఠికాపురమండలాధీశ్వరులు, మహోదారులు నాకుం బోషకులు నగుమహారాజరాజశ్రీ శ్రీ శ్రీరాజా రావు వెంకటకుమార మహీపతిసూర్యారావుబహదరుప్రభువువారు బ్రహ్మశ్రీ యల్లమరాజు సుబ్రహ్మణ్యకవిగారు రచియించినభద్రాపరిణయ మను కావ్యమున కామూలాగ్రముగఁ డీక వ్రాయు మని శ్రీమంతు లగువారిపీఠికాపురపారశాలయం దాంధ్రోపాధ్యాయుఁడను, నాస్థానమున నాంధ్రగ్రంథశోధకుఁడను, వ్యాఖ్యాతను నగునా కానతిచ్చిరి. నేను శ్రీమంతు లగువారి యాజ్ఞను శిరంబున వహించి నా తెల్వి ననుసరించి సుబోధిని యను పేర నీవ్యాఖ్యానమును గావించితిని. ఇందు నాయజ్ఞానమున నేని, ప్రమాదమున నేని దోషము లున్న మన్నింపుఁ డని మిమ్ము వినయముతోఁ బ్రార్థించెదను.

28-6-12
పిఠాపురము.

ఇట్లు విన్నవించువిధేయుఁడు,
పు. మ. శా.

# తప్పొప్పుల దెలుపు పత్రిక.

| పుట సంఖ్య. | బంతి సంఖ్య. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 1 | 7 | యేత్ అను | యేత్తను |
| 2 | 30 | మగువర్ణగణాదుల | మగునీవర్ణగణముల |
| 3 | 9 | ప్రత్యక్షమయ్యె | ప్రత్యక్షుఁడయ్యె |
| ,, | 15 | ,, | ,, |
| ,, | 20 | ప్రత్యక్షము | ప్రత్యక్షుఁడు |
| 6 | 19 | పట్రిమైన | వట్రువైన |
| 8 | 22 | నిషక్త | నిషక్తంబు |
| ,, | ,, | తగులుకొనిన | తగులుకొనినది |
| ,, | ,, | చిత్తప్రవృత్తి | ఐనచిత్తప్రవృత్తి |
| 12 | 5 | సేల | నేల |
| 14 | 19 | సముద్ధ | సముత్థ |
| 15 | 1 | వారణాళీ | వారణాళి |
| 16 | 10 | సముద్ధ | సముత్థ |
| ,, | 19 | దుర్ణిరీక్ష్య | దుర్నిరీక్ష |
| 18 | 01 | శ్రవము | శ్శ్రవము |
| 20 | 5 | ఇంద్రుదు | ఇంద్రుఁడు |
| 35 | 21 | మన్మథుఁడు | మన్మథుఁడు |
| 44 | 3 | ఖలపఙ్క్తి | ఖల...బు. ఖలపఙ్క్తి |
| 46 | 13 | మన్మథుఁడు | మన్మథుఁడు |
| ,, | ,, | ,, | ,, |

| పుట సంఖ్య. | బంతి సంఖ్య | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 47 | 2 | లోతు | లోఁతు |
| ,, | 7 | మన్మథుఁడు | మన్మథుఁడు |
| 48 | 17 | పొగడికయు | పొగడికను |
| 61 | 5 | వస్తువులును | వస్తువులను |
| ,, | 8 | పితృవ్యుండు | పితృవ్యుండు |
| 89 | 23 | అధిక | యధిక |
| 92 | 24 | పరిమళములు | పరిమళములను |
| 99 | 9 | పట్టణము | పట్టనము |
| 113 | 20 | పల్లకీపల్లవములకు | పల్లకిపల్లవములకును |
| ,, | 27 | పల్లకీ | పల్లకి |
| 114 | 16 | సంపంగి | సంపంగె |
| ,, | 18 | చఱులు | చఱులను |
| ,, | 20 | తీవయిండ్లును | తీవయిండ్లను |
| ,, | 23 | రత్నములు | రత్నములను |
| 115 | 23 | భామా | భామా కామా భామా. |
| 120 | 20 | మాలికలమేనఱికమాడ | మొత్తంబులనవఘళింప |
| 122 | 23 | మన్మథుఁడు | మన్మథుఁడు |
| 125 | 18 | పథము | పధము |
| 130 | 1 | బ్రాహ్మణులు | బ్రాహ్మణులఁ |
| ,, | 3 | ,, | ,, |
| 131 | 2 | ముల్లోకములు | ముల్లోకములఁ |
| 139 | 11 | ముద్దుపిల్ల | ముద్దుఁబిల్ల |

| పుట సంఖ్య | బంతి సంఖ్య | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 139 | 14 | ముద్దుపిల్ల. | ముద్దుఁబిల్ల |
| 145 | 19 | సరసంపు | సరసంపు గుత్తులు.సరసంపు |
| 146 | 25 | కాదగుదు | కాఁదగుదు |
| 149 | 27 | మునఁజేసివ, తా | మునఁజేసి, తావ |
| 150 | 9 | కు తెలియ | కుఁదెలియ |
| 151 | 4 | నేమిండ్రి | నేనిండ్రి |
| ,, | 19 | ఏము | ఏను |
| 157 | 24 | బ్రతిమాలు | బతిమాలు |
| 171 | 27 | సొమ్ములు | సొమ్ములను |
| 177 | 26 | స్నాన | స్నాత |
| 181 | 14 | వాసప్రష్ఠ | వానప్రస్థ |
| 183 | 13 | సంపంగి | సంపంగె |
| 184 | 10 | ,, | ,, |
| ,, | ,, | ,, | ,, |
| 195 | 16 | గ్రక్కిరిసి | గ్రిక్కిఱిసి |
| 196 | 9 | , | ,, |
| 198 | 14 | బ్రితిమాలు | బతిమాలు |
| 204 | 12 | బడినగలు | బడీసనగలు |
| 205 | 15 | సంపంగి | సంపెఁగ |
| 207 | 9 | చంచలనయనా | చంచలనయనా...పంచా [యుధ. చంచలనయనా |
| 211 | 6 | పారి | పాఱి |

| పుట సంఖ్య. | బంతి సంఖ్య | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 211 | 21 | నవ్యా | నవ్య |
| ,, | 25 | ప్రత్యక్షుంబగుః | ప్రత్యక్షుండగుః |
| 212 | 5 | ,, | ,, |
| 214 | 14 | అనుగుంజెలువ | అనుఁగుంజెలువ |
| 218 | 12 | ప్రత్యక్షమైన | ప్రత్యక్షుఁడయిన |
| 223 | 3 | పూఁదోట | పూఁదోఁట |
| 224 | 1 | గాసనృత్య | గాననృత్య |
| 228 | 14 | ధృతి | ధృతికోమలులు |
| 234 | 28 | లఅం | అలం |
| 241 | 23 | చెట్లమొదటఁ బటికపు రాలతోఁ గట్టిన యరఁగుల | చెట్లమొదట నీరునిల్చుటకై పటికపురాలతోఁ గట్టిన పల్లముల |
| 242 | 15 | సహించ | సహింప |
| 244 | 6 | యౌవ్వన | యౌవన |
| 252 | 3 | మాలిక | మాలికా |
| ,, | 4 | నెమల్ల | నెమిల్ల |
| 258 | 8 | (వస్తువులను, | (వస్తువులను) |
| 259 | 25 | తగదనుట | తగదనియర్థము |
| 261 | 10 | అంచిత | అంచిత ... సీమః. అంచిత |
| 263 | 7 | ప్రియాః | ప్రియా. |
| 269 | 9 | క్రొత్తదామర | క్రొత్తతామర |
| 271 | 9 | తేఁపు | తేపు |

| పుట సంఖ్య. | బంతి సంఖ్య. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 271 | 12 | పట్టణము | పట్టనము |
| 281 | 2 | కర్త | కర్త్రి |
| 288 | 28 | విక్రమంబులు | విభ్రమంబులు |
| 290 | 5 | సేక | సేద |
| ,, | 28 | భయడుట | భయపడుట |
| 305 | 19 | దివశబ్ద | దినశబ్ద |
| 311 | 12 | నర్ధా | నర్థా |
| 314 | 21 | మతో | నుతో |
| 318 | 17 | మూడు | మూఁడు |
| 320 | 20 | పలుమారు | పలుమాఱు |
| 320 | 27 | విందాన | విందాను |
| 323 | 7 | పట్టణా | పట్టనా |
| 325 | 6 | నలకూబరునితో | నలకూబరునిశరీరముతో |
| ,, | 8 | జయంతునితో | జయంతునిశరీరముతో |
| 330 | 14 | సంఘాతంబు | సంఘాతము |
| 331 | 5 | తామ్రమకుత | తామ్రమాకుత |
| 332 | 12 | యూథ | యూధ |
| ,, | 13 | ,, | ,, |
| 343 | 25 | నిబ్బఱ | నిబ్బర |
| 344 | 4 | ,, | ,, |
| ,, | 13 | పట్టణంబు | పట్టనంబు |
| 348 | 10 | కనుపడులట్లు | కనుపడునట్లు |

| పుట సంఖ్య. | బంతి సంఖ్య. | తప్పు | ఒప్పు. |
|---|---|---|---|
| 348 | 11 | పగలు | పగటి |
| 350 | 24 | పిఠంబునవఘి | పీఠంబునధి |
| 351 | 4 | సముదాయముయొక్కయు | సముదాయముయొక్క |
| 352 | 3 | నీరంధ్రంబులు | నీరంధ్రంబును |
| ,, | 14 | పీఠంబునన్ | పీఠంబున్ |
| ,, | ,, | పీఁటయందున్ | పీఁటను |
| ,, | 15 | కూర్చుండెన్ | ఎక్కెను |
| 353 | 2 | ముద్దుకూఁతు | ముద్దుఁగూఁతు |
| ,, | ,, | ,, | ,, |
| 357 | 6 | చక్కందనము | చక్కందనమును |
| ,, | 12 | మన్మధుఁడు | మన్మథుఁడు |
| 375 | 13 | ఆఘశుఁడు | అధీశుఁడు |

శ్రీ దేవాయ నమః

## ఉపోద్ఘాతము.

అవాఙ్మానసగోచరుండును, సర్వశక్తుండును నగు పరమేశ్వరుండు దృశ్యమానం బగు నిమ్మహాప్రపంచమునందలి మానవహృదయక్షేత్రములు వివిధప్రజ్ఞాబీజసమన్వితంబులై యుత్పత్తిం గాంచు నబ్బురపుటేర్పాటుం గావించి యున్నాఁడు. ఈక్షేత్రబీజములు మనుష్యశరీరములతోడనే జనన మందుచు, వానినే యాశ్రయించి యుండి, వానితోడనే వృద్ధిక్షయములఁ గాంచుచున్నవి. మఱియు నవి తమసంయోగమహిమచే నత్యద్భుతప్రభావసంపన్నంబులై, తాము రూపరహితములయ్యు, సృష్టియందలిరూపసహితపదార్థములలో ననేకములవిచిత్రతరనిర్మాణంబునకు హేతుభూతంబులై యొప్పారుచున్నవి. తొలుదొలుత హృదయక్షేత్రముల నణఁగియుండుప్రజ్ఞాబీజములు లోకసంబంధమనుజలాధారమ్మున మొలకలెత్తి, లోకపరిచితి, గురుజనశుశ్రూష, సత్సహవాసము, విషయగ్రహణప్రయత్నము, లబ్ధవిజ్ఞానమననము, మొదలగుదోహదక్రియలచేఁ గ్రమక్రమముగఁ బెరిఁగి, బహువిధకళ లను శాఖోపశాఖలు గలమహావృక్షమై, పిమ్మట నూహలను మొగ్గలు దొడిగి, యాలోచన లనుపుష్పముల వికసింపఁజేసికొని తుదకు నానావిధశక్తు లనుఫలములను గాంచుచున్నవి. ఇచ్చట 'శక్తి' యనఁగా దేహదార్ఢ్యము గాక మనస్సామర్థ్యమువలనఁ గృషి, వాణిజ్య, శిల్పాదికర్మములకు ననుకూలము లగుపదార్థముల నేర్పఱించుకొనుమార్గములఁ గనిపెట్టునొకజ్ఞానమై యున్నది. (మరుభూములయందలివిత్తనములవలెనే కొందఱుమానవులహృదయక్షేత్రములందలిప్రజ్ఞాబీజములు

మొలక లెత్తకయు, నెత్తినను వృద్ధినొందకయు, విజృంభింపకయు, ఫలింపకయు నిట్లనేకవిధముల వీసరవోవుచున్నవి. ఇందులకు నుత్పత్తిలోపము, దోహదలోపము మొదలగుకారణము లనేకములు గలవు. వానింగూర్చి వ్రాయుట కిది యదను గాదు గావున విరమింప నయ్యెను.)

పైని వ్రాయఁబడినరీతిని మానవులకు వివిధము లగుశక్తులు గలుగుచున్నవిగదా! అవి యన్నియు నాశ్చర్యానందకరములును, లోకోపకారములు నై యున్నవి. ఆశక్తు లన్నిటిలోను గవితాశక్తి యత్యద్భుతమైన దనియు, నిరుపమాన మైన దనియుఁ జెప్పవచ్చును. తక్కినశక్తు లన్నియు దానిలో నిమిడిపోవును. (ఒకానొకబుద్ధిమంతుఁడు ముం దెన్నఁడో యూహించి చేయఁగలయొకవిచిత్రపదార్థమును సైతము కవీంద్రుఁడు తనప్రజ్ఞచే దానిస్వరూపస్వభావాదులను దనమనసునందే సంకల్పించుకొని, ముందుగానే దానిని దనగ్రంథమునందు వ్రాసి పెట్టుచున్నాఁడు) ఇక్కారణమున నట్టిశక్తి గలసత్కవి దైవముచే నొసంగఁబడినయొకమహాత్ముఁ డని మనము నిశ్చయించుకొనవచ్చును. అతఁడు దైవసృష్టిలోనిపదార్థములను, వానిస్థితిగతులను దనగ్రంథపటమున వ్రాసి వానిని లోకులయెదుటఁ బెట్టి వారి నానందింపఁ జేయును. ఎన్నెన్నో లోకదృష్టాంతసమన్వితంబు లగునీతులను బోధించి వారిని సన్మార్గప్రవర్తకులుగాఁ జేయును. తనబోఁటియితరకవులకుఁ దనగ్రంథ మూఁతగా నుండున ట్లొనర్చును. ఇంక నిట్టిపను లెన్నిటినో కావించును. ఇంచుమించుగ నీయర్థము నూహించియే కాఁబోలు సంకుసాలనృసింహకవి తనకవికర్ణరసాయనమున,

“చ. మనమున నున్న నెవ్వగలు ♦ మాన్పి ఘటింతురు, కావ్యసమ్మదం
బనఘుకథాముఖంబున హి ♦ తాహితబోధ మొనర్తు రింపుగాఁ
గనుఁగొనుకంటె నద్భుతము ♦ గా నెఱిఁగింతు రతీంద్రియార్థముల్
ఘనమతు లెల్లవారికి న ♦ కారణబంధులు గారె సత్కవుల్.”

అని చెప్పియున్నాఁడు.

మఱియుఁ గవిచంద్రుఁడు భగవన్మహిమాప్రదర్శకుఁడని చెప్ప నొప్పును. ఆతఁడు తనవిజ్ఞానచంద్రికలను సృష్టియందంతట లెస్సగా వ్యాపింపఁజేసికొని, వానిసాహాయ్యంబున నీశ్వరమహిమల నన్నిటిని బాగుగా గుర్తెఱిఁగి వానిని మానవులకుఁ దెలియఁజేయుచున్నాఁడు. ఇంకను దేవునిచే సృజింపఁబడి కాలక్రమమున నాశనముఁ జెందినయ నేకపదార్థములను దనకావ్యమునం దెక్కించి, వేలకొలఁదిసంవత్సరము లు గడచినపిమ్మట జనించువారికిసైతము దానిని జూపుచున్నాఁడు. శ్రీ రాముఁడు, సీత, శ్రీకృష్ణుఁడు, ధర్మరాజు మొదలగుసజ్జనులును, రావ ణుఁడు, జరాసంధుఁడు, దుర్యోధనుఁడు మొదలగుదుష్టులును దైవము వలన సృజింపఁబడి, కాలగతిఁ జెందియున్నను, వారిని గవి తనగ్రంథ మునందు వ్రాసి, వారిరూపములు, గుణములు, చర్యలు, మొదలగున వి వారితర్వాతఁ జిరకాలమునకుఁ గలిగినమనయెదుటఁ బెట్టుచు వారిని శాశ్వతనాములను జేయుచుండుట మనమెఱుంగుదుముగదా! ఇంత యేల? కవి వ్రాసియే యుండనియెడ వెనుకటివృత్తాంతము లెవ్వియుఁ బిమ్మటివారికి బొత్తిగఁ దెలియనే తెలియవు, కావునఁ గవీంద్రుఁ డీశ్వ రలీలలను బ్రకటించువాఁడని చెప్పవచ్చును. దీనినుద్దేశించియే యొకా నొకమహాత్ముఁడు "షైయిర్ కిలీదె దరే గంజె రాజె ఫితరతస్త్" (కవియొక్కవాక్కు సృష్టిరహస్య మనుధనాగారముయొక్క ద్వారము నకు బీగము.) అని చెప్పియున్నాఁడు.

కొందఱుబుద్ధిమంతులు కవి, దైవసృష్టికిఁ బ్రతిసృష్టిచేయుమహా నుభావుఁడని చెప్పుదురు. వారిమాట విశ్వసనీయమే. ఐనను దానికిని దీనికిని గొంతభేదము గలదు. భగవానుఁడు సృజించినవి దృశ్యమాన ప్రపంచములోనివి. కవి సృజించెడిది భావనాప్రపంచము. భగవత్ప్రి

పంచమునం గలపదార్థములు యథార్థములు. కవిప్రపంచములోనివి కల్పితములు. ఇట్లే తక్కిన భేదములును నెఱుంగఁదగును. ఇట్లయ్యును గవిసృష్టి భగవత్సృష్టితోఁ గొన్ని విషయములయందు సమాన మగుచున్నది. ఎట్లన, శ్రీరామాదులు దైవసృష్టిలోనివా రని మనము విందుముగదా! అట్టిశ్రీరామాదు లేకారణమున నైన సుఖదుఃఖాద్యవస్థలకు లోనైనట్లు మనమేవిధముగానైనఁ దెలిసికొన్నప్పుడు సంతోషవిచారాదివికారములపాలగుచున్నాము. అట్లే కవిసృష్టిలోనిపాత్రములకున్ను నెవ్వియైన నట్టియవస్థలు సంభవించినట్లు మనము చూచుటగాని, వినుటగాని తటస్థించినచో నట్టివికారములనే పొందుచున్నాము. మఱియు భగవత్సృష్టిలోనిపదార్థములవలెనే కవి కల్పించినవియు మనమనస్సులకు వింతను గొలుపుచుండును, ఒకొ్కకప్పుడు నవ్వించును, ఱిచ్చవడఁ జేయును, శిరఃకంపముచేయించును, ఇంకొకప్పు డాడించును. (గీతీయనుదొర శాకుంతలనాటకమును జదివి యత్యానందము పట్టఁజాలక లేచి నృత్యముచేసెనఁట!) ఇట్లే తక్కినవి యూహ్యంబులు. ఈ హేతువుచేతనే,

చ. కవి కమలాసనుండు, త్రిజగత్పతి యైనపినాకపాణియుఁ
గవియె &c &c &c ''

అని యొకానొకకవి చెప్పియున్నాఁడు.

ఇట్టిమహనీయమైనకవితాశక్తిని భగవంతుఁ డేర్పఱిచి పృథివియందుఁ బ్రప్రథమమున వాల్మీకిమహర్షిహృదయమునం బ్రవేశపెట్టెను. పిమ్మటఁ గాలక్రమమున నించుమించుగ నన్ని దేశములయందును, నన్ని భాషలయందును గవిత రచియింపఁగలమహాత్ము లుత్పత్తిఁ గాంచిరి. మనయాంధ్రులయందును గవిచంద్రు లుదయించిరి. అనేకగ్రంథము లాంధ్రమున నుద్భవించెను.

(మన) ఆదికవులు కవితాతత్త్వమును బాగుగ నెఱింగినవా రగుటచేఁ, బ్రథమముననే స్వకపోలకల్పితగ్రంథములను వ్రాసినచో వానిచేఁ బాఠకులను శ్రోతలను సంతోషపెట్టుట కష్టమని యెంచి, పూర్వము సంస్కృతభాషయందు వ్రాయఁబడి, సుప్రసిద్ధములై, నీతిదాయకములును, సన్మార్గబోధకములును నగుకథలు కలిగి వెలయుచుండు గ్రంథములనే తెలిఁగించుచు జనులయెదుటఁ బెట్టుచువచ్చిరి. భారత రామాయణాదు లీతెగలోనివే. పిమ్మటఁ గొందఱుకవులు సంస్కృతమునఁ గేవలగ్రంథరూపమున లేకపోయినను నక్కడక్కడఁ బురాణాదులలో వ్రాయఁబడియున్నవియుఁ, బెద్దలచేఁ బరంపరగఁ జెప్పఁబడుచుండునవియు, మంచిమంచినీతులను, మోక్షమార్గములను బోధించునవియు నగుకథలను గొన్నిటిని జేర్చి యొకొక్కకగ్రంథముగాఁ గల్పించుచువచ్చిరి. మంచన కేయూరబాహుచరిత్రము, అనంతుని భోజరాజీయము మొదలగునవి యీతరగతిలోనివి. ఇంతవఱకును గలగ్రంథములు బహుజనసులభగ్రాహ్యములై, రసోచితములై, కథాచమత్కృతులు గలిగి, మనోహరాలంకారములతో నొప్పారుచుండెడివి. తరువాతి కవులు పురాణములలోని యేదియే నొకకథను దీసికొని స్వతంత్రగ్రంథముగా రచియించుచు వచ్చిరి. పిల్లలమఱ్ఱి పినవీరన్న శకుంతలాపరిణయము, ప్రౌఢకవి మల్లన రుక్మాంగదచరిత్రము లోనగునవి యీజాతిలోనివి. ఇప్పటికిఁ గవులకు శృంగారరసమును విజృంభింపఁజేయునూహయుఁ, గవిత్వమునందుఁ బ్రౌఢిమను జూపుబుద్ధియు జనింపఁదొడఁగెను. సంస్కారము తలచూపెను. శబ్దాలంకారములును నర్థాలంకారములును ముదురఁ గడంగెను. నీతిబోధకవిషయములు వెనుకకు జాఱఁ జొచ్చెను. శృంగారరసాధిదేవత తాండవ మాడనారంభించెను. ఇంతగా వ్రాయనేల? అప్పటికావ్యరచనలోని యొకవిషయముం జూడుఁడు.

ప్రౌఢకవిమల్లన రచించినది రుక్మాంగదచరిత్ర మనుపేరు గలయేకాదశీమాహాత్మ్యము. అది సామాన్యప్రజల కందఱకును భక్తిముక్తులను బోధింపవలసినగ్రంథముగా నుండవలయునుగదా ! అట్టిదానిని దత్కవి పూర్వకవులపద్ధతిని విడిచి, తనకు ముందున్నవారికంటెఁ బ్రౌఢిమను జూపుచుఁ, దననాఁటికవులలో నతిగౌరవముఁ బడయనెంచికాఁబోలు నందుఁ గేవలపండితజనైకవేద్యంబు లగుశబ్దార్థాలంకారములును, రసికజనహృత్యంబు లగుశృంగారవర్ణనములును గడుంగడుఁ జొప్పించియున్నాఁడు.

“సీ. బిసకాండ, హారీన, ♦ పిక, సైకత, స్వర్ణ, కర, నేత్ర, భాషా, జ ♦ ఘన, శరీర

+ + + +

తారకా, శ్వేతదళ, సఖ ... (అలేఖ్యము)

+ + + + ”

ఇత్యాదిపద్యములతో మోహినీదేవిని మిక్కిలి పచ్చిగా వర్ణించి యున్నాఁడు. ఏకాదశీమాహాత్మ్యమున కిదియా లక్షణము ? ఈరీతిని గవితాశక్తికి బాహ్యవేషము మెండై యంతస్సారము క్షీణింపనారంభించెను.

ఇట్లు కాలము జరుగ జరుగ, ‘అల్లసానిపెద్దన’ కవీంద్రుఁడు బయలువెడలి (పైవారివలెనే) యొక (మార్కండేయ) పురాణములో నినీతిబోధక మగునొకకథను దీసికొని, దానిని పెంచి, నూతనపద్ధతి నవలంబించి, మనుచరిత్ర మనుపేర నొకప్రబంధముగా రచించి కృష్ణరాయలచే ‘నాంధ్రకవితాపితామహుం’ డనుబిరుదమును బొందెను. అప్పటికిఁ దాము నడచెడిది నాగరికమార్గ మనునూహ కవులకు జనించెను. పిమ్మట నాతనిశిష్యుఁ డనిచెప్పఁబడు భట్టుకవి పెద్దనకంటెను బ్రౌఢిమను జూపఁదలంచి కథావైచిత్రి గమనింపకయే, భారతమునం

దలి యొకకథను దీసికొని వసుచరిత్ర మనుప్రబంధమును వ్రాసి 'సా
హిత్యరసపోషణుం' డనుబిరుదు నందెను. ఈతనినాఁటనుండి నీతిబో
ధకవిషయాదులకు గ్రంథములలోఁ జోటు లేకపోయెను. శృంగారర
సాధిదేవత విశృంఖలవృత్తిని విహరింపఁజొచ్చెను. ఈతనితరువాతికవు
లకుఁ బ్రౌఢత్వమును జూపికొనుటయందలిదృష్టి ముదిరిపోయెను. ప్ర
బంధ మనునది యొక్కొకకవీంద్రునినాలుకయందును నటింపఁదొడఁ
గెను. మహాకావ్య మనునది యిట్లే యుండవలయు ననకట్టుపాటేర్ప
డెను. గతానుగతికు లయినకవు లందఱును నీతనిమార్గమునే యవలం
బించుచుండిరి. ఇక్కారణమునఁ గవితాప్రౌఢిమకేకాని కథావైచిత్రికి
దిక్కులేకపోయెను. పాత్రగుణపోషణము బొత్తిగ రూపుమాసెను.
క్రమక్రమముగాఁ గవులు చిత్ర, గర్భ, బంధకవిత్వములను దమతమ
గ్రంథములలోని కెక్కించి వసుచరిత్రకారుని మించఁగలిగితిమిగదా
యని సంతసించుచుండిరి. ఇట్లుండఁగా ద్వ్యర్థికావ్యరచన యనునొక
నూతనమార్గము కనిపెట్టఁబడెను. మిగుల సమర్థత్వము గలకవులుకొం
ద ఱీమార్గమున కానందించి తమతమజన్మముల నెల్ల నిట్టిరచనక్రింద
నే వ్యయపఱచిరి. ద్వ్యర్థికావ్యరచనను గాని, ప్రబంధరచనను గాని, మ
ఱిదేనినిగాని మొదటఁ గనిపెట్టినవారి ననవలసినపనిలేదు. భాషలో
నేదియో క్రొత్తమాదిరిగలగ్రంథమును వారు సృష్టించి తమప్రౌఢిమం
జూపుదురు. తక్కినవా రందఱును వారి ననుసరించినచో నందు విశేష
మేమియున్నది? విసుఁగుదలతప్ప వేఱేదియు నుండదు. ఆంధ్రద్వ్యర్థికా
వ్యరచనకు మార్గదర్శి పింగళిసూరనార్యుఁ డని కొందఱందురు. భట్టు
కవి యని కొందఱందురు. ఎవ్వరైననేమి? తన్నిర్ణయమున కిది యద
నుకాదు. ఈసూర్యుఁడు తననిండుజవ్వనమున నిట్టికావ్యమును వ్రాసి
నను వయసుతిరిగినతరువాతఁ దనజ్ఞాననేత్రము నొకసారిభాషాప్రపం

చేము పై లెస్సగాఁ బరఁగించి పురాతనకవులపద్ధతులను బాగుగా గ్రహించి, తనకాలపుఁగవులపోకడలను నిరసించి, క్రొత్తమాదిరిగ నుండునట్లు ప్రభావతీప్రద్యుమ్నము, కళాపూర్ణోదయము నను రెండుదివ్యప్రబంధములను రచియించి భాషాదేవికినూతనాలంకారముల నిడెను. అయిన నీతనిమార్గము పిమ్మటికవులకు రుచించినది కాదు. ఏమి? అది చాలదుర్గమ మైనది. అందుఁ బాత్రగుణపోషణము. కథాచమత్కృతి, సందర్భశుద్ధి, రసోచితశైలి మొదలగువాని నన్నిటినో యనుసంధింపనలసియుండును. వసుచరిత్రమార్గ మైనచోఁ గవితాప్రాగల్భ్యము, శబ్దార్థాలంకారములు మొదలగువానిని స్వేచ్ఛగాఁ గూర్పవచ్చును. ఇట్టియూహాయే వెనుకటికవులను బట్టి పీడింపఁగా వారందఱు నొక్కవిధముగానే గ్రంథములు వ్రాయుచువచ్చిరి ఇప్పటికిని మనవారిలో వయసుచెల్లినవారు కఠినశైలిని లేనిపద్యముల నన్నిటిని జప్పగా నున్నవనుచుందురు. సులభశైలి వారికి గిట్టదు. దీర్ఘసమాసములతో నుండవలయును. ఇట్టిమహానుభావులలోఁ గొందఱు వసుచరిత్రము, ఆముక్తమాల్యద, శృంగారనైషధము మొదలగుగ్రంథముల పేరులేకాని ప్రభావతీప్రద్యుమ్న, కళాపూర్ణోదయముల పేరుల నైన నెఱుంగరు. రాఘవపాండవీయమునే రచియింపకున్నచోఁ బింగళిసూరనార్యునిపేరు కూడ వీరికిఁ దెలిసియుండకపోవును. ఇందులకుఁ గారణము వానియందు శబ్దాడంబరాములు లేకపోవుటయే యని యెఱుఁగవచ్చును. ఇంత యేల? ఆదికవులు సైతము తరువాతికవులకుఁ జాల రని మనవారిలోఁ జాలమందికి నభిప్రాయము గలదు. కావుననే వారిమార్గము నొక్కరైన నవలంబింపకపోయిరి. ఈశబ్దార్థాలంకారాదులమహిమ మేమోకాని యవి సర్వజనసుబోధములుగా నుండవలసిన వేదాంతగ్రంథములయందునయితము ప్రవేశించి యాయాకవులచే నేకాక్షరద్వ్యక్షరనియమ

ముతోడిపద్యములు గలచిత్రకవిత్వమును, మఱియు గర్భబంధకవిత్వాదులను రచియింపఁజేసినది. (సీతారామాంజనేయాదులను జూడవచ్చును.) సామాన్యజనులకు నేతాదృశగ్రంథావలోకనము చేయుశక్తి చాలకుండుటచే వారు భారతభాగవతరామాయణాదులనే పట్టుకొని వ్రేలాడవలసినవారైరి (ఈకారణముచేతనే వానికి దేశమందు వ్యాప్తి మిక్కిలి కలిగెను. ఇదియును మేలే.) పిమ్మటిరాజులచరిత్రము లెవ్వియు గ్రంథముల నెక్కఁ జాలనివయ్యెను. పురాణములలో నుండునొకకథ దీసికొని దానిని దమవర్ణనల కనువుగ నుండునట్లు పెంచి యష్టాదశవర్ణనములతోడను నింపి వ్రాయునట్టి దృష్టిగల కవిపుంగవులకు దేశచారిత్రము లెట్లు రుచించును? అవి యెంత బాగుగ వ్రాయఁబడఁదగినవి! ఎన్నెన్ని రసములు, ఎన్నెన్ని భావములు వానియందు నింపఁబడియుండవలసినది! అట్లు వ్రాసియున్నచో దేశమున కెంతయుపకారము కలిగియుండును! అట్టియదృష్ట మీభాషకు లేకపోయినది. కృష్ణరాయవిజయము, నరపతివిజయము (రామరాజీయము) మొదలగునవి కొన్ని చారిత్రవిషయగర్భితము లగుకావ్యము లున్నవన్నను, అవి చరిత్రమార్గమునఁగాక ప్రబంధసాఁకమున రచియింపఁబడి యతిశయోక్త్యాద్యలంకారములతో నిండిపోయియుండుటచే వానియందు సత్యము లేశమాత్రమే యుండు నని తోఁచెడిని. ఈరీతిని గవితాశక్తి కంతస్సారము బొత్తిగ క్షీణించిపోయెను.

ఇక్కాలమున నాంగ్లేయప్రభుత్వముచే దేశమందంతటను విద్య విజృంభింపఁగా మనవారిలోఁ గొందఱు మహనీయు లన్యభాషాపరిచితింబట్టి యాయాభాషలలోనిగ్రంథముల నవలోకించి, యందలికథాచమత్కృత్యాదులం గాంచి, మనయాదికవులగ్రంథములను జదివి వారి మహిమలకచ్చెరువొంది వానిని వెల్లడించుచుఁ దరువాతికవులమార్గము

ల నధిక్షేపించుచు ననేకగ్రంథములయందును ననేకపత్త్రికలయందును వ్రాయను వ్రాయను, ఇప్పటికి నాంధ్రగ్రంథరచనకుఁ గొంతమాఱుపాటు గలుగనారంభించినది మధ్యాధునికకవులరచనలపై నిరసనభావము కలుగఁజొచ్చినది. పింగళిసూరనార్యునినామమునకు విశేషగౌరవము కలిగినది. క్రొత్తక్రొత్తరచనలపై నింపు జనించుచున్నది. ఇదంతయుఁ గాలముయొక్కమార్పుగదా!

పైని వ్రాయఁబడినవిషయముల నన్నిటిని బరికించు మీకుఁ, కవితాతత్త్వము రెండువిధములైన దనియు, నందు మొదటిది నీతిబోధకసన్మార్గప్రదర్శకవిషయములును, గథాచమత్కృత్యాదులు నొప్పుగ్రంథములు గల దనియు, రెండవది కేవలము శబ్దార్థాలంకారాది భాషాప్రౌఢిమం జూపుగ్రంథములు గల దనియు విశదమైయే యుండును. మఱియు మొదటిది యప్పటికి, నిప్పటికి, నెప్పటికిని బూజనీయమైనదే యనియు, రెండవది తాత్కాలికసుఖమనమాత్రము గూర్చునదియై యుండు ననియు మీ రెఱుంగుదురు. అందు రెండవమార్గము నవలంబించినవారియభిప్రాయ మేమో యించుక విచారింపవలసియున్నది. కథాచమత్కృతి మొదలగునవి భారతాదు లగుసద్గ్రంథములలోఁ గలవుగదా యనియు, మఱియుఁ బక్కిటిపురాణములయందును ననేక చిత్రకథలు పెద్దలచేఁ బరంపరగఁ జెప్పఁబడుచుండునుగదా యనియు భాషాచమత్కృతిం జూపుపొత్తముల నేల రచింపఁగూడదనియు నవి విద్యార్థులకు మిగుల నుపయోగకరములుగా నుండు ననియు వా రూహించి యట్లు గావించియుందు రని తోఁచుచున్నది. అట్టియూహ యొకరినిబట్టి యొకరికి వచ్చి క్రమక్రమముగా వృద్ధి నొందినది గాని యొక్కసారియే వచ్చినది కాదు. వా రుండెడికాలమే యట్టిమార్పు గలిగించినది. ఆయాకృతిపతులును వారివారి కారీతిగ్రంథముల రచిం

చుటకే ప్రోత్సాహ మిచ్చుచు నుండెడివారు. (కాని యీయూహ మతిమాత్రమై దేవునికిఁ గృతిగా నియ్యఁబడిన గ్రంథములుసైత మా విధముననే రచియింపఁబడెను !) ఈకారణమునఁ బ్రౌఢప్రబంధములు లెక్కలేనివి రచింపఁబడెను. అయినను "అత్యుచ్ఛ్రియఃపతనహేతు" వనున్యాయమున కవి గుఱియయ్యెను. కవితాశక్తి కిప్పుడు నూతనప్రపంచము నిర్మింపఁబడుచుండెను. మధ్యకాలకవులగ్రంథము లన్న ననాదరము జనించుచుండెను. ఈనూతనప్రపంచము నిర్మింపఁబడుటకు నించుకముందే యనగా పైరెండవవిధము పరిపూర్ణవ్యాప్తిని జెందియున్న సమయముననే యీ

భ ద్రా ప రి ణ య ము

అనుప్రబంధము రచియింపఁబడెను. భద్ర యనుపేరు గలకన్యారత్నముయొక్క పెండిలికథ యిందుఁ జెప్పఁబడెను గావున దీని కీనామము గలిగెను. ఈభద్రాదేవి శ్రీకృష్ణునియష్టమహిషులలో నొకతె. దీనిం బట్టియే యిందలికథానాయకుఁడు శ్రీకృష్ణుఁ డని తేటపడుచున్నది. ఈగ్రంథమునకుఁ గృతిపతి

శ్రీరాజా రావు వేంకటమహీపతి

గంగాధరరామరాయబహద్దరుగారు

వీరు శ్రీపీఠికాపురసంస్థానాధీశ్వరులు "శూరతోదారతాద్యధికగుణకులం" బగుపద్మనాయకకులంబున జనన మందినమహాపురుషులు. పద్మనాయకకులజులనే "వెలమ" వారని చెప్పుదురు. వెలమవా రను పేరు గలుగుటంగూర్చి యొకానొకకవిచంద్రుఁడు తనగ్రంథమున నిట్లు ప్రోత్సహించియున్నాఁడు.

"చ. ఉరుతరపద్మనాయకకు ♦ లోద్భవు లైనకుమారు లందఱుఁ
<u>వైరవము</u>లై, <u>అ</u>యాంతకస ♦ విక్రము లై, <u>మహనీయు</u>లై నిరం
తరము ను <u>ముఖ్యవర్గగణి</u> ♦ తం బగుపౌరుష నామధేయమే

వరబిరుదంబుగా వెలమ ♦ వా రన విఖ్యాతి గాంచి రిమ్మహిన్."

( ఇది స్వభావోక్తియ యని చెప్పనచ్చును. )

ఆంధ్రభాషాయోషామణికిఁ జిరకాలమునుండియు నీపద్మనాయకప్రభువులయవలంబనమే విశేషముగా నున్నదనియు, నీవెలమవారిలో సంస్కృతాంధ్రభాషలు రెంటియందుఁగాని యొకదానియందుఁగాని పాండిత్యమో, పరిశ్రమమో, పరిచయమో, యాసక్తియో, యభిమానమో లేనివారుండుట యరుదే యనియు నెల్లరునెఱింగినవిషయమే. వీరిలోఁ గొందఱు కవులును గలరు. వీరివంశావతారముంగూర్చి బహుగ్రంథములయందు విశేషముగ వర్ణింపఁబడియుండుటచే నది జగత్ప్రసిద్ధమయియే యున్నది. ఈగ్రంథమునందును బద్మనాయకవంశాభివర్ణనము గలదు. కావున దానింగుఱించి నే నిట వేఱుగ వ్రాయనక్కఱ లేదు.

ఏతత్కృతినాయకుఁ డగుశ్రీగంగాధరరామరాయప్రభువరునింగూర్చి వ్రాయుటకు నస్మాదృశు లగుసామాన్యులు శక్తులు గానేర రనుట యతిశయోక్తి గాదు. ఆశ్రితజనసంరక్షణము, పండితజనాదరణము, కవిజనపోషణము మొద లగుసద్గుణము లీమహారాజునకు సహజములై యుండెడివి. ప్రజలయెడల వీరి కుండినయనుగ్రహ మనిర్వాచ్యమని వయసు చెల్లినవా రిప్పటికి నీప్రభువును వేనోళ్లఁ బొగడుచుందురు. మఱియు సత్కార్యాచరణమున వీరికి సాటియగుప్రభువు నాకాలమునఁ జూచియుండలే దని జనులు చెప్పుదురు. వేయేల? వితరణమునఁ గలియుగసూర్యపుత్త్రుఁడనియు, సాహసమున నభినవవిక్రమార్కుండనియు, విద్యయం దపరభోజుం డనియుఁ, బ్రజారక్షణమున రెండవ యజాతశత్రుం డనియు నీరాజేంద్రుఁడు ప్రఖ్యాతివడసె నని స్వార్థపరాయణులుగాని వృద్ధు లిప్పటికిని బ్రస్తావవశమునఁ జెప్పుచుందు రన నీ

యననుగూర్చి యెంతగ వ్రాయవచ్చునో యోజింపుఁడు.

పైని వ్రాసినవి యథార్థోక్తులు గాని యతిశయోక్తులు గావు. వాని కన్నిటికిని దృష్టాంతములును లేకపోలేదు. అయిన నవి యసంఖ్యాకములుగా నున్నవి. అవి యన్నియు వేఱుగ నొకపుస్తకరూపమున నుండఁదగినవి. గ్రంథవిస్తరభీతిచే వానిలోఁ గొన్నిటిమాత్ర మిచ్చట వ్రాయుచున్నాను.

ఆశ్రితజనసంరక్షణము :—అనేకులగు నాశ్రితులకు దైనిక, మాసిక, వార్షికప్రదానముల నేర్పఱిచి, వారిని రక్షించుచుండిరి. మఱియుఁ గొన్నికుటుంబములకు సైతము తమసంస్థానంబున నెవ్వియైనఁ గార్యములు తటస్థించునప్పుడు మఱికొన్నియీవులు దయచేయఁబడుచుండునట్టియేర్పాటులుకూడఁ గావించియుండిరి. అందనేకములు నేఁటిదనుక నేతత్సంస్థానంబున (ఇప్పటిప్రభువరునిదయాతిరేకంబున) నవిచ్ఛిన్నగతిని జరుగుచున్నవి. ఇంకను ననేకులకుఁ దమయనుగ్రహమువలన 'నిమేబడు' లనుపేరుగలభూములను విశేషముగ నిచ్చియుండిరి. ఇట్టివి యీరామరాయరాజ్యమునఁ బెక్కులు గలవు. మఱియు ననేకాశ్రితులకు విశేషభూములను దానముచేసిరి. పైని వివరింపఁబడిన వన్నియు నాయాయాశ్రితులచేతను, దత్సంతతులచేతను నిరంతరాయముఁగ ననుభవింపఁబడుచున్నవి. శాశ్వతము లగునిట్టియేర్పాటులను గావించిన యీప్రభువరుని వదాన్యతను దలంచుచో నొకానొకకవి చెప్పిన యీక్రిందిపద్యము జ్ఞప్తికి రాకమానదు.

> "ఉ. భూతి ఘటింప మానవుల ♦ పుణ్యవశంబున ఫాలసీమలన్
> ధాత లిఖించెనా, యొకరి ♦ నాఁటి, దదేటికి?, రావువంశజుం
> డైతగురామరాయవసు ♦ ధాధిపుఁ డెవ్వరికై లిఖించు? వా
> వ్రాఁత తదాత్మజాత్మజప ♦ రంపర కెల్ల ఫలించు నెప్పుడున్"

పండితజనాదరణము :—అనేకమండలంబులనుండి యసంఖ్యా

కు లగుపండితులు వచ్చి వీరిని సందర్శించుచుండిరి. వారివారిసామర్థ్యాదులనుబట్టి వారిని దత్కాలమందే ధనం బవారిగ నిచ్చి సత్కరించుచుండుటయే కాక, వారికి వార్షికబహుమానంబులునయిత మేర్పాటు చేసి యాదరించుచుండిరి. అప్పుడప్పుడు పండితవర్యులచేత వాక్యార్థములు మొదలగునవి చేయించుచు నర్హరీతిని సమ్మానించుచు నుండెడివారు. పందొమ్మిదవశతాబ్దమున సుప్రసిద్ధ వైదికులునుపాపయ్యశాస్త్రిగారు, ఇంద్రగంటివిశ్వపతిశాస్త్రిగారు, ఎడవిల్లిశ్రీరామశాస్త్రులుగారు, తణికెళ్లసుబ్బన్నశాస్త్రులుగారు, కనకదండిగోపాలశాస్త్రులుగారు మొదలగు నేకపండితులు వీరివలన విశేషముగ గౌరవింపఁబడినవారే. ఇందుఁ గొందఱకు గొప్పభూదానములుగూడఁ జేసియున్నారు. వీరిసంస్థానంబునను కంచిభట్లసూర్యనారాయణశాస్త్రులువారు, పొక్కులూరివేంకటశాస్త్రులువారు మొదలగువా రుండెడివారు.

కవిజనపోషణము :—వీరియాస్థానంబునఁ బలువురుకవీశ్వరులుండెడివారు. ఏతద్గ్రంథకర్త, కవిశిరోమణి సోంభట్ల రామస్వామిశాస్త్రులుగారు, ఎఱ్ఱమిల్లిలక్ష్మీనారాయణకవి, దేవులపల్లిసుబ్బరాయశాస్త్రిగారు, వేంకటకృష్ణశాస్త్రులుగారు, వేంకటరాయకవి, మొద లగు వా రనేకులు వీరిసభ నలంకరించుచు వీరిపోషణమున నుండెడివారు. మఱియుఁ బలుచోటులనుండి పలువురుకవీంద్రులు వచ్చి శ్రీరాజావారిని దర్శించుచుఁ దమతమప్రజ్ఞాదికములఁ గనఁబఱుచుచు వారివలన విశేషసన్మానములను బడయుచు నుండిరి. శ్రీమాన్ విద్వదభినవ పండితరాయ మాడభూషివేంకటాచార్యకవి, శ్రీశిష్టుకృష్ణమూర్తికవివర్యుడు మొదలగువారు పలువురు వచ్చి వీరిని సందర్శించుచుఁ బలుమాఱు లర్హసత్కారంబులఁ గాంచుచువచ్చిరి. అనేకులకు నేఁటేఁట సమ్మానించు నేర్పాటులునయితము చేసి వీరు పోషించుచుండెడివారు.

సత్కార్యాచరణము.—గ్రామములఁ గట్టించుట, చెఱువులు త్రవ్వించుట, మొదలగు సత్కార్యము లెన్నియో వీరు చేయించియుండిరి. మఱియు, పేదసాదులయందలి కారుణ్యమునకు మితియే లేకుండెడి దని తెలియవచ్చుచున్నది. ఏతద్విషయములకుఁ దార్కాణము లనేకము లున్నను వానిలోఁ గొన్నిటినిమాత్ర మిచ్చట నుదాహరించుచున్నాను.

(1) గ్రామములఁ గట్టించుట.—తమరాజ్యములోనిదియు, గోదావరీమండలమునకు ముఖ్యపత్తనముగా నెన్నఁబడుచుండునదియు నగు కాకినాడపురంబును జేర్చి తమతండ్రిగారిపేరితో 'సూర్యారావుపేట' యనుగ్రామమును గట్టించిరి మఱియుఁ దమరాజధాని యగు పీఠికాపురమును జేర్చి యుత్తరదిశయందు 'కుమారనగర' మనుక్రొత్తపేటను గట్టించిరి. వీనిం దెలుపుపద్యములలో నీగ్రంథమం దున్నవానినే వ్రాసెదను.

> " వ. అతులాబ్ధ్యంతిక కాకినాడనగరోపాంతస్థలస్థాపితా
> యతసత్త్రియత నదిసంకలిత సూర్యారాయపేటాఖ్య భూ
> రితరగ్రామనిదాన' &c &c " తృతీయాశ్వాసము 119 ప.

(2) చెఱువులు త్రవ్వించుట.—తమరాజ్యమునందలి మల్లవర మను గ్రామమున నొకగొప్పచెఱువును ద్రవ్వించి, తత్ప్రాంతమున నుండు ప్రజలకు మహోపకారముం గావించిరి. పెద్దాపురముతాలూకాలో లింగమపర్తికడ నుండుతిమ్మరాజుచెఱు వొకటి తప్ప దీనితో సరివచ్చు పెద్దచెఱువు గోదావరీమండలంబున వేఱొకటిలేదు మఱియు సూర్యారావుపేటలోఁగూడ నొకపెద్దచెఱువును ద్రవ్వించియున్నారు. కాకినాడ, సూర్యారావుపేట, రామారావుపేట, జగన్నాథపురము, ఘాస్టరుపేట, పేరరాజుపేట అనుస్థలమ్ములలో నుండునసంఖ్యాకు లగుజనులకు జ

లయంత్రముల ద్వారమున నవారిగ వారి నొసంగుటకు నీచెఱువే యి ప్పు డాధారమై యున్నది. కుమారనగరము మొద లగుచోట్ల నింకను ననేకతటాకములు వీరు త్రవ్వించినవి కలవు. మల్లవరపుఁజెఱువునుగూర్చి యీగ్రంథమున నిట్లువర్ణింపఁబడియున్నది.

“ క. భీమద్విభరితజయష, మామా! చాహత్తిమల్ల! మల్లవరాఖ్య
గ్రామోపాంతవినిర్మిత, భూమహితాంభోధితులిత ♦ భూరితటాకా!”

చతుర్థాశ్వా. 104 పద్య

(3) ఆరామప్రతిష్ఠాదులు :—అనేకస్థలంబులలో ననేకఫలజాతులు గలయనేకారామంబులు వీరు వేయించిరి. ఇది మొదలగుకారణంబులం బట్టి యీపుడమిపై శాశ్వతము లగుననేకసత్కారములను జేయించి చిరతరయశంబును, నమేయసుకృతంబును సంపాదించినయీరాజచంద్రుఁడు,

“ తే. ధరణిఁ బరఁగుఁ బొగడ్త యెం ♦ దాఁక నంత
కాలమును బుణ్యలోకంబు ♦ గలుగు నండ్రు.”

అనుభ్రాంతవచనమునకు లక్ష్యభూతుఁ డగుచున్నాఁ డని సంతోషపూర్వకముగఁ దెలుపుచు సేయుచున్నాఁడను.

వితరణసాహసాదిసద్గుణములు :—పై వానివలననే యీవదాన్యశేఖరుని వితరణాదిసద్గుణములు దెలియుచున్నను, నింకొకముఖ్యవిషయముగూడ నిందుఁ జూపుచున్నాను. రావువంశముక్తావళిని రచియించి కృతిగా నొసంగినశ్రీ దేవులపల్లిసుబ్బరాయశాస్త్రిగారియెడ నీమహారాజు చూపినయౌదార్యము మిగులఁ గొనియాడఁదగినదియై యున్నది. అది చదువరులకు విశదమగుపొంటెఁ దత్కృవికృతం బగుమహేంద్రవిజయమునందలికవిజీవితమునుండి కొన్నిపంక్తు లిచ్చుట గ్రహించుకొనుచున్నాఁడను.

« రావువంశముక్తావళి యనుపేరిట విలసిల్లుతమవంశచారిత్రము ను (క్రీ.శ.) 1882 వ సంవత్సరమునందుఁగృతినంది, సాకల్యంబుగ గ్రంథ మంతయుఁ జిత్తగించి, తమపూర్వరాజన్యులమాన్యచారిత్రాకర్ణనమువలనను, ననల్పకల్పనాశిల్పనంబులం దనరినకవితామాధుర్యంబునకును, నానందపరవశులై యిందులకుం దగినసత్కారంబేఁ జేయఁగలనే యని నారాజ్యంబ మీకిచ్చితి నని యీకవిసార్వభౌముని సింహాసనాసీనుం గావించి, తమయభినవభోజరాజబిరుదాంకము నన్వర్థంబుగ నొనరించిరి. పిమ్మట నిక్కవితాపట్టభద్రుండు దేవా! యీరాజ్యభారంబు వహింపఁ దేవరభుజాదండంబె సమర్థంబు గాని నే సమర్థుండనే యని తత్క్షణంబ వారిరాజ్యంబు వారికి సమర్పించి &c.»

విద్యాధికత:—భాషాభిమానము, విద్యయం దభిరుచియు నుండనిచోఁ గవులను బండితులను నాదరించుట యంతగాఁ బొసఁగదు. అనేకు లగుకవులను, బండితులను విశేషముగ గౌరవించియుండుటచేత నే యీనృపవర్యుఁడు విద్యాధికుఁడై యుండె నని చెప్పవచ్చును. ఇదిగాక యప్పుడప్పు డాయాకవులను, బండితులను వారివారిప్రజ్ఞలనుబట్టి యనేకము లగుప్రశ్నములు చేయుచు వారివారిప్రత్యుత్తరములసాధుత్వాసాధుత్వమునుగూర్చి వక్కాణించుచు వినోదించుచునుండెడివారఁట! ఒకప్పు డొకవిప్రుఁడు శ్రీయుతు లగువారిసన్నిధిని హరికథఁ జెప్పుచుఁ దాను గవియుఁగూడ నైనట్లు తనమిత్రులచే నాసభలో వెల్లడిచేయించుకొనఁగా, శ్రీప్రభువువారియనుజ్ఞ ననుసరించి తత్సన్నిధానవర్తులలో నొకరు «శ్రీరాజావారిమీఁద నొకపద్యము నాశువుగ రచింపుఁడని కథానంతరమునఁ జెప్పినప్పు డక్కవి యొకసీసపద్యమును జదివెనఁట! అప్పు డారామరాయధరణీశ్వరుఁడు తనబహుగ్రంథదృష్టత్వా

ము వెల్లడిశా నక్కవితో " దాసుగారూ! ఇందలి మొదటియాఱుపాద
ములు నేనాయాగ్రంథములలోఁ జూచినవే. (ఆగ్రంథములపేరులు చె
ప్పిరఁట!) ఏడవపాదము నేను జదివినదే కాని యెందున్నదో యిప్పు
డు జ్ఞప్తికి రాలేదు. ఎనిమిదవచరణమున నాపేరు గలసగముమాత్ర
ము మీరు రచించినదే " యని వాక్రుచ్చిరఁట! దీనింబట్టి యీప్రభు
శిరోమణి కెంతభాషాజ్ఞానము నెంతగ్రంథావలోకనము నుండెడిదో
యూహింపుఁడు వీరికి సంస్కృతాంధ్రములయందే కాక యాంగ్లేయ
మహమ్మదీయభాషలయందును పరిచయ ముండెడిదని తెలియవచ్చుచు
న్నది.

ప్రజారక్షణము.—దీనింగుఱించి విస్తరింప నక్కఱ లేదు. ఈ
మహారాజుపరిపాలనములోఁ బ్రజలకుఁ గలిగినసౌఖ్యమునకు మేరయే
లేకుండె నని చెప్పుదురు. వీరు సర్వవిధములఁ బ్రజలకు లోటుపాటులు
లేకుండఁగనుంగొని సంరక్షించుచుండెడివారఁట కావుననే

" సీ. సకలవిద్వచ్చకో ♦ రకములానందించె, విమతాననాబ్జసా ♦ ళి ముకుళించె
లలి మిత్రకువలయం ♦ బులు వికాసము నొందె, ఖలజనచక్రవా ♦ కములు గుందె
బంధుబృందానంద ♦ సింధువు లుప్పొంగె, దర్మేతరధ్వాంత ♦ తతు లడంగె
సత్సంతతుల కభీ ♦ ష్టము లెల్ల నీడేరెఁ, గుమతిచోరప్రచా ♦ రములు జారెఁ
బీరికాపురవరదుర్గ ♦ పృథులసౌధ
సింహపీఠోదయాచల ♦ శిఖరభాగ
మధిగమించి యఖండరా ♦ జ్యరమఁ దాల్చి
రామరాయాఖ్యచంద్రుండు ♦ ప్రబలుచుండ " ప్రథమా. 86 ప 69 ప్రట

అనుపద్యము సార్థకమై వీరి ప్రఖ్యాతిని వెల్లడించుచున్నది.

ఈరాజేంద్రునకుఁ దనమాన్యచరిత్రము పూర్వరాజన్యుల చా
రిత్రములం బోలు నని బాగుగాఁ దెలియును. ఇక్కారణముననే కాఁ
బోలు,

"సీ. వాల్మీకి యాదికా ♦ వ్యంబొనర్పఁగఁ గదా, రామునిగుణకథల్ ♦ ప్రకటమయ్యె
ద్వైపాయనుఁడు భార ♦ తంబొనర్పఁ గదా, పాండవాదులప్రభా ♦ వములు దెలిసెఁ
గాళిదాసుఁడు కృతి ♦ ఘటనసేయఁగఁ గదా, భోజరాజు యశంబు ♦ దేజరిల్లె
ఘనత విద్యానాథ ♦ కవికబ్బమునఁ గదా, తనరెఁ బ్రతాపరు ♦ ద్రునిప్రసిద్ధి
యిలను రాజనరేంద్రుండు ♦ కృష్ణదేవ
రాయలాదిగఁగలమహీ ♦ రాజులెల్లఁ
గావ్యముఖమునఁ గాదె వి ♦ ఖ్యాతిఁ గనిరి
కానఁ గృతిసాటి వేఱొండు ♦ గలదె తలఁప?" ప్ర. 16 ప. (22 పు.)

అని యిక్కవిని బిలిపించి తననామము శాశ్వతముగా నుండునట్లు కృతి రచింపు మని యానతిచ్చెను.

(ఇమ్మహారాజచంద్రునిగుణగణాదికముం దెలియఁజేయుదృష్టాంతము లనేకములు గలవు అవి యున్నియు నొకచరిత్రగ్రంథముగ నుండదగినవై యుండుటచే నిందు సూత్రప్రాయముగ వ్రాయఁబడినవి.)

మహాత్ము లగువార లంతశ్శుద్ధితోఁ జేసినసత్కర్మములు వ్యర్థములు కావనునార్యోక్తి యుసిపోవకుండఁ జిరకాలముదనుక సంతానము లేనియీరామరాయప్రభువునకుఁ దత్సుకృతిఫలంబో యన, దశరథునకుఁ గౌసల్యయందు శ్రీరామచంద్రుండు వొలె, (పట్టమహిషియగు) శ్రీమంగయాంబాదేవియందు "శ్రీవేంకటకుమారమహీపతిసూర్యారావుబహద్దరువారు" (ఇప్పటిప్రభువరులు) జనన మొంది యపారానం[illegible]ము గలిగించిరి. ఈహేతువులం బట్టియుఁ, బైనిర్వాసినవానిం బట్టియు,

"క. తనయుఁడు, జెఱువును, గావ్యం | బు, నిధానము, గుడి, వనంబు, భూదేవస్థా
పనమును నను నీయేడును | జను శాస్త్రములందు సప్తసంతతు లనఁగన్."

అనురీతిని శ్రీగంగాధరరామరాయప్రభువువారు సప్తసంతానసంస్థాపకులై రనియు, శాశ్వతపుణ్యలోకనివాసులై నిరంతరసౌఖ్యము ననుభవించుచున్నా రనియు మనము దెలిసికొనఁగలము.

మఱియు,

“ క. సంతానసప్తకములోఁ, జింతితఫలదాయకంబు ♦ చిరకీర్తికరం
బెంతయుఁ గృతి మాకది శ్రీ, కాంతకథాసుధనుగూర్పఁ ♦ గావలయుఁజుమీ ”

అని యాప్రభువర్యుం డేతత్కృతికర్తతోఁ బలికి యాగ్రంథము గృతి నొందె నని మీకు విశదమే కదా!

ఇంతవఱకు నీభూమీంద్రునిగుణవిశేషములంగూర్చి సంక్షేపముగాఁ దెలిపియుంటిని. ఒకరిగుణము లిట్టి వని తెలిసికొనినపిమ్మట వారిరూపమెట్లుండునో యెఱుంగఁ గుతూహలపడనివారు సామాన్యముగా నుండరు గావున వీరిరూపమునుగూర్చి యించుక వ్రాయుచున్నాను.

నాచిన్నతనమున నేనీమహారాజును బలుసారులు సందర్శించియుంటిని. ఈయనరూపము దివ్యరూప మని చెప్పవచ్చును. శరీరచ్ఛాయ స్వర్ణసదృశము. తేజ మనన్యసామాన్యము. ముఖము వికాసవంతమును, సలక్షణమును, కారుణ్యాదిసాత్త్వికగుణసూచకమును, గాంభీర్యాదిరాజసగుణద్యోతకమును నైయుండెను. ఫాలము మిగులవిశాలము. నేత్రములు పద్మదళసదృశములు. కటాక్షములు కరుణరసప్రవాహజనకములు. సంభాషణము మృదుమధురగంభీరము. దేహము బలిష్ఠము. అప్పుడు నేను జూచినయానిరుపమానసుందరవిగ్రహ మిప్పటికిని నాకన్నులయెదుట నున్నట్లే తోఁచుచు,

“ శా. రా మా రా యని కించుఁబంచశరునా ♦ రా మారొ్కనం జాలు +
+ + + + +
రామారాయనిరూపవైభవము . . ” (ప్రథ. 85 ప)

అనుదానియం దతిశయోక్తి యేమియు లేదనిపించుచున్నది.

ఇవిమొదలగు హేతువులంబట్టి,

“ కీర్తిప్రతాపసుభగః పుమర్థత్రయతత్పరః, ధురంధరశ్చ గుణవాన్ నాయకః పరికీర్తితః
మహాకులీనతౌజ్జ్వల్యం మహాభాగ్య ముదారతా, తేజస్వితా విదగ్ధత్వం ధార్మికత్వా
దయో గుణాః ”

(కీర్తిప్రతాపములచే సుందరుండును, ధర్మార్థకామములయందుఁ దత్ప
రుండును, భూమండలాధిపతియు, సద్గుణములు గలవాఁడు నగుపురుషుఁ
డు కృతినాయకుఁడు గావలయును. మఱియు గొప్పవంశమునందలిజ
న్మము, చేయవలసినకార్యములయందు నైపుణ్యమును, తేజస్సును,
ధర్మమునందే మనసు గలుగుటయును, మిగుల సౌందర్యము మొదలగు
గుణములు కృతినాయకున కుండవలసిన వని యర్థము.)

ఏతాదృశమహనీయగుణగరిష్ఠుండును, అసాధారణసౌందర్యవిరా
జితుండును నగునిట్టిరాజశ్రేష్ఠుని కీగ్రంథమును గృతిగా నొసంగి ధన్య
త్వముం గన్నపురుషుఁడు,

అల్లమరాజుసుబ్రహ్మణ్యకవి.

ఇతఁడు 'ఆరామద్రావిడ' బ్రాహ్మణుఁడు. హరితసగోత్రుఁడు. నా
రాయణాచలమాహాత్మ్యమును రచించినరంగధామార్యునకుఁ బుత్త్రుఁ
డు. ఎల్లనార్యునకుఁ బౌత్త్రుఁడు. ఇతనితల్లి గంగమాంబ. వైనతేయ
విజయము, సత్యభామావిలాసము, కవిచకోరచంద్రోదయము మొదల
గుననేకప్రబంధములను రచియించిమించినరామకృష్ణకవి కితఁడు భిన్నో
దరసోదరుఁడు (రామకృష్ణకవితల్లికూడఁ గవనము చెప్పెడిదఁట! నా
రాయణాచలమాహాత్మ్యములో నీమె వ్రాసినపద్యములు కొన్ని గలవని
యు, నవి యాగ్రంథమున నేర్పాటుగఁ దెలియుచుండు ననియుఁ జెప్పు
దురు.) వీరిదిపండితవంశము వీరినివాసస్థలము పీఠికాపురమునకు సమీ
పమున నున్నచేబ్రోలను గ్రామము. సుబ్రహ్మణ్యకవి వికృతిసంవత్సర
మునకు సరియగు క్రీ.శ. 1831 వ సంవత్సరమున జన్మించెను. ఈతఁడు
స్వగ్రామముననే నాగాభట్లనరసకవివరుని చెంత నుభయభాషలయందు
ను పాండిత్యము సంపాదించెను. గురువు పరలోకగతుండు కాఁగా సం
స్కృతాంధ్రములం గలపెక్కులుత్కృష్టకావ్యములు తనంతఁ దానే

చదివికొని యుభయభాషలయందును సంపూర్ణపండితుఁ డయ్యెను. ఆంధ్రభాషయందు నీతనికాలమువఱకు నున్నగ్రంథములలో నీతఁడు చదువనిగ్రంథము లేనేలేదని చెప్పుదురు. మఱియు వసుచరిత్రము, ఆముక్తమాల్యదయు నీతని కభిమానగ్రంథములుగా నుండెడివఁట!

లక్ష్మీసరస్వతు లిరువురు నొక్కచోట నుండనేర రనునానుడి యిక్కవివిషయమున యథార్థమై యుండుటచేఁ గాఁబోలు నీతఁడు కుటుంబపోషణము జరుగక కొన్నిచోటులకుం బోయియచ్చటచ్చటఁ గవనము చెప్పుచు దానివలన జీవయాత్ర గడపికొనుచుండెడివాఁడు. ఈతఁడు జ్యోతిషమునందుఁగూడ విశేషపరిశ్రమము గలవాఁడగుటచే నావిజ్ఞానయుత మీతనిధనార్జనశక్తికిఁ గొంత తోడుపడుచుండెను. ఇట్లు కవిత్వమే జీవనాధారముగ సంచారము చేయుచు నీతఁడొకప్పుడక్కాలంబున నాంధ్రభాషాపోషకుం డనిప్రసిద్ధిఁగాంచిన శ్రీకృష్ణభూపతి యనుమాడుగొల్లుసంస్థానాధినాథునిపై శతకము రచించి యాతనిసందర్శనము చేసెను. కవికులమందారం బగునామహారాజుసభయం దప్పుడు మంత్రిప్రెగడసూర్యప్రకాశకవివరుఁడు మొదలగుసుప్రసిద్ధకవులు పలువు రుండిరి. సాధారణముగాఁ బండితులలోఁగాని, కవులలోఁగాని యొండొరులయెడల మాత్సర్యము లేనివారుండుట యరుదు గావున నచ్చటివా రెట్లయిన నిక్కవి నోడింపఁ దలంపుఁగొని యీతని నచ్చటఁ గఠినముగాఁ బరీక్షింపఁగడంగిరఁట! పరీక్షకులు వయసుచెల్లినవారు ఈతఁడు లేఁతవయసువాఁడు. అయిన నీతఁ డాపరీక్షల కెల్ల నోర్చి సదుత్తరము లిచ్చి యాకృష్ణభూపతిమెప్పుఁ గాంచెను. అక్కఠినపరీక్షలోని యొండురెండు విషయముల నుదాహరించుచున్నాను. శ్లేషయమకధ్వన్యాద్యలంకారములతోఁ గొన్నిపద్యము లాశువుగ రచింపఁ గోరఁగా నిక్కవి వానినెల్ల నిరాయాసముగ రచించెనఁట! అంతటఁ దనివిసనక యొకసమస్య నొ

సంగి దాని నాశువునఁ బూరింపు మనుఁడు నిక్కవికుంజరుం డిట్లు పూరించెను.

"ఉ. వస్త్రవహారరత్నములు ♦ వన్నెనగల్ పులిమీఁద వచ్చునా
పుట్రి యటన్నరీతి జిగిఁ ♦ బొల్పగు మాచుకలీలఁ జూచుచుఙ్
దాట్రిలనే? కెలఁగొని ♦ గోరుల సొక్కము నాథ! యంచుఁ దాఁ
గట్రరయొనర్పె లేమ తన + ♦ బ్బలయుబ్బు సహింపలేమిచేఙ్"

తరువాత నీక్రిందిపద్యమున కర్థము చెప్పు మని పృచ్ఛకు లడుగ నాతఁడు వెంటనే చెప్పెనఁట!

"క. కమలాకరకమలాకర, కమలాకరకమలకమలకమలాకరమై
కమలాకరకమలాకర, కమలాకర మైనకొలను గనిరా సుదతుల్"

గ్రంథవిస్తరభీతిచేఁ నాపద్యమున కాతఁడు వ్రాసినయర్థము నిచ్చట వ్రాయలేదు

పిమ్మటఁ గృష్ణభూవరుఁడు సుబ్రహ్మణ్యకవిపాండిత్యాతిశయమునకు సంతసించి, శతకమును విని, తద్రచనాకౌశల్యమునకు నాతని మిగులఁ బొగడుచు, దానిం గృతిగాఁ గొని, విశేషసత్కార మొనర్చి తనయాస్థానమునఁ గవిగా నుండునట్లు కోరెను. ఇక్కాలంబునంబోలె నాదినములయందు రాకపోకల కనువగుమార్గంబులు లేమింజేసియు, నాసంస్థానము తననివాసగ్రామమునకుఁ గడుదూరమున నుండుటంజేసియు నిక్కవి యచ్చట నుండుటకు నంగీకరింపక యాభూపతిం బ్రార్థించి సాంవత్సరికబహుమాన మిచ్చున ట్లొడంబఱుచుకొని కొన్నినాళ్లిచ్చటనుండి మఱల స్వస్థానముం జేరెను ఇట్లు పదియాఱేఁడులదాఁక నీతనికి మూడుగొల్లుసంస్థానంబున వార్షికసమ్మాన మొసంగఁబడుచునే యుండెను. ప్రప్రథమమున నీతఁడు మూడుగొల్లు 1853 వ వత్సరమున నరిగె నని చెప్పుదురు.

ఇక్కవి క్రీ.శ. 1869 వ వత్సరమున శ్రీపీఠికానగరాధినాథుని

సంవర్శింపఁగా వా రితనికి మాసవేతనము నొసంగునేర్పాటు గావించిరి. ఇట్లు నాలుగేండ్లుగడచినపిమ్మట శ్రీరాజావారు భద్రాపరిణయము (ఈ గ్రంథము) ను గృతిగా నొసర్ప ననుమతియిచ్చిరి.

ఇక్కవి యనేకగ్రంథములను రచించెను. వానింగూర్చి యించుక వ్రాయుచున్నాను.

(1) శ్రీకృష్ణభూపతిలలామశతకము :—దీనింగూర్చి పైని వ్రాయఁబడియేయున్నది. ఇది మిగులఁ బ్రౌఢమైనశతకము. కవి దీనిని (క్రీ. శ. 1853) దనయిరువదిరెండవయేఁట రచించెనఁట.

(2) శేషధర్మములు:—ఇది యాఱాశ్వాసములపద్యకావ్యము. ఇది శాలివాహనశతకము 1790 (క్రీ.శ. 1867) వత్సరమునఁ బ్రారంభింపఁబడినట్లు కవి యీగ్రంథమున వ్రాసికొనియున్నాఁడు.

(3) పాపయమంత్రిశతకము :—ఇది పైగ్రంథము రచించుటకు నించుకపూర్వముననో తరువాతనో వ్రాయఁబడినది.

(4) ఆత్మబోధము :—ఇది శ్రీమచ్ఛంకరాచార్యవిరచితసంస్కృతగ్రంథమునకుఁ దెలుఁగు. అందలియొక్కొకశ్లోక మిందొక్కొకపద్యముగాఁ దెలిఁగింపఁబడినది. ఈపుస్తకము శా. శ. 1798 (క్రీ. శ. 1875.) వసంవత్సరమునఁ బూర్తిగావింపఁబడినదని గ్రంథాంతమునఁ గవి వ్రాసియున్నాఁడు

(5) మణిధ్వజచరిత్రము :—ఈగ్రంథము లభింపమిచే దీనికాలముంగూర్చి వ్రాయవలనుపడలేదు.

(6) సింహాద్రిరామాధిపశతకము :—ఈశతకము శా.శ. 1799 (క్రీ.శ. 1876) వ సంవత్సరమున రచియించినట్లు కవియే యందు వ్రాసియున్నాఁడు. శంకరాచార్యవిరచిత మగుప్రశ్నోత్తరమాల యనుసం

స్కృతగ్రంథమునందలిముప్పదినాలుగు తెలుగుశ్లోకములును, వానికిఁ గవిచేసిన తెలుఁగుపద్యములును నీశతకమున నున్నవి.

(7) భద్రాపరిణయము :—ఇది శాలివాహనశకము 1801 (క్రీ.శ. 1878) వ వత్సరమున శ్రీగంగాధర రామరాయప్రభువర్యునకుఁ గృతిగా నీయఁబడుట మొదలగువిషయము లీగ్రంథమునందలిచరమపత్త్రిమున నున్నసీసపద్యమువలనఁ దెలియవచ్చును.

(8) శ్రీకృష్ణకల్యాణము :—హరివంశమునందలిగోవిందపట్టాభిషేకకథ ననుసరించి మూఁడాశ్వాసములపుస్తకముగా రచింపఁబడినది. ఇదియే యిక్కవిరచించినవానిలోఁ గడపటిగ్రంథ మని తోఁచుచున్నది. ఇది “ శాలివాహనశకంబున వేయునెనిమిదినూఱు లబ్దంబులు గడవ నడచిన బహుధాన్యవత్సరమునఁ ” బ్రారంభింపఁబడినట్లు కవియే యవతారికలో వ్రాసికొనియున్నాఁడు. ఇది క్రీ.శ. 1878 వసంవత్సరమగును.

(9) చాటుధారాచమత్కారసారము :—సంస్కృతభాషలోఁ జాటువులుగ నుండి పండితులచేఁ బరంపరగఁ జదువఁబడుచుండునవియు సామాన్యులకు నర్థముకానివియుఁ, జమత్కారముగా నుండునవియునగుశ్లోకములకుఁ బరిపూర్ణవ్యాఖ్యానమును వ్రాసి యిక్కవియాగ్రంథమున కీపేరు పెట్టెను. ఇందుఁ బూర్వాధునికవిద్వత్కవివిరచితంబు లగు ననేకశ్లోకంబులును, వానికి వ్యాఖ్యానమును గలవు. మాడుగోల్లు సంస్థానంబున ‘ కమలాకర ’ అనుపద్యమున కర్థ మడుగంబడుటచేత నే యిక్కవి వాడుకలోనికరినశ్లోకంబుల నన్నిటిని జేర్చి యీగ్రంథముగ వ్రాసె నని చెప్పుదురు.

## కవిగుణాదికము.

“ విద్య గలచోట గర్వము వెలయుచుండు ” నని సామాన్యముగాఁ జెప్పుదురు. ఇక్కవి శ్రేష్ఠుం డుభయభాషలయందును సంపూర్ణ

పాండిత్యము గలవాఁడై యుండియు గర్వముగాని, స్వాతిశయభావముగాని లేనివాఁడై, వినయసౌశీల్యాదిసద్గుణసంపన్నుఁడై, యెవ్వరేమని దూషించినను మాఱువల్కనిసజ్జనుఁడై యుండె నని తెలియుచున్నది. ఈహేతువుచేత నేకాఁబోలు ‘విఖ్యాతవినయుండ’ ననియు, ‘సత్కవివిధేయుఁడ’ ననియు, దనగ్రంథములయందు వ్రాసికొనియున్నాఁడు.

## కవిసామర్థ్యాదులు.

“క. అకలంకభారతీకరు, ణకుఁ బాత్రమవై సుధీజ ♦ నము చెనిల నె
న్నిక గంటివి సుబ్రహ్మ, ణ్యకవీంద్రా! సాహితీర ♦ సాంబుధిచంద్రా!”

(ఈపద్య మీతనిప్రబంధములయం దన్నిటియందును నున్నది.)

అని కృతిపతి తన్నుంగూర్చి సంబోధించినట్లు చెప్పికొనుటవలనను “చతురగర్భసీసాష్టోత్తరశతసంసబంధయమకకవితావిలాసు” నని శేషధర్మకావ్యమునను, “ఉభయభాషాకవిత్వవిలసితు” నని శ్రీకృష్ణకల్యాణమునను జెప్పికొనియుండుటవలనను నీకవికుంజరుం డుభయభాషలయందును నఖండపాండితీవిభవముగలవాఁ డని చెప్పుటకు సందియములేదు. ఈతనిగ్రంథములలో వసుచరిత్రాదిప్రౌఢప్రబంధములలో నుండుపద్యములతోఁ బోల్పఁదగినపద్యము లనేకములు గలవు. మఱియుఁ జిత్ర, గర్భ, బంధకవిత్వముతోఁ గూడినపద్యములు, ఉభయభాషాకందాదులు, అనులోమవిలోమవృత్తాదులు, మొదలగుకవిత్వప్రౌఢిమను దెలుపుపద్యములును నీతనిగ్రంథములయందుఁ గన్పట్టుచున్నవి. మఱియు గ్రంథస్థములు గాక యితరులమీఁదఁ జెప్పఁబడినప్రత్యేకపద్యములుకూడ మిగులఁ బ్రౌఢములై, శ్లేషయమకాద్యలంకారములతోఁ గూడినవై యున్నవి. అందుఁ గొన్ని యుభయభాషానులోమవిలోమాదినియమములతోఁ గూడినపద్యములునై యున్నవి. ఇంతియకాక మిక్కిలికఠినములగు శ్లోకములకు మేలైనవ్యాఖ్యానము గల ‘చాటు

ధారాచమత్కారసార' మీతనిసంస్కృతభాషాపాండిత్యమును, "కళాపూర్ణోదయము, లంకావిజయము" మొదలైనగ్రంథములలోనియుభయభాషాకందములకు నీతఁడు వ్రాసినయర్థములతోడిపత్రికలు గల వేఱొకచిన్నిపొత్త మీతనియాంధ్రభాషాపాండిత్యమును వేనోళ్లఁ జాటుచున్నవి.

కవిసామర్థ్యాదులను దెలుపుమఱికొన్నివిషయంబుల నిచ్చట వ్రాయుచున్నాను.

(1) ఇక్కవివర్యుఁడు "ఇఁక" అనుపదముతోఁ బ్రారంభించి యొకకందపద్యముతో శ్రీరామరాయప్రభుచంద్రునికీర్తి నివర్ణింపుఁ డని యప్పుడప్పుడు కవీంద్రుల నడుగుచువచ్చెనఁట! ఈపదము హ్రస్వాక్షరము మీఁదియఱసున్న యున్నయక్షరము గలదగుటచేతను, మఱియుఁ గందపద్యద్వితీయపాదము గుర్వవసాయి యగుటవలన నట్టిగుర్వక్షరము పిమ్మట వచ్చుహ్రస్వాక్షరముపై నఱసున్న గలపదములొండు రెండుమాత్రమే యుండుటచేతను, (వెల్లఁకి, నాయఁకుఁడు . వారికవిస్ఫురింపకపోవుటచేఁగాఁబోలు) నితరకవులెవ్వరును దానిని రచియింపఁబూనక యుండిరఁట! ఇట్లుండఁగా నొకప్పుడు శ్రీవీరనగరసంస్థానంబునకు శతావధాని యగుశ్రీమాన్, మాడభూషి వేంకటాచార్యకవితల్లజుఁడు రాఁగా నీసుబ్రహ్మణ్యకవి యాయనను గూడఁ బైరీతినే యడిగెనఁట. తోడనే యయ్యాచార్యకవి యాశువున,

"క. ఇఁక నెవ్వానికీర్తులు నీ, ప్రకటగుణుం డైనరామ ♦ రాయక్ష్మాభృ
త్సుకృతిజనపోషకునికీ, ర్తికి సరిగా రావుసుమ్ము ♦ పృథ్వీస్థలిలోన్"

అని రచించి చదివెనఁట. అంతట సుబ్రహ్మణ్యకవి యాపద్యము సరిగా లేదనియు, నందుఁ దప్పు గల దనియుఁ బలికెనఁట! ఆచార్యులు బాగుగ నాలోచించి యందుఁ దప్పులే దని వాదించిరఁట! అంత నీసు.

కవి శ్రీరాజావారిసన్నిధిని శతావధానిగారు మొదలగువా రుండఁగా నీక్రిందిపద్యము చదివెను.

“ క. ఇఁక విను నీయశమునకుఁ ద, లఁకి శశికృశుఁ డయ్యెనుమఱి◆లఁ బెరుఁగ వేర్వె
ల్లఁకియుఁ గొసెసెనొ తొలిమలకె, లఁకులను శ్రీరామరాయ! ◆లలితశ్రేయా!”

అంత నాచార్యులుగారు తమపద్యమునఁ దప్పు లేదని వాదించి రఁట! (ఈయనకుఁ బ్రాసస్థానమున నఱసున్నలు కడవఱకు వచ్చునట్లు పద్యము రచియింపవలయు ననునూహ పొడకట్ట లేదని తోఁచెడి, లేదా, యట్టిపద్య మీయనకుఁ గుదరక పోయెనేమో యనినైన నూహింపవచ్చును, కాక యట్లు చెప్పకపోయినను దోషము లేదని తలంచెనో యేమో!) తరువాత శ్రీప్రభువువారు వారివాదములను విని “ ఆశుకవిత్వమున మీరు గొప్పవా” రని యాచార్యునితోడను, ‘ ప్రబంధకవిత్వమున మీరు గొప్పవా’ రని సుం.కవితోడను ఒలికి వారిని సత్కరించి పంపిరఁట.

ఈవిషయమున నించుక చర్చింపవలసినవిషయ మున్నది. కొందఱిమతమున సబిందుకనిర్బిందుకప్రాససాంకర్యము చేయరాదు. కొందఱిమతమునఁ జేయవచ్చును. మఱియుఁ గొందఱు హ్రస్వాక్షరము పిమ్మట నున్నయరసున్నలనేకాని దీర్ఘాక్షరములపిమ్మటివానిని బాటింపనక్కఱలే దందురు. వీనికి లక్షణగ్రంథకర్తలు చూపినలక్ష్యము లనేకములున్నవి. అవి యప్పకవీయసర్వలక్షణసారసంగ్రహాదిలక్షణగ్రంథములు చూచిన గోచరించును. కావున గ్రంథవిస్తరభీతిచే నిచ్చట నుదాహరింపనైతిని.

“ ప్రాస స్సర్వేషు చైక ఏవస్యాత్ ” అనున్యాయమునుబట్టి యిట్టివానిసాంకర్యము చేయకుండుటయే కవియొక్క ప్రౌఢత్వమును, కవనముయొక్క దోషరాహిత్యమును సూచించును. కవిత్రయమువారి

మత మిదియ యని తోఁచెడి. ఈసుబ్రహ్మణ్యకవి యప్పటిపట్టుదలపై నట్లు వచించి తనప్రజ్ఞను జూపెను. కాని యేకారణముననో తనగ్రంథములయందును నిట్టిసాంకర్యమును గావించియే యున్నాఁడు.

దీర్ఘాక్షరముపై వచ్చునఱనున్నకు :—

"క. ఈగతి నప్పురి వెలువడి । యాగోవిందుండు కతిపయాధ్వగతిఁ జనం
గాఁగేకయపురిచెంతం । బాగగ......" ద్వితీ 75 ప. (172 పు)

హ్రస్వాక్షరముపిమ్మటిదానికి :—

తగవువ...ది । వ్యగురుని... । అగు...నెం । చఁగ..." ప్రథ 84 పుట!

(2) శ్రీగంగాధరరామరాయప్రభువరునియనుగ్రహమునకుఁ బాత్రుఁడైన సూరపరాజుమల్లపరాజనునొకగృహస్థుని నిక్కవి చూడఁబోవ, నాతఁడు "శ్రీరావువేంకటమహీపతిగంగాధరరామారాయ" అనునామ మిమిడ్చి యొకకందపద్య మాశువునరచింపు మనఁ దత్క్షణమ యిట్లు చెప్పెనఁట!

"క. శ్రీధర! శౌరీ! వైకుం । ఠా! ధరశ్రీరావువేంక ♦ టమహీపతిగం
గాధరరామారాయ । క్ష్మాధరునిం బ్రోవు మెపుడు ♦ కరుణాదృష్టిన్"

(3) ఒకసారి యిక్కవి కాట్రావులపల్లె యనుగ్రామమున నొకగృహస్థునింట స్నానముచేయుచు, నచ్చటినూతినీరు కడుఁ జేఁదుగా నుండె నని పలుకఁగా, నాగృహమేధి 'యీయూరనుందునూతులలో నియుదక మెల్ల నిట్లే యుండు' ననియు, దీనింగూర్చి యొకపద్యము రచింపుఁ డనియుఁ గోరఁగా నీతఁ డీక్రిందిపద్యమును జెప్పెనఁట!

"క. దేవాసుర లబ్ధిఁ దరువ । నావిర్భూత మయి హాల ♦ హాల మపుడు మహా
దేవునకున్ భీతిలి కా । ట్రావులపలినూతులందు ♦ డాఁగెనుజుండీ."

(4) మాదుగొల్లుసంస్థానంబున నొకప్పు డొకనియోగికవి "వైదికకవిత్వము వైదికకవిత్వము" అని యాక్షేపించుచురాఁగా వినివిని విసివినయిక్కవి యిట్టు పలికెనఁట!

"ఉ. చందనశాఖికన్న విర ♦ సంబుగ బూరుగ మేలటన్న త్రీ
విం దగినట్లు వైదికక ♦ వీత్వసుధారసధారలెల్లఁ జె
ల్వొందఁగ భూతలంబున ని ♦ యోగికవిత్వముతోడ సాటిగా
దందురు బెట్టిదం బగు న ♦ టందురు కొందఱు మూఢమానవుల్."

## కవిత్వశైలి

ఇది మహీధరశిఖరనిర్గళత్స్రవంతీప్రవాహంబుంబోలి యనర్గళప్రచారంబై మిగులఁ బ్రౌఢమై విరాజిల్లుచున్నది. ఈతనికవిత్వమునం దాంధ్రపదములకంటె సంస్కృతపదములే యెక్కుడుగా నుండును. ఈతనికవితాశైలి దెలియుటకై యొక్కొకగ్రంథమునుండి యొక్కొక పద్యముమాత్ర మిచ్చుట వ్రాయుచున్నాను.

## కృష్ణభూపతిలలామశతకము

సీ. వినికియొక్కొకపద్య ♦ మునకు నీ వర్పించు, కరులఘీంకారబం ♦ ధురతకల్గి
యొకకల్పనమునకీ ♦ వొసఁగుసైంధవముల, బహులహేషారవా ♦ గ్భటికిఁ దలఁకి
మొనసి ని వొకశబ్ద ♦ మునకిచ్చుకాంచనాం, చితమణిపటలిదీ ♦ ధితికి వెఱచి
యక్షరంబునకొక్క ♦ లక్షగా నర్పించు, ఘననిష్కసంతతి ♦ ధ్వనులకదలి
యిరవు లేకున్కి విబుధుల ♦ యిండ్ల వెదకి
పాఱె నెచటికో కాని ని ♦ ష్పచ్చగంబు
మర్త్యకులదీప! దివ్యమ ♦ న్మథసురూప!
పరమగుణధామ! కృష్ణభూ ♦ పతిలలామ!

## శేషధర్మములు.

మ. తనయా! నీనగుమోముఁ జూపిమదిలో ♦ దైన్యంబు వోఁబెట్టి చ
క్కనిసెయ్యంబున ముద్దుఁబల్కులు వినం ♦ గాఁ బల్కవే నిన్నుఁ బా
సినరత్నాభరణాంబరార్థగజవా ♦ జిస్యందనాందోళికా
ద్యవవద్యస్థితులేల? మందిరములే ♦ లా? నూఱువే లుండినన్? (తృతీయా)

(తామరపల్లితిమ్మయాభిధానుని శేషధర్మములనుండి యీయర్థమునే యిచ్చుపద్యము నీక్రింద నుదాహరించుచున్నాఁడను. ఈరెంటికి భేదమునరయుఁడు)

" మ. కొడుకా ! యెక్కడకేగితే ! మొగము నా ♦ కుంజూపి డెందంబులో
నడలుం బాపుమ ! నిన్నుఁ బాసిన మణుల్ ♦ హర్మ్యంబులున్ దోఁటలన్
గుడుముల్ శర్కరలన్ ధనంబులు పగల్ ♦ కోటానకోట్లున్న నీ
నొడువుల్ వోలె మనోహరధ్వనితతుల్ ♦ నూల్కొల్పవే వివ్వియున్ "

### పాపయమంత్రిశతకము

క. న్యాయగుణునకుఁ దోడగు రఘు । నాయకునకుఁబోలె మృగగ ♦ ణంబు లయిన; న
న్యాయగుణుఁ దమ్ముఁడైనం । బాయును రావణునిఁబోలెఁ ♦ బాపయమంత్రీ. 45 ప.

### ఆత్మబోధము.

తే. విషయముల నింద్రియములు వ్యా ♦ పించుచుండ
నాత్మ వ్యాపించుగలేఁ దోఁచు ♦ నజ్ఞులకును
జలదములు మింటఁ బఱవఁగాఁ ♦ జందురుండు
పఱచుచున్నట్లెఱుంగునఁ ♦ బద్మనాభ

( శ్లో. వ్యాపృతేష్విన్ద్రియేష్వాత్మా, వ్యాపారీవావివేకినామ్
దృశ్యతేఽభ్రేషు ధావత్సు ధావన్నివ యథా శశీ. ) 19 వ శ్లోకము.

### మణిధ్వజచరిత్రము.

శా. క్ష్వేళాఘూర్ణితగిక్తటంబు, కహహా ♦ సింహంబుజంబాలదం
భోళిస్పర్ధినఖాంకురంబులశరం ♦ బుల్ నగ్గగాపించుచున్
వ్యాలోలధ్రిపనారుణాగ్రివిన్యతా ♦ స్యంబై మహీజానిపైఁ
గీలాశించినజంత్రమ ♦ ట్లఱికె లక్ష్మి ♦ ఘింఘెంటలోదగ్రితన్

### సింహాద్రిరామాధిపశతకము.

మ. మృగమేగ్గమిదియున్ నర్పాలుబ్ధునకున్ ? ♦ మీనంబు గీడేమి చే
సెఁ గడున్ జాలరి ? కేమి హాని యొనరిం ♦ చెం జీర కీటాళి ? క
ట్లుగ నిర్హేతుకవైరమూని కుజనం ♦ డున్ ఘాతుకత్వం బొన
ర్పుగ శాఘుం జెగుసజ్జనోత్తములకున్ ♦ సింహాద్రిరామాధిపా ! 60 పద్య.

### శ్రీకృష్ణకల్యాణము.

శా, నానాదేశమహీశబంధుహితబృం ♦ దంబుం బరివేష్టింప నా
లోనన్ మాగధభూవరుండు శిశుపా ♦ లుండుం గలాహార్యసం
తానాంతస్థితమేరుమందరగిరి ♦ ద్వంద్వంబురీతిన్ సుఖా
సీనుల్ గాఁ గని యేను వీరిటకు విచ్చే ♦ యం బనే మన్న వాన్, తృతీయా.

( భద్రాపరిణయమీపొత్తమేకావుననిందలిపద్య ముదాహరింపఁబడ లేదు. )

## కథాకల్పనాదులు.

'కాశాదము పెద్దనసోమయాజి' యనుమహాకవి భద్రాపరిణయ మనునామాంతరముగల "ముకుందవిలాస" మనునొకప్రబంధముఁ వ్రాసినట్లు శ్రీ రాయబహద్దరు వీరేశలింగముపంతులుగారికవులచరిత్రమున నేను జదివియుంటిని గావున నీరెండుగ్రంథములకును గలతారతమ్యము ను గనుంగొనుటకు ముకుందవిలాసమునకై నే ననేకప్రయత్నములు చేసి తుదకుఁ దణుకుతాలూకాలో నాబంధువులొకరియొద్ద నొకపురాతనతాళపత్త్రగ్రంథ మున్నట్లు విని దానిందెప్పించి చదివితిని. అది యనేకవిధముల మిగులఁ బ్రౌఢమై రసవంతమై యున్నది. శ్రీయుతవీరేశలింగముపంతులుగారు "ఇక్కవి (పెద్దనసోమయాజి) సంస్కృతాంధ్రములయందు బహుసమర్థుఁడు. ఈతనిగ్రంథములో నున్నన్ని శబ్దాలంకారములును, చిత్రబంధకవిత్వపద్యములును మఱియేకవిగ్రంథములోను లేవు. ఈతనికవనము రసవంతమై కవిజనహృదయరంజకముగా నుండును" అని తమయాంధ్రకవులచరిత్రము తృతీయభాగమున వ్రాసిన సంగతియు నెంతయుఁ దగియున్నది. ఇవి మొదలగుకారణములంబట్టియు, 'కకారము మొదలుమకారముదనుక నుండువర్ణము లిరువదియైదు' ను విడిచి యరలవాదిమితవర్ణములతో మాత్రమే "శేషశైలేశలీల" యనుపేరితో 'అపంచవర్గీయకృతి' ని రచియించియుండుటంబట్టియుఁ బెద్దనసోమయాజి యనేకవిషయములయందు మిగులఁ బ్రౌఢుఁడని చెప్పవచ్చును, "శేషశైలేశలీల" ను రచించువాఁ డెట్టివాఁడై యుండునో యూహింపుఁడు. అట్టి 'యపంచవర్గీయ' పద్యము నొకదానిం గనుఁడు.

## సింహావలోకముక్తపదగ్రస్తకందము.

"క. సరసా వంశీసురవా, సురవారాశంసిశౌర్య ♦ శూరాశరహా
శరహారి హారి స్వరయా, స్వరయావహలీలయాస్య ♦ వశహా సరసా."

పెద్దనసోమయాజిభద్రాపరిణయమునుబట్టియే సుబ్రహ్మణ్యకవి
కొలఁదిమార్పులతోఁ దనభద్రాపరిణయమును రచియించియున్నాఁడు.
మఱియుఁ బెద్దనసోమయాజియందుఁ గలగౌరవముచే నిక్కవి కథాభా
గము నేకాక యుండలి యనేకపద్యములలోనిభావములనుగూడఁ దీసికొని
యున్నాఁడు మఱియు నాతనిగ్రంథములోని కొన్నిపద్యములనుసయిత
ము దీసికొని పెద్దనసోమయాజియం దమితగౌరవమును జూపియున్నాఁడు.
ఏతద్విషయములనుగూర్చి సంగ్రహముగా నిచ్చట వ్రాయుచున్నాను.

(1) కథావిషయము :—యదువంశచక్రవర్తి యగుశ్రీకృష్ణుం
డు ద్వారకానగరంబున నుండి ప్రజలను నిరీతిగఁ బాలించుచు నొక
నాఁడు పాండవులఁ జూడ నిందప్రస్థపురంబునకుఁ గతిపయపరివార
ముతో రథారూఢుండై చని మార్గమధ్యమున రోహణపర్వతము కా
నరాఁగా దానిపై డిగ్గి దాని నభివర్ణించుచు విహరించుచు నుండెను.
(ప్రథమాశ్వాసము) అట్లొకింతసేపు విహరించి యొకచో విశ్రమించి
యుండ నచ్చటికి శ్రుతిరంజని యనునొకయోగిని వచ్చి శ్రీకృష్ణునిదర్శిం
చి యాతని స్తుతించి తనవచ్చినకార్యము విన్నవించునదియై యిట్లుపలి
కెను. "దేవా! కేకయపతి యగుధృష్టకేతుఁడు చిరకాలముదనుక
సంతానము లేనివాఁడై శ్రుతకీర్తి యనుతనసతితో రమాదేవి నారా
ధించి యామెప్రసాదమున సంతర్దనుఁ డనుకుమారు నొకనిని, భద్ర
యనుకూఁతు నొకదానిని గాంచెను. ఆభద్రాదేవికి లక్ష్మీదేవియాజ్ఞచే
నేను సకలవిద్యలను నేర్పితిని. ఆమె మిక్కిలిసౌందర్యము గలది తం
డ్రి యొకనాఁడు భూలోకంబునం గలరాకుమారులరూపములను బట

ములందు వ్రాయించి యామెకు వానిం జూపఁగాఁ జూచి యందు ని
న్నే కోరి యామె నీపై విరాళిం జెంది తపించుచున్నది కావున వేగము
వచ్చి యామెను జేపట్టుము ”. ఇట్లు శ్రుతిరంజని చెప్పఁగాఁ గృష్ణుఁ
డు సంతోషించి ‘ఇప్పు డింద్రప్రస్థపురంబునకుఁ బోవుచున్నా’ ననియు
‘కతిపయదివసములలో వచ్చి యామెం బెండ్లియాడెద’ ననియుఁ జెప్పి
యామెను వీడ్కొలిపి తా నచ్చటనుండి పాండవు లున్నవీటికిం బోయి
యచ్చటఁ గొన్నాళ్లు సుఖంబుండి భద్రాదేవికి స్వయంవరం బగునని
విని కేకయపురింగూర్చి వెడలెను. అట్లు పోవుచుఁ గేకయపురకృతకా
ద్రిపార్శ్వభాగంబున నొకరమ్యవనము గానవచ్చుటయే కాక యందుం
డి యొకమనోహరవీణాగానమును వినవచ్చెను. అంతటఁ గృష్ణుండు త
నపరివారము నచ్చట నిలిపి తానవ్వనంబుం బ్రవేశించి యచ్చట నొప్పు
రత్నమందిరముచెంత నున్నద్రాక్షపందిరిలో నొకచంద్రకాంతశిలావే
దికపై నిండారుచెల్వుతోఁ జెన్నారుచు నెచ్చెలులు దన్నుఁ బరివేష్టింప
మాటిమాటికిఁ దనచిన్నారివ్రేళ్లను మీటుచు నతివిలాసంబుతో వీణ
వాయించు నొకసుందరీతిలకముం గని, తన్మనోజ్ఞాకృతికి విస్మయమందు
చు నచ్చటితీవెలచాటున నిల్చి యామెను వర్ణించుచు సంతోషాబ్ధిఁ
దేలుచునుండెను. (ద్వితీయాశ్వాసము.) “ఓయలివేణీ! హిందోళపు
రాగము నీవీణయందు మనోహరముగఁ బాడితివేని యీసమయమున
మాధవుఁడు (వసంతుఁడు) సాక్షాత్కరించు” నని యొకచెలికత్తె పలు
కఁగా నక్కన్నెమిన్న యట్లు కావించెను. శ్రీకృష్ణుండు దా నగపడుట
కదే యదన నని పొదరిల్లు వెలువడి వసంతుఁడో యన వారియెదుట ని
లిచెను. ఆతనిం గాంచి యచ్చెలువలెల్ల విభ్రాంతలైరి. భద్రయు నా
జగన్మోహనవిగ్రహముం గాంచి మోహపరవశురాలై యుండ, నచ్చటనే
యున్న (పూర్వపు) యోగిని భద్రం గాంచి “చెలీ! నీభాగ్యరాశి యు

గు(శ్రీకృష్ణుఁ డీతఁడే. నిన్నుఁ జూచుటకే వచ్చినాఁడు. కావున నీమహా
మహుని దర్శింపుము." అని పలుక నాభద్రాకన్య సిగ్గుపెంపున (విలా
సవైఖరి నాతనిం గాంచుచు) నచ్చటిమేడలోనికిఁ బోయెను. అంతటఁ
గృష్ణుఁడు ధృష్టకేతుని, నాతనిభార్యయుఁ, దనమేనత్తయు (వసుదేవుని
సోదరియు) నగుశ్రుతకీర్తిని దర్శించి క్షేమాదులం దెలిపి యొకమందిరం
బున విడిసి భద్రాదేవిం దలంచుచు నుండెను. భద్రయుఁ గృష్ణునిపై వి
రాళిచేఁ దపించుచు నుబుసుపోకకై యుద్యానంబున కేఁగి యచ్చట
విరులపాన్పుపై మేనువాల్చి యున్నరనుచుండ నామెచెలి యొర్తు కృ
ష్ణునిపటముం దెచ్చి యాతఁడే కృష్ణుఁ డని చెప్ప నాముగ్ధ కూర్మిచే
దానిని దనయక్కునఁ జేర్చుకొని యుండెను. (తృతీయాశ్వాసము.)
మఱునాఁడు సూర్యోదయము కాఁగానే ధృష్టకేతుఁడు తనకుమారుఁ
డైనసంతర్దనుని శ్రీకృష్ణునిసంసేవనమునకై పంప నాతనిం గాంచి శ్రీకృ
ష్ణుఁడు తనపీఠముపైఁ గూర్చుండఁబెట్టుకొని సరసాలాపంబు లాడుచుం
డ, నచ్చటికి నారదుఁడు వచ్చెను. వాసుదేవుఁ డమ్మునికి నమస్కరింప
'భద్రాప్తిరస్తు' అని దీవించి పిమ్మట నాతని శ్రీమహావిష్ణునిదివ్యావ
తారముగా బహుభంగుల స్తుతించి యాతనియనుజ్ఞం గొని యేగుచుం
డ మార్గమునందు భద్రాస్వయంవరమ్మునకు వచ్చువిందానువిందు లను
నిద్దఱురాజులు 'సంయమివరా! భద్ర మాలో నెవ్వరిని వరించునో
భావ్యర్థజ్ఞుండ వగునీవు వక్కాణింపుమా!'" యని తన్నడుగ నమ్ముని
'భద్ర రమాంశసంభూత కావున శ్రీకృష్ణునిఁదక్క నొరుల నెవ్వరిని వ
రింప' దని చెప్పి యథేచ్ఛముగఁ జనియెను. అంత స్వయంవరము జ
రుపఁబడెను. నానాదేశరాజులును జూచుచుండ భద్ర కృష్ణుని వరించె
ను. విందానువిందులు కృష్ణు నెదిరించి యోడి పాఱిపోయిరి. పిమ్మటఁ
గృష్ణుఁడు భద్రను జేపట్టి సుఖముతో ద్వారకానగరంబున కరిగి యు

సంతభోగంబుల ననుభవించుచుండెను. (చతుర్థాశ్వాసము.)

పైకథయంతయు నించుమించుగఁ బెద్దనసోమయాజిగ్రంథము లోనిదే. అయినను నిందుఁ గొన్నిమార్పులు గలవు. సోమయాజిగ్రంథమున, శ్రీకృష్ణుఁడు ముందుగనే యింద్రప్రస్థమున కరిగి పిదపరైవత మహీధరంబున కరిగిన ట్లున్నది. ఇం దది తలక్రిందుగఁ జెప్పఁబడినది. (రైవతగిరి రోహణగిరిగామార్పఁబడినది) మఱియుఁ బెద్దనపొత్తమున శ్రీకృష్ణునితో భద్రాదేవియుదంతము నొకచిలుక చెప్పినట్లుండఁ నీతఁడు దానిని యోగినిగా మార్చినాఁడు. ప్రథమమున నీతఁడు వ్రాసి నగ్రంథమందును జిలుకయే చెప్పఁబడెను. కాని తిర్యగ్జంతువుచే మాట్లాడించుట యంతసరసమై యుండదనియో, మఱియేమోకాని తరువాతిప్రతులలో దానిని యోగినిగా మార్చినాఁడు. పెద్దసోమయాజి వ్రాసినకథలలో ననేకభాగము లీతఁడు వదలివేసి కథను మిక్కిలి సంగ్రహపఱచెను. కాని యావిడిచిపెట్టఁబడినభాగములలో నొక్కటిమాత్ర మిందు లేకపోవుటచేఁ గథకంతకును లోపముఁ దెచ్చుచున్నది. అది యేది యన,

భద్రాశ్రీకృష్ణు లిరువురును మేనత్తమేనమామబిడ్డలు. అనఁగా భద్రాదేవి శ్రీకృష్ణునితండ్రికిఁ (వసుదేవునకుఁ) దోఁబుట్టువగుశ్రుతకీర్తి యనునామెకుఁ గుమారిక. దీనింబట్టి యామెశ్రీకృష్ణునకు మేనత్తకూఁతురును, శ్రీకృష్ణుఁ డామెకు మేనమామకుమారుఁడు నగుచున్నారుగదా! అత్యంతసమీపబంధువు లయినయీవధూవరు లిరువురును దామిట్టిబాంధవము గలవార మని యెఱిఁగియున్నట్లు కవి యెచ్చటను జెప్పియుండలేదు సరియకదా, యతఁ డొకదేశపురాజకుమారుఁడుగా నామె తెలిసికొన్నట్లును, నామె యొకదేశపురాజకొమారితగా నాతఁడు విన్నట్లును చెప్పినాఁడు. ఇది మిగుల నసంభవము. ఎట్టివారును

మేనత్త మేనమామలబిడ్డలయుదంతము నైన నెఱింగియుండకపో రన్న
చో నట్టియున్నతవంశజాతులే యెఱుంగకుందురా? ఈవిషయము కథకు మిక్కిలి లోపమును దెచ్చుచున్నది. పెద్దనసోమయాజి యీవిషయమును బాగుగఁ జెప్పియున్నాఁడు సుభద్రార్జునులవలెను, శశిరేఖాభిమన్యులవలెను వారు ప్రప్రథమముననే యొండొరుల నెఱింగియున్నట్లు సూచించియున్నాఁడు. మఱియు శ్రీకృష్ణుఁడు గదుఁ డనునొక యాదవకుమారునిఁ దోలుదోల్తఁ గేకయపురమునకుఁ బంపి వారిక్షేమము మొదలగువృత్తాంతముల నెఱింగి యున్నట్లు చెప్పినాఁడు. కథచివరనుగూడఁ గొలఁదిమార్పు లున్నట్టు తోఁచుచున్నది. కాని నాకు లభించినతాళపత్త్రగ్రంథము మిగులశిథిలమై యుండుటచే దానినేర్పఱించుటకు నా కిప్పుడు వలనుపడలేదు.

కేవలభాషాప్రౌఢిమనే చూపుటకు రచింపఁబడినయిట్టివానిలోఁ గథాకల్పనావైచిత్రిగాని, పాత్రగుణపోషణాదులుగాని పాటింపఁబడియుండ వని నేను మొదట వ్రాసియే యున్నాఁడను. కావున నిందలి కథనుగుఱించియు, నాయాపాత్త్రములగుణములనుగుఱించియు వ్రాయవలసినవిశేషవిషయము లెవ్వియును గాన్పింపలే దని వేఱుగ విన్నవింప నక్కఱలేదు.

(2) పద్యభావములు:—కవులు సామాన్యముగా, నితరుల గ్రంథములయందు మనోహరములైనభావములు తమకుఁ గనంబడెనేని యట్టివాని నచ్చటచ్చటఁ దమపాత్త్రములందు నెక్కించుకొనుచుందురు. లేదేని వానింబోలినవానినేని కల్పించుకొందురు. మఱియుఁ బురాణాదులనుండి కైకొనఁబడినకథను బెంచి ప్రబంధముగ వ్రాయునప్పుడుకూడ నందలిభావములుసయితము ప్రబంధములోనికి దొరలుచుండుటయు సహజమే. ఇట్టిచో నొకప్రబంధములోనిసంపూర్ణకథనే కైకొని యిం

కొక ప్రబంధమున వ్రాసినప్పు డందలిమంచిమంచి భావము లిందుఁ బ్రవేశించుట యాశ్చర్యముగాదు. అయిన నీగ్రంథమునం దవి యతిమాత్రముగాఁ గనంబడుచున్నవి. అట్టివానిలోఁ గొన్నిటి నిచ్చటఁ జూపుచున్నాను.

ద్వారకానగరమునందలిబ్రాహ్మణశ్రేష్ఠులవర్ణనము.

“ సీ. శ్రుతిపదక్రమలీలఁ ♦ జూపనేరఁ డటంచు, శేషుఁ గ్రించుగాఁ ♦ జేయఁగలరు,
కావ్యసంపదనించు ♦ కయు నెఱుంగఁ డటంచు, గురునాదివిక్కృతిగా ♦ నెరపఁగలరు,
కడుఁబ్రభాకరయుక్తిఁ ♦ గనియడంగునటంచు, ద్విజరాజు నొకటఁగుం ♦ దింపఁగలరు
..........................భూమిసురలనవ్వీటి ♦ భూమిసురులు.”

పెద్దనముకుందవిలాసము. ప్ర.

“చ. తగవున శేషునిన్ శ్రుతిప ♦ దక్రమలీలలు నేరఁ డంచు, ది
వ్యగురుని గావ్యగోష్ఠి యిసు ♦ మంత యెఱుంగఁ డటంచు సద్వ్రతుం
డగుద్విజరాజునుం గడుఁబ్రి ♦ భాకరుమిక్కులఁ జిక్కనంచు నెం
చఁగఁగల రప్పురిన్ నిగమ ♦ శాస్త్రకళాచతురుల్ మహీసురుల్.

భద్రా పరి 106 పద్య

ఇట్లే తక్కినజాతులవర్ణనములు గలపద్యములభావములుసయితముగ్గైకొనఁబడి వేర్వేఱుపద్యములుగాఁ జెప్పఁబడెను.

“ శా. ధారారీతి సమీరపంచకము పా ♦ దశ్రేణికం బట్టగాఁ
నారాచంబులు నోడి పార్శ్వములనం ♦ టం గొల్వఁగా నాత్మవే
గారూఢిం గనురేవ దేవమణిమా ♦ ద్యత్కాంతభూపాద్యలం
కారంబుల్ బిరుదుల్ ధరించి పురిలోఁ ♦ గన్పట్టు ఘోట్టాణముల్.

పెద్దనముకుం. ప్రథ.

“ చ ఒదవెడునాత్మవేగమున ♦ కోడి సమీరణపంచకంబు దాఁ
బదములఁ బట్టెనో యనఁగఁ ♦ బంచవిధాంచితధారలొప్పఁగాఁ
బ్రిదరము లట్లమోడి యిరుపార్శ్వము ♦ లం దముఁ గొల్చుచుండ నాఁ
బొదు లిరుగ్రేవలం బొదలఁ ♦ బొల్చు మహాజవసాశ్వముల్ పురిన్.

భద్రాప. పరి 111 పద్య.

“ ఉ. తారక సరత్నకుట్టిమశి ♦ తంబులఁ దోఁప శతాంగరీతులన్
హారిమణీశిరోగృహము ♦ లందు ఫలింప విమానలీలలన్
హీరపుత్తాల జాతి చన ♦ విచ్చెఁ దనంతట స్యందనస్థితిన్
దీరులు మీఱ నూరఁ దగుఁ ♦ దేరులు పేరులు సార్థకంబుగన్.

ముకుంద. ప్రథమా.

“ చ. లలితమణీశిరోగృహము ♦ లన్ రహిఁ దోఁప విమానలీలలన్
దలముగ రత్నకుట్టిమశతంబులఁ ♦ దోఁప శతాంగరీతులన్
బలుసెటాలజాతి పిద ♦ పం జని హెచ్చఁగ స్యందనస్థితిన్
దెలుపుచు నూరఁ దీరుఁ గనుఁ ♦ దేరులు పేరులు సార్థకంబుగాన్.

భద్రా. ప్రి. 112 ప.

ఇట్లే పురవర్ణనమునను నచ్చటచ్చటఁ గన్పట్టుచున్నవి.

## రాజవర్ణనము.

సీ. వసుదేవచిరభాగ్య ♦ వాసనాసారంబు, దేవకీకృతపుణ్య ♦ జీవనంబు
నందయశోదాజ ♦ నసంచితఫలంబు, బలదేవసుకృతసం ♦ బంధసీమ
దివ్యబృందావనా ♦ రామకేళిపికంబు, కంసాదిఖలతమః ♦ ఖరమరీచి
రుక్మిణీముఖవరో ♦ రూపసరోహంస, శుకవాక్యమాణిక్య ♦ సూత్రసరణి
యానగరమేలు మేలున ♦ యానఁ గరము
భూజనమునకు బహుసౌఖ్య ♦ భాజనముగ
మదనశతమూర్తి వల్లవీ ♦ మానవస్తు
చౌర్యవిస్ఫూర్తి యదువంశ ♦ చక్రవర్తి  పెద్దనముకుందవిలాసము ప్రథ.

సీ. దేవకీవసుదేవ ♦ దివ్యతపఃఫలం, బలియశోదానంద ♦ భాగ్యసీమ
బలదేవచిరపుణ్య ♦ పరిపాకసమయంబు, రాధికాయూథికా ♦ శ్రీవనంబు
కంసాదిఖలమత్త ♦ గజసింహశాబంబు, వల్లవీజనమోహ ♦ వార్ధిరాజు
రుక్మిణీహృదయస ♦ రోవరహంసంబు, సత్యభామాముఖా ♦ బ్జాతతరణి
యానగరమేలు మేలున ♦ యానఁ గరము,
భూజనమునకుఁ జిరసౌఖ్య ♦ భాజనముగ
నాగమాంతప్రవర్తి య ♦ నంతకీర్తి,
స్మరశతసుమూర్తి యదువంశ ♦ చక్రవర్తి.  భద్రా. ప్ర 117.

పెద్దనసోమయాజి తాను రచించెసిది భద్రాపరిణయము గావు

న సుభద్రాపరిణయ మగువిజయవిలాసములోని,

“ చ అతని నుతింప శక్యమె జ ♦ యంతునితమ్ముఁడు సోయగంబునన్
బతగకులాధిపధ్వజుని ♦ ప్రాణసఖుండు కృపారసమ్మునన్
క్షితిధరకన్యకాధిపతి ♦ కింబ్రతిజోదు సమిజ్జయంబునం
దతని కతండె సాటి చతు ♦ రబ్ధిపరీతమహీతలమ్మునన్.

అను పద్యముం జూచి దానిని మించునట్లు,

“ చ. సిరికి వయుండు భాగ్యమునఁ, ♦ జెల్వమున న్మరుఁ గన్న మేటి, ధీ
సరణి విరించికిం గురుఁడు, ♦ శౌర్యమునం బురభేది చాటమిం
బఱపినయట్టిజోదు, సిత ♦ భానునివియ్యము సత్కళాప్తి, సు
స్థిరకృప శౌరియే, మఱి ను ♦ తింపఁగ శక్యమె తద్గుణావళుల్ ?”

పెద్దనముకుం. ప్ర. ఆ

అని చెప్పఁగా, మనకవి దీనిని మెచ్చుకొని కొంచెము మార్చి,

“ చ చెలువున మన్మథుం గనిన ♦ శ్రీనిధి, శ్రీకి వరుఁడు సంపదన్
గళల సుధాంశువియ్యము, మ ♦ గంటిమి నప్పురభేది వాజిలో
గెలిచినజోదు, బుద్ధి విధి ♦ కిం గురుఁ డబ్ధికి మామ సత్కృపా
కలనఁ దరంబె యేరికి న ♦ ఖండతదీయగుణాళు లెన్నఁగాన్.

అని తనగ్రంథమునఁ జేర్చుకొనియున్నాఁడు. ఇతఁడు క్రొత్తగా మార్చినవిశేషణమున రస మేమియుఁ గాన్పింపదు.

ఇట్లే గ్రంథము కడవఱకు వర్ణనభాగములలోఁ బర్వత, వన, స్త్రీ, మధుమాసాదివర్ణనములపట్టున భావములు గ్రహింపఁబడినపద్యము లనేకములు గలవు. ఇఁకఁ గొలఁదిమార్పులుగలిగినపద్యములు— కథాభాగములోనివి చూపెదను. ప్రథమాశ్వాసము.

“ ఈరీతి నీతి దైతే, యారాతి నిరీతిగాజ ♦ నావనభూతిన్
మీఱి సుఖస్థితి నెకనాఁ, డారూఢప్రీతి మతి హి ♦ తావృతి నెఱయన్ ”

ముకుం పఀ.

“ క ఈరీతి నితి దైతే, యారాతి నిరీతిగా జ ♦ నావనముమదిం
గోరి యొనర్పఁగ నెకనాఁ, డారూఢప్రీతి మతి హి ♦ తావృతి నెనసెన్ ”

భద్రా. ప. 128 ప.

ఎత్తుగీతి ఊరడించి వారల ♦ నూఱడించి, యాలవరించినచెలుల లో ♦ నలవరించి,

(ఈతరువాతిపాదము నాయొద్ద నున్నపొత్తములోనిదిశిథిలమైపోయినది)

... కూరకులు లంటిరా(గ నా ♦ కూరకులుడు　　　ముకుంద. ప్రథ.

ఎత్తుగీతి. అలవరించినచెలుల లో ♦ నలవరించి, యూరడించినవారల ♦ నూఱడించి
యన్న గరమునఁ గాపుంచి ♦ యన్నఁ గరము, కూరకులు లంటిరాఁగ నా ♦
కూరకులుఁడు　　　భద్రా ప్ర. 125.

## ద్వితీయాశ్వాసము.

"క. ఈచందంబున నవ్వన, వైచిత్రిం గనుచు యాద ♦ వప్రభుఁ డొకచో
లోచనచకోరసమ్మద, సూచక మగునిందుకాంత ♦ సుందరవేదిక్" ముకుం ద్వి.

"క. ఆచందంబున నన్నగ, వైచిత్రిం గనుచు యాద ♦ వప్రభుఁ డొకచో
లోచనసరోజసమ్మద, సూచక మగుసూర్యకాంత ♦ సుందరవేదిక్" భద్రా. ద్వి.

(చిలుకను యోగినిగా మార్చుపట్టున నిట్లున్నది.)

ముకుందవిలాసములోని చిలుక.

సీ. అపరంజి మెఱుఁగుటం ♦ దపుముక్కుద్యుతిసంచు, జలజరాగచ్ఛాయ ♦ నెళవు సేయు,
కలికిచిన్నారిచా ♦ క్కపు టెక్కలబెడంగు, మరకతాళిచ్ఛాయ ♦ నెలుక సేయు
వాకంఠహృదయప ♦ ర్యంతకాంతిచ్ఛటల్, పుష్యరాగచ్ఛాయ ♦ పొందు సేయు
నలుదిక్కులీక్షించు ♦ నయనమరీచికల్, శక్రనీలచ్ఛాయ ♦ చనవు సేయు
దివ్యమణిపుత్త్రియో యనఁ ♦ దేజరిల్లి
సుందరస్ఫూర్తిఁ బెనఁగొనఁ ♦ జూచువార
లౌ ననంగ జగన్మోహ ♦ నాంగమైన
యొక్కరాచిల్కఁ గనిమోదా ♦ మోదయుండు."　　　ముకుంద. ద్వి.

(భద్రాపరిణయములోని యోగిని)

సీ. అపరంజి మెఱుఁగుటం ♦ దపుశరీరచ్ఛాయ, దొలుకారుమించుల ♦ నెళవు సేయఁ
గలికినిద్దంపుఁ జ ♦ క్కనిచెక్కులబెడంగు, మగరాలతళుకుల ♦ సొగసు గెలువ
వాణెంపునునుసోగ ♦ వేణీభరముసొంపు, వేల్పురారాలరీ ♦ వి ని హసింపఁ
గాలుకుల వెడలుక్రొం ♦ బెళుకుకన్గవమాపు, లళులమాలికల మే ♦ లటిక మాడ
దివ్యమణిపుత్త్రియో యనఁ ♦ దేజరిల్లి
సుందరస్ఫూర్తిఁ గన్నారఁ ♦ జూచువార

తానవంగ లసన్మంగ ♦ శాంగిరైన
యానలినగంధిఁ గాంచె హే ♦ మాంబరుండు                    భద్రా ద్వి 5 ప.

"ఉ. కాంచి వణిజాంగనాహృదయ ♦ గౌరవచౌర్యధురీణ వాకటా
క్షాంచలపాళి బాళిఁబడి ♦ యాశుకలోకశిఖామణిన్ విమ
ర్శించి యపూర్వవిస్మయవి ♦ శేషము చిత్తమునందు సంభ్రమో
దంచితమై పెనంగ హరి ♦ దానివిలాసము నెంచి యిట్లనున్" ముకుం.ద్వి.

☞ ఈపద్యమున "బాళిఁబడి యాశుకలోకశిఖామణిన్" అనునది "హాళిమెయి నవ్వికచాంబుజలోచనన్" అనిమాత్రము మార్పఁబడి తక్కినదెల్లఁ గైకొనఁబడినది

(ఈభాగమునందిట్లచ్చటచ్చట మార్పఁబడినపద్యములు కొన్ని యింకను గలవు.)

భద్రావృత్తాంతమున:—(కేకయరాజునకు లక్ష్మీదేవి సాక్షాత్కరించి సంతానము కలుగునట్లు వరమిచ్చినతరువాత)

"క. శ్రీవిభునిదేవిదయ వసు, దేవుసోదరి స్వప్నా ♦ దేవి దగియె గ
ర్భావేశవశత శశి, ర్భావేశత నెసఁగునుదయ ♦ యగుదిశ యనఁగన్"
ముకుం. ద్వి.

☞ ఇందు "శ్రీవిభునిదేవి", "ఆవనజాలయ" గను, "తగియె" "వెలసెఁ" గను, "ఉదయ" "పూర్వ" గను మాత్రము మార్పఁబడియె. భ. ద్వి. 24

గీ ఆసుమారుని సంతర్ద ♦ నాఖ్యఁ జేసి, యారమాంశను గన్నదు ♦ మారికఁను
భద్రగుణలక్షణములుచూ ♦ పట్టుకతన, భద్రయనునామ మొసఁగె భూ ♦ పాలమౌళి.
ముకుందవిలాసము. ద్వి.

☞ ఈపద్య మొక్కయక్షరమునైన భేదము గనఁకుండఁ గైకొనఁబడినది. భద్రా. ద్వి. 30.

ముకుందవిలాసమునఁ జిలుక కృష్ణునితో నిట్లు పలికెను.

"గీ. ఏను దిర్యక్కులీన, వి ♦ ద్యానిరూఢ। నగుట శుద్ధాంతమునఁ జేఁగి ♦ సహ్యమనుచు

సకలవిద్యాప్రౌఢగాఁ ♦ జెలువుమనుచు । నప్పుడఁతితండ్రి తనయ నా ♦ కప్పగింప.

శా. తూచా తప్పక యుండ నేర్పితిని హిం ♦ దోళాదిరాగావళీ
వైచిత్ర్యంబును నాట్యకౌశలముఁ గా ♦ వ్యప్రౌఢియుక్ నాటక
ప్రాచుర్యంబు నలంకృతిప్రతిభ శ ♦ బ్దజ్ఞానముక్ దర్క వి
ద్యాచాతుర్యము సత్కవిత్వరచనా ♦ ధౌరంధరీరేఖయుక్" ముకుం. ద్వితీ.

భద్రాపరిణయమున యోగిని యిట్లు పలికెను. (భద్రా.ద్వితీ 36పద్య.)

“ఏను యోగిని నఖిలవి ♦ ద్యానిరూఢ, నగుట శుద్ధాంతగమనయో ♦ గ్య యని తలఁచి,
నిఖిలవిద్యావిశేషముల్ ♦ నేర్పు మనుచు, నప్పుడఁతితండ్రి కొమరి నా ♦ కొప్పగింప.

“శా. సారంబేర్పడఁ జెప్పితిన్ సరసమౌ ♦ సంగీతనృత్యక్రియా
పారీణత్వము, కావ్యనాటకకళా ♦ ప్రాగల్భ్య మందావలం
కారప్రౌఢియు శబ్దశాస్త్రమును ద ♦ ర్కంబుం గుణోదారశృం
గారస్ఫారరసప్రబంధరచనా ♦ ఖండైకచాతుర్యముక్" భద్రా ద్వి. 78

“క. ఆటలఁ బాటల సొగసుం, దేటల రూపనిధివమునఁ ♦ ద్రిభువనములలో
బోటులలోపల నిచెలి, బోఁటులు లే రనుచు దోఁచెఁ ♦ బురుషవరేణ్యా!"
ముకుంద ద్వితీ.

“క. ఆటలఁ బాటల మాటలఁ, దేటల రూపనిధివమునఁ ♦ ద్రిభువనములలో
బోటులలో నీకు నిచెలి, బోఁటులు లే రనుమఁ దోఁచెఁ ♦ బురుషవరేణ్యా!"
భద్రా ద్వి. 41

ఇట్లే యచ్చటచ్చట ననేకములు గన్పట్టుచున్నవి వానినెల్ల వివరించినచో నియ్యుపోద్ఘాతము మూలగ్రంథముకంటె నెక్కుడగునన్నభీతితో ముఖ్యము లగుపద్యముల నొండురెంటినిమాత్ర ముదాహరించి యీవిషయమును విరమించుచున్నాను. (భద్రాకన్యావర్ణనము)

“మ. గతి మత్తేభము, నాస చంపక, మొగిం ♦ గైశ్యంబు కందంబు, సం
గతవాక్యంబులు మత్తకోకిలలు, దృ ♦ క్పాండిత్య మయ్యుత్పల
ద్యుతి, మోమంబురుహంబు, దేహరుచి వి ♦ ద్యున్మాలగా మానినీ
తతవృత్తస్థితు లెన్నఁగాఁ దనమె త ♦ ద్వాగ్జాలకైతం దగన్." ముకుంద.ప్రథ

(సరసమైన) ఈపద్యమే 'దృక్పాండిత్య' మనుచోట 'దృగ్వ్యాపార' మనియుఁ, 'దగన్', 'ధరన్' అనియుఁమార్పఁబడి తెక్కనదెల్లఁ

గైకొనఁబడియె. భ. ద్వి. 113

"ఒకయేటఁ జిక్కె మీన, మొక్కనెలకే చిక్కెఁ బద్మ ♦ మొకపగటికె తా
వికలతఁ జిక్కెను గుముదము, సకియానసమంబు లగునె ♦ జడగతులెప్పుడున్."

ముకుందవిలాసము.

"గీ. ఉవిదనేత్రసామ్య ♦ మొందఁగాఁగడఁగిమీ, నొక్కయేటఁజిక్కె ♦ నొక్కనెలకె
పద్మమోడె నొక్క ♦ పగటికెచెడెఁ గల్వ, సఫలవగునెకోర్కె ♦ జడగతులకు"

భద్ర ద్వి. 107 ప.

"గీ. కుంభకుచ, మీన ♦ లోచన, గోనితంబ। యబ్జధామాస్య, హరిమధ్య ♦ యళిశిరోజ
చాపసుభ్రూయుగళ, నక్ర ♦ జంఘ, యతుల। కన్య, సరసక్రియలరాశి ♦ గాదెజగతి"

ముకుం ప్రి.

ఈపద్యమే భద్రాపరిణయమున (ద్వి. 112 ప.) నున్నది. ఇందు 'జగతి' యనునది 'తలఁప' అని మార్పఁబడినది. 'జగతి' యనుట యే సరసము. (ఇట్లు గ్రంథముకడవఱకు నచ్చటచ్చట నున్నవి)

ఈరీతి నిమ్మహాకవి పెద్దనసోమయాజియందుఁ గలయపారగౌరవమున నాతనిగ్రంథములోనిపద్యములనేకములను దీసికొని తనగ్రంథమునఁ జేర్చికొనియున్నాఁడు ఇంతమాత్రమున మన మీతనియందు గ్రంథచౌర్య మారోపింపరాదు. ఇక్కవియు మిక్కిలిసమర్థుఁడు గాని యల్పుఁడు గాఁడు అశేషపాండితీవిలసితుండును, బహుశాస్త్రపారంగితుండును, ననేకవిద్యాధురంధరుండును, నసాధారణశేముషీయుతుండును నగుగణపవరపువేంకటకవివర్యుఁడు తనప్రబంధరాజవేంకటేశ్వరవిజయవిలాసమునఁ బెక్కుస్థలంబుల భట్టుమూర్తినరసభూపాలీయములోనిపద్యములనేకముల నాతనియందలిగౌరవముచేఁ దీసికొనియుండలేదా? కాళిదాసువంటివాఁడు శ్రీమద్రామాయణమునుండి కొన్నిభావములను, శ్లోకమును గ్రహింపలేదా? వెదకినచో నిట్లనేకులు కవులు పరులభావాదులను గ్రహించినవారు సమస్తభాషాగ్రంథకర్తలందును దొరకుదు. (శ్లేషయమకచక్రవర్తి యగు వేంకటాధ్వరిమహాకవి నైషధ

భారతచంపువులనుండి యనేకభావములను గ్రహించి తనగ్రంథములలోఁ జేర్చుకొన్నాఁడు) కావున నిక్కవిచంద్రునియందుఁ గళంక మున్నట్లూహింపవలదు

(☞ పెద్దనసోమయాజి క్రీస్తుశకము 1700 సంవత్సరప్రాంతమువాఁడై, యిక్కవికంటె 150 యేండ్లు ముందున్నాఁడు గావున నీతనిపొత్తమును జూచి యాతఁడు వ్రాసెనేమో యని యనుకొనుట పొసఁగదు.)

ఈభద్రాపరిణయమున నిక్కవి వసుచరిత్రాదిప్రబంధములయందలి శ్లేషయమకధ్వన్యాద్యలంకారములు గలపద్యములతోఁ దులఁదూఁగఁగలిగినపద్యముల ననేకములను జెప్పియున్నాఁడు. ఆవిషయము లెల్లనీగ్రంథముం బఠించుమీకు విశదమగును గావున నిట వ్రాయలేదు.

ఈతనియితరగ్రంథములయందుసయిత మితరులపద్యములం బోలినపద్యములు కొన్నిచోట్లఁగన్పట్టుచున్నవి. అందొక్కటి యిచ్చటఁ జూపెదను. (శేషధర్మములు.)

"సీ. దండం బఖండమా♦ర్తండమండలవిభా, మండితాఖండపి♦చండ నీకు
వందనం బజశతా♦నందసంక్రందన, వందితచరణార♦వింద నీకు
జోహారు దానవ♦వ్యూహదర్పమహాచె, ప్రావారిసాహసో♦త్సాహ నీకు
&c. &c చతుర్థాశ్వాసము.

"సీ. దండంబుశార్ఙ్గకో♦దండోగ్రకాండ, పరికాండఖండితదైత్య♦కాండ నీకు
జోహారుమదగజ♦ద్రోహగ్రహోవహ, గ్రాహచ్ఛిదాహవో♦త్సాహ నీకు
వందనం బరవింద♦మందిరామందిర, త్సుందరోరస్స్థలా♦లింద నీకు
&c. &c. కంకటివారియుత్తరరామాయణము. ప్రథ. 322 ప.

మనోహరము లని తోఁచినయట్టిపద్యములవంటిపద్యముల రచించుకొనుట కవులకు స్వభావమే. చూడుఁడు! కంకంటివారియీపద్యమునే చూచి యోగిరాలజగన్నాథకవివర్యుఁడు,

సీ. వందన మిందిరా♦సుందరీహృదయార, విందమధ్యచరన్మి♦ళింద నీకు
దండము భుజగజ♦శుండామృణాళత్రి, చండరక్షోగళ♦కాండ నీకు
జోహారు నైగమ♦వ్యాహారవాకము, క్ష్మాహారహారిణీ♦తరల నీకు
&c &c.

అని తనసుమనోమనోభిరంజనము (ద్వితీయోల్లాసము) నందుఁ జెప్పియున్నాఁడు. ఈమూఁడుపద్యములయందలిభేదమును జదువరు లారయఁగలరు. (జగన్నాధకవియు, సుబ్రహ్మణ్యకవియు సమకాలికులు.)

ఛందోవ్యాకరణాదులు.

ఇప్పటివారివలెఁ బూర్వకాలపువారికి సలక్షణము లైనయాయాగ్రంథములలోనిసుప్రయోగము లివి యనియు, లేఖకప్రమాదిజనితదోషము లివి యనియుఁ దెలిసికొనుటకును, దగినరీతిని వాదప్రతివాదములు సలిపి వానిం బరిష్కరించుకొనుటకును, నెద్దియో యొకటి నిర్ధారణముచేసికొనుటకును ననువగుసాధనసామగ్రిలు, అనఁగా, విద్యావిషయములు గలపత్త్రికలు, వానిరాకపోకలకు మార్గములు ముద్రణాదికార్యములు మొదలగునవి యాయాకాలములయందు లేకపోవుటచేతను, అప్పటిలేఖకులు తమయిచ్చవచ్చినరీతిని వ్రాసియిచ్చినతాటియాకులగ్రంథములే వారికి శరణము లై యుండుటచేతను, ఒక్కొకప్రబంధమున కొకొక్కప్రతికంటె నెక్కుడు (భిన్న) ప్రతులు దొరకుట యప్పుడు కష్టముగా నుండుటచేతను, నింకను ననేకవిధము లగుకారణములచేతను బూర్వమధ్యాధునికకవులలో ననేకులగ్రంథములయందు లక్షణవిరుద్ధము లైనప్రయోగములు కొన్ని కాన్పించుచున్నవి. ఒక్కొక్కపుస్తకమునకు ననేకభిన్నప్రతులను దెప్పించి, వానిలోనిసారాంశముల నెల్ల సావకాశముగఁ బరిశీలించి తమతమజీవయాత్ర లన్నియు విద్యావ్యవసాయమునందే కడపి వానిలోనితప్పొప్పుల నెల్ల నిర్ణయించి విశేషాయాసము నొందినవిద్వత్కవులు, అట్టివారితో మైత్రి నెఱపుచు వచ్చిన

సుకవులు మొదలగువారుమాత్రమే తమతమగ్రంథములను సలక్షణముగా రచియింపశక్తిగలవారైరి. ఇతరు లనఁగా, (విశేషపాండిత్యము గలవారే యైనను) నితరవ్యాపారములచేఁ బూర్వగ్రంథములఁ జక్కగఁ బరిశీలింప వలనుపడనివారు, లేఖకులు వ్రాసియిచ్చినగ్రంథములయందలిపాఠపాటులను మహాకవిప్రయోగములుగా నెంచి గ్రహించుచువచ్చిరి. ఈహేతువుచేతనే బమ్మెరపోతన, పిల్లలమఱ్ఱిపినవీరన్న, ప్రౌఢకవిమల్లన మొదలగుపూర్వకవులగ్రంథములయందును, కృష్ణరాయలు, ధూర్జటి, చేమకూరవేంకటపతి మొదలగుమధ్యకవులపుస్తకములయందును, కాకమానిమూర్తి, గణపవరపువేంకటకవి, కంకంటిపాపరాజు మొదలగునాధునికకవులకోశములందును, లక్షణవిరుద్ధములైనప్రయోగములు గానంబడుచున్నవి. ఇంతమాత్రమున నాయాకవిచంద్రులయందుఁ గళంకమున్నదని మనమెంచుట న్యాయము కాదు. అప్పటివారి కవి సుప్రయోగములుగానే తోఁచియుండును. వారు వారు సలక్షణములుగా వ్రాసినప్రయోగములు కొన్నియున్నను నవి కాలక్రమమున లేఖకుల దోషమునఁ దప్పులుగాఁ బడియున్న నుండవచ్చును. అందుఁ గొండఱు స్వాతంత్ర్యమునఁ బ్రయోగించినవియుఁ గొన్నియుండును.

ఈసుబ్రహ్మణ్యకవి మొన్నమొన్నటివాఁ డగుటచేఁ గొన్నికొన్ని విద్యావిషయికము లగుపత్రికలలోనివాదోపవాదములు, గొప్పపండితులచేఁ బరిష్కరింపఁబడి ముద్రితములై యుండుగ్రంథములపాఠములు మొదలగువానిని బాగుగఁ బరిశీలించి తప్పొప్పులను జాలవఱకు గ్రహించియున్నవాఁ డగుటచే నీతనిగ్రంథమునందు లక్షణవిరుద్ధప్రయోగము లంతఁగా గానంబడవు. పూర్వులలో ననేకులగ్రంథములయందుం బోలె నీతనిపాత్రములయందు, క్త్వార్థకేకారసంధులు, దుష్టసమాసము

లు, చేతుఁ౯, కోతుఁ౯, వంచుక, పట్టుక, తిట్టక౯, కొట్టక౯ ఇత్యా ద్యపశబ్దగ్రహణములు మొదలగువ్యాకరణదోషములును, అప్రశస్తయతిప్రాసములు మొదలగుఛందోదోషములును లేనే లేవని చెప్పవచ్చును ఈతఁడు శ్రీమాం౯, మాడభూషి వేంకటాచార్య కవికృతమైన భరతాభ్యుదయమునందలి దోషములంగూర్చి 'రాజయోగి' యనుపత్త్రికలో నొకవిమర్శనమును వ్రాసియున్నాఁడు. అందలికొన్నియాక్షేపములు మిక్కిలి సమంజసములై, యుక్తయుక్తములై యీతనిలక్షణవేత్తృత్వమును వెల్లడించుచున్నవి అయిన నిక్కవి స్థూలదృష్టిచేతనో, లేక తనకు సమ్మతములగుటచేతనో, కాక, యట్లుండవచ్చు ననుతలంపుచేతనో కొన్నియల్పదోషములకుమాత్రము తనగ్రంథములయం దెడమిచ్చియున్నాఁడు వానిలోఁ గొన్నిటి నిచ్చటఁ జూపుచున్నాను

(వ్యాకరణవిషయమున)

(1) సీ పా. తలిరుటాకులజొంప ♦ ములు దావశిఖలంచు
నెంచి యందులఁ బ్రవే ♦ శించఁజూచు తృ 52

ఇందుఁ 'బ్రవేశింప౯' అనుటకుఁ "బ్రవేశించ౯" అని ప్రయోగింపఁబడినది.

(2) మ. తమ మేనత్తను నత్తటి౯ తృ. 34

ఇం దింకొకద్రుత మనవసరము.

(3) అలఘుసువేణియు౯......గంగని, ప 2.

"గంగయని" యనుటకు "గంగని" యని ప్రయోగించినాఁడు.

(4) మఱియు "పనేమి" ఇత్యాదు లచ్చటచ్చటఁ గలవు.

శ్లేషను సమర్థించుపట్టున వసుచరిత్రాదులయందుంబోలె నీతని గ్రంథములయందును దోషములు గన్పట్టుచున్నవి. అందొకదానిని మాత్రము జూపెదను.

సీ. పా. తిలకింపు మెలతామ ♦ రలదండ లొనఁగుము,
నెనరొప్పఁగావల ♦ సిననుగొనుము ప్రథ 115 ఎ.

ఇందు వలచి యనుటకు వలసి యని ప్రయోగించినాఁడు.

ఛందమున.

(1) అఖండయతి —

(a) క ఆ . . . . . . . గా। మారులు దానమునరవికు ♦ మారు లరయగాన్ ప్ర 61

(b) శా . . . . . . . . . . .

క్రి ష్ణవుంబలెఁ బుగం ♦ ధ్రిలోక రత్నంబులన్ పి 83

(2) రేఫద్వయమైత్రి.—

క తటిదాంగ . . . జేష్ఠులఁ। దాఁగెడు &c త్ర 55

చ తుటాషడ్ పదా . . . . ని । బ్రగవు &c. చ 61

ఇం . . గవి నాలుగును గురురేఫములుగనె వ్రాసియున్నాఁడు. కాని " . . . ము " అనునది శకటరేఫము కాదు (నిర్భరశబ్దభవము.)

" సీ పా . . . దేవగయుఁ దా ♦ మరి కప్పగంబు చి,

త్తరువు నిబ్బరము పం ♦ దురుఁడు నిదుర "

మొదలగునవి లఘురేఫము లని ద్విరేఫవర్ణదర్పణము.

" హరిచూచి ని। బ్బగముగ..." హరివంశ పూర్వ వతు

అఖండయతులకుఁగాని రేఫద్వయమైత్రికిఁగాని యిక్కవి యొప్పనివాఁ డని యీతనిగ్రంథము లన్నియుఁ జాటుచున్నవి. ఇవి స్థూల దృష్టిని బడియుండు నని తోఁచుచున్నది

(3) ప్రమాదము :—

(a) సీ పా అళులమాలికల మే ♦ నటికమాడ &c ద్వి. 5

ఇందు యతి ప్రమాదపతితము. 'టికము' గాని 'అటికము' గాదు.

(b) క. సల్లకీపల్లవములకు . ప్ర 135

ఇది " సల్లకిపల్లవములకును " అని యుండనగును.

" ప్రబంధము నా జలరాశి దానిలో, పల నెరసుల్ గణింతురె యపారము లౌమ్యములెల్ల నుండఁగాక్ " అనుచ ట్లిట్టిస్వల్పదోషముల నొకలెక్కలోనికిఁ దీసికొనిరాఁగూడదు. మధ్యాధునికకవులగ్రంథములలో ననేకులగ్రంథములకంటె నీతనిగ్రంథము లనేకవిధముల నిర్దుష్ట

ములుగాఁ గన్పట్టుచున్నవి.

పాఠభేదాదులు

ఈగ్రంథమునందుఁ బ్రథమాశ్వాసములోనికవిస్తుతి.

గీ. భారతంబు నంధ్రభాషగ నొనరించి, వినుతిఁ గన్నసత్కవిత్రయమును
బెద్దనార్యు సోము భీముని శ్రీనాథు, శంభుదాసు మదిని సంస్మరింతు ప్ర. 10

దీనికి వ్యాఖ్యాతగారివిమర్శనము మిగులస్తవనీయమై యున్నది. ఇందు శంభుదాసుఁ డనుపదము శ్రీనాథునకు విశేషణముగాఁ జూపి తన్నాక్షేపించువారిని ధిక్కరించునభిప్రాయముతోఁ గవి దీనిని వ్రాసి యుండును అంతియకాని మిక్కిలిసూరాధునికుఁడైనయీతఁడు శంభుదాసుఁ డనునది యెఱ్ఱాప్రెగ్గడకు బిరుదనామ మని యెఱఁగియుండక పోఁడు. అయిన నిట్టిసందేహమున కెడమీయ నేల యని కాఁబోలుఁ గవియే మఱల నింకొకప్రతిలో "సూరకవిని మదిని స్తుతియొనర్తు" నని సవరించికొనియున్నాఁడు. కావునఁ బాఠకులు తమయిచ్ఛవచ్చిన పాఠమును గ్రహింపవచ్చును

(2) భద్రాదేవిశ్రీకృష్ణునిఁబ్రథమమునఁ గాంచినప్పు డామెకు

ఉ కోరికలూరు, నెమ్మొయిన గుర్పొడుచున్, గడకంటఁ దారకల్
సేరి పరిభ్రమించు, నునుఁ జెక్కులఁ జెమ్మట గ్రమ్ము, నెమ్మెను
య్యారపుఁజూపు లజ్జబెర యం (గను జక్కగ మోదుప్పొందుచున్)
సారెకు వెల్వడుం దొడరి శౌరిని జూచునెడం బడంతికిన్ తృ 13

ఇందు మూఁడవపాదమునఁ గుండలీకరణము చేయఁబడినభాగము పలుప్రతులలోఁ గొఱవడి యున్నది కావుననే పైరీతిని బూరింపబడినది. అయినను గవియే వ్రాసినప్రతిప్రతి నొకదానిని సంపాదించి చూడఁగా నందు,

"మగుడున్, వలపూని క్రమ్మఱన్"

అనియున్నది. కావున నిట్లే చదువుకొనవలయును.

ఈగ్రంథము ప్రథమాశ్వాసమున 133 వపద్యమునందు

"గీ. తరణికిరణోష్మఁ గరఁగి &c" అనియున్నది

దీనివ్యాఖ్యానములో "నూష్మశబ్దమునకు ముపర్ణలోపముచింత"

మని వ్రాయఁబడియున్నది. ము వర్ణలోపము గలుగున ట్లీక్రిందిప్రయోగములు కన్పట్టుచున్నవి. కాని వ్యాకరణసూత్రాధారము కాన్పింపదు.

మ స్వనిదాఘాగ్రనిదాఘువైఖరిని యూ◆ష్మ న్మల్లికల్ &c. ఆముక్త ద్వి 58

మ. ఇనరశ్ముల్ తృషవార్ధిఁ జేరి జలమొ◆క్కింతాన వాత్స్యోష్టక్ &c. ఆము చ 87

ఈగ్రంథము చతుర్థాశ్వాసము 10 వ పద్యమున,

శుకపికశారికల్ పలుకఁ ◆ జొచ్చె గృహాంతరపంజరంబులన్

అను దానివ్యాఖ్యానమున "గోయిలలం బెంచుట యప్రసిద్ధము" అని వ్రాయఁబడియున్నది దీనికి శృంగారనైషధమునఁ బ్రథమాశ్వాసమునందుఁ "బోషితరాజకీరంబులు కైవారంబులుసేయఁ బ్రోదికోయిలలు మంగళగానం బొనర్ప" అనుప్రయోగము గానంబడుచున్నది, గాని సామాన్యముగ నీపద్ధతి గానరాదు గావున వ్యాఖ్యాతగారియభిప్రాయమే సమంజసమై యున్నట్లు తోఁచుచున్నది

### శబ్దార్థాలంకారాదులు.

పెట్టుంజెట్టువలె నున్న దీనివ్యాఖ్యానమే బాలురకునయితము సుబోధ మగునట్లు సర్వవిషయములను దెలుపుచున్నది గావున దీనింగూర్చి యిచ్చట వ్రాయలేదు. ఏతత్ప్రబంధమునకు వ్యాఖ్యాత,

బ్రహ్మశ్రీ పురాణపండమల్లయ్యశాస్త్రులుగారు.

వీరు పీఠికాపురములోనియున్నతవారశాలయందు నాంధ్రపండితులు. ఇంతకుమున్ను 'అమలాపురము' మున్నగుచోట్ల నుండునున్నత పాఠశాలలలోఁ బండితులుగా నుండి పిమ్మట నిచ్చటికి వచ్చిరి వీరు సంస్కృతాంధ్రభాషలు రెంటియందును బరిపూర్ణపాండిత్యము గలవారు మఱియు వేదాంతాదిశాస్త్రములయందును వీరికి విశేషపరిచయము గలదు. ఏవిషయమునుగూర్చియైనను వీరు ప్రసంగించుచున్నపుడు వినువారికి, 'సద్యస్ఫురణ' మనునది వీరికి బాల్యముననే వెన్నతోఁ బెట్టఁబడినదిగాఁ దోఁపకమానదు వీరివలె నుభయభాషలయందును నికరమైనపాండిత్యము గలవారు మనయాంధ్రులలో నెందఱో కానరారు. వీరు మాసంస్థానప్రభువులయాదేశమున ననుసరించి యనేకాంధ్రప్రబంధ

ములకు వ్యాఖ్యానములు రచించుచున్నారు. అందుఁ బ్రభావతీప్రద్యుమ్నము సటీకము ముద్రింపఁబడుచున్నది. శృంగారనైషధవ్యాఖ్యానమిప్పుడు వ్రాయఁబడుచున్నది. ఇఁకను 'ఉత్తరహరివంశము' మొదలగు నుద్గ్రంథములకుఁ డీకఁ వ్రాయుదురు. ఏతత్ప్రబంధవ్యాఖ్యానమును బట్టియే వీరి పాండిత్యాతిశయము మీకుఁ దెలియఁగలదు. ఇందలి యుభయభాషాకందము, విలోమప్రసగ్విణీవృత్తము మొదలగువానికి నర్థము వ్రాయుట యెట్టికష్టమో చదువరు లూహింతురుగాక! మఱియు నిందలి
" గోనిభవార్యాశ్రయమై, . ." ప్ర 90
అనుపద్యమునకును, శ్లేషయమకధ్వన్యాద్యలంకారములతోఁ గూడిన యనేకపద్యములకును వీరు వ్రాసినవ్యాఖ్యానము బాలురకు సహితము సుబోధమై, హృదయంగమమై వీరిసర్వతోముఖపాండిత్యమును వెల్లడించుచున్నది. ఆంధ్రకవులలో ననేకులనాఁటినుండి వచ్చుచున్న యొకపొరపాటునుగూర్చి వీరు ప్రథమాశ్వాసములోని 120 పద్యము యొక్క వ్యాఖ్యానములో వ్రాసియున్నారు. అది సలక్షణమై, యుక్తియుక్తమై యాంధ్రకవులెల్లరును ననుసరింపఁదగినదియై, సత్యమై యున్నది. వీరు వ్రాసినవ్యాఖ్యానములను బఠించువారికి ననేకవిషయములు కరతలామలకము లగుననుట యతిశయోక్తి కాదు. వీరు 'ఆరామద్రావిడ' బ్రాహ్మణులు. కవియు నారామద్రావిడబ్రాహ్మణుఁడే. స్వశాఖనుద్భవించిన పండితవరేణ్యుఁడు వ్యాఖ్య వ్రాయుటచే సుబ్రహ్మణ్యకవిపుణ్యము మిగులఁ గొనియాడఁదగినదిగా నున్నది. ఈయనవయస్సు 58 సంవత్సరములు. వీరిజన్మభూమి తణుకుతాలూకా ఖండవిల్లి.

ఏతత్ప్రబంధమును సటీకముగ ముద్రింపించి యాంధ్రలోకమునకు నొసంగిన శ్రీరాజా రావు వేంకటమహీపతిసూర్యరాయప్రభువర్యులకుఁ బరమేశ్వరుఁ డాయురారోగ్యంబులఁ బరిపూర్ణంబుగ నొసంగఁ బ్రార్థించుచు నీయుపోద్ఘాతమును ముగించుచున్నాను.

ఇట్లు విద్వజ్జనవిధేయుఁడు,
న డ కు దు టి వీ ర రా జు.

శ్రీరస్తు.
శుభమస్తు.
అవిఘ్నమస్తు

# భద్రాపరిణయము.

## ప్రథమాశ్వాసము.

శ్రీదివ్యం బగుభర్మహర్మ్యమున గో ♦ ష్ఠిన్ రుక్మిణీసత్యభా
మాదుల్ గొల్వఁ దనీయహారమణిలం ♦ దారూఢిఁ దాఁ దోఁప నా
హ్లాదం బందఁగ గందళత్తై యొసఁగులీ ♦ లం బొల్చె నా నొప్పు ల
క్ష్మీదేవింతి ప్రోచు రాఘుకులజున్ ♦ శ్రీరామరాయాధిపున్॥

### —* వ్యాఖ్యానప్రారంభము. *—

పూజ్యుఁ డగుసుబ్రహ్మణ్యకవీశ్వరుఁడు "కావ్యం యశసే" యనునది మొదలగు నాలంకారికులవచనంబులు ప్రమాణంబులగుటవలనఁ గావ్యం బనేకశ్రేయంబులకు మూలం బనియును "కావ్యాలాపాంశ్చ వర్జయేత్" అను (కావ్యాధ్యయనము మానవలసినది) నిషేధస్మృతికి నసత్కావ్యంబు విషయంబనియు నట్లు కాదేని శ్రవణాదులచే సకలపురుషార్థసాధనంబు లని తలఁచి వ్యాసుఁడు, వాల్మీకి మొదలగువారు రచియించిన భారతాదికావ్యంబులును, వ్యర్థంబు లగు ననియుఁ దెలిసి యుత్తమనాయకఘటితంబును మోక్షోపయోగికథానాయకంబు నగు భద్రాపరిణయం బను ప్రబంధంబు రచియింపఁ బూని చేయఁదలఁచిన గ్రంథంబునకు నిర్విఘ్నంబుగఁ బరిసమాప్తియు సంప్రదాయావిచ్ఛేదంబు ననుఫలంబులకు సాధనం బగటను "ఆశీర్నమస్క్రియావస్తునిర్దేశోవాపితన్ముఖ" మ్మను (దీవనయేని యిష్టదేవతానమస్కారమేని వస్తునిర్దేశమేని కావ్యాది) నాచార్యదండివచనంబునంజేసి యాశీరాదులలో నొక్కటి ప్రబంధముఖలక్షణంబు గావునను శ్రీదివ్యం బగునిత్యాదిపద్యంబులచే నాశీర్వాదరూపం బైనమంగళమును బ్రబంధాదియందు నిబంధించుచున్నాఁడు సంస్కృతభాషాకావ్యము పురుషార్థసాధనం బైన నగుంగాక "దేశభాషాపురాణాని రచితానిచ మానుషైః । శ్రుత్వా

కావ్యేతిహాసాంశ్చ భయ మాప్నోతి మానవ" యను (జనులచే రచియింపఁబడిన దేశభాషాకావ్యపురాణాదుల వినినవాఁడు భయము నొందును) నిషేధంబువలన నాంధ్రకావ్యరచనయందుఁ గవులకు నందలిరసగ్రహణమున సహృదయులకు నెట్లు ప్రవృత్తి గలుగు నని శంకింపవలదు. "యత్ర కుత్రాపి భాషాయాం శ్రూయతే చరితం శుభం। సా భాషా పాపసంహర్త్రీ" (ఏభాషయందైనఁ బుణ్యమైనచరితం బున్న నాభాష పాపముం బోఁగొట్టునది) యని విద్వాంసులు చెప్పుటచేతను నాంధ్రభాషం బ్రథమాచార్యుఁ డని ప్రసిద్ధి వడిసిన నన్నపార్యుఁడు "స్వస్థానవేషభాషాభిమతాః సంతో రసప్రలుబ్ధధియః లోకే బహుమన్యంతే వైకృతకావ్యాని చాన్య దపహాయ" (రసాసక్తు లగుసత్పురుషు లితరదేశభాషాకావ్యముల విడిచి స్వదేశమునందలి వేషభాషలయం దాసక్తి కలవారై వైకృతకావ్యము లాదరింతురు) యనియును "విశ్వశ్రేయః కావ్య" మ్మనియును (కావ్యము కీర్త్యాదిసకలపురుషార్థసాధనంబు) దాను జేసిన వ్యాకరణంబునఁ జెప్పుటయె కాక భారతముం దెనుఁగింపం బూనుటచేతను ద్వితీయాచార్యుఁ డైనయాథర్వణుఁడు వికృతివివేక మనులక్షణగ్రంథమును రచియించుటచేతను లోకములకు మేలుగోరువాల్మీకి దేశభాషలకు లక్షణగ్రంథము రచియించుటచేతను. నిషేధము రసము పుట్టింపని యన్యదేశభాషాకావ్యపరము గాని దేశభాషాకావ్యసామాన్యపరము గాదు ఇం దక్కడక్కడ నగరార్ణవాదివర్ణనంబులు గలుగుట నిది మహాప్రబంధంబ యగు ఈపద్యమునను మొదట లక్ష్మి యధిదేవతగాఁ గలశవర్ణకారములయు నైశ్వర్యము నిచ్చునగ్ని దేవతగాఁ గలరేఫముయొక్కయు సంబంధమున నేర్పడిన శ్రీకారమును భూదేవతాకమై యైశ్వర్యము నిచ్చుమగణమును బ్రయోగించుటచే వర్ణగణశుద్ధి గలదు. "శుభవర్ణా శ్శుభాశ్శబ్దా యేచ శుభగణా స్త ఏవ కావ్యాదౌ గ్రాహ్యా" యనియును, (శుభము లగువర్ణములును శుభముల నిచ్చుశబ్దములును శుభముల నిచ్చుగణములునే కావ్యాదిని బ్రయోగించునది) "వేదముల కెల్ల నోంకార ♦ మాదియైన। కరణిఁ గృతులకు నెల్ల శ్రీ ♦ కారమాది। గానఁ గవివరు లెల్లను ♦ దానిఁ దక్క। నితరవర్ణంబు లిడరు సత్కృతులమొదల" ననియును, "శుభదేవతాత్రయంబును। శుభఖచరత్రయము గలిగి ♦ శుభవాచకమై। యభినుతి గాంచినకతమున। శుభములు శ్రీకారమునను ♦ జొప్పడు టరుదే?" యనియును "మో భూమి స్త్రిగురు శ్శ్రియం వితనుతే" యనియును (భూదేవతాక మైనమగణము కృతినాయకునకు నైశ్వర్య మొసఁగును) వాగనుశాసనాదులు చెప్పుటచేతనును, మహాకవులు పెక్కండ్రు గ్రంథాదియం దీవర్ణము నీగణముం బ్రయోగించుటచేత నీకవియుఁ గృతినాయకునకును గర్తకును శ్రోతలకును శుభదాయక మగువర్ణగణాదుల నుపయోగించెను

శ్రీదివ్య.. మునన్, శ్రీ=శోభచేతను, దివ్యంబగు=మనోహరమైన, ధర్మహర్మ్యమునన్=బంగారుమేడయందున్, (ని) శ్రీర్వైభవరచనాశోభాసంపత్సరళశాఖిషు (నా). గాంగేయంభర్మకర్బురం, హర్మ్యాదిర్ధనినాంవాసః (అ) గోష్ఠిన్=సభయందున్, రుక్మి.. దుల్=రుక్మిణి సత్యభామ మొదలగువారు, కొల్వన్=ఉపచారము చేయుచుండగాన్, తదీయ.. లందున్=వారిసంబంధమైన ముత్యాలదండలయందలి రత్నములందున్, ఆరూఢిన్=స్పష్టముగాన్, తాన్=(కృష్ణుఁడు) తోఁపన్=ప్రతిఫలింపఁగాన్, అందఱకున్=తన్ను సేవించురుక్మిణి మొదలగుభార్య లెల్లరకును, అందఱై=అన్నియాకారములు ధరించి, ఆహ్లాదంబు=సంతోషమును, ఒసఁగులీలన్=ఇచ్చెడువిలాసముతో, పొల్చినాన్=ప్రత్యక్ష మయ్యెనో యనునట్లు, ఒప్పు—పతి=ప్రకాశించెడుకృష్ణుఁడు, రావుకులజున్= రావువారివంశమున జన్మించిన, శ్రీరామరాయాధిపున్ = శ్రీమంతుఁ డైనరామరాయప్రభువును, ప్రోచుతన్ = రక్షించుఁగాక. (హితము చేసి యహితముల నివారించుట రక్షణము)

మిగుల సుందరమైనబంగారుమేడలోనిసభయందు భార్య లూడిగములు చేయుచుండఁగా వారిహారమణులందుఁ బ్రతిఫలించుటచె వారిసంతోషమునిమిత్త మందఱకు నన్నియాకారములు ధరించి ప్రత్యక్షమయ్యెనో యనునట్లు ప్రకాశించుకృష్ణుఁడు శ్రీశబ్దార్థము లగుసంపదాదులు గలరామరాయప్రభువునకుఁ గీడుఁ దొలఁగించి మేలు చేకూర్చుఁగాక యని తాత్పర్యము

ఇందు లక్ష్మీదేవిపతి యనువిశేష్యము సంపద లిచ్చి రక్షించుటకుఁ దగినసామర్థ్యము గల దను తాత్పర్యమును బోధించుఁ గానఁ బరికరాంకురమును బెక్కండ్రకుం బెక్కురూపములు దరించి ప్రత్యక్షము గాకున్న నట్లుత్ప్రేక్షించుటచె నుత్ప్రేక్షయు నలంకారములు

చ॥ అల ఘనవేణియుక్ శుభక ♦ రాంచితకంకణనిక్వణోర్మికా
వళులు పయోధరస్థలుల ♦ వర్తిలుహారమౌక్తికరాజియుక్ రసా
కలితమరాళయాన మెసఁ ♦ గం గని గం గని గౌరిఁ గౌఁగిటన్
నిలుపుశివుండు సర్వధర ♦ ణీవిభుఁ జేయుత రామరాయనిన్॥ 2.

ఈపద్యమున నీశ్వరుఁడు ధర్మసామ్యముచే గంగాపార్వతులకు భేదము నెఱుఁగక పార్వతిని గంగయను భ్రాంతిచే నాలింగనము చేసికొనినట్లు చెప్పుటచే రెండర్థములుగలవు

అలఘునవేణియుక్ = అల = ప్రసిద్ధమైన, ఘన = గొప్పది యగు, వేణియుక్ = ప్రవాహమును, శుభ — వళులు — శుభకర = (దర్శనస్పర్శనములచే) మేలుచేయునవియు, అంచిత = పూజింపఁబడుచున్నవియును (పావనమైనవనియర్థము) అగు, కంకణ = నీటితుంపరలయొక్క, నిక్వణ = ధ్వనితోఁ గూడిన, ఊర్మికావళులు = తరంగసముదాయములును; పయోధరస్థలులన్ = నీటియడుగుప్రదేశములందున్, వర్తిలుమౌక్తికరాజియున్ = ఉండెడుముత్తియములసముదాయమును, (నదులందును ముత్తెములుపుట్టునని వసుచరిత్రాదులందుఁ బ్రసిద్ధము.) రసాక — నముక్ — రస = జలమునందు, ఆకలిత = వ్యాప్తమైన, మరాళయానముక్ = హంసలయొక్కనడకయును, (ని) శృంగారాదౌ విషేవీర్యేగుణేరాగేద్రవేరసః (అ) ఎసఁగన్ = ప్రకాశింపఁగాన్, (ఇవి గంగయందుఁ గలధర్మములు) అలఘునవేణియుక్ = అల = ప్రసిద్ధమైన, ఘన = మేఘమునుంబోలిన, వేణి = జడయును, (దీర్ఘమైనజడ యనియేనియర్థము) శుభ — వళులు — శుభ = దీప్తమైన, కర = హస్తమునందు, అంచిత = ప్రకాశించుచున్న, కంకణ = కడియములయొక్క, నిక్వణ = ధ్వనియును, ఊర్మికా = ఉంగరములయొక్క, ఆవళులు = సమూహములును, పయోధరస్థలులన్ = కుచములప్రదేశములందున్, వర్తిలుమౌక్తికరాజియున్ = ఉండెడుముత్తియములహారములును, రసాక — నముక్ = సింగారముతోఁ గూడినయంచనడలను బోలిననడలును, ఎసఁగన్ = ప్రకాశింపఁగాన్ (ఇవి గౌరియందలిధర్మములు) గౌరిన్ = పార్వతిని, కని = చూచి, గంగని = గంగ యని భ్రాంతి పొంగి, కౌఁగిఁటన్ = భుజాంతరమునందున్, ఇలుపుశివుఁడు = ధరింపుమంగళప్రదుఁ డగుదేవుఁడు, రామరాయనికిన్ = రామరాయనికి, సర్వధరణీవిభున్ = ఎల్లభూమికి నధిపతిని, చేయుతన్ = చేయును గాక

గంగయందలిప్రేమచే నామె నాలింగనము చేయఁ గోరి దైవవశమున నప్పుడు సన్నిహితయైన గౌరిం జూచి గంగాధర్మము లామెయందు నుండుటచే నామెయే గంగ యని భ్రమపడి శివుఁ డామెను గౌఁగలించె ననియు నానందముతోఁ గూడినప్పుడితరులు కోరినకోరిక లీయఁ బ్రభువులు వేడుకపడుదురు గావున నట్టిశివుఁడు కృతినాయకునకు భూమండలాధిపత్య మీఁజాలును గాన నిచ్చుఁగాక యనియుం దాత్పర్యము.

ఇందు ఘనవేణి మొదలగుశబ్దము లర్థశ్లేషమహిమచే గంగయందుం బార్వతియందు నుండుధర్మములు బోధించును. ఈయర్థద్వయమునకు సంబంధము లేకున్నను శబ్దసామ్యముచే నభేదనిశ్చయము చేయఁగా భ్రాంతి పొడమెఁ గాన శ్లేషమూలకాతిశయోక్త్యనుప్రాణితభ్రాంతిమదలంకారము. ఇందువె గంగాపార్వతులకు సామ్యము గమ్యము

"గంగని" యనుచో నత్తునకు సంధిబహుళం బనుసూత్రమున బహుళగ్రహణముచే స్త్రీవాచకతత్సమసంబోధనాంతములకు సంధిలే దని యెఱుంగునది యని బాలవ్యాకరణమున నున్నది కాని "గంగనుకాసె" "నెలతిచ్చె" "శ్రీరంగభర్తృంమ" మొదలగుప్రామాణికప్రయోగము లుండుటచేతనను "క్వచి త్సంస్కృతీయస్య ప్రాణ స్యాత్ర చ్యుతి ర్భవేత్త" ని (తెలుగుభావయం దొకానొకచోటఁ దత్సమశబ్దములందలియచ్చునకును సంధి యగును) వికృతివివేకమున నుండుటచేతనును సంధి నిర్దుష్ట మని తెలియవలయును

ఉ॥ రాజకళావతంససుర ♦ రాజముఖ స్తవనీయుఁ డబ్జినీ
రాజనిభ ప్రభుండు ఘన ♦ రాజమరాళరథుండు వాహినీ
రాజగభీరమూర్తి ఖగ ♦ రాజగనాభిభవుండు భారతీ
రాజు చిరాయుఁ జేయుఁ గవి ♦ రాజవిధేయుని రామరాయనిన్॥ 3.

రాజ—నియుఁడు రాజకళావతంస=శివుఁడు (చంద్రకళ శిరోభూషణముగాఁ గలవాఁడు) సురరాజ=ఇంద్రుఁడు (దేవతలకుఁ బ్రభువు) ముఖ=మొదలగువారిచే, స్తవనీయుఁడు=స్తుతింపఁబడఁదగినవాఁడు, అబ్జి—ప్రభుండు—అబ్జినీరాజ=సూర్యునితో, నిభ=సమానమైన, ప్రభుండు=కాంతిగలవాఁడును, (సూర్యునికాంతితోసమానమైనదేహకాంతికలవాఁడు) ఘన—రథుండు ఘన=గొప్పవియగు, రాజహంస=రాయంచలు, రథుండు=వాహనముగాఁ గలవాఁడు, (ని) రాజహంసాస్తు తే చంచుచరణై ర్లోహితై స్సితాః॥ (అ) వాహినీ—మూర్తి. వాహినీరాజ=సముద్రునియొక్క, గభీరమూర్తి=గంభీరమైనయాకారముఁ బోలినయాకారము గలవాఁడు, (హర్షము నమర్షముం దెలియఁజేయువికారములు లేకుండుట గాంభీర్యము.) ఖగరాజగనాభిభవుండు=ఖగరాజగ=విష్ణువుయొక్క (పక్షులకురాజైనగరుడవాహనముగఁ బోవువాఁ డని యర్థము) నాభిభవుండు=బొడ్డుఁదామరఁ జనియించినవాఁడును, భారతీరాజు=బ్రహ్మ, (సరస్వతికిఁబతి) కవిరాజవిధేయునిన్=కవిశ్రేష్ఠులకు విధేయునిన్ (శృంగారాదిరసములు గలశబ్దార్థములం గూర్చి వర్ణించువాఁడు కవి యనంబడు) రామరాయనిన్=రామరాయప్రభువును, చిరాయుఃన్=మిక్కిలి జీవితకాలము కలవానిని, చేయున్=కావించుఁగాక

ఇం దబ్జినీరాజనిభప్రభుం డన్నచో నుపమయు, వాహినీరాజగభీరమూర్తి యన్నచో నిదర్శనయుఁ గలవు

ఉ॥ అబ్జ జగన్ముదావహ నిజాననసుందరతానిరస్తరా
కాబ్జ లసత్ప్రవాళమృదులారుణపాణిధృతప్రఫుల్లలీ
లాబ్జ సువృత్తమంగళగళాధికసౌష్ఠవధిక్కృతావదా
తాబ్జ నటించుఁ గాత మనయంబును మత్కృతినాథు నిమ్ములన్.

జగ—కాబ్జ జగత్ = లోకమునందలిజనుల కెల్లను ముదావహ = సంతసము పుట్టించెడు, నిజ = తనదియగు, ఆనన = ముఖముయొక్క, సుందరతా = అందముచేతను, నిరస్త = తిరస్కరింపఁబడిన, రాకాబ్జ = పున్నమనాఁటిచందురుఁడు గలది ("జయతి హసతీ" త్యాదులు సాదృశ్యవాచకము లని యాచార్యదండి చెప్పుటచే ముఖము చందురుని జయించు చున్నది ద్వేషించు చున్నది. పరిహాసము చేయు చున్నది. తిరస్కరించు చున్నది. మొదలగువాక్యములలో జయించు చున్నది. మొదలగుశబ్దములు చేతనధర్మమును జెప్పునవి గావునను బ్రకృతమున ముఖ మచేతనము గావునను ముఖ్యార్థముం జెప్పక యవి లక్షణచేఁ బోలికం జెప్పును మఱియు నిచట జగచ్ఛబ్దమును జడవాచకము గావున నే చేతనధర్మ మగుమోదము తనకు సంభవింపమిచె లక్షణచేత నే జనులను బోధించును ముఖ్యార్థమున కన్వయబాధ గలుగుటచె దానిసంబంధము గల యన్యార్థమునఁ గల్పింపఁబడిన శబ్దవ్యాపారము లక్షణ యనంబడు.)

లసత్ప్ర—లాబ్జ లసత్ = ప్రకాశించుచున్న, ప్రవాళ = చిగురాకువలె, మృదుల = మెత్తనిదియును. అరుణ = ఎఱ్ఱనిదియు నగు, పాణి = హస్తముచేత, ధృత = పట్టుకొనఁబడిన, ప్రఫుల్ల = వికసించిన, లీలాబ్జ = విలాసార్థమైనపద్మము గలది; సువృ.. తాబ్జ సువృత్త = మిక్కిలి వట్రమైన, మంగళ = ప్రశస్తమైన, గళ = కంఠముయొక్క, అధికసౌష్ఠవ = ఎక్కువచక్కఁదనముచేతను, ధిక్కృత = నిందింపఁబడిన, అవదాతాబ్జ = స్వచ్ఛమైనశంఖము గలదియును (అగు) అబ్జ = లక్ష్మి (నీటఁ బుట్టిన దని యర్థము)

మత్కృ—నిమ్ములన్ = నాకృతికిం బతి యగురామరాయప్రభునిగృహములందున్, (నాథుయొక్క + ఇమ్ములన్ = నాథునిమ్ములన్, షష్ఠీసమాసమం దుకార ఋకారంబుల కచ్చుపరం బగునపుడు నుగాగమం బగు' బాల. సంధి) అనయంబున్ = ఎల్లకాలమును, నటియించుఁగాతన్ = నివసించుఁగాక, (కాతన్ + అనియె = కాతమనియె; ఎదుతల ద్రుతంబున కచ్చుపరం బగునపుడు మకారం బగు బా. (క్రి.) ఇందుపమాలంకారము గలదు

సీ॥ ఏరామ హిమవత్కు ♦ మారి యౌ టెఱిఁగించుఁ
దెల్ల మహానుల్లంపుఁ ♦ జల్లఁదనము
ఏలేమ తెలివేల్పు ♦ నిల్లా లగుటఁ దెల్పుఁ
జిలుఁగువెన్నెల నవ్వు ♦ మొలకనవ్వు
ఏసాధ్వి శ్రితజనా ♦ భీష్టదాయిని యౌటఁ
జాటించుఁ దనుపారి ♦ జాతవల్లి
ఏతన్వి భువనైక ♦ మాత యౌటఁ గరంబు
ప్రకటించు చుండు నం ♦ బాసమాఖ్య
యట్టిసతి సర్వమంగళ ♦ యధికకరుణ
సర్వమంగళసంగతా ♦ ఖర్వసార్వ
భౌమత నొసంగుఁగాత శ్రీ ♦ రామరాయ
భూమితలపతి కతిదయా ♦ పూర్ణమతికి॥ 5.

తెల్లమహా .. దనము = స్పష్టమగు మనసునందలి చల్లఁదనము, ఏరామ = ఏమనోహారిణి యగు పార్వతి, హిమవత్కుమారి యౌట = చలిమలకూఁతు రౌటను, ఎఱిఁగించున్ = తెలియఁజేయునో, (చల్ల + తనము = చల్లఁదనము ఉదంతస్త్రీసమంబులకుం బుంపులను నదంతగుణవాచకంబులకుఁ దనంబుపరం బగునపుడు నుగాగమం బగు. చల్లను + తనము = చల్లఁదనము ద్రుతప్రకృతికమునుండి పరుషమునకు సరళము లగు. ఆదేశసరళమునకు ముం దున్న ద్రుతమునకు బిందుసంశ్లేషంబులు విభాష నగు. ఉల్లము + చల్లఁదనము = ఉల్లంపుఁజల్లఁదనము కర్మధారయంబున మువర్ణకంబునకుం బుంపులగు. సమాసంబుల నుదంతంబు లగు స్త్రీసమంబులకుం బుంపులకుఁ బరుషసరళంబులు పరం బగునపుడు నుగాగమం బగు బాల సం తక్కినది మీఁదటియట్లే) జిలుఁగువెన్నెలన్ = సన్నంపువెన్నెలను, నవ్వుమొలకనవ్వు = పరిహాసించెడుమందహాసము, ఏలేమ = ఏస్త్రీ, తెలివేల్పువిల్లాలు = శివునిభార్య, అగుటన్, తెల్పున్ = తెలియఁజేయునో, తనుపారిజాతవల్లి = శరీరమనెడుపారిజాతపుఁదీఁగ, ఏసాధ్వి = ఏపతివ్రత, స్వాశ్రిత— దాయిని = స్వ = తనయొక్క, (తన్ను నియర్థము) ఆశ్రిత = ఆశ్రయించిన, జన = జనులకు, అభీష్టదాయిని = కోరినపదార్థముల నిచ్చునది యౌటన్, చాటించున్ = తెలియఁజేయునో, (తనుపారిజాతవల్లి యనుచో రూపకసమాసము, ఉపమిత మయ్యెనేని

పూర్వపదము ప్రధానమగుటచేఁ దనుశబ్దమునకుఁ బాణిధాన్యము రాఁగా నభీష్టదాతృ
త్వము సంభవించుట దుర్లభము రూపకమయ్యె నేని యుత్తరపద మైనపారిజాతవల్లి
ప్రధానమగుటచె నభీష్టదానము సులభముగ సంభవించును రూపకాలంకారము )
అంబాసమాఖ్య = అంబ యను పేరు, ఏతన్వి = ఏసన్నతాంగి యగుపార్వతి, భువనైక
మాత = లోకమున కెల్ల నొక్కతెయే తల్లి, ఔటన్, కగంబు = మిక్కిలి, ప్రకటించు
చుండుచున్ = స్పష్టపఱుచు చుండుచో, అట్టిసతి = అటువంటిసతి యని పూర్వజన్మము
నఁ బేరొందిన, సర్వమంగళ = పార్వతి ( ఎల్లశుభముల నిచ్చునది యని యర్థము )
( ఈశ్వరునకుం బత్నియయి దక్షునకుం గూఁతురు నగుసతి యనునామె తండ్రిచేసినయ
వమానమున మృతి నొంది పార్వతియై మఱల జన్మించె నని పౌరాణికులు చెప్పుదురు )
అతిదయాపూర్ణమతికిన్ = అధిక మైనదయతో నిండినచిత్తముగల, శ్రీరామ—పతి
కిన్ = శోభావంతుఁ డైనరామరాయభూనాథునకున్, అధికకరుణన్ = మిగులఁ గనిక
రముతో, సర్వమం—సార్వభౌమత, సర్వమంగళ = అన్ని శుభములతో, సంగత =
కూడుకొనిన, అఖర్వసార్వభౌమతన్ = పూర్ణ మైనభూమండలాధిపత్యమును, ఒసంగుఁ
గాతన్ = ఇచ్చుఁగాక తండ్రింబోలి మిక్కిలి చల్లనియాత్మ గలదియు నెల్లవారలయ
భీష్టంబుల నీఁజాలునదియుఁ దల్లియుంబోలె నెల్లప్రజల రక్షించునదియు నగుపార్వతి
నాకృతి నాయకున కఖండభూమండలాధిపత్య మిచ్చుఁగాక యని తాత్పర్యము

మ॥ తనవీణాక్వణనామృతంబున నిష ♦ క్తంబై నచిత్తప్రవృ
త్తి నిజేశుండు పయోధరభ్రమను ద ♦ త్సీమానటత్తుంబి కే
లను బట్టం గిలిగింత వెట్ట విభులీ ♦ లన్ నవ్వునవ్వల్కుఁ జ
వ్వని గంగాధరరామరాయవిభువా ♦ గ్దేవిచిత్రి నిల్పుం గృపన్॥ 6.

తన. . . .బునన్ = తన = తనయొక్క, వీణాక్వణనామృతంబునన్ = వీణాధ్వని
యనెడునమృతమునందు, నిషక్తంబైన—వృత్తిన్ = నిషక్త = తగులుకొనిన, చిత్తప్రవృ
త్తిన్ = చిత్తవ్యాపారముచేతను ( అమృతసదృశ మైనవీణాధ్వనిశ్రవణమునఁ బరాధీన
మైనమనోవ్యాపారముచే నని యర్థము ) నిజేశుండు = తనభర్త ( బ్రహ్మ ) పయోధర
భ్రమను = స్తనభ్రాంతిచేతను, తత్సీమా—త్తుంబిన్, తత్సీమా = ఆకుచములసమీపస్థల
మందు, నటత్ = కదలుచున్న, తుంబిన్ = వీణెచివర నున్న యానుగపుబుఱ్ఱను
కేలన్ = హస్తముతో, పట్టన్ = ధరింపఁగాన్, గిలిగింత వెట్టి = చక్కిలిగింతచేసి
లీలన్ = విలాసముతో, విభున్ = మగనిని, నవ్వుపల్కుఁ—జవ్వని = పరిహాసించెడుసరస్వతి

గరిగా——వైచిత్రిక్ = గంగాధరనామ రాయప్రభుని యొక్క వాగ్విశేషమునందుఁ, కృపన్ = దయతో, నిల్చున్ = వసించుఁగాక

బ్రహ్మదేవుఁడు శ్రావ్యమైన తన వీణాగానము వినుటచే బరాధీనమైన మనసుగలవాఁడై వీణాగ్రమున నున్న బుట్టను జూచి స్తంభభ్రాంతిచే స్పృశింపఁగా నాయనభ్రమను దెలిసికొని పరిహాసము సేయు సరస్వతి కృతిపాలుని వాక్కునందు వసించి వాక్చమత్కారముఁ గలిగించుఁగాక యని తాత్పర్యము

ఇందు వీణాధ్వనియం దాయత్తమైన మనసు గలుగుటచే భ్రమపడినాఁడని చెప్పుటచేఁ గావ్యలింగానుప్రాణితమైన భ్రాంతిమదలంకారము.

శా. శ్రీలావణ్యసమగ్రతుండమును రజ♦శ్శ్లిష్టోత్తమాంగం బురః
ప్రాలంబోరుభుజంగపుంగవము శుం♦భత్కుంభయుగ్మస్థలీ
ఖేలత్కామగుణంబు నయ్యును విర♦క్తిబ్రహ్మచర్యవ్రత
శ్రీలం గ్రాలుగణేశరూపము మదిం♦జింతింతు నశ్రాంతమున్॥ 7.

శ్రీలావ——తుండము, శ్రీ = ఐశ్వర్యము తోడను, లావణ్య = సౌందర్యము తోడను, సమగ్ర = నిండియున్న, తుండము = ముఖము కలదియు, రజశ్శ్లి——గంబు, రజః = రజోగుణముతో, శ్లిష్ట = కూడిన, ఉత్తమాంగంబు = మనసు కలదియును, (ఉత్తమాంగ మనునది శిరమునకు రూఢిచే శిరస్సని యర్థము గాని సర్వవ్యాపారములకు ముఖ్యమైనది గావున నిట శ్రేష్ఠమైన మనము అను నర్థ మని చెప్పఁబడియె) ధూళితోఁ గూడిన శిరస్సు గలదని యర్థాంతరము (ఏనుఁగలు శిరమున దుమ్ముఁ జల్లుకొనుట లోకప్రసిద్ధము) ఇతఁడును గజముఖుఁడు గావున నిట్లు చెప్పఁబడియె. ఉరః——పుంగవము, ఉరః = వ్యాపకమున, ప్రాలంబ = వ్యాపించిన, భుజంగపుంగవము = విటశ్రేష్ఠులు కలదియును (మనసునం దలఁపఁబడిన విటులు గల దని యర్థము. తొమ్మనఁ జిన్నఁగ వ్రేలుచున్న పాము గలది యని యర్థాంతరము) శుంభ——గుణంబు, శుంభత్ = ప్రకాశించెడు, కుంభయుగ్మస్థలీ = శిరసునందలి కుండలంబోలిన మాంసపిండముల జంటయందు, ఖేలత్ = ప్రకాశించుచున్న, కామగుణంబు = కోర్కె యనుగుణము గలదియు, కామగుణము సూచించు ముఖము గలదని యర్థము (కుంభస్థలమునందుఁ గ్రీడించుచు తుమ్మెదలు గలదని యర్థాంతరము కామగుణము = మన్మథవినోదకారి = తుమ్మెదలు (ని), స్మరాభిలాషయోః కామః నానా మహార్యాశ్రం ద్రవ్యశ్రీశేశుక్లసత్వసంధ్యాదికేగుణః ( అ, అయ్యును = అయినను ( అయినగియు

ననియు నర్థము ) ( ఏనుఁగులకుంభస్థలములందలి మదము పానముచేయుటకై తుమ్మెద లటసంచరించుచుండును ) విరక్తి—శ్రీలన్, విరక్తి = విరాగమువలనఁగలిగిన, బ్రహ్మచర్యవ్రతశ్రీలన్ = బ్రహ్మచర్యవ్రతసంపత్తిచే ( సుఖములయందు దాస మాని వివాహము మానుకొని యుండుటచే నని యర్థము ) క్రాలు——రూపము = ప్రకాశించెడువిఘ్నేశ్వరునాకారమును, మదిన్ = మనసునందున్, అశ్రాంతమున్ = ఎల్లప్పుడును, చింతింతున్ = ధ్యానింతును. ఇందు విరాగమును బ్రహ్మచర్యవ్రతము పూనుటకు విరుద్ధమైనరజోగుణము మొదలగునవి యున్నట్లు మొదటియర్థమునఁ గాన్పింపఁగా రెండవయర్థమున దానిఁ బరిహరించుటచే విరోధాభాసాలంకారము.

క॥ అనవద్యవిద్యు మద్గురు
ఘను నాగాభట్లనరస ♦ కవివరుఁ గవితా
భినవవ్యాసు మదగ్రజు
ననఘయశున్ రామకృష్ణ ♦ యాఖ్యు నుతింతున్॥ 8.

అనవద్యవిద్యున్ = పూజ్యమైనవిద్యగలవానిని, ఘనున్ = గొప్పవానిని, మద్గురున్ = నాయుపాధ్యాయుని, నాగాభట్లనరసకవివరున్, ఘనయశున్ = మంచికీర్తిగల, కవితాభినవవ్యాసున్ = కవిత్వమునం గ్రొత్తవ్యాసుఁ డగునట్టియు, రామకృష్ణయాఖ్యున్ = రామకృష్ణయ్య యను పేరుగలట్టియు, మదగ్రజున్ = నాయన్నను, నుతింతున్ = స్తోత్రము చేయుదును.

శా॥ నీరేజాక్షుసమానుఁడై పరతపో ♦ నిష్ఠాగరిష్ఠాత్మతన్
శ్రీరామాయణకావ్యరూపమునవా ♦ ణీక్షోణికింబోణిమిం
పారందెచ్చినవామలూరుతనయున్ ♦ ద్వైపాయనుంబాణునిం
జోరుంభారవికాళిదాసముఖులన్ ♦ స్తోత్రంబుగావించెదన్॥ 9.

నీరే——సమానుఁడై = విష్ణునితోఁ దుల్యుఁడై, పర—త్మతన్, పర = శ్రేష్ఠమైన, తపః = ఉపవాసము మొదలగువ్రతములందు, నిష్ఠా = నిలుకడచేతను, గరిష్ఠ = మిగులం బూజ్యమైన, ఆత్మతన్ = మనసుగలవాఁ డగుటచేతను, శ్రీరామాయణకావ్యరూపమునన్ = శ్రీరాముని చరితముం జెప్పుటచే రామాయణ మని ప్రసిద్ధిం జెందియున్న కావ్యముయొక్క ఆకారముచేతను, వాణిన్ = సరస్వతిని, పోణిమి = ( వినువారికి ) సౌఖ్యము, ఇంపారన్ = కలుగునట్లు, తెచ్చినవామలూరుతనయున్ = తీసికొనివచ్చిన

వాల్మీకిని ( పుట్టయందుఁ బుట్టినవాఁడు. (ని) వామలూరుశ్చ నాకుశ్చ వల్మీకం పుంనపుంసకం (అ). ఇతఁడు భగవంతుం దలఁచుచుఁ జిరకాల మొకచోఁ గదల కుండె ననియును నపుడు మేనం బుట్టలువోసె ననియుఁ బిమ్మట నందుండి వెడలుటచే నీపేరు గలిగె ననియుఁ జెప్పుదురు.) ద్వైపాయనున్ = వ్యాసునిని, (ద్వీప ముత్పత్తిస్థానముగాఁ గలవాఁ డని యర్థము. పరాశరునివలన యమునానదీద్వీపమున సత్యవతి యనుసామాంతరము గలమత్స్యగంధియం దితఁడు పుట్టె నని భారతము ) బాణునిన్ = (కాదంబర్యాదులను రచియించి మిగులఁ బ్రసిద్ధి గన్న) బాణకవినిని చోరున్ = చోరుఁ డనుకవినిని, భా— —ముఖులన్ = భారవి = ( కిరాతార్జునీయమను గ్రంథమునురచించిన ) భారవి, కాళిదాసముఖులన్ = కాళిదాసుఁడు మొదలగుమహాకవులనుగూర్చి, స్తోత్రింబున్ = స్తుతిని, కావించెదన్ = చేసెదను

గీ॥ భారతంబు నంధ్ర ♦ భాషఁగ నొనరించి
వినుతిఁ గనినసత్క ♦ వి త్రయమును
పెద్దనార్యు సోము ♦ భీముని శ్రీనాథు
శంభుదాసు మదిని ♦ సంస్మరింతు॥ 10.

భారతంబున్ = సంస్కృతమున వేదవ్యాసుఁడు రచియించినభారతాఖ్యానమును, ఆంధ్రభాషఁగన్ = తెలుఁగుభాషాకావ్యముగాన్, ఒనరించి = రచియించి, వినుతిన్ = స్తుతిని, కనిన—మున్, కనిన = పొందిన, సత్కవిత్రయమును = సత్ = శ్రేష్ఠులగు, కవి = కవులయొక్క, త్రయమును = ముగ్గురయొక్కసమూహమును (నన్నయభట్టారకునిని తిక్కనసోమయాజినిని నెఱ్ఱాప్రెగ్గడ నని యర్థము ) పెద్దనార్యునిన్ = (మనుచరిత్రకర్త యైన) పెద్దనను, సోమున్ = (ఉత్తరహరివంశము రచియించిన) సోమనాథకవినిని, భీమునిన్ = ( కవిజనాశ్రయ మనులక్షణగ్రంథము చేసిన ) భీమకవినిని, శ్రీనాథున్ = (కాశీఖండము మొద లగుగ్రంథములకుఁ గర్తయైన) శ్రీనాథకవినిని, శంభుదాసున్ = శంభుదాసునిని, సంస్మరింతున్ = తలఁతును

వీ రందఱును దెనుఁగుభాషం బ్రబంధములు నిర్మించి తర్వాతివారికిం గావ్యము నిర్మించుమార్గముఁ జూపిరి గావునఁ గృతజ్ఞతాపూర్వకముగా వీరిని స్తుతింతు నని తాత్పర్యము

ఇందుఁ గవిత్రయముకంటె వేఱుగా శంభుదాసుఁడు చెప్పఁబడియె. కవిత్రయములోని యెఱ్ఱాప్రెగ్గడకే శివభక్తుఁ డగుటచే శంభుదాసుఁ డనియును నరసింహపు

రాణ మనుప్రబంధమును నిర్మించుటచేఁ బ్రబంధపరమేశ్వరుఁ డనియు నామాంతరములు గాని యీపేరు గలకవి యొకఁడు లేఁ డని పెక్కండ్రు తలఁతురు కావున నిట నిట్లు చెప్పుట చింత్యము కాదేని శంభుదాసు ననుపద మిట శ్రీనాథు నన్న దానికి విశేషణమైనం గావచ్చును ( శివభక్తుఁ డైనశ్రీనాథు నని యర్థము )

గీ॥ అజ్ఞు లని కాకవులఁ దేల ♦ నాడ నేల?
యెవ్వనికిఁ బూర్వకృతఫల ♦ మెంత గలుగు
నంతవిద్యయె వానికిఁ ♦ బ్రాప్త మగు భ
వుండె దక్కఁగ సర్వజ్ఞుఁ ♦ డొండు గలఁడె?॥ 11.

కాకవులన్ = కుకవులను, అజ్ఞు లని = మూర్ఖు లని, తేల నాడన్ = నిందించుట, ఏల = ఎందులకున్ ( వారిని నిందించుటవలని ప్రయోజనము లే దని యర్థము ) ఎవ్వనికిన్ = ఏమనుజునకు, పూర్వకృతఫలము = తొలిమేనఁ జేసినపుణ్యము, ఎంత = ఏప్రమాణముగలది, కలుగున్ = ఉండునో, అంతవిద్యయె = ఆపుణ్యమునకుం దగినవిద్యయే, వానికిన్ = ఆమనుజునకు, ప్రాప్త మగున్ = దొరకినది యగును. భవుండు దక్కఁగన్ = ఈశ్వరుఁడు వినాన్, సర్వజ్ఞుఁడు = అన్నియు నెఱిఁగినవాఁడు, ఒండు = ఈశ్వరునికంటె భిన్నుఁడు, కలఁడె = ఉండునా? ( లేఁ డని యర్థము )

దేవుఁ డొక్కఁడు సర్వముం దెలిసినవాఁడు గాని యితరు లెల్లరుం గొంచెము తెలిసినవారు గావునను బూర్వజన్మమునఁ జేసినపుణ్యముంబట్టి విద్యాతిశయము ప్రాప్తించుం గాని యిప్పటిప్రయత్నముచేత నే కాదు గావునను గుకవులు నింద్యులు గారని చెప్పుటచే వారు జన్మాంతరమునఁ బుణ్యముచేసినవారు గా రనియును నింద్యకర్మములు చేసినవా రనియును నిందగమ్యము కాన వ్యాజస్తుత్యలంకారము

క॥ అని యిష్టదైవనతి కవి
జననుతియు నొనర్చి రసల ♦ సద్బంధురవా
గనుబంధ మొకప్రబంధం
బనుసంధింపం దలంప ♦ నాసమయమునన్। 12.

అని = ఈప్రకారము, ఇష్టదైవనతి = ఇష్టదేవతానమస్కారమును, కవిజననుతియున్ = కవీశ్వరు లైనజనులయొక్క స్తోత్రమును, ఒనర్చి = కావించి, రస—బంధము, రసము = శృంగారాదిరసములచేత, లసత్ = ప్రకాశించుచున్న, బంధుర = ఒప్పైన, వాగ

నుబంధము = శబ్దములయొక్క యనువర్తనముగలదానిని, ఒకప్రబంధంబున్ = ఒకకావ్యమును, అనుసంధింపన్ = కూర్చుటకున్, తలంపన్ = ఆలోచింపఁగా, ఆసమయమునన్ = ఆకాలమునందున్ (ముందు పద్యముతో నన్వయము.)

సీ॥ శ్రీనాథకాదంబ ♦ సానందవిహృతికి
మానసం బేధన్య ♦ మానసంబు
నరవరాకారభా ♦ స్వరధర్మదేవతా
దర్శనం బేఱేని ♦ దర్శనంబు
నిత్యకల్యాణని ♦ స్తంద్రసంపదలకు
మందిరం బేశౌరి ♦ మందిరంబు
సకలవిద్వజ్జన ♦ ప్రకరంబునకు సన్ని
ధాన మేవిభుసన్ని ♦ ధాన మరయఁ
నుతిఁ దగునతండు బుధమతా ♦ నుగుణానుగుణ
మణిగణాభరణప్రభా ♦ మండితాష్ట
దిగ్వధూటీలలాటాళి ♦ దృష్టవిమత
జనతమోహాళి యుర్వారా ♦ జానిమాళి॥ 13.

ఏధన్యమానసంబు = ఏపుణ్యవంతునిమనసు, శ్రీనాథ——హృతికిన్, శ్రీనాథ = విష్ణు వనెడు, కాదంబ = హంసము యొక్క (ని) కాదంబః కలహంస స్స్యాత్ (అ) సానంద = సంతోషముతోఁగూడిన, విహృతికిన్ = సంచారమునకు, మానసంబు = మానససరోవరమో, (హిమవంతంబునుత్తరంబున నొకకొలను గల దనియు బ్రహ్మదాని మనసుచే నిర్మించుటచే మానసం బని పేరొందె ననియు నది హంసల కారోగ్యస్థానము గాన నచట హంసలు పెక్కు లుండు ననియుఁ ప్రసిద్ధి గలదు) మానస సరస్సున నంచ యుండునట్లు భగవంతుఁడు భక్తపరాధీనుఁడు గావున నెల్లకాల మీప్రభువునంతరంగమున నుండు నని భావము. ఏతేని దర్శనంబు = ఏరాజుయొక్క దర్శనము, నరవరా——దర్శనంబు, నరవర = రాజుయొక్క, ఆకార = స్వరూపము గల, భాస్వర = ప్రకాశించు, ధర్మదేవతాదర్శనంబు = ధర్మదేవతయొక్క దర్శనమో, ఈప్రభువు స్వరూపమును ధరించినధర్మదేవత యని భావము ఏశౌరిమందిరంబు = ఏరాజు గృహము, నిత్యకల్యా——సంపదలకున్ = నిత్య = శాశ్వతమైన; కల్యాణ = మంగళ

ములచే, నిర్ణిద్ర = ప్రకాశించెడు, సంపదలకున్ = సిరులకున్, మందిరంబు = నివాసస్థానమగునో, ఏవిభుసన్నిధానము = ఏప్రభువుయొక్క సమీపము, సకల—బుధకున్ = ఎల్లవిద్వాంసులసముదాయమునకును, సన్నిధానము = మంచిద్రవ్యరాశియగునో; నుతిన్, స్తుతిచేతను, తగునతండు = తగియెడువాప్రభువును, బుధ—లలాటాళి, బుధ = విద్వాంసులయొక్క, మత = అభిప్రాయమునకు, అనుగుణ = సమ్మతమైన సుగుణమణిగణ = శ్రేష్ఠమైనగుణసముదాయ మనెడు, ఆభరణ = భూషణములయొక్క, ప్రభా = కాంతిచేత మండిత — అలంకరింపఁబడిన, అష్టదిక్ = ఎనిమిదిదిక్కు లనెడు, వధూటీ = స్త్రీలయొక్క, లలాటాళి = ముఖపంక్తిగలవాఁడును, (తనసుగుణము లనుచెర్చుకలచే దిఙ్ముఖముల నలంకరించినవాఁ డని భావము) దృప్త——హేళి, దృప్త = గర్వించిన, విమతజన = శత్రు లనెడు, తమః = చీఁకటికి, హేళి = సూర్యుఁడును, ఉర్వరాజాళిమౌళి = ప్రభుశ్రేష్ఠుఁడును, ముందరివచనములోని శ్రీరావు—నరేంద్రుం డనువిశేష్యముతో నన్వయము సూర్యుఁ డంధకారమును దొలఁగించిన ట్లీయన పగవారిం దొలఁగించె నని భావము

ఇందు విష్ణునందు హంసత్వ మారోపించుట మానసమునందు సరోవరత్వ మారోపించుటకుఁ గారణము గానఁ బరంపరితరూపకాలంకారము దృప్తజనతమోహేళియనుచోటను నిట్లే

వ. వెండియు నఖండాఖండల సదోద్దండ వేదండ శుండాభ నిజభుజా
దండ కుండలీంద్ర సంభృత భూమండలుండును, భూమండలశంకా
వహ విశంకట నిజవిజయ ధాటీ సమాటీకన సముద్ధత పరాగ పరం
పరా పరివృత నభోమండలుండును, నభోమండల మధ్యగత చండ
కర కరమండలీ దుర్నిరీక్ష నిజకరాగ్ర తాండవిత మండలాగ్రధాళద్ధళీ
విలోకనమాత్ర పలాయిత ప్రత్యర్థి సముదయుండును, ప్రత్యర్థి స
ముదయ కుముదప్రమదకర నిరంతర హరిదంతర విశ్రాంత విశ్రాణ
నేందూదయ సముజ్జృంభిత గంభీరాపార యశఃపూర క్షీరపారావా
ర నిజసుగుణకల్లోల హల్లీసకసముల్లంఘితావధి కుధరుండును, కుధ
రచాప త్రిపుటభేదన భేదనోద్యమ సమున్నయనానలాభీల జ్వాలా
మాలికోపమ ప్రతాప తపనదారిత సమదారి ప్రమదాకుచలికుచ

నిచిత చకచకద్రుచిర ముక్తాహార తారకావారుండును, వారణాశీ ప్రముఖ దివ్యక్షేత్ర ప్రతిష్ఠాపితానేకసత్రుండును సత్త్రాణపరాయణ నారాయణ చరణ సేవాచరణ రతపరమభాగవతవతంస పూజానిరంతరాయుండును, రాయవేశ్యా భుజంగ జగనొబ్బగండకరవాల భైరవ ప్రతాప హనుమదాది బిరుదాభిశోభితప్రాభవుండును, భవాభవ వాహ మఘవ వాహ ఖవాహిని కాశ నీకాశ యశోధుర్య సూర్యరాయాధిప తనూభవుండును, భవానీరమాసమాన శుభగుణాంక వేంకయాంబా గర్భపావనుండును, వనతటాకాది సప్తసంతాన సంస్థాపన శీలుండును సుశీలాంచిత నేచర్లగోత్ర పవిత్రుండును, నగుశ్రీరావు వేంకటమహీపతిగంగాధరరామరాయనరేంద్రుం డొక్కనాఁడు దంభశాతకుంభ స్తంభసంభాసమాన రంభాసమాన కాంచనపాంచాలికాసమంచిత పంచశాఖాంచలమణిదీపికావిరాజితంబై, పలువగలఁ జలువగలతోఁగలరాచట్టుజిగజిగిలెలందొగ రోలుక్రొందళ్కు తమ్మికెంపుటోరులయోఁగలం బెట్టనిమ్రుగ్గులై కట్టలుకట్టాణిముత్తెంపుజాలరులు నోఁప గారుత్మతతోరణంబుల సిరిమించుసభాభవనభాగంబున మాణిక్యభద్రాసనాసీనుండై సామంతులు, మంతులు పురోహితులు, హితులు, కవిప్రవరులు విప్రవరులు, పౌరాణికులు, వైశికులు నాదిగాఁ గలనిఖిలపరివారంబునుం గొలువ బృందారకబృందంబునడుమం దగుపురందరుచందంబునం, గులాచలమధ్యంబునం బెంపొందుమేరువుతీరునం బేరోలగంబుండి యున్నాఁడు

వెండియుఁ = మఱియును, అఖండ——భూమండలమంతయును; అఖండ = పూర్ణమైన, (ఇది మిగుల దూరముం దున్నను భూమండలమనుదానితో నన్వయించును) అఖండల = ఇంద్రునియొక్క, మదోద్దండ = మదముచే నతిశయించిన, వేదండ = గజముయొక్క (ఐరావతముయొక్కయనియర్థము) శుండా = తుండముయొక్క, అభ =

కాంతివంటికాంతిగల, (తుండముం బోలిన దని యర్థము) భుజాదండ = హస్తమనెడు, కుండలీంద్ర = శేషాహిచే, సంవృత = ధరింపఁబడిన, భూమండలుండును = భూమండలము గలవాఁడును, ఏనుఁగుతుండమువలె దీర్ఘమగుభుజ మను శేషునిచే భూమండలము ధరించినవాఁ డని యర్థము ఇందు వేదండశబ్దము శకంధ్వాదులలోని దగుటచేఁ బరరూపము వచ్చెను లేనియెడల వేద + అండ అని యుండఁగా సవర్ణదీర్ఘము రాక లనియుండెను మఱియు వేదండశుండాభ యనునది విశేషణము, భుజాదండకుండలీంద్రయనునది రూపకమను నలంకారము గలవు భూమండల — — మండలుండును, భూమండలశంకావహ = భూమండల మను సందియముఁ గలిగించెడు, విశంకట = విశాలమైన, నిజ = తనది యగు నిబిడ = దట్టమైన, ధాటీ = దండయాత్ర పోవునట్టి సైన్యముయొక్క, సమాటీక = సంచారముచేతను, సముద్ధ = బయలువెడలిన, పరాగపరంపరా = ధూళిసముదాయముచేతను, పరివృత = ఆవరింపఁబడిన, నభోమండలుండును = ఆకాశము గలవాఁడును, ఈతని దండయాత్రలయందు గుఱ్ఱములు మొదలగువాని పాదాహతిచే బయలువెడలిన ధూళి భూమియే యాకాశమునకుం బోవుచుండె నేమో యని శంక గలిగించుచు నాకాశమునంత వ్యాపించియుండె నని భావము (పరాగ [illegible] ప్రవృత్తి ధాటి యనునందు) అతిశయోక్త్యలంకారము

నభోమండల — — సముదయమండలుండు, నభోమండల = ఆకాశముయొక్క, మధ్యగత = నడుమనున్న, చండకర = సూర్యునియొక్క, మండలి = బింబసముదాయమువలె, దర్శితశ్రీ = చూపఁబడిన శోభయు గలయునట్టి, నిశితాసి = [illegible], తాండవిత = నాట్యముఁ జేయింపఁబడిన, ([illegible]) మండలాగ్ర = కత్తియొక్క, (1) [illegible] (2) ధారోద్ధతి = కాంతియొక్క, విలోకనమాత్ర = చూచుటచేతనే, పలాయిత = పాఱిపోయిన, ప్రత్యర్థి = శత్రులయొక్క, సమితియుండును = సమూహము గలవాఁడును, ఇందు నుపమయు నతిశయోక్తియుఁ గలవు.

ప్రత్యర్థి [illegible], ప్రత్యర్థి సమితియు — ఎల్లవారికి సముదాయము నేసెను, కుముద = కలువలకు, ప్రమోద = సంతసము నిచ్చు, నిశాంత = ఎడము లేకుండెను, వారిదాంత = [illegible], విక్రాంత = అలయటు తిర్చినట్లు, (వ్యాపించిన యని యర్థము) విక్రాంతసంకురాడను = విక్రాంత = దాన మనెడు, ఇందు — చంద్రునియొక్క, ఉదయ = ఉదయించుటచేత, సముజ్జృంభిత = పొంగిన, గంభీర = అగాధమైన, మకరాలయ = [illegible], [illegible] = [illegible]

సముద్రమునందలి, నిజసుగుణ = తనవి యగుసద్గుణము లనెడు, కల్లోల = తరంగములయొక్క, హల్లీసక = నృత్యముచేతను, సముల్లంఘిత = అతిక్రమింపఁబడిన, అవధిభూధరుండును = చక్రవాళపర్వతము గలవాఁడును, ఎల్లయాచకులకుం గోరికలు నిండ దానముచేయుటచె నీప్రభు వన్నిదేశముల వ్యాపించినకీర్తి సంపాదించె ననియును, దనసుగుణములచేత సూర్యచంద్రులకాంతి వ్యాపింపనిచక్రవాళపర్వతము నయితము నతిక్రమించె ననియుం దాత్పర్యము (కీర్తి తెల్లనిది యని కవిసమయము.) రూపకాలంకారము.

నిధీర......తారకావాసుండును, కుధరచాప = ఈశ్వరునియొక్క, (పర్వతము ధనుస్సుగాఁ గలవాఁ డని యర్థము) త్రిపురభేదన = మూడుపురములయొక్క, (ని) పత్తనంపుటభేదనం (అ) భేదన = చీల్చుటయందైన, (నశింపఁజేయుట యని యర్థము) ఉద్యమ = ప్రయత్నముచేతను, సముత్ = వికసించిన, నయనానల = కంటియందలియగ్నియొక్క, ఆభీల = భయంకరమైన, జ్వాలామాలికా = మంటలవరుసయే, ఉపమ = సాటిగల, ప్రతాపతపన = తేజస్సనుసూర్యునిచే, దారిత = చీల్పఁబడిన (త్రెంపఁబడిన యని యర్థము) సమదారి = మదముగలశత్రువులయొక్క, ప్రమదా = స్త్రీలసంబంధమైన, కుచలికుచ = కమ్మరేఁగుఁబండ్లం బోలినస్తనములయందు, నిచిత = కూర్పఁబడిన, నికచకచ్చుచిర = మిగుల సంచలించుచున్నవియు మనోహరమైనవియును (అగు) ముక్తాహార = ముత్తెములదండలయందలి, తారకావాసుండును = ముత్తెముల గుంపు గలవాఁడును; మున్ను త్రిపురముల దహింపఁదలంచిన యీశ్వరుని కంటినుండి, పుట్టించిచిచ్చుతో సమానమైనప్రతాపముచె నీరాజు గర్వించినశత్రుల సంహరించి వారి భార్యలకంఠభూషణములఁ దొలఁగించె నని తాత్పర్యము మున్ను మయునిచే నిర్మింపఁబడినవియు నెవ్వరికిం దెలియనిగమనాగమనములు గలవియు నయోమయము సువర్ణమయము రజితమయము నగునక్కసులపురములు మూఁడు దేవతలప్రార్థనచె శివుఁడు దహియించె నని భాగవతము. (ఉపమాలంకారము.)

వారణాశీ......సత్రుండును, వారణాశీప్రముఖ = కాశీ మొదలగు, దివ్యక్షేత్ర = పుణ్యక్షేత్రములందు, ప్రతిష్ఠాపిత = నిల్పఁబడిన, అనేకసత్రుండును = పెక్కుసత్రములుగలవాడును

సత్త్రాణ... ..నిరంతరాయుండును, సత్ = సజ్జనులయొక్క, త్రాణ = రక్షణమునందు, పరాయణ = ఆసక్తిగలవాఁడును, నారాయణ = విష్ణువుయొక్క, చరణ = పాదములయొక్క, సేవా = సేవయొక్క, ఆచరణ = చేయుటయందు, (విష్ణుపాదము

లు సేవించుటయం దని యర్థము ) రత=ఆసక్తిగల, పరమభాగవతవతంస=శ్రేష్ఠులైనభగవద్భక్తులయొక్క, పూజా=ఆరాధించుటయందు, నిరతరాయుండును=ఎడతెఱపిలేనివాఁడును

రాయ......ప్రాభవుండును, రాయవేశ్యాభుజంగ మొదలైనబిరుదములచేతను, అభిశోభిత=దీప్తమైన, ప్రాభవుండును=ప్రభుత్వముగలవాఁడును.

భవ ....తనూభవుండును, భవ=శివునియొక్కయు, అభవ=బ్రహ్మయొక్కయు, ( అకారమనగ విష్ణు వని యర్థము. అతనివలన జన్మించినవాఁడు గాన నభవుఁడు=బ్రహ్మ: ) ( ని ) అకారో బ్రహ్మ విష్ణ్వీశ కమఠేషు ( నా ) వాహ=వాహనములైనవృషభముతోడను, హంసముతోడను, మఘవవాహ=ఇంద్రునిగట్టిమైనయుచ్చైశ్శ్రవముతోడను, కాశ=రెల్లుఁబూవుతోడను, నికాశ=సమానమైన, యశోధుర్య=కీర్తినివహించిన, సూర్యరాయాధిపతనూభవుండును=సూర్యరాయప్రభువునకుం బుత్రుండును.

భవానీ......పావనుఁడు, భవాని=పార్వతితోడను, రమా=లక్ష్మితోడను, సమాన=తుల్యురాలును, శుభగుణాంక=సద్గుణము లనెడుభూషణములుగల ( ని ) అంకః స్థానాంతిక క్రోడ భూష ణోత్సంగి లక్ష్మసు ( వి ) వేంకయాంబాగర్భపావనుండును=వేంకయమ్మగర్భమును బవిత్రముచేయువాఁడును.

వన... .శీలుండును, వన=తోఁట, తటాక=చెఱువు, ఆది=మొదలుగల, సప్తసంతాన=ఏడువిధము లగుసంతతులను, సంస్థాపనశీలుండును=నిల్పుటయందు స్వభావము గలవాఁడును, ( క॥ "తనయుఁడుఁ, జెఱువును, గావ్యం । బు, నిధానము, గుడి, వనంబు, భూదేవస్థా । పనమును ననునియేడును । జను శాస్త్రములందు సప్తసంతతు లనఁగన్ " )

సుశీ......పవిత్రుండును=సదాచారముచే నొప్పారెడుసద్గోత్రమును బవిత్రము చేసినయతఁడును ;

అగు శ్రీరావువేంకటమహీపతిగంగాధరరామరాయనరేంద్రుండు, ఒక్కనాఁడు=ఒకదినమునందున్, ( ఇది కాలవాచకము గావునఁ బ్రథమయందుండును. కాలార్థములకుం బ్రాయికంబుగాఁ బ్రథమ యగు బా కా. )

అదంభ. నీరాజితంబై, అదంభ=కృత్రిమము గాని ( స్వచ్ఛమైన దని యర్థము. ) శాతకుంభస్తంభ=బంగారుకంబములయొక్క, ( శతకుంభ మనుపర్వతమునం బుట్టినది శాతకుంభము ( ని ) తపనీయం శాతకుంభం గాంగేయం భర్మ కర్బు

రం (అ) సంభార=సమూహముయందు, సంభాసమాన=ప్రకాశించుచున్న, దంభాస మాన=రంభ యనునప్సరంబోలిన, కాంచనపాంచాలికా = బంగారుబొమ్మలయొక్క (ని) పాంచాలికా పుత్త్రికా స్యా ద్వస్త్ర దంతాదిభిః కృతా. (అ) సముంచిత= ఒప్పుచున్న, పంచశాఖ = చేతులయొక్క, (ని) పంచశాఖ శ్శయః పాణిః (అ) అంచల = అగ్రమునందలి, మణిదీపికా = మాణిక్యప్రదీపములచేతను, నీరాజితం బై = ఆరతీయఁబడినది యై, సభాభవనమునందలి బంగారుకంబములం దున్న బొమ్మలు వారిచే తులయందలిమాణిక్యదీపములచే సభాభవనమునకు నీరాజన మిచ్చుస్త్రీలువలె నుండె ననియు నాపద యాంతి యందమనదివలె నుండె ననియు నాశయము

పలువగలన్ = పెక్కురీతులచేతను, చలువ జిగిలెలన్ = చలువ గల = చల్లఁదనము గల, తొగలరాచట్లు = చంద్రకాంతపురాలయొక్క, జిగి = కాంతి గల, జగిలెలన్ = తిన్నెలందున్, తొగ . యోగలన్, తొగ రొల్కు = ఎఱ్ఱకాంతిం బ్రసరింపఁజేయు, క్రొందళ్కు = క్రొత్తకాంతి గల, తమ్మికెంపుటోపలయోరలన్ = పద్మరాగముల (చేఁజేయఁబడిన) యెఱ్ఱపట్టెలయొక్క సాన్నిధ్యములందున్, (క్రొ త్త + తళ్కు = క్రొందళ్కు, క్రొత్తశబ్దమున కాద్యక్షర శేషమునకుం గొన్ని యెడల నుగాగమంబును గొన్నియెడల మీఁదివాల్లునకు ద్విత్వంబు నగు కెంపు + ఓరులు = కెంపుటోరులు కర్మధారయంబునం దుత్తునకు మ్చుపరంబగు నపుడు టుగాగమం బగు బా సం) పెట్టు గ్రుమ్మగా, ఓట్టు = అధికముగా, అలరుకట్టాణి జాల ములు, అలరు = ప్రకాశించెడు, కట్టాణి జాలములు = ప్రశస్త మైనముత్తెములయొ క్క జాలెలు, (కడు + ఆణి = కట్టాణి, నటుచిటు, కడు, నడు, నిడుశబ్దములు, డలక మ్మపరంబగునపుడు ద్విరుక్తటకారంబగు బా. సం) తోఁపన్ = కాన్పింపఁగాను, గాను తోరణంబులన్ = గముడపచ్చలతోరణములచేతను, సిరి . బునన్ = సిరిమించు = ప్రకాశించెడు, సభాభ బునన్ = సభామండపప్రదేశమందున్, మా ణిక్యభద్రాసనాసీనుం డై = మణులతోఁ గూర్చిన రత్నపీఠమునం గూర్చుండి, సామం తులు = సమీపదేశములరాజులు, (రాజులచే నూఱుగ్రామములఁ బాలింపనియమింప్త లగు నధికారు లనియొక యర్థము) మంతులు = మంత్రులు, (రాజకార్యాలోచనఁ జెప్పు వారు) పురోహితులు = పురోధసులును, హితులు = ఆప్తులును, కవిప్రవరులు = కవిశ్రే ష్ఠులును, విప్రవరులు = బ్రాహ్మణశ్రేష్ఠులును, పౌరాణికులు = పురాణములం జెప్పువారు ను, (ప్రపంచముయొక్క సృష్టిప్రళయములును, సూర్యచంద్రులవంశంబులు నావంశ ములందలిమహారాజులచరితంబును మనువులవృత్తమునుం జెప్పుగ్రంథములు పురాణంబు లనంబడు ఇవి మిత్రులుంబోలె జనులకు హితాహితముల బోధించి దుర్మార్గమునుండి

మఱలించిసన్మార్గమునం బ్రవర్తింపఁజేయుఁ గాన సుహృత్సమ్మితము లనంబడు.) వైణికులుఁ = వీణాగానముచేయువారును, ఆదిగాఁ = మొదలుగా, కలనిఖిలపరివారంబును = కలయెల్లపరిజనమును, కొలువఁ = సేవింపఁగాఁ, బృందారకబృందంబునడుమఁ = దేవతాసముదాయముయొక్కనడుమను, పురందరుచందంబునఁ = ఇంద్రుని యందముచేతఁ (ఇంద్రుడువలె నని యర్థము.) కులాచలమధ్యంబునఁ = కులపర్వతములమధ్యమందు, (శ్లో॥ మహేంద్రో మలయ స్సహ్య శ్శుక్తిమాఁ గంధమాదనః, వింధ్యశ్చ పారియాత్రశ్చ సప్తైతే కులపర్వతాః॥) పెంపొందుమేరువుతీరునఁ = ఔన్నత్యము నొందుబంగారుకొండవలెను, పేరోలగం బుండి = పెద్దసభయం దుండి, అప్పుడు = ఆకాలమున (ముందుపద్యముతో నన్వయము.) ఇం దింద్రాదులతో సామ్యము చెప్పఁబడెఁ గాన నుపమాలంకారము ఈవచనమునందు నాయకగుణంబు లగుకీర్తిప్రతాపాదులును మహాకులీనత మొదలగు నవియుఁ జెప్పంబడియె. ("శ్లో॥ కీర్తిప్రతాపసుభగః పుమర్థత్రయతత్పరః। ధురంధరశ్చ గుణవాఁ నాయకః పరికీర్తితః॥ మహాకులీన తౌజ్జ్వల్యం మహాభాగ్య ముదారతా। తేజస్వితా విదగ్ధత్వం ధార్మిక త్వాదయో గుణాః"॥ కీర్తిప్రతాపములచె సుందరుఁడును, ధర్మార్థకామములందుఁ దత్పరుఁడును, భూమండలాధిపతియు, సద్గుణములుగలవాడు నగుపురుషుఁడు కృతినాయకుఁడు గావలయును మఱియు గొప్పవంశమునందలిజన్మము, చేయవలసిన కార్యములయందు నైపుణ్యమును, తేజస్సును, ధర్మమునందే మనసు గలుగటయును, మిగుల సౌందర్యము మొదలగుగుణములు కృతినాయకుని కుండవలసిన వని యర్థము)

సీ॥ నిత్యసత్యవ్రత ♦ స్తుత్యుఁడౌనెల్లనా
ర్యుని పౌత్రు హారితస ♦ న్మునిసగోత్రు
భారతీపురుషాన ♦ తార మారంగధా
మార్యునితనయు వి ♦ ఖ్యాతవినయు
సతతపుణ్యాచార ♦ యుతగంగమాంబికా
గర్భసంభవుఁ గళా ♦ కలితవిభవు
నల్లమరాజాన్వ ♦ యజుని సుబ్రహ్మణ్యా
కవినామధేయు స ♦ త్కవివిధేయు
శేషధర్మేతిహాసవి ♦ శేష మంత్రి

భాషగ నొనర్చి లింగమ ♦ పర్తిధామ
రామమూర్తికి భక్తిన ♦ ర్పణ మొనర్చి
నట్టినను దయ రావించి ♦ యిట్టు లనియె॥ 14.

నిత్య..... స్తుత్యుఁడు; నిత్య = ఎల్లపుడు, సత్య = నిజము (పల్కుటయందు) వ్రత = నేమము గలవాఁడు గనుకనే, స్తుత్యుఁడు = స్తోత్రమునకుం దగినవాఁడు, ఔసెల్లనార్యునిపౌత్రుఁడ, హారితసన్మునిసగోత్రుఁడ = హారితుఁ డనునుత్తమమునికి సమాన మైనకులముగలవానిని, భారతీపురుషావతారము = సరస్వతియొక్క పురుషరూపము, ఔరంగధామార్యునితనయుఁడ = అగురంగశాయికుమారునిఁ, విఖ్యాతవినయుఁడ = మిగులఁ బ్రసిద్ధ మైనయడఁకువ గలవానినిఁ, సతత .....సంభవుఁడ = సతత = ఎల్లపుడును, పుణ్యాచార = మంచినడవడితో, యుత = కూడుకొనిన, గంగమాంబికాగర్భసంభవుఁడ = గంగమ్మ యనునామెగర్భమున నుప్పతిల్లినవానిని, కళాకలితవిభవుఁడ = కళా = విద్యలచేత, కలిత = పొందఁబడిన, విభవుఁడ = సంపదగలవానిని, అల్లమరాజాన్వయజున్ = అల్లమరాజువారివంశమునఁ బుట్టినవానిని, సత్కవివిధేయుఁడ = మంచికవులకు లొంగినవానిని, సుబ్రహ్మణ్యకవినామధేయున్ (ఇచట ధేయ యనుప్రత్యయము స్వార్థమున వచ్చెను ) నామ మన నెంతయర్థమో నామధేయ మనిన నంతయే యర్థము.) శేషధర్మేతిహాసము = శేషధర్మ మనుగ్రంథమును, ఆంధ్రభాషగఁ = తెనుఁగుకావ్యముగా, ఒనర్చి = చేసి, లింగమపర్తిరామమూర్తికిన్ = లింగమపర్తిలో నున్న రామదేవునకు, భక్తిఁ = అనురాగముతో (పూజ్యులయం దనురాగము భక్తి యనంబడు ) అర్పణ మొనర్చినట్టినన్నుఁ = అర్పణము చేసినన్నుఁ, రావించి = పిలిపించి, దయఁ = కరుణతో, ఇట్టులు = ఈక్రిందిప్రకారము, అనియెఁ = అనెన్. ('ననుఁ' ఇది యీపద్యమున ననె ననుదానికప్రధానకర్మము గావున ద్వితీయయం దుండెను తఱచు షష్ఠియందేని తృతీయయందేని యుండును ) వచ్యర్థాముఖ్య కర్మంబునకుఁ దోడ షు వర్ణకంబులు ప్రాయికంబుగ నగును ( బా కా ) అనెన్ అనుక్రియకు వెనుకటివచనమున నున్నప్రభువు కర్త

క॥ అకలంకభారతీకరు
ణకుఁ బాత్రమ వై సుధీజ ♦ నముచే నిల నె
న్నికఁ గంటివి సుబ్రహ్మ
ణ్యకవీంద్రా! సాహితీర ♦ సాంబుధి చంద్రా॥ 15.

సాహితీరసాంబుధిచంద్రా = గుణములతో నలంకారములతోఁ గూడినశబ్దార్థజ్ఞానమను రసజ్ఞానము నను సముద్రమునకుఁ జంద్రుఁడా, సుబ్రహ్మణ్యకవీంద్రా = సుబ్రహ్మణ్యకవిశ్రేష్ఠుఁడా, అక .. .కరుణకున్ = నిర్మలమైనసరస్వతియనుగ్రహమునకున్, పాత్రమవై = తగినవాఁడవై, సుధీజనములచేన్ = విద్వాంసులచేతను, ఎన్నికన్ = గౌరవమును, కంటివి = పొందితివి

సీ॥ వాల్మీకి యాదికా ♦ వ్యంబొనర్పఁగఁ గదా
రామునిగుణకథల్ ♦ ప్రకట మయ్యె
ద్వైపాయనుఁడు భార ♦ తం బొనర్పఁగఁ గదా
పాండవాదులప్రభా ♦ వములు దెలిసెఁ
గాళిదాసుఁడు కృతి ♦ ఘటన సేయఁగఁ గదా
భోజరాజయశంబు ♦ తేజరిల్లె
ఘనత విద్యానాథ ♦ కవికబ్బమునఁ గదా
తనరెఁ బ్రతాపరు ♦ ద్రునిప్రసిద్ధి
యిలను రాజనరేంద్రుఁ ♦ డును కృష్ణదేవ
రాయ లాదిగఁ గలమహా ♦ రాజు లెల్లఁ
గావ్యముఖమునఁ గాదె వి ♦ ఖ్యాతిఁ గనిరి
కానఁ గృతిసాటి వేఱొండు ♦ గలదె తలఁప॥ 16.

వాల్మీకి, ఆదికావ్యము = రామాయణమును, ఒనర్పఁగఁగదా = చేయుటచేతనే కదా, రామునిగుణకథల్ = శ్రీరామునిసద్గుణంబులుం జరిత్రంబును, ప్రకటమయ్యెన్ = ప్రసిద్ధము లయ్యెను (వాల్మీకి దీని నెల్లసంస్కృతకావ్యంబులకుం బూర్వమున రచియించుటచే నాదికావ్యం బనంబడు.) ద్వైపాయనుఁడు = వ్యాసుఁడు, భారతంబు, ఒనర్పఁగఁగదా = రచియించుటచేతనే కదా, పాండవాదులప్రభావములు = ధర్మరాజు మొదలగువారిమహిమములు, తెలిసెన్, కాళిదాసుఁడు, కృతి = కావ్యమును, ఘటనసేయఁగఁగదా = కూర్చుటచేతనే కదా, భోజరాజయశంబు = భోజునికీర్తి, తేజరిల్లెన్ = ప్రకాశించెను. (కాళిదాసుఁడు భోజునికీర్తికిం బ్రకాశకమగుగ్రంథము రచించిన ట్లీచటం జెప్పంబడె. కాని రఘువంశాదికావ్యములన్ రచించినకాళిదాసుఁడు భోజునికాలమున లేఁ డనియు విక్రమార్కునికాలమున నుండె ననియుఁ గొందఱు చెప్ప

దరు అది యట్లుండె భోజునికాలమునందే కాళిదాసుండెనను నాయన చేసినకావ్యములలో నెచ్చటను భోజునినామము సయితము లేదు అయినను భోజునిపైఁ బెక్కండ్రుకవులు చెప్పినచాటుపద్యములతో నిండినభోజచరిత్ర మనుగ్రంథమునఁ గాళిదాసుఁడుం గొన్నిపద్దెములు చెప్పినట్లుండె. దానింబట్టియే యీకవి యిట్లు చెప్పె నని తోఁచెడిని ) విద్యానాథకవికబ్బము గదా = విద్యానాథకవి చేసినకావ్యము ( ప్రతాపరుద్రీయము ) చేతనే కదా, ఘనతన్ = గొప్పతనముతో, ప్రతాపరుద్రునిప్రసిద్ధి, ఇలన్ = భూమియందు, తనరెన్ = అతిశయించెను, రాజనరేంద్రుండు = రాజరాజనరేంద్రుండు ( ఈయన భారతముం గృతినందినవాఁడు ) కృష్ణదేవరాయలు = ( మనుచరిత్రాదులకుం గృతినాయకుఁడు ) ఆదిగన్ = మొదలుగా, కలమహారాజులెల్లన్ = కల గొప్పరాజు లందఱును, కావ్యముఖమునఁ గాదె = కావ్యద్వారముచేతనే కదా, విఖ్యాతిన్ = ప్రసిద్ధిని, కనిరి = పొందిరి, కానన్ = ఆకారణముచేత, కృతిసతి = కావ్యము నందుటతో సమాన మైనది, వేఱొంకు = ఇంకొకటి, ( కీర్తికర మైనది ) తలఁపన్ = ఆలోచింపఁగా, కలదె? = ఉన్నదా? ( లేదని యర్థము )

క॥ సంతానసప్తకములోఁ
జింతితఫలదాయకంబు ♦ చిరకీర్తికరం
బెంతయుఁ గృతి మా కది శ్రీ
కాంతకథాసుధను గూర్పఁ ♦ గా వలయుఁ జుమీ॥ 17.

సంతాన ... లోన్ = సంతానము లేడిటిసమూహములలోన్, కృతి = గ్రంథము, చింతితఫలదాయకంబు = కోరఁబడినఫలము నిచ్చునదియును, ఎంతయున్ = మిక్కిలిగా, చిరకీర్తికరంబు = శాశ్వత మైనయశముం గలిగించునదియును ( అగును ) అది = అట్టికావ్యమును, శ్రీకాంతకథాసుధన్ = విష్ణుచరిత మనెడునమృతముతోన్, ( సంఘటించి ) మాకున్, గూర్పఁగా వలయుఁజుమీ = మాకీయఁగా వలయును జుమా ( ఇచటఁ జుమీ యనుదాని కర్థము వేఱుగా లేదు గాని వెనుకటిక్రియార్థము ముఖ్య మని బోధించుశక్తి గలదు. )

వ. అని సబహుమానంబుగాఁ గర్పూరతాంబూల కనకాంబరాభరణాదు లొసంగిన నంగీకరించి మదీయకృతికన్యావతంసంబున కనుకూలనాయకరత్నసంఘటనంబు గలిగె నని సంతసించి యేతత్ప్రబంధనిబంధనంబునకుం బ్రారంభించితిం గావునం గృతిపతివంశావతారం

బభివర్ణించెద.

అని = ఇట్లు చెప్పి, సబహుమానంబుగాన్ = మిక్కిలిగౌరవముతోఁ గూడునట్లు, కర్పూర.....ణాదులు ; కర్పూరతాంబూల = కప్పురముతోఁ గూడినవిడెమును, కనక = బంగారు, ( జలతారుగల ) అంబర = వస్త్రములు, ఆభరణాదులు = భూషణములు మొద లగువానిని, ఒసంగినన్ = ఈయఁగాన్, అంగీకరించి = ( నేను ) వానిం బుచ్చికొని, కావ్యము వారి కిచ్చుట కొప్పికొని, మదీయ .. ..సంబునకున్ ; మదీయ = నాసంబంధమగు, కృతి = కృతియనెడు, కన్యావతంసంబునకున్ = కన్యాశిరోభూషణమునకు, అను.....సంఘటనంబు = అనుకూలుఁ డగు నాయకుఁ డనెడురత్నముయొక్క కూర్పు, కలిగె నని = సంధర్భించె నని ( ఒకకాంతకే లోఁబడిననాయకుఁ డనుకూలుఁడు ) సంతసించి = సంతోషపడి, ఏతత్ప్రబంధనిబంధనంబునకున్ = ఈకావ్యనిర్మాణమునకున్, సత్య మగుకథను గొని పెక్కు లగువర్ణనములతోఁ గూర్చి వ్రాయుకావ్యము ప్రబంధము ( ని ) ప్రంబంధః కల్పనాకథా ( అ ) ప్రారంభించితిన్ = మొదలుపెట్టితిని, కావునన్ = ఆకారణముచేత, కృతిపతివంశావతారంబు = కృతినాయకుఁ డగు రామరాయప్రభువుయొక్క వంశోత్పత్తిని, అభివర్ణించెదన్ = పొగడెదను.

సీ॥ త్రిదృగష్టదృక్సహ ♦ స్రిదృగాదికోటీర
హారినీలరోలంబ ♦ పరివృతంబు
శ్రీరమాకరముద్రి ♦ కాంత్నరుచిపుంజ
మంజులకింజల్క ♦ రంజితంబు
సముదితామరధునీ ♦ స్వచ్ఛామితమరంద
లహరీనిరంతరా ♦ లంకృతంబు
సనకసనందనా ♦ ద్యనఘుసన్మునిమనః
కాసారదివ్యప్ర ♦ కాశదంబు
శ్రుతివధూటీశిరస్తటీ ♦ ధృతవతంస
మగుచు నలరారుహరిచర ♦ ణారవింద
మందుఁ జెన్నొందుశూరత్వో ♦ దారతాద్య
ధికగుణకులంబు పద్మనా ♦ యకకులంబు॥ 18.

హరిచరణారవిందము = విష్ణునిపాద మనెడుపద్మము, త్రిదృ.. ...పరివృతంబు, త్రిదృక్ = శివుఁడు, ( మూఁడుకన్నులు గలవాఁడు ) అష్టదృక్ = బ్రహ్మ ( ఎనిమిదికన్నులు గలవాఁడు ) సహస్రదృక్ = ఇంద్రుఁడు ( వేయికన్నులు కలవాఁడు ) ఆది = మొదలైన, దేవతలయొక్క, కోటీర = కిరీటములయందలి, హరినీల = ఇంద్రనీలము లనెడు, రోలంబ = తుమ్మెదలచేతను, పరివృతంబు = ఆవరింపబడినదియును, శ్రీరమా——రంజితంబు, శ్రీరమా = శోభతోఁగూడిన లక్ష్మీదేవియొక్క, కర = హస్తమందలి, ముద్రికా = ఉంగరములయందున్న, రత్న = మణులయొక్క, రుచిపుంజ = కాంతిసమూదాయ మనెడు, మంజుల = మృదువైన, కింజల్క = అకరులచేత ( పువ్వులోనిదారములచేత ) రంజితంబు = ప్రకాశించునదియును, ( లక్ష్మిభర్తకుఁ బాదము లొత్తుచుండఁగా నామె చేతులందలియుంగరములలోనిమణులకాంతి యందుఁ బ్రసరించుటచే నిట్లు చెప్పఁబడె ) సముది లంకృతంబు, సముదిత = పుట్టిన, అమరధుని = ఆకాశగంగ యనెడు, స్వచ్ఛ = నిర్మలమైన, అమిత = అధికమైన, మరంద = పూఁదేనెయొక్క, లహరీ = జాలుచే, అలంకృతంబు = అలంకరింపఁబడినదియును, సనక ప్రకాశదంబు, సనకసనందనాది = సనకుఁడు సనందనుఁడు మొదలగు, అనఘ = పాపములేని, సన్మౌని = గొప్పభగవద్భక్తులయొక్క, మనః = చిత్త మనెడు, కాసార = కొలఁకునకు, దివ్య = స్వచ్ఛమైన, ప్రకాశదంబు = ప్రకాశమును గలిగించునదియును

శ్రుతి వతంసము, శ్రుతి = వేదవాక్యము లనెడు, వధూటీ = స్త్రీలయొక్క, శిరస్తటీ = శిరములచేతను, ( ఉపనిషత్తులచేత ననియర్థము ) ధృత = ధరింపఁబడిన, వతంసము = భూషణమును, అగుచున్, అలరారున్ = ప్రకాశించును, అందున్ = ఆపాదపద్మమునందు ( ఉత్పన్నమైన ) శూరకో——కులంబు, శూరత = పరాక్రమము, ఉదారత = దానము, ఆది = మొదలైన, అధికగుణకులంబు = ఎక్కువ మంచి గుణములసముదాయము గల, పద్మనాయకకులంబు = వెలమవారివంశము, చెన్నొందున్ = ప్రకాశించును

ఇందు భగవంతునిపాదములయందు పద్మత్వ మారోపించి దానిధర్మము లగు భ్రమరసంపత్తి మొదలగునవి యెడతెగక నమస్కరించు దేవతలకిరీటరత్నాదులయందు నారోపించెఁ గాన సావయవరూపకాలంకారము

ఉ॥ అందుఁ బయోధిసప్తకము ♦ నందుఁ బయోంబుధిపోలె వైభవం
బందిన జగత్ప్రసిద్ధి నల ♦ రారుచుచుండెను రావువంశమం

దిందునిభంగి గాఁగ నుద ♦ యించె లసత్కరమండలాగ్రరు
క్సందళితారిదర్పుఁ డనఁ ♦ గా ననవ్రాతమనీఁడు మేటియై॥ 19.

అందన్ = ఆకులమునందు, పయోధిసప్తకమునందన్ = సముద్రము లేడిటిస ముదాయమునందును, పయోంబుధివోలెన్ = క్షీరసముద్రమువలె, రావువంశము = రావు వారికులము, వైభవంబు = సంపదను, అంది = పొంది, జగత్ప్రసిద్ధిన్ = లోకప్రసిద్ధిచే తను, అలరారుచునుండెన్ = ప్రకాశించుచునుండెను, అందన్ = ఆరావుకులమునం దును, ఇందునిభంగిగాఁగన్ = చంద్రునిరీతివంటిరీతిగాన్ (అనఁగాఁ జంద్రుఁడువలె ననిభావము.) లస——దర్పుడు, లసత్ = ప్రకాశించుచున్న, కర = చెతియందలి, మండలాగ్ర = కత్తియొక్క, రుక్ = కాంతియనెడు, కరమండల = కిరణసముదాయ ముయొక్క, అగ్ర = శ్రేష్ఠమైన, రుక్ = కాంతిచేతను, సందళితారిదర్పుఁడు = చీల్పఁ బడిన శత్రువు లనుజక్కవలగర్వము గలవాఁడును (చీల్పఁబడిన యిది గర్వమునకు వి శేషణము.) చంద్రుఁడు తనకాంతిచేఁ జక్రవాకములమద మడఁచిన ట్లీరాజు తనచే తఁబూనినఖడ్గసంబంధమైనకాంతిచేత శత్రువులమద మడఁచె నని తాత్పర్యము. అనఁ గాన్ = అనునట్లు, ననవోతమనీఁడు, మేటియై = ప్రసిద్ధుఁడై, ఉదయించెన్ = పుట్టె ను ఇందు శ్లిష్టరూపకము ఇందునిభంగి యనుచో నిదర్శనాభేదము. కింటికి సం గాంగిభావసంకరము.

గీ॥ పాణిఁ గ్రొమ్మించుకరణి కృ ♦ పాణి మెఱయ
వారువము నెక్కి యెదిరిన ♦ వారు వఱువ
రణము గుడిపెను రిపువిదా ♦ రణ మొనర్చి
యవ్విభుం డతనికి సాటి ♦ యవ్విభుండె॥ 20.

అవ్విభుండు = ఆరాజు, పాణిన్ = హస్తమునందున్, క్రొమ్మించుకరణిన్ = క్రొత్తమెఱుపువలె, కృపాణి = కత్తి, మెఱయన్ = ప్రకాశింపఁగాన్, వారువ మున్ = అశ్వమును, ఎక్కి = ఆరోహించి, రిపువిదారణమున్ = శత్రుసంహారమును, ఒనర్చి = చేసి, ఎదిరినవారు = ఎదుర్కొన్నవారు, (పగవారు) పఱువన్ = పారిపో వఁగా, రణము = యుద్ధమును, కుడిపెన్ = అనుభవింపఁ జేసెను, అతనికిన్ = ఆతే నికి, సాటి = సమానుఁడు, అవ్విభుండే = ఆరాజె (అగును) ఇం దతని కతఁడే కాని యుపమానాంతరము లేదని చెప్పుటచే ననన్వయాలంకారము

క॥ ఆననవోతమధరణీ
జానికి సర్వజ్ఞసింగ ♦ జనపాలుఁడు తే
జోనిధి మాధవనీఁడును
సూనులు శివకేశవాంశ ♦ జులు పుట్టి రొగిన్॥ 21.

ఆననవోతమధరణీజానికిన్ = పైనఁ జెప్పిన ననవోతమరాజునకు, **శివకేశవాంశజులు** = శివకేశవులయొక్క యంశమువలనఁ బుట్టినవారును, తేజోనిధి = ప్రతాపమునకు స్థానమగు, సర్వజ్ఞసింగజనపాలుఁడును, మాధవనీఁడును, ( అను ) సూనులు = పుత్రులు, ఒగిన్ = క్రమముగాను, పుట్టిరి = జన్మించిరి

సీ॥ తనయశోనల్పక ♦ ల్పనగాటవికిఁ బయో
భృత్ప్రదం బాకపర ♦ భృతము గాఁగఁ
దనభుజాటోపప్ర ♦ తాపరూపాగ్నికిఁ
బరబలంబులు శల ♦ భములు గాఁగఁ
దనజయలక్ష్మిని ♦ తంబిని కఖిలది
గ్వలభులు విహరణ ♦ స్థలులు గాఁగఁ
దననిరంతరదాన ♦ ధారానదికి సాగ
రములు గర్భజలాశ ♦ యములు గాఁగఁ
నవనిఁ బాలించి మిగులఁ బ్ర ♦ ఖ్యాతిఁ గాంచె
జైత్రయాత్రాసమారంభ ♦ సమయవిజయ
భేరికాభాంకరణచల ♦ ద్విమతఫణిప
తంగవిభుఁ డైనసర్వజ్ఞ ♦ సింగవిభుఁడు॥ 22.

జైత్ర. ....విభుఁడు ; జైత్రయాత్రా = జయశీలమైన దాడియొక్క, సమారంభసమయ = ఆరంభకాలమందు, విజయ = జయముం దెలిపెడు, భేరికా = భేరులయొక్క, భాంకరణ = " భాం " అనుశబ్దముచేతను, చలత్ = వణఁకుచున్న, విమత = శత్రులనెడు, ఫణిసర్పములకు, పతంగవిభుఁడు = గరుడుఁడు, గరుడుఁడు పాములం జంపునట్లీప్రభువుశత్రుల సంహరించు నని తాత్పర్యము. ఐనసర్వజ్ఞసింగవిభుఁడు, పయోభృ

త్పదంబు=ఆకాశము ( మేఘము లుండుచోటు ) తన——వికిన్=తన = తనయొక్క, యశః=కీర్తియను, అనల్ప=అధికమైన, కల్పకవాటికిన్=కల్పవృక్షములవనమునకు, ఒకపరభృతము = ఒకకోయిల, కాగన్=అగుచుండఁగా, ( కల్పవృక్షములుగలతోఁటలోఁ గోకిల యున్న ట్లీరాజుకీర్తియందు నాకాశ ముండెననిభావము. కీర్తి మిగులగొప్పది యనిఫలితార్థము ) పరబలంబులు=పగవారిసేనలు, తన——అగ్నికిన్=తనభుజాటోప=తనచెతులబలము గొప్పతనమువలన ( గలిగిన ) ప్రతాప=ప్రతాపమనెడు, అగ్నికిన్=చిచ్చునకు, శలభంబులు=మిడుతలు, కాఁగన్, అఖిలదిగ్వలభులు=అన్నిదిక్కులనెడు శిరోగృహములు ( మేడమీఁదియిండ్లు ) తన——వితంబినికిన్=తనజయలక్ష్మి యనెడుస్త్రీకి, విహారస్థలులు=విహరించుచోట్లు, కాఁగన్; సాగరములు=సముద్రములు, తనదానధారానదికిన్=తనయొక్క ( తాను ) దానము చేయునప్పుడు విడిచినజలమువలనఁ గలిగినయేటికిన్, గర్భజలాశయములు = లోపల నున్నమడుఁగులు, కాఁగన్, అవనిన్=భూమిని, పాలించి=రక్షించి, మిగులన్=అధికముగాను, ప్రఖ్యాతిన్=ప్రసిద్ధిని, కాంచెన్=పొందెను

సర్వజ్ఞసింగమహీపాలుఁడు భూమిం జక్కఁగఁ బరిపాలించి లోకమం దంతట వ్యాపించినయశము సంపాదించె ననియు నగ్ని మిడుతలంబోలె శత్రువుల ననాయాసముగ సంహరించి దిక్కులన్ వశపఱచుకొనె ననియు దానజలముచె సముద్రముకంటెఁ బెద్దనదుల నుత్పాదించెననియుఁ దాత్పర్యము

రూపకము నతిశయోక్తియు నలంకారములు

మ॥ వనజాక్షీవనజాస్త్రుఁడై గుణమణీ ♦ వారాశియై సజ్జనా
వనవిశ్వంభరుఁడై భుజార్జితధరా ♦ వల్లభ్యలభ్యోరుశో
భనలక్ష్మివిబుధేంద్రుఁడై హరిపదా ♦ బ్జాతార్పితస్వాంతుఁడై
కనియెన్ మాధవసీఁడు రంగశయనా ♦ గ్రిస్థాననిత్యస్థితిన్॥ 23

మాధవసీఁడు = సింగభూపాలునితమ్ముఁడు, వనజాక్షీవనజాస్త్రుఁడై = వనజాక్షీ=స్త్రీలకు, ( తామరపూవులవంటి కన్నులుగలవారు ) వనజాస్త్రుఁడై=మన్మథుఁడై, ( తామరపువ్వు లాయుధములుగాఁ గలవాఁడు ) యువతులమనసు హరించునందము గలవాఁడని భావము గుణమణీవారాశియై = గుణము లనెడురత్నములకు సముద్రుఁడై, సముద్రమున నెల్లరత్నము లున్న ట్లెల్లసద్గుణము లీరాజునందుండెనని యాశయము సజ్జ——భరుఁడై, సజ్జన=సత్పురుషులయొక్క, అవన=రక్షించుటయందు, విశ్వంభరుఁడై=విష్ణుఁడై, విష్ణువుంబోలె సజ్జనులను రక్షించు నని తాత్పర్యము.

భుజా.....దేంద్రుఁడై, భుజ = బాహుబలముచే, ఆర్జిత = సంపాదింపఁబడిన, ధరావాల్లభ్య = భూమండలాధిపత్యముచే, లభ్య = ప్రాప్తమైన, ఉరుశోభనలక్ష్మి = మిగుల దీప్తమైనసంపదచే, విబుధేంద్రుఁడై = దేవేంద్రుఁడై, బాహుబలమున భూమి సార్జించి సంపదచే నింద్రుని బోలినవాఁ డనిభావము హరి——స్వాంతుఁడై, హరి = విష్ణువుయొక్క, (భక్తులపాపములను నశింపఁజేయువాఁడు) పాదాబ్జాత = పద్మములంబోలినపాదములందు, అర్పితస్వాంతుఁడై = నిలుపఁబడినమనసు గలవాఁడై, రంగ——స్థితిన్, రంగశయన = రంగనాయకస్వామియొక్క, అగ్ర = శ్రేష్ఠమైన, స్థాన = నివాసమందు, స్థితిన్ = ఉనికిని, కనియెన్ = పొందెను శ్రీరంగమున నుండె ననియర్థము.

మ॥ ఘనుఁ డాసింగమనీనికాత్మజులు పె ♦ క్కండ్రుద్భవంబంది ర
య్యనఘుల్ గాంచి రనేకపుత్రకుల వా ♦ రస్తోకదోర్విక్రమా
ర్జునులై యావెలుగోటిపట్టణవర ♦ క్షోణీస్థలిన్ రాజ్యపా
లనముం గొంద ఱొనర్చి రుజ్జ్వలగుణా ♦ లంకారధౌరంధరిన్॥ 24.

ఘనుఁడు = గొప్పవాఁడు (అగు) ఆసింగమనీనికిన్ = ఆసింగభూపాలునకు, (ఇచటసింగమనీని కనుషష్ఠ్యంతమునకు ఘనుఁ డనుప్రథమాంతము విశేషణము ఒకానొకచో విశేషణంబున షష్ఠికిం బ్రథమ విభావనగు (బా కా) ఆత్మజులు = కొమరులు, పెక్కండ్రు = అనేకులు, ఉద్భవం బందిరి = జన్మించిరి, అయ్యనఘుల్ = ఆపుణ్యాత్ములును, అనేకపుత్రకులన్ = పెక్కండ్రు కొమరులను, గాంచిరి = ఉత్పాదించిరి వారిలోకొందఱు, అస్తో——నులై, అస్తోక = అధికమైన, దోర్విక్రమ = బాహుపరాక్రమముచేతను, అర్జునులై = అర్జునుంబోలినవారై, ఉజ్జ్వలగుణాలంకారధౌరంధరిన్ = ఉజ్జ్వల = ప్రకాశించెడు, గుణ = శౌర్యాదిగుణములును, అలంకార = అలంకారములు యొక్క, ధౌరంధరిన్ = ధరించుటచేత, వెలు——స్థలిన్ = వెలుగోటిపట్టణము యొక్క మంచిభూమియందు (వెలుగోటిపట్టణమం దనియర్థము) రాజ్యపాలనమున్ = ప్రభుత్వమును, ఒనర్చిరి = చేసిరి.

గీ॥ అందు శ్రీరంగరాయనృ ♦ పాగ్రగణ్యుఁ
డతిబలమదాంధయవనభూ ♦ పతుల నతుల
సమరమునఁ ద్రుంచి వారిరా ♦ జ్యంబు లైన
మెతుకుగ్గె లాసకోట లు ♦ ద్ధతిని గొనియె॥ 25.

అందుక = ఆపుత్రులలో, శ్రీరంగరాయనృపాగ్రగణ్యుఁడు = సంపద గలరంగ రాయశ్రేష్ఠుఁడు, అతులసమరమునక = సాటిలేనిపోరియందు, అతి——పతులక = అతి = ఎక్కువైన, బల = దార్ఢ్యమువలనను, మద = క్రొవ్వువలనను అంధ = గ్రుడ్డివారైన, యవనభూపతులక = తురకప్రభువులను, త్రుంచి = సంహరించి, వారిరాజ్యములు = వారిదేశములు, ఐనమెతుకుకైలాసకోటలు = మెతుకుకోట, కైలాసకోట యనువానిని, ఉద్ధతిక = గర్వముతో, కొనియెక = వశపఱుచుకొనియెను.

క॥ ఆరంగారాయమహా
శూరున కుదయించె నహిత ♦ సూదనుఁ డగుధ
ర్మారాయశౌరి యతనికి
శ్రీరమ్యుం డైనలచ్చ ♦ నృపతి జనించెక॥ 26.

ఆరంగారాయమహాశూరునకు = మీఁదఁ జెప్పినరంగరాయప్రభు వనుగొప్పపరాక్రమశాలికి, అహితసూదనుఁడు = శత్రువులసంహరించువాఁడు, అగుధర్మారాయశౌరి, ఉదయించెక = పుట్టెను, అతనికిక = ఆయనకు, శ్రీరమ్యుండు = సంపదచేతమనోహరుఁడు, ఐనలచ్చనృపతి, జనించెక = పుట్టెను

క॥ అచ్చరలకు నవ్యవరుల
నిచ్చును, నతరిపుల కభయ ♦ మిచ్చు; నభీష్టం
బిచ్చుక ద్విజతతి కదనక,
లచ్చనృపకృపాణి కల్ప ♦ లతయన భళిరే!॥ 27.

లచ్చనృపకృపాణి = లచ్చరాయప్రభువుయొక్క ఖడ్గము, (ని) కర్త్ర్యాంఘ్రికాయాంచకృపాణీస్యాత్ (నా నా) కల్పలతయనక = దేవవృక్షమువలెక, అదనక = తగినసమయమందు, అచ్చరలకుక = స్వర్గమందలివేశ్యలకు, నవ్యవరులక = క్రొత్తపెండ్లికొడుకులను, ఇచ్చుక = ఒసఁగును, నతరిపులకుక = నమస్కరించినపగఱకుక అభయము = అభయదానము, ఇచ్చుక, ద్విజతతికిక = బ్రాహ్మణసముదాయమునకుక, (ద్విజ = జన్మముచేతను గర్మముచేతను రెండుసారులు జన్మించువారు.) (ని) దంతవిప్రాండజాద్విజాః (అ) అభీష్టంబు = కోరినధనాదికమును, ఇచ్చుక, భళిరే = ఎంతస్తుతింపఁ దగును (ఇది ప్రశంసనార్థక మగునవ్యయము)

లచ్చరాయప్రభువుపగవారిని సంహరించి వారికి స్వర్గమును, శరణాగతుల కభయమును, బ్రాహ్మణుల కెల్లకోరికలును నొసఁగు నని తాత్పర్యము. ఉపమాలంకారము.

ఇందుఁ గృపాణి కరణమైనను (పనిచేయువాని కుపయోగించుపనిముట్టు) క్రియాసాకర్యము (పనియొక్క సులకఁదనము) దెలుపుటకై కర్తగాఁ జెప్పఁబడె.

గీ॥ అవ్విభుఁడు కొండమాంబిక ♦ యందుఁ గనియె
సుతుల మువ్వుర నసమ తే ♦ జోవిలాస
ధరుల సద్ధర్మనిరతుల ♦ ధర్మరాయ
మాధవధరాధినాథ వే ♦ మనరపతుల॥ 28.

అవ్విభుఁడు = ఆప్రభువు, అసమ——ధరులన్ = అసమ = సాటిలేని, తేజః = ప్రతాపముయొక్కయు, విలాస = సింగారముయొక్కయు, (ఇచటఁ గర్మార్థమున షష్ఠి = తేజమును సింగారమును ననియర్థము) (ని) తేజోబలేప్రతాపేగ్నౌ నా నా.

ధరులన్ = ధరించినవారిని, సద్ధర్మనిరతులన్ = మంచి నడవడియం దాసక్తి గలవారిని, ధర్మ——పతులన్ = ధర్మారాయఁడు, మాధవరాయఁడు వేమరాయఁడునను పేరులుగల, మువ్వురన్ సుతులన్ = ముగ్గురు పుత్రులను, కొండమాంబికయందున్, కనియెన్,

ఉ॥ ఆధరణీధవత్రితయ ♦ మందు మహీపరిపాలనంబున
న్మాధవునిన్ విభూతిని ను ♦ మాధవునిన్ మతి వాక్స్వరూపభా
మాధవునిన్ విలాసమున ♦ మాధవునిన్ సదుదారతం ద్రియా
మాధవు నుర్విఁ బోలఁ దగు ♦ మాధవరాయనృపాలుఁ డెన్నఁగన్॥

ఆధరణీధవత్రితయమందున్ = ఆరాజులముగ్గురిసముదాయమందున్ మాధవరాయనృపాలుఁడు, ఎన్నఁగన్ = పరిశీలింపఁగాన్, మహీపరిపాలనంబునన్ = భూమిని జక్కఁగాఁ బరిపాలించుటచేన్, మాధవునిన్ = విష్ణుని, (మధువను యదువంశస్థునిగోత్రమునఁ బుట్టినవాఁడు) లక్ష్మియొక్క భర్త యనియేని యర్థము. (ని) ఇందిరాలోకమాతమా (అ) ధవాః పతినరద్రుమాః. నా. నా.

విభూతిన్ = ఐశ్వర్యముచేతను, ఉమాధవునిన్ = పార్వతీపతిని, (ని) ఉమాకాత్యాయనీగౌరి (అ) మతిన్ = బుద్ధిచేతను, వాక్స్వరూపభామాధవునిన్ = బ్రహ్మను (భాషారూపమైనస్త్రీకిం బతిని) విలాసమునన్ = శృంగారముచేతను, (వలపించుటచేత ననియర్థము) మాధవునిన్ = వసంతునిని, (ని) విష్ణౌవసంతేవైశాఖేమాధవః నా. నా

సముదారతన్ = గొప్పదాతృత్వముచేతను, త్రియామాధవునిన్ = చంద్రునిని, (రాత్రికింబతి) (ని) రాత్రిస్త్రియామాక్షణదాక్షపా (అ) ఉర్విన్ = భూమియందు, పోలఁదగున్ = పోలుటకు నొప్పును. చంద్రుఁడు తనకళలను దేవతలకు దానముచేయు నని వేదములం బ్రసిద్ధము ఇందుశబ్దాలంకారము యమకము అర్థాలంకారముపమ.

గీ॥ ఆఘనుఁడు గుర్వమాంబిక ♦ యందుఁ గనియెఁ
దనయులను నల్వురఁ గురుప్ర ♦ తాపనిధుల
గురువరాయవసుంధరా ♦ వరునిఁ దెనుఁగు
రాయని నృసింహావిభు రంగ ♦ శాయిఘనుని॥ 30.

ఆఘనుఁడు = ఆమాధవరాయప్రభువు, గుర్వమాంబికయందున్, గురుప్రతాపనిధులన్ = గొప్పతేజమున కునికిపట్టయినవారిని, నల్వురన్ తనయులన్ = నల్వురు కొమరులను, కనియెన్, తక్కినది సుగమము.

వ. అందగ్రజుండు.

అందున్ = ఆనల్వురలో, అగ్రజుండు = మొదటివాఁడు, (ముందుపద్యముతో నన్వయము)

క॥ గురుతరభుజశక్తియు సుర
గురునిభధీయుక్తి విప్ర ♦ గురుభక్తియు నుమా
గురునిభధృతిప్రసక్తియు
గురువప్రభువునకు సహజ ♦ గుణములు ధాత్రిన్॥ 31.

(అగు) గురువప్రభువునకున్ = గురువరాయనికిన్, గురు——యుక్, గురుతర = మిక్కిలియధికమైన, భుజశక్తియున్ = బాహుబలమును, సుర——యున్ = సురగురు = బృహస్పతి (బుద్ధితో) నిభ = సమానము (అగు) ధీయుక్తియున్ = బుద్ధికలిమియును, విప్ర——యున్ = విప్ర = బ్రాహ్మణులయందును, గురు = ఉపాధ్యాయులయందును, భక్తియున్ = అనురాగమును, ఉమాగురునిభధృతిప్రసక్తియున్ = ఉమాగురు = హిమవంతునితో (పార్వతికిదండ్రి) (ని) గురుస్తుగీష్పతౌ శ్రేష్ఠేగురౌ పితరిదుర్భరే .. నిభ = తుల్యమైన, ధృతిప్రసక్తియు = = ధైర్యసంబంధమును, ధాత్రిన్ = భూమియందు, సహజగుణములు = కూడఁబుట్టినగుణములు (అయ్యెన్)

మ॥ స్వసమగ్రోదయలీలఁ గాంచుచును స ♦ చ్చక్రంబు లత్యంతమో
దసమృద్ధిన్ విలసిల్ల లోకతమ ము ♦ ద్యచ్చండ తేజంబున
న్వెసఁ బోఁ జిమ్ముచుఁ గీర్తిపద్మినిని బూ ♦ నెన్ ఖడ్గనారాయణాం
కసమేతుండు దెనుంగురాయవసుధా ♦ కాంతాబ్జబాంధుం డిలన్ ॥32.

ఖడ్గనారాయణాంకసమేతుండు = ఖడ్గనారాయణుఁ డనుబిరుదముతోఁ గూడి నవాఁడు, తెనుంగు——బంధుండు, తెనుంగురాయ = తెనుఁగురాయఁ డను పేరుగల, వసుధాకాంత = రాజనెడు, అబ్జబంధుండు = సూర్యుఁడు, ఇలన్ = భూమియందు, స్వ—లీలన్ = స్వ = తనయొక్క, సమగ్ర = పూర్ణమైన, ఉదయలీలన్ = గొప్పతనము నొందు ట యనుచుదయక్రియను. కాంచుచును = పొందుచును, సచ్చక్రంబులు = సజ్జనులసము దాయము లనెడుసానువు లగుచక్రవాకములు, అత్యంత——సమృద్ధిన్ = అత్యంత = అధికమైన, మోద = సంతోషముయొక్క, సమృద్ధిన్ = సంపదతో, విలసిల్లన్ = ప్రకాశింపఁగాన్, లోకతమము = జనులయజ్ఞాన మనుప్రపంచమునందలి చీఁకటిని, ఉద్య——బునన్ = ఉద్యత్ = అభివృద్ధి నొందుచున్న, చండ = తీక్ష్ణమైన, తేజంబునన్ = ప్రతాప మనుకాంతిచేత, వెసన్ = వేగముతోన్, పోఁజిమ్ముచున్ = నివారించుచు, కీర్తిపద్మినిన్ = కీర్తికాంత యనెడుపద్మినిని, పూనెన్ = అవలంబించెను (వశపఱుచుకొనె ననియర్థము) సూర్యుఁడు తనయుదయముచేఁ జక్రవాకములు సంతోషపెట్టి, కాంతిచేఁ బ్రపంచమునందలి చీఁకటినిఁ బోఁగొట్టి పద్మలత నలరించిన ట్లీమహారాజు తనయభివృద్ధిచె జనుల కానందముఁ గల్పించి ప్రతాపము న జ్ఞానముం బోఁగొట్టి కీర్తి సంపాదించె నని తాత్పర్యము

అలంకారము శ్లిష్టరూపకము

క॥ స్థిరనిజభుజాగ్రపీఠియు
సరసం బగుతనదుసూక్తి ♦ సరిఁయు నెన్నన్
వరహితవసుధాశ్రియుమై
నరసింహారాయధీరు ♦ నకుఁ దనరారెన్ ॥ 33.

నరసింహారాయధీరునకున్ = విద్వాంసుఁడైననరసింహారాయప్రభువునకు, (ఇచటఁ గువర్ణకము సంబంధార్థమున వచ్చెను) ఒకానొకచోట సంబధమునను గవర్ణకంబగు బా. కా.

స్థిర...పీఠియుఁ, స్థిర=నిలుకడైన, నిజ=తనదియగు, భుజాగ్రపీఠియున్=బుజము కొనయనుపీఁటయును, సరసంబు=మనోహరమైనది, అగుతనదనూక్తిసరణియుఁ = అగు తనసంబంధమైన మంచిమాటలధోరణియును, వర——శ్రయమై; వర=శ్రేష్ఠులైనవారికి, హిత=మేలుచేయునదియు, వసుధా=భూమికి, (మఱులేని ధనమేని దీన నుండు ననియర్థము.) ఆశ్రియమై=ఆధారమైనదియునై, వరహిత = వకారముతో శూన్యమైన, వసుధా = అమృతమునకు ("వసుధా" యనుదానియందు వకారము పోఁగా 'సుధా' మిగులుంగాన నమృతమనియర్థము.) ఆశ్రయమై = ఉనికిపట్టై, తనరారెఁ=(ఒప్పెను) ప్రకాశించెను ఈప్రభువు సజ్జనులకు మేలుచేయు తనచేతియందు భూమిని, మాటలయం దమృతమును ధరించె ననియర్థము. బాహుపరాక్రమమున సజ్జనుల రక్షించుచు భూమిం బాగుగఁ బరిపాలించెననియు నమృతముంబోలు వాగ్మాధుర్యము గలవాఁడనియు భావము. శ్లేషయు రూపకము నలంకారములు

గీ॥ హస్తముల శంఖచక్రచి ♦ హ్నము లలరుట
సిరియు ధరణియు వశగతిఁ ♦ జెలఁగుచుంట
నసమసాలాంతరస్థితి ♦ పొసఁగుచుంట
రంగశాయికి సాటియా ♦ రంగశాయి॥ 34.

హస్తములన్=చేతులందున్, శంఖచక్రచిహ్నములు=పాంచజన్యము సుదర్శనము ననునాయుధము లనుగుఱుతులు, (శంఖచక్రాకారము లైనరేఖ లనియర్థాంతరము) అలరుటఁ=ప్రకాశించుటచేతనును, సిరియుఁ=లక్ష్మీదేవియును, ధరణియుఁ=భూదేవియును, (సంపదయు, భూమండలము ననియర్థాంతరము) వశగతిఁ=లోఁబడిన స్థితిచేత, చెలఁగచుంటఁ=ఒప్పుచుండుటచేతనను, అస——స్థితి, అసమ=బేసిసంఖ్యగల, సాల=ప్రాకారములయొక్క, అంతరస్థితి=లోపలనునికి (సాటిలేని కోటలోనునికి యని యర్థాంతరము.) పొసఁగుచుంటఁ=లభించుటచేతనను, రంగశాయి=మాధవరాయనిపుత్త్రిలలోఁ గనిష్ఠుఁడు, రంగశాయికిఁ=రంగనాథస్వామికి, సాటి=సమానుఁడు, ఔఁ=అగును

ఇందు భగవంతుఁ డగురంగనాథునిహస్తమునందు శంఖచక్రములు గలవు. రాజుచేతులయందు వానింబోలినరేఖలు గలవు లక్ష్మియు భూదేవియు రంగనాయకుని భార్యలు గాన నాయనవశమం దుండిరి ప్రభు వగుటచే సంపదయును భూమండలమును రాజునకు వశమయ్యెను రంగస్వామియుఁ గావేరీతీరమున సప్తసాలములమధ్య ను

న్నవాఁడు. ఈరాజును సాటిలేనికోటలో నున్నాఁడు. ఇట్లిద్దఱకును శ్లేషచే సాదృశ్యము చెప్పుటచే శ్లేషప్రతిభోత్థాపితోపమాలంకారము.

క॥ ఆరంగశాయినామక
శౌరికిఁ గోనాంబయందు ♦ జనియించిరి దో
స్సారచణుఁడు రామన్న యు
దారుఁడు నీలాద్రిరాయ ♦ ధరణీపతియున్॥ 35.

ఆరంగశాయినామకశౌరికిన్ = మీఁదఁ జెప్పినరంగశాయి యనుపేరుగలప్రభువునకు, (శౌరి యనుపేరు విష్ణునకుం బ్రసిద్ధము, గాని ప్రభువులాయంశమును ధరించువా రనునభిప్రాయమునఁ గాఁబోలును దెనుఁగుకవులు తఱుచుగ నాపదము వారికి వాడుచున్నారు) దోస్సారచణుఁడు = బాహుబలముచే నిపుణుఁడు, (అయిన) రామన్న, ఉదారుఁడు = దానశీలుఁడు (అగు) నీలాద్రిరాయధరణీపతియున్, గోనాంబయందున్, జనియించిరి = పుట్టిరి.

వ. అందగ్రజుండు.

అందున్ = ఆయిద్దఱిలో, అగ్రజుండు = పెద్దవాఁడు (అగు)

క॥ కాముఁడు రూపంబున బల
రాముఁడు భుజశక్తిఁ బరశు ♦ రాముఁడు దృఢసం
గ్రామమున విజయమున రఘు
రాముఁ డితం డనఁగ రామ ♦ రాయఁడు చెలఁగున్॥ 36.

రామరాయఁడు, ఇతండు = ఈప్రభువు, రూపంబునన్ = చక్కఁదనమునందు (హారాదు లగునలంకారములచే నలంకరింపఁబడకున్న నలంకరింపఁబడినట్లు ప్రకాశించునది రూపము.) కాముఁడు = మన్మథుఁడును, భుజశక్తిన్ = బాహుబలమునందున్, బలరాముఁడు = బలభద్రుఁడును, దృఢసంగ్రామమునన్ = బలమైన యుద్ధమునందు, పరశురాముఁడు = భార్గవరాముఁడును, (ఈయన బ్రాహ్మణుఁడయ్యు నేకనిమిత్తములఁ బెక్కుసారులు రాచవారితో యుద్ధముచేసి జయించె ననిభారతము) విజయమునన్ = పగవారి నమోఘముగ) జయించుటయందు, రఘురాముఁడు, అనఁగన్ = (చూచువారు) అనునట్లు, చెలంగున్ = ప్రకాశించును.

శా॥ తూలించెన్ సమరాంగణంబున రిపు ♦ స్తోమంబులన్ హేతిచేఁ
దోలించెన్ నిజరాజ్యసీమ వెడలం ♦ దుష్టాత్ములం జోరులన్
బాలించెన్ బ్రజలన్ సుధర్మమున సం ♦ పత్సౌఖ్యము ల్వర్ధిలం
దేలించెం బ్రిమదంబునన్ సుజనులన్ ♦ నీలాద్రిరాయం డిలన్॥ 37.

నీలాద్రిరాయండు = రంగశాయి రెండవపుత్త్రుఁడు, సమరాంగణంబునన్ = యుద్ధభూమియందున్, రిపుస్తోమంబులన్ = శత్రుసముదాయములను, హేతిచేన్ = ఆయుధముచె, (ని) హేతిర్జ్వాలాయుధాంశుషు నా నా. తూలించెన్ = తొలఁగఁజేసెను

దుష్టాత్ములన్ = చెడుకార్యములఁజేయుమనసుగలవారిని, చోరులన్ = దొంగలనున్, నిజరాజ్యసీమన్ = తనదేశపుసరిహద్దుగండి, వెడలన్ = వెలుపలికిఁబోవునట్లు, తోలించెన్ = తఱిమించెను, ప్రిజలన్ = జనలను, సంపత్సౌఖ్యముల్ = సంపదయు సుఖమును, వర్ధిలన్ = అధికమగునట్లు, సుధర్మమునన్ = మిక్కిలిన్యాయముతో, పాలించెన్ = రక్షించెను, సుజనులన్ = సత్పురుషులను, ఇలన్ = భూమియందున్, ప్రిమదంబునన్ = సంతోషమునందున్, తేలించెన్ = ఓలలాడించెన

క॥ నరసింహరాయమణికి
న్వరమతి వెంగాంబకును ద ♦ నయు లుదయం బం
దిరి చిన్నశౌరియును సాం
ద్రిరుచులు నీలాద్రిరాయ ♦ రామమహీశుల్॥ 38.

నరసింహరాయమణికిన్ = ముప్పదియాఱవపద్యమునం జెప్పఁబడిన నరసింహప్రభుశ్రేష్ఠునకున్, (ఇది యుపమితసమాసము కాన నిందు మణిశబ్దము శ్రేష్ఠార్థకము.) (ని) సింహ శార్దూల నాగాద్యాః పుంసి శ్రేష్ఠార్థగోచరాః (అ) (ఉత్తరపదములగు సింహశార్దూలాదిపదములు శ్రేష్ఠార్థకము లని యర్థము) వరమతి = మంచిబుద్ధిగల, వెంగాంబకున్ = వెంగమ్మకును, చిన్నశౌరియును, సాంద్రరుచులు = అధికమైనకాంతిగల, నీలాద్రిరాయరామమహీశుల్ = ఈపేరులు గల, తనయుల్ = కొమరులు, ఉదయంబు = పుట్టువున, అందిరి = పొందిరి (జన్మించి రని యర్థము)

గీ॥ తతయశోదాంచితానంద ♦ తనయుఁ డగుచు
సాధుబృందావనహితవ్రి ♦ చార మొసర

లలితవంశకలాపుఁడై ♦ లలిఁ జెలంగెఁ
జిన్నశౌరికిఁ బ్రతియనఁ ♦ జిన్నశౌరి॥ 39.

చిన్నశౌరి = చిన్నప్రభువు, తత. ....తనయుఁడు = తత = అధికమైన, యశః = కీర్తియు, దా = దానమును, (ని) దఃపుంసిదాతరిఛేదేదాస్త్రియాంత్షాంతిదానయోః. నా నా అంచిత = పూజింపఁబడిన, ఆనంద = సంతసమును, తనయుఁడు = కుమారులుం గలవాఁడు, అగుచుఁన్, సాధు.... చారము, సాధు = సత్పురుషులయొక్క, బృంద = సమూహముయొక్క, అవన = రక్షణమునకు, హిత = అనుకూలమైన, ప్రచారము = నడవడి, ఒనరన్ = ఒప్పఁగాన్, లలిత. ...పుఁడై, లలిత = మనోహరమైన, వంశకలాపుఁడు = వంశమునకు భూషణమైనవాఁడు, కలాపో భూషణే బర్హే కాంచ్యాం సంహాతి తూణయోః నా నా ఐ, చిన్నశౌరికిన్ = బాలకృష్ణునకున్, ప్రతియనన్ = సదృశుఁ డనునట్లు, లలిన్ = ఉత్సాహముతోన్, చెలంగెన్ = ప్రకాశించెను

ఇట రాజు బాలకృష్ణునకు సదృశుఁ డనుటచె రాజవిశేషణము లన్నియుఁ గృష్ణునకును శ్లేషచె నన్వయించును గాన నిక్రిందిరీతిని రెండవయర్థము చెప్పవలయును.

తత తనయుఁడు, తత = (అంతటను) వ్యాప్తుఁడును, యశోదాంచిత = యశోద (యనుభార్య) చెనలంకరింపఁబడిన, ఆ = స్థానము, (గృహము) గల (ని) ఆకారస్తుపదేభావేపరితాపేపితామహే నా నా నందతనయుఁడు = నందుఁ డనువానికిఁ గొమారుఁడు, అగుచున్, సధు చారము, సాను = చక్కనిది యగు, బృందావన = తులసీవనమునందు, హిత = అనుకూలమై, ప్రచారము = సంచారము, ఒనరన్ = ఒప్పునట్లుగాన్ (బృంద యనుకన్యకయొక్క శ్మశానమునందలిమృత్తికం బుట్టుటచే దీనికి నీపేరు కలిగె నందురు) లలిత . పుడు, లలిత = మనోహరమైన, వంశ = గానసాధనమైనవేణువును (పిల్లనగ్రోవి) కలాప = నెమలిపురియుం గలవాఁడు (అగు) చిన్నశౌరికిన్ = (అయిన) బాలకృష్ణున కని యన్వయము.

శ్లేషానుప్రాణితోపమాలంకారము.

క॥ నీలాద్రివిభుఁడు భావిత
నీలాద్రివిభుండు భూరి ♦ నిజధైర్యలస
చ్ఛీలాద్రివిభుఁడు సదుదయ
లీలాద్రివిభుండు మహిఁ ద ♦ లిర్చె నధికుఁడై॥ 40.

భావితనీలాద్రివిభుఁడు ; భావిత = ఉపాసింపఁబడిన, నీలాద్రివిభుఁడు = నీలపర్వతమందలిస్వామి గలవాఁడు, ( జగన్నాథస్వామి యని యర్థము ) భూరి......విభుఁడు = భూరి = అధిక మైన, నిజ = తనదియగు, ధైర్య = ధైర్యముచేతనును, లసచ్ఛీల = మంచినడవడిచేతనును, అద్రివిభుండు = మేరువు ( మేరువుం బోలినవాఁడును ), సదు......విభుండు = సదుదయలీలా = మంచియభివృద్ధి యనెడునుదయక్రియచేతను, అద్రివిభుండు = సూర్యుఁడును, ( ప్రతిదినము నుదయము నందుటచే సూర్యుంబోలినవాఁ డని భావము. ఉదయశబ్దమునకు రాజపక్షమున నభివృద్ధి యని యర్థము ) ( ని ) అద్రయో ద్రుమ శైలార్కాః ( అ ) ( అయిన ) నీలాద్రివిభుఁడు = నరసింహరాయని ద్వితీయపుత్త్రుఁడు, అధికుఁడై = గొప్పవాఁడై, మహిన్ = భూమియందు, తలిర్చె = వృద్ధిఁ జెందెను.

క॥ అమితకమలోదయంబై
యమితాబ్జప్రభవ మగుట ♦ నంబుధి దెగడన్
గొమరగిరిపురమునం దటా
కము నీలాద్రిప్రభుండు ♦ ఘనముగ నిలిపెన్॥ 41.

నీలాద్రిప్రభుండు, కొమరగిరిపురమునన్ = కొమరగిరిపట్టణమునందున్, అమితకమలోదయంబై = అమిత = పరిమాణములేని ( అధికమైన ) కమలోదయంబై = పద్మములయుత్పత్తిగలదియై, ( ఉదకములకు వాసస్థాన మని యేని యర్థము ) ( ని ) సలిలం కమలం జలం, సహస్రపత్త్రం కమలం శతపత్త్రం కుశేశయం ( అ ) ( లక్ష్మ్యుత్పత్తి గలదియై యని యర్థాంతరము ) ( ని ) కమలా శ్రీర్హరిప్రియా ( అ ) అమి ........ తము = అమిత = మేరలేని, అబ్జ = తామరపువ్వులకున్, ప్రభవము = ఉత్పత్తిస్థానము. ( చంద్రోత్పత్తిస్థాన మని యర్థాంతరము. ) ( ని ) శంఖేధ్వాంతశాచంద్రే పుంస్యబ్జః క్లీబమంబుజే నా. నా అగుటన్ = కావుటచేత, అంబుధిన్ = సముద్రమును, తెగడన్ = నిరాకరించునట్లు, తటాకము = చెఱువును, ఘనముగన్ = గొప్పగాను, నిలిపెన్ = త్రవ్వించెను.

సముద్రమున నేక కమలోదయ మయ్యెను ( లక్ష్మి యొక్కతెయె పుట్టెను ) ఈరాజు త్రవ్వించినచెఱువునం దనేక కమలోదయ మయ్యెను. ( జలములు పెక్కులుండెను ) మఱియు సముద్రమునం దబ్జశబ్దార్థములు ( చంద్రాదులు ) కొన్నియె పుట్టెను. ఈకాసారమున నవి ( పద్మములు ) పెక్కులు పుట్టెను. కాన నిది సముద్రముం దిరస్కరించుచుండె నని భావము.

ఇందు సముద్రముకంటెం జెలువున నాధిక్యము స్ఫుట మయ్యెం గాన వ్యతిరేకాలంకారము, అది శ్లేషసంకీర్ణము.

క॥ అ న్నీలాద్రిప్రభునకు
సన్నుత సేసాంబయందు ♦ జనియించిరి సం
పన్నులు నరసన్నయు బు
చ్చన్నయు వెంకన్న చిన్న ♦ జనపాలుండ్రుల్॥ **42.**

సన్నుత = స్తోత్రము చేయంబడినది

సంపన్నులు = సంపదగలవారు తక్కినది సుగమము.

చ॥ పొనరం దెనుంగురాయనికిం ♦ బుత్రులు గల్గిరి సేసమాంబయం
దనఘుండు మాధవప్రభుం డ ♦ హార్యసుధైర్యుండు వేంకటప్రభుం
డును ఘనుండైన చిన్ననృపుం ♦ డుల్ సరసుం డగుచంద్రశౌరి జ
గ్గనృపుడు కృష్ణరాయం డధి ♦ కప్రతిభుం డగురంగశాయియుల్॥

తెనుంగురాయనికిన్ = ముప్పదియైదవ పద్యమునం జెప్పంబడిన తెనుంగురాయప్రభువునకున్, పొనరన్ = ఒప్పునట్లుగన్, అనఘుండు = పాపము లేనివాండు, (అగు) మాధవప్రభుండు, అహార్యసుధైర్యుండు = పర్వతముం బోలిన మంచిధైర్యము గలవాండు, (ని) అహార్యధరపర్వతాః (అ) వేంకటప్రభుండును, ఘనుండు = ఉత్తముండు, ఐనచిన్ననృపుండున్, సరసుండు = విద్వాంసుండు, అగుచంద్రశౌరి, జగ్గనృపుండు, కృష్ణరాయండు, అధికప్రతిభుండు = ఎక్కువ బుద్ధి గలవాండు, అగురంగశాయియున్, పుత్రులు = కొమరులు, సేసమాంబయందున్, కల్గిరి = జన్మించిరి

సీ॥ గురవరాయేంద్రున ♦ కిరువురు సతులు భ
ద్రాంబికయును లచ్చ ♦ మాంబ యనంగ
నం దగ్రమహిషికి ♦ నందనుల్ మాధవ
ప్రభుండు లక్ష్మీపతి ♦ రామరాయం
డనంగ ముగ్గురు గల్గి ♦ రాద్వితీయద్వితీ
యకుం గల్గె సుతుండు సీ ♦ తన్న యనంగ

నం దగ్రజుఁడు పాండ ♦ వాగ్రజుఁ డట్లుగ
సత్యధర్మక్షమా ♦ సహితుఁ డగుచు
నవనిఁ గలపద్మనాయకు ♦ లందు నిరుప
మానవిఖ్యాతి నలరారె ♦ మానధనుఁడు
గురవరాయతనూజుండు ♦ సరసవచన
పన్నగవరుండు మాధవ ♦ ప్రభువరుండు॥ 44.

గురవరాయేంద్రునకున్ = గురవరాయప్రభువునకున్, భద్రాంబికయును, లచ్చమాంబ, అనఁగన్ = అనునట్టి, ఇరువురుసతులు = ఇద్దఱు భార్యలు, కలరు = ఉండిరి అందున్ = వారిలో, అగ్రమహిషికిన్ = పెద్దభార్యకున్ (ని) కృతాభిషేకామహిషీ భోగిన్యోన్యానృపస్త్రియః (అ) మాధవప్రభుఁడు, లక్ష్మపతి, రామరాయఁడు, అనఁగన్ = అనునట్టి, మువ్వురు, నందనుల్ = ముగ్గురుతనయులు, కల్గిరి = జన్మించిరి, ఆద్వితీయద్వితీయకున్ = ఆ రెండవ భార్యకున్, సీతన్న, అనఁగన్, సుతుఁడు = పుత్త్రుఁడు, కల్గెన్ = పుట్టెను, అందున్ = ఆ పుత్త్రులలో, అగ్రజుండు = పెద్దవాఁడు, గురవరాయతనూజుండు = గురవప్రభుపుత్త్రుఁడును, (అగు) మాధవప్రభువరుండు, మానధనుఁడు = చిత్తౌన్నత్యమే సొమ్ముగ గలవాఁడును, సరసవచనపన్నగవరుండు = మనోహరమైన మాటలచేత శేషుఁడును, వాగ్ధోరణిచే శేషుం బోలినవాఁడని యర్థము.

పాండవాగ్రజుఁడట్లుగన్ = ధర్మరాజువలె, సత్య ... హితుఁడు, సత్య = నిజముతోడను, ధర్మ = సత్కర్మములతోడను, క్షమ = ఓరుపుతోడను, సహితుఁడు = కూడినవాఁడును, అగుచున్, అవనిన్ = పుడమియందున్, కలపద్మనాయకులందున్ = ఉన్న వెలమవారియందున్, నిరుపమానవిఖ్యాతిన్ = సాటిలేని ప్రసిద్ధితోన్, అలరారెన్ = ప్రకాశించెను

చ॥ అతనికి రంగమాంబకుఁ గు ♦ లాద్రులరీతి జనించి రాత్మజుల్
స్తుతమతి గుర్వశౌరియు య ♦ శోనిధి తిర్మలరాయఁ డార్యస
మ్మతుఁ డగు వెంగళన్న నృప ♦ మాన్యుఁడు రామవిభుండు తిర్మల
క్షితిపతి వేంకటప్రభుఁడు ♦ శ్రీనిధి తిమ్మనృపాలమౌళియున్॥ 45.

అతనికిన్ = ఆమాధవరాయనికిని, రంగమాంబకున్, స్తుతమతి = స్తోత్రము చేయఁబడినబుద్ధిగల, గుర్వశౌరియున్, యశోనిధి = కీర్తికిస్థానము (అగు) తిర్మలరా

యుఁడు, ఆర్యసమ్మతుఁడు = పెద్దలకు నిష్టుఁడు, అగు వెంగళాంబ, నృపమాన్యుఁడు = రాజులకుం బూజ్యుఁడు, (అగు) రామవిభుండు, తిరుమలదేవిపతి, వేంకటప్రభుఁడు, శ్రీనిధి = లక్ష్మికి వాసస్థానమైన, తిమ్మనృపాలమౌళియున్ = తిమ్మరాయశ్రేష్ఠుఁడును, ఆత్మజుల్ = పుత్త్రులు, కులాద్రులరీతిన్ = కులపర్వతములరీతిం బోలినరీతి చేతను, (కులాద్రులవలె నని యర్థము) జనించిరి = పుట్టిరి

గీ॥ అలఘువిభవుఁడు తెనుఁగురా ♦ యనికుమారు
లందు సౌందర్యవిజితార ♦ విందబాణుఁ
డగుచు నకలంకకీర్తిచే ♦ నతిశయిల్లె
మాధవనిభుండు మాధవ ♦ క్ష్మావిభుండు॥ 46.

తెనుంగురాయనికుమారులందున్, మాధవనిభుండు = విష్ణువుతో సదృశుఁడు, మాధవక్ష్మావిభుండు = మాధవభూపాలుఁడు, అలఘువిభవుఁడు = గొప్పసంపద గలవాఁడును, సౌం—ణుఁడు = సౌందర్య = చక్కఁదనముచే, విజిత = జయింపఁబడిన, అరవిందబాణుఁడు = మన్మథుఁడు గలవాఁడును, (అరవిందబాణుఁడు = తామరపూవులు బాణములుగాఁ గలవాఁడు) (శ్లో) అరవిందమశోకం చ చూతం చ నవమల్లికా నీలోత్పలం చ పంచైతే పంచబాణస్య సాయకాః॥ (ఆ) అగుచున్, అకలంకకీర్తిచేన్ = స్వచ్ఛమైనకీర్తిచేన్, అతిశయిల్లెన్ = గొప్పవాఁడయ్యెను.

సీ॥ నాఁడుగా పెనుఁబాఁప ♦ ఱేఁడు చాఁ దలయెత్తి
నిజభోగిస్థభోగ ♦ నిష్ఠుఁ డయ్యె
నాఁడుగా దిక్కరీం ♦ ద్రంబు లిచ్ఛారీతి
నలవశానుగతిచే ♦ మెలఁగుచుండె
నాఁడుగా కూర్మంబు ♦ క్రీడావినోదంబు
గైకొనియెను వృద్ధ ♦ కమఠవిభుఁడు
నాఁడుగా కిటిరాజు ♦ పోఁడిమిఁ దనప్రియు
రాలితో సుఖలీలఁ ♦ దేలుచుండె
ధర్మపరిపాలనమున సం ♦ తసము గలిగి
తనదుభుజపీఠమున వసుం ♦ ధర వహించి

తెనుఁగురాయనిమాధవా ♦ వనివిభుండు
దృఢబలపరాక్రమోన్నతి ♦ నేలుచుండ॥ 47.

తెనుంగురాయనిమాధవావనివిభుండు = తెనుఁగురాయనికిం బుత్త్రుఁడైనమాధవభూపాలుఁడు, తనదుభుజపీఠమునన్ = తనబాహు వనుపీఁటయందున్, వసుంధరన్ = భూమిని, వహించి = ధరించి, ధర్మపరిపాలనమునన్ = న్యాయపరిపాలనచేతను, సంతసము = సంతోషము, కలిగి = పొంది, దృఢ... . . న్నతిన్, దృఢ = అధికమైన, బల = శక్తిచేతనును, పరాక్రమ = శౌర్యముయొక్క, ఉన్నతిన్ = ఆధిక్యముచేతను, ఏలుచుండన్ = (భూమిని) పాలించుచుండఁగాన్, నాఁడుగా = ఆయన రాజైయున్నపుడే కదా, పెనుఁబాఁపఱేఁడు = గొప్పవాఁడగుసర్పరాజు, తాన్ = తాను, తలయెత్తి = శిరసునెత్తి, మున్ను బరువుండుటచే శిరసునెత్తవలనులేదయ్యె ఇప్పుడది లేదు గావున నెత్తెననిభావము నిజ ... ష్ఠుఁడు = నిజ = తనవారైన, భోగిని = నాగకాంతతోడి, భోగనిష్ఠుఁడు = సుఖమునొందుటయందు నాసక్తిగలవాఁడు, అయ్యెన్, నాఁడుగా = అప్పుఁడే కదా, దిక్కరీంద్రంబులు = దిక్కులనందునేనుఁగులు, శ్లో॥ ఐరావతః పుండరీకో వామనః కుముదోంజనః పుష్పదంతస్సార్వభౌమస్సుప్రతీకశ్చదిగ్గజాః॥ అ ఇచ్ఛారీతిన్ = కోరికకుం దగినట్టిరీతిచేత, వశానుగతిచెన్ = వశ = ఆఁడేనుఁగులయొక్క (ని) కరిణీధేనుకావశా (అ) అనుగతిచెన్ = అనుసరించి పోవుటచేన్, మెలఁగుచుండెన్ = సంచరించుచుండెను నాఁడుగా = ఆకాలముననే కదా, వృద్ధకమఠవిభుఁడు = ముదుసలితాబేటిఱేఁడు, కూర్మితోన్ = భార్యతోన్, (ఇష్టముతో ననియు నర్థము) కూర్మిశబ్దమునుమీఁద స్త్రీత్వవివక్షయందు జీప్రత్యయము రాఁగాఁ గూర్మీ యనియును వాక్యము రాఁగాఁ గూర్మి యనియు నిష్పన్నమయ్యె క్రీడావినోదంబు = విహారమందలి వేడుకను, కైకొనియెన్ = పొందెను. నాఁడుగా = ఆకాలమందే, కిటిరాజు = ఆదివరాహమూర్తి, తనప్రియురాలితోన్ = తనభార్యతో, పోఁడిమిన్ = ఎక్కుదనముతో, సుఖలీలన్ = సుఖమైనక్రీడచేతను, తేలుచుండెన్ = తృప్తినొందుచుండెను

శేషుఁడు నాదికూర్మము దిగ్గజములు మొదలగునవి భూమిని మోయుచుండె నని పురాణములు చెప్పుచున్నవి కాఁబట్టి యవి యెల్లకాలము భూమిని వహించుటచే సుఖము చెందుట కవకాశము లేదయ్యె ఇప్పుడీమాధవరాయప్రభువు భూమండలమును దనభుజముమీఁద ధరించుటచే మున్ను భూమిని వహించినవియెల్ల విశ్రాంతి గలిగి సుఖము నొందుచుండె నని తాత్పర్యము ఈప్రభు వెల్లవారికి సుఖము గలుగునట్లు తన బాహుబలమున భూమి నార్జించి న్యాయమునఁ బాలించె ననిఫలితము

క॥ చటులతరవిజయధాటీ
పటుపటహఘుమన్నినాద ♦ పరికంపితది
క్తటకుటిలారిబలుఁడు వేం
కటపతిరాయఁడు దనర్చు ♦ ఘనవిక్రముఁడై॥ 48.

చటుల......బలుఁడు చటులతర = మిక్కిలివడిగల, విజయ = జయార్థమైన, ధాటీ = దాడియందలి, పటు = దృఢమైన, పటహ = తప్పెటలయొక్క, ఘుమన్నినాద = ఘుమఘుమలాడుచున్న ధ్వనిచేతను, పరికంపిత = వణకింపఁబడిన, దిక్తట = దిక్కులయందలి, కుటిల = చెడుస్వభావముగల, అరిబలుఁడు = శత్రువులయొక్క సైన్యములు గలవాఁడు, (అగు) వేంకటపతిరాయఁడు, ఘనవిక్రముఁడై = ఎక్కువ పరాక్రమము గలవాఁడై, తనర్చున్ = ప్రకాశించును.

క॥ క్రొన్నెలకన్నునుబున్నమ
వెన్నెలకన్నునుశరాళి ♦ వెన్నులకన్నన్
వన్నెలఁజెన్నలరారెం
జిన్నారాయాగ్రగణ్యు ♦ చిరకీర్తిధరన్॥ 49.

చిన్నారాయాగ్రగణ్యచిరకీర్తి = శ్రేష్ఠుఁడైనచిన్నారాయనియొక్క శాశ్వతమైనపొగడ్త, ధరన్ = భూమియందున్, క్రొన్నెలకన్నను = క్రొత్త కప్పురముకంటెను, పున్నమవెన్నెలకన్నను = పున్నమనాఁటి చంద్రకాంతికంటెను, శరాళివెన్నులకన్నన్ = రెల్లుగుంపులయొక్క పువ్వులకంటెను, వన్నెలన్ = (తెల్లని) కాంతులతోన్, చెన్నలరారెన్ = ప్రకాశించెను. (వన్నెలచెన్ను = (తెల్లని) కాంతులయొక్కయందముచేతను తృతీయార్థమునఁ బ్రథమ అలరారెన్ = ప్రకాశించె ననియేని చెప్పందగు )

గీ॥ పద్మనాయకసత్కులా ♦ భరణ మగుచు
నిలబుధులఁ బ్రోచి ఖలపఙ్క్తి ♦ గలమదంబు
డిందుపడఁ ద్రుంచి భూజనా ♦ నంద మెసఁగ
రామవిభులీల నేలె నా ♦ రామవిభుఁడు॥ 50.

ఆరామవిభుఁడు = ఆచిన్నారాయనితమ్ముఁడగు రామచంద్రప్రభువు, పద్మనాయకసత్కులాభరణము = వెలమవారికి యగుమంచివంశమున కలంకారము, అగుచున్, బుధులన్ = విద్వాంసులను, ప్రోచి = రక్షించి, ఖలపఙ్క్తి = దుర్జనసముదాయమున, కలమదంబు = ఉన్నగర్వము, డిందుపడన్ = పోవునట్లు, త్రుంచి = సంహరించి, భూజనానందము = భూమియందలి జనులసంతోషము, ఎసఁగన్ = అభివృద్ధి పొందఁగా, రామవిభులీలన్ = దశరథపుత్త్రుఁడగు రామునివిలాసము వంటివిలాసముతో, ఇలన్ = భూమిని, ఏలెన్ = పాలించెను, ఇందు రామునివిలాసము వంటివిలాసముతోఁ బాలించె నని చెప్పుటచేఁ బద్మనాయకాదిపదములు శ్లేషచే రామునకు నన్వయించును

(రాముఁడు) పద్మనాయకసత్కులాభరణము = సూర్యవంశమున కలంకారము, అగుచున్, బుధులన్ = దేవతలను, ప్రోచి = రక్షించి, (ని) స్వాత్పృచాంద్రిసురాం బుధాః (అ) ఖలపఙ్క్తిగలమదంబు = ఖల = జనస్థానవాసి యగు రావణుని సేనానాయకుఁడైన ఖరుఁడను రాక్షసునియొక్కయు, (ఇచ్చట ర, ల, ల కభేదము) పఙ్క్తిగళ = రావణునియొక్కయు, మదంబు = గర్వము, డిందుపడన్ = అణఁగునట్లు, త్రుంచి = వారిద్దఱను సంహారించి, భూజన్ = సీతను, ఆనందము = సంతోషము, ఎసఁగన్ = పొందుచుండఁగా,

ఇలన్ = భూమిని, ఏలెన్ = పాలించెను

మున్ను సూర్యవంశాలంకారమై దేవతల రక్షింప ఖరుఁడు రావణుఁడు మొదలగురక్కసులం జంపి సీత కానంద మతిశయింపఁగా రామవిభుఁడు భూమిం బాలించెను. ఈరామవిభుఁడును వెలమవారికులమున కలంకారమై విద్వాంసుల రక్షించి భూమిజనులకు సంతోషము గల్గ రామునిలీలతోఁ బాలించె ననితాత్పర్యము

శ్లేషాలంకారము

**47** వ పద్యమునం జెప్పఁబడినచంద్రశౌరియే యిచట రామశౌరియని చెప్పఁబడియె ముందుపద్యమునఁ జెప్పఁబడురామచంద్రశౌరియు నీయనయె కావున వెనుకటి చంద్రశబ్దము నిచట రామశబ్దమును గూడ నామైకదేశన్యాయమున రామచంద్రశౌరినే చెప్పుచున్న వని సందర్భమున గ్రహింపం దగును

క॥ ఆరామచంద్రరాయధ
రారమణుని దేవి యింది • రాదేవి యనం
గా రుచిరరూపసంపద

దారగుణకదంబ తిమ్మ ♦ మాంబ చెలంగున్॥ 51.

ఆరామ .. దేవి = పైఁజెప్పఁబడినరామచంద్రభూపాలునిభార్యయు, రుచి .. కదంబ, రుచిర = మనోహరమైన, రూపసంపత్ = ఎక్కువ సౌందర్యముగల, ఉదార గుణకదంబ = గొప్పగుణములసముదాయము గలదియు (అగు) తిమ్మాంబ, ఇందిరా దేవియనంగా = లక్ష్మీదేవివలె, చెలంగున్ = ప్రకాశించును

మ॥ నిరతంబుం గులదైవతం బనుచుఁ గుం ♦ తీమాధవుం గొల్చి సు
స్థిరతం బీఠపురాధిరాజ్యవిలస ♦ త్సింహాసనాధ్యాసియై
కరముల్ మోడ్చుచు మన్నెపుందొరలవ ♦ ర్గంబాజ్ఞలో వర్తిలన్
సిరితో నేలెఁ దెనుంగురాయసుతుఁ డౌ ♦ శ్రీజగ్గరాయం డిలన్॥ 52.

తెనుంగురాయసుతుఁడు = తెనుంగురాయప్రభునికుమారుఁడు, ఔ శ్రీజగ్గరాయండు, నిరతంబు = ఆసక్తికలుగునట్లు, కులదైవతంబు = వంశపరంపరచేఁ బూజింపఁబడు దైవము, అనుచున్, కుంతీమాధవున్ = పీఠికాపురమునందలి కుంతిమాధవస్వామిని, (ఈ స్వామి కుంతి యనునింతిచేఁ బ్రతిష్ఠితుఁడు గాన నీపేరు గలిగె నందురు) కొల్చి = సేవించి, సుస్థిరతన్ = మిక్కిలిస్థైర్యముతో, పీఠ .. ధ్యాసియై, పీఠపుర = పీఠికాపుర సంబంధమైన, అధి = అధికమైన, రాజ్య = ప్రభుత్వముయొక్క, విలసత్ = ప్రకాశించుచున్న, సింహాసన = సింగపుగద్దెను, అధ్యాసియై = ఎక్కినవాఁడై, మన్నెపుందొరలవర్గంబు = (సన్మానించి తా నిచ్చినభూభాగముల ననుభవించువారిసముదాయము) కరములు = హస్తములను, మోడ్చుచున్ = ముకుళించుచున్, దోసి లొగ్గి యనియర్థము. ఆజ్ఞలోన్ = (తన) ఆనతియందు, వర్తిలన్ = మెలఁగుచుండఁగాను, సిరితోన్ = సంపదతో, ఇలన్ = భూమిని, ఏలెన్ = పాలించెను.

సీ॥ అలికాక్షుకను వెచ్చ ♦ నంటనిరతిరాజు
గురుశాప మొందని ♦ కువలయాప్తుఁ
డవిలోనఁ దొడరి బొం ♦ కనిధర్మజుం డబ్ధి
లోన మునుఁగనిమం ♦ థానశిఖరి
కుంఠమార్పుగ నిచ్చు ♦ కొనని కానీనుండు
బంధనం బొందని ♦ సింధురాజు

స్వారాజ్యభోగంబు ♦ వాయనిసురభర్త
షండభావంబు గాం ♦ చనికిరీటి
చారురూపకళాసత్య ♦ ధీరభావ
వితరణగభీరతాభోగ ♦ విక్రమముల
నీతఁ డన భూతలమున వి ♦ ఖ్యాతిఁ గాంచెఁ
దెనుఁగురాయనికృష్ణరా ♦ యనృపమౌళి॥ 53.

తెనుఁగురాయనికృష్ణరాయనృపమౌళి = తెనుఁగురాయనియనువాఁ డగుకృష్ణరాయప్రభుశ్రేష్ఠుఁడు, చారు. . . విక్రమములన్ = చారురూప = సుందర మైనయాకారముచేతను, కళా = విద్యలచేతను, సత్య = నిజము (పల్కుట) చేతను, ధీరభావ = బుద్ధిస్థైర్యముచేతను, వితరణ = దానముచేతను, గంభీరత = గాంభీర్యముచేతనును, (సుఖదుఃఖములం దెలుపునికారములు లేకుండుట) భోగ = సుఖానుభవముచేతను, విక్రమములన్ = పరాక్రమముచేతను, ఈతఁడు = ఈకృష్ణరాయప్రభువు, (వరుసగా) అలికాక్షుకనువెచ్చన్ = శివునికంటివెట్టను, అంటనిరతిరాజు = స్పృశింపనిమన్మథుఁడును, గురుశాపము = ఒజ్జ యైనబృహస్పతివలనిశాపమును, ఒందనికువలయాప్తుఁడు = పొందనిచంద్రుఁడును, అనిలోనన్ = యుద్ధమునందున్, తొడరి = యత్నించి, బొంకనిధర్మజుండు = అసృతమాడని ధర్మరాజును, అబ్ధిలోన్ = సాగరమునందున్, మునుఁగనిమంధానశిఖరి = మునుఁగనికవ్వపుఁగొండయు, కుండమార్పుగన్ = ఒకటిఁ బుచ్చికొని మఱియొకటిచ్చుట యగునట్లు, ఇచ్చుకొననికానీనుండు = దానముచేయని కర్ణుఁడును, (కన్నెకొడుకు కానీనుఁడు) (ని) కానీనఃకన్యకాజాతః (అ) బంధనంబు = కట్టును, (సేతువు) ఒందనిసింధురాజు = పొందనిసముద్రుఁడు, స్వారాజ్యభోగంబు = స్వర్గసంబంధమైన సుఖమున, పాయనిసురభర్త = విడువనియింద్రుఁడు, షండభావంబు = నపుంసకత్వమును, కాంచనికిరీటి = అనుభవింపనియర్జునుఁడును, అనన్ = అనునట్లు, భూతలంబునన్ = భూమియందు, ప్రఖ్యాతిన్ = ప్రసిద్ధిని, కాంచెన్ = పొందెను.

మన్మథుఁడు మిగులఁజక్కనివాఁడ కాని మున్ను దేవతలప్రార్థనచే నీశ్వరునకుఁ బార్వతిం గూర్ప యత్నించి నపు డాయననేత్రాగ్నిచేఁ గాల్పఁబడెను చంద్రునకుఁ గళాసమృద్ధి కలదు, గాని యొకనిమిత్తముచేఁ గురుశాపము నొందెను. ధర్మరాజు సత్యము పల్కువాఁడె కాని యుద్ధమున నొకపుడు గురునితో నసృత మాడెను. మందరపర్వతము స్థిరమైనదే కాని సముద్రమును మథించు నపు డది మునిఁగెను. దానము

నం గర్ణుఁడు మిగులఁ బ్రసిద్ధుఁడె కాని యింద్రునకుఁ దన కుండలము లిచ్చినపుడు దా తనివలన శక్తిం గొని మఱి యిచ్చెను సముద్రుఁడు మిగుల గంభీరుఁడు, (అతనిలోతు దేవారు నెఱుఁగరనిభావము) గాని లంకాప్రయాణమున రామునిచే బంధింపఁబడెను ఇంద్రుఁడు మిగుల సుఖానుభవము గలవాఁడె కాని వృత్రాసురుని జంపినపుడు స్వర్గపదమునుండి భ్రష్టుఁ డాయెను అర్జునుఁడు మిగులఁ బరాక్రమవంతుఁ డైనను స్వర్గమున నున్నపుడు ఊర్వశి యిచ్చినశాపమునఁ గొంతకాలము నపుంసకుఁ డయ్యెను. ఇట్లు పైవారియందు గుణములు దోషములు కలసి యుండెను. మన్మథుఁడు మొదలగువారి యందుఁ గలచక్కఁదనము మొదలగునవి యీరాజునందును గలవు, గాని వారియందుఁ గలదోషములు లేవని తాత్పర్యము.

ఇందు రాజునకును మన్మథుఁడు మొదలగువారికిని జక్కఁదనము మొదలగువానిచే సామ్యమును, శివునికంటెమంట నంటమి మొదలైనవానిచే వైలక్షణ్యమును స్ఫుటమయ్యెం గాన వ్యతిరేకాలంకారము

గీ॥ అమరఝరి నిందునందుల ♦ నపహసించె
రహిఁ దెనుఁగురాయసుతుఁ డగు ♦ రంగశాయి
నరవరునికీర్తి తద్ధైర్య ♦ గరిమ గెలిచె
సవివరము తత్ప్రతాప మ ♦ య్యవిని మించె॥ 54.

తెనుఁగురాయసుతుఁడు = తెనుఁగురాయనికిఁ బుత్రుఁడు, అగు రంగశాయినరవరుకీర్తి = అంగరంగరాయప్రభువు యొక్క యశము, అమరఝరిన్ = ఆకాశగంగను, ఇందునందులన్ = చంద్రునిని, (శివుని వాహనమైన) వృషభమునును, రహిన్ = బాగుగాను, గెలిచెన్ = జయించెను (మిగుల స్వచ్ఛమైన కీర్తి గలవాఁడనియర్థము) తద్ధైర్యగరిమ = ఆయన ధైర్యముయొక్క గొప్పతనము, అగపతిన్ = (పర్వతములలో శ్రేష్ఠమైనదానిని) మేరుపర్వతమునను, తత్ప్రతాపము = ఆయన తేజము, అయ్యవిన్ = (ఆ + అవి అయ్యవి) ప్రసిద్ధుఁడగుసూర్యునిని, మించెన్ = అతిశయించెను (ని) అవయశ్శైలమేషాగ్నాః (అ) (ధైర్యముచే మేరువును, ప్రతాపముచే సూర్యుని నీప్రభువు జయించె నని యర్థము.)

క॥ వారలలోపల సగరిజుఁ
డై రాజిలుచున్న మాధ ♦ వాధిపునకుఁ దే

వేరులు సిరిధరణియుఁబలె
నైరొగి జానకియుఁ గోన ♦ మాంబామణియున్॥ 55.

వారలలోపలన్ = పైఁజెప్పిన తెనుఁగురాయని పుత్త్రిలలో, అగ్రజుఁడు = పెద్ద వాఁడు, ఐ, రాజిలుచున్న మాధవాధిపునకున్ = ప్రకాశించు మాధవరాయప్రభువునకు, (మాధవాధిపునకున్ = విష్ణునకున్) సిరిధరణియుఁబలెన్ = లక్ష్మీదేవివలెను, భూదేవి వలెను, జానకియున్, గోనమాంబామణియున్, దేవేరులు = భార్యలు, ఒగిన్ = క్రమముగా, ఐరి,

ఉపమాలంకారము

చ॥ అతనికి జానకీతరుణి ♦ యందు జనించెఁ దెనుంగురాయభూ
పతి రహిఁ గోనమాంబ యను ♦ భామినియందు జనార్దనాహ్వయ
క్షితిపతి పుట్టె నందుఁ జర ♦ కీర్తియు సద్ద్విజదైవభక్తియ
ద్భుతభుజశక్తి ధర్మరతిఁ ♦ బూనెఁ దెనుంగునృపాలుఁ డున్నతిన్॥

అతనికిన్ = ఆమాధవరాయప్రభువునకున్, జానకీతరుణియందున్ = జానకి యను భార్యయందున్, రహిన్ = బాగుగాను, తెనుంగురాయభూపతి, జనించెన్ = పుట్టెను. గోనమాంబ యనుభామినియందున్ = గోనమ్మ యనుభార్యయందున్, జనార్దనాహ్వయక్షితిపతి = జనార్దనుఁ డను పేరు గలప్రభువు, పుట్టెన్, అందున్ = ఆయిద్దఱిలోన్, తెనుంగునృపాలుఁడు, చిరకీర్తియున్ = స్థిరమైన పొగడికయును, సద్ద్విజదైవభక్తి = మంచిబ్రాహ్మణులందు దేవతలందు ననురాగమును, అద్భుతభుజశక్తి = ఆశ్చర్యకరమైన బాహుబలమును, ధర్మరతిన్ = సత్కార్యములయందాసక్తిని, ఉన్నతిన్ = గొప్పతనముతో, పూనెన్ = ధరించెను

ఆమాధవరాయునికిఁ బెద్దభార్యయం దొకకొమరుఁడును రెండవభార్యయం దొక కొమరుఁడును గలిగిరనియు నందుఁ బెద్దకుమారుఁడు కీర్తియు దేవబ్రాహ్మణభక్తియుఁ గల్గి ధర్మాసక్తుఁడై వర్తిల్లె ననియుం దాత్పర్యము

మ॥ రణకోలాహలగర్జితాహితభటా ♦ భ్రశ్రేణిఝంఝాప్రసా
రణమై వైరిసగంధసింధురధరా ♦ ధ్రధ్వంసదంభోళిజృం
భణమై ద్విడ్ఢహరాభిమానతిమిర ♦ బ్రధ్నప్రచండోస్రరిం
ఖణమై యొప్పుజనార్దనాధిపభుజా ♦ గ్రస్థాగ్రిఖడ్గం బనిన్॥ 57.

జనార్దన ఖడ్గంబు = జనార్దననాథిప = జనార్దనుఁ డను పేరుగల ప్రభువుయొక్క, భుజాగ్ర = చేతియందు, స్థ = ఉన్న, ఉగ్ర = భయంకరమైన, ఖడ్గంబు = కత్తి, అనిన్ = యుద్ధమునందున్, రణ . ప్రసారణము, రణ = యుద్ధమునందు, కోలావాల = కేకల నెడు, గర్జిత = ఉఱుములుగల, అహితభట = శత్రుసైనికుల నెడు, అభ్ర = మేఘములయొక్క, శ్రేణి = సముదాయమునకున్, ఝంఝూప్రసారణము = గాలియొక్క సంచారము, ఐ, వైరి ... జృంభణము, వైరి = పగవారియొక్క, సగంధ = మదముతోఁ గూడిన, సింధుర = గజముల నెడు, ధరాధ్ర = పర్వతములయొక్క, ధ్వంస = నాశము చేయుటయందు, దంభోళిజృంభణము = వజ్రాయుధవిలాసము, ఐ, ద్విడ్దుహా... ఖణమై, ద్విట్ = విరోధులయొక్క, దుహా = హృదయమునందలి, అభిమాన = గర్వమ నెడు, ( బలైశ్వర్యాదులచేఁ దాను గొప్పవాఁడ ననుకొనుట గర్వము ) తిమిర = అంధకారమునకు, బ్రధ్న = సూర్యునియొక్క, ప్రచండ = తీక్ష్ణమైన, ఉగ్ర = కిరణముల యొక్క, రింఖణమై = ప్రసారమై, ఒప్పున్ = ప్రకాశించును

మాధవరాయనిద్వితీయపుత్త్రుఁ డగుజనార్దనరాయునిఖడ్గము యుద్ధమునందుఁ గేకలనుఉఱుములు గలపగవారిబంట్లను వాయువు మేఘములంబోలెఁ గదిమె ననియును శత్రులమదగజములను వజ్రము కొండలంబోలె నశింపఁజేసె ననియును పగవారిగర్వమును సూర్యకాంతి చీఁకటింబోలె నివారించె ననియుఁ దాత్పర్యము

ఇందు ఖడ్గమునందు వాయుత్వము మొదలైన వానిఁ నారోపించుటకు శత్రువుల నుండు మేఘత్వారోపణము మొదలగునవి కారణము లగుటచే మాలారూపమైన పరంపరితరూపకాలంకారము

క॥ హరిశౌర్యుఁ డాజనార్దన
ధరణీపతి గనియె సుతుల ♦ ధర్మాంబికయం
దురువిభవజిష్ణు విష్ణు
వరు వేంకటకృష్ణరాయ ♦ వసుధారమణున్॥ 58.

హరిశౌర్యుఁడు = సింహపరాక్రమముగలవాఁడు, ( ని ) యమానిలేంద్రచంద్రార్క విష్ణుసింహాంశువాజిషు శుకాహికపిభేకేషు హరిర్నా కపిలేత్రిషు ( అ ) ఆజనార్దన ధరణీపతి = ఆజనార్దనప్రభువు, ధర్మాంబికయందున్, ఉరువిభవజిష్ణున్, ఉరువిభవ = గొప్ప యైశ్వర్యముచేతను, జిష్ణున్ = ఇంద్రుని ( బోలినవానిని ) విష్ణువరున్ = విష్ణురాయనిని, వేంకటకృష్ణరాయవసుధారమణున్ = వేంకటకృష్ణరాయఁ డను పేరు గల పుడమి ఱేనినిని, సుతులన్ = కుమారులను, కనియెన్

క॥ ఆ రామచంద్రరాయ
క్ష్మారమణుఁడు తిమ్మమాంబి ♦ కారత్నమునం
దారూఢయశుని మాధవ
భూరమణుని నారసింహ ♦ భూవిభుఁ గనియెన్॥ 59.

ఆ రామచంద్రరాయక్ష్మారమణుఁడు = ఆరామచంద్రరాయప్రభువు, తిమ్మాంబికారత్నమునందున్ = శ్రేష్ఠురాలగు తిమ్మాంబయందున్, ఆరూఢయశునిన్ = ప్రసిద్ధమైనకీర్తిగల, మాధవభూరమణున్ = మాధవరాయనిని, నరసింహభూవిభున్ = నరసింహరాయనిని, కనియెన్.

సీ॥ రామచంద్రావని ♦ రమణున కనుజుఁడై
పరఁగుకృష్ణారాయ ♦ నరవరుండు
సర్వమాంబికయందుఁ ♦ జతురుల వేంకట
రాయవిభుఁ దెనుంగు ♦ రాయఘనుని
గనియె నం దగ్రజుం ♦ డనుపమబలధైర్య
శౌర్యగాంభీర్య సౌం ♦ దర్యకలితుఁ
డగుచు సద్ధిజనాళి ♦ కమరభూజంబన
దాతృత్వమహిమ వి ♦ ఖ్యాతిఁ గాంచె
రెండవకుమారుఁ డలరెను ♦ ద్దండకీర్తి
రెండవ కుమారుఁ డనఁగఁ గో ♦ దండముక్త
చండకాండప్రకాండవి ♦ ఖండితారి
మండలుం డిద్ధవైభవా ♦ ఖండలుండు॥ 60.

రామచంద్రావనీరమణునకున్ = రామచంద్రనామము గలప్రభువునకున్, అనుజుఁడు = తమ్ముఁడు, ఐ, పరఁగుకృష్ణారాయనరవరుఁడు = ఒప్పెడుకృష్ణరాయప్రభువు, సర్వమాంబికయందున్, చతురులన్ = నేర్పరులను, వేంకటరాయవిభునిన్, తెనుంగురాయఘనునిన్, కనియెన్, అందున్ = ఆయిద్దఱిలో, అగ్రజుండు = జ్యేష్ఠుఁడు, అనుపమ.... కలితుఁడు, అనుపమ = సాటిలేని, బల = శరీరశక్తితోడను, శౌర్య = పరాక్రమముతోడను, గాంభీర్య = గంభీరతతోడను, సౌందర్య = చక్కఁదనముతోడను,

కలితుఁడు = కూడుకొన్నవాఁడు, అగుచున్, అర్థిజనాళికిన్ = యాచకజనసముదాయమునకున్, కల్పభూజంబునన్ = కల్పవృక్షమునునట్లు, దాతృత్వమహిమన్ = దానముయొక్క గొప్పతనముచేతన్, విఖ్యాతిన్ = ప్రసిద్ధిని, కాంచెన్ = పొందెను రెండవకుమారుఁడు, కోదండ . . . మండలుండు, కోదండ = ధనుస్సునుండి, ముక్త = విడువఁబడిన, చండ = తీక్ష్ణమైన, కాండప్రకాండ = ప్రశస్తమైనబాణములచేతను, విఖండిత = ముక్కలు చేయఁబడిన, అరిమండలుండు = శత్రుసముదాయము గలవాఁడును, ఇద్ధ .. ఖండలుండు, ఇద్ధ = దీప్తమైన, వైభవ = సంపదచేత, ఆఖండలుండు = ఇంద్రుఁడును, (ఇంద్రుంబోలినవాఁడనియర్థము) (అయి) ఉద్దండశక్తిన్ = గొప్పశక్తిచేతను, (శక్తి కుమారస్వామియాయుధమును, శరీరబలమును) రెండవకుమారుఁడనఁగన్ = మఱియొకకుమారస్వామివలె, అలరెన్ = ప్రకాశించెను

ఉపమాలంకారము

క॥ ఆరామచంద్రరాయకు
మారులు సమరమున హరికు ♦ మారులు లీలన్
మారులు చిరభూతిం గా
మారులు దానమున రవికు ♦ మారు లరయఁగాన్॥

ఆరామచంద్రరాయకుమారులు, అరయఁగాన్ = ఆలోచింపఁగాన్, సమరమునన్ = పోరియందున్, హరికుమారులు = అర్జునులు, (సింహపుఁబిల్ల లనియేని యర్థము) లీలన్ = విలాసములందున్, మారులు = మన్మథులు, చిరభూతిన్ = శాశ్వతైశ్వర్యమునందున్, కామారులు = శివులు, దానమునన్ = ఈవియందున్, రవికుమారులు = కర్ణులు, (అగుదురు) ఉల్లేఖాలంకారము

వ అందు

సీ॥ ఉరమందుఁ జేర్పక ♦ చరమాంగమునఁ జెర్పు
కొనుచల్లదాసరిఁ ♦ గూడ నేల
బహుమదోన్మత్తతఁ ♦ బ్రబలి మే నెఱుఁగని
యాశాంతకరులన ♦ ఖ్యాం బ దేల
పటుభోగినులఁ గూడి ♦ కుటిలవృత్తిఁ జరించు
నలభుజగాధిపు ♦ చెలిమి యేల

కదలలేక మహాశ్మ ♦ హృదయాప్తి జడతఁగై
కొనుసహార్యాళితో ♦ నెనయ నేల
యనుచుఁ గమఠహరిద్విర ♦ దాధినాథ
కులగిరులకూటములు రోసి ♦ లలితరాగ
సుగుణసద్వృత్తవిమలాత్మ ♦ శోభి నూధ
వాధవుభుజంబున వసించె ♦ నవనికాంత॥ 62.

అవనికాంత = భూమి యనుస్త్రీ, ఉరమునందున్ = భుజమధ్యమునందున్, చెర్పక = గూర్పక నురమూఁగిమునన్ = వీఁపునందన్, చేర్చుకొనునల్లదాసరిన్ = ధరించెడుతాఁబేటివానిని, కూడన్ = కలియుట, ఏల = ఎందులకున్, నల్లని దాసరివాని నని యునర్థము (వక్షమిచ్చి యాలింగనము చేసికొనక వీఁపున నెక్కించుకొనినవానిం గూడినఁ బ్రయోజనము లేదనియర్థము) ఆదికూర్మము వీఁపున భూమిని ధరించు నని భావము. బహుమదోన్మత్తతన్ = బహు = అధికమైన, మద = క్రొవ్వునెడు, (గర్వమనియు నర్థము) ఉన్మత్తతన్ = వెఱ్ఱిచేతను, ప్రబలి = అతిశయించి, మేను = శరీరమును, ఎఱుఁగని = తెలియని, ఆశాంతకరుల = దిగ్గజము లనునాశావిఘాతుకులయొక్క, (ఆశ = దిక్కు, కోర్కి) సఖ్యంబు = చెలిమి, అది = ఆసఖ్యము, ఏల = ఎందునకున్, (ఉపయోగించును) (గర్వముచే నొడలెఱుఁగక యాశానాశము చేయువారిమైత్రివలనం బ్రయోజనము లేదనియర్థము) మదముచే మేనెఱుఁగక యెక్కుడవైయున్న దిగ్గజములచెలిమి నిష్ప్రయోజన మనిభావము పటుభోగినులన్ = పటు = నేర్పుఁగత్తెలగు, భోగినులన్ = నాగకాంత లనెడుభోగస్త్రీలను, (వేశ్యలను) కూడి = కలసికొని, కుటిలవృత్తిన్ = వంకరనడక లనెడుచెడునడవడిచేతను, చరించు
చెలిమి, చరించు = సంచరించెడు, అల = ప్రసిద్ధుఁడైన, భుజంగాధిపు = శేషుఁడనువిటకానియొక్క, చెలిమి = స్నేహము, ఏల = ఏమి లాభ మిచ్చును (వేశ్యలం గూడి చెడునడవడి గలవిటకాండ్రచెలిమి గూడ దనియర్థము) నాగకాంతలం గూడువక్రగతి గలశేషునిచెలిమి యుక్తము గాదనిభావము. కదలలేక = సంచరించుశక్తి లేక, మహాశ్మహృదయాప్తిన్ = మహత్ = గొప్పలగు, అశ్మ = రాలవంటి (రాలనెడుననియు నర్థము) హృదయాప్తిన్ = మనసు గలుగుటచేతను, జడతన్ = కదలలేమి యనుమొఱకుఁదనమును, కైకొనుసహార్యాళితోన్ = కైకొను = గ్రహించెడు, అహార్యాళితోన్ = పర్వతసముదాయముతోన్, ఎనయన్ = పొందియుండుట, ఏల = ఎందునకు, (కదలఁ

దగినశరీరశక్తి లేనికరినహృదయు లగుమూర్ఖులనెయ్యము తగ దనియర్థము ) స్థావరము లగుపర్వతములతో సంబంధము తగ దనిభావము అనుచుఁ = ఇట్లూహించుచు, కమఠ......కూటములు = కమఠ = కూర్మముయొక్కయు, హరి = సర్పరాజుయొక్కయు, ద్విరదాధిపాథ = ఏనుఁగులయొక్కయు, కులగిరుల = కులపర్వతములయొక్కయు, కూటములు = స్నేహములను, రోసి = విడిచి, లలిత ...భుజంబునన్ = లలిత = మనోహరుఁడును, రాగ = ప్రేమచేతను, సుగుణ = మంచిగుణములచేతను, సద్వృత్తి = మంచినడవడిచేతను, విమలాత్మ = నిర్మల మైనమనసుచేతను, శోభి = ప్రకాశించెడు, మాధవాధిపు = మాధవరాయప్రభువుయొక్క, భుజంబునన్ = భుజమునందున్, వసించెన్ = నిల్చెను

కూర్మము రాగిల్లక విముఖమయ్యెను ( ఆశాంతకరు లాశాంతకరులు. దిగ్గజములాశావిఘాతము చేయునవి. ) శేషుఁడు కుటిలవృత్తి కలవాఁడు పర్వతములు మిగులం గఠినములు కావున భూకాంత వానినెయ్యమును రోసి తనయందు రాగము, మంచిగుణములు సత్ప్రవర్తనము, మంచిమనసుఁ గలమనోహరుఁ డైనయారాజుయొక్క చేతియందు వసించె ననితాత్పర్యము

శ్లిష్టరూపకానుప్రాణితవ్యతిరేకాలంకారము

క॥ సరసాలంకారధ్వని
భరితాంధ్రవచోవిలాస ♦ వాసవదత్తా
పరిణయకృతికిం బతియై
వరకీర్తి వహించె మాధవ ♦ ప్రభుఁ డుర్విన్॥ 63.

మాధవప్రభుఁడు, సరసా .. కృతికిన్ = సరస = శృంగారాదిరసములతోడను, అలంకార = ఉపమాద్యలంకారములతోడను, ధ్వని = వ్యంగ్యార్థముతోడను, భరిత = నింపఁబడిన, ఆంధ్రవచోవిలాస = తెలుఁగుపదములసొగసుగల, వాసవదత్తాపరిణయకృతికిన్ = వాసవదత్తాపరిణయ మనుగ్రంథమునకున్, పతియై = నాయకుఁడై, ఉర్విన్ = భూమియందున్, వరకీర్తిన్ = మంచియశమును, వహించెన్ = సంపాదించెను.

ఈప్రభువు సంస్కృతమున సుబంధు వనుకవి రచించినవాసవదత్త ( వాసవదత్త యనుస్త్రీయొక్కవివాహాదులను వర్ణించుప్రబంధము ) యనుగద్యకావ్యమును దెనిఁగింపఁ జేసి దానికిం గృతినాయకుఁ డయ్యె ననియర్థము.

చ॥ లలి మెఱుఁగొప్పుకొప్పు చప ♦ లాలతఁ గెల్వఁగ నోపురూపు మేల్
చెలువముఁ బూనుకొను గడుఁ ♦ జెన్నగుకన్నులు దూపుఁజూపులుం
గలిగి లసద్గుణంబు నెసఁ ♦ గన్ నరసింహనృపాలుమూఁపునం
దలరుధనుర్మతల్లిక భు ♦ జాశ్రిత యాజయలక్ష్మికైవడిన్॥ 64

ధనుర్మతల్లిక = శ్రేష్ఠమైనధనువు, (ని) మతల్లికామచర్చికాప్రకాండముద్ఘతల్లజౌ (అ) మెఱుఁగొప్పుకొప్పు = (తళతళలాడుకాంతిచే) మనోహరమగునగ్రభాగముగలకేశపాశమును, (ని) కొప్పుఁ దగుఁజాపాగ్రము నొప్పగుధమ్మిల్లమును ఆం స చపలాలతన్ = మెఱుపుఁదీవను, గెల్వఁగన్ = జయించుటను, ఓపురూపు = తగినయాకారమును, ఇచట వృద్ధభూర్త్యాదిశబ్దము లకారాంతము లయ్యును దెలుఁగన నుకారాంతములుగ నైకము వ్యవహరింపఁబడునని యాథర్వణుఁడు చెప్పుటచే రూపశబ్ద ముకారాంత మయ్యెను

మేల్చెలువముకన్ = ఎక్కువ యందమును, పూనుకొను = ధరించుచుంటినదు మనెడునడుమును, కడున్ = మిక్కిలి, చెన్నగుకన్నులు = మనోహరము లగుగనుపులక్రిందిగుంట లనెడునేత్రములును, దూపుఁజూపులున్ = బాణము లనెడుదృష్టిప్రసారములను, కలిగి = పొంది, కలుగుధాతు విట సకర్మకము లసద్గుణంబును = ప్రకాశించునారి యనుసద్గుణము, ఎసఁగన్ = శోభిల్లఁగా, భుజా కైవడిన్ = భుజాశ్రిత = బాహుపరాక్రమము నాశ్రయించినది, ఆజయలక్ష్మికైవడిన్ = అగుజయలక్ష్మివలె, నరసింహనృపాలుమూఁపునందున్ = నరసింహప్రభునిబుజమునందు, అలరున్ = ప్రకాశించును శ్లిష్టరూపకాలంకారము

జయలక్ష్మి యాయనబాహుపరాక్రమము నాశ్రయించి యాతనియొద్ద నుండెననియు దానికి మూలమైనధనువు పరాక్రమమును దెలుపుచు బుజమున వ్రేలుచుండెననియుం దాత్పర్యము

చ॥ అతులితధైర్యమేరునగ ♦ మై జనియించె నృసింహశౌరికిన్
వితతయశోధురంధరుఁడు ♦ వేంకటరాయఁడు శౌర్యసూర్యసం
హృతకిత వాహితప్రతత ♦ హృత్కుహరాంచదఖర్వగర్వగా
ఢతమతమస్సమాజుఁడు దృ ♦ ఢపత్రిభుజుం డతఁ డేలె ధారుణిన్॥

నృసింహశౌరికిన్ = వీరుఁడగు నరసింహప్రభువునకున్, వితతయశోగంధుఁడు, వితత = అంతటను వ్యాప్తమైన, యశః = కీర్తియొక్క, గంధుఁడు = లేశమును వహించినవాఁడు, కీర్తిమంతుఁ డనియర్థము వేంకటరాయఁడు, అతులితధైర్యనగమై = అతులిత = సాటిలేని, ధైర్య = ధీరతచేత ( మనస్థైర్యముచేత ) మేరునగమై = మేరుపర్వతమై, జనించెన్ = పుట్టెను శౌర్యసూర్యసంహృతకితవాహితప్రతతవ్యాపృతఖర్వగర్వగాఢతమస్సమాజుఁడు, శౌర్య = పరాక్రమము నెడు, సూర్య = సూర్యునిచే, సంహృత = నశింపఁజేయఁబడిన, కితవ = కపటులగు, అహిత = శత్రువులయొక్క, ప్రతత = అధికమైన, వ్యాపృతస్మయ = వ్యాపకయగు గాయాందు, అంచత్ = ఒప్పుచున్న, అఖర్వ = విస్తారమైన, గర్వ = దర్పము నెడు, గాఢిత = మిక్కిలి దట్టమైన, తమస్సమాజుఁడు = చీఁకట్లసముదాయము గలవాఁడు, ( సూర్యుఁ డంధకారముం బోఁగొట్టునట్టే రాజు శత్రువులగర్వముం బోఁగొట్టు నని భావము ) దృఢప్రతిభుఁడు = ఎక్కువ ప్రజ్ఞగలవాఁడును, ( అగు ) అతఁడు = ఆ వేంకటరాయఁడు, ధారుణిన్ = భూమిని, ఏలెన్ = ( తండ్రియనంతరము ) పాలించెను రూపకాలంకారము

సీ॥ ఆతం డపుత్త్రికుం ♦ డగుట నప్పిమ్మటఁ
దత్పితామహునిపి ♦ తండ్రి యైన
పూర్వోక్తనరసింహ ♦ భూవిభునకు ద్వితీ
యాత్మజుం డైనసీ ♦ తాద్రినృపుని
రెండవపుత్త్రుం డ ♦ ఖండితమిత్త్రుం డు
దండితశత్రుం డ ♦ ఖండశౌర్యుఁ
డఖిలార్థిజనులకు ♦ నసమానగోదానధనుఁ
డనుపమవిభవుండు ♦ వినుతధైర్యుఁ
డగుమ ధ్యార్జునుండు ♦ లలితముగాఁ
బ్రజలు సుఖియింప విబుధ ♦ సన్మను లుబ్బఁ
జెనఁటులు వడలఁ రాజ్యపా ♦ లనము చేసె
హరినిభుం డౌర! బుచ్చనా ♦ హ్వయవిభుండు॥ 66.

ఆతండు = వేంకటరాయప్రభువు, అపుత్త్రికుండు = కొడుకులు లేనివాఁడు, అగుటన్ = కావుటచేత, అప్పిమ్మటన్ = అతనియనంతరకాలమున, తత్పితామహుపినతండ్రి = అతనితాతతండ్రికిందమ్ముఁడు, ఐనపూర్వోక్తనరసింహభూవిభునకున్ = మునుపటిరెండవ

పద్యమునం జెప్పఁబడిన నరసింహాప్రభునకున్, ద్వితీయాత్మజుండు = రెండవపుత్త్రుఁడు, ఐననీలాద్రిక్ష్మాపునిరెండవపుత్త్రుండు = నలువదియాఱవపద్యమునం జెప్పఁబడిననీలాద్రిప్రభువునకు రెండవకుమారుఁడు, బుచ్చనాహ్వయవిభుండు = బుచ్చన యను పేరుగలప్రభువు, పండితమిత్రుండు = విద్వాంసులకు నెయ్యుఁడును, దండితశత్రుండు = శిక్షింపఁబడినశత్త్రువులు గలవాఁడు, ( ఎవ్వనిచే శత్రులు దండితులో యతఁడు దండితశత్రుఁడు. ) అఖండశౌర్యుఁడు = అధికమైన పరాక్రమము కలవాఁడును, ( ఎవ్వని కఖండమైన శౌర్యము కలదో యతఁ డఖండశౌర్యుఁడు ) అఖిలార్థిజనులకున్ = ఎల్లయాచకులకును, అమరభూరుహనిభుండు = కల్పవృక్షముతో సమానుఁడును, ( అమర = దేవతలయొక్క, భూరుహము = వృక్షము ) వాకినిభుండు = విష్ణుతోఁ దుల్యుఁడును, అనుపమవిభవుండు = సాటిలేనిధనము గలవాఁడును, వినుతస్థైర్యుఁడు = స్తుతింపఁబడినస్థైర్యము గలవాఁడును, అగుచున్, ధర్మార్థకామంబులు = త్రివర్గము, అతిశయింపన్ = వృద్ధియగునట్లును, ప్రజలు = తనదేశమందలిజనులు, సుఖయింపన్ = సుఖపడునట్లును, విబుధవర్గము = దేవతలసముదాయము, నుతింపన్ = స్తోత్రము చేయునట్లును, వైరులు = దుష్టులు, చలింపన్ = భయపడి తొలఁగిపోవునట్లును, రాజ్యపాలనమున్ = దేశసంరక్షణమును, ఒనర్చెన్ = చేసెను, ఔర = ఎంతయాశ్చర్యము

క॥ పొందెను బుచ్చనవిభుఁ డర
విందపురందరహయేందు ♦ విశదాభ్రధునీ
కుందశతానందసుతా
మందశతారనిభకీర్తి ♦ మహిమోన్నతులన్॥ 67.

బుచ్చనవిభుఁడు, అరవింద . . . మోన్నతులన్, అరవింద = తెల్లదామరపువ్వులతోడను, పురందరహయ = ఇంద్రునిగుఱ్ఱముతోడను ( క్షీరసముద్రమునం బుట్టిన యుచ్చైశ్శ్రవ మను పేరుగల తెల్లగుఱ్ఱముతోన్ ) ఇందు = చంద్రునితోడను, విశదాభ్రధునీ = స్వచ్ఛమైనయాకాశగంగతోడను, కుంద = మొల్లపూవులతోడను, శతానందసుత = నారదునితోడను ( శతానంద = బ్రహ్మయొక్క, సుత = పుత్త్రుఁడు ) ( ని ) శతానందశ్శతధృతిర్ద్రుహిణో జో విరించనః ( అ ) అమంద = అధికమైన, శతార = వజ్రాయుధముతోడను, ( శత = నూఱు, అర = అంచులుగలది. ) నిభ = సమానమైన, కీర్తిమహిమోన్నతులన్ = కీర్తియొక్క గొప్పతనమును, గౌరవమును, పొందెన్ = సంపాదించెను.

గీ॥ ఆశమాదికనిధియాతఁ ♦ డాశమాంబ
యందు నందనుఁ గాంచె నా ♦ నందనంద
నసమమూర్తిని జగదంచ ♦ దసమకీర్తిఁ
జిన్నమాధవరాయు నా ♦ శ్రితవిధేయు॥ 68.

ఆశమాదికనిధి=ఆ=ప్రసిద్ధమైన, శమ=ఓర్పు, (మనసును వశపఱుచుకొనుట యనియర్థము) ఆదిక=మొదలగువానికి, నిధి=ఉనికిపట్టు, అతఁడు = ఆయుచ్చనప్రభుఁడు, ఆశమాంబయందున్, ఆనందనందనసమమూర్తిన్ = ప్రసిద్ధుఁడగుకృష్ణునితోఁ దుల్యమైనయాకారము గలవానిని, జగదంచదసమకీర్తిన్ = ప్రపంచమునందుఁ బ్రకాశించు సాటిలేని కీర్తిగలవానిని, ఆశ్రితవిధేయున్=ఆశ్రయించినవారికి వశుఁడగువానిని, చిన్నమాధవరాయున్, కాంచెన్=కనెను

ఇందు మాధవరాయు ననుచోట రాయశబ్దము మగాదిగణములోనిదేయైన నుత్వము రాదు. మఱియు ద్వితీయాదులందు నిగాగమము నిత్యముగ రావలయును కావున నీరాయశబ్దము సంస్కృతసమముగాని తెలుఁగుశబ్దము కాదు. గనుక నిదియును రాముణ్, హామణ్, అనునదివలెనే సాధువని యెఱుంగునది

క॥ చినమాధవరాణ్మణి గనె
ననఘుఁ బెదమహీపతిరాయు ♦ నాతఁ డనుతుఁ డౌ
ట నతని పెదతాతకు నం
దనుఁ డగునీలాద్రినృపతి ♦ ధారణి నేలెన్॥ 69.

చినమాధవరాణ్మణి=శ్రేష్ఠుఁ డగుచిన్నమాధవరాయఁడు, అనఘున్=దోషములేఁగని, పెదమహీపతిరాయున్, కనెన్, అతఁడు=ఆపెదమహీపతిరాయప్రభువు, అసుతుఁడౌటన్=కుమారులు లేనివాఁడగుటచేత, అతనిపెదతాతకున్ = మహీపతిరాయనితాత యగుబుచ్చనప్రభువుకు కన్న యగునరసప్రభువునకున్, (నరసప్రభువు నలువదియాఱవపద్యమునం జెప్పఁబడెను) నందనుఁడు=కుమారుఁడు, అగునీలాద్రినృపతి, ధారణిన్=భూమిని, ఏలెన్=పాలించెను

గీ॥ అవ్విభుండు జగ్గ ♦ మాంబవలనఁ బెద్ద
వేంకటవిభు నెట్టి ♦ వేంకటపతి

బుచ్చివేంకటాధి • పుని ముద్దువేంకట
ప్రభునిఁ గనియెఁ బుణ్య • విభవ మెసఁగ॥ 70.

అవ్విభుండు = ఆనీలాద్రిప్రభువు, జగ్గమాంబవలనన్, పుణ్యవిభవము = పుణ్యాతిశయము, ఎసఁగన్ = ప్రకాశింపఁగాను, పెద్దవేంకటవిభున్, ఎఱ్ఱవేంకటపతిన్, బుచ్చివేంకటాధిపునిన్, ముద్దువేంకటప్రభునిన్, కనియెన్

వ. అందగ్రజుండు = ఆనలుగురిలోఁ బెద్దవాఁడు.

మ॥ ఘనుఁడై యాపెదవేంకటప్రభుఁ డొగిన్ • క్ష్మామండలం బేలె స
జ్జనరక్షాపరుఁడై మహోగ్రరిపురా • ట్సంగ్రామగాండీవియై
వినయోపేతనితాంతదానమహిమా • విఖ్యాతసత్కీర్తిచం
దనచర్చాధవళీకృతాఖిలహరి • ద్బాలాకపోలాళియై॥ 71.

ఆపెదవేంకటప్రభుఁడు, ఘనుఁడై = దిటవు గలవాఁడై, సజ్జ . . పరుఁడై = సజ్జన = మంచివారియొక్క, రక్షా = కాపాడుటయందు, పరుఁడై = ఆసక్తి గలవాఁడై, మహో.....గాండీవియై, మహోగ్ర = మిగులభయంకరమగు, రిపురాట్ = శత్రురాజులయొక్క, సంగ్రామ = యుద్ధమందు, గాండీవియై, అర్జునుఁడై, ( గాండీవ మనువిల్లుగలవాఁడు గాండీవి. ఈచాపము మున్ను విశ్వకర్మచే బ్రహ్మకై నిర్మింపఁబడియె. పిమ్మట నతనినుండి ప్రజాపతియు, వానివలన నింద్రుండు, నతనివలన సోముండుఁ జంద్రునివలన వరుణుండును బ్రచేతసునివలన నగ్నియు గ్రహించిరి. పిమ్మట ఖాండవం బేర్చునపు డగ్ని దేవుం డర్జునున కిచ్చెను ) ఈరాజు రణమున నర్జునుఁడుంబోలె మిగుల నేర్పరి యనిభావము. వినయో. . కపోలాళియై, వినయ = అడఁకువతో, ఉపేత = కూడిన, నితాంత = ఎడతెగని, దానమహిమ = దానాధిక్యముచేతను, ఆవిర్భూత = ఉత్పన్నమైన, సత్కీర్తి = మంచియశస్సనెడు, చందనచర్చా = గంధపుంబూఁతచేత, ధవళీకృత = తెల్లనిగఁ జేయఁబడిన, అఖిల = సమస్తమైన, హరిత్ = దిక్కులనెడు, బాలా = స్త్రీలయొక్క, కపోలాళి = గండప్రదేశములయొక్క సముదాయములు గలవాఁడు, ఐ, అడఁకువతోఁ గూడినదానముచే నెల్లదిక్కుల వ్యాపించినకీర్తి గలవాఁ డనియర్థము. కీర్తి తెల్లనిది యనికవిసమయము. ఒగిన్ = క్రమముగాను, క్ష్మామండలంబున్ = భూమండలంబును, ఏలెన్ = పాలించెను.

క॥ పెదవేంకటవిభు తేజము
నుదితయశము జగమునందు ♦ నుప్పొంగఁగ వి
ల్లిది యనిపూనఁ గడఁగు ని
ల్లిది యనినివసింపఁ దలఁచు ♦ వృషభాంకుఁ డొగిన్॥

పెదవేంకటవిభు తేజమున్ = పెదవేంకటరాయుని ప్రతాపమును, ఉదితయశ
మున్ = ఉత్పన్నమైనకీర్తియును, జగమునందున్ = లోకమునందు, ఉప్పొంగన్ = అభి
వృద్ధినొంది యంతటను వ్యాపింపఁగాన్, వృషభాంకుఁడు = శివుఁడు ( వృషభచిహ్న
ము జెండాయందుఁ గలవాఁడు. ) ఒగిన్ = క్రమముగాను, ఇది = ఈప్రదేశము,
విల్లు = ధనువు, అని = తలఁచి, పూనన్ = ధరించుటకు, కడఁగున్ = యత్నించును.
ఇది = ఈప్రదేశము, ఇల్లు = గృహము, అని = తలఁచి, వసింపన్ = ఉండుటకున్,
తలఁచున్ = ఎంచును.

ఈపెదవేంకటపరిభునికీర్తిప్రతాపములు లోకమం దెల్లెడల వ్యాపించుటచే నెల్ల
యెడల బంగారుకాంతితోడను, రజతకాంతితోడను గూడియుండుటచే శివుఁడు మేరు
వది కైలాసమిది యనునానవాలు నెఱుఁగక యన్నియు మేరువు లనిధనువుగా గ్రహిం
పను నెల్లయెడలఁ గైలాసము లనినివసింపను దలఁచుచుండె ననిభావము.

ఇచట జగము తనకాంతిని విడిచి కీర్తిపరితాపములయుత్కృష్టకాంతిని గ్రహిం
చునట్లు చెప్పుటచేఁ దద్గుణాలంకారమును దానిచే ననుప్రాణితమైన భ్రాంతిమదలంకా
రమును గలదు. పరితాపము స్వర్ణకాంతి గలదియని కవిసమయము.

గీ॥ పెద్దవేంకటవిభునకు ♦ వెంగమాంబ
యందు జనియించె సుగుణ ♦ రత్నాకరుండు
పటుయశుండు కుమారవేం ♦ కటమహీపతి
రాయశేఖరుఁ డధికసా ♦ మ్రాజ్యధరుఁడు॥ 73.

పెద్దవేంకటవిభునకున్, వెంగమాంబయందున్, సుగుణరత్నాకరుండు = మంచి
గుణము లనురత్నములకు సముద్రుఁడు ( సముద్రమున రత్నము లుండిన ట్లీయనయందు
సుగుణములు పెక్కు లుండె ననిభావము ) పటుయశుండు = అధికమైనకీర్తి కలవాఁ
డు, అధికసామ్రాజ్యధరుఁడు = గొప్పపరిభుత్వమును వహించినవాఁడు, కుమారవేంకట
మహీపతిరాయశేఖరుఁడు, ( శేఖరము = శిరమునం జుట్టుకొనుపూలదండ, ఇచట శ్రే
ష్ఠార్థకము ) జనియించెన్

సీ॥ తనదానగరిమ సం ♦ తత మర్థిజనపుత్త్రి
పౌత్త్రాన్వయావన ♦ ప్రౌఢి నమరఁ
దనచేతిహేతి దృ ♦ ప్తవిపక్షవక్షఃక
వాటపాటనపాట ♦ వంబు నెఱపఁ
దనధైర్యపటిమ మం ♦ దరధరాధరవర
స్థిరవిస్ఫురణతోడఁ ♦ జెలిమి సేయఁ
దనవాగ్విలాసంబు ♦ ఘనసుధారసఝరీ
పృథుమాధురీసాధు ♦ రీతి నొనరఁ
దనవిపులసన్నిధానంబు ♦ తతమనీషి
జనమునకు సన్నిధానమై ♦ సకలవాంఛి
తార్థము లొసంగ విలసిల్లె ♦ నార్యవినుత
రమ్యగుణహారి మహిపతి ♦ రాయశౌరి॥ 74.

ఆర్య ... హారి = ఆర్య = పెద్దలచేత, నుత = స్తోత్రము చేయఁబడిన, రమ్య = మనోహరమైన, గుణ = శౌర్యధైర్యాదులచె, హారి = మనోహరుఁడు, మహిపతిరాయశౌరి, తనదానగరిమ = తనయీవియొక్క గొప్పతనము, సంతతము = ఎల్లపుడును, అర్థి... పౌఢి = అర్థి = యాచకజనులయొక్క, పుత్త్రి = కుమారులు, పౌత్త్రి = మనుమలు, (మొదలైన) అన్వయ = సంతానముయొక్క, అవన = రక్షణముయొక్క, ప్రౌఢిన్ = నేర్పుచేతను, అమరన్ = ఒప్పఁగాన్, ఈప్రభు వొక్కనికి దానముఁ జేసిన నావంశమువారెల్ల దాననే జీవించునట్లు చెయుననియాశయము

తనచెతిహేతి = తనచెత నున్నయాయుధము, దృప్త.. ...పాటవము. దృప్త = గర్వించిన, విపక్ష = పగవారియొక్క, వక్షఃకవాట = తలుపువంటి ఱొమ్ముయొక్క, (ఉపమితసమాసము) పాటన = చీల్చుటయందు, పాటవము = నైపుణ్యమును, నెఱపన్ = ప్రకటింపఁగాన్, తనధైర్యపటిమ = తనధీరత్వముయొక్కసామర్థ్యము (ఎక్కువధైర్య మనియర్థము.) మందర ... .తోడన్ = మందరధరాధర = మందర మనుపేరుగలపర్వతశ్రేష్ఠముయొక్క, స్థిరవిస్ఫురణతోడన్ = స్థిరవైభవముతోన్, చెలిమి = స్నేహమును, చేయన్ = కావింపఁగాన్, తనధైర్యము మందరపర్వతమును బోలఁగా ననిభావము తనవాగ్విలాసంబు = తనమాటలనేర్పు, ఘన. ...రీతిన్ = ఘన = అధికమై

న, సుధారసఝరీ = అమృతప్రవాహముయొక్క, పృథుమాధురీ = గొప్పమాధుర్యము యొక్క, సాధురీతిన్ = లెస్సయైనప్రకారముచేతను, ఒనరన్ = ప్రకాశింపఁగా, తన భాషణము లమృతముం బోలఁగా ననిభావము. తనవిమలసన్నిధానంబు = తనస్వచ్ఛమై నసామీప్యమే, తతమనీషజనమునకున్ = గొప్పవిద్వాంసులకున్, సన్నిధానమై = తఱుఁ గనిద్రవ్యరాశియై, సకలవాంఛితార్థములు = అన్ని కోరఁబడినవస్తువులును, ఒసంగన్ = ఈయఁగాన్, విలసిల్లెన్ = ప్రకాశించెను.

క॥ శ్రీయుతుఁ డగునమ్మహిపతి,
రాయగ్రామణియనంత ♦ రమునఁ బితృవ్యుం
డై యెసఁగు బుచ్చివేంకట
రాయనినీలాద్రివిభుఁడు ♦ రాజ్యము నేలెన్॥ 75.

శ్రీయుతుఁడు = సంపదతోఁ గూడినవాఁడు, అగు......నన్ = అయినయామ హిపతిరాయప్రభుశ్రేష్ఠునియొక్కతరువాతికాలమునందున్, పితృవ్యుండు = ఆయనతం డ్రికిం దమ్ముఁడు, ఐ, ఎసఁగుబుచ్చివేంకటరాయనినీలాద్రివిభుఁడు = ప్రకాశించుబుచ్చి వేంకటరాయనికుమారుఁ డైననీలాద్రిప్రభువు, రాజ్యమున్ = దేశమును, ఏలెన్ = పా లించెను.

సీ॥ శారదాభ్రశతార ♦ తారకాశరకాండ
కాండజాసనకాండ ♦ ఘనయశుండు
రమణీయనలరాజ ♦ రాజరాజకుమార
మారసన్నిభసుకు ♦ మారమూర్తి
రమ్యచింతారత్న ♦ రత్నాకరభమిత్ర
మిత్రజద్యుద్రిమా ♦ మితవితీర్ణి
జ్వలితదావజ్వాల ♦ జాలాంబురుహబంధు
బంధుపరితాపశో ♦ భావిభాసి
రాజమాత్రుండె నిఖలది ♦ గ్రాజవినుత
బహుళధర్మైధితామేయ ♦ భాగధేయ
ధుర్యతార్థేందుమౌళిగాం ♦ భీర్యముఖ్య
రాజితగుణాళి నీలాద్రి ♦ రాయమౌళి॥ 76.

శార.....యవుండు. శారద=శరత్కాలమునందలి, (ఆశ్వయుజ, కార్తిక ములు) అభ్ర=మేఘము, శతార = వజ్రాయుధము, తారకా = నక్షత్రములు, శర కాండ = తెల్లుఁబూలసముదాయము, (ని) శరోదధ్యాద్యగ్రసారేబాణేకాండేత్ప్రకాంతరే. నా. నా. కాండో స్త్రీదండబాణార్వవర్గావసరవారిషు (అ) కాండజాస నకాంత=హంసలు (కాండ=నీటియందు, జ=పుట్టినది. పద్మము. అదియే, ఆసన= పీఠముగఁగలవాఁడు; అనఁగాఁ బద్మాసనమున నున్నవాఁడు=బ్రహ్మ. అతనియొక్క, కాండ=అశ్వము. బ్రహ్మకు హంస వాహన మనిసుప్రసిద్ధము.) వీనింబోలిన, ఘనయ శుండు=గొప్పకీర్తి కలవాఁడు; లుప్తోపమాలంకారము. రమణీయ .....మూర్తిః రమణీయ=మనోహరుఁడైన, నలరాజ=నలరాజుతోడను, రాజరాజకుమార=నలకూ బరునితోడను, (రాజరాజ=కుబేరునియొక్క, కుమారుఁడు=పుత్త్రుఁడు (ని) రాజ రాజోధనాధిపః. అ) మార=మన్మథునితోడను, సన్నిభ=సమమైన, సుకుమార = మృదువైన, మూర్తి=ఆకారముగలవాఁడును, రమ్య.....వితీర్ణి. రమ్య =మనోహ రమైన, చింతారత్న = చింతామణికివలెను, సముద్రమున నుత్పన్నమైనదియు నెవ్వ రేమికోరిన నిచ్చునదియు నగుస్వర్గమునందలియొకమణి రత్నాకర=సముద్రునకువలె ను, ఇతఁడు విష్ణునకుఁ గన్యాదానమును, దేవతలకు వనదానము నన్నదానమును, నిం ద్రునకు గజాశ్వాదిదానములు చేసెను భమిత్ర=చంద్రునకువలెను, (భ=నక్షత్రము లకు, మిత్రుఁడు=చెలికాఁడు) ఇతఁడు స్వదేహమును దేవతలకు దానముఁ జేయు ను. మిత్రజ=కర్ణునకువలెను, (మిత్ర=సూర్యునివలన, జ=పుట్టినవాఁడు) ద్యుద్రు మ=మందారము మొదలగుస్వర్గమునందలి వృక్షములకువలెను, అమితవితీర్ణి=పరిమాణ ము లేనిదానము కలవాఁడును, జ్వలిత .....విభాసి=జ్వలిత=మండుచున్న, దావ= అడవినిప్పుయొక్క, జ్వాలజాల=మంటలసమూహమునకును, అంబురుహబంధు=సూ ర్యునకును, బంధు=తుల్యమైన, ప్రతాప= తేజముయొక్క, (ధనమువలనను సేనవలన ను గలుగుతేజము ప్రతాపము) శోభా=దీప్తిచే, విభాసి = ప్రకాశించువాఁడును, నిఖిల .....వహాళి=నిఖిల=అందఱగు, దిగ్రాజ=దిక్పతులచేతను, వినుత=స్తుతింపఁ బడిన, బహుళ=అధికమైన, ధర్మ=సత్కర్మములచే, ఏధిత = వృద్ధిపొందింపఁబడిన, అమేయ=కొలఁదిలేని, భాగధేయధుర్యతా=ఐశ్వర్యమును వహించుటయందు, అర్ధేం దువహాళి=శివుఁడు, (దిక్పతులచె స్తుతింపఁబడిన సత్కర్మములఁ జేయుటచే నభివృద్ధి పొందినయైశ్వర్యముచే శివుంబోలినవాఁడని యర్థము.) (గాంభీ..... గుణాళి=గాం భీర్య=గంభీరత, ముఖ్య=మొదలైన, రాజిత=ప్రకాశించెడు, గుణాళి=గుణసముదా యము గలవాఁడును (అగు) నీలాద్రిరాయవహాళి = నీలాద్రిరాయప్రభువు, రాజమా

త్రుండే = సాధారణుఁడగు రాజా? కాఁడనియర్థము )

శా॥ నానామానధనాగ్రగణ్యనుతపు ♦ ణ్యస్వచ్ఛచారిత్రుఁ డౌ
నానీలాద్రివిభుండు దాఁ గనియె భా ♦ వాంబాలలామంబునం
దానాళీకహితోపమప్రభుని సూ ♦ ర్యారాయధాత్రీంద్రు స
త్యానూనప్రతిభుం గుమారమహిప ♦ త్యాఖ్యావనీవల్లభున్॥ 77.

నానా...చారిత్రుఁడు, నానా = పెక్కుండ్రగు, మానధన = చిత్తౌన్నత్యము గలవారిలో, అగ్రగణ్య = మొదట లెక్కింపఁదగినవారిచే, నుత = స్తుతింపఁబడిన, పుణ్య = పవిత్రమైన, స్వచ్ఛ = నిర్మలమైన, చారిత్రుఁడు = చరిత్రగలవాఁడు ఔ నానీలాద్రివిభుండు, తాన్, భావాంబాలలామంబునందున్ = శ్రేష్ఠురాలగు భావాంబయందున్ (లలామము = భూషణము. ఇచట శ్రేష్ఠ మనియర్థము.) ఆనాళీ .....ప్రభునిన్, ఆ, నాళీకహిత = సూర్యుఁడు ( నాళీక = తామరలకు, హిత = మేలు చేయువాఁడు ) ఉపమ = సాటిగల, ప్రభునిన్ = కాంతిగలవానిని, ( సూర్యుని తేజమువంటి తేజముగల వానిననియర్థము ) ఉపమాలంకారము. సూర్యారాయధాత్రీంద్రున్, సత్యానూనప్రతిభున్ = సత్య = నిజమునందు, అనూన = పూర్ణమైన, ప్రతిభున్ = మనసుగల, ( నిజమునం దత్యంతము మనసు గలవానినని యర్థము ) కుమారమహిపత్యాఖ్యావనీవల్లభున్ = కుమారమహిపతి యనునామము గలప్రభువును, కనియెన్

వ. అందగ్రజుండు = వారిద్దఱిలోఁ బెద్దవాఁడు,

సీ॥ సరసిజాక్షుఁడువోలె ♦ సిరితోడ సలరి భ
 ర్గునిభంగి నార్యాను ♦ కూలుఁ డగుచుఁ
గందర్పురీతిఁ జ ♦ క్కని, రూపు గల్గి య
 బ్జునిమాడ్కి గురుకళా ♦ పూర్ణుఁ డగుచుఁ
బరమేష్ఠిగతి మంజు ♦ భాషాఢ్యుఁ డై సరి
 త్పతిపోల్కి నిమ్నస్వ ♦ భావుఁ డగుచు
సూర్యునిపగిదిఁ దే ♦ జోమహత్త్వముఁ గాంచి
 ఘనునికైవడి దాన ♦ కలితుఁ డగుచు

మహితలోకైకజేగీయ ♦ మానవిభవ
సాంద్రుఁ డనుపమభోగదే ♦ వేంద్రుఁ డనఁగ
సూర్యరాయనరేంద్రుండు ♦ క్షోణితలము
రహిని బాలించెఁ బ్రకృతివ ♦ర్గము సుఖింప॥ 78.

సరసిజాక్షుఁడువోలెన్ = విష్ణువువలె, సిరితోడన్ = లక్ష్మితోన్, అలరి = ప్రకాశించి, సంపదతో ననిభావము భర్గునిభంగిన్ = శివునిరీతిచేత, ఆర్యానుకూలుఁడు = పార్వతి కనుకూలనాయకుఁ డనిశివపరమైన యర్థము సజ్జనులకు సహాయము చేయువాఁ డని రాజపరమైన యర్థము (ని) ఆర్యాదాక్షాయణీచైవగిరిజామేనకాత్మజా, మహాకులకులీనార్యసభ్యసజ్జనసాధవః. (అ) (ఒకకాంతయందే రాగము గలవాఁ డనుకూలుఁడు కావ్యాలం) అగుచున్, కందర్పరీతిన్ = మన్మథునిరీతిచేతను, మన్మథుఁడువలెననియర్థము. చక్కనిరూపు = మనోహర మగునాకారమును, కల్గి = పొంది, అబ్జునిమాడ్కిన్ = చంద్రునివిధముగా, గురుకళాపూర్ణుఁడు = ఎల్లకళలతో నిండినవాఁ డనియర్థము సకలవిద్యలు నేర్చినవాఁ డనిభావము. అగుచున్, పరమేష్ఠిగతిన్ = బ్రహ్మరీతిచేతను, బ్రహ్మవలె ననియర్థము మంజుభాషాప్రభుఁడై = మృదు వగుసరస్వతికిం బ్రభువై, మృదువు లగుమాటలు గలవాఁడై యనిభావము. సరిత్పతిపోల్కెన్ = సముద్రునిసామ్యముచేత, నిమ్నస్వభావుఁడు = అగాధ మైనస్వభావము గలవాఁడు, గంభీరుఁ డనిభావము అగుచున్, సూర్యునిపగిదిన్ = సూర్యునిప్రకృతిచేత, తేజోమహత్త్వము = అధిక తేజస్సనియర్థము ప్రతాపాతిశయము ననిభావము కాంచి = పొంది, ఘనునికైవడిన్ = మేఘునివిధముచేతను, దాత = దానము చేయువాఁడు, అగుచున్, మహిత .సాంద్రుఁడు, మహిత = పూజ్యులైన, లోక = జనులచేతను, ఏక = ముఖ్యముగాను, జేగీయమాన = స్తుతింపఁబడుచున్న, విభవసాంద్రుఁడు = సంపదచేతసమగ్రుఁడు, సూర్యరాయనరేంద్రుఁడు, అనుపమభోగదేవేంద్రుఁడు = సాటిలేనిసుఖానుభవముచే నింద్రుఁడు, అనఁగన్ = అనునట్లు, ప్రకృతివర్గము = మంత్రిసముదాయము, సుఖింపన్ = సుఖపడునట్లు, రహిన్ = సంతోషముతో, క్షోణితలమున్ = భూమిని, పాలించెను

ఇందునిదర్శనాలంకారము గలదు

చ॥ పదుగురు చైత్రులైన నల ♦ పంకజవైరులు సూర్యులైన న
మ్మదనులు వేవురైన శత ♦ మన్యుకుమారులు లక్షయైన న

ర్థదజులు కోటియైన వసు ♦ ధాస్థలిఁ బోలుదురే సురూపసం
పద సుకుమారతాకరుఁ గు ♦ మారమహీపతిరాయశేఖరున్॥ 79.

చైత్రులు = వసంతులు, పదుగురు = పెక్కండ్రు, ఐనన్, అలపంకజవైరులు = ప్రసిద్ధు లగుచంద్రులు, నూర్గురు = అనేకులు, ఐనన్, అమ్మదనులు = ఆమన్మథులు, వేవురు = వేయిసంఖ్యగలవారు, ఐనన్, శతమన్యుకుమారులు = జయంతులు, లక్షయైనన్ = లక్షసంఖ్యగలవారైనను, అర్థదజులు = నలకూబరులు (కుబేరపుత్త్రులు) కోటియైనన్, సుకుమారతాకరున్ = సౌకుమార్యమునకునిధి (యగు) కుమారమహీపతిరాయశేఖరున్, సురూపసంపదన్ = ఎక్కువ చక్కఁదనపు (ఎక్కువ చక్కందనము చేత ననియర్థము) సంపదచే, వసుధాస్థలిన్ = భూమియందు, పోలుదురే = సాటియగుదురా కారనియర్థము.

ఈప్రభువు నిరుపమాన మైనసౌందర్యము కలవాఁ డనిభావము

మ॥ ఘనశౌర్యుం డగుసూర్యరాడ్విభుఁడు వెం ♦ కయ్యాంబికారత్నమం
దనఘశ్రీకమనీయమూర్తి యగునీ ♦ లాద్రీశు శ్రీరామతు
ల్యుని గంగాధరరామరాయజనపా ♦ లున్ సూర్యనారాయణా
ధిపున్ వేంకటరాయభూరమణు భా ♦ స్వత్ప్రజ్ఞుఁ గాంచెన్ రహిన్॥

ఘనశౌర్యుండు = గొప్పపరాక్రమము గలవాఁడు, అగుసూర్యరాడ్విభుఁడు, వెంకయ్యాంబికారత్నమందున్, అనఘ . . మూర్తి, అనఘ = పాపములేనిదియు, శ్రీ = శోభచేత, కమనీయ = మనోహరమైనదియు, (అయిన) మూర్తి = ఆకారముగలవాఁడు, అగునీలాద్రీశున్, శ్రీరామతుల్యునిన్ = శ్రీరామునితోసమానుని, గంగాధరరామరాయజనపాలున్, సూర్యనారాయణాధిపున్, భాస్వత్ప్రజ్ఞున్ = ప్రకాశించుబుద్ధిగల, వేంకటరాయభూరమణున్, రహిన్ = ఆనందముతో, కాంచెన్ = కనెను

వ తదనుజుంపు = ఆయనతమ్ముఁడు

గీ॥ రహిఁ గుమారమహీపతి ♦ రాయశౌరి
సందనుల లక్ష్మిసరసయ్య ♦ యందుఁ గాంచె
నధికతరపుణ్యు సూర్యరా ♦ యాగ్రగణ్యు
నార్యజనగేయు ధర్మరా ♦ యాభిధేయు॥ 81.

కుమారమహీపతిరాయశౌరి, లక్ష్మనరసయ్యయందుఁ, అధికతరపుణ్యుఁ = ఎక్కువపుణ్యముగలవానిని, సూర్య సూత్రగణ్యుఁ = సూర్యరాయప్రభుశ్రేష్ఠుని, ఆర్యజనగేయుఁ = సజ్జనులచేస్తుతింపఁబడఁదగిన, ధర్మరాయాభిధేయుఁ = ధర్మరాయనామముకలవానిని, నందనులన్ = పుత్త్రిలను, రహిఁ = సంతసముతో, కాంచెఁ.

క॥ వీరాగ్రణి యగునలసూ
ర్యారాయధరామరేంద్రు ♦ నాత్మజుఁడు మహో
దారుఁడు నగునీలాద్రిధ
రారమణాగ్రగుననంత ♦ రమున నధిపుఁడై॥ 82.

వీరాగ్రణి = పరాక్రమముగలవారిలోముఖ్యుఁడు, అగు .....నాత్మజుఁడుఁ = అగుసూర్యారాయఁడను పేరుగలభూలోకదేవేంద్రునకుఁ గుమారుఁడును, మహోదారుఁడు = మిగులదాతయును, అగు. ....ననంతరమునఁ = అగునిలాద్రిరాయప్రభుశ్రేష్ఠుని యొక్క తరువాతికాలమందున్, అధిపుఁడై = ప్రభువై, ( ముందరిపద్దెములోనిరామరాయమూర్ధన్యుఁ డనుదానితో నన్వయము. )

శా॥ క్ష్మాలోకేంద్రుఁడు సూర్యరాడ్విభునిరా ♦ మారాయమూర్ధన్యుఁ డా
శ్రీలానీలల విష్ణువుంబలెఁ బురం ♦ ధ్రీలోకరత్నంబులఁ
హేళిఁ ముప్వురఁ బెండ్లియాడె నొగి మం ♦ గయ్యాంబికఁ సీతయాం
బాలావణ్యవతీవతంసమును సు ♦ బ్బయ్యాంబికారత్నముఁ॥ 83.

క్ష్మాలోకేంద్రుఁడు = భూలోకమున కింద్రుఁడు, ( ఈలోకమున నింద్రునింబోలిసంపదగలవాఁ డనియర్థము. ) సూర్యరా... .ర్ధన్యుఁడు = సూర్యరాయనిపుత్త్రుఁడైనరామారాయప్రభువు, ఆశ్రీలానీలలఁ = ఆలక్ష్మిదేవిని, భూదేవిని, నీలాదేవినిని, విష్ణువుంబలెఁ = విష్ణుమూర్తివలెనే, పురంధ్రీలోకరత్నంబులన్ = స్త్రీసముదాయములో శ్రేష్ఠురాండ్రను, ( పురంధ్రీ = గృహముం గాపాడునట్టిది. ) మంగయ్యాంబికఁ, సీతయాంబాలావణ్యవతీవతంసముఁ, సుబ్బయ్యాంబికారత్నమున్, ముప్వురఁ, ఒగిన్ = క్రమముగాను, హేళిఁ = ఆసక్తితో, పెండ్లియాడెఁ = వివాహముచేసికొనెను.

సీ॥ భవునివైఖరిఁ బద్మ ♦ భవునివైఖరి భవ్య
భూతిచె శేముషీ ♦ బాతిచేతఁ

జంద్రుకైవడి హరి ♦ శ్చంద్రుకైవడిఁ గళా
యుక్తిచే వరసత్య ♦ సూక్తిచేత
నింద్రుపోలిక భూధ ♦ రేంద్రుపోలిక భోగ
పూర్తిచే ధైర్యవి ♦ స్ఫూర్తిచేత
మిత్రుచాడ్పునఁ జైత్రి ♦ మిత్రుచాడ్పున భూరి
దీప్తిచే లలితరూ ♦ పాప్తిచేత
నలరి పొగడొందునిజహృద ♦ యారవింద
కందళితభక్తినందిత ♦ నందగోప
నందనుఁడు సూర్యరాయేంద్ర ♦ నందనుండు
ప్రథితసుగుణాళి శ్రీరామ ♦ రాయమౌళి॥ 84.

నిజ . నందనుఁడు = నిజ = తనసంబంధమైన, హృదయారవింద = పద్మముకుళాకారమైనహృదయమునందున్, ( తామరమొగ్గంబోలిన మాంసపిండము రొమ్ములోఁగ గలదనియు నది ధ్యానము చేయఁదగినయీశ్వరునివాసస్థానమనియు నదియే హృదయమనియు వేదాంతములం బ్రసిద్ధము ) కందళిత = అంకురించిన, భక్తి = అనురాగముచేతను, నందిత = సంతోషపెట్టఁబడిన, నందగోపనందనుఁడు = కృష్ణుఁడు గలవాఁడు, ప్రథితసుగుణాళి = ప్రసిద్ధికెక్కిన దానదాక్షిణ్యాదిసద్గుణములుగల, శ్రీరామరాయనృపమౌళి = శోభాశాలి యగు రామరాయప్రభుశ్రేష్ఠుఁడు, భూతిచేన్ = ఐశ్వర్యముచేతను, శేముషీభాతిచేన్ = బుద్ధిప్రకాశముచేతనును, భవుని వైఖరిన్ = శివునిరీతిచేతనును, పద్మభవుని వైఖరిన్ = బ్రహ్మయొక్కరీతిచేతనును ( అలరి యనుక్త్వార్థకముతో నన్వయము ఈప్రభు వైశ్వర్యమున శివునిఁ బుద్ధిచే బ్రహ్మను బోలినవాఁ డని భావము. అన్వయము నభిప్రాయము నిట్లే ముందు నెఱుంగునది ) కళాయుక్తిచేన్ = కళాసంపత్తిచేతను ( విద్యాసంపత్తిచేత ననియర్థము ) సత్యసూక్తిచేతన్ = నిజము పల్కుటచేతను, చంద్రుకైవడిన్ = చంద్రునివిధమునను, హరిశ్చంద్రుకైవడిన్ = హరిశ్చంద్రువిధమునను, భోగపూర్తిచేన్ = సుఖములపూర్ణతచేతనును, ( ఎక్కువసుఖముల ననుభవించుటచే ననియర్థము ) ధైర్యవిస్ఫూర్తిచేతన్ = ధీరతయొక్కవికాసముచేతమను, ( అతిధైర్యముచేత ననియర్థము. ) ఇంద్రుపోలికన్ = ఇంద్ర సామ్యమునను, భూధరేంద్రుపోలికన్ = పర్వతసామ్యముచేతను, భూరిదీప్తిచేన్ = అధికమైన తేజస్సుచేత

ను, లలితరూపాప్తిచేన్ = మనోహరమైనయాకారము గల్గుటచేతను, మిత్రుచాడ్పునన్ = సూర్యునివిధమునను, చైత్రమిత్రుచాడ్పునన్ = మన్మథునివిధమునను, అలరి = ప్రకాశించి, పొగడు = స్తుతిని, ఒందున్ = పొందును.

క్రమాలంకారము

శా॥ రామా రా యని కంచుఁ బంచశరు నో ♦ రా మార్కొనం గోరు నో
రామా రా యని యాహలాయుధుని బో ♦ రం జీరు నోపద్మభూ
రామా రా యని మిన్కుముద్దియను జే ♦ రం బిల్చుఁ బెన్నుద్దికిన్
రామా రాయనిరూపవైభవము, దో ♦ ర్దర్పంబు, సత్కీర్తియున్॥

రామా ... వైభవము = రామరాయప్రభువుయొక్క రూపసంపద, (చక్కఁదనమనియర్థము) దోర్దర్పంబు = బాహుగర్వము, (బాహుబలాతిశయమనియర్థము) సత్కీర్తియున్ = మంచియశస్సును, (క్రమముగా) మారా = ఓమన్మథుఁడా, అనికిన్ = యుద్ధమునకు, రా = రమ్ము (ఇది వచ్చుధాతువుయొక్క ప్రార్థనార్థకమధ్యమపురుషము.) అంచున్ = పల్కుచున్, పంచశరున్ = మన్మథుని, (అరవిందాదు లైదుబాణములు కలవాఁడు.) మార్కొనన్ = ఎదుర్కొనుటకు, కోరున్, ఈప్రభుసౌందర్యము మన్మథుని యుద్ధమునకుఁ బిల్చు ననియర్థము మన్మథునికంటె నెక్కుడుచక్కఁదనము గలవాఁడనిభావము. రామా = ఓ బలరాముఁడా, రా = రమ్ము, అని, ఆహలాయుధునిన్ = ఆబలరాముని (నాఁగలియాయుధముగాఁగలవాఁడనియర్థము) పోరన్ = యుద్ధముచేయుటకు, చీరున్ = పిలుచును ప్రలంబాదుల సంహరించినబలభద్రునికంటె నధికబలశాలి యనియాశయము ఓపద్మభూరామా = ఓసరస్వతీ! (తామరపువ్వునం బుట్టినవానియింతి విష్ణువునాభికమలమున బ్రహ్మ యుదయించెననిపురాణములం గలదు) పెన్నుద్దికిన్ = పోలికకున్, రా = రమ్ము, అని, మిన్కుముద్దియన్ = పలుకులవెలఁదిని, చేరన్ = సమీపించుటకున్, పిలుచున్ ఈప్రభువు కీర్తిధావళ్యగుణముచే సామ్యమునకు రమ్మని సరస్వతినిం బిలుచుచున్నది యనియర్థము ఈప్రభువు సరస్వతిని మించినతెల్లనికీర్తి గలవాఁ డనితాత్పర్యము. ఇందు శబ్దాలంకారము యమకమును, అర్థాలంకారము యథాసంఖ్యమును గలవు

సీ॥ సకలవిద్వచ్చకో ♦ రకము లానందించె
విమతాననాబ్జపా ♦ ళి ముకుళించె

లలిమిత్త్రకువలయం • బులు వికాసము నొందె
ఖలజనచక్త్రవా • కములు గుందె
బంధుబృందానంద • సింధువు లుప్పొంగె
ధర్మేతరధ్వాంత • తతు లడంగె
సత్సంతుల కభీ • ష్టము లెల్లనీడేరెఁ
గుమతిచోరప్రచా • రములు జాఱెఁ
బీఠికాపురవరదుర్గ • పృథులసౌధ
సింహపీఠోదయాచల • శిఖరభాగ
మధిగమించి యఖండరా • జ్యరమఁ దాల్చి
రామరాయాఖ్యచంద్రుఁడు • ప్రబలుచుండ॥ 86.

రామరాయాఖ్యచంద్రుఁడు = రామరాయప్రభు వనుచంద్రుఁడు, పీఠి .. .. భాగము, పీఠికాపుర = ఈపేరు గలపట్టణమునందలి, వర = శ్రేష్ఠమైన, దుర్గ = కోటయం దుండెడు, పృథులసౌధ = పెద్దమేడయుంమిన్న, సింహపీఠ = సింహాసనమనెడు, ఉదయాచలశిఖరభాగము = ఉదయపర్వతముయొక్క యగ్రభాగమును, అధిగమించి = పొంది, అఖండరాజ్యరమన్ = పూర్ణమైనరాజ్యసంపదను, తాల్చి = ధరించి, ప్రబలుచుండన్ = వృద్ధి నొందుచుండఁగా, సంతతవిద్వచ్చకోరకములు = అందఱువిద్వాంసులనెడువెన్నెలపులుఁగులు, ఆనందించెన్ = సంతసించెను చంద్రోదయమునఁ జకోరములు సంతసించిన ట్లీప్రభువు వృద్ధి నొందుచుండ విద్వాంసు లానందించి రనిభావము. నిమ పాళి = విమత = శత్రువులయొక్క, ఆస్య = మోములనెడు, అబ్జ = తామరలయొక్క, పాళి = సమూహము, ముకుళించెన్ = ముగిడెను, చంద్రునుదయమునఁ దామరలుముడిఁగిపోవున ట్లీప్రభువుకాలమున శత్రువుల మోములు ముడిఁగిపోయె ననియాశయము మిత్త్రకువలయంబులు = నెయ్యురనుకలువలు, లలిన్ = ఉత్సాహముతో, వికాసమున్, ఒందెన్ = వికసించెను ఖలజనచక్రవాకములు = దుర్మార్గులనుచక్రవాకములు, కుందెన్ = ఖేదపడియెను చక్రవాకములకుఁ బవలు సంయోగము రాత్రివియోగము గలుగుఁగాన నవి చంద్రోదయమునఁ గుందును అట్లే యీప్రభువుకాలమున దుష్టులు తమచెడుపనులు సాఁగమిచే ఖిన్నులైరనిభావము బంధ . సింధువులు = బంధుబృంద = చుట్టములయొక్క, ఆనంద = సంతోషమనెడు, సింధువులు = సముద్రములు

ఉప్పొంగెన్=విజృంభించెను చంద్రునుదయమున సముద్రము లభివృద్ధి నొందిన ట్లీప్రభువు రాజ్యకాలమునఁ జుట్టములు సంతసిల్లి రనియాశయము. ధర్మేతరధ్వాంతతతులు= ధర్మేతర=పాపకార్యములనెడు, ధ్వాంత=చీఁకట్లయొక్క, తతులు = సముదాయములు, అడంగెన్=నశించెను సత్సంతతులకున్ = సజ్జను లనుసత్పుత్రములకు, అభీష్టములెల్లన్=కోర్కు లన్నియు, ఈడేరెన్ = ఫలించెను (ని) సస్సత్త్వైవిదుషి(శ్రేష్ఠే సాధ్వీభవతిచత్రిషుసత్త్రీకంబమ్మృక్షే. నా. నా కుమతివోరగప్రచారములు=చెడుబుద్ధి గలదొంగలసంచారములు, జారెన్=నశించెను చంద్రుఁడు ప్రకాశించుచుండఁ దమసంచారము వెల్లడియగు నని దోరులు సంచరింపరు. ఈప్రభువుకాలమున 'దండభయమునఁ జోరులు సంచరింప మారి గరియాశయము సావయవరూపకాలంకారము

శా॥ అక్షివ్యాజమునన్ వృషాంకునొసలన్ ♦ వ్యాపించి పాథోధిరా
ట్కుక్షిం బాడబకైతవం బెసఁగ నా ♦ టోపించి మింటన్ జగ
చ్చక్షుఃప్రక్రియ సంచరించి జలము ♦ జ్జాలంబునన్ వైద్యుతా
గ్న్యక్షీణాకృతి రామరాయవిభుశౌ ♦ ర్యం బుండు లోకంబునన్॥

రామరాయవిభుశౌర్యంబు=రామరాయవిభుప్రతాపము, వృషాంకునొసలన్ = ఈశ్వరునిఫాలమునందు, అక్షివ్యాజమునన్ = (మూఁడవ) కన్నునెపముచే, వ్యాపించి=అలముకొని, పాథోధిరాట్కుక్షిన్=సముద్రమధ్యమునందున్, బాడబకైతవంబు=బడబాగ్ని యనుమిష, ఎసఁగఁగాన్=కలుగఁగాన్, ఆటోపించి = ప్రబలి, మింటన్=ఆకాశమునందున్, జగచ్చక్షుఃప్రక్రియన్=సూర్యునియధికారముతో, సంచరించి, జలముగ్జాలంబునన్=జలముక్ = మేఘములయొక్క, జాలంబునన్=సముదాయమునందు. వైద్యుతాగ్న్యక్షీణాకృతిన్=వైద్యుత=మెఱుపులసంబంధమైన, అగ్ని= అగ్నియొక్క, అక్షీణ=పూర్ణమైన, ఆకృతిన్=ఆకారముతోన్, (మెఱుపు లనెడు మిషచేత ననియర్థము.) లోకంబునన్=లోకమం దంతటను, ఉండున్=వసించును.

ఈప్రభువుప్రతాపమే యీశ్వరునినొసటఁ గంటియాకారముతోడను సముద్రమున బడబాగ్నిరూపమునను నాకాశమున సూర్యరూపమునను మేఘములమెఱుపురూపమునను వ్యాపించి లోకముల నన్నిటి నాక్రమించె ననియర్థము. ఇచట సూర్యాదులయందు స్వరూపముం గప్పి ప్రతాపత్వము కల్పించుటచే నపహ్నవాలంకారము.

సీ॥ తతదివ్యచంద్రికా ♦ ధవళాంశుకంబుతో
గగనగంగాకంచు ♦ కము దలిర్ప

హిమశైలరజతశై ♦ లము లనుపాలిండ్ల
పైఁ దారకాహార ♦ పటలి మెఱయ
నమరశాఖిసుమాళి ♦ యవతంసముగఁ గ్రాల
వీణాశ్రుతిని నల్వ ♦ రాణి పాడఁ
గలశాంబునిధితరం ♦ గమ్మృదంగనిస్వనం
బలరమహానటుం ♦ డాటఁ గఱప
ఘనశరద్ఘన మనుతిర ♦ స్కరిణి మించి
చంద్రవదనంబు దోఁప ని ♦ చ్చలు నటించు
రావుశ్రీరామరాయభూ ♦ రమణుకీర్తి
మహితనర్తకి బ్రహ్మాండ ♦ మండపమున॥ 88.

రావు.. ..నర్తకి = రావువారివంశమున జన్మించినశ్రీమంతుఁ డగురామరాయప్రభునిపూజ్యమైనకీర్తి యనునటి, తత.. ..కంబుతోన్, తత = విశాలమైన, చంద్రికా = వెన్నెలయను, ధవళ = తెల్లని, అంశుకంబుతోన్ = వస్త్రముతో, గగనగంగాకంచుకము = గగనగంగా = ఆకాశగంగయను, కంచుకము = రైక, తలిర్పన్ = ప్రకాశింపఁగాన్, హిమశైల . . పైన్ = మంచుకొండయు వెండికొండయునను స్తనము లమీఁదను, తారకాహారపటలి = నక్షత్రము లనుముత్యాలదండలవరుస, మెఱయన్ = భాసిల్లఁగాన్, అమరశాఖిసుమాళి = కల్పవృక్షములయొక్కపూలసముదాయము, అవతంసముగన్ = చెవిమీఁదిభూషణముగా, క్రాలన్ = ప్రకాశించుచుండఁగా, నల్వరాణి = చతుర్ముఖునిభార్య (సరస్వతి), వీణాశ్రుతిన్ = వీణయొక్కశ్రుతితో, పాడన్ = పాడుచుండఁగా, కలశా......నంబు = కలశాంబునిధి = క్షీరసముద్రముయొక్క, తరంగ = అల లనెడు, మృదంగ = మద్దెలయొక్క, నిస్వనంబు = ధ్వని, అలరన్ = ఒప్పఁగాన్, మహానటుండు = శివుఁడు, ఆటన్ = నాట్యమును, కఱపన్ = నేర్పఁగాను, ఘనశరద్ఘనము = గొప్పది యగుశరత్కాలమందలిమేఘము, అనుతిరస్కరణిన్ = అను తెరను, మించి = దాఁటి, చంద్రవదనంబు = చంద్రుఁ డనుముఖము, తోఁపన్ = కనుపడఁగా, నిచ్చలు = ఎల్లకాలమును, నటించున్ = నాట్యము చెయును

ఇందుఁ గీర్తియందు నాటకత్తెతనము కల్పించి మిక్కిలి తెల్లనివి యగువెన్నెల మొదలగువానియందు నటి కలంకారము లగువస్త్రత్వాదుల నారోపించుటచే సావయ

వరూపకాలంకారము. ఈప్రభునినిర్మలకీర్తి భూమియం దంతటను వ్యాపించి యాకాశమందును బ్రహ్మలోకమునందును గూడ నిండి యుండె నని తాత్పర్యము.

చ॥ రసికుఁడు రామరాయనృప ♦ రత్నము రత్నధనాంబరాదు ల
ర్థిసమితి కీయ దాఁచికొ న ♦ దివ్యమణుల్ దనలో సముద్రుఁ డ
ర్థసముదయంబు ప్రాఁతఱల ♦ దాఁచె ధనాధిపుఁ డంబరం బదృ
శ్యసరణిఁ గాంచెఁ గాచికొ న ♦ నయ్యమరావళి మేరుశైలమున్॥

రసికుఁడు=విద్వాంసుఁడు, రామరాయనృపరత్నము=రామరాయప్రభుశ్రేష్ఠుఁడు, అర్థిసమితికిన్=యాచకులసముదాయమునకు, రత్నధనాంబరాదులు=రత్న=మణులను, ధన=సొమ్మును, అంబరాదులు=వస్త్రములు మొదలగువానిని, ఈయన్=దానముచెయుచుండఁగాను, (దానము చేయుటచెతననియర్థము) సముద్రుఁడు, తన లోన్=తనమధ్యమునందు, దివ్యమణుల్=మంచిమణులను, దాఁచికొనెన్, ధనాధిపుఁడు=కుబేరుఁడు, అర్థసముదయంబు=ద్రవ్యసముదాయమును, ప్రాఁతఱలన్=నిధులయందున్, దాఁచెన్ = కనుపడకుండునట్లు రక్షించెను అంబరంబు = ఆకాశము, అదృశ్యసరణిన్=కనుపడనిరీతిని, కాంచెన్=పొందెను (ని) అంబరంవ్యోమ్ని వాససి (అ) (అంబరశబ్దము వస్త్రమునకుం బేరగుటచె నామసామ్యమునఁ దన్నుసైత మీప్రభువు దానముసేయునని యాకాశము దాఁగెనని భావము.) అయ్యమరాళి=అద్దేవతలసముదాయము, మేరుశైలమున్=బంగారుకొండను, కాచికొనెన్ = రక్షించుకొనెను

ఈప్రభువు మేరుపర్వతమునుసైతము దానముసేయు నని దేవతలు భయపడి రక్షించుకొనుచున్నా రనిభావము

ఇందు సముద్రమున మణులుండుటయును, ఆకాశమున కదృశ్యసరణియును దేవతలకు వాసమగుటచె మేరువును గాచియుండుటయును, కుబేరుఁడు ద్రవ్యమును బ్రాఁతఱలం దాఁచుటయును సహజమైయుండఁగా నీప్రభువు మిగుల దానముచేయుటచే నిట్లయ్యె ననియుత్ప్రేక్షించుటచే నుత్ప్రేక్షాలంకారము

క॥ గోవిభవార్యాశ్రియమై
శ్రీవల్లభశివవిరించి ♦ జిష్ణుతరణిప్రా
ఘోవాహామదనలీలల
రావుసువంశమణి రామ ♦ రాట్ప్రభువమరున్॥ 90

రావుసువంశమణి = రావువారిమంచివుల మను వేణువునకు ముత్తియము, ( అగు ) రామరాట్ప్రభువు = రామరాయప్రభువు, గోవిబ .....మై, గో = భూమికిని, విభవ = సంపదకును, ఆర్య = సజ్జనులకును, ఆశ్రియమై = ఉనికిపట్టై, ( ఈప్రభువు సజ్జనులం బోషించు ననియు సంపదలకు వాసస్థానమనియు భూమి కాధారమనియుభావము ) శ్రీవల్లభ .. .లీలన్ = శ్రీవల్లభ = విష్ణువుయొక్కయు, శివ = సాంబమూర్తియొక్కయు, విరించి = బ్రహ్మయొక్కయు, జిష్ణు = ఇంద్రునియొక్కయు, తరణి = సూర్యుని యొక్కయు, పాథోవాహ = మేఘముయొక్కయు, మదన = మన్మథునియొక్కయు, లీలలన్ = విలాసములం బోలువిలాసములతో, అమరున్ = ప్రకాశించును

ఇందు గోవిభవార్యాశ్రియవిశేషణసామర్థ్యముచే, రాజు విష్ణువుమొదలైనవారి విలాసమునం బ్రకాశించె ననిచెప్పుటచే నావిశేషణము వారికిం జెందును

గోవిభ . .ము, గో = భూదేవియొక్క, విభవ = సంపదకును, అరి = చక్రాయుధమునకును, ఆశ్రియము = ఆధారము ( విష్ణువు )

గోవిభ. .. .ము, గోవిభవ = నందీశ్వరునియైశ్వర్యమునకును, ఆర్యా = పార్వతికిని, ఆశ్రయము = ఆస్పదము ( శివుఁడు )

గోవిబ ము, గోవిభవ = సరస్వతీదేవిసౌభాగ్యమునకును, ఆర్య = బ్రహ్మర్షులకును రాజర్షులకును, ఆశ్రయము = ఆధారము ( బ్రహ్మ )

గోవిబ . .ము, గోవిభవ = స్వర్గసంపదకును, ఆర్య = బృహస్పతికిని, ఆశ్రయము = అండ, ( ఇంద్రుఁడు )

గోవిభ ము, గోవిభవ = కిరణాతిశయమునకును, అరి = చక్రవాకములకును, ఆశ్రయము = నివాసమునుం బోషకుఁడును, ( సూర్యుఁడు )

గోవిభ . ము, గో = వజ్రముయొక్క, విభ = కాంతిగల, (తెల్లకాంతిగల) వారి = ఉదకమునకు, ఆశ్రయము = ఉండుతావు, ( మేఘము )

గోవిభ . డు, గోవిభవ = దృష్టిసంపదయును, ( నేత్రములశోభ )

గోవిభవ = బాణసంపదగల, ఆర్యా = యువతులు, ఆశ్రియము = సహాయముగల వాఁడు, ( మన్మథుఁడు ) ఈయర్థమున నిది బహువ్రీహిసమాసము. మన్మథుఁడు లోకముల జయించునపుడు బాణములం బోలినవాఁడిచూపులు గలజవ్వనులే సహాయము కలవాఁడై యుండును గాన నిట్లుచెప్పఁబడెను రామరాయప్రభువును గోవిభవార్యాశ్రయుఁడు విష్ణువుమొదలైనవారు నట్టివారు కాఁబట్టి వారిలీలలతోఁ బ్రకాశించెనని తాత్పర్యము ఇందు విష్ణువుమొదలగువారిలీల వారియందు యుండును గాని యితరుల

యందు సంభవింపమిచే వారిలీలం బోలినలీల యనియర్థము ప్రాప్తించుంగానం బదార్థవృత్తినిదర్శనాలంకారము ఇది శ్లేషమహిమను బ్రాప్తించుంగాన శ్లేషానుప్రాణితము. తానికిని విష్ణువు మొదలగువానికి సౌపమ్యము (సామ్యము) గమ్యము (ని) స్వర్గేషుపశువాగ్వజ్రదిఙ్నేత్రఘృణిభూజలేలక్ష్యదృష్ట్యస్త్రీయాంపుంసిగౌః (అ)

క॥ నారాయణాంశభవుఁ డగు
శ్రీరామారాయశౌరి ♦ చిరవిభవముతోఁ
ధారణిఁ బాలించుత నా
తారాచంద్రార్కముగ సు ♦ ధర్మాభిరతిన్॥ 91.

నారాయణాంశభవుఁడు = విష్ణువునంశమునజన్మించినవాఁడు, శ్రీరామారాయశౌరి, చిరవిభవముతోన్ = శాశ్వతమైనయైశ్వర్యముతో, ఆతారాచంద్రార్కముగన్ = చుక్కలుం జంద్రుఁడు సూర్యుఁ డున్నంతకాలము, ధారణిన్ = భూమిని, సుధర్మాభిరతిన్ = న్యాయమునందాసక్తితో, పాలించుతన్ = రక్షించెడుఁగాక

## షష్ఠ్యంతములు.

క॥ ఏతాదృశగుణమణికి న
రాతిమదద్విరదసృణికి ♦ బ్రహ్మాండకటా
హాతీతయశోధఃకృత
శీతఘృణికి మార్గణౌఘ ♦ చింతామణికిన్॥ 92.

ఏతాదృశగుణమణికిన్ = మీఁదఁ జెప్పినమంచిగుణములుగలిగిన, అరాతి ..... సృణికిన్ = అరాతి = శత్రువులను, మదద్విరద = మదపుటేనుఁగులకు, సృణికిన్ = అంకుశమగువానికిని, బ్రహ్మాండ.....ఘృణికిన్ = బ్రహ్మాండకటాహ = కటాహముం బోలినప్రపంచమును, అతీత = దాఁటిన, యశః = కీర్తిచేతను, అధఃకృత = తిరస్కరింపఁబడిన, శీతఘృణికిన్ = చంద్రుఁడు గలవానికిని, చెఱకుపానకము మొదలైనవానిం గాఁచుపాత్రము కటాహము ఈప్రపంచము నంత నతిక్రమించినయీతనికీర్తి యీలోకము నతిక్రమింపలేనిచంద్రుం దిరస్కరించె నని భావము. మార్గ.....మణికిన్ =

మార్గణౌఘ = యాచక సమూహమునకు, చింతామణికిన్ = చింతామణి యైనవానికిన్, ఇందలివిశేషణములను ముందరిపద్యములయందలివిశేషణములను ‘‘నవరసరసికయను’’ పద్యములోని ‘ రామరాయాగ్రణికిన్ ’ అనువిశేష్యముతో నన్వయము.

క॥ భూవిదితసర్వవరమున
దేవాలయగోపురప్ర ♦ తిష్ఠాపనదీ
క్షావిధికి సకలసజ్జన
సేవధికి వదాన్యతాప ♦ హసితవారిధికిన్॥ 93.

భూవిదిత . . .మునన్ = భూమియందుఁ బ్రసిద్ధ మైనసర్వవరమను పట్టణము నందున్, దేవాలయ . . .విధికిన్ = దేవాలయ = కోవెలయొక్కయు, గోపుర = (వాకిలి) గోపురముయొక్కయు, ప్రతిష్ఠాపన = కట్టించుటయందు, దీక్షావిధికిన్ = గొప్పనియమము కలవానికిన్, సకల . . .సేవధికిన్ = ఎల్లసాధువులకు ద్రవ్యరాశిం బోలినవానికిన్, వదాన్య . . .రిధికిన్ = వదాన్యతా = దాతృత్వముచే, హసిత = పరిహసింపఁబడిన, వారిధికిన్ = సముద్రము గలవానికిని, సముద్రుఁడుం బోలె దాత యైనవాని కని భావము

క॥ రంభాకుచకుంభపరీ
రంభానందద్విపక్ష ♦ రాణ్ణుతశౌర్యా
రంభునకున్ శుంభజ్జయ
సంభావితనిజభుజాసి ♦ సంరంభునకున్॥ 94.

రంభా . . .రంభునకున్, రంభా = స్వర్గమునం దుండునొకానొక వేశ్యయొక్కయు, కుచకుంభ = కుంభములం బోలిన స్తనములయొక్కయు, పరీరంభ = కౌఁగిలింతచేత, ఆనందత్ = సంతసించుచున్న, విపక్షరాట్ = శత్రురాజులచేతను నుత = స్తుతింపఁబడిన, శౌర్యారంభునకున్ = పరాక్రమమునందలి వేడుక కలవానికిన్, యుద్ధమునం దీయనచే మృతులైనపగవారు స్వర్గమునకుం జని యచట రంభ నాలింగనము చేసికొని యప్పటి యానందముచే, దానికిం గారణ మగునిరాజుశౌర్యమును బొగడుచున్నా రని భావము యుద్ధమున మరణము నొందినవానికి స్వర్గము వచ్చు నని స్మృతులం గలదు. శుంభ. . . . .రంభునకున్, శుంభత్ = ప్రకాశించుచున్న, జయ = గెలుపుచే, సంభావిత = ప్రకాశింపఁజేయఁబడిన, నిజ = తనది యగు, భుజ = చేతియందలి, అసిసంరంభు

నకున్ = కత్తియొక్క వేగిరపాటు కలవానికిన్, ప్రసిద్ధ మగు చున్న గెలుపుచే వ్యాప్తము చేయఁబడినతన చెలియందలికత్తియొక్క యాటోపము కలవాని కని యర్థము.

లోకమందుఁ బ్రసిద్ధ మగుచున్న యీయనజయమే భుజమునందలికత్తియొక్క సామర్థ్యమును బ్రకటించుచున్న దని భావము.

క॥ సేతుహిమాచలమధ్య
స్థాతతదివ్యస్థలాది ◆ యాత్రాసుకృతా
న్వితపునీతాంగునకున్
ఖ్యాతవిలాసాతిశయజ ◆ తానంగునకున్॥ 95.

సేతు . తాంగునకున్, సేతు = ( రాముఁడు లంకాప్రయాణకాలమున దక్షిణసముద్రమున రామేశ్వరమునొద్దఁ గట్టిన ) గట్టునకును, హిమాచల = మంచుకొండకును, మధ్యస్థ = నడుమ నున్న, ఆతత = గొప్పవి ( అగు ) దివ్యస్థలాది = పుణ్యక్షేత్రాదులకు, యాత్ర = పోవుటచే ( కలిగిన ) సుకృత = పుణ్యములతో, అన్విత = కూడిన వాఁడు గనుక నే, పునీతాంగునకున్ = పవిత్రము చేయఁబడినశరీరము గలవానికిని, ఖ్యాత . నంగునకున్ = ఖ్యాత = ప్రసిద్ధమైన, విలాసాతిశయ = శృంగారచేష్టలయతిశయముచే, జిత = జయింపఁబడిన, అనంగునకున్ = మన్మథుఁడు కలవానికిని, శృంగారచేష్టలచే మన్మథుని గెలిచినవాని కని యర్థము

క॥ నవరసరసికశిఖామణి
కవిరళనిజభుజభుజంగ ◆ మాధిపధృతభూ
యువతీమణికిన్ విద్వ
త్ప్రవరసలక్షణునకు శ్రీరామ ◆ రాయాగ్రణికిన్॥ 96.

నవ . . కిన్ = నవరస = శృంగారాదులయొక్క, రసిక = విద్వాంసులలో, శిఖామణికిన్ = శిరోభూషణ మైనవానికిన్, "శ్లో॥ శృంగారహాస్య కరుణా రౌద్ర వీర భయానకాః। భీభ త్సాద్భుత శాంతా శ్చ నవ నాట్యే రసా స్స్మృతాః॥" శృంగారాదిరసముల నెఱిఁగినవారిలో నగ్రేసరుఁ డని యర్థము అవి . . మణికిన్ = అవిరళ = దృఢమైన, నిజ = తనదియగు, భుజ = చెయి యనెడు, భుజంగమాధిప = శేషునిచే, ధృత = ధరింపఁబడిన, భూయువతీమణికి = భూమి యనెడు స్త్రీరత్నము గలవానికిని, శేషుఁడు ఫణామండలమున భూమిని ధరించిన ట్టీరాజు తనభుజముల ధరించె నని భావ

ము విద్వ   ఖమణికిన్ = విద్వత్ప్రవర = శ్రేష్ఠు లగువిద్వాంసు లనెడు, నల = తామరపూవులకు, ఖమణికిన్ = సూర్యుఁ డైనవానికిన్ ( ఖమణి = ఖ = ఆకాశమునకు, మణి = మణిం బోలినవాఁడు; విన్ను మానికము, సూర్యుఁడు ) సూర్యుఁడు తామరలకుంబోలె విద్వాంసుల కీప్రభువు సంతోషహేతు వని భావము రామరాయాగ్రణికిన్ = రామరాయప్రభువునకున్, ముందువచనముతో నన్వయము

వ. అభ్యుదయపరంపరాభివృద్ధిగా నారచియింపంబూనిన భద్రాపరిణ
  యం బనుమహాప్రబంధంబునకుం గథావిధానం బెట్టి దనిన.

అభ్యుదయ .. .వృద్ధి = అభ్యుదయ = శుభములయొక్క, పరంపర = వరుసల యొక్క, అభివృద్ధి = పెంపు, కాన్ = అగునట్లు, నారచియింపంబూనిన . బునకున్ నారచియింపన్ = నాయొక్క రచియించుటకు, ( ఇచటఁ గర్త్రర్థమున షష్ఠి ) నేరచియించుట కని యర్థము, పూనిన = ఆరంభించిన భద్రాపరిణయం బనుమహాప్రబంధంబునకున్, కథావిధానంబు = కథాప్రకారము, ఎట్టి దనినన్

గీ॥ హరిచరిత్రంబు శ్రోతృక ♦ ర్ణామృతముగఁ
  దొల్లి సూతుండు శౌనకా ♦ దులకుఁ దెల్పి
  నట్టిరీతిఁ బరిక్షిద్ధ ♦ రాధినాథ
  తిలకమున కిట్లు శుకయోగి ♦ తెలుపఁదొడఁగె॥ 97.

తొల్లి = పూర్వకాలమునన్, సూతుండు = ( నైమిశారణ్యంబున మహార్షులకు సత్రయాగకాలంబున సకలపురాణములం జెప్పినవ్యాసశిష్యుఁడు. ) శ్రోతృకర్ణామృతము = వినువారిచెవుల కమృతముం ( బోలినది ) కన్ = అగునట్లు, శౌనకాదులకున్ = శౌనకుఁడు మొద లగుఋషులకు, తెలిపినట్టిరతిన్ = చెప్పినప్రకారము పె, శుకయోగి = వ్యాసపుత్త్రుఁడు, పరిక్షి. తిలకమునకున్ = పరిక్షితుఁ డనురాజశ్రేష్ఠునకు, ముస్లశ్వత్థామ ప్రయోగించిననారాయణాస్త్రముచె గతప్రాణుఁడై యుత్తరాగర్భంబునఁ బుట్టుటచె నీరాజునకుఁ బరిక్షిత్తను నామంబు గలిగె ఇట్లు = ఈక్రిందిప్రకారముగా, హరిచరిత్రంబు = కృష్ణునిచరిత్రమును, తెలుపఁదొడంగెన్ = చెప్ప మొదలిడెను

సీ॥ ఏవీట సౌధాగ్ర ♦ సౌవర్ణకలశంబు
  లబ్జకోశంబు లౌ ♦ సమరథునికి
  నేవీట సతులత ♦ న్వావిలాసంబులు

ప్రార్థనీయంబు లౌ • నచ్చరలకు
నేవీట హర్మ్యమ • ణీవిభావిభవ మ
భావంబొనర్చువి • భావరులకు
నేవీటఁ జంద్రశా • లావితానస్థహా
రములు తారావళీ • భ్రాంతి నొసఁగుఁ
దుంగతరరోహణాచల • శృంగతులిత
గురురుచిరరత్నకీలిత • గోపురంబు
వెలఁగు బహువిధసంపద్వి • శేషహాసిత
గోపురం బగునా ద్వార • కాపురంబు॥ 98.

ఏవీటన్=ఏపట్టణమున, (కల) సౌధా . . . సంబులు = సౌధ = మేడలయొక్క, అగ్ర = కొనయందలి, సౌవర్ణ = బంగారువికారమైన, కలశంబులు = కుండలు, అమరధునికిన్ = ఆకాశగంగకున్, అబ్జకోశములు = తామరమొగ్గలు, ఔనో; ద్వారకాపురమునందలి మేడ లాకాశము నంటుచున్నవి గనుక వానిచివర నున్న బంగారుకుండలు స్వర్గలోకమం దున్ననదిలోనితామరపువ్వు లంబోలె నుండె నని యాశయము. ఇందు మేడలమీఁద నున్న బంగారుకుండలకు నాకాశగంగలోనియబ్జకోశత్వము సంబంధించకున్న నట్లు చెప్పుటచేత అతిశయోక్త్యలంకారము

తక్కినమూఁడుచరణంబులం దిట్లు సంబంధాతిశయోక్త్యలంకార మగియే యెఱుంగునది ఏవీటన్=ఏపట్టణమున, సతుల . . . . సంబులు = సతుల = స్త్రీలయొక్క, తనూ = శరీరములయొక్క, విలాసంబులు = చక్కఁదనములు, అచ్చరలకున్ = రంభమొద లగువారికిన్, ప్రార్థనీయంబులు = కోరఁబడఁదగినవి, ఔనో, ఈపట్టణమందలి స్త్రీలు రంభాదులకంటె సొగసుకత్తె లని భావము ఏవీటన్=ఏనగరమున, హర్మ్య . . విభవము = హర్మ్య = మేడలయందలి, మణీ = రత్నములయొక్క, విభా = వెలుఁగుయొక్క, విభవము = సంపద, విభావరులకున్ = రాత్రులకు, అభావంబు = నాశము, ఒనర్చున్ = చేయునో, ఇందలి మేడలయందలిమణులకాంతిచే రాత్రియుం బవలుగా నుండె నని తాత్పర్యము ఏవీటన్=ఏపురమునందున్, చంద్ర . . . హారములు, చంద్రశాల = మేడలమీఁదియిండ్లయందలి, వితానస్థ = మేలుకట్టులయందలి, హారములు = ముత్యాలజాలరులు, తారావళీభ్రాంతిన్ = నక్షత్రసముదాయమనుభ్రమను, ఒసఁగున్ = ఇచ్చునో, మేడలు మిగుల నున్నతము లగుటచే నందలిమేల్కట్లయం దున్న జాలరుల

సౌధముల్ గర్భస్థ ♦ శైలములు గ
శశికాంతకృతచతు ♦ ష్పథములు ఝరులు గాఁ
గరిఘటల్ మకరసం ♦ ఘాతములు గ
నుత్తాలసాలంబు లుల్లోల ♦ తతులు గాఁ
దతపతాకములు మ ♦ త్స్యములు గాఁగ
నఖిలాంగనాజనం ♦ బప్సరోగణము గాఁ
బురలక్ష్మి కల్మిపూ ♦ బోఁడి గాఁగ
సతతమంగళతూర్యని ♦ స్వనము లెల్ల
ఘనతరంగరవంబు లై ♦ కడలుకొనఁగ
క్షీరవారాశి యో యనఁ ♦ జెలువు మిగిలి
హరికి శుభకర మై యొప్పు ♦ నప్పురంబు॥ 100.

గారుత్మతవితర్దికలు = గారుత్మత = గరుడపచ్చలయొక్క, వితర్దికలు = అరఁగులు, ( మరకతమణులతోఁ గట్టినయరఁగు లని యర్థము ) సైకతములు = ఇసుకతిన్నెలు, కాన్ = కాఁగా, సౌధముల్ = మేడలు, గర్భస్థశైలములు = ( సముద్రము ) లోపలనున్న పర్వతములు, కన్, శశికాంత ..థములు = శశికాంతకృత = చంద్రకాంతపురాళ్లతోఁ ( పటికపురాళ్లతోఁ ) గట్టఁబడిన, చతుష్పథములు = నాలుగుత్రోవలు గలసినచోట్లు, ( ఇచట మార్గము లనియే యర్థము ) ఝరులు = సెలయేళ్లు, కాన్, కరిఘటల్ = ఏనుఁగులగుంపులు, ఏనుఁగలసముదాయము ఘట యనంబడు. ( ని ) కరిణాం ఘటా ఘటా ( అ ) మకరసంఘాతములు = మొసళ్లగుంపులు, కన్, ఉత్తాలసాలంబులు = ఎత్తైనప్రాకారములు, ఉల్లోలతతులు గాన్ = పెద్దతరంగములు గాన్, అఖిలాంగనాజనంబు = ఎల్లస్త్రీలసముదయము, అప్సరోగణము గాన్ = అచ్చరలసముదాయము గాన్, పురలక్ష్మి = నగరశోభ, కల్మిపూబోఁడి = లక్ష్మీదేవి, కాఁగన్, పువ్వు + మేను = పూబోఁడి. బహువ్రీహిని స్త్రీవాచ్యం బగచో నుపమానంబుమీఁది మేనునకు బోఁడి యగు శా స సతత......లెల్లన్ = సతత = ఎడతెగని, మంగళ = శుభసూచకములైన, తూర్యనిస్వనములు = భేరులమ్రోఁతలు, ఘనతరంగరవంబులు = గొప్పతరంగముల ధ్వనులు, ఐ, కడలుకొనఁగన్ = దిక్కులను వ్యాపింపఁగా, అప్పురంబు = ఆద్వారక, క్షీరవారాశియో యనన్ = క్షీరసముద్రమువలె, చెలువు = కాంతిచే, మిగిలి = అతిశ

యించి, హరికిన్ = కృష్ణునకు, శుభకరమై = సంతసము గల్గించునది యై, ఒప్పున్ = ప్రకాశించును.

పాలసముద్రమనుకలితిన్నెలు మొదలైనవానిచె మిగుల మనోహరమైనది గావున నం దెప్పుడు విష్ణువు వసించు చుండును. ఆవిష్ణువే యిప్పుడు శ్రీకృష్ణుఁడై యిందు వసియించెఁ గాన నిదియుఁ దనధర్మములచేఁ బాలసముద్రముంబోలి సంతసము గలిగించు చుండె నని యాశయము

ఉ॥ మేలిపసిండిముచ్చగమి ♦ మించుపతాకలు చిత్రరత్నపాం
చాలిక లబ్జరాగకల ♦ శద్యుతులున్ గలచంద్రశాలికా
జాలము వ్రేల్చుఁ బట్టణపు ♦ సంపదఁ గన్గొన నిల్చునిర్జర
స్త్రీలవిశాలనవ్యమణి ♦ దివ్యవిమానవితానమో యనన్॥ 101.

మేలి..... గమిన్ = ప్రశస్తమైనబంగారుచిఱుగంటలయొక్క గుంపుచే, మించుపతాకలు = ప్రకాశించు టెక్కెములును, చిత్రరత్నపాంచాలికలు = చిత్ర = వ్రాఁతపటములయందలి, రత్న పాంచాలికలు = రత్నపుంబొమ్మలును, (ని) పాంచాలికా పుత్రికా స్యాద్వస్త్ర దంతాదిభిః కృతా (అ) అబ్జ.. ద్యుతుల్, అబ్జరాగ = పద్మరాగములయొక్క, (కెంపులతోఁ జేయఁబడిన) కలశ = కుండలయొక్క, ద్యుతుల్ = కాంతులును (ఇవి ద్వితీయార్థమునఁ బ్రథమలు) కల.... .జాలము = పొందినమేడలమీఁదియిండ్లు, పట్టణపుసంపదన్ = నగరశోభను, కన్గొనన్ = చూచుటకు, నిల్చు .....మోయనన్ = నిల్చు = ఉండెడి, నిర్జరస్త్రీ = దేవతాస్త్రీలయొక్క, విశాల = విరివిగల, నవ్య = నూతనమైన, మణి = రత్నములయొక్క (రత్నములచేఁ జేయఁబడిన) దివ్య = ఆకాశమునను న్న, విమానవితానమో యనన్ = విమానసముదాయమో యనునట్లు (విమానము = అంతరిక్షమున దేవతలెక్కి సంచరించెడురథము) వ్రేల్చున్ = ప్రకాశించును.

ఇప్పట్టణమునందలి మేడలమీఁదియిండ్లయం దున్నప్రతిమలు పట్టణసౌందర్యముం జూడవచ్చినదేవకన్యలువలె నాయిండ్లు మిగులం బొడవు గలవి యగుటచె నాకాశమున నున్నవారివిమానములువలెను బ్రకాశించు చుండె నని తాత్పర్యము

ఉత్ప్రేక్షాలంకారము

చ॥ అరుణగభస్తి మున్నహర ♦ హాంబును నంబరవీధి నేగఁగాఁ
బురవరభర్మహర్మ్యచయ ♦ ముల్ గమనంబున కడ్డమైనచోఁ

విని, ( పెక్కుసారులు వినుటచే నేర్చి యని యర్థము. ) తాన్, ధాత్రిన్ = భూమియందు, కళానిధియనన్ = విద్యలకు వాసస్థాన మనునట్లు, ( చంద్రునిపదియాఱవభాగము కళ యనంబడు అట్టివానికి వాసస్థానము ) ప్రసిద్ధిన్ = ఖ్యాతిని, చెందెన్ = పొందెను. చంద్రుఁడు ప్రతిదినము రేలా పురమార్గమునం బోవుచు నచట నున్న స్త్రీలు చేయుకావ్యగానాదిగోష్ఠులను విని తా నేర్చి కళానిధి యనుపే రొందె నని తాత్పర్యము.

ఇందుఁ జంద్రునికిఁ బేరైనకళానిధిశబ్దమునకు యోగమున ( అవయవశక్తిచే ) వేరర్థమును గల్పించుటచే నిరుక్త్యలంకారము

చ॥ లలితజలోర్ధ్వయంత్రిఝరు ♦ లం బస పాడఁగ ధూపధూమకుం
తలములు కేతుహస్తకల ♦ నన్ నగ రేందిర విప్పి సొమ్ములం
దళియల నుంచెఁ బ్రోవులుగ ♦ నాఁ బొలు పౌనవరత్నరాసుల
న్విలసిలుఁ గాంచనాంచితవ ♦ ణిగ్వపణీరమణీయహట్టముల్॥ 104.

నగరేందిర = పురశోభ యనులక్ష్మి, లలిత లన్, లలిత = సుందర మైన, జలోర్ధ్వయంత్రఝరులన్ = నీటిని మీఁదికిఁ జిమ్ముగ్రోవులవలనఁ గలిగినప్రవాహములందున్, పసపాడఁగన్ = పసపు పూసికొని స్నానము చెయుటకున్, కేతుహస్తకలనన్ = టెక్కెము లనుచేతులవ్యాప్తిచేన్, ( చేతులఁ జాచి యని యర్థము ) ధూపధూమకుంతలములన్ = పరిమళముకై కాల్చుకృష్ణాగరు మొదలైనవానిపొగ లనుముంగురులను, విప్పి, సొమ్ములన్ = తనదేహమునందలి యాభరణములను, ప్రోవులుగన్ = రాసులుగాను, తళియలయందున్ = పళ్లెరములందున్, ఉంచెనాన్ = ఉంచెనో యనునట్లు, పొలుపౌనవరత్నరాసులన్ = ఒప్పెడునవరత్నములు మొదలైనవానిరాసులతోన్, కాంచనాంచిత రమణీయహట్టముల్ = కాంచన = బంగారముతోన్, అంచిత = ఒప్పుచున్న, వణిగ్వపణీ = బజారులందలి, రమణీయ = మనోహరములు ( అగు ) హట్టముల్ = అంగడులు, విలసిలున్ = ప్రకాశించును

ద్వారకాపురమునందలిబజారులు పురలక్ష్మి స్నానము చెయుటకై యూడ్చి పళ్లెరముల నుంచినయాభరణములువలె నున్నరత్నరాసులతోడను బంగారురాసులతోడను నెల్లప్పుడు నిండి యుండు నని తాత్పర్యము.

చ॥ సవరము లంచు మబ్బు నటు ♦ చందురుఁ జందురువంక యంచు సాం
కవ మని తత్కళంకము ని ♦ గారవుహారము లంచుఁ దారకా

నినహాము నెంచి తాల్చుటకు ♦ నేర్పునఁ జేకొనఁ బోవఁ బ్రౌఢ లౌ
నువిదలు మాన్ప మాని యిటు ♦ లుందురు మేడల ముగ్ధసుందరుల్॥

ముగ్ధసుందరుల్ = ముగ్ధ లగుస్త్రీలు, (క్రొత్తజవ్వనము గలనాయిక ముగ్ధ యనంబడు.) మబ్బుల్ = మేఘమును, నవరము లంచున్ = చమరీవాలము లని భ్రమించుచున్) అలచందురున్, (ఇచట లక్షణచె లేఁతచందురు నని యర్థము) చందురు వంక యంచున్ = ఱేఁడువాఁడు శిరసున ధరించుకొను నాభరణ మనియును (చంద్రవంక), తత్కళంకముల్ = చంద్రునిలోనినల్లనిమచ్చను, సాంకవ మంచున్ = జవ్వాది యనియును, తారకానివహముల్ = నక్షత్రసముదాయమును, నిగారపుహారము లంచున్ = శ్రేష్ఠ మైనముత్యాలదండ లనియును, ఎంచి = తలంచికొని (భ్రాంతిపొంది యని యర్థము) తాల్చుటకున్ = ధరించుటకు, నేర్పునన్ = నైపుణ్యముతో, చేకొనఁబోవన్ = చేతితోఁ బుచ్చుకొనుటకు యత్నింపఁగాన్, ప్రౌఢలు = నిండుజవ్వనము గలవారు, లౌనువిదలు = ఐనస్త్రీలు, మాన్పన్ = వానిస్వరూపమును జెప్పి నివారింపఁగా, మాని = విడిచి, ఇటులు = ఈప్రకారము, ఉందురు

అసట్టిమున నున్న ముగ్ధలు మేడలు మిగుల నున్నతము లగుటచే సమీపమున నున్నమబ్బు మొదలగువానిం జూచి యలంకారము లని భ్రమపడి ధరింప యత్నింపఁగాఁ బ్రౌఢలు వాని స్వరూప మెఱిఁగినవారు గావున మాన్పుచుండి రని భావము

ఇంత ముగ్ధలకు మబ్బు మొదలైనవానియందు భ్రాంతి గలుగుటచే భ్రాంతిమదలంకారము

చ॥ తగవున శేషునిన్ శ్రుతిని ♦ దక్షిణమూర్తిలీలలు నేరఁ డంచు ది
వ్యగురుని గావ్యగోష్ఠి నిసు ♦ మంత యెఱుంగఁ డటంచు సద్వ్రతుం
డగుద్విజరాజునుం గడుఁ బ్రి ♦ భాకరుమిన్కులఁ జక్క నంచు నెం
చఁగఁగల రప్పురిన్ నిగమ ♦ శాస్త్రకళాచతురుల్ మహీసురుల్॥

అప్పురిన్ = ఆద్వారకాపురమునందున్, నిగమ . చతురుల్ = నిగమ = వేదములచేతను, శాస్త్ర = మీమాంస మొదలగువానిచేతను, కళా = గానాదులచేతను, చతురుల్ = నేర్పరులు, (విద్వాంసు లని యర్థము) (వేయవలసినకార్యములను, జేయఁగూడనిదుష్కార్యములను బోధించునది వేదము) మహీసురుల్ = బ్రా

హ్మణులు, తగవునన్ = (విద్యానిమిత్తమైన) జగడమునందు, శేషునిన్ = వేయినోళ్లు గలిగి వ్యాకరణభాష్యమును రచియించినసర్పరాజును (విష్ణువీయనయందుఁ బరుండుటచే నీయనకీ పేరు గలిగెను) శ్రుతి... లీలలు = శ్రుతి = వేదసంబంధమైన, పదక్రమ = పదముయొక్కయుఁ గ్రమముయొక్కయు, లీలలు = విలాసములను, నేరఁడంచున్ = తెలిసికొనలేఁ డనియును, వేదమున మిక్కిలి గొప్పవి యగుజట, ఘన యటుండఁ బెక్కండ్రు నేర్చెదుపదక్రమములు సైతము నేరఁ డని యర్థము చెవులయొక్కయుఁ బాదములతోడినడకయొక్కయు విలాసములు లేనివాఁ డని భావము (శ్రుతి = చెవి, పదక్రమ = పాదములతోడినడక,) పాములకుఁ జెవులును బాదములతోడినడకయును లే వని స్పష్టము దివ్యగురునిన్ = స్వర్గమున నున్న వారి కొజ్జయైన బృహస్పతిని, కావ్యగోష్ఠిన్ = రామాయణాదిగ్రంథములయొక్క ప్రసంగమును, ఇసుమంతయున్ = కొంచెమైనను, ఎఱుంగఁ డటంచున్ = నేర్చినవాఁడు కాఁ డనుచు నని యర్థము శుక్రునితో సహవాససంభాషణాదుల నెఱుఁగనివాఁ డని భావము కావ్యుఁడు = శుక్రుఁడు, (ని) శుక్రో దైత్యగురుః కావ్యః (అ) సద్వృత్తుండై = పుణ్యకర్మములు గలవాఁడు (నక్షత్రములయం దాసక్తి కలవాఁ డనియు నర్థము) అగుద్విజరాజును = అగుచంద్రుఁడును, (బ్రాహ్మణశ్రేష్ఠు డనియు నర్థము) ప్రభాకరుమిన్కులన్ = పూర్వమీమాంసావాక్యముల నని యర్థము సూర్యకాంతులచేత నని భావము చిక్కన్ = లొంగగను. కృశించె నని భావము అంచున్, ఎంచఁగఁగలరు = లోపముల నెన్నుటకు సమర్థు లగుదురు

వేదములను, కావ్యములను, సంగీతాదివిద్యలను నెఱిఁగిన ద్వారకాపురవాసులగు బ్రాహ్మణులకుఁ బదక్రమము తెలియని శేషుఁడును, కావ్యగోష్ఠి నెఱుఁగని బృహస్పతియుఁ బ్రభాకరునకు జడియు ద్విజరాజును దుల్యులు గా రని తాత్పర్యము సకలవిద్యల నేర్చినబ్రాహ్మణు లప్పురమునఁ గల రని ఫలితార్థము

శ్లేషానుప్రాణితవ్యతిరేకాలంకారము

సీ॥ సమదారిబలభిదా ♦ చణులై మహాహవ
భాగసద్వ్యము లౌచుఁ ♦ బరఁగుపల్లి
యనుజాతశౌర్యాత్త ♦ ఘనతరైశ్వర్యులై
దివ్యకల్పు లగుచుఁ ♦ దేజరిల్లి
గురుహితార్థప్రదా ♦ నరతులై పరమేశు

రమణీయహాయు లౌచు • రమణ కెక్కి
సకలస్తుతపవిత్రు • సద్గోత్రు లై పాలి
తాఖిలవిబుధు లై • యతిశయిల్లి
స్థిరసుధర్మాధిగతు లయి • చిరవినోద
కరసదారంభు లగుచు భా • స్వరతఁ దనరి
సారతరభోగితతయశ • స్సాంద్రు లగుచు
నింద్రు లన నొప్పు చుండ్రు రా • జేంద్రులచట॥ 107.

ఈపద్యమున రాజులకు నింద్రునకుఁ బోల్కి చెప్పుటచే విశేషణము లన్నియు రెండర్థముల నిచ్చును మొదట రాజపరమైనయర్థమును బిమ్మట నింద్రపరమైనయర్థమును వ్రాయఁబడును

అచటన్ = ఆద్వారకాపురమునందున్, రాజేంద్రులు = రాజశ్రేష్ఠులు, సమదా . లై = సమద = గర్వముతోఁ గూడిన, అరిబల = శత్రుసేనలయొక్క, భిదా = చీల్చుటచే, చణులై = నేర్పుగలవారై, ( గర్వముతోఁ గూడినశత్రుఁ డగుబలుఁ డనురక్కసునిఁ జీల్చుటచె నేర్పుగలవారలు. ఇంద్రులు ) మహా . . సద్యములు, మహత్ = గొప్పది యగు, ఆహవ = యుద్ధాపక్తియు, భాగ = భాగ్యమును, సద్యములు = మంచివి యగుసత్యాదిగుణములు గలవారు, ఔమన్, పరిఢవిల్లి = ప్రకాశించి, ( మహత్ = గొప్పవి యగు, ఆవావ = యజ్ఞములయందలి, భాగ = పాలియందు, సద్యములు = మంచి యేర్పాటుగలవారు ) అనుజాత . లై, అనుజాత = సహజమైన ( తోడఁబుట్టిన ) శౌర్య = పరాక్రమముచేతిన, ఆత్త = సంపాదింపఁబడిన, ఘనతరైశ్వర్యులై = గొప్పసంపద కలవారై ( తమ్ముఁడైన వామనునియొక్క పరాక్రమముచె సంపాదింపఁబడినగ్యైశ్వర్యము కలవారై అనుజాత = తమ్ముఁడు ) మున్ను బలి యింద్రునైశ్వర్య మపహరింపఁగా నతనితల్లి విష్ణువుతో మనవిచేసికొనె నవియు నాతఁ డదితికశ్యపులకు నుపేంద్రుఁడై జన్మించి బలి నడిగి యైశ్వర్యుము బరిగ్రహించి మఱల నింద్రుని కిచ్చె నని యు భాగవతము.

దివ్యకల్పు లగుచున్ = దేవతలతోఁ దుల్యులగుచున్, తేజరిల్లి = ప్రకాశించి, ( దేవలోకమందలియుత్పత్తి కలవా రగుచుఁ బ్రకాశించి ) గురు . లై, గురు = ఉపాధ్యాయునకును, తండ్రి మొద లగుపూజ్యులకును, హిత = మేలైన, అర్థ = వస్తువులయొక్క, ప్రదాన = యిచ్చుటయందు, రతులై = ఆసక్తులై, ( బృహస్పతికి మేలైన

వస్తువుల నిచ్చుటయం దాసక్తి గలవారు.) వర......లౌచున్ = వర = శ్రేష్ఠ మైన, మేఘ = మబ్బుం బోలిన, రమణీయ = మనోహర మైన, హయములు = గుఱ్ఱములు గలవారు ఔచున్, రమణ కెక్కి = ప్రీతి నొంది ( మేఘము లనెడుమనోహర మై గుఱ్ఱములు గలవారు (ని) తురాషా ణ్మేఘవాహనః. అ) సకల . . లై = సకల = ఎల్లవారిచేతను, స్తుత = స్తోత్రముచేయఁబడిన, పవిత్ర = పావన మైన, సద్గోత్రులు = మంచికులము గలవారు, ఐ, ( సకల = ఎల్లవారిచేతను, స్తుత = స్తోత్రముచేయఁబడిన, పవి = వజ్రాయుధముచే, త్రిసద్గోత్రులు = జడియుచున్న పర్వతములు గలవారు.) పాలి . తై, రక్షింపఁబడినయెల్లవిద్వాంసులు గలవారై, ( రక్షింపఁబడినయెల్లదేవతలు గలవారు ) అతిశయిల్లి = ప్రబలి, స్థిరసుధర్మాధిగతు లయి = శాశ్వత మైనపుణ్యకార్యముల నెఱిఁగినవారై, ( శాశ్వత మైనసుధర్మ యనుసభను బొందినవారై (ని) స్యాత్సుధర్మా దేవసభా అ) చిర. . .లగుచున్ = చిర = శాశ్వతమైన, వినోదకర = సంతసమును గలిగించెడు, సదారంభులు = సత్కార్యములు గలవారు, అగుచున్, ( చిరకాల మానందము గలిగించువారును నెల్లపుడు రంభ గలవారును.) భాస్వరతన్ = ప్రకాశించుస్వభావముతో, తనరి = ఒప్పి, సార .. లగుచున్ = సారతర = మిగుల ప్రశస్త మైన, భోగ = సుఖానుభవముచేతను, తతయశః = అధిక మైనకీర్తిచేతను, సాంద్రులు = నిండినవారు, అగుచున్, ఇంద్రు లకన్ = ఇంద్రులువలె, ఒప్పు చంద్రు = ప్రకాశించు చంద్రు

ఇందు శ్లేషానుప్రాణితోపమాలంకారము

చ॥ మును దనపూర్వ లోకు లల ♦ ముల్ దిని కాలము పుచ్చుచుండ మై
కొని యొకదిక్కునన్ నవతఁ ♦ గొన్నినిధుల్ సమకూర్చుకొంచు ని
ల్గొనరుకు బేరుఁ బేరుకొన ♦ కుందురు బేరులు పట్టణంబునం
దనిశనవాధికార్థనిధు ♦ లంచితదానకలాకళానిధుల్॥ 108

పట్టణంబునందున్ = ద్వారకయందున్, అనిశ. .. నిధుల్ = అనిశ = ఎల్లపుడును, ( తండ్రి తాతలనాఁటినుండియు నని యర్థము ) నవ = తొమ్మిదికంటె, అధిక = ఎక్కువసంఖ్య గల, అర్థనిధులు = ద్రవ్యరాసులు గలవారు, కుబేరునకు స్వార్జితములైనతొమ్మిది ద్రవ్యరాసులు కలవు ఈపట్టణమున నుండువైశ్యులకుఁ బూర్వకాలమునుండియు ననేకము లగుద్రవ్యరాసులు గల వని యాశయము అంచిత...నిధుల్ = పూజింపఁబడినదానవిద్యం జంద్రుం బోలినవారు, బేరులు = వైశ్యులు, మును = పూర్వ

కాలమునందు, (ఇది కాలవాచకము గావునఁ బ్రథమ యయ్యెను.) కాలాధ్వముల కుం బ్రాయికంబుగాఁ బ్రథమ యగు. బా కా తనపూర్వులు = తనతండ్రితాతలు, (విశ్రవసుఁడు మొదలగువారు) ఆకు లలముల్ = ఆకులఁ గూరలను, తిని = భక్షించి, కాలము పుచ్చుచుండఁ = కాలక్షేపము చేయుచుండఁగా, మైకొని = అంగీకరించి, (కుబేరుఁడు ధనము గలవాఁ డయ్యును దండ్రితాత లగుఋషులు తగినపదార్థములు సంపాదింపలేక యాకులు మొదలగువానిని భక్షించుచుండ నూరక చూచుచుండె నని యర్థము వారు తపస్వులు గావున నట్టిపదార్థముల భక్షించుచుండి రని భావము. ఒకదిక్కునఁ = ఒకకోటను, (ఉత్తరదిశయం దని భావము.) నవతఁ = (ఉపవాసామునఁ) గ్రసించుటచే, (తొమ్మిదిసంఖ్యచేత నని యర్థాంతరము) కొన్ని నిధుల్ = కొన్ని ద్రవ్యరాసులను, సముపార్జించుచుఁ = సంపాదించుకొనుచుఁ, ఇట్లొనరుకుబేరుఁ = ఇట్లుండుకుబేరుని, పేరుకొన కుందురు ఉచ్చరింప కుందురు. ఆపురమునందలివైశ్యులు పూర్వమునుండియు ననేకద్రవ్యరాసులు గలవారునువృద్ధులకు సౌఖ్యము గలుగునట్లు వ్యయపఱుచువారును దానము సేయువారును గానఁ దాను మిగులం గృశించి తండ్రితాత లాకులఁగూరలు దినుచుండఁగా నూరకుండి క్రొత్తగాఁ గొన్ని ద్రవ్యరాసులు సంపాదించినకుబేరుని పేరుసైతము దలంప నిష్టపడ రని యర్థము. వ్యతిరేకాలంకారము

క॥ హలరేఖలు లక్ష్మీకర
విలసనములు బహుళభద్ర ♦ విభ్రమగతులుం
గలిగి హరిచరణసదృశత
నలరుచు రలఘుబల మొప్ప ♦ నప్పురిశూద్రుల్॥ 109.

ఇందు శూద్రులు తమజన్మస్థాన మైనవిష్ణుపాదముంబోలి యున్నా రని చెప్పుటచేఁ బెక్కుపదములకు రెం డర్థములు గలవు

అప్పురిశూద్రుల్ = అప్పీటియం దున్నశూద్రులు, హలరేఖలు = నాఁగలిచాళ్లును, నాఁగలియాకారము గలరేఖ లని పాదపర మైనయర్థము అచటిశూద్రులు పెక్కునాఁగళ్లు గలవా రనియును భగవంతునిపాదమునందు నాగళ్లం బోలినరేఖలు గలవనియును నర్థము లక్ష్మీకరవిలసనములు = ఐశ్వర్యము గలిగించుచేష్టలును, లక్ష్మీదేవి యొక్కచేతియందలి ప్రకాశము లని యర్థాంతరము శూద్రులు సంపదలను గలిగించు పనులఁ జేయువా రనియును లక్ష్మీదేవి విష్ణునకుఁ బత్ని గావున నాయనపాద మొత్తునపు డామెచేతికాంతు లందుఁ బ్రసరించుచుండె ననియు నర్థము బహు......

గతులుఁ = బహుళ = అనేకము లగు, భద్ర=శుభములయొక్కయు, విభ్రమ = భూషణములు మొద లగువానిని ధరించుటచేఁ గల్గుకాంతియొక్కయు, గతులు = ప్రాప్తులను, అనేకము లగు నెద్దులయొక్క విలాసములని యని యర్థము. ( బహుళ = అధికమైన, భద్ర = శుభముల నిచ్చెడు, వి = పక్షియొక్క ( గరుడుని ) భ్రమ = సంచారముచేత, గతులు = గమనములను. గరుడవాహనముననుం బోవునది యని పాదపరమైనయర్థము ) కలిగి = పొంది, అలఘుబలము = గొప్పదార్ఢ్యము, ఒప్పఁ = ప్రకాశింపఁగా, హరిచరణసదృశతఁ = విష్ణువుపాదముతోడిసాదృశ్యముచేత, నలరుదురు = ప్రకాశింతురు. శ్లేషానుప్రాణితోపమాలంకారము

గీ॥ బలవదుత్తుంగరూపవై ♦ భవ మతిస్థి
రాభరణలీల తతగండ ♦ శోభితరుచి
శ్రితఘనాళి సదావన ♦ శ్రీయుఁ గలిగి
పొలుచుభూభృన్నిభంబు ల ♦ ప్పురి నిభములు॥ 110.

ఈపద్యమున నేనుఁగులకుఁ బర్వతములతో సదృశ్యము చెప్పుటచేఁ దక్కిన పదము లన్నియు నుభయధర్మములం జెప్పను

భూభృన్నిభములు = పర్వతములతో సమానములు, ఇభములు = ఏనుఁగులు, బలవ. . వైభవము = బలవత్ = మిక్కిలి బలము గల, ఉత్తుంగ = మిక్కిలి యెత్తైన, రూపవైభవము = ఆకారముయొక్క నతిశయమును ( ఇది రెంటికి సమము ) అతిలీల = అతి = మిక్కిలి, స్థిరా = భూమిక, ఆభరణలీల = భూషణములయొక్క శోభ యని యేనుఁగుపరము అతి = మిక్కిలి, స్థిరా = భూమియొక్క, భరణలీల = మోచుట యనక్రియ యని పర్వతపరము తత రుచి = తత = విశాలమైన, గండ = చెక్కులయొక్క, శోభిత = దీప్తమైన, రుచి = కాంతి యని యేనుఁగుపరము. తత = విశాలము లగు, గండ = రాతిపలకలయొక్క, శోభిత = దీప్తమైన, రుచి = తేజస్సు నని పర్వతపరము. శ్రితఘనాళిన్ = ఆశ్రయించిన అధికమైనతుమ్మెదలను, ఇచట నళిశబ్దము జాత్యేకవచనము ఆశ్రయించిన మేఘసముదాయము నని పర్వతపరము. సదావనశ్రీయుఁ = ఎల్లప్పుడు మదోదకశోభ యని యేనుఁగు పరమైనయర్థము సదావనశ్రీయనుచో, సదా = దాయనునక్షరముతోఁ గూడినదియు, అవ = వకారముతో శూన్యమైనదియు, 'న' యనుదానియొక్క శోభ యని యర్థము సదావన యనుదానియందు 'దా' యనునక్షరము నుంచి వకారమును దీసి 'న' యనుదానిం గలుపఁగా దాన యని యుండును. దానశబ్దమునకు మదజలి యర్థము ( ని ) సదా దానం ( అ ) ఎప్పుడును

వనశోభ యని పర్వతపరము. కలిగి=పొంది, అప్పురిన్=ఆపట్టణమందు, పొల్చున్=ప్రకాశించును ఇందలంకారము వెనుకటియట్లే యెఱుంగునది

చ॥ ఒదవెడునాత్మవేగమున ♦ కోడిసమీరణపంచకంబు దాఁ
బదములఁ బట్టెనో యనఁగఁ ♦ బంచవిధాంచితధార లొప్పఁగాఁ
బ్రదరములట్లు యోడి యిరు♦పార్శ్వములందముఁ గొల్చుచుండెనాఁ
బొదు లిరుగ్రేవలం బొదలఁ ♦ బొల్చు మహాజవనాశ్వముల్ పురిన్॥

మహాజవనాశ్వముల్=మిగులవడి గలగుఱ్ఱములు, ఒదవెడునాత్మవేగమునకున్=తగునట్టితమయొక్క (గుఱ్ఱములయొక్క) శీఘ్రగమనమునకు, ఓడి=అపజయము నొంది, సమీరణపంచకంబు=ప్రాణాదివాయువులు, పదములన్=(అశ్వములయొక్క) పాదములను, పట్టెనో యనఁగన్=ఆశ్రయించెనో యనునట్లు, పంచవిధాంచితధారలు=పంచవిధ=ఐదువిధములచేత, అంచిత=ఒప్పుచున్న, ధారలు=గమనవిశేషములు, (ని) ఆస్కందితం ధోరితకం రేచితం వల్గితం ప్లుతం గతయోమూః పంచధారాః అ అతివేగము నతిమందము గాని సమమైనగతి యాస్కందితము అంతకంటె నధికమై చతురమైనగతి ధోరితకము తాళగతితోఁ దిరుగుట రేచితము వేగముతోఁ గూడి కాళ్లు మీఁదికిఁ గదలించుచుఁ బోవుట వల్గితము పోవునంతదూరమును సమముగా వేగముగాఁ బోవుట ప్లుతము ఒప్పఁగాన్=ప్రకాశింపఁగాన్, అట్లు=ఆవాయువులవలెనే, ప్రదరములు=బాణములు, ఓడి=అపజయము నొంది, ఇరుపార్శ్వములన్=రెండుప్రక్కలయందును, తమున్=ఆయశ్వములను, కొల్చుచుండెనాన్=సేవించుచున్నవో యనునట్లు, పొదులు=తూణములు, ఇరుగ్రేవలన్=రెండుపార్శ్వములయందును, పొదలన్=ప్రకాశింపఁగాన్, పురిన్=పట్టణమునందున్ పొల్చున్=ప్రకాశించును

ఇందు ధారలను గమనవేగమున కోడి పాదములం బడినవాయువు లని యుత్ప్రేక్షించుటచే నుత్ప్రేక్షాలంకారము

చ॥ లలితమణీశిరోగృహము ♦ లన్రహిఁ దోఁప విమానలీలలన్
దల మగురత్నకుట్టిమశ ♦ తంబులఁ దోఁప శతాంగరీతులం
బలునెలరాలఁ జాటి పిద ♦ పం జని హెచ్చఁగ స్యందనస్థితిం
దెలుపుచు నూరఁ దీరు గనుఁ ♦ దేరులు పేరులు సార్థకంబుగాన్॥

తేరులు=అరదములు, లలిత . లన్, లలిత=సుందరమైన, మణిశిరోగృహములన్=మణులసంబంధమైన (మణులతోఁ గట్టఁబడిన) మేడమీఁదియిండ్లయందున్, రహిన్=బాగుగా, తోఁపన్ = ప్రతిఫలించుటచే, విమానలీలలన్=విమానములయొక్క విలాసములను, దలము=తలము, అగురత్నకుట్టిమశతంబులన్ = అగురత్నములయొక్క కట్టడపునేలలయొక్క నూఱులందున్ (అనేకము లగు మణులు దాపినభూములయం దని యర్థము) తోఁపన్=ప్రతిబింబించుటచే, శతాంగరీతులన్=నూఱుశరీరములయొక్క ప్రకారములను, ఉరునెలఱాలన్ = పెద్దచంద్రకాంతపుఱాలయందున్, జాఱిచని జరిగిపోయి, పిదపన్=తరువాతను, హెచ్చుగన్=అతిశయముగాను, స్యందనస్థితిన్=జాఱుటయొక్క రీతిని, తెలుపుమన్=ప్రకటించుచు, పేరులు=రథనామములు (విమాన, శతాంగ, స్యందన నామములు) సార్థకంబుగన్=అర్థముతోఁ గూడిన వగునట్లు, ఊరన్=ద్వారకాపురమునందు, తిరుగున్=సొగసుగనుండును

ఆపురమునందలి రథములు మేడలమీఁదియిండ్లయందుఁ బ్రతిఫలించుటచే విమాననామములను, రత్నపునేలలయందుఁ బ్రతిబింబించుటచే శతాంగనామములను, స్ఫటికపుఱాలయందు జాఱుచుం బోవుటచే స్యందననామములను సార్థకము చేసికొనె నని యర్థము విమానము—గమనమునందుఁ బక్షితో సాదృశ్యము గలది ఈపేరు రథములు మేడలమీఁదిభాగమునఁ బ్రతిఫలించుటచే సార్థక మయ్యెను ఆకాశమునం బోవునట్లుండె నని భావము శతాంగము=నూఱంగములు గలది ఈశబ్దమునకు నూఱవయవములు గలదని యర్థ మైనను ప్రకృతమున నూఱు శరీరములు గల దని గ్రహింపవలెను ఈపేరు పెక్కురత్నపునేలలయందుఁ బ్రతిఫలించుటచే సార్థక మయ్యెను ఒక్కొక్కరథమే పెక్కుస్థలములఁ గాన్పించుటచేఁ బెక్కు లాకారములు గలట్లు కనుపడె నని భావము స్యందనము=జాఱుచుం బోవునది ఈపేరు స్ఫటికపుఱాలమీఁద జాఱుటచే నర్థవంత మయ్యెను

సీ॥ సంగీతనృత్యకౌ ♦ శలము మెచ్చఁగ రాజ
గాయకుల్ నర్తకీ ♦ కములు గనిరి
దగ్గఱిల్లి గాయవా ♦ దములు దిక్కులఁ బ్రాఁకె
కువలయాధిపవాక్కు ♦ కోటుల దూఁకె
స్వాంతశక్తిమంపుశ్రీ ♦ స్వర్గ్యులచే బలె రతి
క్రాంతాంగనాసమ్యఘు ♦ రమ్యజల మాని

సాంకవమృగమద ♦ చంద్రసౌరభములు
గైకొనంగబలెనం ♦ గళ్ల మెలఁగి
పురతురంగమగమనచా ♦ తురికి నోడి
వింతసిగ్గునఁ దనయొక్క ♦ రింత నడఁగ
నడవమి ననంగ జడ నగు ♦ నడక లసర
నంపొలయుచుండు మలయమం ♦ దానిలుండు॥ 113.

మలయ .. ..లుండు=మలయపర్వతసంబంధ మగుచుండువాయువు (దక్షిణపుగాలి) అందుఁ=ఆపురమున, సంగీ . .శలము=సంగీత = గానముయొక్కయు, నృత్య = (అవయవములచే భావము సూచించు) ఆటయొక్కయు, కౌశలము= నైపుణ్యము, మెచ్చఁగబలెఁ=మెచ్చుటకువలెను, గాయ ములు, గాయన్నటీ= పాడుచున్న స్త్రీలయొక్క, కైశికములు=కేశపాశములను, నిమిరి=స్పృశించి, మెప్పు గలుగునట్లు విద్యావిశేషముం జూపినవారికిశిరమేని శరీరమేని స్పృశించుట లోకదృష్టము. వేఁవలన్=తెల్లవారుజాములందుఁ, దంపతి.. . దములు=దంపతి=భార్యాభర్తలయొక్క, ప్రణయవాదములు=పొలయలుకలను, తీర్పబలెఁ=తీర్చుటకువలె, సౌధగవాక్షకోటిఁ, సౌధ = మేడలయందలి, గవాక్షకోటిఁ=కిటికీలసముదాయమును, దూఱి=ప్రవేశించి, పొలయల్కచె మాన్పఁగ మిడినభార్యాభర్తలు మన్మథోద్దీపన మైనచల్లగాలి సోఁకినంతనె మానము విడిచి యభిముఖు లగుటచే శీతవాయువులు వారికలకం దీర్చుట కందుఁ బ్రవేశించెనో యను నుత్ప్రేక్షించెను.

స్వపథ .. చేఁ, తనమార్గాయాసమునఁ గలిగినదప్పిచేతను, బలెఁ=వలెఁ రతి .. .జలము. రతి=సంభోగముచేతను, శ్రాంతా=అలసిన, అంగనా=స్త్రీలయొక్క, ఆస్య=మోమునందలి, ఘర్మజలము=చెమటనీటిని, ఆని=త్రావి, క్రీడలచే నలసినస్త్రీలచెమ్మటలాఱునట్లు వారిమోమునఁ బ్రసరించి యని యర్థము. సాంక . .ములు = సాంకవ = జవ్వాదియొక్కయు, మృగమద = కస్తూరియొక్కయు, చంద్ర=కప్పురముయొక్కయు, సౌరభములు=పరిమళములు, (ని) ఘనసార శ్చంద్రసంజ్ఞః అ. కైకొనంగబలెఁ=చేకొనుటకువలె అంగళ్లన్ = బజాఱులయందు, మెలఁగి=సంచరించి, తనయొక్కరింత = తనవాహ్యా మైనయుక్తి, పుర..... చాతురికిన్=పుర=పట్టణమునందలి, తురంగమ=గుఱ్ఱములయొక్క, గమనచాతురికిఁ=నడకలనేర్పునకుఁ, ఓడి, వింతసిగ్గునఁ=అపూర్వ మైనసిగ్గుచేతను, నడవమి ననంగఁ=

నడవకపోవుటచేతినో యనునట్లు జడనుగునడకలు = మెల్లనినడకలు, అపేన్ = కలుగఁగా, ఒలయుచుండున్ = సంచరించుచుండును ఉత్ప్రేక్షాలంకారము

సీ॥ అమితరసప్రౌఢి ♦ నలరెడు సరసుల
నెనయుటవలనఁ బ ♦ ద్మిను లనంగ
లలితబంధవిశేష ♦ ములమహాభోగులఁ
దనుపుటవలన భో ♦ గిను లనంగ
ఘనతరాగములపెం ♦ పెనసి పల్లవలాభ
గరిమ దాల్చుటఁ గల ♦ కంఠు లనఁగఁ
దజ్ఞులు వినుతింపఁ ♦ దగు వెల లందుచు
మనుటచే సురుచిర ♦ మణు లనంగఁ
బ్రాలి తతమంజులాస్యవి ♦ భ్రమసమృద్ధి
లలరఁ బ్రీతిభరతరహాస్య ♦ ములను నలరుచు
తగుచు రంభాదులను గెల్చు ♦ సొగసునఁ బురి
నెఱలు చెంపొందు వారసుం ♦ దరులు భళిరె॥ 114.

అమితరసప్రౌఢిన్ = అమిత = కొలఁదిలేని, రస = అనురాగ మనెడుజలముయొక్క, ప్రౌఢిన్ = ధరించుటచేతన్, అలరెడుసరసులన్ = ప్రకాశించెడురసికులనుకొలఁకులను, ఎనయుటవలనన్ = పొందుటవలనన్, పద్మినులు = పద్మినీజాతిస్త్రీలు, (తామరలతలు,) అనంగన్, లలిత ... ములన్ లలిత = సుందరమైన, బంధవిశేషములన్ = వేర్వేరుబంధములచేత, మహాభోగులన్ = గొప్పసుఖము గలవారినుసర్పములను తనుపుటన్ = తృప్తిఁ బొందించుటచేత, భోగినులు = (వేశ్యలు) భోగస్త్రీలు, (నాగకాంతలు,) అనంగన్ = అనునట్లును, ఘనత ... పెంపు, ఘనతన్ = గొప్పతనముచేత, రాగములపెంపు = కల్యాణి మొదలగురాగములగొప్పతన మనెడు (ఘనతర = మిక్కిలిగొప్ప లగు, అగ = వృక్షములయొక్క, పెంపు = అభివృద్ధిని,) ఎనసి = పొంది, పల్లవలాభగరిమన్ = విటు లనుచిగురుటాకులయొక్కప్రాప్తివలనిగౌరవమును, తాల్చుటన్ = ధరించుటచేత, కలకంఠులు = మధుర మైనకంఠధ్వని కలవారు (కోయిలలు) అనఁగన్ = అనునట్లుగా, తజ్ఞులు = తెలిసినవారు, వినుతింపన్ = స్తుతింపఁగా, తగువె

లలు=తగినవిలువలను, అందుచున్=పుచ్చికొనుచున్, మనుటచేన్=సుఖముగ నుండుటచే, సురుచిరమణులు=మంచి కాంతి గలస్త్రీలు, ( సురుచిరమణులు=మనోహరము లగుమణులు ) అనంగన్=అనునట్లును, ప్రబలి=ప్రఖ్యాతి గాంచి, తత ధ్రువులు తత = విశాలమైన, మంజుల=ఒప్పిదమైన, ఆస్య=ముఖముయొక్క, విభ్రమసమృద్ధులు=విలాసాతిశయములు, ( తత=వీణాదివాద్యములయొక్కయు, మంజు=మృదువైన, లాస్య=నృత్యముయొక్కయు, విభ్రమసమృద్ధులు=విలాసములు, ) అలరన్=ప్రకాశింపఁగాన్, ప్రతిభన్=బుద్ధివిశేషముచేతను, నర్మహాస్యములను=క్రీడలయందలి కేళిపలుకులందు, వంతులు=నేరుపుగలవారు ( ప్రతి … లన్=ప్రతి ఎల్లవియునగా, భ=భావములయొక్కయు ర=రాగములయొక్కయు, త=తాళములయొక్కయు, "శ్లో॥ భకారో భావవాచీస్యా ద్రకారో రాగవాచకః తకారో తాళవాచిస్యా త్రిమంభరతముచ్యతే" హాస్యములన్=కేళిపలుకులందు, వంతులు=నేర్పరులు) రంభాదులన్=రంభ మొదలగువారిని, గెల్చుసొగసునన్=గెల్చుసౌందర్యముకొఱకై, వారసుందరులు=వేశ్యలు, మరిన్=మఱియు, వఱలు చుందురు=ప్రకాశించుచుందురు భళిరె=ప్రశంసనార్థకము. శ్లిష్టరూపకాలంకారము

సీ॥ కలికి యెత్తుల కేలి ♦ కలువ నీ విపు డిన్ను
వేరే యిడుము నింపుఁ ♦ గోరఁ దగదు
చెలువ మల్లికల సు ♦ స్థితిఁ జూపు మది తావు
లంటి చూపినఁ దోఁచు ♦ నమగి చేల
తిలకింపు మెలతాను ♦ రలపండ లోనఁగుసుము
నెల గొప్పఁగా వల ♦ పినను గానుము
పిలుపఁ జేకొని యొప ♦ సలుకుబంతులు నిన్ను
చను బంతు లిప్పు డిం ♦ టివను గంను

ననుచు నర్మోక్తి రచనల ♦ ననుమ వేడ్కఁ
దిమ్ము గల రమ్ము మేటిచె ♦ ల్వము మ్రులఁ గవి
సరసతలు చూపువిటులకు ♦ సరము లిడుచుఁ
బుష్పలావికలుండె నా ♦ పురమునందు॥ 115.

ఈపద్యమునందుఁ బువ్వులమ్మునింతులకును వారిం గొనవచ్చువిటులకును జరిగిన సంభాషణము రెండర్థములతోఁ జెప్పఁబడియె

కలికి = ఓసుందరీ, ఎత్తులకుఁ = పూలదండలకుఁ, ( పురుషుని వలచి యువిద లిచ్చుసొమ్ములకని యర్థాంతరము ) ఏమి? కలువఁ = కలువపూవును, ఈవు = నీవు; ఇపుడు, ఇమ్ము = ఒసఁగుము ( కలువఁ = నీతోఁ గలియుట, నీవి = పోఁకముడిని, ( ని ) స్త్రీకటీవస్త్రబంధోపరి నీవి పరిపణోపెవ అ ఇపుడు, ఇమ్ము = ఒసఁగు మని రెండవయర్థము ) 'కలువఁ' అనునది రెండవయర్థమున గ్రామ్యము ఇది విటులవచనము వేరే మరియొకప్రకారముచేత నే, ఇచ్చెదన్ = ( నీ వడిగినకలువపూవు ) నిచ్చెదను. ఇందుఁ = ఈదండయందుఁ, ( దండయం దున్నకలువపూవు అని యర్థము) కోరఁ = అపేక్షించుట, తగదు = యుక్తము కాదు. ( వే = శీఘ్రముగఁ, రే = రాత్రికాలమునందుఁ, ఇది కాలవాచకము గావుఁ బ్రథమ యయ్యెను ఇచ్చెదఁ = ( నీవి ) నిచ్చెదను, ఇందుఁ = అంగడియందుఁ ( పగటికాలమం దనియేని యర్థము. ) కోరఁ = నీవి నపేక్షించుట, తగదు = యుక్తము కాదు ) ఇది పుష్పలావికావచనము. ఇట్లే ముందు నెఱుంగునది. చెలువ = ఓప్రియభాషిణీ, మల్లికలన్ = మల్లెపూవులను, సుస్థితిఁ = మంచియునికితో, చూపుము = కనుపఱుపుము చెలువ యనుపదమును రెండవయర్థమున ముందరిమువ్వయితోఁ గలిపి చెప్పుటచె వెనుకవాక్యమునందలిసంబోధనమే యిందు గ్రహింపవలెను ఓకలికి అల్లికలఁ = బంధములందుఁ, చెలువము = చక్కఁదనమును, సుస్థితిఁ = మంచినిలుకడతో, చూపుము = కనుపఱుపుము ) పలువము దప్పనిమల్లెపూవులం జూపు మని యర్థము బంధనైపుణ్యముం దెలుపు మని యర్థాంతరము అది = ఆపుష్పసముదయము, బంధనైపుణ్య మని యర్థాంతరము తావులు = పరిమళములను, అంటి మూచినఁ = పరీక్షించినయెడఁ, తోఁచుఁ = కాన్పించును, ( తావులు = కళాస్థానములను, అంటి మూచినఁ = స్పృశించి మూచినయెడల, తోఁచుఁ = కాన్పించును ) అడుగఁ = ప్రశ్న సేయుట, ఏల = ఎందులకుఁ, పరిమళములనుబట్టి చూచిన మల్లియలు మంచిస్థితియం దున్నవో లేవో తెలియును ప్రశ్నముతో నేమిప్రయోజనమని యర్థము తావు లంటిమూచిన చెలువ మున్నదియో లేదో తెలియును ప్రశ్నముతో నేమిప్రయోజన మని రెండవయర్థము

తిలకింపుము = ఇటు చూడుము ఎలతామరలదండలు = వాడనితామరపూవుల దండలను, ఒసఁగుము = ఇమ్ము [ మెలఁతా! = ఓస్త్రీ! మరలఁ = నేవెనుకకుఁ బోను తిలకింపు = ఇటుచూడు దండలు = నీప్రాపులను ( బహువచన మాధిక్యముం దెలుపును ) ఒసఁగుము = ఇమ్ము. ] వాడనితామరపూలదండ లిమ్మని యర్థము. నిప్రాపు

గలిగిన మరలి యింటికిఁ బో నని యర్థాంతరము. సెనరు = ప్రేమము, ఒప్పఁగ = ఒప్పునట్లుగా, కావలసినఁ = అవశ్యమైనచో, కొనుము = (తామరదండలను) వెలయిచ్చి పుచ్చికొనుము. (సెనరు = కృతజ్ఞత, ఒప్పఁగా = ఒప్పునట్లుగా, వలసినఁ = ప్రేమించినయెడల, కొనుము = నాప్రాపును గ్రహింపుము ఈయర్థమున నిది 'వలచినఁ' అని యుండవలెను) అవశ్యమైనం దామరదండల నిచ్చెద నని యర్థము ప్రేమించినం బ్రాపిచ్చె నని యర్థాంతరము విలువఁ = వెలచేతను, వెల యిచ్చి యని యర్థము చెకొనియెదఁ = కొందును, అలరుబంతులఁ = పూవుచెండ్లను, ఇమ్ము, (విలువఁ = వెలను, చెకొని = మున్ను గ్రహించి, ఎదఁ = బొమ్మునందు, అలరుబంతులన్ = ప్రకాశించుబంతులం బోలినపదార్థములను (స్తనములను) ఇమ్ము) వెల యిచ్చికొందును పూలబంతుల నిమ్మని యర్థము వెల ముందు పుచ్చికొని బంతులం బోలినవాని నిమ్మని యర్థాంతరము

చనుబంతులు = యుక్తము లగుపూలబంతులు, ఇపుడు = ఈకాలమున, అంటినఁ = స్పృశించినయెడల, కందున్ = వాడిపోవును (చనుబంతులు = బంతులం బోలినకుచములను, ఇప్పుడు, అంటినన్ = ముట్టికొనినయెడల, కందుఁ = చూతును.) పూలబంతు లిపు డంటిన వాడిపోవు నని యర్థము స్తనములు స్పృశించినం జూతు నని యర్థాంతరము

అనుచుఁ = ఇట్లు పలుకుచుఁ, నర్మోక్తిఁ = పరిహాసపుమాటలచేతను, రచనలన్ = పూవులదండలఁ గూర్చుటయందలి నైపుణ్యముచేతను, ననుమవేశ్యఁ = మొలచెడుకుతూహలముతో, తమ్ముఁ = (పుష్పలావికలను) అలరమ్ము మేటిచెయ్దమ్ములఁ = అలరు = పువ్వులను, అమ్ము = అమ్మెడునట్టి, మేటిచెయ్దమ్ములన్ = గొప్పచెష్టలను, (అలరు = పువ్వులు, అమ్ము = బాణములుగాఁ గల, మేటి = శూరునియొక్క, చెయ్దమ్ములఁ = వికారములను, మన్మథవికారముల నని యర్థము) కని = చూచి, సరసతలు = శృంగారాదిరసజ్ఞానమును, మాపువిటులకుఁ = కనుపటిచెడుసొగసుగాండ్రకు, సరములు = పూలదండలను, ఇడుచుఁ = అమ్ముచుఁ, అప్పురమునందుఁ = ఆద్వారకయందు, పుష్పలావికలు = పువ్వు లమ్ముస్త్రీలు, ఉందురు నివి + ఇపుడు = నివిపుడు. నీవి యనునది ఏమ్యాదులలోనిది యగుటచే వైకల్పికసంధి గల్గెను ఏమ్యాదులయం దిత్తునకు సంధి వైకల్పికముగ నగు బా. సం తిలకింపుము + మెలత = తిలకింపుమెలత ప్రార్థనార్థకమధ్యమపురుషమువర్ణంబునకు హల్లు పర మగునపుడు లోపము వైకల్పికము. బా. సం. ప్రకృతశ్లేషాలంకారము.

మ॥ సురసాంచద్ఘనపుష్పపూరితము లై ♦ సొంపొంది దృప్తాండజో
త్కరసంచారపటుత్వముల్ గలిగి రం ♦ గద్భృంగసంగీతముల్
పరఁగన్ సారససౌరభానిలసదా ♦ భంగాగమంబుల్ దగన్
బురి నుద్యానములున్ సరోవరములుం♦బొల్చున్ సమత్వంబునన్॥

పురిన్ = ద్వారకాపురమునందున్, ఉద్యానములున్ = పూఁదోఁటలును, సరోవరములున్ = శ్రేష్ఠ మైనకొలఁకులును, (చివర నున్న ద్రుతము సముచ్చయార్థకము.) సుర పూరితములై, సు = మంచి, రస = మకరందముతో, అంచత్ = ఒప్పుచున్న ఘన = అధిక మైన, పుష్ప = పూలతో, పూరితములు = నింపఁబడినవి, ఐ, పూఁదేనెతో నిండిన పెక్కుపూలతోఁ గూడిన వని యుద్యానపర మైనయర్థము (సురస = మంచి రుచితో, అంచత్ = ఒప్పుచున్న, ఘనపుష్ప = ఉదకముతో, పూరితములు = నింపఁబడినవి, ఐ, మంచిరుచితోఁ గూడినయుదకములతో నిండిన వని సరఃపర మైనయర్థము) (ని) శృంగారాదౌ విషే వీర్యే గుణే రాగే ద్రవే రసః అ మేఘపుష్పం ఘనరసం అ సొంపు = సొగసును, ఒంది = పొంది, దృప్త .. ముల్, దృప్త = గర్వించిన, అండజోత్కర = పక్షిసముదాయముయొక్క, సంచారపటుత్వముల్ = సంచరించుటకుం దగినపాటవమును, (అండజ = చేపలయొక్క, తక్కినది రెంటికిని సరి) రంగ .. .ముల్, రంగత్ = ప్రకాశించుచున్న, భృంగ = తుమ్మెదలయొక్క, సంగీతముల్ = గానములు, పరఁగన్ = ప్రకాశింపఁగాన్, (ఇది రెంటికిని సమము,) సారస... ..ముల్, సార = శ్రేష్ఠ మైన, ససౌరభ = మంచివాసనతోఁ గూడిన, అనిల = వాయువును, సదా = ఎల్లప్పుడును, అభంగ = పూర్ణ మైన, అగమంబుల్ = వృక్షములను గలవి. (ని) పలాశీ ద్రు ద్రుమాగమాః. అ ఆయుద్యానములో మందమారుత మెప్పుడు నుండు ననియును బూవులు మొదలైనవానితో నిండినవృక్షములు గల వనియు నర్థము. (సారస = పద్మములయొక్క, సౌరభ = మంచివాసనతోఁ గూడిన, అనిల = వాయువుచేత, సదా = ఎల్లపుడు, భంగ = తరంగములయొక్క, ఆగమంబుల్ = ప్రాప్తులు గలవి, చెఱువులందుఁ దామరపూవులవాసనతోఁ గూడినవాయు వెప్పుడు నుండుటచే నలలు పుట్టు చుండు నని యర్థము) సమత్వంబునన్ = సమ మైనస్థితిచేన్, తగన్ = బాగుగా, పొల్చున్ = (ఉద్యానములును, చెఱువులును) ప్రకాశించును. ఇందుఁ బ్రకృతశ్లేషాలంకారము

సీ॥ దేవకీవసుదేవ ♦ దివ్యతపఃఫలం

బతియశోదానంద ♦ హర్షసీమ
బలదేవచిరపుణ్య ♦ పరిపాకసమయంబు
రాధికాయూధికా ♦ శ్రావణంబు
కంసాదిఖలమత్త ♦ గజసింహశాబంబు
వల్లవీజనమోహ ♦ వార్ధిరాజు
రుక్మిణీహృదయస ♦ రోవరహంసంబు
సత్యభామాముఖా ♦ బ్జాతతరణి
యానగరమేలు మేలున ♦ యానఁగరము
భూజనమునకుఁ జిరసౌఖ్య ♦ భాజనముగ
నాగమాంతప్రవర్తి య ♦ సంతకీర్తి
స్మరశతసుమూర్తి యదువంశ ♦ చక్రవర్తి॥ 117.

దేవకీ . ...బు, దేవకీవసుదేవ = దేవకీవసుదేవులయొక్క, దివ్య = ఒప్పిదమైన తపఃఫలంబు = నోములపంట, దేవకీవసుదేవులు పూర్వజన్మమున మహాతపంబుఁ జేయ విష్ణుండు సాక్షాత్కరించి వరంబు వేఁడుఁ డన నిన్నుం బోలినపుత్త్రుండు గావలె నని కోరి రనియు నానిమిత్తమున విష్ణుండు కృష్ణుండై వారికి జన్మించె ననియు భాగవతము. అతి......సీమ, అతి = అధికమైన, ( ఇది హర్షవిశేషణము ) యశోదానంద = యశోదయు నందుఁడు ననువారియొక్క, హర్ష = సంతోషమునకు, సీమ = హద్దు బల... ...బు, బలదేవ = బలరామునియొక్క, చిరపుణ్య = చాలఁ గాల మార్జించినపుణ్యముయొక్క, పరిపాకసమయంబు = ఫలకాలము రాధికా .. . బు, రాధికా = రాధ యను పేరుగలగోపిక యను, యూధికా = అడవిమొల్లకు, శ్రావణంబు = శ్రావణమాసము. వర్షాకాలమం దడవిమొల్ల పూచినట్లు కృష్ణునియం దీమె సంతసించు నని తాత్పర్యము కంసాది......బు, కంసాది = కంసుఁడు మొదలగు, ఖల = క్రూరు లనెడు, మత్తగజ = మదపుటేనుఁగులకు, సింహశాబంబు = సింగపుఁబిల్ల, వల్ల .. .....రాజు, వల్లవీజన = గోపికలయొక్క, మోహ = వల పనెడు, వార్ధి = సముద్రమునకు, రాజు = చంద్రుఁడు, చంద్రోదయమున సముద్ర ముప్పొంగిన ట్లీయనవలన గోపికలకు మోహ మతిశయిల్లు నని యాశయము. రుక్మిణీ......సంబు = రుక్మిణీదేవిమన సనెడుకొలఁకునకు రాయంచ, సత్య......తరణి = సత్యభామయొక్కమో మనెడుపద్మమునకు సూర్యుఁ

డు, ఆగమాంతప్రవర్తి = వేదాంతముల నుండువాఁడు, వేదాంతములచేఁ దెలియఁబడువాఁ డనియర్థము. అనంతకీర్తి = అంతములేనియశము గలవాఁడు, స్మరశతసుమూర్తి = మన్మథులు నూఱుగురయొక్కయాకారముం బోలినమంచియాకారము గలవాడు. యదువంశచక్రవర్తి = ( అగు ) యాదవప్రభుఁడు ( కృష్ణుఁడు ) భూజనమునకుఙ్ = లోకమందలిజనసముదాయమునకుఙ్, కరము = మిక్కిలి, చిరసౌఖ్యభాజనము = శాశ్వతమైనసౌఖ్యప్రాప్తి, కఙ్ = అగునట్లు, మేలునయానఙ్ = అధిక మైననీతితో, నయము + నఙ్ = నయానఙ్, ఉలనలు పరంబు లగునపు డాగమమువర్ణంబునకు లోపంబును దత్పూర్వస్వరంబునకు దీర్ఘంబును విభాషనగు బా త అనగరము = ఆద్వారకాపట్టణము, ఏలున్ = పాలించుచుండును ఇందుఁ గృష్ణునందు శ్రావణత్వము మొదలగున వారోపించుటకు రాధికాదులందు యూధికాత్వాద్యారోపము కారణము గావున మాలాపరంపరితి రూపకాలంకారము చెప్పంబడినయుపమానోపమేయముల కభేద ప్రతిపత్తి యారోప మని యాలంకారికులు

సీ॥ కనకంపువన్నెచ ♦ క్కని టెక్కగనపక్కి
దొరజక్కి వగ నెక్కి ♦ తిరుగువాఁడు
కలిమిముద్దులగుమ్మ ♦ వల పిమ్మడిగ నెమ్మ
దిని గ్రిమ్మ నురముపై ♦ నునుచువాఁడు
కిడలే కడరుపాల ♦ కడలిమీఁగడ లోందు
తెలిదీవికడ లీల ♦ మెలఁగువాఁడు
తొలిమిన్కు లుడ్డమో ♦ ముల నిడ్డముద్దుబి
డ్డనిబొడ్డుఁదామరఁ ♦ గనినవాఁడు
కార్మొయిలడాలువాఁడు జ ♦ గంబు లేలఁ
జాలువాఁ డంఘ్రి నొదవిన ♦ జాలువాఁడు
జాళువాసేలువాఁడు జే ♦ జేలజేజె
పుడమి విహరించె యదుకులం ♦ బున జనించి॥ 118.

కనకంపు .. ..జక్కిఙ్, కనకంపు = బంగారముయొక్క, వన్నె = రంగుగల, చక్కని = మనోహర మైన, టెక్కగవ = టెక్కెజంట గల, పక్కిదొర = పక్షిరాజనెడు ( గరుడుఁడు ) జక్కిఙ్ = గట్టియును, వగఙ్ = విలాసముతో, ఎక్కి = ఆరో

హించి, తిరుగువాఁడు=సంచరించువాఁడు గరుడవాహనుఁ డైసంచరించువాఁ డని యర్థము కలిమిముద్దులగుమ్మన్=భాగ్యములయొక్క స్త్రీని, (భాగ్యముల కధిదేవత యగులక్ష్మి నని యర్థము) నెమ్మదిన్=మనసునందు, వలపు=కోరిక, ఇమ్మడిగన్=రెట్టింపుగా, క్రమ్మన్=వ్యాపింపఁగా, ఉరముపైన్=ఱొమ్మమీదను, ఉనుపువాఁడు=నిలుపువాఁడు (లక్ష్మిం బ్రేమాతిశయమున వక్షమున ధరించినవాఁ డనియర్థము) కడలేక=అంతములేకుండన్, అడరు మీఁగడలు, అడరు=కలిగాడు, పాలకడలి=పాలసముద్రసంబంధమైన, మీఁగడలు=తెట్టెలను, ఒందుతెలిదీవికడన్=పొందెడుశ్వేతద్వీపమునందున్, లీలన్=విలాసముతో, మెలఁగువాఁడు=సంచరించువాఁడు. భగవంతుఁ డగువిష్ణువు పాలసముద్రములోని తెలిదీవియం దుండి భక్తులకు సులభముగ సాక్షాత్కరించు నని భారతము.

తొలిమిన్కులు = వేదములను, ఉద్దమోములన్ = నాలుగుమోములందును, ఇ.. ని, ఇడ్డ=ధరించిన, ముద్దుబిడ్డని=చక్కనినిసువును, చతుర్ముఖబ్రహ్మ నని యర్థము బొడ్డుఁదామరన్=నాభిపద్మమునందున్, కనినవాఁడు=జన్మింపఁజేసినవాఁడు, కార్మొయిలడాలువాఁడు=నీలమేఘములచాయగలవాఁడు, జగంబు లేలఁజాలువాఁడు=జగంబులను రక్షించుటకుఁ దగినవాఁడు, అంఘ్రిన్=పాదమునందున్, ఒదవిన=పుట్టిన, జాలువాఁడు=నదిగలవాఁడు. ఆకాశగంగ హరిపాదమునం బుట్టె నని ప్రసిద్ధి జాళువాసేలువాఁడు=బంగారువుప్పటము గలవాఁడు (అగు) జేజేలజేజె=దేవతలకుఁ బ్రభువు, (దేవదేవుఁడు) యదుకులంబునన్=(యయాతికిం బెద్దకుమారుఁడగు) యదువనురాజుకులంబునన్, జనించి=పుట్టి, పుడమిన్=భూమియందు, విహరించెన్=సంచరించెను

చ. చెలువున మన్మథుం గనిన ♦ శ్రీనిధి శ్రీకి వరుండు సంపదన్
గళల సుధాంశువియ్యము మ ♦ గంటిమి నప్పురభేది నాజిలో
గెలిచినజోదు బుద్ధి విధి ♦ కిం గురుఁ డబ్ధికి మామ సత్కృపా
కలనఁ దరంబె యెరికి న ♦ ఖండతదీయగుణాళు లెన్నఁగాన్॥119.

(ఆకృష్ణుఁడు) చెలువునన్=చక్కఁదనమునన్, మన్మథన్=కాముని, కనిన శ్రీనిధి=కన్నశోభావంతుఁడు (మిగులసుందరుఁ డగుమన్మథునిం గన్నవాఁడు గావున నాతనికంటె నధికసౌందర్యము గలవాఁ డనిభావము) సంపదన్=ఐశ్వర్యమునందు, శ్రీకిన్=లక్ష్మికిన్, వరుండు=భర్త, (ఎల్లవారికిం దనకటాక్షమాత్రమున నై

శ్వర్య మీఁజాలినలక్ష్మి కళత్రమై యీయనకటాక్షము నపేక్షించుచుండుటచె నీయన సంపద వర్ణింప నలవిగానిది యనిభావము ) కళలన్ = విద్యలందున్, సుధాంశువియ్యము = చంద్రునకుం జుట్టము బాంధవ్యము సమానులక సంభవించుం గావున నీయన పెక్కుకళలు నేర్చినవాఁడు గావుననే కళానిధి యైనచంద్రునిబాంధవ్యము గలిగె నని భావము ఇటఁ గళలకును విద్యలకు నభేదాధ్యవసాయము ) మగంటిమిన్ = శౌర్యమునన్, పురభేదిన్ = శివునిని. ( రక్కసులపురముల మూఁటిని నశింపఁజేసినవాని నని యర్థము.) అనిలోనన్ = యుద్ధమునందు, గెలిచినజోదు = జయించినవీరుఁడు. మున్ను శివుండు బాణాసురునితపంబునకు మెచ్చి యతఁడు గోరినప్రకార మతనిగృహంబుననుండి యొకనిమిత్తమున నతనితో యుద్ధము సేయవచ్చినకృష్ణునితోఁ బోరి యోటు వడియె నని భాగవతము. బుద్ధిన్ = తెలివియందున్, విధికిన్ = బ్రహ్మకున్, గురుండు = తండ్రి ఎట్టిబుద్ధిమంతులైన నిది యిట్టు లయ్యె నని యూహింపలేని యీప్రపంచనిర్మాణము చేయఁగలబ్రహ్మను సృష్టించినవానిబుద్ధి మిగులగొప్పది యని చెప్ప నేలయనిభావము. సత్కృపాకలనన్ = మంచిదయకలిమిని, అబ్ధికిన్ = సముద్రునకు, మామ = చుట్టము, ఏరికిన్ = ఎట్టివారికైనను, అఖండ... ..ళులు = పూర్ణమైన యాకృష్ణునిసంబంధమైన సద్గుణములను, ఎన్నఁగాన్ = వర్ణించుట, తరంబె = శక్యమా ? (కాదనుట)

చ॥ ననిపెడుదైవ మంచుఁ దను ♦ నమ్మినరాజును ధర్మమూర్తి గా
ననుపమమైత్రిఁ దన్ను నని ♦ నట్టినరున్ విజయప్రసిద్ధుఁ గాఁ
దను నతిభక్తి వేఁడినన ♦ దైన్యుని భూమిసురేంద్రుఁ గా నొన
ర్చెను వసుదేవసూనుఁడు వి ♦ చిత్రము లెన్నఁగఁ దచ్చరిత్రముల్॥

వసుదేవసూనుఁడు = కృష్ణుఁడు, ననిపెడుదైవము, ననిపెడు = ( భక్తులందు ) ననురాగ మొందెడు, దైవము = ఈశ్వరుఁడు, అంచున్, తనున్, నమ్మినరాజున్ = విశ్వసించినన్నపునిని ( ధర్మరాజు ననియుందోఁచును ) ధర్మమూర్తి గాన్ = ధర్మస్వరూపుఁడగునట్లును, అనుపమమైత్రిన్ = సాటిలేనిస్నేహముచె, తన్నున్ = ( కృష్ణునిన్ ) ఎనసినట్టినరున్ = పొందినమనుజునిని, సేవించినవాని ననియర్థము. ( అర్జును ననియును ధ్వనించును ) విజయప్రసిద్ధుఁ గాన్ = గెలుపుచేఁ బ్రసిద్ధి గలవాఁడుగాన్ ( విజయుఁ డను పేరుచేఁ బ్రసిద్ధి గలవాఁడుగా ననియుందోఁచును ) ఈచోటను 'కాన్', అనునది యసమాపకక్రియ గాన దీనికిఁ గర్త యుండవలెను. క్రియ యగుంగాని కర్త లేదనుట యన్యాయము. కాఁబట్టి దీనికిం బూర్వపదము కర్తృవాచక మైనప్రథమయయుం డుండుట తగును. ద్వితీయ నున్నప్పు డర్థముం బొసఁగదు. ఈభావయం దిట్టప్రయోగ

ములు కలవు గాని యిది చింత్యము తనున్ = (కృష్ణుని) అతిభక్తిన్ = మిక్కిలియనురాగముతో, వేఁడినసద్దైన్యునిన్ = ప్రార్థించినదీనునిని, దరిద్రుని ననియర్థము. భూమిన్ = ఈలోకమునను, సురేంద్రుఁగాన్ = ఇంద్రుఁ డగునట్లును, ఒనర్చెను = చేసెను (కుచేలుని భాగ్యవంతునిం జేసె ననియూఁదోఁచును) తచ్చరిత్రముల్ = ఆయననడవడులు (ఆయన చేయుపనులు) ఎన్నఁగన్ = గణించఁగన్, విచిత్రములు = ఆశ్చర్యకరములు (అగును)

క॥ కొలువున నివ్వెఱపడి తను
దలఁచుచుఁ బ్రార్థించుద్రుపద ♦ తనయాధృతరా
ష్ట్రుల కరుదుగ హరి యొసఁగె
న్విలసితనవ్యతరదివ్య ♦ నేత్రములు దయన్॥ 121.

కొలువునన్ = సభయందున్, నివ్వెఱపడి = మిగులభయపడి, తనున్ = (కృష్ణునిని) తలఁచుచున్ = స్మరించుచున్, ప్రార్థించు . . లకున్, ప్రార్థించు = వేఁడుకొనెడు, ద్రుపదతనయా = ద్రౌపదికిని, ధృతరాష్ట్రులకున్ = ధృతరాష్ట్రమహారాజునకును, అరుదుగన్ = (మామవారి) కాశ్చర్యముపుట్టునట్లు, దయన్ = కనికరముచేతను, (ఇతరులకుఁ బ్రాప్తించుదుఃఖముఁ బోఁగొట్టునిచ్చ దయ యనంబడు) విలసిత . . లు, విలసిత = ప్రకాశించుచున్న, నవ్యతర = మిగుల నూతనమైన, దివ్య = సుందరమైన, నేత్రములు = వస్త్రములను, (కన్నుల ననియర్థాంతరము) (ని) స్యాజ్జటాంశుకయోర్నేత్రం. అ ఒసఁగెన్ = ఇచ్చెను ద్రౌపదికి వస్త్రములను ధృతరాష్ట్రునకుఁ గన్నుల నిచ్చె ననియర్థము

మున్ను దుర్యోధనుఁడు జూదంబు గల్పించి ధర్మజు మోడించి సకలంబు హరియించి యింకను నవమానింపం దలంచి యతనిభార్యవస్త్రముల నొలిపించుచుండ నామె భక్తిపూర్వకంబుగఁ గృష్ణుం బ్రార్థంప నపరిమితంబు లగుపుట్టంబు లనుగ్రహించె ననియు ధర్మరాజు జూదంబాడునపుడు చెసినప్రతిన ననుసరించి యరణ్యవాసంబు నజ్ఞాతవాసంబుఁ గావించి తనపా లపేక్షింప దుర్యోధనుం డీనఁ బోరునిశ్చయించు నపుడు కృష్ణుండు దూతయై ధృతరాష్ట్రుసభకుం బోయి మాటలాడుచుండ దుర్యోధనుండు గృష్ణు బంధించినఁ బాండవులు జితులగుదు రనియత్నంబు సేయుచుండ నది యెఱింగి కృష్ణుండు విశ్వరూపంబు చూపెననియు నపుడు ధృతరాష్ట్రుండు తన్నుం జూడఁ బ్రార్థింపఁ గన్ను లిచ్చెననియు భారతమునఁ గలదు.

గీ॥ కుజనమర్దనంబు ♦ సుజనాళిసంరక్ష
ణంబు సల్పి భూభ ♦ రంబు మాన్ప
ద్వారకాపురమున ♦ వసియించి దిక్పాల
పాలకుండు జగము ♦ లేలుచుండు॥ 122.

దిక్పాలపాలకుండు=(కృష్ణుఁడు) ఇంద్రాదుల రక్షించువాఁడు, కుజనమర్దనంబు=దుర్మార్గులయొక్క నాశనంబును, సుజనాళిసంరక్షణంబు=మంచిజనులసముదాయముయొక్క సంరక్షణమును, చల్పి=చేసి, భూభరంబు=భూమియొక్క బరువును, మాన్పన్=పోఁగొట్టుటకు, ద్వారకాపురమునన్, వసియించి, జగములు=లోకములను ఏలుచుండున్=పాలించుచుండున్

క॥ ఈరీతి నీతిదైతే
యారాతి నిరీతిగా జ ♦ నావనము మదిం
గోరి యొనర్పఁగ నొకనాఁ
డారూఢప్రీతి మతి హి ♦ తాదృతి నెనసెన్॥ 123

దైతేయారాతి=(కృష్ణుఁడు) రక్కసులకుం బగవాఁడు ఈరీతిన్=ఈప్రకారముచే, నీతిన్=న్యాయముతో, నిరీతిగాన్=ఈతిబాధలు లేకుండునట్లు, "శ్లో॥ అతివృష్టిరనావృష్టిర్మూషకాశ్శలభాశ్శుకాః। అత్యాసన్నాశ్చ రాజానష్షడేతా ఈతయస్స్మృతాః॥" జనావనము=జనులరక్షణమును, మదిన్=మనసునందు, కోరి, ఒనర్పఁగన్=చేయుచుండఁగా, ఒకనాఁడు, ఆరూఢప్రీతిన్=ఉత్పన్నమైనప్రీతిచేత, మతి=బుద్ధి, హితాదృతిన్=మిత్రులయందలిప్రేమను, ఎనసెన్=పొందెను

శా॥ ఇంద్రప్రస్తరసన్నిభాసితవిభా ♦ భృద్దివ్యదేహుండు దే
వేంద్రప్రస్తుతవైభవాఢ్యుఁ డగుశ్రీ ♦ కృష్ణుండు స్నేహార్ద్రుఁడై
యింద్రప్రస్థపురంబునన్ సకలభూ ♦ భృద్వంద్యసామ్రాజ్యని
స్తంద్రానందులఁ బాండునందనులఁ గాం ♦ చంగోరి యుద్యుక్తుఁడై॥

ఇంద్రప్రస్త......హుండు, ఇంద్రప్రస్తర=ఇంద్రనీలపురాతితో (ని) పాషాణప్రస్తరగ్రావోపలాశ్మానశ్శిలాదృషత్ అ సన్నిభ=సమానమైన, అసిత=నల్లని, విభా=కాంతిని, భృత్=ధరించిన, దివ్యదేహుండు=సుందరమైనదేహము కలవాఁ

దును, దేవేంద్ర......డు. దేవేంద్ర=సురపతిచె, ప్రస్తుత=స్తోత్రముచేయఁబడిన, వైభవ=సంపదచే, అధుఁడు=పూర్ణుఁడును, అగుశ్రీకృష్ణుండు, స్నేహార్ద్రుఁడు=స్నేహముచేఁ దడిపినవాఁడు (స్నేహమునఁ గరఁగినమనసు గలవాఁడు) ఐ, ఇంద్రప్రస్థపురంబునన్, సకల... .స్త్రంద్రానందులన్, సకల=అందఱు, భూభృత్=రాజుల కును, వంద్య=నమస్కరింపఁ దగిన, సామ్రాజ్య=భూమండలాధిపత్యముచె, నిస్త్రంద్రానందులన్=ప్రకాశించుసంతసము గలవారిని, పాండునందనులన్=పాండవులను, కాంచంగోరి=చూడనపేక్షించి, ఉద్యుక్తుఁడై=ప్రయాణమునకు యత్నించువాఁడై, ముందుపద్యముతో నన్వయము రాజసూయ మనుయాగము చెసి హిమవత్పర్వతమున కు సేతువునకు నడుమ నున్న రాజులను వశపఱిచికొని యాదేశమున కధిపతియైనయతఁడు సమ్రాట్టనియు నతనిరాజ్యము సామ్రాజ్యమనియుఁ జెప్పంబడు (ని) యే నేష్టం రాజసూయేనమండలశ్యేశ్వరశ్చయశ్శాస్తియశ్చాజ్ఞయా రాజ్ఞ స్ససమ్రాట్. అ

సీ॥ తల్లుల సాధ్వీమ ♦ తల్లులఁ గని మ్రొక్కి
యానకదుందుభి ♦ యాన వడసి
గురుల సుధీదేవ ♦ గురుల సంభావించి
హితుల సంతోషాభి ♦ హితులఁ జేసి
తమ్ములఁ బ్రియభాషి ♦ తమ్ముల నియమించి
భటుల విక్రమసము ♦ ద్భటుల నెంచి
మతిని రుక్మిణీయను ♦ మతి నింపునవహించి
సత్యానుకూలత ♦ సత్యఁదనిపి
యలవరించినచెలుల లో ♦ నలవరించి
యూరడించినవారల ♦ నూఱడించి
యన్నగరమునఁ గాపుంచి ♦ యన్నఁగరము
శూరకులు లంటి రాఁగ నా ♦ శూరకులుఁడు॥ 125

సాధ్వీమతల్లులన్=మిక్కిలిపతివ్రతలగు, తల్లులన్=దేవకి, రోహిణిమొదలగు వారిని, కని=చూచి, మ్రొక్కి=నమస్కరించి, ఆనక .....యానవడసి, ఆనకదుందుభి=తనుదేవునియొక్క, ఆన = అనుజ్ఞను, పడసి =పొంది, కృష్ణుజననకాలమం

దీయనయింట దేవతలచే ఆనకములు ( మద్దెలలు ) దుందుభులు ( భేరులు ) ను వాయింపఁబడుటచే నీపేరు కల్గెను అ. సుధీదేవగురులన్ = మంచిబుద్ధిచే బృహస్పతింబోలిన, గురులన్ = పెద్దలను, సంభావించి = గౌరవించి, హితులన్ = మిత్రులను సంతోషాభిహితులన్ = సంతసముచేఁ జెప్పఁబడినవారిని, చేసి = సంతోషమున వారితోఁ జెప్పి యనియర్థము తమ్ములన్ = సాత్యకి మొదలగుయదుకుమారులను, ప్రియభాషితమ్ములన్ = ఇష్టవచనములతో, నియమించి = ( తనతో రమ్మని ) ఏర్పాటుచెసి, విక్రమసముద్భటులన్ = పరాక్రమముచేభయంకరులను, భటులన్ = జోదులను, మతిన్ = మంచిబుద్ధితో, ఏంచి = తనతో రావలసినవారలను వేరుచెసి, రుక్మిణియనుమతిన్ = రుక్మిణియొక్కసమ్మతిని, ఇంపునన్ = ఇష్టముతో, వహించి = గ్రహించి, సత్యానుకూలతన్ = నిజమైనయొద్దికతో, సత్యన్ = సత్యభామను, తనిపి = తృప్తిఁబొందించి, అలవరించిన చెలులన్ = ప్రసిద్ధముగఁ దన్నుఁ గామించినస్త్రీలను, లోన్ = మనసులందు, అలవరించి = సంతోషపెట్టి, ఊరన్ = గ్రామమునందు, డించినవారలన్ = విడిచినవారిని, ఊఱడించి = ( కొలఁదిదినములలో వత్తు నని, విచారముపోఁగొట్టుమాటలనుఁ జెప్పి, ఆ న్నగరమునన్ = ఆపట్టణమునందున్, అన్నన్ = బలరామునిని, కాపుంచి = రక్షించుటకేర్పాటుచేసి, శూరులు = సాత్యకి మొదలగువారు, కరము = తనహస్తమును, అంటి = స్పృశించి, రాఁగన్ = వచ్చుచుండఁగాన్ ఆశూరకులుఁడు = కృష్ణుఁడు ( శూరునికులమునం బుట్టినవాఁడు. ) ముందరిపద్యములోని వెడలె ననుదానితో నన్వయము.

క॥ మాగధవందిజనస్తుతి
వాగారవములు సెలంగ ♦ ద్వారము వెడలెన్
ధాగధగీచాకచకీ
నైగనిగీరుచుల భూష ♦ ణంబులు వెలుఁగన్॥ 126.

మాగధ రవములు, మాగధ = వంశము స్తోత్రముచేయువారియొక్కయు, వందిజన = తనపరాక్రమమును స్తుతి సేయువారియొక్కయు, స్తుతివాగారవములు = స్తుతిశబ్దములయొక్కధ్వనులు, చెలంగన్ = మ్రోయుచుండఁగా, భూషణంబులు = ( కృష్ణుఁడు శరీరమునధరించిన ) యాభరణములు, ధాగ .. .రుచులన్ = ఇందు మొదటి మూడు ననుకారిశబ్దములు కన్నులఁ జలింపఁజేసెడుకాంతులతో ననియర్థము. వెలుఁగన్ = ప్రకాశింపఁగా, ద్వారమున్ = గుమ్మమునుండి, వెడలెన్ = బయలు వెడలెను.

సీ॥ పద్మరాగసువజ్ర ♦ బద్ధచక్రప్రభల్

రవిచంద్రకిరణవై ♦ భవము సూప
భరితనానావిధ ♦ భరమైన హేమకూ
బరము మేరునగంబు ♦ భంగి నొనర
హారినీలముక్తామ ♦ యంపుఁజప్పర ముడు
నిబిడ మౌనుప్పరం ♦ బుబలె నొప్ప
ఘనపదక్రమములు ♦ గలచతురాయతా
శ్వములు వేదంబుల ♦ సరణిఁ దనరఁ
దగుమహోచ్ఛ్రవిపుంగవ ♦ ధ్వజము గూర్చి
భూమి విఖ్యాతి గనుతేరు ♦ పొలుపు మీఱ
దారకుఁ డుదారవిధిలీలఁ ♦ దేర దాని
నధిగమించెఁ బురారి నా ♦ నమ్మురారి॥ 127.

పద్మరాగ. . . భల్, పద్మరాగ = తమ్మికెంపులచేతను, సువజ్ర = మంచివజ్రములచేతను, బద్ధ = కట్టఁబడిన, చక్రప్రభల్ = బండికండ్లయొక్క కాంతులు, రవి......వైభవము, రవి = సూర్యునియొక్కయు, చంద్ర = చంద్రునియొక్కయు, కిరణ = కిరణములయొక్క, వైభవము = సంపదను, చూపఁన్ = కనుపఱుపఁగాన్, కెంపులతోఁ జేయఁబడినచక్రకాంతి సూర్యకిరణవైభవమును, వజ్రములతోఁ జేయఁబడినచక్రకాంతి చంద్రకిరణవైభవమును జూపఁగా ననియర్థము దారకుఁడు (కృష్ణునిసారథి) కృష్ణునకు సిద్ధముచేసిన బండిచక్రములు తమయందలి మణులకాంతిచే ము న్నీశ్వరుఁడు త్రిపురాసురులం గొట్టఁబోవునపు డెక్కినయరదమునకుం జక్రము లైనసూర్యచంద్రులతేజము వెదగల్లుచున్న వనిభావము భరిత ....భరము, భరిత = నింపఁబడిన, నానావిధ = పెక్కువిధములుగల, భరము = బరువుగలది, ఆయుధములు మొదలగువానిచె నింపఁబడిన దనియర్థము ఐనహేమకూబరము = ఐనబంగారునొగ, మేరునగంబుభంగిన్ = మేరుపర్వతముయొక్క రీతిచేత, ఒనరన్ = ఒప్పఁగాన్, కృష్ణునియరదపునొగ సాంబమూర్తిరథమున ధను వైయున్న మేరువువలె నుండె ననిభావము. హారి......జప్పరము, హారినీల = ఇంద్రనీలములయొక్కయు, ముక్తామయంపు = ముత్తెములయొక్కయు వికారమైన, చప్పరము = మీఁదికప్పు, ఉడునిబిడము = నక్షత్రములతో నిండినది. ఔనుప్పరంబుబలెన్ = ఐనయాకాశమువలె, ఒప్పన్ = ప్రకాశింపఁ

గాన్, ముత్యాలు దాపిన యింద్రనీలపు గాలతోఁ జేయఁబడిన బండిమీఁదికప్పు నక్షత్రములతోఁ గూడినమిన్నువలె నుండె ననియర్థము ఘనపదక్రమములు, ఘన = గొప్పవియగు, పదక్రమములు = నడకలను, కలచను . . ములు = కలిగిన నేర్పు గలపెద్ద గుఱ్ఱములు, ఘన, పదము, క్రమము నను వేదభాగవిశేషములు గలనాలుగుగుఱ్ఱము లనియర్థాంతరము వేదసరణిన్ = వేదములరీతిని, తనరన్ = ప్రకాశింపఁగాను, ఘనమైనపదక్రమములు ( నడకలు ) గలయశ్వములు ఘన, పద, క్రమములు గలిగి యాశ్వయునిరథమునకు గుఱ్ఱము లైనవేదములవలె నుండె ననిభావము. దారుకుఁడు, ఉదారవిధిలీలన్ = గొప్పయేర్పాటుయొక్క విలాసముతో, ( గొప్పవాఁడగు బ్రహ్మవిలాసముతో ననియర్థాంతరము ) ఈశ్వరునకు మున్ను సారథి యైనబ్రహ్మవలె ననియర్థము. తగు ....ధ్వజము, తగు, మహోచ్ఛ = మిగులందెల్లని, విహంగవధ్వజము = పక్షి రా జైనగరుడునిచిహ్నము గలటెక్కము నని, కృష్ణపరము. మహోచ్ఛవి = గొప్పకాంతిగల, పుంగవధ్వజము = వృషభచిహ్నము గలటెక్కము నని శివపర మైనయర్థము కూర్చి = ఘటించి, భూమిన్ = పుడమియందు, విఖ్యాతి = కీర్తిని, కనుతేరు = పొందినరథమును, (భూమివిఖ్యాతి గనుతేరు = భూమి యనుపేరు గలరథము ననిశివపరము ) శివునకు మున్ను భూమియే యరద మయ్యె ననిప్రసిద్ధము తేరన్ = తిసికొని రాఁగా, దానిన్ = ఆరథమును, పురారినాన్ = శివుఁడువలె, అమ్మురారి = ఆకృష్ణుఁడు, అధిగమించెన్ = ఎక్కెను కృష్ణుఁడు పురము వెడలి దారుకుఁడు మున్ను త్రిపురసంహారమునను శివుఁ డేగునపు డెక్కినరథముం బోలినరథమును దీసికొని రాఁగా దాని శివుడువలె నెక్కె ననితాత్పర్యము ఇందు శివకేశవులకు సమాన మైనరధారోహణముచే సామ్యము చెప్పఁబడెను ; గావున శ్లేషానుప్రాణిత మైనయుపమాలంకారము

క॥ ఈరీతి రథము నెక్కి ము
రారాతి పురంబు వెడలె ♦ నప్పుడు సముదగం
భీరులరులు భీరులుగా
భోరున భేరులను మొఱసెఁ ♦ బురమార్గమునన్ ॥128

మురారాతి = ( మురుఁ డనురక్కసునిం జంపినవాఁడు ) కృష్ణుఁడు, ఈరీతిన్ = ఈవిధము ( చేత ) గా ననియర్థము రథమున్ = బండిని, ఎక్కి = ఆరోహించి, పురంబున్ = పట్టణమును, వెడలెన్ = బయలువెడలెను. అప్పుడు = ఆకాలమున, సమదగంభీరులు = గర్వముతోఁ గూడినవారును లోఁతైనమనసుగలవారును ( అగు ) అరులు = పగవారు, భీరులు = భయపడునట్టివారు, కాన్ = అగునట్లు, పురమార్గమునన్ = పట్టణ

మునందలి పెద్దవీధియందు, భేరులు = వాద్యవిశేషములు, భోరునన్ = పెద్దధ్వనితో, మొఱసెన్ = మ్రోఁగెను

వ॥ ఇట్లు నిర్గమించి మించినజవంబున నంబరచుంబిశిఖరగోపురంబు లగు పురంబులును, వికచకమలకుముదసముదయాకరంబు లగుసరోవరంబులును, నగణితఖగమృగాదిజీవనంబు లగువనంబులును, వివిధగోవృషవృషలాదిజనఘోషంబు లగుఘోషంబులును, ననంతపాంథాంతరంబు లగునగాంతరంబులును, మణిసుందరంబు లగుకందరంబులును, నగోచరమార్గంబు లగుదుర్గంబులును గడచి చనఁజన వనజనయనునకు నగ్రభాగంబున, 129.

ఇట్లు = పైప్రకారముగా, నిర్గమించి = (పురమునుండి) వెడలి, దీనికి వెనుకటి పద్యమునందలి 'మురారాతి' కర్త. మించినజవంబునన్ = అధికమైనవేగముతో, ముందున్న 'చనన్' అనుసమాపకక్రియతో నన్వయము. అంబర.... పురంబులును, అంబర = ఆకాశమును, చుంబి = తాఁకుచున్న, శిఖర = అగ్రములుగల, గోపురంబులు = సింహద్వారములుగలవి, అగుపురంబులును = అయినపట్టణంబులును, వికచ.... రంబులును, వికచ = వికసించిన, కమల = తామరలయొక్కయు, కుముద = కలువలయొక్కయు, సముదయ = సమూహమునకు, ఆకరములు = ఉత్పత్తిస్థానములు, అగుసరోవరంబులును = అయినకొలఁకులును, అగణిత.... జీవనంబులు, అగణిత = లెక్కింప శక్యముగాని, ఖగ = పక్షులకును, (ఆకాశమునం బోవునవి) మృగాది = మెకములు మొదలగువానికిని, జీవనంబులు = రక్షకంబులు, అగువనంబులును = అగుతోఁటలును, వివిధ.... ఘోషంబులును, వివిధ = పెక్కుతెఱఁగులగల, గోవృష = ఆవులయు నెద్దులయు, వృషలాది = గొల్లలు మొదలగ జనులయొక్కయు, ఘోషంబులు = ధ్వనులుకలవి, అగుఘోషంబులును = అయినపల్లెలును, అనంత.... రంబులును, అనంత = అంతములేని, పాంథాంతరంబులు = అడవులుగలవి, ఎడారులుగలవి యనియేని యర్థము అగునగాంతరంబులును = అగుపర్వతమధ్యభాగంబులును, మణి.... రంబులును, మణిసుందరంబులు = మణులచే నందముగలవి, అగుకందరంబులును = అయినకొండగుహలును, అగోచర.... ర్గంబులును, అగోచరమార్గంబులు = తెలియనిత్రోవలుగలవి, అగుదుర్గంబులును = అయినచొరరానికోటలును, (ఇవి యన్నియు ద్వితీయార్థమునఁ బ్రథమలు) కడచి = అతిక్రమించి, చనఁజనన్ = పోఁగాఁబోఁగా, వనజనయనునకున్ = కృష్ణునకు,

అగ్రభాగంబునన్ = ఎదుటను, ముందుపద్యముతో నన్వయము.

సీ॥ భ్రమరీజలదజాల ♦ సమరీతిరతి ఖేల
దమరీగళితవాల ♦ సమితినీల
మతికాంతమణికూట ♦ తతికాంతరితఖేట
గతికాంతరుచిఝాట ♦ గగనవాట
మమితాచ్ఛసుమపూగ ♦ నమితాగమపరాగ
శమితాభనలరాగ ♦ సానుభాగ
మసమానసురగాన ♦ రసమానసమసూన
లసమానరువదాన ♦ నసదళీన
మలఘుహారిణధరోపల ♦ ఫలకఫలిత
లలితసితకరకిరణమం ♦ డలబిసాశ
యానటత్తటసితగిరు ♦ దగ్రసరసి
యైనరోహణనగమాళి ♦ గానసయ్యె॥ 130.

భ్రమరీ . నీలము, భ్రమరీ = తుమ్మెదలతోడను, జలదజాల = మేఘసమూహములతోడను, సమ = తుల్యమైన, రీతి = స్థితిగల, ( ఇది కేశపాశమునకు విశేషణము, రతి = అనురాగముచె, ఖేలత్ = క్రీడించుచున్న, అమరీ = దేవతాస్త్రీలయొక్క, గళిత = జాఱిపోయిన, వాల = కేశములయొక్క, సమితి = సముదాయముచేతను, నీలము = నల్లనిది, దేవతాస్త్రీ లిచ్చ వచ్చినట్లు క్రీడించుచుండ జాఱిపోయిన వారిధమ్మిల్లకాంతిచె నల్లనైనదని యర్థము అతికాంత . వాటము, అతికాంత = మిగుల సుందరమైన, మణికూట = మాణిక్యశిఖరములయొక్క, తతికా = సముదాయముచేతను, అంతరిత = కప్పివేయఁబడిన, ఖేట = గ్రహాదులయొక్క, గతి = సంచారమును, కాంత = సుందరమైన, రుచిఝాట = కాంతిసమూహమును, గగనవాటము = ఆకాశప్రదేశమునుగలది పొడవగుశిఖరములచేతను, నాకాశమునఁ బోవుగ్రహములనడకను గాంతిని నాకాశమునుగూడఁ గప్పివేసిన దనియర్థము అమితాచ్ఛ . భాగము, అమితాచ్ఛ = మిగుల నిర్మలమైన, సుమపూగ = పువ్వులసముదాయముచెతి, నమిత = వంగిన, అగము = వృక్షములయొక్క, పరాగ = ధూళిచెతను, శమిత = నివారింపఁబడిన, ఆభ = కాంతిగల, నలరాగసానుభాగము = పద్మరాగమణిమయమైన చదునుపునేలలుగలది. ( ని ) స్నిగ్ధప్రస్థస్సాను

రస్త్రియాం. ఆ పువ్వులచె వంగినవృక్షములనుండి జాఱుచున్న పుష్పోడిచేఁ గప్పఁబడి నపద్మరాగమణిమయము లగుమీఁదిచదరపువేలలుగలది. అసమాన.....సదళీనము. అసమాన=సాటిలేని, సురగాన=దేవతలసంగీతముయొక్క, రస=మాధుర్యముయొక్క, మాన=కొలఁదికి, సమ=తగునట్లు, (ఇది రువత్తను దానితో నన్వయించును) సూన=పుసుమములందు, లసమాన=ప్రకాశించుచున్న, రువత్=ధ్వనిచెయుచున్న, ఆనన=ముఖములుగల, సత్=శ్రేష్ఠమైన, అళీనము=భ్రమరరాజములుగలది. ఇందలి వృక్షములయం దున్న తుమ్మెదలు దేవతలు చక్కఁగా గానముచేయుచుండఁగా నా గానమాధురికిఁ దగినట్లు సుతి పట్టుచున్నట్లు కూయుచుండె ననిభావము. (అళి+ఇన=అళీన. (ని) ఇనస్సూర్యేప్రభౌ. అ) అలఘు.. ..సరసి, అలఘు=గొప్పవైన, హారిణధరోపల=చంద్రకాంతపురాలయొక్క, ఫలక=పలకలయందు, పలిత=ప్రతిబింబించిన, లలిత=మృదువగు, సితకర=చంద్రునియొక్క, కిరణమండల=కాంతిసముదాయమందున్, బిసాశయ=తామరతూండ్లనుభ్రాంతిచేత, ఆనటత్=మిగుల నాట్యము సేయుచున్న, తట=ఒడ్డునందలి, సితగరుత్=హంసలుగల (తెల్లరెక్కలుగలది) అగ్రిసరసి=శ్రేష్ఠమైనకొలఁకులుగలది. (ని) హంసాస్తుస్వేతగరుతః అవిరోహానగవరాళి=విరోహాణమనుపర్వతశ్రేష్ఠము, కానవచ్చెన్=కాన్పించెను చంద్రకాంతపురాలం బ్రతిబింబించిన చంద్రకిరణములను జూచి తామరతూండ్లనుకొని వానికై నాట్యముచెయుచుండుబావు తీరమునందలి హంసలు గలకొలఁకులు గలరోహణము కృష్ణునకుఁ గాన్పించె ననియర్థము ఇందు వృత్త్యనుప్రాసము శబ్దాలంకారము; అతిశయోక్తియు భ్రాంతిమంతమును నర్థాలంకారములు

మ॥ పవిధారం దెగి నట్టిచెట్టుపలు పై ♦ పై రాయిడిం జిందునైం
దవబింబామృతబిందురాజిఁ బునరు ♦ త్పన్నంబులై యుత్కట
చ్ఛవులం గార్కొనెనో యనంగ గిరిపా ♦ ర్శ్వచ్ఛన్ననీరంధ్రవే
ణువనంబుల్ శుకవర్ణపర్ణతతులం ♦ దోఁచెన్ దదగ్రిస్థలిన్॥ 131.

పవిధారన్, పవి=వజ్రాయుధముయొక్క, ధారన్=అంచుచేత, (ని) కులిశంభిదురంపవిః. ఆ తెగినట్టిచెట్టుపలు=కొట్టివేయఁబడిన రెక్కలు, రాయిడిన్=గాసిడిచేత, పైపైన్=రెక్కలు పోయినప్రదేశములమీఁదను, చిందు . . .రాజిన్, చిందు=పడియెడు, ఐందవబింబ=చంద్రమండలసంబంధమైన, అమృతబిందురాజిన్=అమృతపుఁజుక్కలసముదాయముచేతను, పునరుత్పన్నంబులై=(రెక్కలు) తిరిగి పుట్టినవై, ఉత్కటచ్ఛవులన్=అధికమైనకాంతులచేత, కార్కొనెనోయనంగన్=

నల్లఁబడినవో యనునట్లు, గిరిపార్శ్వ.. ...వంబుల్, గిరిపార్శ్వ=పర్వతముయొక్క ప్రక్కలయందు, చ్ఛన్న=డాఁగిన, నీరంధ్ర=దట్టమైన, వేణువనంబుల్=వెదురుటడవులు, శుకవర్ణపర్ణతతులన్=చిలుకవన్నె గలయాకులసముదాయముతో, తదగ్రస్థలిన్=ఆపర్వతముయొక్క ముందుభాగమందు, (కృష్ణునిముందుభాగమం దనియేనియర్థము) తోఁచెన్=కాన్పించెను. ఆపర్వతము మిగులఁ బొడవైనదగుటచే శిఖరములు దాఁకఁగాఁ జీలినచంద్రబింబమునుండి జాఱినయమృతపుఁజుక్కలచె మున్ను వజ్రాయుధముచే గొట్టఁబడినఱెక్కలు మఱల జిగిర్చి క్రొత్తకాంతిచె నొప్పుచున్నవో యనునట్లు నల్లని వెదురుపొదరులు కాన్పించె ననితాత్పర్యము. ఉత్ప్రేక్షాలంకారము.

ఉ॥ రంగదహార్యశృంగనల ♦ రాగవిభాగతరాగ యై వియ
ద్గంగతరంగపంక్తి దవు ♦ దవ్వుల మింట ననంతకాంతి య
య్యెం గురుచిత్రలీల గగ ♦ నేందిర దాల్చినయింగిలీకపుర్
రంగుతెఱంగునం గడుహొ ♦ రంగగుచీరచెఱంగులో యనన్॥

విియ.. . .పంక్తి=ఆకాశగంగయొక్క యలలవరుస, (ఇది తత్సమసమాసము గావున గంగాశబ్దము హ్రస్వాంత మయ్యెను.) రంగ .యై, రంగత్=ప్రకాశించుచున్న, అహార్య=(రోహణ) పర్వతముయొక్క, (ని) అహార్యధ్రపర్వతాః అశృంగ=శిఖరమునందలి, నలరాగ=పద్మరాగములయొక్క, విభా=కాంతిచేతను, గత=ప్రాప్తమైన, రాగయై=ఎఱుపు గలదియై, గగనేందిర=ఆకాశలక్ష్మి, గురుచిత్రలీలన్=అధికమైనవింతవిలాసముతో, తాల్చిన... ..తెఱంగునన్, తాల్చిన=ధరించిన, ఇంగిలీకపున్ రంగుతెఱంగునన్=ఇంగిలీకపువన్నెయొక్క రీతిచేతను, (ఎఱ్ఱకాంతిచేత ననియర్థము) ఇంగిలీకము+రంగు=కర్మధారయంబున మువర్ణకంబునకు బుంపు లగు=ఇంగిలీకపురంగు బా సం (పిమ్మట) నుదంతస్త్రీసమంబులకుం బుంపుల కుఁ బరుషసరళములు పరం బగునపుడు నుగాగమం బగు ననుసూత్రముక్రింద సుకాసుకచో స్థిరము పరంబగునపుడు నియోగమంబుగానం బడియెడి నని బా. సం. వఁ జెప్పుటచే నుగాగమము రాఁగా నీరూపము నిష్పన్న మయ్యెను కడున్=మిక్కిలి, హొరంగగుచీరచెఱంగులోయనన్=సుందరములగుకోకకొంగులవలె, దవుదవ్వులన్=దూరదూరమున, మింటన్=ఆకాశమున, అనంతకాంతి=మేరలేనికాంతికలది, అయ్యెన్; ఈపర్వతమునందలి కెంపులకాంతి మిన్నేటితరంగములలోఁ బ్రసరించుటచే నవి యాకాశలక్ష్మి ధరించినయెఱ్ఱవస్త్రముకొనలువలె మిగులం బ్రకాశించె ననితాత్పర్యము ఉత్ప్రేక్షాలంకారము

గీ॥ తరణికిరణోష్మఁ గరఁగి యి ♦ ధ్మములఁ దొఱఁగి
వజ్రఫలకము లంటుజ ♦ వ్వాది వలచు
తీవయిండ్లు కానన ♦ దేవతాళి
కేళికాశాలికలభంగి ♦ గిరిఁ జెలంగె॥ 133

తరణికిరణోష్మన్ = సూర్యకిరణములయొక్క యావిరిచేతను, ( వేఁడిచేత నని యర్థము. ) ( ఇచట మువర్ణలోపము చింత్యము. ) కరఁగి, ఇధ్మములన్ = కట్టెలనుండి, తొఱఁగి = జాఱి, వజ్రఫలకములు = మగరాలపలకలను, అంటుజవ్వాదిన్ = తగుల్కొనెడుసంకుమదము చేతను, వలచుతీవయిండ్లు = పరిమళించుపొదరిండ్లు, గిరిన్ = పర్వతమునందు, కానన .....భంగిన్, కాననదేవతాళి = వనదేవతాసముదాయములయొక్క, కేళికాశాలికలభంగిన్ = క్రీడాగృహములవిధమునను, చెలంగున్ = ప్రకాశించును.

సీ॥ తతశిఖామరకత ♦ ద్యుతులు దూర్వాంకుర
శంక మేయఁగ నెల ♦ జింక గదురఁ
గటకగారుడములఁ ♦ గన్గొని భీతిమై
రవిరథభుజగర ♦ జ్జువులు జాఱ
నమితేంద్రనీలగం ♦ డముల కిభభ్రాంతి
నురుదరీసుప్తోత్థ ♦ హరులు దుముక
ఘనవజ్రశృంగాట ♦ కములు గంగాఝరు
లనుచు దేవర్షులు ♦ మునుఁగఁ దొడరఁ
బ్రకటితాధిత్యకాపుష్య ♦ రాగములకు
సురుచిరాగమనుమపరి ♦ చ్యుతమరంద
బిందుసందోహతృష్ణచేఁ ♦ బృథుమిళింద
బృంద మందంద మూఁగఁ జె ♦ న్నొందు చున్న
యన్నగమువన్నె మది నెన్న ♦ వెన్నుఁ డపుడు॥ 134

నెలజింక = చంద్రునిలోనిలేడి, తత.......ద్యుతులు, తత = పొడవులగు, శిఖా = అగ్రములుగల, మరకత = పచ్చలరాలయొక్క, ద్యుతుల్ = కాంతులను, దూ

శ్యాంకురశంకన్ = గఱికె మొలకలయొక్క భ్రాంతిచేతను, మేయఁగన్ = మేయుటకు, కదురన్ = సమీపింపఁగాన్, కటకగారుడములన్ = కొండనడుమల నున్న గరుడపచ్చలను, (ని) కటకోస్త్రీనితంబో ద్రేః అ. రవిరథభుజగరజ్జువులు, రవిరథ = సూర్యునిరథ సంబంధమైన, భుజగరజ్జువులు = సర్పములనుత్రాడులు, కన్గొని, జాఱన్ = జాఱిపోఁగాన్, సూర్యునిరథమునందుం ద్రాడులైయున్న పాము లాపర్వతమం దున్న గరుడపచ్చలం జూచి గరుడుని తేజ మని భ్రమించి జాఱిపోవు చున్న వనిభావము సూర్యునిరథము మోయుగుఱ్ఱములకుఁ బాములు పగ్గము లనిప్రసిద్ధి. ఉరుదరీ ....హరులు, ఉరు = గొప్పవియగు, దరీ = గుహాలయందు, సుప్తోత్థ = నిద్రఁబోయి లేచిన,హరులు = సింగములు, ఇభభ్రాంతిన్ = గజము లనుభ్రాంతిచేతను, అమితేం .. ములకున్ = పెద్దవి యగునింద్రనిలపురాలకు, దుముకన్ = ఉఱుకఁగాన్, దేవర్షులు = దేవలోకమందలిఋషులు, ఘన . కములు, ఘన = విశాలమైన, వజ్రశృంగాటకములు = మగటాలయొక్క పెక్కు త్రోవలు గూడుచోట్లు, (ని) శృంగాటక చతుష్పథే అ గంగాఝరులనుచున్ = నదీప్రవాహము లనిభ్రమించుచు, మునుఁగన్ = స్నానము సేయుటకు, తొడరన్ = యత్నింపఁగాన్, పృథుమిళిందబృందము, పృథు = పెద్దవియగు, మిళింద = తుమ్మెదల యొక్క, బృందము = సముదాయము, సురుచిర... చెన్, సురుచిర = మిగులమనోహరములైన, అగము = వృక్షములయొక్క, సుమ = పుష్పములనుండి, పరిచ్యుత = జాఱిన, మరందబిందుసందోహా = పూదేనెతుంపురులసముదాయముయొక్క, తృష్ణచేన్ = ఆశచేతన్, ప్రకటిత ములకున్, ప్రకటిత = కనఁబడిన, అదిత్యకా = కొండమీఁది భూములయందలి, పుష్యరాగములకున్, (ఇవి తేనెరంగుగలవి) అచ్చటచ్చట = అచ్చటచ్చట, మూఁగన్ = ముసరికొనఁగాన్, చెన్నొందు చున్నయిన్నగమువన్నెన్ = ప్రకాశించుచున్న యాపర్వతముయొక్క శోభను, వెన్నుఁడు = కృష్ణుఁడు, మదిన్ = మనస్సునందున్, ఎన్నెన్ = శ్లాఘించెను. ఇందు భ్రాంతిమదలంకారము.

క॥ సల్లకీపల్లవములకు
నెల్లెడఁ దుండములు సాఁచి ♦ నిభములరొద భీ
తిల్లు తెలిజల్లిమెకముల
జల్లులు తెల్లుల్లసిల్లు ♦ చాఁపునఁ దోఁచెన్॥ 135.

సల్లకీపల్లవములకున్ = అంకుగుచిగుళ్లకు, హస్తములు = తొండములను, సాఁచుని భములరొదన్ = చాఁచెడునేనుఁగులయొక్కధ్వనిచేతను, భీతిల్లు . జల్లులు, భీతిల్లు = జడిసెడు, తెలి = తెల్లని, జల్లిమెకముల = చమరము లను జంతువులయొక్క,

జల్లులు = తోఁకలు ( సవరములు ) ఎల్లెడన్ = అన్ని దిక్కులయందును, ఱెల్లుల్లసిల్లు చాడ్పునన్ = ఱెల్లు వికసించినట్లు, తోఁచెన్ = కాన్పించెను

సీ॥ పై దట్టముగ వ్రాలు ♦ పరువంపుఁజంపక
ప్రసవాళు లనఁగ భ ♦ ర్మమయతటులు
తటులందు వెదురుము ♦ త్యములనెత్తము లాడు
చెంచుగుబ్బెతల దీ ♦ పించుపొదలు,
పొదలపైఁ బొదలునం ♦ బుదములు గర్జింపఁ
దొలిమొల్క లెత్తువై ♦ దూర్యమణులు,
వైదూర్యమణులరే ♦ వల కుల్కి మింటఁ గ
ట్టనితోరణంబు లై ♦ చనుశుకములు
శుకములకు బింబికాఫల ♦ స్ఫూర్తి దెలుపు
పొలుపు గలవాతెఱలవేలు ♦ పుంజెలులను
గలిగి విలసిల్లునమ్మహా ♦ చలముపజ్జ
నరుగుచుఁ దదీయవిభవంబు ♦ నరయఁ దలఁచి॥ 136.

పైన్ = మీఁదను, దట్టముగన్ = అధికముగన్, వ్రాలు.... ళులు వ్రాలు = పడియెడు, పరువంపు = నూతనముగ వికసించిన, చంపకప్రసవాళులు = సంపంగిపూవుల సముదాయములు, అనఁగన్ = అనునట్లు, భర్మమయతటులు = బంగారువికారమైనచఱులును, తటులందున్ = చఱులందున్, వెదురుముత్యములన్ = వెదుళ్లయందుత్పన్నమైనముత్యములతో, నెత్తములు = జూదములను, ఆడు......పొదలు, ఆడు = క్రీడించు, చెంచుగుబ్బెతల = చెంచుజవ్వనులయొక్క, దీపించుపొదలు = ప్రకాశించుతీవయిండ్లును, పొదలపైన్ = అట్టితీవయిండ్లమీఁదను, పొదలునంబుదములు = వృద్ధిఁ జెందెడుమేఘములు, గర్జింపన్ = ఉఱుమఁగాన్, తొలిమొల్కలెత్తు = మొదటనంకురించెడు, వైదూర్యమణులు = పిల్లికంటిరత్నములును, వైదూర్యమణులరేవలనున్ = విదూరదేశపుమణులచక్కఁదనమునను, ఉల్కి = భయపడి, మింటన్ = ఆకాశమున, కట్టనితోరణములై = ( జనులు ) నిర్మింపనిదండలై, చనుశుకములన్ = పోయెడుచిలుకలను, శుకములకున్ = చిలుకలకు, బింబికాఫలస్ఫూర్తిన్ = దొండపంటియొక్కకాంతిని, తెలుపు = తెలియఁజేయు, పొలుపుగల = చక్కఁదనముగలిగిన, వాతెఱలవేలుపుంజెలులను = పెద

వులు గలిగినదేవతాస్త్రీలను, గలిగి = ( పైనచెప్పినవానిని ) పొంది, విలసిల్లునమ్మహాచల ముపజ్జక్ = ప్రకాశించునా పెద్దకొండప్రక్కను, అరుగుచున్ = పోవుచున్, తదీయ విభవంబు = ఆపర్వతముయొక్క సంపదను, అరయన్ = పరీక్షించుటకున్ ( బాగుగఁ జూచుట కనియర్థము. ) తలఁచి = ఆలోచించి, ( దీనికి ముందుపద్యములో నున్న శరన్నాళీకాక్షుఁడు కర్త ) ఇందుఁ బూర్వపాదము చివర నున్న పదము రెండవచరణమున కు మొదట మఱల గ్రహించుటచేఁ బాదాంతపాదాదిముక్తపదగ్రస్తమను శబ్దాలంకారము

క॥ మేలిమియరదము డిగి యి
చ్చాలీలం బరిజనము న ♦ చట నిలిపి శర
న్నాళీకాక్షుఁడు తత్కట
కాళీవనచిత్రసరణు ♦ లరయుచు నుండెన్॥ 137.

శరన్నాళీకాక్షుఁడు = ( శరత్కాలమందలిపద్మములం బోలినకన్నులుగలవాఁడు ) కృష్ణుఁడు, అరదమున్ = రథమునుండి, డిగి = దిగి, పరిజనమున్ = సేవకసముదాయమును, అచటన్, నిలిపి, తత్కట ...సరణులు, తత్కటకాళీ = ఆకొండచఱులందలి, వనవిచిత్రసరణులు = తోఁటలలోని వింత లగుమార్గములను, ఇచ్చాలీలన్ = ఇచ్చవచ్చినట్లు, అరయుచునుండెన్ = పరిశీలించుచుండెను

వ॥ అనిన విని శుకయోగీంద్రునిం బరిక్షీన్న రేంద్రుం డవ్వలికథ నెఱింగింపు మనియడుగుటయు, ( సుగమము ) 138.

క॥ భామానవవిధకామా
కామాహితనయనశిఖిశి ♦ ఖాసమ తేజో
ధామా ధామరహితరిపు
భీమా భీమబలసుభట ♦ వీరస్తోమా॥ 139.

భామా = స్త్రీలకు, నవవిధ = నూతనప్రకారములుగల, కామా = మన్మథుఁడా, కామా .. ధామా, కామాహిత = శివునియొక్క, ( మన్మథునికి శత్రు వనియర్థము ) నయన = నేత్రముసందలి, శిఖి = అగ్నియొక్క, శిఖా = జ్వాలతో, సమ = తుల్యమైన, తేజః = ప్రతాపమునకు, ధామా = స్థానభూతుఁడా, ధామ... ..భీమా, ధామరహి

త=సుఖమునుండి తొలఁగింపఁబడిన, (ని) ధామజన్మప్రభాస్థానప్రభావసుఖసద్మను (నా) రిపు=శత్రువులకు, భీమా=భయంకరుఁడా, భీమ వీరస్తోమా, భీమబల=భయమును గలిగించుశరీరశక్తిగల, సుభటవీర=పరాక్రమశాలు లైనభటుల యొక్క, స్తోమా=సముదాయముగలఁప్రభూ,

ఉ॥ సంచితభూరిపుణ్య పటు ♦ సత్యవచోనిపుణాగ్రగణ్య దో
శ్చంచదనూనవిక్రమవి ♦ శాల మహాత్తరధైర్యధుర్యతా
కాంచనశైల భూవరని ♦ కాయనుతామితపీఠికాపురా
భ్యంచితరాజ్యవైభవస ♦ మగ్ర సుధీమహిమాబ్జసంభవా॥ 140

సంచితభూరిపుణ్య=సంపాదింపఁబడిన యధిక మైనపుణ్యము గలరాజా, పటు ... గణ్య, పటు=గౌరవగలవారియందును, సత్యవచోనిపుణ=నిజము పల్కుట యందు నేర్పు గలవారియందును, అగ్రగణ్య=శ్రేష్ఠుఁడా, దోశ్చం . . . విశాల, దోః=బాహువులయందు, చంచత్=ప్రకాశించుచున్న, అనూన=కొఱవడని, విక్రమ=పరాక్రమముచేతను, విశాల=అధికుఁడా, మహాత్తర . శైల, మహాత్తర=మిగులగొప్పది యగు, ధైర్యధుర్యతా=ధైర్యమును వహించుటయందు, కాంచనశైల= మేరుపర్వతతుల్యుఁడా, భూవర. సమగ్ర, భూవర=రాజులయొక్క, నికాయ= సముదాయముచేతను, నుత=స్తుతింపఁబడిన, అమిత=అధిక మైన, పీఠికాపుర=పీఠికా పురసంబంధ మైన, అభ్యంచిత=పూజింపఁబడిన, రాజ్యవైభవ=ప్రభుత్వసంపదచేతను సమగ్ర=పూర్ణుఁడా, సుధీమహి .. భవా, సుధీ=మంచిబుద్ధియొక్క, మహిమ= గొప్పతనముచేతను, అబ్జసంభవా=బ్రహ్మ (అబ్జసంభవుఁడు=తామరపూవునందుఁ బుట్టినవాఁడు. బ్రహ్మ)

పృథ్వీవృత్తము

అనర్ఘగుణరత్నధు ♦ ర్యవరసూర్యరాయాత్మజా
వినిర్మలహృదబ్జజా ♦ వితమురారిపాదాంబుజా
కనద్ఘనకపీంద్రసం ♦ ఘటితసవ్యసాచ్యగ్రజా
ఘనాబ్ధివిధుకామధు ♦ క్సదృగనూనదానధ్వజా॥ 141.

అనర్ఘ.... ఆత్మజా, అనర్ఘ=వెలలేని, (ఎక్కువ వెలగల) (ని) మూల్యే పూజావిధావర్ఘః. అ గుణరత్న=గుణము లనెడురత్నములయొక్క, ధుర్య=భార

మును వహించిన, వర = శ్రేష్ఠుఁడగు, సూర్యరాయాత్మజా = సూర్యరాయపుత్త్రుఁడా, వినిర్మల......దాంబుజా, వినిర్మల = మిగుల స్వచ్ఛమైన, హృదబ్జ = హృదయపద్మము చేత, భావిత = ధ్యానింపఁబడిన, మురారిపాదాంబుజా = కృష్ణునియొక్క పాదపద్మములు గలిగిననృపా, కనద్ఘన......వ్రజా, కనత్ = ప్రకాశించెడు, ఘన = గొప్పవారగు కవీంద్ర = కవీశ్వరులచేతను, సంఘటిత = కూర్పఁబడిన, నవ్య = నూతనమైన, కావ్యవ్రజా = కావ్యసముదాయము గలప్రభువా, ఘనాబ్ధి.. ...ధ్వజా, ఘన = మేఘముతోడను, అబ్ధి = సముద్రముతోడను, విధు = చంద్రునితోడను, కామధుక్ = కామధేనువుతోడను, (కోరికలం బితుకునది) సదృక్ = సమానమైన, అనూన = తక్కువకాని, దానధ్వజా = దానచిహ్నము గలరాజవరా.

గద్యము.—ఇది శ్రీమహాభారతీప్రసాదాసాదితకవితామతల్లికా
ల్లమరాజవంశజాపస్తంబసూత్రవదెల్లనార్యపౌత్త్ర
రంగశాయినామార్యపుత్త్ర హారితసగోత్ర
పవిత్ర సుకవిజనవిధేయ సుబ్రహ్మణ్యార
వినామధేయప్రణీతం బైనభద్రాపరిణ
యం బనుమహాప్రబంధంబునందుఁ
బ్రథమాశ్వాసము.

శ్రీ ర స్తు

శు భ మ స్తు

అ వి ఘ్న మ స్తు

# భ ద్రా ప రి ణ య ము.

## ద్వి తీ యా శ్వా స ము.

శ్రీవిలసద్భక్త్యర్పిత
సౌవర్ణమణీఘృణిల ♦ సత్కంకణము
ఖ్యావళితాంగక శేష
గ్రివాంచదుపేంద్రి రామ ♦ రాయనరేంద్రా॥ 1

శ్రీవిల... ...పేంద్రి, శ్రీ=సంపదచేతను, విలసత్=ప్రకాశించుచున్న, భక్తి=అనురాగముచేతను, అర్పిత=ఈయఁబడిన, సౌవర్ణ=బంగారముతోఁ జేయఁబడినవియుఁ, మణీఘృణి=మాణిక్యపుఁగాంతులచే, లసత్=ప్రకాశించు చున్నవియును (నగు) కంకణముఖ్య=కడియములు మొదలగువానిచె, ఆవళిత=వ్యాప్తమైన, అంగక=అవయవములుగల, (ని) అంగంప్రతీకోవయవః అ శేషగ్రావ=శేషాచలమునందు (తిరుమలయందు) అంచత్=ఒప్పుచున్న, ఉపేంద్రా=విష్ణువుగల (ని) ఉపేంద్రయింద్రావరజః. అ. ఈప్రభువు తిరుమలయందలి వేంకటేశ్వరస్వామికి బంగారుతోఁ జేయఁబడినవియు మణులకాంతి గలవియు నగుభూషణముల నర్పించి వానిచె వాదేవు నలంకరించె ననియర్థము. రామరాయనరేంద్రా=రామరాయప్రభూ! ముందరిపద్దెముతో నన్వయము

గీ॥ అవధరింపుము శౌరిభ ♦ వ్యచరితంబు
దొల్లి సూతుండు శౌనకా ♦ దులకుఁ జెప్పి

నట్టిరీతిఁ బరిక్షిద్ధ ♦ రాధినాథ
తిలకమున కిట్లు శుకయోగి ♦ దెలుపఁ దొడఁగె॥ 2

శౌరి . . .తంబు, శౌరి=కృష్ణునియొక్క, (శూరునిగోత్రమున జన్మించినవాఁడు) భవ్య=(వినువారికిని జెప్పువారికిని) శుభము నిచ్చెడు, చరితంబు=వృత్తాంతమును, అవధరింపుము=చిత్తగింపుము, తొల్లి=పూర్వము, సూతుండు, శౌనకాదులకున్=శౌనకుఁడు మొదలగునైమిశారణ్యవాసు లగుమునులకు, చెప్పినట్టిరీతిన్=చెప్పిన ప్రకారముచేత, పరిక్షిద్ధరాధినాథతిలకమునకున్=శ్రేష్ఠుఁ డగుపరిక్షిన్మహారాజునకు, ఇట్లు=ఈక్రిందిప్రకారముగా, శుకయోగి, తెలుపన్=తెలియఁజేయుటకు, తొడఁగెన్=ప్రారంభించెను

క॥ ఆచందంబున నన్నగ
వైచిత్రిం గనుచు యాదవ ♦ ప్రభుఁ డొకచో
లోచనసరోజసమ్మద
సూచక మగుసూర్యకాంత ♦ సుందర వేదిన్॥ 3

యాదవప్రభుఁడు=కృష్ణుఁడు, (చంద్రవంశ్యుఁ డైనయయాతికిం బుత్త్రుఁ డగుయదు వను రాజువంశమున జన్మించినప్రభువు.) ఆచందంబునన్=ఆప్రకారమునన్, అన్నగవైచిత్రిన్=ఆరోహణపర్వతసంబంధ మైనవైచిత్ర్యమును (అందలి వింత లని యర్థము.) కనుచున్=చూచుచున్, ఒకచోన్=ఒకస్థలమునందున్, ఉత్తరపదంబగు "చోటు" శబ్దముటూత్తరంబునకు లోపంబు విభాష నగు బా సమా. లోచన .....కము, లోచనసరోజ=పద్మములం బోలినకన్నులకు, సమ్మద=సంతోషమునకు, (కర్మార్థమునషష్ఠి) సూచకము=(కలిగించునది) సూచించునది, అగు...వేదిన్=అయ్యెడుసూర్యకాంతపురాలయొక్క (సూర్యకాంతపురాలతోఁ గట్టఁబడిన దనియర్థము.) అంద మగునరఁగునందున్ ముందుపద్దెముతో నన్వయము

ఉ॥ ఇంచుకసేపు దాను వసి ♦ యించిన నత్తఱి నమ్మహాద్రిశృం
గాంచలవీథిఁ జుక్క డిగి ♦ నట్లు తళు క్కని చంద్రుఁ బాసి యే
తెంచుకళావిశేషముగ ♦ తిం జఱియం దఱియంగ వచ్చి వీ
క్షించఁగ మ్రోల నిల్చె నొక ♦ చేడియ తద్వనదేవతాకృతిన్॥ 4

ఇంచుక సేపు=కొంచెపుఁగాలము, తాన్ = ఆకృష్ణుఁడు, వసియించినన్ = ఉండఁగా, అత్తఱిన్ = ఆకాలమునందు, ఒకచేడియ = ఒకానొక స్త్రీ ( ఇది చేటీశబ్దభవము ) ఆమ్మహా......వీధిన్, అమ్మహాద్రి = ఆగొప్పకొండయొక్క, శృంగ = శిఖరముయొక్క, అంచలవీధిన్ = అగ్రభాగమునుండి, ( ఇటఁ బంచమ్యర్థమున ద్వితీయ ) చుక్క = నక్షత్రము, ( ఇది శుక్రశబ్దభవ మనిచెప్పుదురు, గాని యిచ్చట నక్షత్రసామాన్య మనియే యర్థము ) దిగినట్లు, తళుక్కని = మెఱసి, ( ఇది మెఱయుటయం దగు ననుకరణముం దెలుపు శబ్దము ) చంద్రున్, పాసి = వదలి, ఏతెంచుకళావిశేషముగతిన్ = వచ్చెడునొకానొకభాగముయొక్క రీతి వంటిరీతితో, ( ని ) కళాతుషోడశో భాగః. అ చఱియన్ = శిఖరముక్రిందిభాగమును, తఱియంగన్ = సమీపించునట్లు, వచ్చి, వీక్షించఁగన్ = చూచుచుండఁగనే, తద్వనదేవతాకృతిన్ = ఆపర్వతమునందలి వనముం గాపాడుదేవతయొక్కయాకారముతో, మ్రోలన్ = ఎదుటన్, నిల్చెన్ = ఉండెను

సీ॥ అపరంజిమెఱుఁగుటం ♦ దపుశరీరచ్ఛాయ
తొలుకారుమించుల ♦ నెళవు సేయఁ
గలికినిద్దంపుఁజ ♦ క్కనిచెక్కులబెడంగు
మగరాలతళుకుల ♦ సొగసు గెలువ
నానెంపునునుసోగ ♦ వేణీభరముసొంపు
వేల్పురారాలకి ♦ విని హసింపఁ
గొలుకుల వెడలుక్రొం ♦ బెళుకుకన్గవచూపు
లళులమాలికల మే ♦ నఱికమూడ
దివ్యమణిపుత్త్రియో యనఁ ♦ దేజరిల్లి
సుందరస్ఫూర్తిఁ గన్నారఁ ♦ జూచువార
లౌననంగలసన్మంగ ♦ ళాంగి యైన
యోనలినగంధిఁ గాంచె హే ♦ మాంబరుండు॥ 5

అపరంజి .. ..చ్ఛాయ, అపరంజి = బంగారుయొక్క, మెఱుఁగుటందపు = తళతళలాడుసుందరమైన, శరీరచ్ఛాయ = దేహకాంతి, తొలు......సేయ, తొలుకారు = వర్షాకాలమునందలి, మించుల = మెఱుఁగులయొక్క, నెళవు = పరిచయమును,

చేయన్ = కావింపఁగాన్, శరీరకాంతి మెఱుపులం బోలఁగా ననిభావము. కలికి...... బెడంగు, కలికి = మనోహరమైన, నిద్దంపుఁజెక్కుని = నున్నని యందమైన, చెక్కులబెడంగు = గండస్థలముయొక్క సౌందర్యము, మగరాలతళుకులసొగసు, మగరాల = వజ్రములయొక్క, తళుకులసొగసు = కాంతులయందమును, గెలువన్ = జయింపఁగాన్, చెక్కులకాంతులు వజ్రకాంతులం బోలఁగా ననిభావము నాణెంపు.... .సొంపు, నాణెంపునునుపోగ = నాగరికమైన నున్నని దీర్ఘమైన, వేణీభరముసొంపు = జడయొక్కచక్కందనము, వేల్పురారాలతీవిన్ = ఇంద్రనీలములకాంతిని, హసింపన్ = పరిహాసము చేయఁగా, ( వేల్పు = దేవతలయొక్క, రా = రాజైనయింద్రునియొక్క, రాలు = మణులు. ) కొలుకులన్ = కంటితుదలనుండి, వెడలు .. .చూపులు, వెడలు = ప్రసరించెడు, క్రొంబెళుకు = క్రొత్తకాంతిగల, కన్గవచూపులు = కన్నులజంటయొక్కదృష్టులు అళులమాలికలన్ = తుమ్మెదబారులను, మేలమాడెన్ = పరిహసింపఁగాన్, దివ్యమణిపుత్త్రికయో యనన్ = సుందరమైనమణులయొక్కబొమ్మవలె, ( మణులచేఁ జేయఁబడినబొమ్మవలె ననియర్థము ) తేజరిల్లి = ప్రకాశించి, సుందరస్ఫూర్తిన్ = అందమైనప్రకాశముతో, కన్నారన్ = కన్నులనిండన్, చూచువారలు, పొగడంగలసన్మంగళాంగి = స్తుతిచేయఁ దగినసుందరమైనశరీరముగలది యైన, యానలినగంధిన్ = తామరపూలవంటి సహజమైనపరిమళము గలస్త్రీని, గంధము సహజమైనప్పుడే బహువ్రీహిసమాసమున నీశబ్దమున కికారము వచ్చు ననిపాణిని హేమాంబరుండు = కృష్ణుఁడు ( బంగారుసరిగవస్త్రముల ధరించినవాఁడనియర్థము బంగారముం బోలిన పచ్చనివస్త్రము గలవాఁడనియేని యర్థము ) కాంచెన్ = చూచెను

ఉ॥ కాంచి వ్రజాంగనాహృదయ ♦ గౌరవచౌర్యధురీణ మాకిరా
ఖాంచలపాళి హాళిమెయి ♦ నవ్వికచాంబుజలోచన న్విమ
ర్శించి యపూర్వవిస్మయవి ♦ శేషము చిత్తమునందు సంభ్రమో
దంచితమై పెనంగ హరి ♦ దానివిలాసము నెంచి యిట్లనున్॥ 6

హరి = కృష్ణుఁడు, అవ్వికచాంబుజలోచనన్ = మీఁదఁ జెప్పినస్త్రీని, ( వికసించినతామరపువ్వులంబోలిన కన్నులు గలదాని ననియర్థము ) వ్రజాంగనా... ..ధురీణము, వ్రజాంగనా = గొల్లపల్లెలయందలిసుందరులయొక్క, హృదయ = మనసులందలి, గౌరవ = గొప్పతనముయొక్క, ( గొప్పతనము ననియర్థము ) చౌర్య = దొంగిలించుటయందు, ధురీణము = భారము వహించినది ( గోపికలమనసును వశపఱచికొనిన ద

నియర్థము. ) డొక.....చలపాళిన్ = అగుకేళిఁగంటిచూపులయగ్రభాగములవరుసతో, పాళిమెయిన్ = ఆసక్తిచేత, కాంచి = చూచి, ( కేళిఁగంటం జూచి యనియర్థము ) వి మర్శించి = పరిశీలించి, దానివిలాసమున్ = ఆయింతియొక్కచక్కఁదనమును, ఎంచి = స్తుతించి, అపూర్వ .. శేషము, అపూర్వ = ము న్నెన్నఁడులేని, విస్మయవిశేషము = ఆశ్చర్యాతిశయము, చిత్తమునందున్ = మనసునందున్, సంభ్రమోదంచితమై = ఆదర ముచే వృద్ధిపొందింపఁబడినదియై, పెనంగన్ = చుట్టుకొనఁగాన్ ( గాఢముగ వ్యాపిం పఁగా ననియర్థము. ) ఇట్లు = ఈక్రిందిరీతిని, అనున్ = పలుకును

క॥ ఇది యెవ్వతెయో దీనికి
సదనం బెయ్యదియొ దీని ♦ జననస్థల మె
య్యదియో మది కద్భుతమై
యిది కన్నులపండువగుచు ♦ నింపు ఘటించెన్॥ 7

ఇది = ఈసుందరి, ఎవ్వతెయో, ( ' ఓ ' సందేహార్థక మగునవ్యయము ) దీనికిన్ = ఈయింతికిన్, సదనంబు = వాసస్థలము, ఎయ్యదియొ, దీనిజననస్థలము = దీనిపుట్టినచో టు, ఎయ్యదియో, ఇది = ఈయువతి, మదికిన్ = మనసునకు, అద్భుతమై = ఆశ్చర్యము గలిగించునదియై, ( ఇచట నద్భుతశబ్దమునకు లక్షణచే నద్భుతము గలిగించునది యని యర్థము. ) కన్నులపండువు = నేత్రోత్సవము, అగుచున్, ఇంపు = ఆనందమున్, ఘ టించెన్ = కూర్చెను

క॥ భారతిసహచరియో కా
కారతిసహచరియొ కాక ♦ యన్యాంగన కి
ట్లీరుచి, యీశుచితాత్యుచి
తారచితవిలాసభాసి ♦ తాకృతి గలదే॥ 8

( ఇది ) భారతిసహచరియో = సరస్వతిచెలియో, కాక = కానియెడ, ( ఇట నిది దేశ్యావ్యయము ) ఆరతిసహచరియొ = ఆప్రసిద్ధురా లగుమన్మథునిభార్యయొక్కచె లియో, కాక = కాకుండినన్, అన్యాంగనకున్ = ఇతరస్త్రీకి, ఇట్లు = ఈకనుపట్టుచున్న ప్రకారము, ఈరుచి = ఈదేహకాంతియు, ఈశుచి.....కృతి, ఈ = ఇట్టి, శుచితా = పారిశుద్ధ్యముచేతను, అత్యుచిత = మిగులం దగువట్లు, ఆరచిత = చేయఁబడిన, విలాస = లీలలచేతను, భాసిత = ప్రకాశించెడు, ఆకృతి = ఆకారము, కలదే = ఉండునా? ఉండ

దని యర్థము. ఇందు సందేహాలంకారము.

గీ॥ అని వితర్కించుచుండ న • య్యాదవేంద్రు
దివ్యమంగళవిగ్రహ • తేజ మువిద
గాంచి దృఢభక్తిఁ బులకిత • గాత్రి యగుచుఁ
గనుఁగవ ముదశ్రు లొలుక ని • ట్లనుచు మ్రొక్కె॥ 9

అని వితర్కించుచుండఁగ = (కృష్ణుఁడు) మీఁదఁ జెప్పినట్లు సంశయించుచుండఁగా, ఉవిద = ఆయువతి, అయ్యాద... ..తేజము, అయ్యాదవేంద్రు = ఆకృష్ణుని యొక్క, దివ్య = సుందరమైనదియు, మంగళ = శుభమైనదియునగు, విగ్రహ = శరీరముయొక్క, తేజము = ప్రకాశమును, కాంచి = చూచి, దృఢభక్తిన్ = అధికమైనయనురాగముచేత, పులకితగాత్రి = గగుర్పొడిచిన మేనుగలది, అగుచున్, కనుఁగవన్ = కన్నులజంటనుండి, ముదశ్రులు = సంతోషబాష్పములు, ఒలుకన్ = స్రవింపఁగా, ఇట్లనుచున్ = ఈక్రిందివాక్యములను బలుకుచు, మ్రొక్కెన్ = నమస్కరించెను

క॥ జయజయ వసుదేవాత్మజ
జయజయ గోవింద భక్త • జనకల్ప హరే
జయజయ జగదధినాయక
జయజయ కృష్ణ ధృతశంఖ • చక్ర నమస్తే॥ 10

వసుదేవాత్మజ = వసుదేవుని పుత్త్రుఁడా, జయజయ = జయింపుము (ఎల్లవారికంటె నధికుఁడ వగు మని యర్థము) గోవింద = భూమిని స్వాధీనపఱచుకొనినస్వామీ, జయజయ = జయింపుము, భక్తజనకల్ప = సేవించినవారికిం గల్పవృక్షమగుప్రభువా, (భక్తులకుం గోరినవాని నిచ్చువాఁ డని యర్థము) హరే = భక్తులపాపములను వారించుస్వామీ, జయజయ = జయింపుము, జగదధినాయక = ఎల్లప్రపంచములం బాలించుదేవరా, జయజయ, ధృతశంఖచక్ర = ధరింపఁబడినపాంచజన్యమును సుదర్శనమును గల కృష్ణా, (ని) శంఖోలక్ష్మీపతేఃపాంచజన్యశ్చక్రంసుదర్శనః అ తే = నీకొఱకు, నమః = నమస్కారము (అస్తు = అగును)

కేవలసంస్కృతవాక్యములకేని పదములకేని తెనుఁగునం బ్రయోగంబు లేదనియు, ననుకరణంబున వారికిం బ్రయోగంబు గల దనియు నన్నయభట్టారకుండు చెప్పెంగాన మునుపటివచనమున "ని" యని చెప్పెను. ఆంధ్రపదములతోఁ గూడనికేవ

లసంస్కృతవాక్యము ననుకరణముం దొలంగియుఁ బ్రయోగింప నగునని యావికృతివివే కమున" నుండెను గాన నీపద్యమున ననుకరణము లేకున్నను దోషంబులేదు.

వ॥ అని మఱియును (సుగమము.) 11

సీ॥ పంకజప్రభవాండ • భాండకాండములకు
మనికిపట్టెమహా • మహులనిభోజ్జ
భువనపావనియైన • దివిజనిమ్నగకు నె
వ్వనిపదాంభోజంబు • జననసీమ
యజుఁడు వేగంటిమి • న్నగు మేటిజేజేలు
గానంగనేర రె • వ్వానిరూపు
మొనసి యేదేవుని • వినుతింపఁజాలక
పెనుఁబల్కు లాలింపి • గ్గునను మరలు
నట్టిబ్రహ్మాంబఁ పీవు మ • హానుభావ
ఖలుల ననుపులఁ ద్రుంచి సా • ధులను బెంప
భూభరము మాన్ప యదుకులం • బున జనించి
తయ్య లక్ష్మీమనోహర • యాదిపురుష॥ 12

మహానుభావ=దొడ్డమహిమగల, లక్ష్మీమనోహార=లక్ష్మీపతీ, ఆదిపురుష = మొదటిపురుషుఁడా, ఈవు, ఏమహామహులనిభోజ్జ=ఏగొప్పతేజశ్శాలియుదా ము, పంకజ.... కాండములకు, పంకజప్రభవాండభాండ=భాండములంబోలిన (కుండలంబోలిన) బ్రహ్మాండములయొక్క, కాండములకు=సముదాయములకు, మనికిపట్టు = నివాసస్థానమొ, ఎవ్వనిగర్భము సకలప్రపంచములకు నివాసస్థానమో యని యర్థము; (ని) కాండోస్త్రీదండబాణార్వవర్గావసరవారిషు అ ఎవ్వనిపదాంభోజంబు=ఎవ్వనిదగుతామరపూవుంబోలినపాదము, భువనపావని = లోకముం బవిత్రముసేయునది, ఐన, దివిజనిమ్నగకు=ఆకాశగంగకు, (ని) ప్రవంతీనిమ్నగాపగా అ. జననసీమ= పుట్టుచోటో, ఏభగవంతునిపాదపద్మము స్వర్గలోకమున మందాకిని యనియు భూలోకమున భాగీరథి యనియుఁ బాతాళమున భోగవతి యనియు నామములం బ్రవహించుచుఁ బావనము చేయునది యుత్పత్తిస్థానమో యని యర్థము ఎవ్వానిరూపు=ఏపరమే

శ్వరుఁడాకారమును, అజుఁడు = బ్రహ్మ, (పుట్టువులేనివాఁడు) వేగంటి = ఇంద్రుఁడు (వేయికన్నులుగలవాఁడు) మున్నగుమేటివేల్పులు = మొదలగుగొప్పదేవతలు, కానంగన్ = చూచుటకు, నేరరు = శక్తులుకారో, ఏదేవునియాకారము బ్రహ్మమొదలగువారుసయితము చూడ శక్తులు గారో యని యర్థము. వెనుఁబల్కులెల్లన్ = వేదములన్నియు, ఏదేవునిన్, మొనసి = యత్నించి, వినుతింపన్ = స్తుతిసేయుటకు, చాలక = తగినవిగాక, సిగ్గునన్ = లజ్జచేతను, మరలున్ = వెనుక మొగము వెట్టునో, సకలమును దెలుపువేదములుసయితమేదేవునిం బొగడఁజాలవో యని యర్థము. అట్టిబ్రహ్మంబవు = పైనచెప్పినలక్షణములుగలనిత్యమును, శుద్ధమును నగువస్తువవు. ఖలులన్ = క్రూరులైన, అసురులన్ = రాక్షసులను, త్రుంపన్ = చంపుటకును, సాధులన్ = సజ్జనులను (పరోపకారముచేయువారలను) పెంపన్ = రక్షించుటకును, భూభరము = భూమియొక్కబరువును, మాన్పన్ = నివారించుటకున్, యదుకులంబునన్ = యదువంశమున, జన్మించితయ్య = పుట్టితివిగదా.

గీ॥ ద్వారవతిఁ జేరఁ దారాప • థమునఁ జనుచు
దేవ! తావకదర్శనం • బేవిధమున
నబ్బునని రాఁగ నిచ్చటఁ • బ్రాప్త మయ్యె
సులభముగ నేఁడు నాపూర్వ • సుకృత మహిమ ॥13

దేవ = ఓస్వామీ, ద్వారవతిన్ = ద్వారకాపురమున, చేరన్ = ప్రవేశించుటకు, తారాపథమునన్ = ఆకాశముచేతను, (నక్షత్రములుపోవుత్రోవను) చనుచున్ = పోవుచు, తావకదర్శనంబు = నీసంబంధమైనదర్శనము, ఏవిధమునన్ = ఏప్రకారముచేత, అబ్బునని = దొరకునని, రాఁగన్ = వచ్చుచుండఁగా, ఇచ్చటన్ = ఈస్థలమునందు, నాపూర్వసుకృతమహిమన్ = నాయొక్కపూర్వపుణ్యముయొక్కమహిమచేతను, (నేను మునుపటిజన్మమునఁ జేసికొనినపుణ్యబలముచేత నని యర్థము.) నేఁడు = ఈదినమునన్, సులభముగన్ = అనాయాసముగ, ప్రాప్త మయ్యెన్ = సంభవించిన దయ్యెను.

వ॥ అని భక్తిపారవశ్యంబున నద్దివ్యసుందరీరత్నంబు ముకుందచరణారవిందంబుల నిజఫాలతలంబు సోఁక వ్రాలిన వనమాలి కేలు కేలం గీలించి యెత్తి కరుణాయత్తచిత్తుండై యత్తన్వి వేణీభరంబు నిఖిలమంగళాకరం బగునిజకరంబున నిమురుచు భవదీయవృత్తాంతం బె

ద్ది దెఱింగింపు మనవుడు హరికరస్పర్శనసుఖావేశంబునం బొంగు నెమ్మనంబు నెట్టకేలకుఁ గ్రమ్మఱిచి యమ్ముకుందున కది యిట్ల నియె॥ 14

అద్దివ్యసుందరీరత్నంబు = మీఁదఁ జెప్పినదేవతాస్త్రీశ్రేష్ఠము (శ్రేష్ఠురాలగు దేవతాస్త్రీ యని యర్థము.) (ని) రత్నం స్వజాతిశ్రేష్ఠేపి. అ అని = ఇట్లు పలికి, భక్తిపారవశ్యంబునన్ = భక్తిపరాధీనతచేత, (పరవశుఁడు = పరవశుఁడు, ఇతరులకు లోఁబడినవాఁడు; పరవశునిభావము పారవశ్యము. ఇట భక్తికి లోఁబడుటచే ననియర్థము.) నిజఫాలంబు = తననొసలు, సోఁకన్ = (పాదములు) తాఁకునట్లు, ముకుందుచరణారవిందంబులన్ = కృష్ణునిపాదపద్మములందు, వ్రాలినన్ = ఒఱగఁగాన్, వనమాలి = కృష్ణుఁడు (దళములం బువ్వులం గూర్చినమాలికల ధరించినవాఁడు) కేలన్ = తనచేతితో, కేలు = (ఆస్త్రీ) హస్తమును, కీలించి = పట్టుకొని, ఎత్తి = లేవఁదీసి, కరుణాయత్తచిత్తుండై = దయకులోఁబడినమనసుకలవాఁడై (దయఁగలవాఁడై) నిఖిల .. ..కరంబు, నిఖిల = సమస్తమైన, మంగళ = శుభములకు, ఆకరంబు = స్థానము, అగు, నిజకరంబున్ = తనచేతితో, అత్తన్వివేణీభరంబు = ఆలతాంగియొక్క జడను, నిమురుచున్ = (ప్రేమతోఁ) దడవుచు, భవదీయవృత్తాంతంబు = నీసమాచారము, ఎద్ది, ఎఱింగింపుము = (దానిని) తెలుపుము, అనవుడున్ = అనినతోడనే, అది = ఆసుందరి, హరికర వేశంబునన్, హరి = కృష్ణునియొక్క, కరస్పర్శన = హస్తము తాఁకుడుచేతనైన, సుఖావేశంబునన్ = సుఖపారవశ్యముచేత, (ఎక్కువసుఖముచేత నని యర్థము) పొంగు నెమ్మనంబున్ = సంతోషపడుమనమును, ఎట్టకేలకున్ = చిట్టచివరకున్, క్రమ్మఱిచి = మరలిచి, అమ్ముకుందునకున్ = ఆకృష్ణునకున్, ఇట్లు = ఈక్రిందివాక్యమును, అనియెన్ = పలికెను

సీ॥ అపునరావృత్తి, ని ♦ త్యానందసాంద్రమై
పొలుపొందు తెలిదీవి ♦ పుట్టినిల్లు
బ్రహ్మర్షి రాజర్షి ♦ పరివేష్టితంబైన
పరమేష్ఠికొల్వుకు ♦ పరఁగుచోటు
సకలదివ్యాంగనా ♦ సతతసంసేవిత
భారతినేస్తంబు ♦ ప్రాణతుల్య

మత్యంతసత్యవ్ర • తాశ్రయం బైయొప్పు
సత్యలోకంబు సం • చారసీమ
శంకరామరపతిముఖ్య • సర్వదేవ
తాలయంబులు గమనయో • గ్యస్థలములు
సహచరులు దివ్యవనితలు • సహజగోష్ఠి
తావకకథాళి మాకుఁ బ • ద్మాకళత్ర॥ 15

పద్మాకళత్ర=ఓకృష్ణా! (పద్మ=లక్ష్మి, కళత్రము=భార్య. లక్ష్మియేభార్యగాఁగలవాఁడు పద్మాకళత్రుఁడు దానిసంబుద్ధి పద్మాకళత్ర) అపునరావృత్తి... ...సాంద్రము అపునరావృత్తి=మరలజన్మమునుగలిగింపనిదియు, నిత్య=శాశ్వతమైన, ఆనంద=సుఖముచే, సాంద్రము=ఎడతెగనిదియు, ఐ, పాలుపొందుతెలిదీవి=ఒప్పారుశ్వేతద్వీపము, మాకున్, (ఇట నేకవచనము చెప్పఁదగి యున్నను బహువచనంబును శాస్త్రసమ్మతము) ఇదియెల్ల వాక్యములతో సంబంధించును పుట్టినిల్లు=జన్మస్థానము, ఏదీవిని జన్మించినవారికి మగల జన్మము గలుగదో మఱియు నెచ్చట శాశ్వతమైనసుఖ ముండునో యట్టితెలిదీవి నాజన్మస్థాన మని యర్థము బ్రహ్మర్షి. ....తంబు, బ్రహ్మర్షి=బ్రహ్మఋషులచేతను, రాజర్షి=రాజఋషులచేతను, పరివేష్టితంబు=ఆవరింపఁబడినది, ఐన, పరమేష్ఠికొల్వు=చతుర్ముఖునిసభ, (మాకున్) ఉనికి=వాసస్థానమును, పరఁగుచోటు=విహరించుస్థలమును, (ఉనికి=వ్యాపించుచోటనియేనియర్థము.) (అగును) సకల . నేస్తంబు, సకలదివ్యాంగనా=ఎల్లదేవతాస్త్రీలచేతను, సతత=ఎల్లప్పుడును, సంసేవిత=సేవింపఁబడు, భారతి=సరస్వతియొక్క, నేస్తంబు=చెలిమి, (మాకున్) ప్రాణతుల్యము=ప్రాణములతోసమానము (అగును) అత్యంత... యంబు, అత్యంత=అంతములేని, సత్యవ్రత=నిజముపల్కుటయందునియమముగలవారికి, ఆశ్రయంబు=నివాసము, ఐ, ఒప్పుసత్యలోకంబు=తగియెడుబ్రహ్మలోకము, (మాకున్) సంచారసీమ=తిరిగెడుచోటు, (అగును) శంకరామర .. యంబులు, శంకర=శివుఁడు (లోకములకు సుఖము గలిగించువాఁడు) అమరపతి=ఇంద్రుఁడు, ముఖ్య=మొదలైన, సర్వదేవతాలయంబులు= సమస్తదేవతలయొక్కగృహములును, గమనయోగ్యస్థలములు=పోఁదగినచోట్లు (అగును) సహచరులు=చెలికత్తెలు, దివ్యవనితలు=దేవలోకమందలిస్త్రీలు, సహజగోష్ఠి=కూడఁబుట్టినసల్లాపము, తావకకథాళి=నీవృత్తాంతసముదయము (అగును.)

క॥ ఏదేవర్షి కుమారిక
నీదయ నిగమాగమాంత ♦ నిశ్చితయోగ
ప్రాదుర్భూతానందము
నూఁదుట శ్రుతిరంజని యను ♦ యోగినినిహారీ॥ 16

హారీ = ఓకృష్ణా! ఏన్, దేవర్షికుమారికన్ = ఒకానొకదేవఋషికూఁతురను, నీదయన్ = నీకరుణచే, నిగమాగ ... నందమున్, నిగమ = వేదములచేతను, ఆగమాంత = వేదాంతములచేతను, నిశ్చిత = సిద్ధాంతింపఁబడిన, యోగ = భక్తిచేతను, (మనసును బాహ్యపదార్థములనుండి మరలించి యీశ్వరునందు నిలుపుట యోగము.) ప్రాదుర్భూత = పుట్టిన, ఆనందమున్ = సుఖమును, ఊఁదుటన్ = ధరించుటచేతను, శ్రుతిరంజని, అను యోగినిని = అనుభక్తురాలను. శ్రుతులయందు ననురాగము గలది గాన శ్రుతిరంజని యనియును బ్రశస్తమైనయోగము (భక్తి) గలదిగావున యోగిని యనియు సార్థక నామములు

వ॥ అని యద్దివ్యయోగినీరత్నంబు దనవచ్చినప్రయోజనంబు ప్రశంసించునదియై కంసభేది కిట్లనియె. 17

అద్దివ్యయోగినీరత్నంబు = ఆశ్రుతిరంజని, అని = (తనవృత్తాంత మిట్లు) చెప్పి, తనవచ్చినప్రయోజనంబు = తనవచ్చినకార్యమునుగూర్చి, ప్రశంసించునదియై = చెప్పఁదలఁచినదియై, కంసభేదికిన్ = కృష్ణునకున్, ఇట్లనియెన్ = ఈక్రిందిప్రకారము చెప్పెను

ఉ॥ క్ష్మాకమలేక్షణాసుమణి ♦ మాల్యసమేక్షుమతీతరంగిణీ
కోకనదాంబుజాతచయ ♦ గుంఫితభూరిఝరీప్రకాశమై
ప్రాకటసర్వవర్ణజన ♦ బంధురసౌఖ్యనివేశ మాచుల
క్ష్మీకలితప్రదేశ మగు ♦ కేకయదేశము వొల్చుఁ దద్ధరన్॥ 18

క్ష్మాకమ......ప్రకాశము, క్ష్మా = భూమియనెడు (ని) క్ష్మాకమలేక్షణ = భూమియనెడు స్త్రీ. అ. కమలేక్షణా = స్త్రీయొక్క, సుమణిమాల్య = ముత్తియములదండతో, సమ = తుల్యమైన, ఇక్షుమతీతరంగిణీ = ఇక్షుమతి యనుపేరుగలనదీసంబంధమైన, కోకనద = ఎఱ్ఱగలువలయొక్కయు (ని)రక్తోత్పలంకోకనదం అ. అంబుజాత = తామరపూవులయొక్కయు, చయ = సముదాయముచేతను, గుంఫిత = కూర్పఁబడిన, భూరి = అధికమైన,

ఝురీప్రకాశము=ప్రవాహరూపమైనకాంతిగలది, (కాంతిప్రవాహము గలదని యర్థము) ఐ, ప్రాకట .....నివేశము, ప్రాకట=ప్రసిద్ధమైన, సర్వవర్ణజన=ఎల్లజాతులమనుజులయొక్కయు, బంధుర=ఒప్పిదమైన, సౌఖ్య=సంతసమునకు, నివేశము=నివాసస్థానము, ఔచుక్, లక్ష్మీకలితప్రదేశము=సంపదతోఁగూడినస్థలముగలది, అగుకేకయదేశము, పొల్చున్=ప్రకాశించును (ఉండె నని యర్థము.) తద్ధరన్=ఆదేశమునందున్, ముందుపద్దెముతో నన్వయము భూమియనునింతికి ముత్యాలదండంబోలిన యిక్షుమతి యనునదీతీరమున నెల్లవారికి సుఖదమై సకలసంపదలకు నిరవైనకేకయదేశము కలదని భావము

సీ॥ శ్రీకరాభ్యంచితా ♦ స్తోకరత్నాళి చా
మీకరస్థగితసౌ ♦ ధాకరంబు
భాసురాగమసదా ♦ భ్యాసరాజితమనీ
షాసరోజాసన ♦ జ్యాసురంబు
కేళికావశచంద్ర ♦ శాలికాంతరచల
ద్బాలికాదృక్పద్మ ♦ మాలికంబు
గంధవారణఘటా ♦ గంధవాహాత్యంత
బాంధవాత్యున్నత ♦ సైంధవంబు
లోకనుతపాకవైభవ ♦ పాకహార్య
నేకసుశ్రీకనృపలోక ♦ సాకరీక
ళాకలితనాకసమసంప ♦ దాకరంబు
కరము వొగడంగఁ దనరుఁ గే ♦ కయపురంబు॥ 19

శ్రీకర ...కరంబు, శ్రీకర=శోభను గలిగించు, అభ్యంచిత=పూజింపఁబడిన, అస్తోక=అధికమైన, రత్నాళి=మణులసముదాయముచేతను, చామీకర=బంగారముచేతను, స్థగిత=కప్పఁబడిన, సౌధ=మేడలకున్, ఆకరంబు=ఉనికిపట్టును, (రత్నములును బంగారమును దాఁపినమేడలు గలదనియర్థము) భాసుర......సురంబు, భాసుర=ప్రకాశించెడు, ఆగమ=వేదములయొక్క, సదాభ్యాస=ఎడతెగనియలవాటుచేన్, రాజిత=ప్రకాశించెడు, మనీషా=బుద్ధిచేతను, సరోజాసన=చతుర్ముఖు లగు, (సరోజాసనుఁడు=పద్మ మాసనముగాఁ గలవాఁడు) జ్యాసురంబు=

బ్రాహ్మణులు గలదియును, ( జ్యాసురలు, జ్యా=భూమి, సురలు=దేవతలు, బ్రాహ్మణులు ) ( ని ) క్షోణిర్జ్యాకాశ్యపీక్షితిః. అ. వేదముల నెల్లప్పుడు నభ్యసించుచుండుటచే విలసిల్లుబుద్ధిని బ్రహ్మంబోలిన బ్రాహ్మణులు గల దనియర్థము. కేళికా...మాలికంబు, కేళికా=క్రీడలయందలి, వశ=యిచ్ఛచేతను, చంద్రశాలికా=మేడలమీఁదియిండ్లయొక్క, అంతర=మధ్యమునందు, చలత్=సంచరించుచున్న, బాలికా=లేజవ్వనులయొక్క, దృక్పద్మమాలికంబు=చూపు లనెడు తామరపూవులదండలు కలదియును, క్రీడాసక్తిచే మేడలమీఁద సంచరించెడు జవ్వనులచూపు లనెడుపూలదండలు గల దనియర్థము. గంధ... ..సైంధవంబు, గంధవారణ=మదము గలయేనుఁగులయొక్క, ( గంధము గలవారణము గంధవారణము గంధశబ్దము గుణవాచకము గావున మతుప్ప్రియము లోపించెను. ) ఘటా=సముదాయమును, గంధవాహా=వాయువునకు, అత్యంతబాంధవ=మిగులం జుట్టము లగు, అత్యున్నత=మిక్కిలి పొడవులైన, సైంధవంబు=గుఱ్ఱములుగలదియును, మదించినయేనుఁగులను వాయువేగము గలగుఱ్ఱములను గలది యనియర్థము లోకనుత. ..కరంబు, లోకనుత=జనులచేత స్తుతింపఁబడిన, పాక=సంతానము గలవారును, వైభవ=సంపదచేత, పాకహారి=ఇంద్రుంబోలిన, అనేక=పెక్కండ్రగు, సుశ్రీక=ఎక్కువ సంపదగల, నృప=రాజులయొక్క, లోక=సముదాయముయొక్క, సౌకరీకళా=సౌలభ్యముచేత నైనశోభచేతను, కలిత=ప్రాప్తమైన, నాకసమ=స్వర్గలోకముతో సమానమైన ( స్వర్గసంపదతో సమానమైన యనియర్థము. ) సంపత్=భాగ్యమునకు, ఆకరంబు=పుట్టినిల్లు, మిగులనుత్తమ మగుసంతానము గలవారును నైశ్వర్యముచే నింద్రుంబోలినవారును నగు పెక్కండ్రురాజులకలిమిచె స్వర్గపురముం బోలిన దనియర్థము అగుకేకయపురంబు, కరంబు=మిక్కిలి, పొగడంగన్=స్తుతింపఁగా, తనరున్=ప్రకాశించును.

ఇం దర్థాలంకారము రూపకము శబ్దాలంకారము వృత్త్యనుప్రాసము

మ॥ కలఁ డప్పట్టణనేత యాతతసమా ♦ ఖ్యా బాలికా కేళికా
నిలయీభూతజగత్త్రియుం డఖిలభూ ♦ నేతృస్తుతాత్మీయరా
జ్యలసచ్ఛ్రీనిధి వారితారిహిమ తే ♦ జోఖండమార్తాండమం
డలరుక్కాండుఁడు ధృష్టకేతుధరణీ ♦ నాధావతసం బిలన్॥ 20

అప్పట్టణనేత=ఆకేకయపురమునకుం బతియును, ఆతత . జగత్త్రియుండు ఆతత=విరివియైన, సమాఖ్యా=కీర్తియనెడు, ( ని ) యశఃకీర్తిస్సమాఖ్యాచ. అ. బా

లికా = కన్నెయొక్క, కేళికా = నృత్యమునకు, నిలయీభూత = ఉనికిపట్టైన, జగత్త్రియుండు = ముల్లోకములు గలవాఁడును, ముల్లోకముల వ్యాపించినకీర్తి గలవాఁ డనియర్థము. అఖిల......నిధి, అఖిల = అందఱగు, భూనేతృ = దేశాధిపతులచే, స్తుత = శ్లాఘింపఁబడిన, ఆత్మీయ = తనసంబంధమైన, రాజ్యలక్ష్మీ = రాజ్యసంబంధమైనప్రకాశించుసంపదకు, నిధి = స్థానమును, ఎల్లరాజులచే శ్లాఘింపఁబడినరాజ్యసంపదఁ గలవాఁ డనియర్థము. వారిత......క్కాండుఁడు, వారిత = తొలఁగింపఁబడిన, అరి = శత్రువులనెడు, హిమ = మంచుగల, తేజః = ప్రతాపమనెడు, (కోశదండములవలనఁ బుట్టినప్రభావము) అఖండమార్తాండమండలరుక్కాండుఁడు = పూర్ణమైన సూర్యతేజస్సముదయముఁ గలవాఁడును, సూర్యుఁడు తనకిరణములచె మంచు వారించునట్లీరాజు తనతేజమునం బగఱ వారించు ననిభావము (అగు) ధృష్టకేతుధరణీనాథావతంసంబు = (అగు) ధృష్టకేతుఁ డనుపేరు గలరాజశ్రేష్ఠుఁడు, ఇలన్ = భూమియందున్, కలఁడు. ఇందు శత్రువులందు హిమత్వ మారోపించుట తేజమున సూర్యకాంతిత్వ మారోపించుటకుఁ గారణము గావునఁ బరంపరితరూపకాలంకారము

ఇందు మూఁడవపాదమున యకారమునకును, తేజశ్శబ్దమునకు మీఁదిశబ్దముతో సంధి చేసినపుడు వచ్చిన యోకారమునకును యతి వేయఁబడెను దీనికి లుప్తవిసర్గకస్వరయతి యనిపేరు

తే॥గీ॥ దేవభాష నదంతసం ♦ తములమీఁద
సత్తుమొదలను గలశబ్ద ♦ ములకు వేళ
నమరు నోత్వంబునకుఁ జెల్లు ♦ నహాయ లిపులు
జగతి లుప్తవిసర్గక ♦ స్వరవిధులను॥ అప్పకవి ఆశ్వా 3.

వ॥ మఱియు నతండు నలనృగసగరభగీరథదుంధుమారసుహోత్రమాంధాతాదులకరణి ధరణీభరణదక్షుండై దీనాలాపంబులు శరణాగతశాత్రవముఖంబులయంద వక్రభావంబు లధిజ్యశరాసనంబులయంద దృఢబంధంబులు సురతంబులయంద కుటిలనటనంబులు వేశ్యాజనంబులయంద సదాపత్రాప్తిచే మొఱవెట్టుట తరుణీమంజీరంబులయంద మదాంధత్వంబునం దిరుగుట కరిఘటలయంద పరుషదండం

బువలనఁ జక్రిప్రక్రంపంబులు వొడముట కులాలకృత్యంబులయంద సమస్తవస్తుసంపదలుం దోఁచుట లీలాదర్పణంబులయంద చెన్నొం దుచుండ నధర్మంబున కభావంబును దనదానంబున కప్రమాణంబు ను దనక్రోధంబున కస్థిరత్వంబును దనవిక్రమంబున కసహ్యతయుఁ దనయశంబున కత్యాశాప్రవృత్తియుఁ దవులం జేసి మహావీరుం డ య్యును వినయోపేతుం డై యధికసత్వసంపన్నుం డయ్యును బర లోకభీకరుం డై కామార్థపరుం డయ్యును విమలధర్మప్రధానుం డై రాజ్యంబు పాలించుచు సంతానకాంక్షి యై శ్రుతకీర్తినామకనిజదే వీసహితంబుగాఁ దత్సాధనం బగుదమూసమారాధనంబు దినదినంబు ను గావింప నొక్కనాఁడు. 22

అతండు=ఆపట్టణ మేలుధృష్టకేతుఁడు, మఱియును=ఇంకను, నల . . .కర ణిఁ=నలుఁడు మొదలగురాజులయొక్క విధమువంటి విధమువెతను, (ఇట నిదర్శ నాలంకారము) ధరణీభరణదక్షుండై, ధరణీ=భూమియొక్క, భరణ=పోషించుట యందు, (జనులం బాలించుటయం దనియర్థము) దక్షుండై=నేర్పరియై, దీనాలా పంబులు=భయపడినవారిమాటలు (దరిద్రులమాటలును) శరణాగత ....యంద, శరణాగత=రక్షణముం గోరివచ్చిన, (రక్షింపు మనికోరి వచ్చిన యనియర్థము) శా త్రవ = పగవారియొక్క, ముఖంబులయంద=నోళ్లయందే, దీనశబ్దమునకు రెండర్థము లుండుటచేత దీనవచనములు పేదవారిమొగములందును భయపడినవారిమొగములందను బ్రాప్తించుచుండఁగా నిరాజుకాలమున బీదలు లేరు గాన నట్టివచనము లీరాజునకు వె ఱచి రక్షింపు మనికోరుశత్రులనోళ్లయందే యుండె ననిభావము. వక్రభావంబులు= వంకరతనములు, (ఇతరులకు బాధ గలిగించుటయును) అధిజ్యశరాసనంబులంద=ఎ క్కువెట్టినధనుస్సులందే, వక్రభావము దుర్జనులందు నెక్కువెట్టినవిండ్లయందును బ్రా ప్తించఁగా నీతనికాలమునఁ గ్రూరులు లేరు గావున ధనువులందే వక్రభావము నిలిచె ననిభావము దృఢబంధంబులు=అధికమైన బంధములు, (నాగాద్యాకారమైన సం యోగవిశేషములు) (అధికముగాఁ జెఱ నుంచుటలును) సురతంబులయంద=స్త్రీపు రుషులసంయోగంబులయందే, బంధములు రెండుచోట్లం బ్రాప్తించుచుండఁగా జెఱ వె ట్టందగినతప్పు చేయువారు లేమిచె నవి సంభోగములయందే నిలిచె ననిభావము. మఱి

లనటనంబులు = ఒకతీరునాట్యములు ( కపటపరివర్తనములును ) వేశ్యాజనంబులయంద = వారకాంతలయందే, కుటిలనటనశబ్దము శక్తిచేత నాట్యమునందును జెడునడవడియందును బ్రవర్తింపఁగా నారాజు దేశమున దుష్పరివర్తనము గలవారు లేరు గావున నాశబ్దము నాట్యమునందే ప్రవర్తించుచుండె నని నియమించె సదాపత్ప్రాప్తిచేఁ = ఎల్లప్పుడును బాదముల నుండుటచేతను ( ఎల్లప్పుడు నాపదల నొందుటచేత నని యర్థాంతరము ) మొఱవెట్టుట = ధ్వనించుట ( ఆపద నొందువాఁడు తన్ను రక్షించుకొను శక్తి లేక తగినవారింగూర్చి చేయుదుఃఖముతోఁ గూడినధ్వనియును ) తరుణీమంజీరంబులయంద = ఆఁడువారికాలియందెలయందే, ఈయనరాజ్యమున నాపద నొందువారు లేరు గావున మొఱవెట్టుట యందెలయందే యుండె నని భావము పరుషదండంబులవలనఁ = కఠినశిక్షలవలన ( గట్టివి యైనకఱ్ఱలవలనను ) చక్రప్రకంపంబులు = దేశసంబంధముగల ( జనులయొక్క భయమువలన ) వణఁకులు, ( కుమ్మరిసారెలు తిరుగుటలును ) కులాలకృత్యంబులయంద = కుమ్మరులు చేయుపనులయందే, పరుషదండమువలనఁ జక్రప్రకంపనము కుమ్మరులు చేయుపనులయందును దేశజనులయందును బ్రాప్తింపఁగా నా దేశమునఁ దప్పుచేయువారు లేరు గావున కుమ్మరులు చేయుపనులయందే యుండె నని భావము. మదాంధత్వంబునన్ = క్రొవ్వువలని గ్రుడ్డితనముచేతను, ( గర్వముచేఁ గలిగిన గ్రుడ్డితనముచేతను, గర్వమువలనియవివేకముచేతననియు నర్థము ) కరిఘటలయంద = ఏనుఁగులసముదాయమునందే, ఈయనరాజ్యమున గర్విష్ఠులు లే రనిభావము సమస్తవస్తుసంపదలుఁ = అన్ని పదార్థములసంపత్తులును, తోఁచుట = ప్రతిఫలించుట, (దోఁచుట = దొంగిలించుట యనియర్థాంతరము ) లీలాదర్పణంబులయంద = విలాసార్థము లగు నద్దములయందే, ఈప్రభువుకాలమున దొంగతనము లే దనిభావము చెన్ను = అందమును, ఒందుచుండఁ = ( పైఁ జెప్పినవి చెప్పినస్థలములయందే యుండఁగా ననియర్థము ) ఇంతవఱకుఁ బరిసంఖ్యాలంకారము అధర్మంబునకుఁ = ధర్మవిరుద్ధకార్యమునకు, అభావంబును = లేమియును, ఈయనదేశమున నన్నియుం గలవు గాని యధర్మమొక్కటియే లే దనియర్థము. తనదానంబునకున్ = తనయీవికి, అప్రమాణంబును = ప్రమాణాభావమును ( కొలఁదిలేమియును ) తనక్రోధంబునకుఁ = తనకోపమునకు, ( పరులు చేసినయపకారమును సహింపలేమిచే మనసునం బుట్టువికారము క్రోధము ) అస్థిరత్వంబును = చిరకాలము నిలుకమియును, తనవిక్రమంబునకుఁ = తనపరాక్రమంబునకున్, అసహ్యతయున్ = సహింపలేమియును, తనయశంబునకున్ = తనకీర్తికి, అత్యాశాప్రవృత్తియుఁ = అధికమైన కోరికయందుఁ బ్రవేశమును, (అత్యాశా = దిక్కుల నతిక్రమించిన, ప్రవృత్తియుఁ = సంచారమును. ) తవులం జేసి = తగులొకొనునట్లు చేసి,

మీఁదియప్రామాణ్యము నస్థిరత్వము మొదలగుచెడుగుణములనుమీఁదఁ జెప్పినవానియం దేకాని యొండెడ లేకుండఁ జేసి యనియర్థము (ఇవి మఱియొకచో దోషములయినను మీఁదఁజెప్పినచోట్ల గుణములగును) పరిసంఖ్యాలంకారము. మహావీరుండయ్యును = గొప్పశూరుఁ డైనను (వీరుఁడు = శత్రుల వణఁకించువాఁడు) వినయోపేతుండై = మిగుల నడఁకువఁ గలవాఁడై, మిగులఁ బరాక్రమశాలియు నధిక మైననీతితోడం గూడినవాఁ డనియు నర్థాంతరము అధికసత్త్వసంపన్నుం డయ్యును = ఎక్కువ సత్త్వగుణము గలవాఁ డయ్యును, పరలోకభీకరుం డై = ఇతరజనులకు భయమును గలిగించువాఁడై, (ఎక్కువబలము గలవాఁడును శత్రులకు వెఱపు పుట్టించువాఁడు నని యర్థాంతరము) కామార్థపరుం డయ్యును = కామమునందు నర్థమునందే యాసక్తి గలవాఁ డయ్యును, విమలధర్మప్రధానుం డై = నిష్కల్మష మైనసత్కర్మములే ప్రధానముగాఁ గలవాఁ డై, (కామము నర్థము ననుపురుషార్థములయం దాసక్తి గలవాఁడును ధర్మపురుషార్థమే ప్రధానముగాఁ గలవాఁడు ననియర్థాంతరము.) విరోధాభాసాలంకారము. రాజ్యంబు = దేశమును, పాలించుచున్ = రక్షించుచు, సంతానకాంక్షియై = సంతానముం గోరువాఁ డై, శ్రుతకీర్తినామకనిజదేవీసహితంబుగాన్ = శ్రుతకీర్తి యను పేరు గలతనపట్టాభిషిక్తురా లగుభార్యతోఁ గూడుకొనట్లుగా, తత్సాధనంబు = సంతానమునకుం గారణము, అగు, రమాసమారాధనంబు = లక్ష్మీదేవియొక్కపూజనమును, దినదినంబును = ప్రతిదినంబును, కావింపన్ = చేయుచుండఁగాన్, ఒక్కనాఁడు = ఒక్కదినమున (ముందుపద్దెముతో నన్వయము)

గీ॥ భక్తి కెద మెచ్చి యామహీ ♦ పాలకునకు
శ్రీసతీమణి సాక్షాత్క ♦ రించి వరము
గోరు మన నినుఁ బోలిన ♦ కొమరి మరునిఁ
బోలుసుతు నిమ్మనిన వరం ♦ బు నిడి చనియె॥ 23

శ్రీసతీమణి = లక్ష్మి యనుస్త్రీశ్రేష్ఠము, భక్తికిన్ = రాజు చేసినసేవకు, ఎదన్ = మనసునందున్, మెచ్చి = సంతసించి, సాక్షాత్కరించి = సన్నిధి చేసి, (కన్నులకుం గన్పట్టి యనియర్థము.) వరము = ఇష్ట మైనదానిని, కోరుము = అడుగుము, అనినన్ = ఇట్లనఁగా, నినున్ = (లక్ష్మిని) పోలినకొమరిన్ = పోలినకూఁతును, మరునిన్ = మన్మథునిని, పోలినసుతున్ = పోలినకొమారునిని, ఇమ్ము = దయచేయుము, అనినన్ = రా జిట్లు ప్రార్థింపఁగా, వరంబు = (ఆయన) కోరినదానిని, ఇడి = ఇచ్చి, చ

నియోగ = ( లక్ష్మి ) ఏగను

కం॥ ఆవనజాలయదయ ఏను
దేవునిసోదరి నృపాలు ♦ దేవి వెలసె గ
ర్భావేశవశత శశిగ
ర్భావేశత నెసఁగుపూర్వ ♦ యగుదిశ యనఁగన్॥ 24

వసుదేవునిసోదరి = నితండ్రి యైనవసుదేవునికిం దోఁబుట్టువు, నృపాలుదేవి = ధృష్టకేతునిభార్య, ఆవనజాలయదయన్ = ఆలక్ష్మియొక్క కరుణచేతను, ( వనజాలయ = పద్మమే గృహముగాఁ గలది ) గర్భావేశవశతన్ = గర్భప్రవేశమునకు లోఁగుటచేత, ( గర్భము ధరించుటచేత ననియర్థము ) శశిగర్భావేశతన్ = చంద్రుని గర్భమున ధరించుటచేత, ఎసఁగుపూర్వ యగుదిశయనఁగన్ = ప్రకాశించు తూర్పుదెసవలె, వెలసెన్ = ప్రకాశించెను. ఉపమాలంకారము

కం॥ నెలదప్పి వింతచిన్నెల
నెల వగు నెలఁతుకకు నిండు ♦ నెలవెన్నెలవ
న్నెల గెలుచు తెలుపు చెక్కుల
నెలకొన నవి చంద్రికకల ♦ నియుతిం దనరెన్॥ 25

నెలదప్పి = నెల నతిక్రమించి ( సందర్భముచేఁ గొన్నినెలలు దప్పి యనియర్థము ) వింతచిన్నెలనెలవు = క్రొత్తలక్షణములకు వాసస్థానము, అగు, నెలఁతుకకున్ = (శ్రుతకీర్తికి ) నిండునెలవెన్నెలవన్నెలన్ = పూర్ణచంద్రునికాంతులయొక్క వన్నెలను, గెలుచుతెలుపు = జయించెడుతెల్లనిచాయ, చెక్కులన్ = చెక్కులందు, నెలకొనన్ = స్థిరపడఁగా, అవి = ఆచెక్కులు, చంద్రశకలనియుతిన్ = కర్పూరపుముక్కలసంపదం బోలినసంపదతో, తనరెన్ = ప్రకాశించెను ( ని ) ఘనసారశ్చంద్రసంజ్ఞః ఆ

ఆమె గర్భిణి యైనకొన్ని దినములకు నామెశరీరమునఁ జెక్కులు చాలాలిచిన్నెలుప్పతిల్లె ననియు నం దొకటి యగుతెలిచాయచేఁ జెక్కులు కర్పూరఖండంబులకులవలెఁ బ్రకాశించె ననియుభావము

మ॥ నవగర్భోదయవేళ యన్ తొలుకరి ♦ స్పందంబులై హంసయా
నవి శేషంబులు వొల్చె నూర్పుగము ల♦న్వ్యాజంబునన్ దూర్పుగా

డ్పు వెస న్మించెఁ బయోధరంబు లొగి నుప్పొంగెన్ వినీలాంతరన్
నవకం బేర్పడె మించెఁ జిట్టుములు సోనల్గాఁ గురంగాక్షికిన్॥ 26

కురంగాక్షికిన్=(శుకకీర్తికిన్, (లేడికన్నులం బోలినకన్నులుగలది) నవగర్భోదయవేళ=నూతనమైనగర్భోత్పత్తిసమయము, అన్తొలుకరిన్=అనువర్షాకాలమందు, హంసయానవిశేషంబులు, హంసయాన=ఆస్త్రీయొక్క, (అంచనడలంబోలిననడలుఁగలదానియొక్క) విశేషంబులు=అవస్థలనియెడి, హంసయానవిశేషంబులు=అంచలయొక్కగతివిశేషములు, మందంబులై=అల్పములై, పొల్చెన్=కానఁబడెను వర్షాకాలమున హంసలసంచారము లల్పము లైయుండును గర్భిణులు మిగుల మందములగుకార్యములు గలవారుగ నుందురు, గాన నిట్లు చెప్పఁబడెను. ఊర్పుగముల వ్యాజంబునన్ = శ్వాససమూహము లనుమిషచేత, తూర్పుగాడ్పు=తూర్పుదిక్కునుండివచ్చువాయువు, వెసన్=త్వరతో, మించెన్=అతిశయించెను గర్భిణులకు నూర్పు లధికముగ నుండును వర్షాకాలమునం దూర్పుగాలి హెచ్చును కాన నూర్పులయందు స్వరూప మపహ్నవించి (కప్పిపుచ్చి) పూర్వవాయుత్వ మారోపింపఁబడెను; గనుక నపహ్నవాలంకారము. వర్షాకాలమున దుస్సహము లగుతూర్పుగాడ్పులు విసరున ట్లీమె గర్భిణి యైనపుడు దుస్సహము లగునూర్పులు వుట్టె ననియాశయము పయోధరంబులు=స్తనము లను మేఘములు, వినీలాంతరన్=నల్లనియగ్రములు గలుగుటచేతను (నల్లనియాకారము గలుగుటచేత నని మేఘపరము) (ని) అంతో స్త్రీనిశ్చయేనాశేస్వరూపే గ్రేంతికేంతరె నా నా. ఉప్పొంగెన్=వృద్ధిచెందెను నవకంబు=మార్దవ మనుక్రొత్తనిరు, ఏర్పడెన్=బయలుపడెను, (ని) కంశిరోంబుసుఖేక్లీబం తత్త్రివచకమవ్యయం నా. నా. (నవకంబు మార్దవ మనునర్థమున దేశ్యము. రెండవయర్థమున సంస్కృతసమము అప్పుడు నవం+కం అనివిభాగము నవం=క్రొత్తదియగు, కం=నీరు, దీనితత్సమము నవకము, నవకంబు. ) చిట్టుములు=చిన్నయుమ్ములు, (చిఱు+ఉములు=చిట్టుములు. కుఱు, చిఱు, కడు, నడు, నిడుశబ్దముల ఱ, డల కచ్చు పరమగుచునపుడు ద్విరుక్తటకారం బగు బా సం ) సోనల్గాన్ = వర్షధారలుగాన్, మించెన్=అతిశయించెను ఇది గర్భిణులకుం బుట్టులక్షణము.

ఇం దీమె గర్భిణి యైనకాలమందు వర్షాకాలత్వ మారోపించి గర్భచిహ్నలన్నిటియందును వానకాలమందలిలక్షణముల నారోపించుటచే రూపకాలంకారము. ఇది కొన్నిచోట్ల శ్లేషసంకీర్ణము

సీ॥ మున్ను కటిగరిమకు నుల్కి ♦ విన్ననైన
తరుణిలేఁగౌను చూలింత ♦ తనముఁ గూడ
దాని నెదురించె జితుఁడైన ♦ హీనబలుఁడు
బలము సమకూడుతఱి వైరి ♦ గెలుచుఁ గాదె॥ 27

మున్ను = గర్భము లేనికాలమున. కటిగరిమకున్ = పిఱుఁదులగొప్పతనమునకు, ఉల్కి = భయపడి, విన్ననైన = చిన్నవోయిన, తరుణిలేఁగౌను = ఇంతియొక్క లేఁతనడుము, చూలింతతనము = గర్భిణీధర్మము, కూడన్ = తనకు సహాయము సేయఁగాన్, దానిన్ = ఆపిఱుఁదును, ఎదిరించెన్, గర్భము లేనికాలమున మిగులసన్న మగునడుము మిగుల విశాల మైనపిఱుఁదుకంటెఁ దక్కువతనమును బొందియుఁ దనకు సహాయము సేయువారు లేమిచే నూరకుండి యిప్పుడు గర్భము తోడ్పడఁగా దాని నెదుర్కొనె ననియాశయము మున్ను మిగులనూక్ష్మ మైనమధ్యభాగము గర్భధారణమున బలిసి మిగులస్థూలమయ్యె ననిఫలితము జితుఁడు = ఓడింపఁబడినవాఁడు, ఐన, హీనబలుఁడు = తక్కువబలము గలవాఁడు, బలము = సహాయము, సమకూడుతఱిన్ = లభించుకాలమునందున్, వైరిన్ = పగవానిని, గెలుచుఁ గాదె = జయించును గదా పగఱచె నోడింపఁబడినవాఁడు తగినబలము సంప్రాప్త మైనపుడు వారిని జయించుట లోకసిద్ధము

ఇందు మొదటియంశమును సమర్థించుటకై రెండవయంశము చెప్పుటచె నర్థాంతరన్యాసాలంకారము.

ఉ॥ చల్లనితమ్మితూండ్లక్రియఁ ♦ జల్వ వహించినచేతులన్ విభున్
మెల్లనఁ గౌఁగిలించు మను ♦ మ్రింగినకమ్మనిమోర మోవి న
ల్లల్లననానుఁ గాంక్షితర ♦ తాదులకున్ మదిఁ గొంకి ప్రార్థనా
భ్యల్లసదుక్తి యైయుబుసు ♦ పుచ్చుఁ బ్రియుం జెలి కేళివేళలన్॥

చెలి = శుకకీర్తి, కేళివేళలన్ = క్రీడాకాలములందు, చల్లనితమ్మితూండ్లక్రియన్ = చల్లనితామరకాడలయొక్క వ్యాపారము వంటివ్యాపారముచెతను, ( కాడలవలెననియర్థము ) ఇచట నిదర్శనాలంకారము చల్వ = శైత్యమును, వహించినచేతులన్ = ధరించినచెతులతో, గర్భిణులశరీరములయందుఁ జల్లఁదన మధికముగ నుండుట సాజము. విభున్ = మగనిని, మెల్లనన్ = తిన్నఁదనముతో, కౌఁగిలించున్ = ఆలింగనముచెసికొనును, మను = మంటిని, మ్రింగినకమ్మనిమోరన్ = భుజియించినది గనుక నే

మంచివాసనఁ గలనోటితో, మోవిన్ = (ప్రియుని) మోవిని, అల్లల్లనన్ = మిగులమాంద్యముతో, ఆనున్ = త్రావును; మన్నుఁ దినుటచేఁ బరిమళించునోరితో మగనియధరోష్ఠమును మిగుల మందముగాఁ బానము చేయు ననియర్థము. కాంక్షితరతాదులకున్ = (మగఁడు) అపేక్షించినక్రీడలకు, మదిన్ = మనసునందు, కొంకి = జడిసి, ప్రియున్ = మగనినిఁగూర్చి, ప్రార్థనాభ్యుల్లసదుక్తియై, ప్రార్థనా = వేఁడుటతో, అభ్యుల్లసత్ = ప్రకాశించుచున్న, ఉక్తియై = మాటలు కలదియై, ఉబుసుపుచ్చున్ = కాలక్షేపము సేయును; ఆమె గర్భభారముచే నాయాసమున కోర్వలేక మగఁడుకోరినపరిహాసాదులకుఁ జాలక వేఁడుకొనుచుఁ గాలక్షేపము చేయుచుండె ననిభావము

చ॥ నెల లొగి నిట్లు తొమ్మిదియు ♦ నిండినపిమ్మటఁ బుణ్యభామినుల్
బలుముద మొందనొక్కశుభ ♦ లగ్నమునన్ శ్రుతకీర్తి గాంచె న
క్కలువలఱేని నిందిరను ♦ గాంచినదుగ్ధపయోధివీచికా
తిలకమురీతి మేరునగ ♦ ధీరుఁ గుమారుఁ గుమారికామణిన్॥ 29

ఇట్లు = పైన చెప్పఁబ్రకారముగాన్, నెలలుతొమ్మిదియున్ = తొమ్మిదినెలలును, ఒగిన్ = క్రమముగా, నిండినపిమ్మటన్ = పూర్ణమైనతరువాతను, ఒకశుభలగ్నమునన్ = ఒకానొక మంచిరాశియారంభమున, (ని) రాశీనాముదయోలగ్నం అ. పుణ్యభామినుల్ = సువాసినులు, బలుముదము = ఎక్కువసంతసమును, ఒందన్ = పొందగాన్, శ్రుతకీర్తి, అక్కలువలఱేనిన్ = చంద్రునిని, ఇందిరన్ = లక్ష్మినిని, కాంచిన ......రీతిన్, కాంచిన = కనిన, దుగ్ధపయోధి = పాలసముద్రముయొక్క, వీచికాతిలకమురీతిన్ = తరంగశ్రేష్ఠముయొక్కరీతిచేతను, (శ్రేష్ఠమైనతరంగమువలె ననియర్థము.) మేరునగధీరున్ = మేరు వనుపర్వతమునుంబోలె ధైర్యము గలవానిని, కుమారునిన్ = పుత్రునిని, కుమారికామణిన్ = మణిం బోలినకూఁతును, కాంచెన్ = ప్రసవించెను. పాలసముద్రమునఁ జందురుఁడు, లచ్చియుంబోలె నీమెగర్భమున నొకకుమారుఁడుం గుమారియుఁ బుట్టి రనియాశయము.

గీ॥ ఆకుమారుని సంతర్ద ♦ నాఖ్యఁ జేసి
యారమాంశను గన్నకు ♦ మారికకును
భద్రగుణలక్షణములు నూ ♦ పట్టుకతన
భద్రయనునామ మొసఁగె భూ ♦ పాలమౌళి॥ 30

భూపాలమౌళి = రాజులకు శిరోభూషణ మగుధృష్టకేతుఁడు. ఆకుమారునిన్, సంతర్దనాఖ్యన్ = సంతర్దనుఁ డను పేరు కలవానిని, చేసి = కావించి, ( ఆకుమారునకు సంతర్దనుఁ డని పేరు పెట్టి యనియర్థము ) అరమాంశను గన్నకుమారికకును = అలక్ష్మి యంశమునఁ గాంచినకూఁతునకున్, భద్రగుణలక్షణములు, భద్ర = ప్రశస్తమైన, గుణ = రూపలావణ్యాదులును, లక్షణములు = ( ఐశ్వర్యాదుల సూచించు రేఖలు మొదలగు ) గుఱుతులును, చూపట్టుకతనన్ = ( ఆమెయందుఁ ) గన్పడుకారణముచేతను, భద్రియను నామము = భద్రయను పేరును, ఒసఁగెన్ = ఇచ్చెను. ( కూఁతునకు భద్రగుణములు భద్రలక్షణములు గలుగుటచే భద్ర యని పేరు పెట్టె ననియర్థము. ) నిరుక్త్యలంకారము.

మ॥ పొలుపారన్ జలకంబులార్చి జిలుఁగుం ♦ బొత్తిళ్లలో నుంచి త
ళ్కులు రాగిల్లుపసిండిగిన్నియల ను ♦ గ్గు ల్వోసి కన్దోయిఁ గ
జ్జలముం గస్తురి ఫాలమందు నిడుచున్ ♦ జ న్నిచ్చి యమ్ముద్దుపి
ల్లల మేల్బంగరుతొట్టెలం దునిచి జో ♦ ల ల్వాడి రాళీజనుల్॥ 31

ఆళీజనుల్ = (అశ్రుతకీర్తియొక్క) చెలికత్తెలు, పొలుపారన్ = బాగుగాను, జలకంబులార్చి = స్నానము చెయించి, అమ్ముద్దుపిల్లలన్ = ఆచక్కనిబాలురను, జిలుఁగుంబొత్తిళ్లలోన్ = సన్న ప్రాఁతవస్త్రములయందు, ఉంచి = పరుండఁబెట్టి, తళ్కులన్ = మెఱుఁగుఁజాయలతో, రాగిల్లుపసిండిగిన్నియలన్ = ప్రకాశించెడుబంగారుగిన్నెలతోన్, ఉగ్గుల్వోసి = ఉగ్గుపెట్టి, కందోయిన్ = కన్నులజంటయందు, కజ్జలంబు = కాటుకను, ఫాలమందున్ = నొసటను, కస్తురిన్ = కస్తూరిబొట్టును, ఇడుచున్ = నిల్పుచున్, చన్నిచ్చి = పాలిచ్చి, మేల్బంగరుతొట్టెలందున్ = ప్రశస్తమైన బంగారపుటుయ్యేలలయందున్, ఉనిచి = నిలిపి, జోలల్ = నిదురపుచ్చుపాటలను, పాడిరి = గానముచేసిరి

క॥ ఇంతు లిటు లూడిగము ల
శ్రాంతంబు నొనర్ప రూప ♦ సంపన్నతచే
నెంతయు బాలామణి యం
తంతకు బాలేందురేఖ ♦ యనఁ దనరారెన్॥ 32

ఇంతులు = ( చెలికత్తెలగు ) యువతులు, ఇటులు = ఈఁదిప్రకారముగా, అశ్రాంతంబున్ = ఎల్లప్పుడును, ఊడిగములు = ఉపచారములను, ఒనర్పన్ = చేయుచుండఁగా

బాలామణి = చిన్నవయసున నున్నయాభద్ర, రూపసంపన్నతచేన్ = రూపసంపత్తుచేతను, ( చక్కనియాకారముచే ననియర్థము ) అంతంతకున్ = నానాఁటికిన్, బాలేందురేఖయనన్ = లేఁతచంద్రకళవలెన్, తనరారెన్ = అతిశయించెను. ( వృద్ధిం జెందె ననియర్థము )

క॥ ఆసమయంబున నన్నొక
వాసరమున లక్ష్మికడకు ♦ వాణి వనుప నా
శ్రీసతి యోశ్రుతిరంజని
భాసిలుఁ గేకయసుపుత్త్రి ♦ భద్ర యనంగన్॥ 33

ఆసమయంబునన్ = భూలోకమునం గేకయరాజుకూఁతురు శుక్లపక్షమునందలి చందురురేకవలెఁ గ్రమాభివృద్ధి నొందుచున్నకాలమున, ఒకవాసరమునన్ = ఒకదినమునందున్, వాణి = సరస్వతి, నన్నున్, లక్ష్మికడకున్ = లక్ష్మిదేవియొద్దకు, పనుపన్ = ( పొమ్మని ) యాజ్ఞాపింపఁగా, ఆశ్రీసతి = ఆలక్ష్మి, ఓశ్రుతిరంజని! కేకయసుపుత్త్రి = కేకయరాజుకూఁతురు, భద్రయనంగన్ = భద్ర యనిపిలుచుచున్నట్లు, ( భద్ర యను పేరుగల్గి యనియర్థము ) భాసిలున్ = ప్రకాశించును కేకయరాజపుత్త్రి బాల్యమున నున్నపుడు చెలి నగునన్ను సరస్వతి యొకనాఁడు లక్ష్మియొద్దకుఁ బొమ్మనఁగా నేఁ బోయితిని. లక్ష్మి నన్నపుడు సంబోధించి భూలోకమున భద్ర యనుపేరుగలకేకయరాజపుత్త్రి కల దనిముందుపద్యములోఁ జెప్పుప్రకారము నాతోఁ జెప్పె నని కృష్ణునితో శ్రుతిరంజని చెప్పెను

ఉ॥ ఆచెలి మామకాంశభవ ♦ యై తగుఁ గావునఁ గేకయోర్వికిన్
వే చని బాలికన్ సకల ♦ విద్యలఁ దేటల నాటపాటలన్
రాచతికంపునీతులను ♦ రాణఁ బ్రవీణను గా నొనర్పుమా
భూచరివై మనుష్యసతి ♦ పోలికఁ గైకొని నీవు నావుడున్॥ 34

ఆచెలి = ఆకేకయరాజుకూఁతురు, మామకాంశభవయై = నాయంశంబునఁ ( లచ్మియంశమున ) బుట్టినదియై, తగున్ = ప్రకాశించును, కావునన్, నీవు, వే = శీఘ్రముగాన్, కేకయోర్వికిన్ = కేకయదేశమునకు, మనుష్యసతిపోలికన్ = మనుష్యస్త్రీయొక్కసాదృశ్యమును, కైకొని = ధరించి, భూచరివై = భూమియందు సంచరించుదానవై, చని = పోయి, తేటలన్ = ఎరుకల మైనపరివర్తనములందును, ఆటపాటలన్ = నృత్యము

నందు గానమునందును, సకలవిద్యలన్ = అన్ని చదువులయందును, రాచతీకంపునీతులన్ = ప్రభుత్వముతో సంబంధించినమంచివిషయములయందును, రాణన్ = ఒప్పిదముతో ( బాగుగా ననియర్థము ) ప్రవీణను = సమర్థురాలిని, ఒనర్పుమా = చేయుము. నావుడున్ = ఇట్లు లక్ష్మి చెప్పినతోడనే, ముందుపద్యముతో నన్వయము

సీ॥ అట్లుగా కని యామ ♦ హాదేవికిని నమ
స్కారం బొనర్చి మ ♦ త్స్వామిని యగు
నబ్జజభామిని ♦ యనుమతి వడసి భూ
లోకంబునకు డిగ్గి ♦ నాకలోక
నీకాశ మై యొప్పు ♦ కేకియనగరంబు
నం బ్రవేశించి భూ ♦ నాథునను మ
తంబున నతనియా ♦ త్మజ భద్ర యనుబాల
నంతఃపురంబున ♦ నరిగి కాంచి
యబ్జసంపద కరముల ♦ నాననమున
శశిసహోదరభావంబు ♦ సరసవచన
ముల సలసుధానువర్తనం ♦ బును దెలుప గ
మాంశభవగా నెఱింగితి ♦ యదుకులేంద్ర॥ 35

యదుకులేంద్ర = కృష్ణా! ( ఏను ) అట్లు = నాకు సెలవిచ్చినప్రకారమే, కాక = అగుం గాక యని, ఆమహాదేవికిన్ = ఆలక్ష్మికి, నమస్కారంబొనర్చి = వందనము చెసి, మత్స్వామిని = నాకొడయరాలు, అగు, నబ్జజభామినియనుమతిన్ = అగు సరస్వతియొక్కయంగీకారమును, వడసి = పొంది, భూలోకంబునకున్, డిగ్గి = ( స్వర్గమునుండి ) దిగి, నాకలోకనీకాశమై = స్వర్గమునకుం దుల్యమై, ఒప్పుకేకయపురమునన్ = ప్రకాశించుకేకయనగరమందు, ప్రవేశించి, భూనాథునను మతంబునన్ = కేకయరాజునంగీకారముచేతను, అంతఃపురంబునకున్ = ఆరాజుస్త్రీ లుండుకోటలోనిభాగమునకు అరిగి = పోయి, అతనియాత్మజన్ = ఆయనకుం గూతును, భద్రయనుబాలన్, కాంచి = చూచి, కరములన్ = చెతులయందు, అబ్జసంపద = తామరపూవులు కలిగియుండుట యనియర్థము. ( తామరపూవులం బోలినరేఖలు కలిగియుండుట యనియేని, తామరపూవులశోభం బోలినశోభ యనియేని యర్థాంతరము. ) ఆననమునన్ = మొగమునం

దుఁ, శశిసహోదరభావంబు = చంద్రునకుం దోబుట్టు వగుటయు, (చంద్రునిసాదృశ్యమనియుద్ధాంతరము) సరసవచనములన్ = శ్రావ్యమైనపలుకులందు, అలసుధానువర్తనంబును = దేవలోకమునందలి యమృతముం బోలుటయును, తెలుపన్ = ఎఱిఁగింపఁగాన్, (ఆమె) రమాంశభవ గాన్ = లక్ష్మియొక్కయంశమువలనఁ బుట్టినదని, ఎఱింగితిన్ = తెలిసికొంటిని.

లక్ష్మి భూలోకమునకుం బోయి నాయంశమునం బుట్టినకేకయరాజపుత్త్రికి విద్యల నేర్పు మని నాకానతీయఁగా నే నామెసెలవు పుచ్చుకొని నాకుం బ్రోవసరా లగుసరస్వతియొద్దకు వచ్చి యామెతోఁ జెప్పి భూలోకమునకు వచ్చి కేకయరాజునంతిపురమునకుం బోయి యాకన్నెం జూచి యామెమోముఁ జంద్రసాదృశ్యమును, జేతులం బద్మసంపదయును మాటల సుధయుం గల్గుటవె నిలక్షణములు లక్ష్మియం దుండునవి గాన నిచిన్నది లక్ష్మ్యవతార మనినిశ్చయించితి నని శ్రుతిరంజని కృష్ణునితోఁ జెప్పెను. లక్ష్మిహస్తముల నెపుడుం బద్మము లుండుట 'నిత్యంసాపద్మహస్తా' మొదలగు స్తుతులం బ్రసిద్ధము శ్లేషాలంకారము.

గీ॥ ఏను యోగిని నఖిలవి ♦ ద్యానిరూఢ  
నగుట శుద్ధాంతగమనయో ♦ గ్య యని తలఁచి  
నిఖిలవిద్యావిశేషముల్ ♦ నేర్పు మనుచు  
నప్పుడఁతితండ్రి కొమరి నా ♦ కొప్పగింప॥ 36

ఏను, యోగినిని = భగవంతునియందు మనసుఁ గూర్చుదానను (భగవద్భక్తురాల ననియర్థము) అఖిలవిద్యానిరూఢన్ = ఎల్లవిద్యలచేఁ బ్రసిద్ధురాలను, అగుటన్ = అగుటచేతను, అప్పుడఁతితండ్రి = కేకయరాజు, శుద్ధాంతగమనయోగ్య = అంతఃపురమునకుం బోఁదగినది, అనితలఁచి, నిఖిలవిద్యావిశేషముల్ = అన్నిచదువులను, నేర్పు మనుచున్, కొమరిన్ = బాలికను, నాకున్, ఒప్పగింపన్, ముందుపద్దెముతో నన్వయము.

శా. సారం బేర్పడఁ జెప్పితిన్ సరస మా ♦ సంగీతనృత్యక్రియా  
పారీణత్వము కావ్యనాటకకళా ♦ ప్రాగల్భ్యముం దానలం  
కారవ్రౌఢియు శబ్దశాస్త్రమును ద ♦ ర్కంబున్ గుణోదారశృం  
గారస్ఫారరసప్రబంధరచనా ♦ ఖండైకచాతుర్యముం॥ 37

సారంబు = ముఖ్యాంశము, ఏర్పడన్ = స్పష్టపడునట్లు, సరసము = రసముతోఁ

గూడినది ( మనోహర మయిన దనియర్థము ) ఔ......పారీణత్వము, ఔ=అన్య, సంగీత=గానవిద్యయొక్కయు, నృత్యక్రియా=చేయి కన్ను మొదలగువానిచే భావము దెలుపునాటయొక్కయు, పారీణత్వముఁ=అవతలియొడ్డు చూచుటను ( పాండిత్యము ననియర్థము) కావ్యనాటకకళాప్రాగల్భ్యము, కావ్య=రఘువంశాదులయొక్కయు, నాటక=శాకుంతలాదులయొక్కయు, కళా=చిత్తరువువ్రాయుట మొదలగువానియొక్కయు, ప్రాగల్భ్యము=నైపుణ్యమును, అందౌ నలంకారప్రౌఢియుఁ, అందుఁ=ఆకావ్యాదులయందు, ఔ=ఉండెడునట్టి, అలంకారప్రౌఢియుఁ=ఉపమాదులయొక్క నేర్పును, ( కావ్యములకు నాత్మ యగురసమునకు శబ్దార్థద్వారమున శోభాహేతువు లలంకారములు ) శబ్దశాస్త్రమును=వ్యాకరణమును, తర్కంబుఁ, గుణో......చాతుర్యమున్. గుణ=ప్రసాదమాధుర్యాదులచేతను, ( పురుషునకు ) శౌర్యధైర్యాదులువలె రసమున కుత్కర్షముం గలిగించు ప్రసాదమాధుర్యాదులు గుణము లనంబడు ) ఉదార=అధికమైనట్టియు, శృంగారస్ఫారరస=అధికమైనశృంగారరసముతోఁ గూడినట్టియు, ప్రబంధ=కావ్యములయొక్క, రచనా=రచించుటయందు, అఖండ=పూర్ణమైన, ఏక=ముఖ్యమగు, చాతుర్యముఁ=నైపుణ్యమును, చెప్పితిన్=ఉపదేశించితిని

క॥ బెళికెడుచూపుల నమృతము
చిలికెడువచనముల మిసిమి ♦ చెంది మొలకలై
కులికెడుచనుమొగడల సిరు
లొలికెడునెలప్రాయ మప్పు ♦ డువిదకుఁ బొడమెన్ ॥38

బెళికెడుచూపులన్ = తళతళ మెఱయుచూపులచేతను, అమృతము=అమృతమును, ( క్షీరసముద్రమున నుత్పన్నమై సురలకు భోజనమైనపదార్థము ) చిలికెడు=ప్రసరింపఁజేయు, వచనములన్=మాటలచేతను, మిసిమి=క్రొత్తకాంతిని, చెంది=పొంది, మొలకలై=అంకురములై, కులికెడుచనుమొగడలఁ=అందముగం గదలుచుండెడుమొగ్గలం బోలినకుచములతోడను, సిరులొలికెడునెలప్రాయము=శోభలను వెదచల్లెడు లేజవ్వనము, అప్పుడు=నేను విద్య నుపదేశించునప్పటికి, ఉవిదకుఁ=నీమేనత్తకుఁ గూఁతు రగుభద్రకుఁ, పొడమెఁ=ఉత్పన్న మయ్యెను

ఉ॥ కెంపులఁ జేసె మోవి నునుఁ ♦ గెంపుచొకాటపునత్తుముత్తెపుం
గుంపులఁ జెక్కుటద్దములఁ ♦ గూర్చిన కస్తురివ్రాఁత గంబురా

సొం పొనరించె బెళ్కు తెలి ♦ చూపులు కుంకుమచిత్రకంబు ఫా
లంపుఁగురుల్ మృగీమదవి ♦ లాసపురేఖ నొనర్చె నింతికిన్॥ 39

ఇంతికిన్=భద్రకున్, మోవినునుఁగెంపు=అధరోష్ఠముయొక్క లేఁతయెఱుపు, చొకాటపు.....గుంపులన్, చొకాటపు=నిర్మలమైన, నత్తు=ముక్కుపోఁగునందలి, ముత్తెపుంగుంపులన్=ముత్తెములసముదాయములను, కెంపులన్ = పద్మరాగమణులను (ఎఱ్ఱనికాంతి గలవానిని) చేసెన్=కావించెను. నాసాభరణమునందలిముత్తెములు తెల్లని కాంతి గలవియైన నధరోష్ఠసమీపమున నుంచుటచే నెఱ్ఱని వయ్యె ననిభావము బెళ్కు తెలిచూపులు=మెఱయుచున్న తెల్లనిచూపులు, చెక్కుటద్దములన్=అద్దము లం బోలినచెక్కులందున్, కూర్చినకస్తురివ్రాఁతన్=పూసినకస్తురియొక్క రచనయందున్, గంబురాసొంపు=కప్పురముయొక్క చక్కఁదనమును, ఒనరించెన్=కావించె ను ఆమె విశాలములునుం దెల్లనివియు నగుకన్నులు గలది గావఁ జూపులు గండముల వ్యాపించి యందలి కస్తూరిపూఁతకుం గర్పూరకాంతి గలిగించె ననియాశయము. ఫాలంపుఁగురుల్=భ్రమరకములు, (నొసటిమీఁదికురులు) కుంకుమచిత్రకంబు=కుంకుమబొట్టును, (ని) చిత్రకంతిలకే నాతువ్యాఘ్రేవహ్న్యైక్యభేషజే నా నా మృగీమదవిలాసపురేఖన్=కస్తూరియొక్క విలాసము గలగీఱను (బొట్టు ననియర్థము) ఒనర్చెన్= చేసెను ముంగురులు కుంకుమబొట్టును గస్తూరిబొట్టును జేయుచున్న వనిభావము ఇందు ముత్తెములు మొదలగునవి తమయందున్న తెల్లఁదనము మొదలగువానిని విడిచి యధరోష్ఠాదులయందున్న యెఱుపు మొదలగువానిని గ్రహించి నట్లువర్ణించుటచేఁ దద్గుణాలంకారము

సీ॥ పాణిపాదాధర ♦ పల్లవంబులరక్తి
వెనుపొందఁ గలకంఠ ♦ నినద మొసఁగెఁ
దోరంపుమెఱుఁగుల ♦ దోర్లతల్ కొనసాఁగ
నభినవోత్కలిక లో ♦ య్యానఁ దనర్చె
సరసంపునెఱిగుబ్బ ♦ విరిగుత్తు లిరవొంద
మందాక్షవృకసం ♦ పదలు ప్రబలె
దరహాసరుచిమరం ♦ దపుసోన చిలుకంగ
భ్రమరకంబులు సువి ♦ భ్రమము దాల్చె

మృదులశుకవాగ్విలాసంబు ♦ వ్రేదల నతను
భాసురాంబకములు చల ♦ త్ప్రభల నెఱసె
నతివతను వనుమనసిజో ♦ ద్యానవనము
నందు నవ్యవయోవసం ♦ తాగమమున॥ 40

అతివతనువు=భద్రయొక్క శరీరము, అనుమనసిజోద్యానవనమునందు=అను మన్మథునిపూఁదోఁటయందున్, నవ్యవయోవసంతాగమమునను, నవ్య=క్రొత్తదియగు, వయః=వయసనెడు (జవ్వనము.) వసంతాగమమునను=వసంతఋతువు ప్రాప్తించి నసమయమందు, పాణి.. .రక్తి=హస్తములు పాదములు పెదవియు ననుచిగురాకు లయొక్కయొఱ్ఱఁదనము, పెనుపొందను=వృద్ధి చెందఁగాను, కలకంఠనినదము=మధు రమైనకంఠధ్వని యనెడుకోయిలకూఁత, ఎసఁగెను=అతిశయించెను. జవ్వనమున నామెహస్తములుఁ బాదములుఁ బెదవియుఁ జిగురాకులువలె మృదువులు నరుణములు న య్యె ననియుఁ గంఠము కోయిలస్వరముం బోలె ననియుభావము దోర్లతల్=బాహు వులనెడుతీవలు, తోరంపుమెఱుఁగులన్=అధిక మైనకాంతులతో, (తోరము స్థూల శబ్దభవము) కొనసాఁగను=వర్ధిల్లఁగాను, అభినవోత్కలికలు=క్రొత్తవి యగునౌత్సు క్యము మొదలగుశృంగారభావము లనుక్రొత్తమొగ్గలు, ఒయ్యను=క్రమముతో, తన ర్చెను=విజృంభించెను యౌవనమున నామెబాహువులు వసంతకాలమునఁ దీఁగెలువ లె మృదువులు దీర్ఘములు నయ్యె ననియు నాకాలమున మొగ్గలువలె నుత్కంఠలు మొ దలగునవి కలుగఁజొచ్చె ననియుభావము (ఉత్కంఠలు=కోరికలు, ఔత్సుక్యము= ప్రియమైనపనికి వేగిరించుట) సరిసంపు=మనోహరమైన, నెఱి=అధికమైన, గుబ్బ= కుచములనెడు, విరిగుత్తులు=పూలగుత్తులు, ఇరవొందను=నెలకొనఁగాను,(వృద్ధిఁజెందఁ గా ననియర్థము.) మందాక్ష. . ..సంపదలు, మందాక్షు=లజ్జయను, (ని) మందా క్షంహ్రీస్త్రపావ్రీడా. అ. వృక్షసంపదలు=వృక్షశోభలు, పరిబలెను=అతిశయిం చెను. వసంతకాలమందలిపూలగుత్తులువలెఁ గుచములు శోభిల్లె ననియు నప్పటివృక్షశో భవలె లజ్జ యుత్పన్నమయ్యె ననియు భావము నాయిక ముగ్ధ గావున లజ్జ యధిక మయ్యె ననిచెప్పంబడె దర......సోన, దరహాస=మందహాసముయొక్క, రుచి= కాంతియనెడు, మకరందపుసోన=తేనెవర్షము, చిలుకంగను=ప్రసరింపఁగాను, భ్రమర కంబులు=కుంతలము లనుతుమ్మెదలు, సువిభ్రమమును=మంచికాంతి యనువిలాసము ను, తాల్చెను=ధరించెను మృదులశుకవాగ్విలాసంబు, మృదుల=మృదువులైన, శుక వాక్=భద్రయొక్క, విలాసంబు=మాటలచమత్కారమనెడు, మృదుల=మనోహర

మైన, శుక = చిలుకలయొక్క, వాగ్విలాసంబు = కూఁతలయందము, పొదలన్ = అతిశయింపఁగాన్, అతనుభాసురాంబకములు, అతను = విశాలమైన, భాసుర = ప్రకాశించు, అంబకములు = కన్నులనెడు, అతను = మన్మథునియొక్క, భాసుర = ప్రకాశించెడు, అంబకములు = బాణములు, ( మన్మథునిబాణములు చిగురులుం బువ్వులును ) చలత్ప్రభలన్ = చంచలకాంతులను, నెఱసెన్ = పొందెను వసంతకాలమున శుకములపలుకులు ప్రబలినట్లు యౌవనారంభమున నామెకు వాక్చమత్కారము గలిగె ననియు నాకాలమున నామెవిశాలమైనకన్నులు తళతళకాంతులతోఁ గూడి మరునిబాణములవలె విలసిల్లె ననియుభావము ఇందు రూపకాలంకారము అది గొన్నిచోట్ల శ్లేషసంకీర్ణము.

క॥ ఆటలఁ బాటల మాటలఁ
దేటల రూపవిభవమునఁ ♦ద్రిభువనములలో
బోటులలో నీఁక నీచెలి
బోఁటులు లేరనుచుఁదోఁచెఁ ♦ బురుషవరేణ్యా॥ 41

పురుషవరేణ్యా = ఓకృష్ణా ( మనుజులలోశ్రేష్ఠుఁడా యనియర్థము ) ఆటలన్ = నృత్యముచేతనున్, పాటలన్ = గానముచేతనున్, మాటలన్ = మాటలనైపుణ్యముచేతనున్, తేటలన్ = మంచినడవడిచేతనును, రూపవిభవమునన్ = రూపసంపదచేతనును ( మిక్కిలిచక్కఁదనముచేత ననియర్థము ) త్రిభువనములలోబోటులలోన్ = మూఁడులోకములలో నున్నస్త్రీలలో, ఈచెలిబోఁటులు = ఈస్త్రీనిఁ బోలినవారు, ఇఁక లేరనుచున్ = మఱొకరు లేరనుచున్, తోఁచెన్ = తోఁచెను

క॥ శ్రీరమణి మదంశజ యని
యీరమణిన్ మున్ను దెలుప ♦ నిది మదిఁ దోఁపన్
మీ రున్నకతన నే నీ
ద్వారకమార్గంబు వట్టి ♦ వచ్చి రమేశా॥ 42

రమేశా ! = ఓలక్ష్మీపతీ ! ( ఇది సాభిప్రాయము ) నీవు లక్ష్మీకిం బతివి కావున నీబాల యామెయవతారము గావున నీ మెకుఁ బతివి కాదగుదు వనియాభిప్రాయము కావుననే పరికరాంకురాలంకారము. శ్రీరమణి = లక్ష్మి, ఈరమణిన్ = ఈమనోహారిణి యగుస్త్రీని, మదంశజయని, మత్ = నాయొక్క ( లక్ష్మియొక్క ) అంశజ యని =

అంశమువలనఁ బుట్టినదని, తెలుపన్ = తెలియఁ జేయుటచే, ఇది = ఈసంగతి, మదిన్ = మనస్సునందు, తోఁపన్ = స్ఫురింపఁగాన్, మీరున్న కతనన్ = మీరున్న కారణముచేతన్, ద్వారకమార్గంబు = ద్వారకాపురమార్గమును, పట్టి = అవలంబించి, ఏన్ = ఏను, వచ్చి = ( ఈచోటికి ) నేగుదెంచి, ముందుపద్యముతో నన్వయము

క॥ ఈరోహణశైలముపైఁ
జేరి మిముం గంటిఁ గోర్కె ♦ సిద్ధింపఁగఁ జే
కూరెను మీవలన బుధా
ధార సుధాధార వంటి ♦ దయ నేఁ గంటిన్॥ 43

బుధాధార, బుధ = విద్వాంసులకు ( దేవతల కనియు నర్థము ) ఆధార = ఆధారవగుస్వామీ! ( ని ) బుధస్మారకాసుకౌసౌమ్యే నా నా చేరి = సమీపించి, ఈరోహణశైలంబుపైన్ = రోహణమను పేరికొండయందు, కోర్కె = కోరిక, సిద్ధింపఁగన్ = సఫలమగునట్లు, మిమున్, కంటిన్ = దర్శించితిని, మీవలనన్, చేకూరెన్ = ( నాకోర్కె ) సఫలమయ్యెను సుధాధారవంటిదయన్ = అమృతవర్షముంబోని ( మీయొక్క ) యనుగ్రహమును, ఏన్, గంటిన్ = పొందితిని.

క॥ జనకుఁడు రాకొమరుల నె
ల్లను భువిఁగలవారిఁబటము ♦ ల లిఖించి తగఁ
దనయొకడ కనుప నన్యముఁ
గన నొల్లదు నీపటంబ ♦ కాని రమేశా! 44

రమేశా = ఓలక్ష్మీపతీ! జనకుఁడు = నా దండ్రి, భువిన్ = భూమియందు, కలవారిన్ = ఉన్నవారిని, రాకొమరులనెల్లన్ = రాజపుత్రులనందఱను, పటములన్ = చిత్రములందున్, లిఖించి = వ్రాయించి ( ఇది యంతర్భావితణ్యంతము ) తగన్ = బాగుగా, తనయొకడన్ = కూఁతునొద్దకు, అనుపన్ = పంపఁగాన్, నీపటంబకాని = నీయొక్కరూపము గలపటము నేకాని, అన్యమున్ = మఱియొకనిపటమును, కనన్ = చూచుటకు, ఒల్లదు = ( ఆకన్నె ) యిష్టపడదు నీపటము నాదరమునఁ జూచు ననిభావము. ఇందుఁ జక్షుఃప్రీతి యనుమన్మథావస్థ చెప్పఁబడినది. ప్రత్యక్షచిత్రస్వప్నాదులందు సాదరముగఁ బ్రియదర్శనము చక్షుఃప్రీతి యనంబడు

మ॥ విను వందిప్రకరంబు దండ్రికడ ను ♦ ర్విం గల్గుభూనాథులన్
వినుతింపన్ వినఁగా నసహ్యపడు బ ♦ ల్వేడ్కన్ భవత్సన్నుతు
ల్వినఁగాఁ గాంచు నినుం గనుంగొనినరీ ♦ విన్ సన్ముఖాబ్జాతముం
గనుదమ్ముల్ వికసింప నుబ్బి కుచకో ♦ కంబుల్ గుబాళింపఁగాన్॥

(ఓకృష్ణా) విను = (నాచెప్పుదాని) నాకర్ణింపుము. వందిప్రకరంబు = స్తుతిచేయువారిసముదాయము, (రాజులయొద్ద బలపరాక్రమముల స్తుతియించుసేవకులు వందులు) తండ్రికడన్ = కేకయరాజునొద్దను, ఉర్విన్ = భూమియందున్, కల్గుభూనాథులన్ = ఉండురాజులను, వినుతింపన్ = స్తుతిసేయఁగాన్, వినఁగన్ = (ఆస్తుతులను భద్ర) వినుటకు, అసహ్యపడున్ = సహింపలేకుండును (వినుట కిచ్చగింప దనియర్థము) నినున్, కనుంగొనినరీవిన్ = చూచినట్టిసొగసుతో (చూచునప్పుడువలె ననియర్థము) సన్ముఖాబ్జాతమును = మనోహరమగు ముఖపద్మమును, కనుదమ్ముల్ = తామరపూవులం బోలినకన్నులును, వికసింపన్ = వికాసము నొందఁగాన్, కుచకోకంబుల్ = చక్రవాకములం బోలినస్తనములు, గుబాళింపఁగాన్ = ప్రకాశింపఁగాన్, బల్వేడ్కన్ = మిక్కిలి యభిలాషముతో, భవత్సన్నుతుల్ = మీస్తోత్రములను, వినఁగాఁ గాంచున్ = వినుట కిష్టపడును.

ఆబాలిక తనతండ్రియొద్ద నున్నవందులు సకలరాజులను స్తుతించునపుడు నీస్తుతులనే కాని తక్కినవారిస్తుతులను విన నొల్ల దనియాశయము

క॥ ఈమర్మముఁ దెలియుటకై
యామానిని గ్రుచ్చిగ్రుచ్చి ♦ యడిగి రహస్యం
బోమెలఁకువ మీయందుల
నామగువకుఁ గూర్మి గలుగు ♦ టరసితి శౌరీ! 46

శౌరీ! = ఓకృష్ణా! ఈమర్మమున్ = ఈయభిప్రాయమును, (ఈకిటుకును) తెలియుటకై, ఆమానినిన్ = ఆస్త్రీని, గ్రుచ్చిగ్రుచ్చి = మిక్కిలినిర్బంధించి, అడిగి, రహస్యంబు = ఏకాంతము, ఓమెలఁకువన్ = అనువర్తనముచేతను, ఆమగువకున్ = ఆభద్రకు, మీయందున్, కూర్మి = ప్రేమము, కలుగుటన్ = ఉండుటను, అరసితిన్ = తెలిసికొంటిని

సీ॥ మది నుస్సురనుచుఁ బె ♦ ల్లోదవు తాపాగ్నిచే
నొక కొంత వేఁడిని ♦ ట్టూర్పు వుచ్చు
నిండారువలపుమ ♦ న్నీ రుబ్బి పొంగారు
వెరవున సాత్త్విక ♦ స్వేదమూను
తావకీనకథాసు ♦ ధాస్వాదమునఁ జేసి
యఖిలభోజ్యములందు ♦ నరుచిఁ జేయు
విరహం బనెడిమేటి ♦ వేమరు పైకొన్న
నొకటనుండినచోట ♦ నుండకుండు
హృదయగోప్యార్థ మొకరియ ♦ నీనమైన
బైలువుచ్చుక లో జాలిఁ ♦ దూలినట్లు
జాగరము కాని నిద్దుర ♦ చాలకుండు
మీఁపయి మనంబు దవిలి యా ♦ మెలఁత శౌరి॥ 47

శౌరి = ఓకృష్ణా! ఆమెలఁత = ఆస్త్రీ, మీపయిన్ = మీయందు, మనంబు = మనసు, తవిలి = చిక్కుకొనుటచేతను, ఇట్టిక్త్వార్థకములు హేత్వర్థకము లనికొందఱు చెప్పుదురు ఇంతకంటె నిది సాధువగమార్గము లేదు. ఎట్లనఁగ, ఒకకర్తగల క్రియలలో నెయ్యది ముందు ప్రయోగింపఁబడు నది క్త్వార్థకంబు ఇటఁ దవిలి యనుదానికిం గర్త మనసును, నీవాక్యమునందలి సమాపకక్రియ యగు వుచ్చు ననుదానికిం గర్త్రి భద్ర యగుటచే నన్వయము సంభవింపదు. తెలుఁగున నిట్టిప్రయోగములు కలవు గాని వానికిచ్చుట వ్రాసినట్లే గతి కల్పింపవలయును కావున తవిలి యనునది యంతర్భావితప్రేరణమైనం గావలయును అప్పుడు తవిలి = తవిలించి (మనసును సంఘటించియ నియర్థము) మదిన్ = మనసునందున్, ఉస్సురనుచున్ = (ఇది యూర్పునందలి యనుకరణముం జెప్పును) పెల్లోదవుతాపాగ్నిచేన్ = అధికముగం బుట్టు (కామునివలని) కాఁక యనునగ్నిచేన్, ఒకకొంతవేఁడినిట్టూర్పు = కొంచెము వెచ్చనిశ్వాసమును, పుచ్చున్ = విడుచుచుండును, నిండారు.... న్నీరు, నిండారు = పూర్ణమైన, వలపుమున్నీరు = మోహాసముద్రము, ఉబ్బి = అధికమై, (లోన స్థలము చాలక మీఁదికి వచ్చి యనియర్థము) పొంగారువెరవునన్ = అతిశయించువిధముచేతను, సాత్త్వికస్వేదము = సాత్త్వికభావమైన స్వేదమును, ఊనున్ = ధరించును, తావకీ.... .మునఁ జేసిన, తా

నీన = నీసంబంధమైన, కథా = వృత్తాంతములనెడు, సుధా = అమృతముయొక్క, స్వాదమునఁజేసి = అనుభవముచేతను, అఖిలభోజ్యములందుఁ = ఎల్లభోజనపదార్థములందును, అరుచిఁ = ఇష్టములేమిని, చెయుఁ = పూనును; విరహంబు = వియోగము (ఎడఁబాటు) అనెడు, మేటివేదుఱు = గొప్పయున్మాదము, పైకొన్నఁ = వ్యాపింపఁగాఁ, ఒకటఁ = ఒకకాలమునన్, ఉండినచోటఁ = ఉండినస్థలమునందు, ఉండకుండుఁ = నివసింపకుండును, హృదయగోప్యార్థము = మనస్సునందు దాఁగినవస్తువు, ఒకరియధీనము = ఇతరులయధీనము, ఐనఁ = కాఁగా, (తనకోర్కె తాను సాధింప శక్యముగాక యితరులచేత సాధించుకొనవలసినది కాఁగా ననియర్థము) బైలుపుచ్చక = (ముగ్ధగావున) నితరులకు తెలియనీయక, లోఁ = మనసునఁ, జాలిఁ = దుఃఖముచేతను, తూలినట్లు = చలించినట్లు, జాగరముకాని = [illegible] కాని, నిద్దుర = నిద్రయు, చాలకుండుఁ = కావలసినట్లు పొందకుండును. ఇందు మనస్సంగమును సంజ్వరము నరతియు జాగరము ననుమన్మథావస్థలును, స్వేద మనుసాత్త్వికభావముం జెప్పంబడియె ఎల్లప్పుడుం బ్రియునియందె మనసు నిలుపుట మనస్సంగము తాపాధిక్యము సంజ్వరము ప్రియవ్యతిరిక్తవిషయమున వైరాగ్య మరతి- నిద్రాభావము జాగరము లజ్జాశ్రమహ్లాదాదులవలనం బుట్టినదియును గాలి సేవించుటయుం దలియిచ్చవె విసనకఱ్ఱమొదలైనవాని గ్రహించుట యనువ్యాపారము గలిగించునదియు నగు శరీరమునుండి వెడలుజలము స్వేదము

క॥ కావున నోవనజోదర
యౌవనరుహనేత్రి నచటి ♦ కరుదెంచి మహా
దేవిగ భూవిభునాజ్ఞ
వైవాహికవిధిని జేకొ ♦ నం దగు వేగన్॥ 48

వనజోదర = ఓపద్మనాభా! శ్రీమహావిష్ణువునాభియం దొకపద్మ ముండు నని పురాణములం బ్రసిద్ధము ఈపద మిచ్చట నివు విష్ణువునంశమున నవతరించినవాఁడవనియును లక్ష్మియంశంబునఁ బుట్టినభద్రను వివాహామాడఁ దగుదువనియు సూచింప నుపయోగించెను. కావునఁ = భద్ర నీయందలియనురాగమున మిగులఁ బీడితురాలగుట యనుకారణమునన్, అచటికిన్ = ఆపురమునకున్, అరుదెంచి = (నీవు) వచ్చి, భూవిభునాజ్ఞఁ = కేకయరాజునాజ్ఞచే, ఆవనరుహనేత్రిఁ = ఆభద్రను, (పద్మములం బోలినకన్నులు గలదానిని) వైవాహికవిధిఁ = వివాహసంబంధమైనవిధిచేతను, దేవిగఁ = భార్యగా, వేగఁ = త్వరగా, చేకొనందగున్ = గ్రహించుట కుచితము.

వ॥ అని విన్నవించిన నద్దివ్యయోగినివచనామృతంబున కానందంబు నొంది ముకుందుండు వదనారవిందంబున మందహాసంబు గందళింప నోశ్రుతిరంజనీ! భవదాగమంబు మాకు భద్రావాప్తికారణం బయ్యెఁ గావున నే నింద్రప్రస్థపురంబుననుండి కేకయపురంబునకుం గతిపయదినంబులలో నరుదెంచి భవదుక్తం బగుకళ్యాణలాభంబు నొంది సుందరీమణిం జేకొందు సందియంబు వల దనిభువనరక్షణప్రశస్తం బగుహస్తం బొసంగి వీడ్కొల్పిన నదియును మహాప్రసాదం బనిపాదంబుల కెఱఁగి మింటితెరువున మరాళికపోలికం జని కేకయపురాంతఃపురంబుఁ బ్రవేశించి మంతనంబున నయ్యింతికి శ్రీకృష్ణసందర్శనసందేశాదికథనం బెఱింగించినం బ్రహర్షంబున నక్కన్నియ వెన్నునిరాక నిరీక్షించుచుండె నంత నక్కడ॥ 49

అనివిన్నవించినన్ = (శ్రుతిరంజని) యిట్లు మనవిసేయఁగా, ముకుందుండు = శ్రీకృష్ణుఁడు, అద్దివ్య .....నకున్, అద్దివ్యయోగిని = (మీఁదఁ జెప్పఁబడిన) దేవలోకమున నుండెడిభక్తురాలియొక్క, వచనామృతంబునకున్ = అమృతముం బోలినమాటలకు, ఆనందంబున్ = సంతసమును, ఒంది = పొంది, వదనారవిందంబునన్ = మోముఁదమ్మియందున్, మందహాసంబు = చిఱునగవు, కందళింపన్ = అంకురింపఁగాన్, ఓశ్రుతిరంజనీ! భవదాగమంబు = నీయొక్కరాక, మాకున్ = (మే మనియర్థము) భద్రావాప్తికారణంబు = మేలొందుటకుఁ గారణము (భద్ర యనుకన్నెం బొందుటకుఁ గారణ మనియర్థాంతరము) అయ్యెన్, కావునన్, ఏను, ఇంద్రప్రస్థపురంబుననుండి, కతిపయదినములలోన్ = కొన్నిదినములలో, కేకయపురంబునకున్, అరుదెంచి = వచ్చి, భవదుక్తంబు = నీచేఁ జెప్పఁబడినది, అగు, కళ్యాణలాభంబున్ = శుభావాప్తిని, ఒంది = పొంది, సుందరీమణిన్ = భద్రను, చేకొందున్ = వివాహమాడుదును, సందియంబు = సంశయము, వలదు = కూడదు, అని = ఇట్లు చెప్పి, భువనరక్షణప్రశస్తంబు = లోకముం గాపాడుటచే శ్లాఘింపఁబడునది అగు, హస్తంబు = చేతిని, ఒసంగి = యిచ్చి, (చేతఁ జేయి వెట్టి విశ్వాసము గలుగునట్లు చెప్పి యనియర్థము) వీడ్కొల్పినన్ = సెలవీయఁగా, అదియున్ = ఆశ్రుతిరంజనియు, మహాప్రసాదంబని = చిత్తమని, (నాయందు గొప్పయనుగ్రహముం జూపితి రని చెప్పి) పాదంబులకున్ = కృష్ణునిచరణము

లనున్, ఎఱఁగి = నమస్కరించి, మింటితెరువునన్ = ఆకాశమార్గము చేతను, మరాళికపోలికన్ = హంసీసాదృశ్యముతో, ( హంసివలె ననియర్థము ) చని = పోయి, కేకయపురాంతఃపురంబున్ = కేకయరాజుపురమునందలి యంతిపురమును, ప్రవేశించి, మంతనంబునన్ = రహస్యస్థలమునందున్, అయ్యింతికిన్ = తన్నుఁ బంపినభద్రకున్, శ్రీకృష్ణ .. ...కథనంబు = కృష్ణునిదర్శనము చేయుటయు నతనితో నిచటివృత్తాంతము చెప్పుటయు నాతఁడు చెప్పినదియు, ఎఱింగించినన్ = తెలుపఁగాన్, అక్కన్నియ = ఆభద్ర, ప్రహర్షంబునన్ = మిగులసంతసముతో, వెన్నునిరాకన్ = కృష్ణునియాగమనంబును, నిరీక్షించుచుండెన్ = ఎదురుచూచుచుండెను అంతన్ = పిమ్మటను, ఇక్కడన్ = రోహణమునందున్, ముందుపద్యముతో నన్వయము

ఉ॥ రోహణసానువుం డిగి స ♦ రోరుహనేత్రుఁడు గ్రమ్మఱన్ రథా
రోహణ మాచరించి యను ♦ రూపబలద్విపవాహ మాభట
వ్యూహము గొల్వఁగాఁ జనియె ♦ నున్నతగోపురగోపురస్ఫుర
ద్గేహరమావిధానికి యు ♦ ధిష్ఠిరసంస్థితరాజధానికిన్॥ 50

సరోరుహనేత్రుఁడు = కృష్ణుఁడు, రోహణసానువున్ = రోహణపర్వతముయొక్కచఱియనుండి, డిగి, క్రమ్మఱన్ = మఱలన్, రథారోహణము = అరదము నెక్కుటను, ఆచరించి = చేసి, ( అరదము నెక్కి యనియర్థము ) అనురూప......హము, అనురూప = తగిన, బల = సైన్యములును, ద్విప = ఏనుఁగులును, వాహము = గుఱ్ఱములుం గలది, ఔ భటవ్యూహము = అగుసేవకసముదాయము, కొల్వఁగాన్ = సేవించుచుండఁగా ఉన్నత......విధానికిన్, ఉన్నత = ఎత్తైన, గోపుర = వాకిళ్లచేతను, గోపుర = స్వర్గమునందు, స్ఫురత్ = ప్రకాశించుచున్న, గేహరమా = గృహలక్ష్మియొక్క, విధానికిన్ = రచనగల ( ఎత్తైనగోపురములచే స్వర్గమువఱకు వ్యాపించినగృహశోభ గల దనియర్థము. ) యుధిష్ఠిర = ధర్మరాజుయొక్క, సంస్థిత = చక్కనిదగు, రాజధానికిన్ = పురమునకున్, ( ఇంద్రప్రస్థమున కనియర్థము. ) చనియెన్ = పోయెను.

శా॥ శ్రీకృష్ణుండు పురోపకంఠమునకుం ♦ జేరంగ నేతెంచుటల్
క్ష్మాకాంతోత్తముఁ డైనధర్మసుతుఁ డా ♦ కర్ణించి యాప్తానుజా
నేకామాత్యపురోహితాదియుతుఁడై ♦ యేతెంచి యాశౌరి నా
లోకించెం బ్రముదంబుభక్తి నెనయన్ ♦ లో మ్రొక్కుచుం జొక్కుచున్॥

శ్రీకృష్ణుండు, పురోపకంఠమునకున్ = పట్టణసమీపమునకున్, చేరంగన్ = సమీపించునట్లు, ఏతెంచుటన్ = వచ్చుటను, క్ష్మాకాంతోత్తముఁడు = రాజులలో శ్రేష్ఠుఁడు, ఐన ధర్మసుతుఁడు = ధర్మరాజు, ఆకర్ణించి = విని, ఆప్తాను......యుతుఁడై, ఆప్త = మిత్రులతోడను, అనుజ = తమ్ములతోడను, అనేకామాత్య = పెక్కండ్రగు మంత్రులతోడను, యుతుఁడై = కూడినవాఁడై, ఏతెంచి = వచ్చి, ప్రమదంబు = సంతోషము, భక్తిన్ = అనురాగమును, ఎనయన్ = పోలఁగాన్, (సంతసము ననురాగము సదృశము లగుచుండఁగా ననియర్థము) సంతోషముం భక్తియుఁ గలుగగా నని ఫలితము లోన్ = మనసునందు, మ్రొక్కుచున్ = నమస్కరించుచును, చొక్కుచున్ = పారవశ్యము నొందుచును, ఆశౌరిన్ = వచ్చినకృష్ణునిని, ఆలోకించెన్ = చూచెను

క॥ అప్పు డాయదువల్లభుఁడుం
గృపతో ధర్మాత్మజునకుఁ ♦ గేల్మోగిచి ప్రమో
దపునః పునరాశ్లేషా
లపనాదుల భీమముఖ్యు ♦ లను దేలించెన్॥ 52

అపుడు = ధర్మరాజు వచ్చినకాలమున, ఆయదువల్లభుఁడున్ = ఆకృష్ణుఁడును, కృపతోన్ = దయతోన్, ధర్మాత్మజునకున్ = ధర్మరాజునకున్, (యమునిపుత్త్రుని కనియర్థము) కేల్మోగిచి = నమస్కరించి, భీమాదులన్ = భీముఁడు మొదలగువారిని, ప్రమోదపునః......నాదులన్, ప్రమోద = సంతోషముతోడ, పునఃపునరాశ్లేష = మఱలమఱల (గావించు) నాలింగనములచేతను, ఆలపనాదులన్ = సంభాషణమొదలగువానిచేతను, తేలించెన్ = తృప్తినొందించెను.

వ॥ ఇట్లన్యోన్యహర్షంబు లింపార సపరివారంబుగా శ్రీకృష్ణునిఁ దోడ్కొని తమతమరథంబులు కనకమహీధరంబులవిధంబున ఘంటాపథంబునం బోవ దేవకీవసుదేవప్రముఖుల కుశలంబు లడుగుచు ధర్మజుండు పురంబు ప్రవేశించె నంతరంబ॥ 53

ఇట్లు = ఈప్రకారము, అన్యోన్యహర్షంబులు = ఒండొరులసంతోషములు, ఇంపారన్ = వర్ధిల్లుచుండఁగా, ధర్మజుండు = ధర్మరాజు, శ్రీకృష్ణునిన్, సపరివారంబుగాన్ = సేనతోఁ గూడునట్లుగా, తోడ్కొని = తీసికొని, తమతమరథంబులు = వారివా

రి తేరులు, కనకమహీధరంబులవిధంబునన్ = బంగారుకొండలవిధముచే, ఘంటాపథంబునన్ = రాజమార్గమునందున్, పోవన్ = పోవుచుండఁగా, దేవకీవసుదేవప్రముఖులకుశలంబులు = దేవకి వసుదేవుఁడు మొదలైనవారి క్షేమములను, అడుగుచున్, పురంబు = నగరమును, ప్రవేశించెన్, అనంతరంబ = పిమ్మటను,

క॥ ఆయదుచంద్రుఁడు సుస్థిరుఁ
డై యింద్రప్రస్థపురము ♦ నలంకరించెన్
శ్రీయుతకరుణావీక్షా
స్ఫాయచ్చంద్రికల బంధు ♦ జనసింధువులన్॥ 54

ఆయదుచంద్రుఁడు = ఆకృష్ణుఁ డనెడుచంద్రుఁడు, (ఇచ్చట యదుశబ్దమునకు లక్షణచే నావంశమున జన్మించినకృష్ణుఁ డనియర్థము. మఱియు ముందున్న బంధుజనసింధువులు, వీక్షాచంద్రికయనువానియనురోధమునను, అలరించె నను సామాన్యప్రయోగమునను రూపకసమాసమే చెప్పవలయును.) ఇంద్రప్రస్థపురమునందున్, స్థిరుఁడై = నిలిచినవాఁడై, శ్రీయుత .. చంద్రికలన్, శ్రీయుత = శోభతోఁగూడిన, కరుణావీక్షా = దయాదృష్టియనెడు, స్ఫాయత్ = బలియుచున్న, చంద్రికలన్ = వెన్నెలలచేత. బంధుజనసింధువులన్ = చుట్టములనుసముద్రములను, అలరించెన్ = సంతోషపెట్టెను, రూపకాలంకారము.

సీ॥ రాజనీతిప్రవ ♦ ర్తనధర్మమున నొప్పు
ధర్మనందనుప్రభు ♦ త్వంబు మెచ్చి
నిర్మలగుణయుక్తి ♦ నిరుపమశీలుఁడై
తనరుభీమునిబలో ♦ ద్ధతి నుతించి
సహజాప్తుఁడై ప్రాణ ♦ సఖ్యంబునఁ జరించు
నర్జునువిజయంబు ♦ లభినుతించి
నాసత్యరూపవి ♦ లాససంపద నొప్పు
కవలసౌజన్యంబు ♦ గారవించి
సంతతంబును దనదుద ♦ ర్శనము గోరు
కుంతి నత్యాదరంబునఁ ♦ గొంత దనిపి

తనదునామంబు దాల్చి డెం । దమున నమ్మి
నట్టిద్రౌపది నాకృష్ణుఁ । డాదరించె॥ 55

ఆకృష్ణుఁడు, రాజనీతిప్రవర్తనధర్మమునన్, రాజనీతి = రాచవారు తప్పక చేయవలయుకర్జములం దెలుపుగ్రంథమునందలి మంచివిషయమునన్, ప్రవర్తన = ఉండుటయను, ధర్మమునన్ = గుణముచేతను ( నీతిశాస్త్రమునఁ జెప్పఁబడినప్రకారము చేయుమంచిపరిపాలనముచేత ననియర్థము ) ఒప్పు = ప్రకాశించెడు, ధర్మనందనుప్రభుత్వంబు = ధర్మరాజుయొక్కదొరతనమును, మెచ్చి = పొగడి, నిర్మలగుణయుక్తిన్ = స్వచ్ఛములగుశౌర్యధైర్యాదులకలిమిచే, నిరుపమశీలుఁడై = సాటిలేని మంచినడవడి కలవాఁడై, ( ని ) శీలంస్వభావేసద్వృత్తౌ ( అ ) తనరుభీమునిబలోద్ధతిన్ = ఒప్పుభీమునిబలగర్వమును, నుతించి = స్తుతి చేసి, సహజాప్తుఁడై = తోఁబుట్టువగుసుభద్రకుం బ్రియుఁడై, పుట్టినప్పటినుండి మిత్రుఁడై యనియు నర్థము ప్రాణసఖ్యంబునన్ = ప్రాణమునందలి చెలిమిం బోలినచెలిమిచేతను, ( అతిస్నేహముచే ననియర్థము. ) చరించునర్జునువిజయంబు = సంచరించెడుపాండవమధ్యమునిగెలుపును, అభినుతించి = స్తుతిచేసి, నాసత్యరూపవిలాససంపదన్, నాసత్య = అశ్వినీదేవతలయొక్క, రూపవిలాస = చక్కఁదనముయొక్క, సంపదన్ = కలిమిచేతను, వారిచక్కఁదనముం బోలినచక్కఁదనముచే ననియర్థము ( ని ) నాసత్యావశ్వినౌదస్రావాశ్వినేయాచతావుభౌ అ. ఒప్పుకవలసౌజన్యంబున్ = ఒప్పెడునకులసహదేవులమంచితనమును, గారవించి = మన్నించి, మున్ను సూర్యునిభార్యయు విశ్వకర్మకుం గూఁతురు నగుసంజ్ఞ యొకనిమిత్తమున నిషధపర్వతమునందు ఘోటియై తపంబు సేయ సూర్యుఁడు దాని వెదకి కనుఁగొని తాను నశ్వరూపంబు ధరించి సమీపించుటకు నామె పరపురుషుఁ డనుశంకచే నాభిముఖ్యంబు నొందిన నాసికాసంయోగంబున నీపురుషు లిరువురుం బుట్టుటచే వీరికి నాసత్యు లనినామంబు గల్గె ననిభారతము వీరియనుగ్రహమువలన నే కుంతికి నకులసహదేవులు జన్మించుటచే నట్టి సౌందర్యము వీరికిఁ గలదని యిటఁ జెప్పఁబడియె సంతతంబు = ఎల్లప్పుడును, తనదు దర్శనము = ( కృష్ణుని ) దర్శనమును, ( ఆత్మసాక్షాత్కారము ననియేని యర్థము ) కోరుకుంతిన్, అత్యాదరంబునన్ = మిగులఁబ్రీతితోన్, కొంతదనిపి = కొంతతృప్తిఁజేసి, తనదునామంబు = తనపేరు, తాల్చి = ధరించి, ( తన్నెప్పుడును స్మరించి యనియర్థము ) కృష్ణ యను పేరు ధరించి యనియర్థాంతరము డెందమునన్ = మనసునందున్, నమ్మినట్టిద్రౌపదిన్ = ( తన కాపదలు రాకుండ రక్షించునని ) విశ్వసించిన పాండవపత్నిని, ఆదరించెన్ = మన్నించెను

క॥ హితుల మహీపతులఁ బురో
హితుల దృఢవ్రతుల వరసు ♦ కృతులం బతిదే
వత లౌసతులం దగుసం
స్తుతుల నతులఁ దేల్చె నంద ♦ నూనుఁడు వేడ్కన్॥56

నందనూనుఁడు = కృష్ణుఁడు, హితులన్ = ఆప్తులను, మహీపతులన్ = రాజుల ను, దృఢవ్రతులన్ = పుణ్యకర్మములం జేసినవారిని, పురోహితులన్, వరసుకృతులన్ = విద్వాంసులను, పతిదేవతలు = భర్తయేదైవమనిసేవించువారలు, ఔసతులన్ = అయినస్త్రీలను, ( పతివ్రతల ననియర్థము ) వేడ్కన్ = కుతూహలముతో, స్తుతులన్ = పొగడ్తలచేతను, నతులన్ = నమస్కారములచేతను, తేల్చెన్ = సంతోషపెట్టెను

క॥ వారలు సంప్రీతిమెయిన్
సారసగోష్ఠీవినోద ♦ సల్లాపచమ
త్కారములం దనుఁ దనుపఁగ
శౌరి యిటులు కొన్నినాళ్ల ♦ చట నుండంగన్॥ 57

వారలు = ఆ హితులుమొదలగువారలు, ప్రీతిమెయిన్ = ప్రేమతో, సారస... ...ములన్, సారస = మనోహరమైన, గోష్ఠీ = ప్రసంగమునందలి, వినోద = వేడుకలో అకైన, సల్లాప = సంభాషణమందలి, చమత్కారములన్ = నేర్పులచేతను, తనున్, తనుపఁగన్ = తృప్తి పొందింపఁగా, శౌరి = కృష్ణమూర్తి, ఇటులు = ఈప్రకారము, కొన్నినాళ్లు, అచటన్ = అయింద్రప్రస్థపురమునందు, ఉండంగన్, ముందరిపద్యముతో నన్వయము.

సీ॥ సురసాలనిభలీల ♦ సురసాలతరుజాల
సరసాలపనఖేల ♦ దురుశుకంబు
మలయాగణితభోగ ♦ వలయాగవరపూగ
నిలయాగతసదాగ ♦ తిలసితంబు
వనితాజనసమాజ ♦ ధనితాజరమనోజ
జనితాజయవిరాజ ♦ దనునయంబు

చరితాంతసురతాంత ♦ పరితాంతసదుదంత
భరితాంతరసకాంత ♦ వరచయంబు
లలితకలరవకలరవ ♦ మిళదళికుల
కలకలోజ్జ్వలవిచికిల ♦ కలితవకుల
విసరకేసరపరిలస ♦ దసమకుసుమ
సముదయము వొల్చె మధుదిన ♦ సముదయంబు॥ 58

సురసాల......శుకంబు, సురసాల = దేవవృక్షములతో, ఈక్రిందఁ జెప్పఁబోవునవి యైదును దేవవృక్షములు (ని) పంచైతే దేవతరవః మందారః పారిజాతకః సంతానః కల్పవృక్షశ్చ పుంసివాహరిచందనం. అ నిభ = తుల్యమైన, లీల = విలాసముగల, సురసాల, సు = ప్రశస్తమైన, రసాల = తియ్యమావు లనెడు (ని) ఆమ్రశ్చూతోరసాలో సౌసహకారోతిసౌరభః అ. తరు = వృక్షములయొక్క, జాల = సముదాయమందు, సరసాలపన = మనోహరమైనపలుకులతో, ఖేలత్ = క్రీడించుచున్న, ఉరుశుకంబు = పెక్కుచిలుకలు కలదియు, మలయాగ—లసితంబు, మలయాగ = మలయపర్వతమందలి, అగణిత = లెక్కింపఁబడని, భోగవలయ = పాములచుట్లు గల (పాములశరీరములచేఁ జుట్టఁబడిన యనియర్థము) అగవర = వృక్షశ్రేష్ఠములయొక్క, (మంచిగంధపుఁజెట్లయొక్క) పూగ = సముదాయముయొక్క, నిలయ = స్థానమునుండి, ఆగత = వచ్చిన సదాగతి = వాయువుచేతను, లసితంబు = ప్రకాశింపఁజేయఁబడినదియు (దక్షిణపుదిక్కునుండి వచ్చుగాలితోఁ గూడిన దనియర్థము) వనితా . దనుసయంబు, వనితాజనసమాజ = స్త్రీసముదాయముయొక్కయు, ధనితాజగ, ధనితా = సంపదతో, ధన్యతతో ననియేని యర్థము (కూడిన) అజర = చిన్నవయసునున్న పురుషులయొక్కయు, మనోజ = మన్మథునిచేత, జనిత = పుట్టింపఁబడిన, అజయ = పరాభవముచె, విరాజత్ = ప్రకాశించుచున్న, అనసయంబు = ప్రార్థనలు గలది వసంతమలయానిలాదులుద్దీపనవిభావములు గాన నాకాలమున నాయికానాయకులు మానము విడిచి యొండొరుల బ్రతిమాలుచుందు రనిభావము చరితాంత వరచయంబు, చరిత = నడవడిచె, అంత = సుందరులును, మంచినడవడిఁ గలవా రనియర్థము, సురతాంత = సంభోగానంతరమున, పరితాంత = అలసినవారును, సదుదంత = మంచిసమాచారములతో, భరిత = నిండింపఁబడిన, అంతర = అవకాశముగల, సకాంత = భార్యలతోఁ గూడిన, వరచయంబు = నాయకసముదాయము గలదియును, (ని) వరోజామాతృషిద్గయోః. అ. శే ల

లిత.....సముదయము, లలిత=మనోహరములగు, కలరవ=పావురములయొక్క, కలరవ=మధురధ్వనితో, మిళత్ =కలియుచున్న, అళికుల=తుమ్మెదలయొక్క, కలకల=ధ్వనిచేత, ఉజ్జ్వల=ప్రకాశించెడు, విచికిల=మల్లితీఁగెలతో, కలిత=కూడుకొనిన, వకులవిసర=పొగడలగుంపులందును, కేసర=పొన్నచెట్లయందును, పరిలసత్ =వికసించుచున్న, అసమ=సాటిలేని, కుసుమసముదయము=పువ్వులగుంపులు గలది. మధుదినసముదయంబు=వసంతపుదినములసముదయము (వసంతకాల మనియర్థము) పొల్చెన్=సాక్షాత్కరించెను. వృత్త్యనుప్రాసాలంకారము.

చ॥ శ్రుతిహితవాక్యముల్ వలుకు ♦ చుం ద్విజపాళి మెలంగఁ గేళిప
ర్వతశుభవేదులందుఁ బ్రస ♦ వర్తుదినాత్మవివాహవేళ ను
న్నతలతికామహీజమిథు ♦ నంబులు పైనితరేతరం బుదా
రత నిడుముత్తియంపుఁదలఁ ♦ బ్రాలన జాలకరాజి రాజిలెన్॥ 59

ద్విజపాళి=కోయిలలు మొదలగుపక్షులసముదాయ మనెడుబ్రాహ్మణసముదాయము, (ని) దంతవిప్రాండజాద్విజాః అ. శ్రుతిహితవాక్యముల్=చెవుల కింపగుపలుకు లనెడు వేదమందుఁ జెప్పఁబడినవాక్యములను, (ని) నేదేశ్రవసిచశ్రుతిః అ పలుకుచున్, మెలంగఁగన్=సంచరించు చుండఁగాన్, శ్లిష్టరూపకాలంకారము. కేళిపర్వతశుభవేదులందున్, కేళి=క్రీడార్థము, (కల్పితములైన) పర్వతశుభవేదులందున్=కొండ లనెడు పెండ్లియరుఁగులమీఁదను, ప్రసవర్తు.....ళన్, ప్రసవర్తుదిన=వసంతకాలమనెడు, ఆత్మవివాహవేళన్=తమయొక్క (లతలయువృక్షములయు) వివాహకాలమునందున్, ఉన్నత.....మిథునంబులు, ఉన్నత=పొడవులగు, లతికా=తీవలును, మహీజ=వృక్షములు ననెడు, మిథునంబులు=స్త్రీపురుషులజంటలు, ఇతరేతరంబు=అన్యోన్యమును, పైన్=ఒండొరులమీఁదను, ఉదారతన్=గొప్పతనముతో, ఇడుముత్తియంపుఁదలఁబ్రాలన్=చల్లుకొను చున్న ముత్తెములతలఁబ్రాలో యనునట్లు, జాలకరాజి=మొగ్గలసముదాయము, రాజిలెన్=ప్రకాశించెను రూపకానుప్రాణితోత్ప్రేక్షాలంకారము

చ॥ ఎలయుచుఁ దేఁటిమొత్తపు ♦ మొయిల్ పయిఁ గప్పి రవం బొనర్పఁ గో
యిల లనువానకోయిలలు ♦ హెచ్చఁగ నచ్చపుఁబువ్వుఁదేనెసో
నలు గురియన్ వనానిలము ♦ నం గన నౌచుఁజలించెఁ గ్రొమ్మెఱుం

ఁగులఁగతిఁ దియ్యమావియెల ♦ గున్నలఁ గెందలిరాకుజొంపముల్ ॥60

తియ్యమావియెలగున్నలన్ = తియ్యమామిడిచెట్లసంబంధమైనలేఁతమొక్కలయందున్ (లేఁతతియ్యమావులందనియర్థము.) కెందలిరాకుజొంపముల్ = ఎఱ్ఱనిలేఁతయాకులసమూహములు, పయిన్ = వానిమీఁదను, కప్పి = ఆవరించి, తేఁటిమొత్తపుమొయిల్ = తుమ్మెదగుంపులనుమేఘములు, ఎలయుచున్ = వ్యాపించుచున్, రవంబు = ధ్వనిని, ఒనర్పఁగాన్ = చేయుచుండఁగాన్, కోయిలలు = కోకిలలు, అనువానకోయిలలు = అనియెడుచాతకములు, హెచ్చఁగన్ = అధికమగుచుండఁగాన్, అచ్చపుఁబువ్వుఁదేనెసోనలు = నిర్మలమైనమకరందమనువర్షధారలు, కురియన్ = వర్షింపఁగాన్ వనానిలమునన్ = వనమునందలిగాలిచేతను, క్రొమ్మెఱుంగులగతిన్ = క్రొత్తమెఱుఁగులరీతిచేతను, (క్రొత్తమెఱుఁగులవలె ననియర్థము.) కనరాచున్ = ఒకసారి కానుపించుచున్, చలించెన్ = కదలియాడుచుండెను.

లేఁతమావులయందలిచిగుళ్లమీఁద మేఘములువలెఁ దుమ్మెదలు ముసరి ధ్వనిచేయుచుండఁగా వర్షధారలువలె మకరందము గురియుచుండఁగా మెఱుఁగులువలె గాలిచే నొకప్పుడు గాన్పించుచు నొకప్పుడు గాన్పింప కుండె ననియర్థము.

మ॥ వనరాశ్యుద్గతఫేనము ల్వనరమా ♦ వజ్రప్రభారమ్యమం
డనశోభల్ మధుపప్రతానమధుపా ♦ నప్రక్రియారౌప్యపా
త్రనికాయంబులు చైత్రరాత్రిముఖని ♦ ర్యత్తారకల్ వల్లికా
వనితాంచద్దరహాసముల్ సితసుమ ♦ వ్రాతంబు లొప్పెన్ వనిన్॥

వనరాశ్యుద్గతఫేనముల్, వనరాశి = అరణ్యసముదాయమనెడుసముద్రమునుండి ఉద్గత = మీఁదికివచ్చిన, ఫేనముల్ = నురుగులును, (ని) పయఃకీలాలమమృతంజీవనం భువనంవన మనియును, గహనంకాననంవన మనియును నమరుఁడు. వనరమా........ భల్, వనరమా = వనలక్ష్మి యనెడుస్త్రీయొక్క, వజ్రప్రభారమ్య = వజ్రకాంతులచే మనోహరము లైన, మండనశోభల్ = అలంకారములయొక్కదీప్తులును, మధుప...నికాయంబులు, మధుప = తుమ్మెద లనుమద్యపానముచేయువారి, ప్రతాన = సముదాయముయొక్క, మధుపాన = మకరందము ద్రావుట యనెడుమద్యపానవ్యాపారమునకు, రౌప్యపాత్రనికాయంబులు = వెండిగిన్నెలగుంపులును, చైత్ర.....త్తారకల్, చైత్ర = వసంతకాలమనెడు, రాత్రిముఖ = సూర్యాస్తమయకాలమందు, నిర్యత్ = ఉదయించుచున్న, తారకల్ = నక్షత్రములును, వల్లికా.....హాసముల్, వల్లికా = తీవలనెడు,

వనితా = స్త్రీలయొక్క, అంచత్ = ఒప్పుచున్న, దరహాసముల్ = మందహాసములును, (అగు) సితసుమవ్రాతంబుల్ = తెల్లపువ్వులసముదాయములు, వనిన్ = వనమునందున్ ఒప్పెన్ = ప్రకాశించెను.

క॥ వసుపతి దాను నగుట నల
వసుపతి మైత్రికిఁ దదాశ ♦ వఱలె నన విభా
వసుఁ డుత్తరంపుఁద్రోవను
మసలెం దనమిత్రభావ ♦ మహిమ దలిర్పన్॥ 62

విభావసుఁడు = సూర్యుఁడు (ని) విభావసుర్గ్రహపతిస్త్విషాంపతిరహర్పతిః. అ. తాను, వసుపతి = కిరణముల కధికారి, ధనముల కధికారి యనియర్థాంతరము (ని) దేవభేదేనలేరశ్మౌవసూరత్నే ధనేవసు. అ. అగుటన్ = కావుటచేతను, అలవసుపతిమైత్రికిన్ = ప్రసిద్ధుఁడైనధనాధిపతి యగుకుబేరునియొక్క చెలిమికిన్, తదాశన్ = ఆధనమునందలియాశచేతను, ఆకుబేరుఁ డుండునుత్తరపుదిక్కునం దనియర్థాంతరము. (ని) ఆశాశ్చహరితశ్చతాః అ వఱలె ననన్ = వ్యాపించెనో యనునట్లు, తనమిత్రభావమహిమ = తనమైత్రియొక్క గొప్పతనము, తనసూర్యభావముయొక్క గొప్పతనమనియర్థాంతరము తలిర్పన్ = వృద్ధి చెందఁగాన్, ఉత్తరంపుఁద్రోవన్ = ఉత్తరమార్గమందు, మసలెన్ = సంచరించెను. సూర్యుఁడుత్తరాయణమున నుత్తరదిక్కునందును దక్షిణాయనమందు దక్కినపుదెసను సంచరించుట సహజమైయుండఁగా, సమానులకు మైత్రి సమకూడు నను ప్రసిద్ధిచేత నిచట సూర్యుఁడును వసుపతి ( కిరణముల కధికారి ) గావునసాశచేత వసుపతి ( ధనపతి ) యైనకుబేరునితో మైత్రి చేయ నెంచి యాదిక్కున సంచరించుచున్నట్లు తోఁచె ననియుత్ప్రేక్షించినాఁడు. వసుపతిశబ్దమునం దర్థద్వయమున కభేదాధ్యవసాయము.

శ్లేషమూలకాతిశయోక్త్యనుప్రాణితోత్ప్రేక్షాలంకారము.

సీ॥ నవరసామోదంబు ♦ నవరించె నెయ్యది
తరులయందును ఘన ♦ తరులయందు
సుమనోవికాసంబు ♦ సమకూర్చె నెయ్యది
శ్యామలందును నవ ♦ శ్యామలందు

మధుపరాగసమృద్ధి ♦ మననిచ్చె నెయ్యది
తమ్మిలందును లతాం ♦ తమ్మిలందు
లలితకుంకుమపత్రి ♦ కలన మెయ్యది నించెఁ
గొమ్మలం దెలమావి ♦ కొమ్మలందు
నట్టిసురభికి సురభివి ♦ ఖ్యాతి గలుగు
టరిదియే సత్ఫలములు ద్వి ♦ జావళులకు
బాలగణికలకు నవీన ♦ పల్లవాప్తి
లలిఁ బ్రసవయుక్తి వంధ్యాళు ♦ లకు నొసంగ॥ 63

ఎయ్యది = ఏవసంతకాలము, తరులయందున్ = వృక్షములయందును, ఘనతరుల యందుఁ = గొప్పవారియందును, నవరసామోదంబు, నవ = నూతనమైన, రస = మధురాదులయు, ఆమోదంబు = పరిమళములయు, ( సముదాయమును ) నవ = నూతనమైన, రస = ( శృంగారము ) ప్రేమను, ఆమోదంబు = సంతోషంబును, నవరించెఁ = కలిగించెనో, వృక్షములందు మధురరసమును, బరిమళమును, పురుషులందుఁ బ్రేమను సంతోషమునను గలిగించె ననియర్థము. ( ని ) శృంగారాదౌ విషేవీర్యగుణేరాగేద్రవేరసః. ఆ ఎయ్యది = ఏవసంతకాలము ( ఈపదమునకు ముందు నిట్లే యర్థము గ్రహింప నగును.) శ్యామలందును = యువతులందును (ని) శ్యామాషోడశవర్షాస్త్రీ నా.నా నవశ్యామలందుఁ = లేఁతప్రేంకణపుఁజెట్లయందును, సుమనోవికాసంబు = అధిక మైనమనస్సంతోషంబును, పూలయొక్క వికాసమునను, సమకూర్చెఁ = సంఘటించెనో, యువతులకు సంతోషమును, ప్రేంకణములకుం బువ్వుసమృద్ధిని గలిగించె ననిభావము. ఎయ్యది, తమ్మిలందును = తామరలయందును, లతాంతమ్మిలందుఁ = పుష్పములయందును, మధుపరాగసమృద్ధిఁ, మధుప = తుమ్మెదలయొక్క, రాగ = ప్రేమయొక్క, సమృద్ధిన్ = అతిశయమును, మధు = పూఁదేనెయొక్కయు, పరాగ = పుప్పొడియొక్కయు, సమృద్ధిఁ = సంపదను, మననిచ్చెఁ = ఉండఁజేసెనో, పుట్టించెనోయనియర్థము తామరలందుం దుమ్మెదలకుఁ బ్రేమాతిశయమునుఁ బువ్వులందుమరందముం బుప్పొడిని గలిగించె ననియభిప్రాయము. ఎయ్యది, కొమ్మలందుఁ = స్త్రీలయందును, ఎలమావికొమ్మలందుఁ = లేఁతమామిడికొమ్మలందును, లలితకుంకుమపత్రకలనము, లలిత = సుందరమైన, కుంకుమపత్ర = ( చెక్కిళ్లు మొదలగువానియందలి ) కుంకుమపూఁత వలని, కలనము = చక్కఁదనమును, కుంకుమం బోలినచిగురుటాకులయందమును, నించెఁ =

నిండించెనో, స్త్రీలకుం గుంకుమపూఁతలును మావులయందుఁ జిగురాకులును సంఘటించె ననియర్థము అట్టిసురభికిన్ = అట్టివసంతఋతువునకు, (ని) సురభిస్తుగవిస్త్రియాం వసంతచైత్రయోః పుంసిత్రిషుసౌమ్యసుగంధినోః శా. నా ద్విజావళులకున్ = బ్రాహ్మణులకు, (పక్షుల కనియర్థాంతరము) సత్ఫలములు = కోరినలాభములను (మంచిపండ్ల ననియర్థాంతరము) బాలగణికలకున్ = లేఁతయడవిమల్లెతీఁగెలకున్, (చిన్నవయసున నున్న వేశ్యల కనియర్థాంతరము.) నవీనపల్లవాప్తిన్ = లేఁతచిగుటాకులకలిమిని (క్రొత్త విటులసంబంధము ననియర్థాంతరము) (ని) వారస్త్రీగణికా వేశ్యా యనియును గణికాయూధికా యనియును నమరుఁడు లలిన్ = చక్కఁగాన్, వంధ్యావళులకున్ = గొడ్రాండ్రకున్ (గొడ్డువి యగుతుమ్మెదల కనియేని ఫలింపనిచెట్లసముదాయమున కనియేని యర్థాంతరము) ప్రసవయుక్తిన్ = సంతానమును, (పుష్పసంపద ననియర్థాంతరము.) ఒసంగన్ = ఇచ్చుటచేతను, సురభివిఖ్యాతి = సురభియను పేరు (కామధేనువుయొక్కకీర్తిం బోలినకీర్తి యనియర్థాంతరము) కలుగుట = సంభవించుట, అరిదియే = దుర్లభమా? కాదనియర్థము కామధేను వెవ్వ రేమికోరిన నది యిచ్చును వసంతఋతువునకును శ్లేషచే నట్టిసామర్థ్యము చెప్పఁబడియె కాఁబట్టియే దానిపేరైనసురభి యనునామమును గీర్తియును దీనికిం గలుగుట దుర్లభము గాదని తాత్పర్యము. వసంతఋతువునకు సురభి యనునామము నిమిత్తాంతరముచేతఁ గలిగి యుండఁగా నిది పెక్కండ్రకుం బెక్కుకోర్కు లిచ్చినట్లు శ్లేషచేఁ జెప్పి యాకారణముచేతనే కామధేనువునకుం బేరైనయాశబ్దము దీనికిం జెల్లు ననియుత్ప్రేక్షించుటచే శ్లేషానుప్రాణితోత్ప్రేక్షాలంకారము.

చ॥ చివురుకటారు లయ్యలరు ♦ సింగిణులుం దలిరాకుబాఁకులున్
రవదళిశింజినుల్ సుమప ♦ రాగమునన్ మెఱుఁగెక్కఁ జేసి మా
ధవుఁ డనుఁ గైనమారునకుఁ ♦ దా నిడ నించినయస్త్రశాలల
ట్లవితథలీల నొప్పె వని ♦ నంచితమంజునికుంజపుంజముల్॥ 64

మాధవుఁడు = వసంతుఁడు, చివురుకటారులు = చిగురులనుచురకత్తులును, అయ్యలరుసింగిణులున్ = పూవిండ్లును, తలిరాకుబాఁకులున్ = లేఁతయాకులను ఖడ్గవిశేషములును, రవదళిసింజినుల్ = ధ్వనియించుచున్న తుమ్మెదనారులును, సుమపరాగమునన్ = పుప్పొడిచేతను, మెఱుఁగెక్కఁజేసి = మెఱయునట్లుచేసి (పదనుపెట్టి యని యర్థము) కత్తులుమొదలైనవానికిం బదను కలుగఁజేయునిమిత్త మిసుము మొదలగునవి రాతిమీఁద

వేసినారనుట సుప్రసిద్ధము. అనుఁగైనమారునకున్ = ప్రియుఁడైనమన్మథునకు, తాన్, ఇడన్ = ఇచ్చుటకు, నించినయస్త్రశాలలట్లు = నిండించిన యాయుధాగారములువలె, అంచిత .. .. పుంజముల్, అంచిత = ఒప్పెడు, మంజు = మృదువైన, నికుంజపుంజముల్ = పొదరిండ్ల సముదాయములు, అవితథలీలన్ = సఫలమైన విలాసముతో, వనిన్ = వనమునందున్, ఒప్పెన్ = ప్రకాశించెను.

వసంతుఁడు తన చెలికాఁడైన మన్మథునకిచ్చుటకు సిద్ధముచేసిన యాయుధశాలలువలెఁ బొదరిండ్లు పువ్వులతోడం జివుళ్లతోడను విలసిల్లెననిభావము.

చ॥ కొలఁకులఁ దేలితేలి తొవ ♦ గుంపులకంపుల సోలిసోలి మ్రాఁ
కులపయి వ్రాలివ్రాలి సుమ ♦ గుచ్ఛసుగంధముఁ గ్రోలిగ్రోలి తీ
వలగమిఁ గ్రాలిక్రాలి తరు ♦ పంక్తులనీడలఁ దాళితాళి మేల్
నిలుకడ వీచె నామని వ ♦ నీతలశీతలవాతపోతముల్॥ 65

వనితల శీతల వాత పోతముల్, వనీతల = తోఁటలయందలి, శీతల = చల్లని, వాతపోతముల్ = పిల్లవాయువులు, ఆమనిన్ = వసంతకాలమునందున్, కొలఁకులన్ = సరస్సులందున్, తేలితేలి = స్నానముచేసి (సంచరించియనియర్థము.) తొవగుంపులకంపులన్ = కలువ పువ్వుల వాసనచేత, సోలిసోలి = మిగులం బారవశ్యము నంది, కంపు శబ్దము దుర్గంధ పరమైనట్లు లోకమునం బ్రసిద్ధము కాని భారతము మొదలగువానియందు గంధసామాన్యపరముగా నీ శబ్దము నుపయోగించిరి మ్రాఁకులపయిన్ = చెట్లమీఁదను, వ్రాలివ్రాలి = మిగులవిశ్రమించి, సుమగుచ్ఛసుగంధమున్ = పువ్వులగుత్తులయొక్క పరిమళమును, క్రోలిక్రోలి = మిగులననుభవించి, తీవలగమిన్ = తీవలగుంపునందున్, క్రాలిక్రాలి = మిగులసంచరించి, తరుపంక్తులనీడలన్ = చెట్లవరుసల నీడలయందున్, తాళితాళి = ఆఁగియాఁగి, మేల్ నిలుకడన్ = మిగులస్థైర్యముతో వీచెన్ = విసరెను ఇందు వాయువునందు వర్ణ్యములైన చల్లఁదనము మాంద్యము సౌరభ్యము నను మూఁడు గుణములును వర్ణింపఁబడెను

క॥ అలినీకుటుంబినులకున్
లలి నీరవపుబొమ్మ ♦ రిండ్ల లతికాపాంచా
లుల నవపుష్పోద్గమవే
ళల వనరమ దేనెవిందు ♦ లను గావించెన్॥ 66

వనరమ=వనలక్ష్మి, లతికా......వేళలన్, లతికా=తీవలను, పాంచాలికల=బొమ్మలయొక్క, నవపుష్పోద్గమవేళలన్, నవ=నూతనమైన, పుష్పోద్గమవేళలన్=పువ్వులుపుట్టుకాలమనెడు రజోదర్శన కాలమందున్, లలిన్=చక్కఁగా, ఈరపుబొమ్మరిండ్లన్=పొదరులను, బొమ్మలను బెట్టికొని పిల్లలాడుకొను నిండ్లయందున్, అలినీకుటుంబినులకున్=ఆఁడుతుమ్మెదలను పేరఁటాండ్రకున్, తేనెవిందులన్=మకరంద భోజనములను, కావించెన్=చేయించెను.

గీ॥ విరహితతిమీఁద దండెత్తు ♦ మరునివీర
కాహళల భంగి మొఱసెఁ బి ♦ కవ్రజంబు;
లమరెఁ గోరకములు కింశు ♦ కములఁ గాన
నస్థలీస్త్రీల కెంపుల ♦ వత్తులనఁగ॥ 67

పికవ్రజంబు=కోయిలలసముదాయము, విరహితతిమీఁదన్=వియోగముం బొందిన స్త్రీపురుషుల సముదాయముమీఁదను, దండెత్తు .. భంగిన్, దండెత్తు=యుద్ధమునకు వెడలెడు, మరుని=మన్మథునియొక్క, వీర కాహళల భంగిన్=పరాక్రమశాలులకుంబిరుదులైన కొమ్ముబూరల రీతిచేతను, మొఱసెన్=ధ్వనించెను కింశుకములన్=మోదుగులయందున్, కోరకములు=మొగ్గలు, కాన.. ...లనఁగన్, కాననస్థలీ=అడవులయందలి యకృత్రిమ భూములనెడు, స్త్రీల=ఆఁడువారియొక్క, కెంపులవత్తులనఁగ=పద్మరాగములఁగూర్చిన ముక్కుపోఁగులో యనునట్లు, అమరెన్=ఒప్పెను ఉత్ప్రేక్షాలంకారము.

సీ॥ తరులలోఁ దీవపం ♦ దిరులలో విరులమం
జరులలో మకరంద ♦ ఝురులు గ్రోలి
గముల బాగమరి వ్రా ♦ గములపైఁ దగి పరా
గములఁ బైకొని సురా ♦ గముల మించి
చెలువొందు గుజ్జుమా ♦ వులయందుఁ దలిరుఁగ్రొ
వులయందు ననలతా ♦ వులఁ బెనంగి
దిటములై శ్రితపుష్ప ♦ పుటములై కలితని
ష్కుటములై నవపవసీ ♦ తటుల నదిమి

తమిని మగపెంటిపిల్లతం • డములఁ గలసి
గలశిరంబులఁ బూఁదేనెఁ • గప్పికొనఁగఁ
గొనగఱులువిప్పి యపుడు ఝు • మ్మనుచుఁ బొదలఁ
బొదల రొదలిడి కొదమతు • మ్మెదలు మెదలు॥ 68

కొదమతుమ్మెదలు = లేఁతతుమ్మెదలు, తరులలోన్ = చెట్లలోను, తీవపందిరులలోన్ = తీవలతో నల్లుకొనిన పందిరులనడుమను, ( ఉండు ) విరులమంజరులలోని మకరందఝరులు = పూలగుత్తులలోపలనున్న తేనెనదులను, క్రోలి = త్రావి, గములన్ = గుంపులచేతను, బాగమరి = చక్కఁబడి, ( గుంపులుగూడియనియర్థము. ) పూగములపైన్ = పువ్వులగుంపులమీఁదను, తగి = ప్రకాశించి, పరాగములన్ = పుప్పొడులను, పైకొని = మీఁదం జల్లికొని, సురాగములన్ = మంచియనురాగములతో, మించి = అతిశయించి, చెలువు = అందమును, ఒందు గుజ్జుమావులయందున్ = పొందెడు లేఁతమామిడులందును, తలిరుఁగొమ్ములన్ = చిగిరించినకొమ్మలయందును, ననలతావులన్ = పూలుగలచోట్లను, పెనంగి = కలసికొని, దిటములై = ధైర్యముకలవియై, శ్రితపుష్పపుటములై = ఆశ్రయింపఁబడిన పూలగుత్తులు కలవియై, కలితనిష్కుటములై = ( తమచే ) వ్యాపింపఁబడినయింటివెనుకనున్నతోఁటలుగలవియై, ( ని ) గృహారామస్తునిష్కుటః. అ. నవవనీతటులన్ = నూతనమైన తోఁటలను, అదిమి = కప్పి, ( అందవ్రాలియనియర్థము ) తమిన్ = వేఁడుకతో, మగపెంటిపిల్లతండములన్ = మగవానియొక్కయు, ఆఁడువానియొక్కయుఁ బిల్లలయొక్కయు సముదాయములను, కలసి, గలశిరంబులన్ = మెడలయందును శిరసులందును, పూఁదేనె = మరందము, కప్పికొనఁగన్, కొనగఱులు = ఱెక్కలచివరలను, విప్పి, ఝుమ్మనుచున్, పొదలన్ = తీవగుంపులయందున్, పొదలన్ = అధికమగునట్లు, అపుడు = ఆవసంతకాలమందు, రొదలిడి = ధ్వనిచేసి, మెదలున్ = సంచరించును

మ॥ కలితాశోక లతాంతదీపరుచి రం • గత్కుంజగేహంబులోఁ
గలకంఠీతతి రాగవీక్షణము సోఁ • కం దార్పఁగా దక్షిణా
నిలుఁ డల్లల్లనఁ దావు లంటుకొనుచో • నీరంధ్రమాధ్వీరస
చ్ఛలఘూర్ణోద్గమలై వడంకి రలవా • సంతీలతాబాలికల్॥ 69

కలిత...... గేహంబులోన్, కలిత = ప్రాప్తమైన, అశోకలతాంత = అశోకపుం

బువ్వులనెడు, దీప=దీపములయొక్క, రుచి=కాంతిచేతను, రంగత్=ప్రకాశించుచున్న, కుంజగేహంబులోన్=పొదరుటిల్లనెడు గృహమధ్యమందున్, కలకంఠీతతి=ఆడుకోయిలలను స్త్రీలసముదాయము, రాగవీక్షణము=ఎఱ్ఱనిచూపులనెడు ప్రేమతోఁ గూడినచూపు, సోఁకన్=తగులఁగాన్, తార్పఁగాన్=కూర్పఁగాన్, దక్షిణానిలుఁడు=దక్షిణనాయకుఁడైన దక్కినపుగాలి, (పెక్కుభార్యలందు వైషమ్యములేకుండ నిపుణముగం బ్రవర్తించువాఁడు దక్షిణనాయకుఁడు) అల్లల్లనన్=మిగులమాంద్యముతోన్, తావులు=పరిమళములను కళాస్థానములను, అంటుకొనునోన్=తాఁకినపుడు అల వాసంతీలతా బాలికల్=ప్రసిద్ధినొందిన గురువిందతీఁగెలను ముగుదలు, నీరంధ్ర......లై, నిరంధ్ర=సందులేని, మాధ్వీరస=పూఁదేనెయొక్క, చ్ఛల=మిషచేతను, ఘర్మోద్గములై=చెమటయొక్క పుట్టుకఁగలవారై, వడంకిరి=కంపించిరి.

ముగుదలను మొదట నాయకులతోఁ గొంద ఱింతులుగూర్చుటయు నాకాలమునవారికిఁ జెమ్మటమొదలగు సాత్త్వికభావములు పుట్టుటయు సహజము. ఈపద్యమున మీఁదటిలోకసిద్ధవ్యవహారమునను సరించి ముగ్ధాత్వము మొదలగునవి వాసంతీలత మొదలగువానియందుఁ గవి యారోపించెను, గాన రూపకాలంకారము, మఱియు మకరందమున దానిరూపముం గప్పియందు స్వేదత్వమారోపించుటచే నపహ్నవాలంకారము. వసంతకాలమునఁ గోకిల లెఱ్ఱనిచూపులఁగలిగి విలసిల్లుచుండెననియు మందమారుతము పూలపొదలయందు సంచరించుచుండెననియు నశోకములు దీపములంబోలిన యెఱ్ఱనిపూలుగలిగియుండెననియు గురువిందతీవలనుండి యెడతెగని మరందధారలుగురియుచుండెననియు భావము ఇందు శృంగారరసవాకారులగు స్వేదము (చెమ్మట) వేపథువు (కంపము) ననుసాత్త్వికభావములు రెండు చెప్పంబడియె

మ॥ వనరంగంబులపైఁ దమాలవృతి నే ♦ పథ్యంబులొప్పం బిక
స్వనగీతంబులతో మరున్నటుఁడు లా ♦ స్యప్రౌఢిఁ నేర్పం జివు
ళ్లను కేల్ద్రిప్పుచు వల్లిపాత్రములగుం ♦ పాడన్ వసంతప్రభుం
డనుకంపామతి మెచ్చియిచ్చెఁ గుసుమ ♦ ప్రాంచన్మణీభూషలన్॥

వనరంగంబులపైన్=వనములను నాట్యస్థలములయందున్, (ఎల్లవారు రంజిల్లుచోటుగావున నాట్యస్థానము రంగంబునాఁబడు) తమాల . .బులు, తమాలవృతి=చీఁకటిమ్రాఁకులయావరణమునెడు, (వృతి=ఆవరణము, కంచె,) నేపథ్యంబులు=తెరచాటుచోటులు, రంగమునకు వెనుకటిదిక్కున వస్త్రాద్యలంకారములు ధరించుటకు

వేషగాండ్రు దేర్పఱుచుకొన్న స్థానము నేపథ్యము. ఒప్పన్ = ప్రకాశింపఁగాన్, పికస్వనగీతంబులతోన్, = కోకిలస్వనములనెడు గానములతోన్, మరున్నటుఁడు = మందవాయువను నభినయశాస్త్ర ముపదేశించువాఁడు, లాస్యప్రౌఢిన్ = నృత్యమునందలి సామర్థ్యమును, ( ఆంగికాద్యభినయములచే రామాదుల యవస్థ ననుకరించుట నాట్యము. ఇది లాస్యము తాండవము నని ద్వివిధము మృదువైనది లాస్యము, నుద్ధతమైనది తాండవమును ) నేర్పన్ = శిక్షింపఁగాన్, వల్లి పాత్రముల గుంపు = తీవలను నర్తకుల సముదాయము, చివుళ్లను కేల్ద్రిప్పుచున్ = చిగురాకులను హస్తముల నాడించుచు, ఆడన్ = అభినయింపఁగాన్, వసంతప్రభుండు = వసంతుఁడను మహారాజు, మెచ్చి = సంతసించి అనుకంపామతిన్ = దయగలబుద్ధితోన్, కుసుమ శోభించన్మణీ భూషలన్ = పువ్వులనెడు విలసిల్లుచున్న మణులతోఁగూడిన నగలను, ఇచ్చెన్ = ఒసఁగెను రూపకాలంకారము

సీ॥ ఆసవంబుల నాని ♦ యలరుచుఁ బద్మినీ
జాలంబు మధుపాళి ♦ కేళి నెనయ
విటపానువృత్తులై ♦ వెలయుచు ఘనతరుల్
పరలతాతనుయోగ ♦ పటిమ నొనరఁ
దతపల్లవాళితో ♦ దుత సుమనోరాజి
కడనుండుకొమ్మలఁ ♦ గలిసియుండఁ
గడువనప్రియుఁడై ♦ కామదాతృత నూని
గణికాప్తిఁ బత్రిభం ♦ గము లొనర్ప
సకల కుజములఁ బెంచి సు ♦ జాతి నొంచి
మహి రజోవ్యాప్తిగను గంధ ♦ వహు వహించి
యతితపస్స్ఫూర్తి హరియించి ♦ యతిశయించి
చైత్రుఁ డాత్మప్రభావవై ♦ చిత్రిఁ దెలిపె॥ 71

పద్మినీజాలంబు = తామరల సముదాయము, ఆసవంబులన్ = పూఁదేనెలను, ఆని = ధరించి, మధుపాళికేళిన్ = తుమ్మెదలతోడి క్రీడను, ఎనయన్ = పొందఁగాన్, వసంతకాలమున దామరలు మిగులఁ దేనె స్రవించుచుఁ దుమ్మెదలతోఁ గూడి విలసిల్లు

చుండెననిభావము. పద్మినీజాలంబు = పద్మినీజాతిస్త్రీలయొక్క సముదాయము, ఆసవంబులన్ = మద్యవిశేషములను (పచ్చిచెఱకురసముతోఁ జేయుసారాయిని) ఆని = త్రావి, మధుపాళికేళిన్ = కల్లుద్రావువారి సముదాయముతోడి క్రీడను, ఎనయన్ = పొందఁగాన్, అనిరెండవయర్థము. (ని) పద్మినీకరిణీశ్రీస్త్రీసరోజ్జనలినీషుచ. నా. శా. వసంతకాలము మిగుల మన్మథోద్దీపకమగుటచే నుత్తమస్త్రీలుసయితము మద్యము ద్రావి త్రావినవారితో విహరించుచుండిరనిభావము ఘనతరుల్ = గొప్పచెట్లు, విటపానువృత్తులై = కొమ్మలయనుసరణగలవియై, వెలయుచున్ = ప్రకాశించుచు, పరలతాతనుయోగపటిమన్, పర = శ్రేష్ఠమైన, లతా = తీవెలయొక్క, అతనుయోగ = అధికమైనకూడుకొనుటయొక్క, పటిమన్ = సామర్థ్యముతోన్, ఒనరన్ = ప్రకాశింపఁగాన్, వసంతకాలమునందుఁ జెట్లు మిక్కిలికొమ్మలు గలవియై దగ్గఱనున్న లతలతో బాగుగ నల్లికొని ప్రకాశించుచున్నవని భావము ఘనతరుల్ = మిగులగొప్పవారు (వివేకులని యర్థము.) విటపానువృత్తులై, విటప = విటులంబాలించువారియొక్క, (గొప్పవిటులయొక్కయనియర్థము) అనువృత్తులై = అనుకరించుటగలవారై, పర... ..పటిమన్, పర = ఇతరులయొక్క, లతాతను = స్త్రీలయొక్క, (పరవనితలయొక్కయనియర్థము) యోగపటిమన్ = కలయికయందలి నేర్పుచేన్, ఒనరన్ = ప్రకాశింపఁగాన్, అనిరెండవయర్థము. వివేకులుసయితము కాలవిశేషమున వివేకముంబోగొట్టుకొని పెరయింతులఁ గోరుచున్నారని యాశయము. సుమనోరాజి = కుసుమసముదయము, తతపల్లవాళితోడుతన్, తత = విస్తరించుచున్న, పల్లవ = చిగుళ్లయొక్క, ఆళితోడుతన్ = సమూహముతో, కడన్ = చివరను, ఉండుకొమ్మలన్, కలసియుండన్ = వ్యాపింపఁగాన్, కాలమహిమచేఁ గుసుమములు చెట్లయందుఁ జివరవఱకు నుత్పన్నమాయెననిభావము సుమనోరాజి = విద్వాంసులసమాజము, (ని) సుమనాః పుష్పమాలత్యోః స్త్రియాం దేవేబుధేచ నా. శా. తత = (అంతటను) వ్యాపించెడు, పల్లవాళితోడుతన్ = విటకాండ్రతోన్, (ని) అథపల్లవః అస్త్రీప్రవాశేసాషిద్గే నా. నా. (కూడి) కడనుండుకొమ్మలన్ = వెలుపలనున్నయింతులను, (రజస్వలలనియర్థము) చైత్రుని యసాధారణ మహిమచేఁ విద్వాంసులు సయితము రజస్వలాసంగమము నిచ్ఛగించుచున్నారనిభావము. వనప్రియపక్షి = కోయిలలవరుస, కడున్ = మిక్కిలి, కామదాసతన్ = మన్మథుని సేవను, ఊని = అవలంబించి, గణికాప్తిన్ = అడవిమొల్లలమీఁదవ్రాలుటచే, పత్రభంగములు = ఆకులరాలుభ్రమను, ఒనర్పన్ = కావింపఁగాన్, మన్మథుని భటులైన కోయిలలడవిమొల్లమీఁదనెక్కి యాకులరాల్చుచున్నవనిభావము వనప్రియపక్షి = అడవియందుఁబ్రేమఁగలవారు, (వానప్రస్థులనియర్థము.) ప్రపంచసుఖమునం దాసవదలి తీర్థసేవఁ జే

యుచుఁ బుణ్యారణ్యములం దపము సేయువారు వానప్రస్థులు కామ దాసతఁ = మన్మథుని దాస్యమును, ఊని = అవలంబించి, కామునికి లోఁబడి యనియర్థము. గణికాప్తిఁ = వేశ్యలయొక్క సంబంధముచేతను, పత్రభంగములు = మకరాకారమైన కస్తూరి మొదల గువానిపూఁతలను, కడుఁ = మిక్కిలి, ఒనగ్పఁ = చెయఁగాన్, అని రెండవయర్థము. వసంతునివలన విరాగులుసయితము వేశ్యాసంబంధము నభిలషించుచున్నారని భావము. చైత్రుఁడు = వసంతుఁడు, సకలకుజములఁ = ఎల్లవృక్షములను (కు = భూమియందు, జని = ఉత్పత్తిగలది, కుజని = వృక్షము. బహువచనము కుజనులు) ఎల్లదుష్టులననియర్థాంతరము, పెంచి = వృద్ధినొందించి, సుజాతిఁ = జాజిని, నొంచి = బాధించి, వానికివికాసము లేకుండఁజేసి యనియర్థము అవి వర్షాకాలమున వికసించుననియు వసంతకాలమునఁ బుష్పింపవనియుఁ బ్రసిద్ధి మంచివంశమున జన్మించినవారిని బాధించి యని యర్థాంతరము. మహిఁ = భూమియందు, రజోవ్యాప్తి = పూవుదుమ్ముతోఁగూడికను, కను గంధవహుఁ = పొందువాయువును, వహించి = ధరించి, మహిఁ, రజోవ్యాప్తిన్ = రజోగుణముతోడి సంబంధమును కనుగంధవహుఁ = పొందెడుగర్వముగలవానిని (జాత్యేకవచనము) (ని) గంధోగంధకసంబంధామోదలేశస్మయేషు చ. నా. వా. వహించి = పోగుచేసి, అతి తపస్స్ఫూర్తిఁ = మిక్కిలిగ శిశిరఋతువుయొక్క ప్రకాశమును, హరియించి = పోఁగొట్టి, (రెండవయర్థమున యకారాదిగాఁ బదమువిభజింపవలెను) యతితపస్స్ఫూర్తిఁ = సన్యాసులయొక్క తపస్సుచేయవలెననుతలఁపును, హరియించి = పోఁగొట్టి (తనమహిమచే సన్యాసులకుసయితము చిత్తస్వాస్థ్యము లేకుండఁజేసి యనిభావము.) అతిశయించి = విజృంభించి, ఆత్మప్రభావవైచిత్రిఁ = తనప్రతాపముయొక్క చమత్కారమును, (ని) ప్రితాపశ్చప్రిభావశ్చయత్తేజః కోశదండజమ్. అ. తెలిపెఁ = ప్రకటించెను శ్లేషాలంకారము

సీ॥ మునుమాపు నులివిచ్చు ♦ బొండుమల్లెలు సోగ
క్రొమ్ముడి నెఱతావి ♦ గుమ్మరింప
ననుఁజిగురాకుపా ♦ న్పుల విరిపఱపుల
నెసఁగు నేలకిపొద ♦ రిండ్లఁ జొచ్చి
మధుర శీధురసాత్త ♦ మదమాంద్యమునఁ బునః
పునరుపగూహనం ♦ బుల మిటారి
వలిచన్నుఁగవ లురం ♦ బుల నాట ననఁటుల

కప్పురంపుఁబోడి తేఁచు ♦ కమ్మదెమ్మె
రలు నితాంతోపరతి పరి ♦ శ్రమ సముత్థ
కమ్ర గల్లతల స్వేద ♦ కణిక లార్పఁ
బతులయెదఁ గూర్కుసతులు రే ♦ పకడఁ దెలిసి
రలఘుశుకపికనిష్కుట ♦ కలకలముల॥ 72

మునుమాపు = సూర్యాస్తమయకాలమునన్, నులివిచ్చుబొండుమల్లెలు, నులి = కొంచెము, విచ్చు = వికసించెడు, బొండుమల్లెలు = ఒకతెగమల్లెపూవులు, సోగక్రొమ్ముడిన్ = దీర్ఘమగునూతనముగ జిద్దిన సిగనుండి, నెఱతావి = అధికమైనపరిమళము ను, క్రుమ్మరింపన్ = వెదచల్లఁగాన్, నునుఁజిగురాకు పాన్పులన్ = మృదువులగు లేఁతయాకులమంచముతోడను, విరిపఱపులన్ = పూలసెజ్జలతోడను, ఎసఁగు నేలకి పొదరిండ్లన్ = ప్రకాశించెడు నేలకి తీవయిండ్లయందున్, చొచ్చి = ప్రవేశించి, (దీనికిఁగర్తృపదముసతులు) మధుర.....మాంద్యమునన్, మధుర = కమ్మని, శీధురస = మద్యము చేతను, (మద్యపానము చేతననియర్థము) ఆత్త = ప్రాప్తమైన, మద = మత్తుగలని, మాంద్యమునన్ = ఆలస్యముతో, పునఃపునరుపగూహనంబులన్ = మఱల మఱలఁగావించెడు కౌఁగిళ్లచేతను, మిటారివలిచన్నుఁగవలు = ఎత్తుగల చల్లని కుచములజంటలు, ఉరంబులన్ = (భర్తల) వక్షస్థలములందున్, నాటన్ = గ్రుచ్చుకొనఁగాన్, అనఁటులకపురంపుఁబోడి = కర్పూరమునుగలిగించునట్టియనఁటిమొక్కలధూళిని, (కర్పూరపురజముననియర్థము) తేఁచు కమ్మదెమ్మెరలు = ఎగురఁగొట్టెడుసువాసనగల లేఁతవాయువులు, నితాంత.....కణికలు, నితాంత = ఎడతెగని, ఉపరతి = పురుషాయితమువలని, పరిశ్రమ = ఆయాసమువలన, సముత్థ = పుట్టిన, కమ్ర = మనోహరమైన, గల్లతల = చెక్కిళ్లయందలి, స్వేదకణికలు = చెమ్మటబిందువులను, ఆర్పన్ = ఎండింపఁగాన్, పతులయెదన్ = నాయకుల హృదయమందు, కూర్కుసతులు = నిద్రించుస్త్రీలు, అలఘు.....కలములన్, అలఘు = అధికమైన, శుక = చిలుకలయు, పిక = కోయిలలయు, నిష్కుట = ఇండ్లవెనుకనున్నతోఁటలయందలి, కలకలములన్ = ధ్వనులచేతను, రేపకడన్ = ప్రాతఃకాలముననుు, తెలిసిరి = మేల్కొనిరి ఇందు సంభోగశృంగారము వర్ణింపఁబడె. నాయికలుస్వీయాలుంబ్రౌఢలును.

వ॥ ఇట్లు సకలజగదామోదకరామోదవిలాసభాసురంబులగు వసంతవాసరంబులు జరుగుచుండ నొక్కదినంబున నంబుజాక్షుండునుం బాం

చాలీసహితంబుగాఁ బాండుకుమారులునుం బరివారంబుతోఁ బే
రోలగంబున్న సమయంబునం గేకయరాజప్రేషితుండగు పురోహి
తుం డరుదెంచి సముచితసత్కారంబు వడసి యతండు నేఁటికాఱవ
దినంబున భద్రాస్వయంవరమహోత్సవంబు గాఁగలదు. తజ్జనకుం
డగు ధృష్టకేతుప్రభుండు భవదాగమనంబునకై నన్నుఁ బుత్తెంచెన
ని కృష్ణయుధిష్ఠిరులకు విన్నవించి సువర్ణవర్ణచిహ్నాంబగు శుభరేఖ
యొసంగిన సంతసించి యవ్విప్రునకభీష్టార్థంబులిచ్చి వీడ్కొల్పి యు
ధిష్ఠిరాదులకన్నమున్నుగ వెన్నుండు గేకయపురంబునకుం జనను
ద్యుక్తుండయ్యె నంత॥ 73

ఇట్లు = ఈప్రకారము, సకల .....భాసురంబులు, సకలజగత్ = ఎల్లలోకము లును, లోకమునయుండువారికెల్లనని యర్థము ఆమోదకర = హర్షంబుగలిగించెడు, ఆమోద = పరిమళముయొక్క (ని) సౌగంధ్యహర్షావామోదౌ నా నా విలాస = ఉల్లాసముచేతను, భాసురంబులు = ప్రకాశించునవి, అగు, వసంతవాసరంబులు = వసంతకాలపుదినములు, జరుగుచుండఁగాన్ = పోవుచుండఁగాన్, ఒక్కదినంబునన్, అంబుజాక్షుండునున్ = కృష్ణుఁడును, (తమ్మికంటి) పాంచాలీ సహితంబుగాన్ = ద్రౌపది తోఁగూడుకొన్నట్లుగా, పాండుకుమారులునున్ = పాండవులును, పరివారంబుతోన్ = సేవక సముదాయముతోన్, పేరోలగంబు = సభయందు (ఇది సప్తమ్యర్థమునందు బ్రథమ) ఉన్న సమయంబునన్, ఉన్నకాలంబునన్, కేకయరాజప్రేషితుండు = కేకయదేశపు రాజుచేఁబంపఁబడినవాఁడు, అగు, పురోహితుండు, అరుదెంచి = వచ్చి, సముచితసత్కారంబు = తగినగౌరవమును వడసి = పొంది, అతండు = ఆబ్రాహ్మణుఁడు, నేఁటి కాఱవదినంబునన్, భద్రాస్వయంవర మహోత్సవంబు = భద్ర యనుకన్నెయొక్క స్వయంవరమను పండుగ, కాఁగలదు. తజ్జనకుండు = ఆమెతండ్రి (కేకయరాజు) అగు ధృష్టకేతుప్రభుండు, భవదాగమనంబునకై = మీరాకకై, మిమ్ముఁబిల్చుటకని యర్థము. నన్నున్, పుత్తెంచెన్ = పంపెను, అని కృష్ణయుధిష్ఠిరులకున్, విన్నవించి = మనవిచేసి, సువర్ణవర్ణచిహ్నాంబు = బంగారపుటక్కరములుగా వ్రాతలుగలది, అగు, శుభరేఖన్ = వివాహమునందెలుపుకమ్మను, ఒసంగినన్ = ఈయఁగాన్, సంతసించి = హర్షము నొంది అవ్విప్రునకున్ = ఆబ్రాహ్మణునకున్, అభీష్టార్థంబులు = కోరినసొమ్ములు, ఇచ్చి, వీడ్కొల్పి = పంపించి, యుధిష్ఠిరాదులకన్నన్ = ధర్మరాజు మొదలగువారికంటెను,

మున్ను గన్ = మొదటను, వెన్నుండు = కృష్ణుఁడు, కేకయ పురంబునకున్, చనన్ = పోవుటకు, ఉద్యుక్తుండు = ప్రయత్నించినవాఁడు, అయ్యెన్, అంతన్,

గీ॥ కుంతివలన ననుజ్ఞఁ గై ♦ కొని యుధిష్ఠి
రానిలజనరముఖులు ర ♦ థాధిరూఢు
లై రహిం దను ననుపరా ♦ నచట వారి
సమ్మతి వహించి వీడ్కొని ♦ చనియె శౌరి॥ 74

శౌరి = కృష్ణుఁడు, కుంతివలనన్, అనుజ్ఞ = సెలవును, కైకొని = పుచ్చుకొని, యుధిష్ఠి.....ముఖులు = ధర్మరాజు, భీముఁడు, నర్జునుఁడు మొదలగువారు, రథాధిరూఢులై = బండ్లెక్కినవారలై, రహిన్ = ఆనందముతోన్, తనున్, అనుపరాన్ = పంపుటకువచ్చుచుండఁగాన్, అచటన్ = ఆస్థలమునందున్, వారిసమ్మతిన్ = వారియిష్టమును, వహించి = పొంది, వీడ్కొని = వెళ్లివచ్చెదనని చెప్పి, చనియెన్ = వెళ్లెను

క॥ ఈగతి నప్పురి వెలువడి
యాగోవిందుండు కతిప ♦ యాధ్వగతిఁ జనం
గాఁ గేకయపురిచెంతం
బాగగు కృతకాద్రిపార్శ్వ ♦ భాగమున రహిన్॥ 75

ఆగోవిందుఁడు, ఈగతిన్ = ఈప్రకారముచేతను, అప్పురిన్ = ఆపట్టణమునుండి వెలువడి = బయలుదేరి, కతిపయాధ్వగతిన్ = కొన్నిప్రయాణములు నడచుటచేతన్, చనంగాన్ = పోఁగాన్, (కొంతదూరము వెళ్లఁగా నని యర్థము) కేకయపురిచెంతన్ = కేకయపుర సమీపమందున్, బాగు = చక్కనిది, అగు, కృతకాద్రిపార్శ్వభాగమునన్, కృతకాద్రి = కల్పితమైనపర్వతముయొక్క, పార్శ్వభాగంబునన్ = ప్రక్కస్థలమునందున్, సమీపముననని యర్థము ముందుపద్యముతో నన్వయము

మహారాజులు రాలుమన్ను మొదలగువానితో నెత్తైనపర్వతాకారము కల్పించి దానం బూలచెట్లు నాటించి చల్లగాలికై యందుసంచరించుచుందు రని ప్రబంధముల వర్ణింతురు. దీనినే కృతకాద్రి యందురు

సీ॥ ఏలాలతాజాల ♦ హేలాంకలిత కీర
బాలా స్ఫుటాలాప ♦ లాలితంబు

మందారమాకంద ♦ బృందామితమరంద
సందోహనందితేం ♦ దిందిరంబు
ఖిల్లీకుచోల్లీఢ ♦ మల్లీలసద్గుచ్ఛ
వల్లీమతల్లీప్రి ♦ వేల్లితంబు
పారావతనటన్మ ♦ యూరాతతకిశోర
వారామితారవో ♦ ద్గీరణంబు
మానితానూనపిక కాక ♦ లీనినాద
లీనకానన దేవతా ♦ గానజాయ
మానసూనప్రియాళుప్రి ♦ తానినీన
పీనరుచి యైనయొకకోన ♦ గాన నయ్యె॥ 76

ఏలాలతా......లాలితంబు, ఏలాలతా = ఏలకితీఁగె లనెడు, డోలా = ఉయ్యెలలచేత, కలిత = పొందఁబడిన, ( ఉయ్యెలలయం దున్న యని యర్థము. ) కీరబాలా = చిలుక పిల్లలయొక్క, అస్ఫుటాలాప = స్ఫుటము కానిపలుకులచేత, ( ముద్దుపలుకులచేత న ని యర్థము. ) లాలితంబు = సుందర మైనదియు, మందార......దిందిరంబు, మందార = మందారములయొక్కయు, మాకంద = తియ్యమామిడులయొక్కయు, బృంద = సమూహమునందలి, అమిత = పరిమాణము లేని, మరంద = పూఁదేనెయొక్క, సందోహ = సముదాయముచేతను, ( ప్రవాహముచేత నని యర్థము ) నందిత = సంతోషపెట్టఁబడిన, ఇందిందిరంబు = తుమ్మెదలు కలదియు, ( ని ) ఇందిందిర శ్చంచరీకో రోలంబో బంభర శ్చ సః అ ఖిల్లీ. ..వేల్లితంబు, ఖిల్లీ = చెంచెతలయొక్క, కుచ = స్తనము లచేతను, ఉల్లీఢ = అనుభవింపఁబడిన, మల్లీలసద్గుచ్ఛ = మల్లెపూలయొక్క ప్రకాశించెడు గుత్తులు గల, వల్లీమతల్లీ = ప్రశస్త మైనతీవలచేతను, వేల్లితంబు = అల్లుకొనఁబడినదియు ను, పారావత .... ద్గీరణంబు, పారావత = పావురములయొక్కయు, నటత్ = నాట్యముచేయుచున్న, మయూర = నెమిళ్లయొక్కయు, ఆతత = అధిక మైన, కిశోర = శిశువులయొక్క, వార = సముదాయముయొక్క, అమిత = హెచ్చైన, ఆరవ = ధ్వనియొక్క, ఉద్గీరణంబు = ప్రసారము గలదియును, మానితానూన ..నపీనరుచి, మానిత = పూజింపఁబడిన, అనూన = తక్కువకాని, పిక = కోయిలలయొక్క, కాకలీనినాద = మధురధ్వనియందు, లీన = అణఁగిపోయిన, ( ఏకీభవించిన యని యర్థము. ) కానన

దేవతా=వనాధిదేవతలయొక్క, గాన=సంగీతరూప మైనదోహదముచేతను, జాయమాన=పుట్టుచున్న, సూన=పువ్వులుగల, ప్రియాళు=మోరటిచెట్లయొక్క, ప్రతానినీ=కొమ్మలయందుండుపాపలయొక్క, నవీనరుచి=క్రొత్తకాంతి గలదియు, వన, ఒకకోన=ఒకయరణ్యము, కాన నయ్యెక్=కాన్పించెను తరులతాదుల కకాలమునఁ బుష్పాదులఁ బుట్టించుక్రియ దోహదము అది యశోకమునకు స్త్రీపాదతాడనమును వకుళమునకు మద్యగండూషణమును, కురవకమునకు నాలింగనమును, మోరటికి గానమును దిలకమునకు వీక్షణము మొదలగునది

వ॥ అట్లు పొడచూపిన నవ్వనప్రాంతంబు రమాకాంతుండు డాయం జన నచ్చెంతల ననంతవాసంతికాక్రాంత వకులతర్వంతర నిరంతరదంతుర లతాంత నిష్క్రాంత ఘుమఘుమాయమాన సుగంధ బంధుర గంధవాహకిశోర విహారంబులును, హారమౌక్తికవ్రాతంబులచెన్నునఁ జెన్నలరుక్రొన్నిగ్గుమొగ్గల నెలకొన్న పొన్నగున్నలమిన్నలముక్కొన్న నలసన్నపుహొప్పారులయొప్పునఁ గుప్పతెప్పలై యనఁటుల నుప్పతిల్లుకప్పురంపుదుమారంబుల మఱుంగుపడుసీరంబులును, నీరంధ్రితమ తమాలద్రుమసముదయ తమోవిమోచనసమర్థ ద్యుమణికిరణాయమానంబు లగునశోకానోకహ కుసుమగుచ్ఛంబులవలన నచ్ఛంబులై జలజలఁ జిలుకు పలపలని యలరుబలుఁదేనెసోనలకు వానకోయిలలచెలువునఁ గలయ మెలఁగువలికులంబుల కలఝుంకారంబుల కనుసారంబు లగుసమీరపూరిత వేణురంధ్ర నిర్గతనిస్వనంబులునుం గలిగి వివిధ తరు లతా జాలంబున కాలవాలంబును మధుర ఫల సముదయంబున కునయంబును శుక పిక ప్రముఖ సకల శకుంతవారంబున కాధారంబును శృంగారలతాభవనంబులకుఁ గులభవనంబును నసమ కుసుమ ప్రకరంబున కాకరంబును గెంపుసొంపుల నింపారుచివురుజొంపంపుఁబట్టులకు విడిమట్టును గంబురాపచ్చకస్తురిపట్టు, పునుంగులతావులకుఁ దావును, జలువనెలరాలచెలువు

లకు నెలవును మావిమోకలకివికి దీవియుఁ దలిరాకుఁదేటకు మూటయు నయి నీటలరుముగుదపగిది నవవయోవిలాసంబునం దనరి ఋతుస్నాతరీతి నాతతహరిద్రాంకంబులం బొనరి జాలెంతపోలిక లాలితప్రసవసంపదం బొసఁగి యింద్రజాలంబుచందంబున విచ్చుమొగ్గల నెసఁగి శుభవస్తు ప్రభవ విభవాభిరామం బగునయ్యారామం బారామపట్టాభిషేకసమయంబునుంబోలెఁ బ్రశోభిత భూమిజాశేష శాఖామృగ కాండం బై కాండంబునుం బోలె నూత్నపత్రిసుందరం బై దరంబునుంబోలె బహుళార్జున ప్రభామహిమం బై హిమంబునుంబోలె వసహ్యామాన ఖగరాజధామం బై, రాజధామంబునుంబోలె సంభరితసారంగం బై సారంగంబునుంబోలె నధిగతమహీభృత్సన్నిధానం బై నిధానంబునుంబోలెఁ గనత్కనకరత్నప్రత్యగ్రజన్మం బై యగ్రజన్మ సముదాయంబునుంబోలె గాయత్రీజపాసక్తాలోకం బై లోకంబునుంబోలె వర్ధమాన ప్రాణిచయానందకం బై నందకంబునుంబోలె మాధవాలంకృతం బై మన్మథావేష్టితం బయ్యును నీలకంఠసమన్వితం బై దేవవల్లభవిరాజమానం బయ్యును బహుఫలాశోదంచితం బై వితతకీచక సంవృతంబయ్యును సంతతానిలడింభకసంచారం బై పూతనారమ్యం బయ్యును కృష్ణసారప్రకాశమానం బై కుంభజాతస్ఫురితం బయ్యును విజృంభిత మహావీర ద్రుపదం బై లలితోత్కలికా కలిత దివ్యమహిళాగణం బై లలితోత్కలికా కలిత దివ్యమహిళాగణం బగుచు సుమధురసాలాన్వితం బై సుమధురసాలాన్వితం బగుచు వానప్రస్థనివాసం బై వానప్రస్థనివాసం బగుచుం బొలుచునవ్వనంబున॥

అట్లు పొడచూపినన్ = ఆప్రకారము కనపడఁగాన్, అవ్వనప్రాంతంబున్ = ఆ యడివిసమీపమును, రమాకాంతుఁడు=కృష్ణుఁడు (లక్ష్మీపతి) డాయన్ = సమీపిం

చఁగాౝ, అచ్ఛాంతలౝ = ఆచేరువలందుౝ, అనంత......విహారంబులును, అనంత = అంతము లేని, వాసంతికా = అడవిమల్లెతీఁగలచేత, ఆక్రాంత = చుట్టుకొనంబడిన, వకులతర్వంతర = పొగడచెట్లనడుమ నున్న, నిరంతర = ఎడములేని, దంతుర = నిమ్నోన్నత మైన, లతాంత = పూలనుండి, నిష్క్రాంత = బయలువెడలిన, ఘుమఘుమాయమాన = గమగమలాడు చున్న, సుగంధ = పరిమళముచేతను, బంధుర = మనోహర మైన, గంధవాహకిశోర = లేఁతవాయువులయొక్క, విహారంబులును = సంచారములును, హార......చెన్నునౝ, హార = దండయందలి, మౌక్తిక = ముత్తియంబులయొక్క, వ్రాతంబుల = సముదాయముయొక్క, చెన్నునౝ = అందమునంటియందముచేతను, చెన్నలరు......ఒప్పునౝ, చెన్నలరు = ప్రకాశించెడు, క్రొన్నిగ్గు = నూతనమైనమెఱుఁగులు గల, మొగ్గలనెలకొన్న = కోరకములకునివాస మగు, పొన్నగున్నల = లేఁతపొన్నచెట్లయొక్క, మిన్నులము = ఆకాశమున వ్యాపించెడు, క్రొన్ననల క్రొత్తపువ్వులయొక్క పుప్పొడులయొప్పునౝ = పరాగములచక్కందనముచేౝ, కుప్పతెప్ప లై = మిక్కిలి రాసు లై, అనఁటులన్ = కప్పురపుంజెట్లనుండి, ఉప్పతిల్లుకప్పురంపుమారంబులౝ = పుట్టెడుకప్పురపుధూళిచేతనును, మఱుంగుపడునీరంబులును = కప్పుపడుపొదలును, ( పొదలు గప్పడ కుండునంతటియధికముగఁ గురియుపొన్నపూలపరాగముం గప్పురపుధూళియు నీవనమున గలవని భావము ) నీరంధ్ర .. ..కిరణాయమానంబులు, నీరంధ్రతమ = మిక్కిలి దట్ట మగు, తమాలద్రుమ = చీఁకటిమ్రాఁకులయొక్క, సముదయ = సమూహము నెడు, తమః = అంధకారముయొక్క, విమోచన = నివారించుటకుౝ, సమర్థ = తగిన, ద్యుమణి = సూర్యునియొక్క, కిరణాయమానంబులు = కాంతులువలె నాచరించుచున్నవి, అగునశోకా .. ..వలనౝ, అగు, అశోకానోకహ = అశోకవృక్షములయొక్క, కుసుమగుచ్ఛంబులవలనన్ = పూఁగుత్తులనుండి, అచ్ఛంబు లై = నిర్మలము లై, జలజలౝ = జలజల యనుధ్వనితో, ( ఇది ప్రవాహముపోవునప్పు డగుధ్వని ననుకరించుశబ్దము. ) చిలుకు......సోనలకున్, చిలుకు = ప్రవహించెడు, పలపలని = ( ప్రవించునప్పుడయ్యెడుచప్పుడు ననుకరించుశబ్దము ) పలపలఁ గారెడు, అలరుబలుఁదేనెసోనలకుౝ = పూవులసంబంధ మైన పెద్దతేనెధారలకు, వానకోయిలలచెలువునన్ = చాతకములయందముచేన్, ( చాతకములువలె నని యర్థము ) కలయౝ = అంతటను, మెలంగు......బులకున్, మెలంగు = సంచరించెడు, అలికులంబుల = తుమ్మెదలగుంపుయొక్క, కల = శ్రావ్యమైన, ఝుంకారంబులకుౝ = ధ్వనులకు, ( ఇది కర్మార్థమున షష్ఠి ) ధ్వనుల నని యర్థము. అనుసారంబులు = అనుసరించు నవి, అగు......నిస్వనంబులునున్, అగు, సమీర = గాలిచేత, పూరిత = నింపఁబడిన, వేణు = వెదుళ్లయొక్క, రంధ్ర = చిల్లులనుం

డి, నిర్గత = బయలు వెడలిన, నిస్వనంబులును౯ = ధ్వనులును, కలిగి = ( ఇచటం గలుగు ధాతువు సకర్మకము ) పొంది, వర్షము గురియునప్పుడు బెగ్గురులువలెఁ బూఁదేనెలకుం దిరుగుతుమ్మెదలు ధ్వనించుచుండఁగా గాలిచేఁ బూర్ణమైనబొంగువెదుళ్లు చేయుధ్వని తుమ్మెదలఝుంకారము ననుసరించి చేయు గానమువలె నుండె నని భావము. వివిధలతాజాలంబులకు౯ = పెక్కుతెఱంగులచెట్లయొక్కయుఁ దీవెలయొక్కయు గుంపులకు౯, ఆలవాలంబులు = పాదులును, ... మని యర్థము మనురపలసముదయంబునకు౯ = తియ్యనిపండ్లసముదాయములకు౯, ఉదరంబును = పుట్టువోటును, శుక .. . వాగంబునకు౯, శుకి = చిలుకలు, క = కోయిలలు, ప్రముఖ = మొదలైన, సకల = అన్నియగు, శకుంత = పక్షులయొక్క, ...ంబునకు౯ = సమూహమునకు౯, ఆధారంబును = ఉనికిపట్టును, శృంగా...ంబులకు౯ = అందమైనపొదరుటిండ్లకు౯, కులభవనంబును = వంశక్రమముగా ... చిరకాలమునుండి యున్న గృహ మని యర్థము. అసు... , ... , కుసుమప్రకరంబునకు౯ = పూలగుమికి౯, ... పట్టులకు౯, కెంపుసొంపులకు౯ = పద్మరాగములయొక్క ..., ఇంపారు ... కలిగించెడు, చివురుజొంపపుఁబట్టులకు౯ = చిగురుటాకులచుట్టతీకములకు౯, విడిపట్టు = కాఁపురమును, గంబురాపచ్చికస్తురిపట్టు, గంబురా = కర్పూరమును, పచ్చికస్తురి = పచ్చికస్తూరియు, పట్టు = వాసస్థానము, ...ంగులతావులకు౯ = జవ్వాదులయొక్క పరిమళములకు, తావును = విడిదియును౯, చలువవెన్నెలచెలువులకు౯ = చల్లనిచంద్రకాంతిపుంజములచక్కఁదనములకు౯, నెలవును = వాసస్థానమును, ఒప్పువన మనుపాత్రసార్థము మావిమొకలగీవికి౯ = మామిడిమొక్కలవైభవమునకున్, దీవియును౯ = పుట్టుచోటును, తలిరాకుఁదేటకు౯ = చివుళ్లకాంతికి౯, మూటయున్ = ముడియును, అయి, నీటలరుముగుదపగిది౯, నీటు = శృంగారముచేతను ( తృతీయార్థమునఁ బ్రథమ) అలరుముగుదపగిది౯ = ప్రకాశించుముగ్ధాంగనరీతిచేతను, ముగ్ధవలె నని యర్థము పరియు నా ...ండ్లప్రాయము గలది ముగ్ధ యనంబడు నవవయోవిలాసంబున౯ = క్రొత్తజవ్వనముయొక్కసొంపుతో౯, తనరి = ఒప్పి, యని ముగ్ధాంగనాపరము అపూర్వములగుపులుఁగులసౌందర్యముతో నని వనపరమైనయర్థము ( వి ) ఖగ బాలాదికో ... అ ... స్నానరీతిన్ = రజస్వలయై స్నానముచేసినదానితెఱఁగుచేత, ఆతత...కంబులకు౯ = మిగులవ్యాపించినపసపుగుఱుతులచేత, పొసఁగి = ప్రకాశించి, ( పసపుచె భూషణాభరణములచేతఁ బ్రకాశించి యని వనపరమైనయర్థము ) ( వి ) అంకో నాటకవిచ్ఛేదే సంఖ్యాయాం యుధి భూషణే సగ్రాహే రూపకే స్థానే మతా వృత్సం ... చిహ్న గోః నా.నా బా

లెంతపోలికన్ = ప్రసవించిన స్త్రీసామ్యము చేతను, లాలితప్రసవసంపదన్ = ముద్దుచే యఁబడిన శిశువుకలిమిచేతను, పొసఁగి = ఒప్పిదమై, లాలిత = మనోహర మైన, ప్రసవ సంపదన్ = పువ్వులయొక్కయేని ఫలములయొక్కయేని కలిమిచేతను, పొసఁగి యని వ నపరము. ఇంద్రజాలంబుచందంబునన్ = గారడముయొక్కరీతిచేతను, మాయచేఁ గ ల్పింపఁబడినవస్తువువలె నని యర్థము విచ్చుమొగ్గలన్ = ఎచ్చటనున్న వచ్చటనే కా న్పించకుండుటతో, ఎసఁగి = ప్రకాశించి, వికసించు చున్న పూమొగ్గలతో, నని వనప ర మైనయర్థము శుభ......వాభిరామంబు, శుభ = మేలైన, వస్తు = పుష్పములు, ఫ లములు మొదలైనవానికి, ప్రభవ = కారణ మగు, విభవ = సంపదచేతను, అభిరామం బు = మనోహర మైనది, అగు, అయ్యారామంబు = అయుద్యానము, ఆరామపట్టాభిషే కసమయంబునుం బోలెన్ = రామునిపట్టాభిషేకకాలమువలె, ప్రశోభిత......కాండం బై, ప్రశోభిత = అలంకరింపఁబడిన, భూమిజా = సీతయు, అశేష = సమస్త మైన, శా ఖామృగ = వానరములయొక్క, కాండం బై = సముదాయమును గలది యై, ( ఇది ప ట్టాభిషేకసమయమునకు విశేషము. ) వనమునకు విశేషణ మైనపుడు, ప్రశోభిత = ప్రకా శించు, భూమిజ = వృక్షములయొక్క, అశేష = సమస్త మైన, శాఖా = కొమ్మలయొ క్కయు, మృగ = జంతువులయొక్కయు, కాండం బై = సముదాయము గలది యై, కాండంబునుం బోలెన్ = బాణమువలె, ( ని ) కాండో స్త్రీ దండ బాణార్వవర్గావస ర వారిషు అ. నూత్నపత్రసుందరం బై = క్రొత్తఱెక్కలచే సుందర మై, ( బాణములు వేగముగఁ బోవుటకై వానికి గ్రద్ద మొదలైనవానియీఁకలు గట్టుట ప్రసిద్ధము. ) క్రొ త్తయాకులచే సుందర మై యని వనపరము దరంబునుం బోలెన్ = శంఖమువలె, బ హుళార్జునప్రభామహిమం బై, బహుళ = అధిక మైన, అర్జునప్రభా = తెల్లనికాంతిచేత ను, మహిమం బై = గొప్పతనము కలదియై, ( ని ) వళక్షో ధవళోర్జునః. అ బహుళ = అధిక మైన, అర్జున = మద్దిచెట్లయొక్క, మహిమం బై = గొప్పతనము గలదియై యని వన పర మైనయర్థము. హిమంబునుంబోలెన్ = మంచువలెన్, అసహ్య.....ధామం బై, అసహ్యమాన = సహింపఁబడని, ఖగరాజ = సూర్యునియొక్క, ధామం బై = తేజస్సు గ లదై, ( ఖగరాజు, ఖ = ఆకాశమున, గ = పోవునట్టివి, ఖగములు = గ్రహనక్షత్రాదులు. వానికి, రాజు = ప్రభువు, గాములఱేఁడు = సూర్యుఁడు ) అసహ్య = సహింపరాని, మా న = సంఖ్యగల, ఎక్కువసంఖ్య గల యని యర్థము. ఖగరాజ = ( చిలుకలు కోయిల లు మొదలైన ) పక్షిశ్రేష్ఠములకు, ధామం బై = వాసస్థానమై యని వనపరము. ( సం ఖ్య లేనిశుకపికాదులు గలది వనము, సూర్యకాంతిని సహింపలేనిది మంచు నని యర్థ ద్వయమునను భావము ఇందు శబ్దమాత్రమున సామ్యము రెంటికిం గలదు. ముందును

వనజాక్షి ప్లక్షగలపోటుల నిట్టూర్చె లేతియుకలను ) రాజధామంబునుంబోలెన్ = రాజ
గృహాముగవలె, సంభరితసారంగంబై, సంభరిత = పోషింపఁబడిన, సారంగంబై = గజ
ములు గలది యై, పోషింపఁబడినతుమ్మెదలు గలది యై యని వనపరము. (ని) సా
రంగ శ్చాతకే భృంగే కురంగేచ మతంగజే. వి. సారంగంబునుంబోలెన్ = ఏనుఁగువ
లె, అధిగత......బై, అధిగత = ప్రాప్తమైన, భూభృత్ = రాజులయొక్క, సన్నిధా
నంబై = సమీపప్రదేశము గలది యై, ప్రాప్తమైనపర్వతసామీప్యము గలది యై యని వ
నపర మైనయర్థము. (ని) భూపాద్రీభూభృతౌ. నా. నా. నిధానంబునుంబోలెన్ =
పాతాళప్రాంతమువలెన్, కనత్క......జన్మంబై, కనత్ = ప్రకాశించుచున్న, కన
క = సువర్ణములయు, రత్న = మణులయు, ప్రత్యగ్ర = నూతన మైన, జన్మంబై = పుట్టు
వు కలదియై, కనత్ = ప్రకాశించుచున్న, కనకరత్న = శ్రేష్ఠ మైనసంపెంగపూలయొ
క్క, ప్రత్యగ్రజన్మం బై = నూతన మైనయుత్పత్తి కలది యై యని వనపర మైనయర్థ
ము, (ని) కనకం కాంచనే నాగ దత్తూరే నాగకేసరే చంపకే. నా. నా. అగ్రజ
న్మసముదాయంబునుంబోలెన్ = బ్రాహ్మణసముదాయమువలె, గాయత్రీ......లోకం
బై, గాయత్రీ = గాయత్రి యను పేరు గలమంత్రముయొక్క, జప = ఆవృత్తిచేత, ఆసక్త =
ప్రాప్త మైన, ఆలోకం బై = తేజము గలది యై, ( ఒక్కదానినే మఱల మఱల స్మ
రించుట యావృత్తి. ) గాయత్రీ = చండ్రచెట్లయందును, జపా = మంకెనపూలయం
దును, సక్త = తగులుకొన్న, ఆలోకం బై = కాంతి గలది యై యని వనపరము. (ని)
గాయత్రీ బాలతనయః ఖదిరో దంతధావన యనియును, ఓడ్రపుష్పం జపా యనియు
నమరుఁడు. లోకంబునుంబోలెన్, వర్ధమానప్రాణి .....బై, వర్ధమాన = పెరుగుచున్న,
ప్రాణిచయ = జంతుసముదాయమునకు, ఆనందకంబై = సంతోషమును గలిగించునది
యై, వనపర మైనయర్థము నిదియే నందకంబునుంబోలెన్ = విష్ణుఖడ్గమువలె, మాధవా
లంకృతంబై = కృష్ణున కలంకారమై, వసంతకాలముచే నలంకరింపఁబడినదియై యని వన
పర మైనయర్థము. (ని) శంఖో లక్ష్మీపతేః పాంచజన్య శ్చక్రం సుదర్శనః కౌమో
దకీ గదా ఖడ్గో నందకః కౌస్తుభో మణిః అ ( రామపట్టాభిషేకమునుంబోలె ననున
ది మొదలింతదనుక శ్లేషప్రతిభోత్థాపితోపమాలంకారము. ) మన్మథావేష్టితం బయ్యు
ను = మరునిచేఁ బ్రవేశింపఁబడిన దయ్యును, నీలకంఠసమన్వితం బై = శివునితోఁ గూడి
నదియై, నెలగలచే నిండఁబడినదియును నెమిళ్లతోఁ గూడినదియు నని యర్థాంతరము.
ము న్నింద్రునిప్రార్థనచేఁ బార్వతీపరమేశ్వరులకు సంఘటనము సేయ యత్నించి మ
రుఁ డతనినేత్రాగ్నిచే దగ్ధుఁ డయ్యె నని ప్రసిద్ధము. పరస్పరవిరుద్ధు లగువా రిద్ద ఱొ
క్కచో నున్నా రని చెప్పుటచే విరోధము ప్రాప్తింపఁగా దాని నర్థాంతరమునఁ బరి

హరించుటచే నిట విరోధాభాసాలంకారము ముందును మొదటియర్థమునఁ బ్రాప్తిం చినవిరోధమును రెండవయర్థమునఁ బరిహరించిన నిదియే యలంకారమగును. ఈయారామము పెక్కులగువెలగచెట్లును, నెమిళ్లను గలది యని ఫలితము. ఈయర్థమునందు 'సయ్యును' అనునది సముచ్చయముగా గ్రహింపవలెను. దేవవల్లభవిరాజమానం బయ్యును=ఇంద్రునిచే విలసిల్లుచున్నది యయ్యును, బహుపలాశోదంచితంబై, బహు=పెక్కండ్రగు, పలాశ=రక్కసులచేత, ఉదంచితంబు=అతిశయించినది, ఐ, ఇంద్రుఁడును రక్కసులును బరస్పరశత్రులు గాన వీరిద్దఱు నొక్కచో నున్నా రనునీయర్థమున విరోధము రాఁగా, దేవ .యుక్ష, దేవవల్లభ=పున్నాగవృక్షములచే, విరాజమానం బయ్యును=విలసిల్లుచున్నదియును, బహు.....బై, బహు=పెక్కులగు, పలాశ=మోదుగులచే, ఉదంచితంబై=విజృంభించినది యై యనునర్థముచేఁ బరిహారము (ని) పున్నాగే పురుష స్తుంగః కేసరో దేవవల్లభ యనియును, పలాశేకింశుకః పర్ణ. యనియు నమరుఁడు. వితత..... బయ్యును, వితత=విశేషముగ వ్యాపించిన, కీచక=సింహబలాదులచే, సంవృతం బయ్యును=ఆవరింపబడిన దయ్యును, సంతత...సంచారంబై, సంతత=ఎడతెగని, అనిలడింభక=(వాయుపుత్త్రుఁడగు) భీమునియొక్క సంచారంబై=సంచారము కలది యై, భీమునిచేఁ గీచకు లొకకారణమున మృతులైరి గాన నీయర్థమున విరోధము సంభవింపఁగా, విస్తారమైనవెదురుటడవులచే నావరింపఁబడినదియు నెడతెగనిమందమారుతము గలదియు ననురెండవయర్థమునఁ బరిహారము. పూతనారమ్యంబయ్యును=పూతన యనురక్కసిచే మనోహరమైన దయ్యును, కృష్ణసారప్రకాశమానం బై=కృష్ణునిబలముచేఁ బ్రకాశించునది యై, పూతన యనురక్కసి కృష్ణునిచిన్నతనమున నతనిఁ జంపఁ గంసునిచేఁ బ్రేరితయై బాలెంతరాలై వచ్చి విషముతోఁ గూడినపాలిచ్చుచు శ్రీకృష్ణునిచే మృత యయ్యె నని భాగవతము పూతన యిదివఱకే మృతయయ్యెఁ గాన విరోధము పూతనారమ్యం బయ్యును=కరకచెట్లచేత మనోహర మయ్యును, కృష్ణసారప్రకాశమానం బై=జింకలచేఁ బ్రకాశించునది యైయని పరిహారము. (ని) పూతనామృతా హరీతకీ హైమవతీ యనియును, కృష్ణసార రురు న్యంకు రంకు శంబర రౌహిషా యనియు నమరుఁడు. శంఖజాతస్ఫురితం బయ్యును=ద్రోణాచార్యుచేఁ బ్రకాశింపఁబడిన దయ్యును, విజృంభిత . బై, విజృంభిత=విజృంభించిన, మహావిర=గొప్పపరాక్రమశాలి యగు, ద్రుపదం బై=ద్రుపదరాజు గలది యై, మునొక్కకార్యార్థము ద్రోణుఁడు సహాధ్యాయి యగుద్రుపదు నాశ్రయింపం బోయి యతనిచేతం బరిహాసితుం డై తనశిష్యుఁ డగునర్జునునిచే నతని బద్ధుఁ దెప్పించి తనపాదములఁ బడవేయించుకొని పిమ్మట ననుగ్రహించి విడిచె నని భారతము ఇ

ట్లు ద్రోణాచార్యునిశిష్యునిచే నోడింపఁబడినవాఁ డాయన యున్నచో విజృంభించె ననుటచే విరోధము రా, కుంభజాతస్ఫురితం బయ్యును = అగస్త్యవృక్షములయొక్క (అగిసెచెట్లయొక్క) ప్రకాశము కలదియును, విజృంభిత.....బై, విజృంభిత = అతిశయించిన, మహాత్ = పెద్దవి యగు, నీగదుశ్రీ = ఎఱ్ఱమద్దిచెట్లను, పదంబై = స్థానంబైయని పరిహారము (ని) నదీసర్జౌ నీరతరు రింద్రద్రుః కకుభోర్జునః అ లలితో.....బై, లలిత = సుందర మైన, ఉత్కలికా = మొగ్గలతో, కలిత = కూడుకొనిన, దివ్య = స్వచ్ఛ మైన, మహిళా = పేరింకణపుఁదీవలయొక్క, గణంబు = సముదాయము కలది, వి, లలిత = సుందర మైన, ఉత్కలికా = వేడుకలతో, కలిత = కూడుకొనిన, దివ్యమహిళా = దేవతాస్త్రీలయొక్క, గణంబు = సముదాయము కలది, అగుచున్, (ని) శ్యామాతు మహిళాహ్వాయా యనియును, వనితా మహిళా తథా యనియు నమరుఁడు సుమధురసాలాన్వితంబై, సు = మిక్కిలి, మధు = మకరందముగల, రసాలాన్వితంబై = మావులతోఁ గూడినదియై, సుమధురసాలాన్వితంబగుచు, సుమధర = పువ్వులను ధరించిన, సాలాన్వితంబు = చెట్లు కలది, అగుచున్, మకరందము గలమావులును, పూలు గలయితరవృక్షములు గలదియు నని యర్థము వానప్రస్థనివాసం బై = ఇప్పచెట్ల కునికిపట్టై, వానప్రస్థనివాసం బగుచున్ = తపము చేయుచునుండు యాశ్రమమువారి కునికిపట్టై పొలుచువనంబునన్ = ప్రకాశించెడువనమునందున్, ముందరిపద్యమునందలిక్రియతో నన్వయము.

క॥ లలనావాక్కులనాకల
కలనానాశుకపికాళి ♦ కళరవరవసం
కులనాతిదూరవీణా
కలనాదం బపుడు హరికిఁ ♦ కటకి విన వచ్చెన్॥ 78

లలనా..... నాదంబు, లలనా = స్త్రీలయొక్క, వాక్ = పలుకులయొక్క, కలనా = ప్రాప్తిచేత నైన, కలకల = గొప్పధ్వనితోడను, నానా = పెక్కువిధములగు, శుక = చిలుకలయు, పికాళి = కోయిలలయు, కళరవ = పావురములయు, రవ = ధ్వనితో, సంకుల = కలసినదియు నగు, నాతిదూర = మిగుల దూరమందుఁ గాని, వీణాకలనాదంబు = వీణయొక్కయస్ఫుట మైనమధురధ్వని, ఒకటి, అపుడు = ఆకాలమున, హరికిన్ = కృష్ణునకున్, విన నయ్యెన్ = విన వచ్చెను,

క॥ వీనులకుఁ దనదుమురళీ
గానముకన్నను వినోద ♦ కర మై యమృతం
బానినక్రియ నానినదం
బానందము గ్రుమ్మరింప ♦ హరి యిటు పలికెన్॥ 79

ఆనినదంబు = ఆధ్వని, వీనులకున్ = చెవులకు, తనదుమురళీగానముకన్నన్ = తన సంబంధమైనపిల్లఁగ్రోవివలనిగానముకంటెన్, వినోదకరమై = వేడుకంజేయునది యై అమృతంబు, ఆనినక్రియన్ = అమృతంబును ద్రావినట్లు, ఆనందము = సంతసమును, గ్రుమ్మరింపన్ = ప్రకటింపఁగాన్, హరి = కృష్ణుఁడు, ఇటు = ఈక్రిందిప్రకారము, పలికెన్ ;

ఉ॥ ఈవనకోనలోన నిపు ♦ డేనళినాననలో విపంచికా
గానము లోకమోహనము ♦ గా నొనరించుచు నున్నవార ల
చ్చానలయున్నచో ప్పరసి ♦ చయ్యన వచ్చెద నుండుఁ డంచు శ్రీ
జాని రథంబు డిగ్గి కడు ♦ సంభ్రమ మొప్ప రహస్యవైఖరిన్॥ 80

ఈవనకోనలోనన్ = ఈపూలు గలకోనయందున్, ఏనళినాననలో = ఏస్త్రీలో, (నళిన = పద్మమునుంబోలిన, ఆనన = ముఖ మెవతెకుఁ గలదో యది, నళినానన = తామరపువ్వుం బోలినమోము గలది) ఇపుడు = ఈకాలమునన్, విపంచికాగానమున్ = వీణాగానమును, లోకమోహనము = జనులకుం బారవశ్యము, కాన్ = కలుగునట్లు, ఒనరించుచు నున్నవారు = పాడుచున్నవారు, అచ్చానలయున్నచోప్పు = ఆస్త్రీలున్నజాడను, అరసి = తెలిసికొని, చయ్యనన్ = వేగముగాన్, వచ్చెదన్, ఉండుఁడు = (మీరిచటనే) వసింపుఁడు అంచున్ = ఇట్లాజ్ఞ యిచ్చుచున్, శ్రీజాని = కృష్ణుఁడు, (ఎవ్వనికి లక్ష్మిభార్యయో యతఁడు) రథంబున్ = అరదమునుండి, డిగ్గి = దిగి, సంభ్రమము = ఆదరము, ఒప్పన్, రహస్యవైఖరిన్ = రహస్యమైనపద్ధతితో, ముందుపద్యముతో నన్వయము.

ఉ॥ పూవులతావులం జెలఁగు ♦ పొన్నలగున్నలఁ దిన్నె నైనబ
ల్మావులమోవులం గలసి ♦ మల్లిక లల్లినగొప్పకప్రపుం
దీవులతావులం జలువ ♦ దెమ్మెర గ్రమ్మఁగ వీవ సమ్మద
శ్రీవలమానమానసము ♦ చే నరిగెన్ వనవీథిలోనికిన్॥ 81

పూవులతావులన్ = పుష్పములయొక్క గంధములచేతను, చెలఁగుపొన్నలగున్నలన్ = ప్రకాశించెడుపొన్నమొక్కలతోను, తిన్న నైనబల్మావులన్, తిన్నన = చక్కఁదనము, ని = పొందిన, ( ఇది నగుధాతువు సకర్మకము. ) బల్మావులన్ = పెద్దమామిడిచెట్లతోడను, మోవులన్ = మోవిచెట్లతోడను, కలసి = కూడికొని, మల్లికలు = మల్లితీఁగెలు, అల్లిన.....తావులన్, అల్లిన = అల్లుకొన్న, గొప్ప = పెద్దవి యగు, కప్రపుందీవులతావులన్ = కప్పురపుందిన్నెలు గలస్థలమునుండి, చలువతెమ్మెర = చల్లనివాయువు, క్రిమ్మలన్ = మఱలమఱలన్, వీవన్ = విసరుచుండఁగా, వనవీథిలోనికిన్ = వనపఙ్క్తిమధ్యమునకున్, సమ్మద.....చేన్, సమ్మదశ్రీ = సంతోషాతిశయముచే, తలమాన = భ్రమియించుచున్న, మానసము చేన్ = మనస్సుచేన్, అరిగెన్ = పోయెను. ( దీనికి వెనుకటిపద్యమునందలి శ్రీజాని కర్త.)

సీ॥ పువ్వుఁబోదల్ సొర మేనఁ ♦ బొదలుపుప్పొడిరంగు
పసపునలుంగుక్రొం ♦ బస నెసంగ
నడచుచో మకుటల ♦ గ్నం బైనసంపంగి
నన పైఁడిబాసికం ♦ బు నెత్తిఁ దనర
ముం జేతమకరంద ♦ మున నంటునునుఁదీఁగె
నవ్యమంగళకంక ♦ ణముగ నొనరఁ
బక్వమై రాలువు ♦ ష్పచ్ఛటా కేసరం
బులు హారిద్రాక్షతం ♦ బులుగ నమరఁ
గుదురుపెద నంటుకిసలయ ♦ కుట్మలముల
వరుస నవరత్నహారభా ♦ స్వరతఁ బూన
నవుకు భద్రాప్తి కరుగుపీ ♦ తాంబరుండు
క్రొత్త పెండ్లికుమారుని ♦ కొమరుఁ దెలిపె॥ 82

పువ్వుఁబోదల్ = పూవులయొక్క పొదలను, ( పూవులు గలతీఁగయిండ్ల నవియర్థము. ) చొరన్ = ప్రవేశింపఁగాన్, ( దీనికిం బీతాంబరుండు కర్త ) మేనన్ = శరీరమునందున్, పొదలుపుప్పొడిరంగు = కలిగెడుపరాగకాంతి, పసపునలుంగుక్రొంబసన్ = పసపునలుఁగుయొక్క క్రొత్తకాంతివంటికాంతిచేతను, ( కాంతివలె నని యర్థము ) ఎసంగన్ = ప్రకాశింపఁగాన్, కృష్ణుఁ డాశ్రీ లున్నస్థలమును వెదకుచుఁ బోవునపుడు

దారి నున్న పొదలయందలి పూవులలోని పరాగమా యన దేహము నంటి పెండ్లికుమారునకు వివాహములోఁ గావించు పసపునలుఁగువలె నుండఁగా నని తాత్పర్యము క్రొత్త + పస = క్రొంబస. క్రొత్త శబ్దమున కాద్యక్షర శేషము నగునపుడు కొన్నియెడల నుగాగమంబును గొన్ని యెడల మీఁది [illegible] ద్విత్వంబు నగు. [illegible] క్రొన్ + పసిడి' యని ప్రాప్తించఁగా [illegible] సరళము లగును ఆదేశసరళములకు ముందున్న ద్రుతమునకు బిందుసంశ్లేషములు విభాష నగు నను సూత్రములచే నీరూపము సిద్ధించెను. సమాసంబు గావున ద్విత్వంబును హ్రస్వము నొందఁబడి గావున నలుగున్నయు వ్యవస్థితవిభాషచే సంశ్లేషంబు సమ్మితంబునకుఁ గలుగ దని బాల వ్యా. సం.) నడచుచోన్ = నడచునప్పుడు, మకుటలగ్నంబు = కిరీటము నంటుకొన్నది, ఐనసంపఁగినన = ఆయుఃసంపఁగిపువ్వు, పైఁడిబాసికంబు నెతెన్ = బంగారుబాసికమునందముచేన్, (పెండ్లికుమారునకుం బెండ్లికూఁతురుకును వివాహకాలమున నొసటఁ గట్టెడు నాభరణవిశేషము) తనరన్ = ప్రకాశింపఁగాన్, ముంజేతన్ = ఎడమచేతియందున్, మకరందమునన్ = పూదేనెచేతను, అంటుకొనుచుండఁగ = తగిలియున్న సన్నతీవ, నవ్యమంగళకంకణముగన్, నవ్య = నూతనమైన, (ఇది కంకణమునకు విశేషము) మంగళ = పెండ్లిసంబంధమైన, కంకణముగన్ = కడియముగాన్, ఒనరన్ = ప్రకాశింపఁగాన్, (కృష్ణుఁడు పోవునప్పుడు ముంజేతియందుఁ బూఁదేనెతోఁ గూడి యంటికొన్న సన్నతీఁగ పెండ్లియప్పుడు గట్టిన కంకణమువలె భాసింపఁగా నని యర్థము) పక్వమై = ముదిరినవియై, రాలు పుప్పొడిగా కేసరంబులు = పడియెడు పువ్వులగుంపులోని దారములు, (కింజల్కములు) హరిద్రాక్షతంబులుగన్ = పసుపుతోఁ గూడిన యక్షతలుగన్ అమరన్ = ఒప్పఁగాన్, నుదురుపెడన్ = నొక్కనివత్తమునన్, అంటు .. వరుస, అంటు = తగిలియున్న, కిసలయ = చిగుళ్లయొక్కయు, కుట్మల = మొగ్గలయొక్కయు, వరుస = పంక్తి నవరత్నహారభాస్వరతన్ = తొమ్మిదివిధము లగురత్నములతోఁ గూర్చినదండయొక్క ప్రకాశమును, పూనన్ = ధరింపఁగాన్, అపుడు = ఆకాలమున, భద్రాప్తికిన్ = శుభముఁ బొందుటకు (భద్ర యనుకన్యను సంపాదించుటకు ననియు నర్థము.) అనుగుపీతాంబరుండు = పోవు కృష్ణుఁడు, (పీతాంబరుండు = పచ్చనిపట్టువస్త్రము కలవాఁడు) క్రొత్తపెండ్లికుమారునికొమరున్ = క్రొత్తపెండ్లికొమరునియందమును, తెలిపెన్ = ప్రకటించెను. మీఁదటిలక్షణములచేఁ గృష్ణుఁడు పెండ్లికొమరుఁడువలె నుండె నని భావము ఇందుఁ బుప్పొడిరంగు పసపునలుంగు క్రొంబస చెసంగ నగు మొదలైనచోట్ల నన్యధర్మము లన్యస్థలమున సంభవింపమిచే సదృశధర్మము లని యర్థము ప్రాప్తించుఁ గాన నిదర్శనాలంకారము.

మ॥ గళితంబై ధరఁ బడ్డరోహణపుశృంగంబో యనం బైఁడిగ
చ్చులనిద్దాజిగితోడ దివ్యమణిరో ♦ చుల్ దిక్కులం బర్వ ను
జ్జ్వలమై యొప్పెడురత్నమందిరముప ♦ జ్జం ద్రాక్షపందిళ్లలో
నెలరాతిన్నియమీఁద నెచ్చెలులలో ♦ నిండారుచెల్వొప్పఁగాఁ.

గళితంబై = జాఱినదియై, ధరన్ = భూమియందున్, పడ్డరోహణపుశృంగంబో యనన్ = పడినరోహణపర్వతశిఖరమో యనునట్లు, ( విరిగి క్రిందఁ బడినరోహణపర్వతశిఖరమువలె నని యర్థము. ) పైఁడి ....జిగితోడన్, పైఁడి = బంగారముయొక్క, గచ్చుల = పూఁతయొక్క, నిద్దా = నునుపుగల, జిగితోడన్ = కాంతితోడను, దివ్యమణిరోచుల్ = స్వచ్ఛమైన ( అందమైన ) మాణిక్యపుఁ గాంతులు, దిక్కులన్ = దిశలందున్, పర్వఁగాన్ = వ్యాపింపఁగాన్, ఉజ్జ్వలమై = మిగులఁ బ్రకాశించునదియై ఒప్పెడురత్నమందిరముపజ్జన్ = బాగుగ నుండెడురతనముల(తోఁ గట్టఁబడిన) యింటి సమీపమునన్, ద్రాక్షపందిళ్లలోన్ = ద్రాక్షతీఁగలతో నల్లుకొన్న పందిళ్లనడుమునను, నెలరాతిన్నియమీఁదన్ = చంద్రకాంతపురాలయరుఁగుమీఁదను, నెచ్చెలులలోన్ = చెలికత్తియలమధ్యమునందున్, నిండారుచెల్వు = పూర్ణమైనచక్కఁదనము, ఒప్పఁగాన్ = ప్రకాశింపఁగాన్, ముందుపద్యముతో నన్వయము

సీ॥ బలుకెంపురుచిపెంపు ♦ పగడంపుజిగిసొంపు
సగు కెంపుటధరంపు ♦ సొగసుదాని
ననచిల్కుదొరముల్కు ♦ లనఁ గొల్కులను జిల్కు
నును బెళ్కుకినుఁదళ్కు ♦ లొనరుదాని
నలకాలఘనజాల ♦ హరినీలముల నేలఁ
గలనీలకచలీలఁ ♦ గలుగుదాని
లలి నబ్బురపుగుబ్బ ♦ లులయు బ్బడఁచి గుబ్బ
తిలునిబ్బరపుగుబ్బ ♦ లలరుదాని
మించుచెలువూని విణవా ♦ యించుదాని
దాని కది గాని సరి లేని ♦ మేనిదాని
దానినడకలదానిఁ గ ♦ డానిబొమ్మ

బోనియొకమానినిని రమా ♦ జాని గనియెఁ॥ 84

రమాజాని = కృష్ణుఁడు, బలుకెంపురుచిపెంపు = పెద్దదియగు కెంపుయొక్క కాంత్యతిశయమును, పగడంపుజిగిసొంపు = పగడములకాంతియొక్క చక్కఁదనమును, నగు......దాని, నగు = పరిహసించెడు, కెంపుటధరంపు = ఎఱ్ఱని పెదవియొక్క, సొగసుదానిన్ = సొగసు కలదానిని, ననచిల్కు......లనన్, ననచిల్కుదొర = మన్మథునియొక్క ( నన = పుష్పమను, చిల్కు = బాణముగల, దొర = ప్రభువు. ) ములుకులనన్ = బాణములువలెన్, కొలుకులన్ = కంటితుదలయందున్, చిల్కుననుబెళుకు కనుదళుకులు, చిల్కు = వ్యాపించెడు, నను = చక్కని, బెళుకు = చలించెడు, కనుఁదళుకులు = కన్నులకాంతులచేతన్, ( తృతీయార్థమునఁబ్రథమ ) ఒనరుదానిన్ = ప్రకాశించుదానిని, అలకాల......లన్, అల = ప్రసిద్ధమైన, కాలఘనజాల = వర్షాకాలపు మేఘములసముదాయమును, హరినీలములన్ = ఇంద్రనీలపురాలను, ఏలఁగల......లీలన్, ఏలఁగల = రక్షింపశక్తి గల, నీలకచలీలన్ = నల్లనివెండ్రుకలసొగసుతో, కలుగుదానిన్, మేఘము లనునీలపురాలనుంబోలినశిరోజములు గలదాని యని యర్థము. లలిన్ = చక్కఁగా, అబ్బురపుగుబ్బలులయుబ్బు, అబ్బురపు = వింతయైన, గుబ్బలుల = పర్వతములయొక్క, ఉబ్బు = గర్వమును ( అతిశయమును ) అడఁచి = నివారించి, గుబ్బతిలు నిబ్బరపుగుబ్బలు, గుబ్బతిలు = అతిశయించెడు, నిబ్బరపు = నిండైన, గుబ్బలు = కుచములచేత, అలరుదానిన్ = ప్రకాశించుదానిని, మించుచెలువు = అధికమైనయందమును, ఊని = ధరించి, వీణన్, వాయించుదానిన్, దానికిన్ = ఆమెశరీరమునకు, అదిగాని = ఆమెశరీరమే కాని, సరి లేనిమేనిదానిని = సాటి లేనిదేహము గలదానిని, ( అనన్వయాలంకారము. ) దానినడకలదానిన్, దాని = ఏనుఁగుయొక్క, నడకలదానిన్ = నడకలవంటినడకలు గలదానిని, ( నిదర్శనాలంకారము. ) ( దానము = ఏనుఁగుమదము. అది కలది దాని ) ( ని ) మదోదానం అ. కడానిబొమ్మఁబోనియొకమానినిని = బంగారుబొమ్మఁ బోలినయొక స్త్రీని ఉపమాలంకారము. కనియెన్ = చూచెను

క॥ అతఁ డటు కని తతశంపా
లతయో ధృతజీవకనక ♦ లతయో వనదే
వతయో యని యరు దందుచు
లతికావృతిచాటున న్మె ♦ లఁగి మదిలోనన్॥ 85

అతఁడు = ఆకృష్ణుఁడు, అటు = ఆప్రకారము, కని = ( ఆబాలికను ) చూచి,

తతశింపాలతరూ = విశాలమైనమొలపుఁడీవరూ, ధృత......లతరూ = ధరింపఁబడిన చైతన్యము గలబంగారుతీవరూ, వనదేవతరూ = వనాభిమానిదేవతరూ, అని = అని కాని, అరుదు = ఆశ్చర్యమును, అందుచున్ = పొందుచున్, లతికావృతిచాటునన్ = తీవలవెలుగుచాటున, ( చేని కేని తోఁట కేని చుట్టుచేయునావరణము వృతి, వెలుగు ననంబడు ) మెలఁగి = ఉండి, మదిలోనన్ = మనసునందున్. ఇది 118 వ పద్యములోని ‘ఎన్ని’ యనుసమాపకక్రియతో నన్వయించును. సందేహాలంకారము.

సీ॥ ఈపద్మపాణిఁ జే • రెదఁ గూర్పఁజాలిన
పురుషోత్తమునిదె సు • భోగగరిమ
ఈయార్య నెమ్మేన • నెనసినరాజశే
ఖరునిదె నూవె భా • సురవిభూతి
ఈహంసయానతో • నెసఁగుప్రబోధినా
యకునిదె నూచి • నుకృతమహిమ
ఈనవపద్మినితో • ననురక్తి నొం
దినయినునిదె నూవె • ఘనతపంబు
కనివిని మెఱుంగ మిమ్మజ్జ • గముల నున్న
నరగరుడసిద్ధసాధ్యకి • న్నరసురాహి
రాజకన్యకలందు నీ • రాజవదన
కెన యగుమిటారి నిదియె మా • రునికటారి॥ 86

ఈపద్మపాణిన్ = ఈయింతిని, ( తామరపూవులం బోలి-చేతులు గలదాని యని యర్థము ) లక్ష్మి యని యర్థాంతరము ( పద్మము హస్తమునందుఁ గల దని యపు డర్థము ) పేరెదన్ = విశాలమైనవక్షమునందున్, కూర్పన్ = ఆలింగనము చేసికొనుటకు, ధరించుట కని యర్థాంతరము. చాలినపురుషోత్తమునిదే = తగినపురుషశ్రేష్ఠునిదె, తగినవిష్ణునిదే యని యర్థాంతరము. సుభోగగరిమ = సుఖాతిశయము ఈమెం గౌఁగిలించినవాఁడే పురుషశ్రేష్ఠుఁ డనియును, నీమె నురమునఁదాల్చినవాఁడే శ్రీమహావిష్ణు వనియును గ్రమముగ భావము ఈయార్యన్ = ఈపడుచును, పార్వతి యని యర్థాంతరము నెమ్మేనన్ = శరీరమునందున్, ఎనసినరాజశేఖరునిదే = పొందినరాజశిరోభూషణముదే ( రాజశ్రేష్ఠునిదే ) శివునిదే యను యర్థాంతరము. ( రాజ = చంద్రుఁను,

శేఖర=శిరోభూషణ మెవనికో యతఁడు, రాజశేఖరుఁడు=శివుఁడు ) చూపె=చూడుము భాసురవిభూతి=ప్రకాశించుచున్నభాగ్యము ఐశ్వర్య మని శివపరము. ఈకాంతఁ గూడినరాజుదే గొప్పభాగ్య మనియును భాగ్వతిని శరీరమునఁ దాల్చినశివునిదే యధికైశ్వర్య మనియును భావము ఈహంసయానతోన్=ఈస్త్రీతోన్, ( హంసనడకలం బోలిననడకలు గలది ) సరస్వతి యని యర్థాంతరము ( హంసయే వాహనముగాఁ గలది ) ఎనఁగుపద్మజాధినాయకునిదె=కూడియుండురాజుదే, చూ=చూడుము బ్రహ్మదే యని యర్థాంతరము చిరసుకృతమహిమ=శాశ్వతమైనపుణ్యాతిశయము. స్థిరమైనసృష్టిమహిమ యని యర్థాంతరము ఈమెం గూడినరాజు మిగులఁ బుణ్యాత్ముఁ డనియు సరస్వతిం గూడినబ్రహ్మగే సృష్టిమహిమ యనియును భావము

ఈనవపద్మినితోన్=ఈపద్మినీజాతిజవ్వనితోన్, క్రొత్తతామరలతతో నని యర్థాంతరము అనురక్తిన్=ప్రేమతోన్, ఒందినయినునిదె=స్నేహము చేసినరాజుదే, సూర్యునిదే యని యర్థాంతరము చూపె, ఘనతపంబు=అధికమైన తపస్సు, గొప్పతేజ మని యర్థాంతరము ఈపద్మిని ననురాగమునఁ గూడినరాజు చేసినదియే గొప్పతప స్సనియును, పద్మముల వికసింపఁజేయుసూర్యునిదే గొప్పతేజ మనియును భావము, ఇమ్ముల్లోకములన్=ఈమూడులోకములయందున్, ఉన్న కన్నెలందున్, ఉన్న. నర=మనుష్యులయొక్కయు, గరుడ=గరుడులయొక్కయు, సిద్ధ=సిద్ధులయొక్కయు, సాధ్య=సాధ్యులయొక్కయు, కిన్నర=కిన్నరులయొక్కయు, సుర=దేవతలయొక్కయు, అహి=నాగులయొక్కయు, రాజ=రాజులయొక్క, కన్యకలందున్=పడుచులందున్, ఈరాజవదనకున్=ఈస్త్రీకిన్, ( చంద్రునిం బోలినముఖము గలదానికిన్ ) ఎనయఁగుమిటారికిన్=సమాన మగునంతటిది, ఏది=మాచి, విని=ఆలకించి, ఎఱుంగము=తెలియము ఇదియు=ఈచిన్నదియు, మారునికటారి=మన్మథునాయుధము మన్మథునాయుధమువలె యువజనులం బీడించునీముగ్ధ సముల్లోకముల నీడు లే దని భావము ఇందుఁ బ్రకృతాప్రకృతశ్లేషాలంకారము ప్రాచీనులు దీనినే శబ్దశక్తిమూలధ్వని యందురు ఈకన్నెగును లక్ష్మ్యాదులకును నీమెం బెండ్లిచేసికొనువానికిని విష్ణ్వాదులకును నౌపమ్యము గమ్యము

మ॥ నెలతోడం దరమోముమోము, కళల ♦ న్లేనవ్వు లేనవ్వు ; మిం
చులచాంచల్యముచూపుచూపునెఱి, మిం ♦ చుంగుబ్బలింగుబ్బలిం
పుల మేల్దీఁగెనగానుగాను, సరసం ♦ పున్నోమిమూమోవి, వ

ర్త్రిలుమీనాంకునిచేతిహేతిగనయారే! యారె! యొయ్యారికిన్॥

ఒయ్యారికిన్ = ఈయందకత్తెకున్, (ఇచటన్ గువష్ఠీకము సంబంధార్థమున వచ్చెను గాన నందకత్తెయొక్క యని యర్థము. మఱియు నిపద మెల్లవాక్యములతో సంబంధించును) మోము = ముఖము, నెలకోడన్ = చందురునితో, తరము = సామ్యమును, ఓమున్ = రక్షించును ఈమె మొగము చందురునిం బోలు నని యర్థము లేవవ్వులే = (ఈమె) మందహాసములే, కళలన్ = చంద్రికళలను (వెన్నెలల నని యర్థము) నవ్వున్ = పరిహసించును చూపుసెజ్జ = దృష్టిసౌందర్యము, మించుమలచాంచల్యము = మెఱుములయొక్క చాపల్యమును, చూపున్ = కనుపఱచును చూపులు మెఱుపులవలె మిగులం జంచలము లని యాశయము గుబ్బలు = స్తనములు, ఇంపులన్ = సంతోషముతో, (బహువచన మవివక్షితము) గుబ్బలిన్ = పర్వతమును, మించున్ = అతిశయించును. కౌను = నడుము, మేల్తీగెవగి = ప్రశస్తమైనలతయొక్క విలాసమునుంబోలినవిలాసము కలది, ఔన్, మోవి = పెదవి, సరసంపుజ్జమోవి = మనోహరమైన మోవిచెట్టుయొక్క చిగురు సరసంపు + మోవి = సరసంపుమోవి, ఈదంత స్త్రీసమంబులకుం బుంపులకుం బరుషసరళంబులు పరంబు లగునపుడు సుగాగమం బగు నన్న సూత్రమునొద్ద స్థిరము పర మగునపు డోకానొకచో నియోగమంబు గానంబడియెడు నని బా సం అరె = గోమావళియే, మీనాంకునిచేతిహేతిగన్ = మన్మథునిచేతియందలిఖడ్గముగన్, వర్తిలున్ = ఉండును హేతిశబ్దమునకు ధనుస్సు మొద లగునవి యన్నియుం జెప్పవచ్చుం గాని ప్రకృతమున నుపమేయమునకుం దగినది కావున ఖడ్గమనియే యర్థము అయారె! = ఎంతవింత! ఇందు రూపకము, నిదర్శనయు, నుపమయు ననునలంకారములు గలవు

ఉ॥ మించులమించులున్ మఱియు • మేల్మిపసిండియుఁ జంద్రసార మ
బ్జాంచితసౌరభంబు నివి • యన్నియు నొక్కట మేళవించి య
క్కాంచనగర్భుఁ డాత్మమతి • కౌశల మందఱు మెచ్చ దీని ని
ర్మించెనె కాక యిట్లు నెఱి•మించునె యీగొముఁగుచాయ యేయెడన్.

అక్కాంచనగర్భుఁడు = బ్రహ్మ, కాంచనము (బంగారము) గర్భమునఁ గలవాఁడు మించులమించులున్ = మెఱుములధాళధళ్యములను, మఱియున్ = ఇంకను, మేల్మిపసిండియున్ = ప్రశస్తమైనబంగారమును, చంద్రుసారము = చంద్రునిలోనిచెవ్వను, అబ్జాంచితసౌరభంబు, అబ్జ = పద్మముయొక్క, అంచిత = పూజింపఁబడిన, సౌర

ళంబు = పరిమళమును, ఇవి యన్నియుఁ = మీఁదటివస్తువుల నన్నిటిని, ఒక్కటన్ = ఏకకాలమున, మేళవించి = కూర్చి, ఆత్మమతికౌశలము = తనబుద్ధినైపుణ్యమును, అందఱు = ఎల్లరు, మెచ్చన్ = స్తుతించునట్లు, దీనినిన్ = ఈయింతిని, నిర్మించెనె = చేసెనే, (ఏ యేవార్థకము.) కాక = ఇట్లు కానియెడను, ఈ మెయిచాయ = ఈశరీరకాంతి, ఏమెడన్ = ఎప్పటనైనను, ఇట్లు = ఈప్రకారము, నెఱిన్ = చక్కఁదనముతో, మించునె = అతిశయించునా? అతిశయింప దనియర్థము.

బ్రహ్మ మంచిచాయ గలవస్తువులను బరిమళమును మేళవించి యీమెను దనబుద్ధిచాతుర్యమున జనులు మెచ్చునట్లు సృజియించి యుండును కానియెడ నిట్టిచాయ యిట్లు సంభవించు నని తాత్పర్యము ఉత్ప్రేక్షాలంకారము

క॥ తారకలు ధృతపునర్భవ
చారుతలై యాశ్రయించె • సతియడుగులఁ గా
కారయఁ బుష్కరపదగతి
చే రహిఁ నెటు లొప్పు సదు • చిస్ఫూర్తి దగన్॥ 89

తారకలు = నక్షత్రములు, ధృత .. ..చారుతలై, ధృత = ధరింపఁబడిన, పునర్భవ = గోళ్లయొక్క, చారుతలై = అందము కలవియై, ధరింపఁబడినమఱియొకజన్మ సౌందర్యము కలవియై యని యర్థాంతరము గోళ్లరూపమున మరల జన్మించినవి యై యని భావము. సతియడుగులన్ = ఈస్త్రీయొక్కపాదములను, ఆశ్రయించెన్ = సేవించెను (ని) పునర్భవః కరరుహాః. అ ఆరయన్ = ఆలోచింపఁగాన్, కాక = అట్లుకాక, అవి, పుష్కరపదగతిచేన్ = తామరపూవులం బోలినయామె పాదప్రాప్తిచేతను, ఆకాశమును బొందుటచేత నని యర్థాంతరము. (ని) పుష్కరం కరిహస్తాగ్రే వాద్యభాండముఖే జలే వ్యోమ్ని ఖడ్గ ఫలే పద్మే తీర్థౌషధివిశేషయోః. అ. సదుచిస్ఫూర్తి = ఉత్తమమైనకాంతి, తగన్ = ఒప్పఁగాన్, నక్షత్రకాంతి యొప్పఁగా నని యర్థాంతరము. రహిన్ = చక్కఁదనముతోన్, ఎటులు = ఏప్రకారము, ఒప్పున్ = ప్రకాశించును. నక్షత్రములు నఖరూపమున జన్మించి యీమెపదముల నాశ్రయించి యుండును. కానియెడ నీమెగోరులు పుష్కరపదము నొంది సద్రుచితో నెట్లు ప్రకాశించు నని తాత్పర్యము గోరులు పుష్కరపదము నొంది సద్రుచితోఁ బ్రకాశించుటనుబట్టి (శ్లేషచేఁ బ్రాప్త మగురెండర్థములకు నభేదనిశ్చయమున) నక్షత్రములు నిట్టి నఖరూపమున జన్మించి యీమెపాదముల నాశ్రయించె నని చెప్పుటచే శ్లేష

యూలక మైనయతిశయోక్తిచే నమ్రాణిత మైనయుత్ప్రేక్షాలంకారము.

క॥ తదుపరిపదనిర్జిత మై
రయుదిగెం దగువారిఁ జేరి ♦ యును గమఠము నా
నిది సత్యము గాకుండిన
నది ముడుచుట యేల భీతి ♦ నఖిలాంగములన్॥ 90

కమఠము = తాఁబేలు, తదుపరిపదనిర్జితమై, తత్ = ఆమెయొక్క, ఉపరిపద = మీఁగాలిచే, నిర్జితమై = ఓడింపఁబడినదియై, తగువారిన్ = రక్షింపశక్తి గలవారి నని యర్థము. (తనవాసమునకుఁ) దగినయుదకము నని భావము. చెరియున్ = శరణు పొందియును నని యర్థము. ప్రవేశించియుననిభావము. ఒదిగెన్ = తొలఁగెను. పారి పోయె నని యర్థము. నాన్ = అనుట, ఇది, సత్యము = నిజము, కాకుండినన్ = కాని యెడల, అది = తాఁబేలు, భీతిన్ = భయముచేతన్, అఖిలాంగములన్ = అన్ని యవయవములను, ముడుచుట = సంకోచపఱుచుట, ఏల = ఏమికారణమునన్, (అగున్)

ఇందు స్వభావమునఁ గల్గుతామేటియవయవముల ముడుచుకొనుట యామెమీఁగాలి కొడుటచేఁ గల్గినభయమున నయ్యెనని చెప్పుటచె నుత్ప్రేక్షాలంకారము.

క॥ కలమోదరములు ఘనసే
తులసత్క్షేత్రమునఁ దపముఁ ♦ దొలిఁ జేసియ యీ
చెలి జంఘుల కెన వూనెను
ఫలసిద్ధి వొసంగ కున్నె ♦ వరశాలులకున్॥ 91

కలమోదరములు = వరిపొట్టలు, ఘన .....మునన్, ఘన = గొప్పవి యగు, సేతు = గట్లచేత, లసత్ = ప్రకాశించుచున్న, క్షేత్రములన్ = పొలములను, శ్రీరాములు లంకకుం బోవునపుడు సముద్రమునఁ గట్టినగట్టుచేఁ బ్రకాశించు సిద్ధస్థానమున (రామేశ్వరమునందు) (ని) క్షేత్రం శరీరె కేదారె సిద్ధస్థాన కలత్రయోః అ. తొలిన్ = పూర్వమందు, తపము = శరీరాయాససాధ్యము లగువ్రతములను, చేసియ = కావించియే, ఈచెలిజంఘులకున్ = ఈమెపిక్కలకు, ఎన = సాదృశ్యమును, పూనెన్ = ధరించెను. వరశాలులకున్ = దైవానుగ్రహమునఁ గోరికల నొంది ప్రకాశించువారికి, ప్రశస్త మైనవరిపొట్టల కని భావము పలసిద్ధి = లాభప్రాప్తి, (పంట) పొసంగ కున్నె = సంఘటింప కుండునా? సంఘటించు నని భావము ఇందుఁ బూర్వవాక్యము

న స్వభావముచేతనే వరిపాట్లలకు జంఘలతో సాదృశ్యము గలుగు చుండఁగా మున్ను తపము చేయుటచేతఁ గల్గెనని యుత్ప్రేక్షించి దాని నుత్తరవాక్యమున శ్లేషచే సమర్థించుటచే నుత్ప్రేక్షయు నర్థాంతరన్యాసమును నలంకారములు.

గీ॥ నడల కెన రాక మదగజేం • ద్రంబు వనన
గముల లలనాంగసాయుజ్య • కాంక్షఁ దపము
సలుపఁ గటి నుత్తమాంగము • గలసెఁ గరము
గలసె నూరుల నడకలు • గలసె నడల॥ 92

మదగజేంద్రంబు = మదపుటేనుఁగు, నడలకున్ = ఈమె నడకలకు, ఎనరాక = సాదృశ్యమును బొందలేక, వననగములన్ = అడవులయందుం బర్వతములందును, లలనాంగసాయుజ్యకాంక్షన్ = ఈస్త్రీయొక్క యవయవములతో నైక్యముఁ బొందుకోర్కెచేన్, తపము = తపస్సును, చలుపన్ = చేయఁగాన్, ఉత్తమాంగము = (ఏనుఁగు) శిరము, కటిన్ = జఘనమునందున్, కలసెన్ = ఏకీభవించెను కరము = తొండము, ఊరులన్ = తొడలందున్, కలసెన్, నడకలు = గమనములు, నడలన్ = ( ఈమె ) నడకలయందున్, కలసెన్.

ఏనుఁగుశిరముంబోలె విశాలము నున్నతము నగుజఘనము తుండమును బోలునూరులును గజగమనముం బోలుగమనము నీమెకుం గలదని భావము

ఉ॥ ఆకమలాసనుండు దను • జాపహృతం బగునేమొ వెండియున్
శ్రీకమనీయ మైనధర • ణీవలయం బని తన్నిజాంశమీ
స్త్రీకటిచక్రసీమగ సృ • జించి మఱుంగున దాఁచెఁ గాక ర
త్నాకరమేఖలాంక విపు • లాకృతి నైయది యేల పొల్పుగున్॥

ఆకమలాసనుండు = ప్రసిద్ధుఁ డగుబ్రహ్మ, శ్రీకమనీయము = సంపదచేత మనోహర మైనది, ఐన, ధరణీవలయంబు = భూమండలము, వెండియున్ = మఱలన్, దనుజాపహృతంబు = రక్కసునిచె దొంగిలింపఁబడినది, అగు నేమొ, అని = తలఁచి, తన్నిజాంశము = ఆభూమండల సంబంధ మైనసత్య మైనభాగమును ( సార మైనభాగము వని యర్థము.) ఈస్త్రీకటిచక్రసీమ = చక్రాకార మైనయీమెజఘనప్రదేశము, కన్ = అగునట్లు, సృజించి = సృష్టిచేసి, మఱుంగునన్ = ( వస్త్రము ) చాటునందున్, దాఁచెన్ = దాఁపఱికము చేసెను. కాక = అట్లు కానియెడను, అది = ఆజఘనము, రత్నా

కర......రై, రత్న = మణులకు, ఆకర = ఉనికిపట్టైన, మేఖలా = ఒడ్డాణ మెత్తు, అంక = భూషణము గలదియును, విపులాకృతి రై, విశాల మైనయాకారము గలదియు నై ( రత్నాకర = సముద్రుఁ డనెడు, మేఖలాంక = ఒడ్డాణపుగుఱుతు గలదియును, విపులాకృతి = భూమి యాకారముగలదియు నై యని యర్థాంతరము. ఇట నీరెండర్థములకు నభేదశ్లేషయును చేయవలెను. ) ఏల = ఎందువలన, పోల్పగన్ = ఒప్పగన్.

బ్రహ్మ భూమిని మఱల రక్కసుఁ డెత్తికొనిపోవు నని తలఁచి దానిపొరయుం దీసి యీమెకటిప్రదేశముం జేసి వస్త్రముచాటున దాఁచెను. లేనియెడ భూధర్మ ము గురత్నాకరమేఖల ( సముద్ర మనునొడ్డాణము ) గల్గుటయు విపులాకృతియుఁ గటియం దేల కాన్పించు నని భావము. ఈమెకటి భూమియుం బోలె విశాలమై రత్నాకరమేఖల ( మణులయొడ్డాణము ) గల్గి యొప్పుచుండె నని ఫలితము. మున్ను హిరణ్యాక్షుఁడు భూమి నెత్తికొని పోవుచుండఁగా విష్ణు వాతని వరాహావతార మెత్తి సంహరించె నని పౌరాణికులు చెప్పుదురు ఉత్ప్రేక్షాలంకారము

క॥ వళి యడ్డురేఖ రోమా
వళి నిడురేఖయుఁ గ హంస ♦ పాది లిఖించెన్
నలు వచట లేని నడుమున
కలజను లెం దున్న దొక్కొ ♦ యని శంకపడన్॥ 94

నలువ = బ్రహ్మ ( నాలుగుముఖములు గలవాఁడు ) వళి = కడుపుమీఁద నుండుముడుత, అడ్డురేఖ = అడ్డుగీఁతయు, రోమావళి = నూగారు, నిడురేఖయు = నిడుగీఁతయు, కన్ = అగునట్లు, అచటన్ = ఆస్థలమునందు, లేనినడుమునకున్, అలజనులు = లోకమందలిజనులు, ఎం దున్న దొక్కొ = ఎక్కడ నున్నదో యని, శంకపడన్ = సందేహపడునట్లు, హంసపాది = హంసపాదమును, లిఖించెన్ = వ్రాసెను.

ఆమెనూగారును గడుపుమీఁదిముడుతయును గలసి బ్రహ్మ యీమెను సృజించునపుఁడు నడు మిచట లే దని తెలుపుటకై వేసిన హంసపాదివలె నుండె నని యర్థము. ఆమె మిగుల సన్నపునడుము గల దని భావము వ్రాయునపుడు గొన్ని యక్షరములఁ బ్రమాదమున విడిచె నేని వానిని మఱియొకచో వ్రాయుచు నక్కడఁ దప్పియున్న దని తెలియుటకై వ్రాయుగీఁతలను హంసపాది యందురు. తఱచుగ హంసపాద మనియే ప్రయోగములం గానుపించు.

చ॥ తృణ మగువి ల్లిదేటి కని ♦ యిక్షుశరాసము డించి వేణికా
గుణయుత మైనయీకుసుమ ♦ కోమలికోమలగాత్రవల్లి సిం
గిణిగ నొనర్చి కా స్మరుఁడు ♦ కేలను బట్టఁ దదంగుళీనిక
ర్షణభవరేఖ లొప్పె నన ♦ రాజిలు బిత్తర మైనముత్తఱుల్॥ 95

మరుఁడు=మన్మథుఁడు, ( ఇది స్మరశబ్దభవము. ) ఇది=ఇందాఁక తాను ధరించునది, తృణము=గడ్డిజాతిలోనిది, అగువిల్లు=అగుధనువు, ఏటికిన్=ఎందుకనుక అని=తలఁచి, ఉపయోగకారి కా దనుకొని యని యర్థము. ఇక్షుశరాసము=చెఱకువింటిని, డించి=వదలి, వేణికాగుణయుతము, వేణికా=జడయను, గుణ=నారితో, యుతము=కూడినది, ఐన, ఈకుసుమకోమలికోమలగాత్రవల్లి, ఈకుసుమకోమలి=పుష్పసుకుమార యగునీచిన్నదానియొక్క, కోమల=మృదు వైన, గాత్రవల్లి=శరీర మనుతీవను, సింగిణి=ధనువు, కాన్=అగునట్లు, ఒనర్చి=చేసి, కాను=ఈమెనడు మను వింటిపిడుమును, కేలన్=హస్తముతోన్, పట్టన్=ధరింపఁగాన్, తదంగుళీ.....లు తత్=ఆమరునియొక్క, అంగుళీ=వ్రేళ్లయొక్క, నికర్ష=ఒరపిడివలనన్, భవ=పుట్టిన, రేఖలు=గీఁతలు, ఒప్పెనన్=స్ఫురించెనో యనునట్లు, బిత్తర మైనముత్తఱుల్=సుందర మైనమూఁడువళులు, ( కడుపుమీఁదిముడుతలు) రాజిలున్=ప్రకాశించును.

మన్మథుఁ డిదివఱకుఁ దాను ధరించువిల్లు గడ్డిజాతిలోనిది కావున నిస్సార మని తలఁచి దాని విడిచి యీమెశరీరము నే ధనువుగాఁ జేసికొని చేతఁబట్టుటచే వ్రేళ్లవలనఁ గలిగినగీఁతలువలె నామెవళులు ప్రకాశించు చున్న వని యర్థము. ఉత్ప్రేక్షాలంకారము. ఇది వేణికాగుణయుత యనునది మొద లయినచోట్ల నున్నరూపకముచే నుత్థాపితము.

క॥ ఘనజఘనపులినమున నెల
కొనుమణికాంచి యనుపొన్న ♦ కొమ్మసుమము మా
నినినాభి యూరు తద్వా
సనకై యరుదెంచునళుల ♦ చాల్గా కున్నే. 96

మానినినాభి=ఈయింతినాభి, ఘనజఘనపులినమునన్, ఘన=పెద్దది యగు, జఘన=కటిపురోభాగ మనెడు, పులినమునన్=తిన్నె యందున్, నెలకొను......

కుసుమము, సెలకొను = ఉండెడి, మణికాంచి = మణుల (తోఁగూడిన) మొల్నూలయొక్క
అనుపొన్న కొమ్మకుసుమము = అనెడుపొన్న కొమ్మయొక్క పుష్పము, అళుల్, అళి =
రోమాళి, తద్వాసనకై = ఆపుష్పమందలిపరిమళముకొఱకు, అరుదెంచువళులచాలు = వ
చ్చెడుతుమ్మెదలవరుస, కాఁ దున్నే = కాకుండునా? అగు నని యర్థము.

ఈమెనాభి పున్నాగపుష్పమువలెను నూగారు తుమ్మెదలచాలువలె నుండె నని
భావము. రూపకానుప్రాణితమగు నుత్ప్రేక్షాలంకారము.

సీ॥ నాభీనదమునుండి ♦ నడు మనుమింటిపైఁ
గవ గూడి యెగయుచ ♦ క్రంబు లొక్కొ
నవవయోలక్ష్మి యీ ♦ యువిదపొం దూని కా
నుక యిడ్డకనకకం ♦ దుకము లొక్కొ
వరతనూశృంగార ♦ వనములో విహరించు
మనసిజకుంభికుం ♦ భంబు లొక్కొ
స్ఫురదురోలావణ్య ♦ సరసిలో జనియించి
మొనచూపుపొందమ్మి ♦ మొగడ లొక్కొ
ప్రకటరోమావళీలతా ♦ గ్రసుమగుచ్ఛ
ములొ యనఁగఁ గ్రిక్కిరిసి సిబ్బె ♦ ములను మెఱసి
యొలసి ప్రక్కల నెరసి యొం ♦ డొంటిఁ దఱిసి
యొరసి సరసిజదృగురోజ ♦ యుగళ మమరు॥ 97

సరసిజ ....యుగళంబు, సరసిజదృక్ = ఈస్త్రీయొక్క, (పద్మములం బో
లినకన్నులు గలది) ఉరోజయుగళము = కుచములజంట, నాభీనదమునుండి = బొడ్డ
నునదినుండి, నడు మనుమింటిపైన్ = నడు మనునాకాశముమీఁదను, కవగూడి = జో
డు గట్టి, ఎగయుచక్రంబు లొక్కొ = ఎగయుచక్కవలో, నవవయోలక్ష్మి = క్రొత్త
ది యైనజవ్వనమువలనిశోభ యనెడులచ్చి, ఈయువిదపొందు = ఈయువతియొక్క స్నే
హమును, ఊని = అంగీకరించి, కానుక యిడ్డకనకకందుకము లొక్కొ = కానుక యి
చ్చినబంగారుబంతులో, గొప్పవారిమైత్రిఁ గోరి మొదట వారిదర్శనమునకుం బోవున
పుడు తీసికొనిపోయి యిచ్చెడువస్తువు కానుక యనంబడు వరతనూశృంగారవనము

లాఁగ = తోయఁగాంతోయనుపూఁదోఁటలా, ...ంచు.....లం, విహరించు = క్రీడించెడు, మనసిజ = మన్మథుఁడనెడు, కుంభి = ఏనుఁగుయొక్క, కుంభంబు లొక్కొ = శిరము నందలిమాంసపిండము లగునేమో, స్ఫుర.....సరసిలోఁ, స్ఫురత్ = ప్రకాశించు చున్న, ఉరః = వక్షస్థ్సలమనెడు, లావణ్యసరసిలోన్ = లావణ్యపుంగొలఁకులో, (ము త్యములందలిచాయం బోలినతళతళలాడు దేహకాంతి లావణ్యము.) జనియించి = పుట్టి, మొనచూపు.....లు, మొనచూపు = అగ్రములను గనుపఱుచు, పొందమ్మి మొగడ లు = బంగారుతామరమొగ్గలు, ఒకొ = అగునేమో, ప్రకట.....లొ, ప్రకట = స్ఫుట మైన, రోమావళీ = నూగారనెడు, లతా = తీఁగెలయొక్క, అగ్ర = చివర నున్న, సుమగుచ్ఛములో = పూలగుత్తులో, అనఁగన్ = అనునట్లు, క్రిక్కిరిసి = ఎడము లేకుండఁగలిసికొని, సిబ్బెములన్ = ఒకవిధ మైనమచ్చలతోన్, మెఱసి = ప్రకాశించి, ఒలసి = వ్యాపించి, ప్రక్కలన్ = సమీపస్థలములను, సెరసి = క్రమ్ముకొని, ఒండొం టిన్ = ఒకటి మఱియొకదానిని, తఱిసి = సమీపించి, ఒరసి = రాచుకొని, అమరున్ = ఒప్పును.

రూపకానుప్రాణిత మైనయుత్ప్రేక్షాలంకారము.

మ॥ తతముక్తామణిహారనిర్ఝరపయో ♦ ధారస్తనస్వర్ణప
ర్వతభాగంబులఁ బుట్టి కాంచనరుచిన్ ♦ వ్యాపించి పెన్సోగలౌ
లత లీచంచలనేత్రబాహుబిసము ♦ ల్గావేని బాలాంగుళీ
గతచంచన్నఖపుంజపుంజివురుమొ ♦ గ్గల్ వుట్ట నం దేటికిన్॥ 98

చంచలనేత్రబాహుబిసముల్ = ఈస్త్రీయొక్క తామరతూండ్లం బోలినబాహు వులు, తత . . భాగంబులన్, తత = అధిక మైన, ముక్తామణిహార = ముత్యాలదండ లనెడు, నిర్ఝరపయోధార = కొండవాఁగులనీటిధారలు గల, స్తనస్వర్ణపర్వతభాగంబు లన్ = స్తనము లనెడుబంగారుకొండలప్రదేశములందున్, పుట్టి = జన్మించి, కాంచనరు చిన్ = బంగారుకాంతితోన్, వ్యాపించి, (కారణగుణములు కార్యమున సంక్రమించు ననున్యాయమున బంగారుకొండలయందుఁ బుట్టినవి కావున బంగారుకాంతితో వ్యాపించి యని భావము) పెన్సోగలు = మిగుల దీర్ఘములు, ఔలతలు = అగుతీఁగెలు కావేని = కానియెడల, అందున్ = ఆబాహువులందున్, బాలాంగుళీ . . . మొగ్గల్, బాలాంగుళీ = లేఁతవ్రేళ్లయొక్కయు, గత = వానియందు న్నవి యై, చంచత్ = ప్ర కాశించుచున్న, నఖ = గోళ్లయొక్కయు, పుంజపుంజివురుమొగ్గల్ = సముదాయ ము

నెఱంజిగుబ్బలను మొగ్గలును, పుట్టన్ = పుట్టుట, ఏటికిన్ = ఎందుకొఱకు ? (అగును.) ఈమెబాహువులు, ముత్యాలదండ లనునీటిధారలు గలకుచము లనుస్వర్ణపర్వతములం బుట్టినబంగారుతీవలే కానియెడ వానియందు వేళ్లనుచివుళ్లును, గోళ్లనుమొగ్గలు నేల పుట్టు నని యర్థము. ఈమె స్తనములు పర్వతములువలెను, బాహువులు తీవలువలెను, నేళ్లు చివుళ్లువలెను, గోళ్లు మొగ్గలువలె నుండె నని భావము. ఇందు బాహువులను బంగారుతీవ లని యుత్ప్రేక్షించినాఁడు గాన నుత్ప్రేక్షాలంకారము. అది స్తనముల యందుఁ బర్వతత్వారోపరూప మైనరూపకముచె నుత్థాపితము. ఈరెంటికి సంశ్యాంగి భావమున సాంకర్యము.

చ॥ కనకపుఁగట్టులు న్మొదలు ♦ గా బిరుదుల్ ఘటియించి చందనం
బు నలఁది దోర్యుగాగ్రితల ♦ భూషితపీఠిక నించునయ్యనం
గునివిజయాంకశంఖముగుఁ ♦ గోమలికంఠము గాక యున్న స
ద్వినుతకళల్ సువృత్తతయు ♦ దీపితమంగళరేఖ లుండునే॥ 99

కోమలికంఠము = ఈమెకంఠము, కనకపుఁగట్టులు = బంగారుకట్లు, మొదలు గాన్ = ముం దగునట్లు, బిరుదల్ = జయచిహ్నములను, ఘటియించి = కూర్చి, చందనంబు = శ్రీగంధమును, అలఁది = పూసి, దోర్యుగ......పీఠికన్ = చెతులమీఁదిభాగమనెడు నలంకరింపఁబడిన పీఁటయందున్, నించు......శంఖము, నించు = నిల్పెడు, అయ్యనంగుని = ప్రసిద్ధుఁ డగుమన్మథునియొక్క, విజయాంక = జయచిహ్నములుగల, శంఖము, అగున్, కాకయున్నన్ = అట్లుకానియెడల, సద్వినుతకళల్ = శ్రేష్ఠ మైనవి గనుక నే స్తోత్రము చెయఁబడినకాంతులును, సువృత్తతయున్ = మిగుల గుండ్రనయును, దీపితమంగళరేఖలు = ప్రకాశింపఁబడినశుభ మైనరేఖలును, ఉండునే = ఉండునా ? (ఉండ వనుట.)

శంఖమందు శుభరేఖలు మొదలగునవి గలుగుటయు దానికిం బంగరుకట్లు వైచి గంధముం బూసి పీఠమం దుంచి పూజించుటయుఁ లోకవిదితము శుభరేఖలు గుండ్ర న మొదలగ ధర్మములు కంఠమందును నుండును. ఈధర్మసామ్యముచేఁ గంఠమందు మన్మథశంఖత్వము సంభావించుటచె నుత్ప్రేక్షాలంకారము.

గీ॥ అలరసాలఫలంబు న ♦ గాగ్రివాసి
యై తపస్స్థితి మీఱె యీ ♦ యతివచుబుక

మగుటఁ బ్రియకరయోగ్యవృ ♦ త్తిఁ గయికొనియె
డెందమున నెంచి చూడ మా ♦ కంద మగుచు॥ 100

డెందమునన్ = మనసునందున్, ఎంచిచూడన్ = ఆలోచింపఁగా, అలరసాల ఫలంబు = ప్రసిద్ధ మగుతియ్యమామిడిపండు, నగాగ్రవాసియై = చెట్టుకొన నున్నదియై, ( పర్వతాగ్రమున నుండి యని యర్థాంతరము. ) ( ని ) అగో నగశ్చ భుజగే నాథా భూరుహే భూధరే. నా. నా. తపస్స్థితిన్ = గ్రీష్మకాలమున నునికిచే ( చాంద్రాయణాదివ్రతములయం దునికిచేన్, వ్రతములు చేయుటచే నని యర్థాంతరము ) మీఱి = అతిశయించి, ఈయతివచుబుకము = ఈమెగడ్డము, అగుటన్ = అయిజన్మించుట చేతను, మాకందము = మాకంద మను పేరు కలది, ( ఈస్త్రీరూపమున నున్నలక్ష్మికి నందము గలిగించునది యని రెండవయర్థము ఈయర్థమున మాకున్ + అందము అని పదచ్ఛేదము. అంద మనుశబ్దమునకు లక్ష్మిచే నందము గలిగించునది యని యర్థము గ్రహింపవలెను. ) అగుచున్, ప్రియకరయోగ్యవృత్తిన్ = ఇష్టము గావించుమంచివ్యాపారమును, ( ప్రియునిహస్తమునకుం దగినవ్యాపారము నని యర్థాంతరము. ప్రియుఁడు చేతఁ బూని బ్రతిమాలఁదగినవ్యాపారము నని భావము ) కయికొనియెన్ = వహించెను. శ్లేషాలంకారము.

గీ॥ వదనముకురంపుబరణిలోఁ ♦ మదనుఁ డునుపఁ
బల్లవము వ్రాలె వెలికిఁ గ ♦ న్పట్టువిశద
రదనకురువిందమాలిక ♦ తుదఁ దనర్చు
నాయకం బనఁ గెమ్మోవి ♦ నారి కొనరు॥ 101

మదనుఁడు = మన్మథుఁడు, వదనముకురంపుబరణిలోన్ = ముఖ మనెడుసద్దపుబరణియందున్, ఉనుపన్ = నిలుపఁగాన్, వెలికిన్ = వెలుపలికిన్, పల్లవమువోలెన్ = చిగురాకువలె, కన్పట్టు . . . తుదన్, కన్పట్టు = కాన్పించెడు, విశద = స్వచ్ఛమైన, రదన = దంతము లనెడు, కురువింద = కెంపులయొక్క, మాలిక = దండయొక్క, తుదన్ = చివరయందున్, తనర్చు నాయకం బనన్ = ప్రకాశించు నాయకమణివలె, హారమునకు మధ్య నున్న పెద్దమణిని నాయక మందురు కెమ్మోవి = ఎఱ్ఱనియధరము, నారికిన్ = ఈస్త్రీకి, ఒనరున్ = ఒప్పును రూపకముతోఁ గూడినయుత్ప్రేక్షాలంకారము.

చ॥ రమణిమృదూక్తిమాధురికి ♦ ద్రాక్షఫలం బిల నోడి సుర్కె వే
గమ పులు సెక్కెఁ దేనె పుల♦ఖండము ఖండము లయ్యె నిక్షుకాం
డము తుదఁ జప్ప నయ్యె సుమ♦నఃప్రియ మై నుతి గాంచుచుంటచే
నమృతరసంబు గొంత సరి♦యై తగు నేమొ మదిం దలంపఁగన్॥

ఇలన్ = భూమియందున్, ద్రాక్షఫలంబు, రమణిమృదూక్తిమాధురికిన్ = ఈజవ్వనియొక్కమృదువైనమాటలరుచికి, ఓడి = అపజయము నొంది సుర్కెన్ = ఎండిపోయెను. మృదూక్తిమాధురికి నోడి యనునది యెల్లవాక్యములతో సంబంధించును. తేనె, వేగమ = త్వరగనే, పులుసెక్కెన్ = మాధుర్యమును విడిచి పుల్లనిరుచికలది యయ్యెను ఈమె వాఙ్మాధుర్యమునుఁబట్టి చూడఁ దేనె మధుర మైనదియైనను బుల్లనిదివలె నుండె నని భావము పులఖండము = గిడ్డచక్కెర, ఖండము లయ్యెన్ = ముక్కలయ్యెను. ఇక్షుకాండము = చెఱుకుఁగఱ్ఱ, తుదన్ = చివరన, చప్పనయ్యెన్ = నిస్సారమయ్యెను సుమనఃప్రియమై = దేవతలకు నిష్టమై, (విద్వాంసులగువారల కిష్టమై యని యర్థాంతరము) నుతిగాంచుచుంటచేన్ = స్తోత్రము నందుచుండుటచేన్, అమృతరసంబు = సుధ, (ఇది దేవతలును రాక్షసులును క్షీరసముద్రమును మథింపఁగా నుత్పన్న మైనపదార్థము) మదిన్ = మనసునందున్, తలంపఁగాన్ = ఆలోచింపఁగాన్, కొంత సరియై = కొంచెము సమాన మై, తగు నేమొ = ఒప్పు నేమో (యని తోఁచును)

ద్రాక్ష మొదలగువానియందు స్వభావమున నే కలిగెడుసుర్కుట మొదలైన వానికి నిమెమాటల నోడుట హేతువుగాఁ జెప్పుటచే నుత్ప్రేక్షాలంకారము

చ. చలమున మోము దా భువన♦జాతము గెల్చి ప్రసిద్ధిఁ గాంచుచా
యలఁ బ్రతివచ్చె వీఁడు దన♦కంచు శశిం గని కిన్క రెండుప్ర
క్కలుగ నొనర్చె భీతిఁ గొని♦క్రిమ్మఱ సమ్ముఖవార్యయుగ్మముం
దొలఁగక కొల్చుచున్న దల♦తుస్కలనం దగుఁ జెక్కు లింతికిన్.

మోము = ఈయింతిముఖము, చలమునన్ = పట్టుదలచేత, భువనజాతమున్ = తామరపువ్వును, (లోకసముదాయము ననియుం దోఁచును) (నీటఁబుట్టినది) (ని) జీవనం భువనం వనం అ. గెల్చి = జయించి, ప్రసిద్ధి గాంచుచాయలన్, ప్రసిద్ధి = ప్రఖ్యాతిని, కాంచుచాయలన్ = పొందెడుకాంతులచేతను, వీఁడు = (చంద్రుఁడు) తనకున్ = (ముఖమునకున్) ప్రతివచ్చెన్ = సాటి యయ్యెను, అంచున్, శశిన్ = చంద్రుని, కని = చూచి, కిన్కన్ = కోపముచేతను, రెండుప్రక్కలున్ = రెండుముక్క-

లు గాన్, ఒనర్పఁగ = చేయఁగా, భీతిఁగొని = భయపడి, క్రమ్మఱన్ = మఱలన్, ఆముఖపార్శ్వయుగ్మముఁ = ఆమోముయొక్క రెండుప్రక్కలను, తొలఁగక = విడువక, కొల్చుచున్న వెలతుకలు = సేవించుచున్న చంద్రఖండములు, అనఁ = అనునట్లు, ఇంతికిఁ = ఈమెకు, చెక్కులు = చెక్కిళ్లు, తగుఁ = ప్రకాశించును

ఈయింతిమోము తామరపూవులను గెల్చి యుండఁగాఁ జంద్రుఁడు నన్నే చెసి ప్రసిద్ధమైన కాంతులచేఁ దనకు సదృశుఁ డయ్యె నని కోపించి యాచంద్రునిని ముక్కలు చేయఁగా, మఱలఁ దనకేమి యాపద సంభవించునోయని భయపడి ముఖపార్శ్వములను సేవించు నాముక్కలో యనునట్లీమె చెక్కులు ప్రకాశించు చుండె నని యర్థము ఈమెమోము చంద్రునిఁ జెక్కులు చంద్రశకలములం బోలు నని భావము ఉత్ప్రేక్షాలంకారము

క. నలినము నుశంక నళులీ
లలనావదనంబు గ్రమ్మి ♦ లావణ్యరసా
వహ గ్రోల కుండుటకు నై
నలువట గంధఫలి నిలిపె నా ♦ నాస దగుఁ. 104

అళులు = తుమ్మెదలు, నలిన మనుశంకఁ = తామరపూవనుభ్రాంతిచేత, ఈలలనావదనంబు = ఈయింతియొక్క ముఖమును, క్రమ్మి = వ్యాపించి, లావణ్యరసావహ = లావణ్యరసము దాయము, రసప్రవాహము నని యర్థము గ్రోల కుండుటకు నై = త్రావ కుండుటకొఱకు, నలువ = బ్రహ్మ, అటఁ = ఆముఖమునందున్, గంధఫలిఁ = సంపెంగపూవును, నిల్పెనాఁ = నిల్పెనో యనునట్లు, నాస = ఈమెముక్కు, తగన్ = ప్రకాశించును.

ఈమెమోము పద్మముం బోలుటచేఁ దుమ్మెదలు భ్రాంతిపడి యట వ్రాలి లావణ్యరసము ద్రావ కుండ నలువ యట నిల్పిన సంపెంగపూవువలె నాస ప్రకాశించుచుండె నని తాత్పర్యము గంధఫలికిం దుమ్మెదలకును విరోధము ప్రసిద్ధము ఉత్ప్రేక్షాలంకారము

క. శ్రీకారము లీకామిని
వౌకర్ణము లెంచి చూడ ♦ నటు గాకున్నఁ
బ్రాకటసువర్ణయుక్తము
లౌకమ్మల నంటియున్నె ♦ యవి యెల్లపుడున్. 105

ఎంచి చూడఁగ = ఆలోచింపఁగాఁ, ఈకామినివి = ఈస్త్రీసంబంధ మైనవి, ఔకర్ణములు = అగుచెవులు, శ్రీకారములు = శ్రీ యనునక్షరములు అటు గాకున్నన్ = అట్లు కానియెడల, అవి = ఆకర్ణములు, ప్రాకటసువర్ణయుక్తములు = స్పష్టమైనమంచియక్కరములతోఁ గూడినవి, ప్రసిద్ధమైనబంగారముతోఁ గూడిన వని యర్థాంతరము ఔకమ్మలన్ = అగురేఖలను, అగుకర్ణభూషణముల నని యర్థాంతరము. ఎల్లపుడుఁ = ఎల్లకాలంబును, అంటి యున్నె = తగుల్కొని యుండునా? (ఉండ వని యర్థము) ఈమెచెవులు శ్రీకారములు గానియెడల సువర్ణములతోఁ గూడినకమ్మలం గలిసికొని యుండుట సంభవింపదు గావున నవి శ్రీకారములే యని యర్థము. చెవులు శ్రీకారములువలె నుండె నని భావము.

క॥ దరహాసచంద్రికను నై
తరుణీమణివిమలముఖసు ♦ ధాకరబింబా
న్తరమున వ్రాలుచకోరక
వరయుగ మనఁ గన్నుదోయి ♦ వలనొప్పారుఁ॥ 106

దరహాసచంద్రికకున్నై = చిఱునగ వనెడువెన్నెలకై, తరుణీ.....మునన్, తరుణీమణి = స్త్రీశ్రేష్ఠముయొక్క, విమల = నిష్కళంక మైన, ముఖ = మొగ మనెడు, సుధాకరబింబాన్తరమునఁ = చంద్రమండలమునడుమను, వ్రాలుచకోరకవరయుగమనఁ = ప్రవేశించెడువెన్నెలపులుగులజో డనునట్లు, కన్నుదోయి = కన్నుఁగవ, వలను = అందముచేతను, ఒప్పారున్ = ప్రకాశించును

చకోరములు వెన్నెలను భక్షించి జీవించునవి గాన మందహాస మనువెన్నెలగల ముఖ మనుచంద్రుసెద్ద వ్రాలిన యాపులుఁగులువలె నీమెకన్నులు ప్రకాశించుచుండె నని యర్థము ఈమెకన్నులు చకోరములువలెను, మొగము చందురుఁడువలెను, చిఱునగవు వెన్నెలవలెను నుండె నని భావము

రూపకముతోఁ గూడినయుత్ప్రేక్షాలంకారము

గీ॥ ఉవిదనేత్రసామ్య ♦ మొందఁగాఁ గడఁగి మీ
నొక్కయేటఁ జిక్కె ♦ నొక్కనెలకె
పద్మ మోడె నొక్క ♦ పగటికే చెడెఁ గల్వ
సఫల మగునె కోర్కె ♦ జడగతులకు॥ 107

మీమ=చేఁప, ఉవిదనేత్రసామ్యము=ఈయువిదకన్నులతోడిపోలిక్కాని, ఒంది కాఁగాన్=పొందుటకు, కడంగి=యత్నించి, ఒక్కయేటన్=ఒక్కసంవత్సరకాలమునందున్, చిక్కెన్=కృశించెను లొంగిపోయె ననియునర్థము. ఒక్కనదియందుఁ దగుల్కొనె నని భావము. పద్మము=తామరపువ్వు, ( అట్లు యత్నించి ) ఒక్కనెలన్=ఒక్కమాసమునకె, ఓడెన్=పరాజయము నొందెను. ఒక్కచంద్రునికే పరాజయము నొందె నని యర్థాంతరము. చేఁప యేటఁ జిక్కెను గాని యది నెలకె చిక్కె నని దానికంటె న్యూనత్వము స్ఫురించును. కల్వ=ఉత్పలము, ఒక్కపగటికే=ఒకదినమునకే, చెడెన్=ఓడెను. పగటికాలమునకే యోడె నని యర్థాంతరము. జడగతులకున్=అల్పమైనతెల్వి గలవారికి, ల, డల కభేద మగుటచే నీటియందుండువారి కని యర్థాంతరము కోర్కి, సఫలము=ఫలము గలది, అగునె=( కా దని యర్థము. ) శ్లేషతోఁ గూడినయర్థాంతరన్యాసాలంకారము

గీ॥ మూఁడులోకంబుల జయింప ♦ మూఁడువిండ్లు
దర్పకుఁడు దెచ్చి యొక్కటి ♦ దాను బూని
యువిదకడ రెండు దాఁచెఁ గా ♦ కున్న వంగి
దృక్శితశరాళి నీను నే ♦ దీనిబొమలు॥ 108

దర్పకుఁడు=మన్మథుఁడు, మూఁడులోకములన్=ముల్లోకములను, జయింపన్=గెలుచుటకు, మూఁడువిండ్లు=మూఁడుధనువులను, తెచ్చి, తాను, ఒక్కటిన్, పూని=ధరించి, రెండు=రెంటిని, ఉవిదకడన్=ఈస్త్రీయొద్ద, దాఁచెన్=దాఁపతికము చెసెను. కాకున్నన్=కానియెడల, దీనిబొమలు=ఈమెకనుబొమలు, వంగి=వంపు గలిగి ( వక్రములై ) దృక్శితశరాళిన్, దృక్=చూపు లనెడు, శిత=వాఁడియైన, శరాళిన్=బాణసముదాయములను ఈను నే=ప్రసరింపఁజేయునా? ( చేయ వని యర్థము. ) ఈమెకనుబొమలు అనంగునివిండ్లవలె వక్రములును జూపులను బాణములువలె వాఁడి గలవియు నని భావము రూపకముతోఁ గూడినయుత్ప్రేక్షాలంకారము.

క॥ భగణంబుగ గోరు లమరె
సగముగ శశిలోన నెన్నఁ ♦ జను నిటలంబున్
దగు వదనము నలమనఁగా
నగరీతిన్ గుచములున్ ద ♦ నర్చున్ సతికిన్॥ 109

సతికిన్ = ఈభామకు, గోరులు, భగణంబుగన్ = నక్షత్రసముదయ మగునట్లు, సముదయమువలె నని యర్థము. అమరెన్ = ఒప్పెను. విటలంబున్ = ఫాలమునున్ ('ను' సముచ్చయము.) శశిలోనన్ = చందురునందున్, సగముగన్ = సగ మగునట్లు ఎన్నఁ జనున్ = లెక్కింపవచ్చును వదనము = ముఖము, నలము = పద్మము, అనఁగాన్ = అనునట్లు, తగున్ = ఒప్పును. కుచములున్ = స్తనములును, నగరీతిన్ = పర్వతపురీతిచెతను, తనర్చున్ = ప్రకాశించును ఇందు భగణము, సగము, నలము, నగము అనుపదములు సందర్భము ననుసరించి నక్షత్రిసముదాయము మొద లైనవానియందుఁ బ్రవర్తించినను వ్యంజనావ్యాపారముచె ఛందశ్శాస్త్రమందలి కొన్ని సంజ్ఞలందెలుపునట్లుగాన నీమెగోరులు మొదలగునవి యక్షరసామ్యము చె భగణము మొదలగువానింబోలి యుండెనని యర్థాంతరము స్ఫురించును. (గోరులు ఇంము మొదటగురువును బిమ్మట రెండులఘువులుంగలవు భగణమునకిట్లేయుండవలెను ఇదియేసామ్యహేతువు. తక్కినవానికినిట్లే తెలియవలెను) ఇట్టియర్థము నే వ్యంగ్యార్థ మని యాలంకారికులు చెప్పుదురు పదార్థములు పరస్పరము నన్వయించిన పిమ్మట వ్యాక్యార్థశోభార్థము స్ఫురించునర్థము వ్యంగ్యార్థము. ఇట్టియర్థముం దెలుపుశబ్దశక్తియే వ్యంజనావ్యాపారము.

ఉ॥ మంగళలీల ఫాలతట ♦ మండితమండనసీలరత్న రా
జిం గికురించి వక్త్రసర ♦ సీరుహసౌరభవీచికాచర
ద్భృంగములో యనంగ విను ♦ తిం గనుచుం గొనబౌ మెఱుంగులం
బొంగి చెలంగుముంగరులు ♦ ముంగురు లంగన కుం గనుంగొనన్॥

అంగనకున్ = ఈయింతియొక్క, మెఱుంగులన్ = నిగనిగలాడుకాంతిచెత, పొంగి = అతిశయించి, చెలంగు . . . ముంగురుల్ = ప్రకాశించునవంకరగలముంగురులు (ముందు + కురులు = ముంగురులు మోముమీఁద వ్రేలు వెండ్రుకలు) కనుంగొనన్ = చూడఁగాన్, ఫాలత . . . రాజిన్, ఫాలతట = నుదుటను, మండిత = అలంకరింపఁబడిన, మండన = భూషణమునందలి, నిలరత్న రాజిన్ = నీలపురాలసమూహమును, కిసరించి = మోసముచేసి, జయించి యని యర్థము వక్త్రసరసీరుహ . . . భృంగములో యనంగన్, వక్త్ర = ముఖమనెడు, సరసీరుహ = తామరపూవుయొక్క, సౌరభవీచికా = పరిమళతరంగములకై, పరిమళాతిశయముకొఱ కని యర్థము. చరత్ = తిరుగుచున్న, భృంగములో యనంగన్ = తుమ్మెదలో యనునట్లు, వినుతింగనుచున్ = స్తుతి నొందుచున్, మంగళలీలన్ = శుభవిలాసముతో, గొనబు = మనోహరములు, ఔన్. (ఇట ముంగురు లనుబహువచనాంతమునకు గొన బను నేకవచనము విశేషణ

ము.) ఈమెముంగురులు కొసట నున్న భూషణములోని నీలపురాలం దిరస్కరించి మొగ మనుపద్మముయొక్క పరిమళము నాస్వాదింపవచ్చిన తుమ్మెదలవలె విలసిల్లుచుండె నని భావము.

రూపకానుప్రాణితోత్ప్రేక్షాలంకారము.

గీ॥ మౌళిమాణిక్యరుచితటి • న్మంజులంబు
రుచిరనవరత్నసీమంత • రోహితంబు
నై నయీమోహనాంగిసో • యగపునీల
కైశికము ఘనవిస్ఫూర్తిఁ • గాంచు టరుదె॥ 111

మౌళి......మంజులంబు, మౌళి=శిరోభూషణమునందలి, మాణిక్య=మణులయొక్క, రుచి=కాంతి యనెడు, తటిత్=మెఱుములచేతను, మంజులంబు=మనోహరమైనదియు, రుచిర......రోహితంబు, రుచిర=చక్కనికాంతి గల, నవరత్న=తొమ్మిదిరతనములచేత (జేయఁబడినగలు గల) సీమంత=పాపట యనెడు, రోహితంబు=కొరడుగలదియునై (ఎఱ్ఱవెట్టనియింద్రునిధనువు రోహిత మనంబడు. దీనినే తెనుఁగునఁ గొర డందురు.) (ని) ఇంద్రాయుధం శక్రధను స్తదేవ ఋజు రోహితం. అ అయిన, ఈమోహనాంగి......కైశికము, ఈమోహనాంగి=ఈయింతియొక్క, (వలపు పుట్టించుశరీరముగలది) సోయగపునీలకైశికము=చక్కనినల్లనికొప్పు, ఘనవిస్ఫూర్తిన్=మేఘకాంతిని, (గొప్పకాంతి ననియు నర్థము.) కాంచుట=పొందుట, అరుదె=ఆశ్చర్యమా? (కా దని యర్థము.) రూపకాలంకారము

గీ॥ కుంభకుచ మీనలోచన • గోనితంబ
యబ్జధామాస్య హరిమధ్య • యళిశిరోజ
చాపసుభ్రూయుగళ నక్రి • జంఘ యతుల
కన్య సరసక్రియలరాశి • గాదె తలఁప॥ 112

(ఈయింతి) తలఁపఁగాన్=ఆలోచింపఁగాన్, కుంభకుచ=ఏనుఁగుకుంభములం బోలినకుచములు గలది. ఘటములం బోలినకుచములు గల దనియైన యర్థము. మీనలోచన=చేఁపలం బోలినకన్నులు గలది. గోనితంబ=భూమివలె (విశాలమైన) కటిప్రదేశము కలది. అబ్జధామాస్య=చంద్రునికాంతిం బోలినకాంతి గలమోము గలది. హరిమధ్య=సింహపునడుముం బోలిననడుము గలది, అళిశిరోజ=తుమ్మెదలం బోలినకురు

లు గలది. చాపసుభ్రూశ్రీయుగళ = ధనువులం బోలినకనుబొమలజంట గలది. నకశిఖం ఘు = మొసళ్లం బోలినపిక్కలు గలది. అతులకన్య = సాటిలేనికన్య; సరసక్రియాలరాశి = శృంగారముతోఁ గూడినచెష్టలపుంజమును, కాదె = కాదా? అగు నని యర్థము. ఇందుఁ గుంభశబ్దము మొదలగునవి కుచాదుల కుపమానము లగుగజకుంభము మొదలగు వానిని బోధించుచు నప్రకృత మైనరాశిరూపార్థమును దోఁపించును. (ధ్వనింపఁ జేయును.) కావున నిందు ద్వాదశరాసులనామములు నిమిడి యున్నవి. గోనితంబ యనుచో గోశబ్దము వృషభరాశిని బోధించును. హరి = సింహరాశి. అబ్జధామ = కర్కటకము. చంద్రుని ల్లనియర్థము. అళి = వృశ్చికము. నక్ర = మకరము, సరస = మిథునము. శృంగారరసముతోఁ గూడినది క్రియ = మేషము తక్కినది సుగమము.

మ॥ గతి మత్తేభము, నాస చంపక, మొగిన్ ♦ గైశ్యంబు కందంబు, సం
గతవాక్యంబులు మత్తకోకిలలు, దృ ♦ గ్వ్యాపార మయ్యుత్పల
ద్యుతి, మో మంబురుహంబు, దేహరుచి వి♦ద్యున్మాల, యీమానినీ
తతవృత్తస్థితు లెన్నఁగాఁ దరమె త♦ద్వాగ్జాని కైనన్ ధరన్॥ 113

గతి = (ఈమె) నడక, మత్తేభము = మదగజము. ఈమె నడక మదగజమునడకం బోలు నని భావము. నాస = ముక్కు, చంపకము = సంపంగిపువ్వు, ఒగిన్ = క్రమముగా, కైశ్యంబు = కేశపాశము, కందంబు = మేఘము, సంగతవాక్యంబులు = యుక్తము లగుమాటలు, మత్తకోకిలలు = మదించినకోయిలలు, మాటలు కోకిలపలుకులం బోలు నని యర్థము. దృగ్వ్యాపారము = చూపు, అయ్యుత్పలద్యుతి = ప్రసిద్ధ మైననల్లగలువలకాంతివంటికాంతి గలది మోము, అంబురుహంబు = పద్మము. పద్మసదృశ మని యర్థము. దేహరుచి = దేహకాంతి, విద్యున్మాల = మెఱుపులపఙ్క్తి, ధరన్ = భూమియందున్, ఈమానినీతతవృత్తస్థితులు, ఈమానిని = ఈస్త్రీయొక్క, తత = విశాలమైన, వృత్తస్థితులు = మంచినడవడులయునికలను, (ఈమానినీ = ఈస్త్రీయందు, తత = ఆయాయిరూపముల వ్యాపించియున్న, వృత్త = ఉత్పలమాల మొదలైనపద్యములయొక్క, స్థితులు = స్థితులను) వాగ్జాని కైనన్ = బ్రహ్మ కైనను, ఎన్నఁగాన్ = లెక్కించుట, తరమె = శక్యమా. కా దని యర్థము. ఈమెనడలు మదపుటేనుఁగునడలను, ముక్కు సంపంగిపువ్వును, శిరోజములు మేఘములను, పలుకులు కోయిలలను, చూపులు నల్లగలువలను, మోము పద్మమును, దేహకాంతి మెఱుములను బోలు ననియు నీమెనడవడి మిగుల నుత్తమ మైన దనియుఁ బ్రకృతార్థము పరికరణముచే స్పష్టము కాఁగా నిందలి మ

త్తేభము మొదలైనశబ్దములు వ్యంజనావృత్తిచే వృత్తము లను నవార్థము బోధించును గావున నీమె నడకలు మొదలగునవి మత్తేభము మొదలైనవృత్తములం బోలి యుండె ననియుఁ జెప్పం దగు.

క॥ అని యిటు హరిమది విస్మయ
మెనయఁగ నయ్యన్నుమిన్న ♦ నెన్ని పొదలమా
టునఁ దద్రూపాతిశయం
బున కానందాబ్ధిఁ దేలి ♦ మునుఁగుచు నుండెన్॥ 114

హరి = కృష్ణుఁడు, ఇటు = ఈప్రకారము, మదిన్ = మనసునందున్, అని = అనుకొని, విస్మయము = ఆశ్చర్యము, ఎనయఁగన్ = కలుగఁగాన్, అయ్యన్నుమిన్నన్ = ఆస్త్రీశ్రేష్ఠమును, ఎన్ని = స్తుతించి, పొదలమాటునన్ = తీవయిండ్లమఱుఁగునను, తద్రూపాతిశయమునకున్ = ఆమెచక్కఁదనముయొక్కయాధిక్యమునకున్, ఆనందాబ్ధిన్ = సంతోషసముద్రమునందున్, తేలి మునుఁగుచు నుండెన్ = ఓలలాడుచుండెను. ఆమెసౌందర్యమునకు మిక్కుటముగ సంతసించుచుండె నని యర్థము.

వ॥ అనిన విని పరిక్షిన్నరేంద్రుం డవ్వలికథ నెఱింగింపు మని శుక
యోగీంద్రు నడుగుటయు (సుగమము) 115

మ॥ అమరేంద్రప్రతిమానవైభవ భవా ♦ బ్జస్వర్ధునీకల్పక
ద్రుమడిండీరపటీరహీరశశభృ ♦ ద్దుగ్ధాబ్ధిసంస్పర్ధిస
ద్విమలాఖండయశఃపరంపర పరో ♦ ర్వీనాథగర్వాపహా
క్రమదోర్విక్రమ విక్రమార్కనృపసం ♦ గ్రామస్ఫురత్సాహసా॥

అమరేంద్రప్రతిమానవైభవ, అమరేంద్ర = ఇంద్రునియొక్క, (వైభవము) ప్రతిమాన = పోలిక గల, వైభవ = సంపదఁ గలవాఁడా, భవా.....పరంపర, భవ = శివునితోడను, అబ్జ = తామరలతోడను, స్వర్ధుని = ఆకాశగంగతోడను, కల్పకద్రుమ = కల్పవృక్షములతోడను, డిండీర = నురువుతోడను, పటీర = గంధముతోడను, హీర = వజ్రములతోడను, శశభృత్ = చందురునితోడను, దుగ్ధాబ్ధి = క్షీరసముద్రముతోడను, సంస్పర్ధి = విరోధించుచున్న, (సదృశ మగుచున్న యని యర్థము.) సత్ = శ్రేష్ఠమైన, విమల = స్వచ్ఛమైన, అఖండ = పూర్ణమైన, యశఃపరంపర = కీర్తిసమూహము గ

లప్రభువా, పరోర్వీనాథ......క్రమ, పరోర్వీనాథ=శత్రురాజులయొక్క, గర్వ=మదమును, అపహా=పోఁగొట్టెడు, క్రమ=రీతిగల, దోర్విక్రమ = బాహుపరాక్రమముగలరాజా, విక్రమార్క...సా, విక్రమార్కనృప=విక్రమార్కమహారాజునకువలె, సంగ్రామ=యుద్ధమందు, స్ఫురత్=ప్రకాశించుచున్న. సాహాసా=తెగువ గలప్రభువా.

క॥ చంచలనయనానూతన
పంచాయుధ సుజనకల్ప ♦ పాదప సరసో
దంచితగంభీరవచః
పంచాయుధతల్ప వినయ ♦ భవ్యాకల్పా॥ 117

చంచలనయనా=స్త్రీలకు, నూతనపంచాయుధ = క్రొత్తమన్మథుఁడా, ప్రాచీనుఁ డగుమన్మథుఁ డనంగుఁడును నీయన సాంగుఁడును గాన నూతనమన్మథుఁ డని చెప్పెను సుజనకల్పపాదప=సజ్జనులకుం గల్పవృక్షమా! సరసో.....తల్ప, సరస=మనోహర మైన, ఉదంచిత=మిగుల పూజ్య మైన, గంభీర = అర్థపాటవము గల, వచః=సంభాషణమునందు, పంచాయుధతల్ప=శేషుఁడా, (గద, ఖడ్గము, ధనువు, శంఖము, చక్రము ననునైదాయుధములు గలవాఁడు పంచాయుధుఁడు=విష్ణువు ఆయనకుం దల్పము=పాన్పు శేషుఁడు. విష్ణువు క్షీరసముద్రమున శేషునిపై శయనించియుండు నని పురాణములం బ్రసిద్ధి.) వినయభవ్యాకల్పా=అడఁకువ యనుమనోహర మైనభూషణము గలప్రభువా.

మాలినీవృత్తము॥ స్థిరలసదుపమాక ♦ క్షేత్రధాత్రీధరేంద్రా
ధరపరిసరసాశ్మ ♦ స్థాపితప్రోజ్జ్వలద్గో
పురవరశిఖరాళీ ♦ భూషితవ్యోమసీమా
ప్రరుచిరగుణధామా ♦ రావువంశాబ్ధిసోమా॥ 118

స్థిర......సీమా, స్థిర=శాశ్వతముగా, లసత్=ప్రకాశించుచున్న, ఉపమాకక్షేత్ర=ఉపమాక యనుపుణ్యస్థలమునందలి, ధాత్రీధరేంద్ర=పర్వతముయొక్క, అధర=క్రిందటి, పరిసర=సమీపప్రదేశమందు, సాశ్మ=రాలతోఁ గూడునట్లు, స్థాపిత=నిల్పఁబడిన, (కట్టింపఁబడిన యని యర్థము.) ప్రోజ్జ్వలత్ = మిక్కిలి ప్రకాశించుచున్న, గోపురవర=శ్రేష్ఠ మైనగోపురముయొక్క, శిఖరాళీ=శిఖరసమూహముచేతను, భూషిత=అలంకరింపఁబడిన, వ్యోమసీమా=ఆకాశప్రదేశము గలప్రభు

వా! ప్రరుచిరగుణధామా=మిక్కిలి మనోహరము లగుగుణములకు నివాసమా, రావువంశాబ్ధిసోమా = రావువారివంశ మనుసముద్రమునకుం జంద్రుఁడ వగురామరాయప్రభూ!

గద్యము.—ఇది శ్రీమహాభారతీప్రసాదాసాదితకవితామతల్లికా
ల్లమరాజవంశజాపస్తంబసూత్రవదెల్లనార్యపౌత్త్ర
రంగశాయినామార్యపుత్త్ర హారితసగోత్ర
పవిత్ర సుకవిజనవిధేయ సుబ్రహ్మణ్యక
వినామధేయప్రణీతం బైనభద్రాపరిణ
యం బనుమహాప్రబంధంబునందు
ద్వితీయాశ్వాసము.

శ్రీ ర స్తు

శు భ మ స్తు.

అ వి ఘ్న మ స్తు

# భ ద్రా ప రి ణ య ము.

## తృ తీ యా శ్వా స ము.

శ్రీవనితావరపదరా
జీవాయతనాంతరంగ! శ్రితజనవనచై
త్రా! విబుధనుతచరిత్రా!
రావుకులజచంద్ర! రామ రాయనరేంద్రా. 1

శ్రీవనితా......తరంగ, శ్రీ = లక్ష్మియనెడు, వనితా = స్త్రీయొక్క, వర = భర్తయైనవిష్ణువుయొక్క, పదరాజీవ = పాదపద్మములకు, ఆయతన = నివాసస్థలమైన, అంతరంగ = మనసుగలప్రభూ! మనసున విష్ణునిపాదపద్మముల ధ్యానించురాజా యని యర్థము. శ్రితజనవనచైత్రా = ఆశ్రయించినజను లనెడుతోఁటకు వసంతుఁడా! చైత్రుఁడు వనమునకుంబోలె నాశ్రయించినవారికి నీరాజు ఫలము లొసగుచున్నవాఁ డని యర్థము విబుధనుతచరిత్రా, విబుధ = విద్వాంసులచే, నుత = స్తోత్రము చేయఁబడిన చరిత్రా = నడవడి గల, రావుకులజచంద్ర = రావువంశమున జన్మించినచంద్రుఁడా! ఇట రాజునందుఁ జంద్రత్వారోపము వంశమునందు సముద్రత్వారోపమునకు గమకము గాన నేకదేశవర్తి రూపకాలంకారము. రామరాయనరేంద్రా = ఓరామరాయప్రభూ!

గీ. అవధరింపుము శౌరిభ వ్యచరితంబుఁ
దొల్లి సూతుండు శౌనకా దులకుఁ జెప్పి
నట్టిరీతిఁ బరిక్షిద్ధ రాధినాథ
తిలకమున కిట్లు శుకయోగి తెలుపఁదొడఁగె. 2

అవధరింపుము = చిత్తగింపుము. తొల్లి = పూర్వము, సూతుండు, శౌరిభవ్యచరితంబుఁ = కృష్ణునిమనోహర మైనచరిత్రము, శౌనకాదులకుఁ, చెప్పినట్టిరీతిన్ = చెప్పినరీతిచేతను, శుకయోగి, పరిక్షిద్ధరాధినాథతిలకమునకుఁ = పరిక్షితుఁ డను రాజశ్రేష్ఠునకు, ఇట్లు, తెలుపన్ = తెలియఁజేయుటకు, తొడఁగెఁ = ప్రారంభించెను.

ఉ. నందకుమారువీక్షణక ♦ నద్ఘనమత్తమిళిందబృంద మా
సుందరిమోముఁదమ్మి పయి ♦ జొబ్బిలుహాసవిలాసచిక్కణా
స్పందమరంద మానునెడఁ ♦ బ్రాపయి ముంగురు లాదరించెఁ జె
న్నందఁగ రెండునున్భ్రమర ♦ కాఖ్యములౌటఁగదా సుహృత్క్రియల్.

నందకుమారు......బృందము, నందకుమారు = కృష్ణునియొక్క, వీక్షణ = చూపులనెడు, కసత్ = ప్రకాశించుచున్న, ఘన = అధిక మైన, మత్త = మదించిన, మిళింద బృందము = తుమ్మెదలగుంపు, ఆసుందరిమోముఁదమ్మిపయిన్ = ఆకన్నియయొక్క మోమనెడుతామరపువ్వుమీఁదను, జొబ్బిలు... ..మరందము, జొబ్బిలు = ఉత్పన్నమయ్యెడు, హాస = నగవును, విలాస = శృంగారచేష్టలు ననెడు, చిక్కణ = తఱచైన, ఆస్పంద = కదలని, ( గడ్డకట్టిన ) మరందము = పూఁదేనెను, ఆనునెడన్ = త్రాగునపుడు, ముంగురులు = అలకలు, ప్రాపయి = సహాయపడి, చెన్నందఁగన్ = అనుకూలపడునట్లు, ఆదరించెన్ = ప్రేమఁ జూపెను రెండును = తుమ్మెదలును ముంగురులునుం గూడ, భ్రమరకాఖ్యములు = భ్రమరకము లను పేరుగలవి, ఔటఁగదా = అగుటచేత నే కదా, సుహృత్క్రియల్ = మిత్రులు మిత్రులకుఁ జేయుకార్యములు. ఆదరించుటయని యర్థము. ( అయ్యెన్ ) ( ని ) షట్పదభ్రమరాళయ యనియును, అలకాశ్చూర్ణకుంతలాస్తే। లలాటేభ్రమరకా యనియు నమరుఁడు

కృష్ణునిచూపు లామెమోమున వ్రాలునపుడు ముంగురు లాదరించె, ననఁగాఁ, దుమ్మెదలు పద్మమున వ్రాలి మకరందము ద్రావినట్లు దృష్టు లచ్చటం బ్రవేశించి ముఖవిలాసముం జూచి సంతసించుచుండఁగా నచట మున్న కురులు ముఖమున కమితసౌందర్యము గల్పించి యధిక మైనసంతసముం గన్నులకుఁ గలిగించె నని యాశయము. ఇట్టిసంతసమును గురులు స్వభావముననే చేయఁగాఁ జూపులయందు భ్రమరత్వ మారోపించి వానితో సమాననామము కల్గుటచే నట్లు చెసె నని చెప్పుటచే రూపకానుప్రాణితోత్ప్రేక్షాలంకారము

చ. పదముల నాసి యూరువులఁ ♦ బారి నితంబమునాటి నాభికం

బొదలి వళిత్రియం బెనసి ♦ ముద్దులనిద్దవుటూరు హత్తి పై
నుదుటుగ నున్నయున్నతప ♦ యోధరచక్రము లాక్రమించె న
మ్మదవతిఁ జూచుచో యదుకు ♦ మారునిమోహనదృష్టిజాలముల్.

యదుకుమారునిమోహనదృష్టిజాలముల్ = బాలకృష్ణునిసుందర మైనచూపులను మోహము, అమ్మదవతిన్ = ఆభద్రను, చూచుచోన్ = చూచునపుడు, పదములన్ = పాదములను, ఆని = ప్రవేశించి, ఊరువులన్ = తొడలను, పాఱి = వ్యాపించి, నితంబమున్ = కటిప్రదేశమును, నాటి = తగుల్కొని, నాభికన్ = నాభియందున్, పొదలి = వర్ధిల్లి, వళిత్రయంబు = కడుపుమీఁదిముడుతలను, ఎనసి = పొంది, ముద్దులనిద్దపుటూరున్ = మనోహర మైననున్నని నూగారును, హత్తి = అంటుకొని, పైన్ = పిమ్మటను, ఉదుటుగన్ = గర్వము గలుగునట్లు, ఉన్నయున్నతపయోధరచక్రములు, ఉన్న, ఉన్నత = ఎత్తైన, పయోధరచక్రములు = జక్కవలంబోలినకుచములను, ఆక్రమించెన్ = వశపఱచుకొనెను

కృష్ణునిదృష్టి యామెయవయవములం గ్రమక్రమముగఁ జూచుచుఁ జిట్టచివరకు నున్నతప్రదేశముఁ బొందె నని భావము.

క. ఈరీతిఁ బుష్పవనమున
నారీతిలకమును జూచి ♦ నవ్యానంద
స్ఫారమతి యగుచుఁ జెంతకు
సారసనయనుండు సేరఁ ♦ జనుసమయమునన్. 5

సారసనయనుండు = కృష్ణుఁడు, ( పద్మములం బోలినకన్నులు గలవాఁడు ) ఈరీతిన్ = ఈప్రకారముచేతను, పుష్పవనమునన్ = పూఁదోఁటయందున్, నారీతిలకమును = భద్రను, ( స్త్రీశ్రేష్ఠమును ) చూచి = కన్గొని, నవ్యానందస్ఫారమతి, నవ్య = నూతన మైన, ఆనంద = సంతసముచేత, స్ఫార = అతిశయించిన, మతి = బుద్ధి గలవాఁడు, అగుచున్, చెంతకున్ = సమీపమునకున్, చేరం జనుసమయమునన్ = చేరునట్లు, వెళ్లెడుకాలమునందున్ ( ముందుపద్యముతో నన్వయము. )

మ. అలహిందోళపురక్తి మాధవుఁడు ప్ర ♦ త్యక్షుం బగుణ్ వీణనో
యలివేణీ యది మేళగించి లలితం ♦ బౌగీతముం బాడుమం

చు లతాతన్వి యొకర్తు దెల్పఁ జెలియ • చ్చోఁ నట్లు కావింప న
ప్పలుకుల్ దా విని శౌరి యిప్డు పొడచూ • ప న్వేళయంచున్వడిన్.

ఓయళివేణీ = ఓభద్రా, (తుమ్మెదచాలుం బోలినజడగలదానా) మాధవుఁడు = వసంతుఁడు (కృష్ణుఁ డనియు ధ్వనించును) అలహిందోళపురక్తిన్, అల = ప్రసిద్ధమైన, హిందోళపురక్తిన్ = హిందోళ మనురాగమునందలి ప్రేమచేతను, ప్రత్యక్షుంబగున్ = సాక్షాత్కరించును. శిశిరఋతువునకు వసంతకాలమునకు నడుమం బాడునొకానొకరాగము హిందోళ మనంబడు. అది = ఆరాగమును, వీణన్ = వీణయందున్, మేళగించి = కూర్చి, లలితంబు = శ్రావ్య మైనది, ఔగీతమున్ = అయ్యేదుపాటను, పాడుము = గానము చేయుము అంచున్, ఒకర్తులతాతన్వి = ఒకానొకస్త్రీ, తెల్పన్ = తెలియఁజేయఁగాన్, చెలి = భద్ర, అచ్చోన్ = అస్థలమునందున్, అట్లు కావింపన్ = ఆహిందోళరాగమును వీణయందు సంఘటించి పాడఁగాన్, శౌరి = కృష్ణుఁడు, తాన్ అప్పలుకుల్ = ఆమాటలను, విని = ఆలకించి, పొడచూపన్ = కాన్పించుటకున్, ఇప్డువేళ = ఇది సమయము, అంచున్ = అని తలఁచుచున్, వడిన్ = త్వరతోన్, ముందుపద్యముతో నన్వయము

శిశిరవసంతములకు సంధియందు హిందోళముఁ బాడుదురు గావున నట్లుచేయుము. మాధవుఁడు (వసంతుఁడు) నీకు సాక్షాత్కరించు నని యొకయింతి చెప్పఁగా భద్ర యట్లు చేయుచున్నపుడు వసంతునకుఁ బర్యాయ మైనమాధవపదము తనకుం జెల్లుఁ గావున నిదియే యీమెకుం గనుపడుసమయ మనికృష్ణుఁడు తలఁచి యని తాత్పర్యము.

క. కుసుమలతావృతి వెలువడి
యసదృగ్వనదేవతాగ • ణాంతర్గతుఁ డై
యెసఁగువసంతుఁడొకో యనఁ
బొసఁగి సతీసమితి మధ్య • మున నిలిచినచోన్. 7

కుసుమలతావృతిన్ = పువ్వుతీఁగెలకట్టువనుండి, వెలువడి = బయలువెడలి, అసదృక్......గతుఁడై = సాటిలేనివనదేవతలనడుమ నున్నవాఁడై, ఎసఁగువసంతుఁడొకో యనన్ = ప్రకాశించువసంతుఁడో యనునట్లు, పొసఁగి = సాక్షాత్కరించి, సతీసమితిమధ్యమునన్ = స్త్రీసభామధ్యమందు, నిలచినచోన్ = ఉన్నప్రుడు, చోటుశబ్ద మిటఁగా

లముం జెప్పను. ముందుపద్యములో నన్వయము.

సీ. ప్రకటాస్యచంద్రచం ♦ ద్రికవోలె మొలకన
వ్వొలుకువానిని సిరు ♦ ల్గులుకువాని
లలితరూపమునఁ గ ♦ ల్వలజేని వలజేని
మించువాని మొయిళ్ల ♦ మించువాని
హరినీలనీలాభ ♦ నలరారుమీసంపు
లీలవానిఁ బసిండి ♦ చేలవాని
నరవిందములకు విం ♦ దగుకన్నుఁగవతళ్కు
లొలయువాని శుభాప్తి ♦ వెలయువాని
మహితకుండలకౌస్తుభ ♦ మకుటకటక
కాంచికాంగదధాగధ ♦ గ్యములవాని
నాజగన్మోహనుని శౌరి ♦ నద్భుతాత్మ
లగుచుఁ గని లేచి నిలిచి ర ♦ య్యబ్జముఖులు. 8

అయ్యబ్జముఖులు = మీఁదఁ జెప్పినభద్రమొద లగుస్త్రీలు, అద్భుతాత్మలు = ఆశ్చర్యముతోఁ గూడినమనసుగలవారు, అగుచున్, ప్రకట......వోలెన్, ప్రకట = స్ఫుటమైన, ఆస్య = మోము అనెడు, చంద్ర = చంద్రునియొక్క, చంద్రికవోలెన్ = వెన్నెలవలె మొలకనవ్వు = మందహాసమును, ఒలుకువానిన్ = ప్రకటించువానిని, సిరుల్ = శోభలను, కులుకువానిన్ = వెదచల్లువానిని, లలితరూపమునన్ = మనోహరమైనచక్కఁదనముచేతను, కల్వలజేనిన్ = చంద్రునిని, వలజేనిన్ = మన్మథునిని, మించువానిన్ = అతిశయించువానిని, మొయిళ్లన్ = మేఘములను, మించువానిన్ = అతిశయించిన ( శరీరచ్ఛాయ గల ) వానిని, హరినీలనీలాభన్ = ఇంద్రనీల మనుమణియొక్క నల్లనిచాయం బోలినచాయచేతను, అలరారుమీసంపులీలవానిన్ = ప్రకాశించుమీసంపు సొగసు గలవానిని, పసిండిచెలవానిన్ = బంగారు (వన్నె గల) వస్త్రము గలవానిని, అరవిందములకున్ = పద్మములకున్, విందు = చుట్టము, అగుకన్నుఁగవతళ్కులు = అయ్యెడు నేత్రములజంటయొక్క కాంతులను, ఒలయువానిన్ = పొందువానిని, శుభాప్తిన్ = మేలు పొందుటచేతను, వెలయువానిన్ = ప్రకాశించువానిని, మహిత......

వానిన్, మహిత=పూజ్యమైన, కుండల = తమ్మెంట్లయు, కౌస్తుభ=కౌస్తుభమను (సముద్రమునఁ బుట్టినమణితోఁ గూడిన) దండయొక్కయు, మకుట=కిరీటముయొక్కయు, కటక=కడియములయొక్కయు, కాంచికా=మొలత్రాటియొక్కయు, అంగద=బాహుపురులయొక్కయు, ధాగధగ్యములవానిన్=ధగధగ లాడెడుకాంతి గలవానిని, ఆజగన్మోహనునిన్=సన్నిహితుఁడైనట్టియు లోకము నంతను వలపించునట్టియు, శౌరిన్=కృష్ణునిని, కని=చూచి, లేచి నిలిచిరి ఇందు యమక మనుశబ్దాలంకారమును, రూపకము నుపమయు ననునర్థాలంకారములును గలవు

క. కలయ వెలుఁ గొందురుచిఁ జు
క్కలమధ్యమునందు నిందు ♦ కళ యన భద్రా
లలనారత్నం బనుగుం
జెలువలలో నుండి వింత ♦ చెలువము దోఁపన్. 9

భద్రాలలనారత్నంబు=భద్ర యనుస్త్రీశ్రేష్ఠము, కలయన్=అంతటను, వెలుఁ గొందురుచిన్=ప్రకాశించుకాంతిచేతను, చుక్కలమధ్యమునందున్=నక్షత్రములనడుమను, ఇందుకళ యనన్=చంద్రుకళవలె, అనుగుంజెలువలలోనన్=ప్రియసఖులనడుమను, ఉండి, వింతచెలువము = అపూర్వమైనసౌందర్యము, తోఁపన్ =కనుపడఁగాన్, ముందుపద్యముతో నన్వయము

చ. తమకము నబ్బురంబును ము♦దంబు నెదం గదియంగ నేత్రప
ద్మములు ప్రఫుల్లముల్ సలలి♦తంబులు నై చలదృఙ్మిళిందబృం
దములను గ్రిమ్మరింపఁ గర♦నస్తనము ల్పులకింపఁ గాంచెఁ బ్రే
మ ముడిగొనంగ నయ్యదుకు♦మారుని దివ్యవిలాసధారునిన్. 10

తమకము=త్వరయును, అబ్బురంబును=ఆశ్చర్యమును, ముదంబును=సంతోషమును, ఎదన్=మనసునందు, కదియంగన్=వ్యాపింపఁగాన్, నేత్రపద్మములు=కన్నుఁదామరలు, ప్రఫుల్లముల్=వికసించినవియును, సలలితంబులు నై=మిగులమనోహరములు నై, చల.....బృందములను, చల=చలించుచున్న, దృక్=చూపుల నెడు, మిళిందబృందములను=తుమ్మెదలసమూహమును, క్రిమ్మరింపన్= వెలికిఁజిమ్మఁగా, కఠినస్తనముల్, పులకింపన్=గగుర్పొడువఁగాన్, ప్రేమ=స్నేహము, ముడిగొనఁగన్=దృఢపడునట్లుగా, దివ్యవిలాసధారునిన్=సుందరమైనశృంగారచేష్టలు ధరించిన

వానిని, అయ్యదుకుమారునిన్ = ఆకృష్ణుని, కాంచెన్ = చూచెను దీనికిం గర్త్రి వెను కటిపద్యమునందలిభద్ర. రూపకాలంకారము. ఇందు రోమాంచ మను సాత్త్వికభావము చెప్పంబడెను

మ. తొలుకార్మించులసంచులై కువలయ♦స్తోమైకదామంబులై
బెళుకుంబేడిసమీలలీల లయి దీ♦ప్తిన్ ఖంజనాప్తంబులై
తెలినెత్తమ్ములతమ్ములై తళుకులై♦దివ్యచ్ఛకోరాళికా
ళులునై కప్పె ముకుందుమేన నపుడా♦లోలాక్షివీక్షాతతుల్. 11

అపుడు = కృష్ణుం జూచునపుడు, ఆలోలాక్షివీక్షాతతుల్ = ఆభద్రయొక్క దృష్టిసముదాయములు, తొలుకార్మించుఁగంచులై = వర్షాకాలమునందలి మెఱుపులయందము కలవి యై, ( అతిచంచలములై యని భావము ) కువలయ.. . లై = కలువలగుంపులయొక్క దండలై, బెళుకుంబేడిసమీలలీల లయి = తళతళలాడెడుచేఁపలయొక్క విలాసములు కలవి యై, దీప్తిన్ = కాంతిచేతను, ఖంజనాప్తంబు లై = కాటుకపిట్టలకుం జెలులై, తెలినెత్తమ్ములతమ్ములై = తెల్లనితామరపూవులకుసోదరులై ( సమానము లై యని యర్థము ) తళుకులై = ప్రశస్తమైనకాంతి గలవి యై, దివ్యచ్ఛకోరాళికిన్ = ప్రకాశించుచకోరసముదాయమునకున్, ఆళులునై = చెలికత్తెలునై, ముకుందుమేనన్ = కృష్ణునిశరీరమందున్, కప్పెన్ = వ్యాపించెను

ఉ. వీలుగ వాలుఁగంటిబొమ ♦ వింటివిలోలదృగాశుగాళి గో
పాలువిశాలవక్షమునఁ ♦ బర్వఁగ నయ్యద నెంచి యించువి
ల్దాలుపు దంటవింటఁ బది ♦ లంబుగఁ దుమ్మెదనారి మ్రోయఁ బ్రో
యాలిపయిం గడంగి కుసు♦మాస్త్రము లేయఁ దొడంగె నేపునన్.

వాలుగంటి.. ..గాళి, వాలుగంటి = భద్రయొక్క, ( సోగకన్నులు కలది ) బొమవింటి = కనుబొమ లనెడుధనుస్సంబంధమైన, విలోల = చంచలమైన, దృక్ = చూపు లనెడు, ఆశుగ = బాణములయొక్క ( వేగమునం బోవునవి ) ఆళి = సముదాయ వీలుగన్ = తగునట్లు, గోపాలువిశాలవక్షమునన్ = కృష్ణమూర్తి పేరురమునందున్, పర్వఁగన్ = సోఁకఁగాన్, ఇంచువిలుదాలుపు = మన్మథుఁడు, ( చెఱకువింటిని ధరించినవాఁడు ) అయ్యదను = ఆసమయమును, ఎంచి = తెలిసికొని, దంటవింటన్ = బలముగలధనుసువందు, పదిలంబుగన్ = జాగ్రత్తగా, తుమ్మెదనారి = తుమ్మెద లనెడునల్లె

ప్రాదు, మ్రోయఁగన్ = ధ్వనింపఁగాన్, పోద్రుమాలిపయిన్ = శత్రుమీఁదను, కడంగి = పూని, కుసుమాస్త్రములు = పుష్పబాణములను, ఏపునన్ = విజృంభణముతోడన్, ఏయఁ దొడంగెన్ = వేయుట కారంభించెను. ఆమె కృష్ణునిలో మ్మనఁ జూపు లనుబాణముల ను బ్రయోగింపఁగా నది సహింపక వెంటనే యామెపైని మన్మథుఁడు పూవుటమ్ములం బ్రయోగించెను. అనఁగా నామెయుఁ గృష్ణుం జూచినవెంటనే మన్మథవికారము గల్గె నని భావము.

ఉ. కోరిక లూరు నెమ్మెయి గగుర్పొడుచుం గడకంటఁ దారకల్
చేరి పరిభ్రమించు నునుఁ జెక్కులఁ జెమ్మట గ్రమ్ము నెమ్మి నొ
య్యారపుఁజూపులజ్జ బెరయం గను జక్కఁగ మోడ్పునొందుచున్
సారెకు వెల్వడుం దొడరి శౌరిని జూచునెడం బడంతికిన్॥ 13

తొడరి = ప్రయత్నించి, శౌరిని = కృష్ణుని, చూచునెడన్ = చూచుకాలమునం దున్, పడంతికిన్ = భద్రకున్, కోరికలు = ఇచ్ఛలు, ఊరున్ = పుట్టును, నెమ్మెయి = శరీరము, గగుర్పొడుచున్ = పులకరించును, తారకల్ = కంటిగ్రుడ్లు, కడకంటన్ = కంటితుదయందున్, చేరి, పరిభ్రమించున్ = చలించును, నునుఁజెక్కులన్ = నున్నని చెక్కిళ్లయందున్, చెమ్మట = స్వేదము, క్రమ్మున్ = వ్యాపించును, ఒయ్యారపుఁజూపు = సొగసైనదృష్టి, లజ్జ = సిగ్గు, బెరయంగన్ = ఉత్పన్నముకాఁగా, చక్కఁగన్ = అందముగాన్, మోడ్పునొందుచున్ = ముకుళించుచున్, నెమ్మిన్ = ప్రేమచేతను, సారెకున్ = మాటిమాటికిన్, వెల్వడున్ = ( తిరిగి ) వ్యాపించుచుండును. భద్రకుం గృష్ణుని జూడఁగనే కోరిక పుట్టె ననియుఁ బిమ్మట దానికిం బోషకము లగుపులకాదిసాత్త్వికభావంబులును సహకారి యగులజ్జ యనుసంచారిభావము నుత్పన్న మయ్యె నని తాత్పర్యము. ( కోరిక యనఁగా రతి సంభోగవిషయ మైనయిచ్ఛావిశేషము రతి యనంబడు. ఇదియే శృంగారమునకు స్థాయిభావము ఈయిచ్ఛావిశేష మనుభవమువఱకు నిలిచిన స్థాయి యనంబడు ఇదియే శృంగారరసమునకుం బూర్వావస్థ. లోపల నున్న యనురాగమును సూచించు రోమాంచా ( గగుర్పాటు ) దులు సాత్త్వికభావము లనంబడు. రసమునకు సహకారు లగునిర్వేదాదులు సంచారులు. అందు ననంగనిమిత్త మైనరాగాదులచేఁ జేతస్సంకోచనము లజ్జ యనంబడు. డాఁగుట, వైవర్ణ్యము, నధోముఖత్వము, నేత్రనిమీలనము మొదలగునవి దీనికార్యములు ) నాయికముగ్ధ

వ॥ ఇత్తెఱంగున నత్తరుణీరత్నం బత్తామరసాక్షు నీక్షించుచుఁ దనమ నంబున, 14

అత్తరుణీరత్నంబు = (ఆ స్త్రీశ్రేష్ఠము) భద్ర, ఇత్తెఱంగునన్ = ఈప్రకారము చేతను, అత్తామరసాక్షుని = ఆకృష్ణుని, ఈక్షించుచున్ = చూచుచును, తనమనంబు నన్ = తనమనసునందున్ ఇది 17 వ పద్యమందలి యని యనుదానితో నన్వయించుఁ

సీ॥ తనకాంతిదరహాస ♦ మున నిల్పి భూచరుం
డగుచు వర్తించుసు ♦ ధాంశుఁ డొక్కొ
తనదుపద్మాంబక ♦ త్వము కన్నులనె తాల్చి
సాంగుఁడై మెలఁగున ♦ నంగుఁ డొక్కొ
తనసౌరభము వక్త్ర ♦ మున నించి నిజవిలా
సము చూప వచ్చువ ♦ సంతుఁ డొక్కొ
తనహరిడింభక ♦ త్వము మధ్యమునఁ బూని
యవనికి డిగినజ ♦ యంతుఁ డొక్కొ
వీరు గావైన నీదివ్య ♦ విభవభువన
మోహనాకారలావణ్య ♦ ములు గలుగునె
కాన మద్వల్లకీగాన ♦ కలన నలరి
శౌరి సాక్షాత్కరించిన ♦ శౌరి యితఁడు॥ 15

తనకాంతి = తనయొక్క (చంద్రునియొక్క) తెల్లనిచాయను, దరహాసమునన్ = చిఱునగవునందున్, నిల్పి = ఉండునట్లు చేసి, భూచరుండు = నేలం దిరుగువాఁడు, అగుచున్, వర్తించుసుధాంశుఁ డొక్కొ = ఉండుచంద్రుఁ డగునేమో, భద్ర తనకు సాక్షాత్కరించినకృష్ణుం జూచి శరీరమంతటను నుండుతెల్లనికాంతిని చిఱునవ్వునందే ధరించి భూమియందు సంచరించెడుచంద్రుఁ డగు నేమో యని సందేహించెనని భావము. తనదుపద్మాంబకత్వమున్ = తనసంబంధమైనతామరపువ్వులనుబాణములు గలుగుట యనుధర్మ (తామరపువ్వులంబోలినకన్నులు గలుగుటయు) ము కన్నులనె = నేత్రములయందే, తాల్చి = ధరించి, సాంగుఁడై = శరీరముతోఁ గూడుకొన్నవాఁడై, మెలఁగుననంగుఁ డొక్కొ = సంచరించెడుమన్మథుఁ డేమో, తనసౌరభము = తన

యొక్క సురభినామము గల్గుటను (పరిమళమును) వక్త్రమునన్ = మోమునందున్, నించి = నిండించి, (ధరించి యని యర్థము.) నిజవిలాసము = తనశృంగారచేష్టలను, చూపన్ = ప్రకటించుటను, వచ్చువసంతుఁ డొక్కొ = ఏతెంచినవసంతుఁడో, తనహారిడింభకత్వము = తనయింద్రునకుం గొడుకగుట యనుసింగపుంబిల్లతనమును, మధ్యమునన్ = నడుమునందున్, పూని = ధరించి, అవనికిన్ = భూమికిన్, డిగినజయంతుఁ డొక్కొ = అవతరించినజయంతుఁడో, (అని సందేహించి) వీరు = నేఁ జెప్పినవారు, కారు. అయినన్ = ఇందొక్కఁ డైనయెడల, ఈదివ్య.....ములు, ఈ = ఇట్టి, దివ్య = ఒప్పిదమైన, భువనమోహన = లోకమునకు వలపు వుట్టించెడు, ఆకార = దేహమును, లావణ్యములు = నిగనిగలాడెడుకాంతియు, కలుగునె = ఉండునా? (ఉండ వని యర్థము) కానన్ = ఆకారణముచేతను, మద్వల్లకీగానకలనన్ = నావీణాగానముయొక్క యొప్పుచేతను, అలరి = సంతసించి, కోరి = అపేక్షించి, సాక్షాత్కరించినశౌరి = ప్రత్యక్ష మైనకృష్ణుఁడు, ఇతఁడె. (అగును) నాకు సాక్షాత్కరించినయీయనమన్మథాదులలో నొకఁ డైన నిట్టిసౌందర్య ముండదు కాఁబట్టి నావీణాగానమునకు సంతసించి వచ్చినకృష్ణుఁడే కాని మ ఱొక్కఁడు గాఁ డని భద్ర నిశ్చయించె నని తాత్పర్యము. నిశ్చయాంత మైనసందేహాలంకారము శ్లేషమూలకాతిశయోక్త్యనప్రాణితము.

సీ॥ అక్షిసాఫల్య మింపా ♦ రఁగా వీనిమేఁ
జెలువంబు గోరి వీ ♦ క్షింపవలదె
విమలగాంధర్వంబు ♦ వినుతి కెక్కఁగ వీని
పైని గీతంబులు ♦ పాడవలదె
కులుకుగుబ్బలసోరు ♦ గొనబు మీఱఁగ వీని
దృఢపరీరంభమ ♦ ర్థింపవలదె
కమ్మకెమ్మోవి వో ♦ క్కఁవుఁజవుల్ దగ వీని
నునుఁజెక్కుఁగవ ముద్దు ♦ గొనఁగవలదె
విలువఁ దెలుపఁగరానియీ ♦ తలిరుఁబ్రాయ
మొలసిఫల మొంద వీనితోఁ ♦ గలసి మెలసి
వలచి వలపించి తమిఁ బెంచి ♦ యలరువిలుతు
కేళికలఁ దేలి సుఖలీలఁ ♦ గ్రాలవలదె॥

అక్షిసాఫల్యము = కన్నులకు ఫలము (కలిమి) ఇంపారఁగాన్ = సంభవించునట్లు, వీనిమేఁజెలువంబు = ఈతనిశరీరముయొక్క చక్కఁదనమును, కోరి = అపేక్షించి, వీక్షింపవలదె = చూడఁగూడదా? కన్నుల ఫలము చెందుట యీతనిసౌందర్యము తప్పక చూడవలయు నని భావము. విమలగాంధర్వంబు = స్వచ్ఛమైనగానము, వినుతికెక్కఁగన్ = ప్రసిద్ధి పొందునట్లు, వీనిపైని గీతంబులు = ఈతనిపేరం గావించినపాటలను, పాడవలదె = పాడఁగూడదా! అవశ్యము పాడవలె నని యాశయము. కులుకుగుబ్బలసౌరు = చక్కఁగఁ గదలెడుస్తనములయందము, గొనబు = మనోహరమై, మీఱంగన్ = అతిశయించునట్లు, వీనిదృఢపరిరంభము = ఈతనిబిగువుకౌఁగిలిని, అర్థింపన్ = వేఁడికొనుట, వలదె = వలదా? ముఖ్యముగ నపేక్షింపఁ దగు నని యాశయము. కమ్మకెమ్మోవిచొక్కపుఁజవుల్ = మధురమైనమెత్తనిపెదవియొక్క నిర్మలమైనరుచులు, తగన్ = ప్రకాశింపఁగాన్, వీనిమునుఁజెక్కుఁగవ = ఇతనిమనోహరమైనచెక్కిళ్లజంటను, ముద్దుగొనఁగ వలదె = ముద్దుపెట్టికొన వలదా? వలయు నని యర్థము. విలుత = తెలను, తెలుపఁగ రానియీతలిరుఁబ్రాయము = చెప్పలేనట్టియీలేఁతవయసు, ఫలము = ఫలమును, ఒలసి = కదిసి, ఒందన్ = అనుభవించునట్లు, వీనితో, కలసిమెలసి = ఏకీభవించి, వలచి = కామించి, వలపించి = కోరునట్లు చేసి, తమిన్ = అపేక్షను, పెంచి = వృద్ధిపఱిచి, అలరువిలుకునికేళికలన్ = మన్మథక్రీడలందున్, తేలి = తృప్తినొంది, సుఖలీలన్ = సుఖమైనవిలాసముతోన్, గ్రాలవలదె = చరింపవలదా (కూడు నని యర్థము)

మ॥ అని యూహించునృపాలకన్యకకు మున్నా శౌరి వీక్షించి వ
చ్చినయాయోగిని పల్కె నిట్లు కమలాక్షీ! నీదుభాగ్యం బిఁకెం
తన వచ్చున్ జలజాసనాదుల కశక్యం బైనగోపాంగనా
జనవిక్షేపము నేఁడు నీకడకు నిచ్చన్ వచ్చె వీక్షించితే॥ 17

అని = ఇట్లు, ఊహించునృపాలకన్యకకున్ = తలంచెడురాజపుత్త్రికకున్, మున్నా = పూర్వకాలమునందున్, ఆశౌరిన్ = కృష్ణమూర్తిని, ఈక్షించి = చూచి, వచ్చినయాయోగిని = వచ్చినశ్రుతిరంజని, ఇట్లు = ఈప్రకారము, పల్కెన్ = చెప్పెను. కమలాక్షీ = ఓభద్రా! నీదుభాగ్యంబు = నీయదృష్టము, ఉత్తరపదంబు పరం బగునపుడు యుష్మదస్మదాత్మార్థకంబులకు దుగాగమం బగు. బా. స నీయొక్క + భాగ్యము. ఇఁకన్ = పిమ్మటను, ఎంతనవచ్చున్ = ఎంత యని చెప్పవచ్చును. చెప్ప శక్యము కా దని యర్థము. జలజాసనాదులకున్ = బ్రహ్మమొదలగువారికి, అశక్యంబు =

(చూడ) సాధ్యము కానిది, ఐన, గోపాంగనాజనని క్షేపము = గొల్లపడుచులయొక్క నిధి (దాఁచికొన్న ద్రవ్యరాశి) నేఁడు = ఈదినమునన్, నీకడకున్ = నీయొద్దకున్, ఇచ్చన్ = (నిన్నుఁ జూచు) కోరికతోన్, వచ్చెన్ = ఏగుదెంచెను. ఈక్షించితే = చూచితివా? బ్రహ్మాదులకు దర్శన మీయనిమహానుభావుఁడును దన్నుఁ బ్రేమించినవారి తలఁపు మిగుల సులభుఁడు నగు శ్రీకృష్ణుఁడు నిన్నుం జూడఁగోరి వచ్చె నతని దర్శింపు మని శ్రుతిరంజని భద్రతోఁ జెప్పెను.

గీ. అనిన యదువిభుహృదయ మా ♦ వనజనయన
భావము నెఱింగి కనకాంగి ♦ పలికె నిట్లు
లోకనాయక! నీదగు ♦ రాకవలన
నధిగతాభీష్ట యయ్యెమా ♦ హంసయాన॥ 18

అనినన్ = శ్రుతిరంజని యిట్లు చెప్పఁగా, యదువిభుహృదయము = కృష్ణునిహృదయమును, వనజనయనభావము = భద్రయభిప్రాయమును, కనకాంగి = ఈపేరు గలయొకచెలి, ఎఱిఁగి = తెలిసికొని, ఇట్లు = ఈప్రకారము, పలికెన్, లోకనాయక = ఓకృష్ణా! (ఎల్లలోకములకుం బ్రభువా యని యర్థము) నీదగురాకవలనన్ = నీసంబంధమైనవచ్చుటవలనన్ (నీవు వచ్చుటవలన నని యర్థము.) మాహంసయాన = మాచెలియగుభద్ర (అంచనడలం బోలిననడలు గల దని యర్థము.) అధిగతాభీష్ట = ప్రాప్తమైనకోర్కెగలది, అయ్యెన్. ఈపద్యమున లోకనాయకశబ్దముచె బ్రహ్మయు హంసయానశబ్దముచె సరస్వతియు ధ్వనించును.

వ॥ అనినఁ గలవాణి హరి కిట్లనియె. 19

అనినన్ = ఇట్లు కనకాంగి చెప్పఁగా, కలవాణి = ఈపేరుగలమఱియొకచెలియ, హరికిన్ = కృష్ణునకున్, ఇట్లనియెన్ = ఈప్రకారము చెప్పెను.

క॥ పురుషోత్తమ! నీసన్నిధి
పరిపూర్ణములుగ మదీయ ♦ భాగ్యము లెల్లన్
వరుస ఫలింప నోపర్చెన్
వరశోభ మదీయపద్మ ♦ పాణికిఁ గూర్చెన్॥ 20

పురుషోత్తమ = ఓపురుషశ్రేష్ఠుఁడా, (విష్ణుఁడాయని యును ధ్వనించును) నీసన్ని

ధి=నీసాక్షాత్కారము, మదీయభాగ్యము లెల్లన్ = నావి యగుసుకృతముల నన్నింటి
ని, వరుసన్ = క్రమముతో, పరిపూర్ణములుగన్ = నిండుగా, ఫలింపన్ = ఫలించునట్లు,
ఒనర్చె = చేసెను. మదీయపద్మపాణికిన్, మదీయ = నాచెలియగు, పద్మపాణికిన్ =
భద్రికున్, ( తామరపూవులం బోలినచేతులు గలదాని కని యర్థము. లక్ష్మి కనియుం
దోఁచును. తామరపూవులను హస్తమున ధరించినది యని యర్థము ) వరశోభన్ = అ
ధికదీప్తిని, మగనిశోభ యనియుం దోఁచును కూర్చెన్ = సంఘటించెను.

వ॥ అనిన నిందువదన యిట్లనియె. ( సుగమము ) 21

గీ॥ వఱలుశృంగారసారప్రవాహసరణి ♦ నతనుతుంగాంచితశ్రీల ♦ నధిగమించి
వెలయునది భద్ర యీఘన ♦ వేణిఁ గలయఁ
గలుగు నీకు విలాససా ♦ గరత శౌరి॥ 22

వఱలు.. ...సరణిన్, వఱలు=ప్రకాశించెడు, శృంగారసార=శృంగారరసమనెడు మనోహరమైనయుదకముయొక్క, ప్రవాహసరణిన్ = ప్రవాహపుమార్గముచేతను, అతనుతుంగాంచితశ్రీలన్, అతను = మన్మథునిసంబంధమైన, తుంగ = అధికమైన, అంచిత = పూజ్యమైన, శ్రీలన్ = శోభ లనియెడు, ( మన్మథావేశమువలనఁ గలిగిన విలాసముల నని యర్థము ) అతను = అధికమైన, తుంగా = తుంగ యనునదియొక్క, అంచిత = ఒప్పిన, శ్రీలన్ = శోభలను, ( పెద్దది యగుతుంగ యనునదియొక్క శోభల నని యర్థము. ) అధిగమించి = పొంది, భద్ర = భద్ర యనుతుంగభద్ర, వెలయునది = ప్రకాశించునది, ఈఘనవేణి = మేఘముం బోలినజడ గలది యగునికన్నె యనెడుగొప్పనది, కలయన్ = నిన్నుఁ బొందఁగాన్, నీకున్, విలాససాగరత = శృంగారచేష్టలకు సముద్రుఁ డగుట, కలుగున్ = సంభవించును. నది సముద్రముతోఁ గలియునప్పటి రసాధిక్యముయొక్క శోభ నిన్నిమె గూడినపుడు, సంభవించు నని భావము. ( తుంగభద్రానదికి సముద్రముతో సంబంధము కృష్ణానదీద్వారమునఁ గలదు. శ్లిష్టరూపకాలంకారము.

మ॥ అనినన్ సిగ్గున మోము వంచికొని భ ♦ ద్రాబ్జాక్షి చన్దోయి వ్రేఁ
గున లేఁగా నసియాడ నిస్తులతులా ♦ కోటిస్వనాకృష్టకా
ననమాయూరమరాళియై కటితటీ ♦ నాట్యోల్లసద్వేణియై

చనియెం గ్రిమ్మతి శౌరిఁ జూచుచు మణీసౌధాంతరక్షోణికిన్॥ 23

అనినన్ = ఇందువదన యను చెలి యిట్లు చెప్పఁగాన్, భద్రాబ్జాక్షి = భద్ర యను స్త్రీ, సిగ్గునన్ = సిగ్గుచేతను, మోము వంచికొని, చన్దోయి బ్రేఁగునన్ = చన్దోయి యొక్క భారముచేతను, లేఁగౌను = లేఁతనడుము, అసియాడన్ = వణఁకుచుండఁగా, నిస్తుల.....మరాళియై, నిస్తుల = సాటిలేని, తులాకోటి = అందెలయొక్క, (ని) పాదాంగదంబులాకోటి. అ. స్వన = ధ్వనిచేతను, ఆకృష్ట = ఆకర్షింపఁబడిన, కానన = అడవియందలి, మాయూరమరాళియై = నెమిళ్లును హంసలును గలదియై, కటి...యై కటితటీ = కటిప్రదేశమందు, నాట్య = చలించుచుండుటచేతను, ఉల్లసత్ = ప్రకాశించుచున్న, వేణియై = జడగలదియై, క్రిమ్మతి = మఱలి, శౌరిన్ = కృష్ణుని, చూచుచున్, మణీసౌధాంతరక్షోణికిన్ = మణుల (తోఁ గట్టబడిన) మేడలోనిప్రదేశమునకు, చనియెన్ = వెళ్లెను.

వ॥ ఇట్లు యదునందన సందర్శన సందీపి తానంద మోహాపరవశ యయ్యు నయ్యిందువదన నవోఢ గావున సఖీజన పరిహాస జనిత లజ్జాభరంబునఁ దనజనని యున్న సదనంబున కరిగినం దోడిబోటులు చిఱునగవు మొగంబులఁ దళుకొత్త నిలిచినం గాంచనాంబరుండు మీర లీయుపవనంబున నుంటకుం గతం బెయ్యది యని యడిగిన హరికి వార లిట్లనిరి॥ 24

అయ్యిందువదన = మీఁదఁ జెప్పంబడినభద్ర, (చంద్రుం బోలినమొగము గలది.) ఇట్లు = ఈప్రకారము, యదునందన.....పరవశ, యదునందన = కృష్ణునియొక్క సందర్శన = చూచుటచేతను, సందీపిత = ప్రజ్వలింపఁబడిన (అధిక మైన యని యర్థము.) ఆనంద = సంతసమునకును, మోహా = వలపునకును, పరవశ = లోఁబడినది. అయ్యున్ = అయినను, (ఆయనం జూచుటచే నధికానందమును మిగుల వలపును గలదియైన నని యర్థము.) నవోఢ = ముగ్ధ, కావునన్ = కాఁబట్టి, (నవోఢాశబ్దమునకుఁ గ్రొత్తపెండ్లికూఁతు రని యర్థము, గాని యిచ్చో నది లక్షణచే ముగ్ధం జెప్పును.) సఖీ.....భరంబునన్, సఖీజన = చెలులయొక్క, పరిహాస = ఎగతాళివలన, జనిత = పుట్టింపఁబడిన, లజ్జాభరంబునన్ = లజ్జాతిశయముచేతను, తనజనని = తనతల్లి, ఉన్నసదనంబునకున్ = వసించినగృహమునకున్, అరిగినన్ = పోవఁగాన్, తోడిబోటులు = కూ

ఔ మన్న చెలికత్తెలు, చిఱునగవు = మందహాసము, మొగంబులన్ = ముఖములయందున్ తళుకొత్తన్ = అంకురింపఁగాన్, నిలిచినన్, కాంచనాంబరుండు = కృష్ణుఁడు, (బంగారుచాయగలవస్త్రముల దరించినవాఁడు) మీరలు, ఈవనంబునన్ = ఈపూఁదోటయందున్, ఉంటకున్ = ఉండుటకు, కతంబు = కారణము, ఎయ్యది యని యడిగినన్ = ఏమని యడుగగాన్, వారలు = ఆభద్రచెలికత్తెలు. హరికిన్ = కృష్ణునకున్, ఇట్లు = ఈప్రకారము, అనిరి = పలికిరి.

క॥ విను మోవనజోదర ! మా
జననాథుఁడు దేవితోఁ వ ♦ సంతోత్సవ మిం
దొనరింప వచ్చినకతం
బున మేమును నీయుపవన ♦ మున నుంటి మనన్॥ 25

ఓవనజోదరా = ఓపద్మనాభా ! వినుము = ఆలకింపుము మాజననాథుఁడు = మా ప్రభు వగుధృష్టకేతుఁడు, దేవితోన్ = భార్యతోన్, ఇందున్ = ఈతోఁటయందున్, వసంతోత్సవము = వసంతపూజాదుల వని యర్థము. ఒనరింపన్ = చెయుటకు, వచ్చినకతంబునన్ = వచ్చినకారణముచేతను, మేము, ఈయుపవనంబునన్ = ఈయుద్యానవనమునందున్, ఉంటిమి = వసించితిమి, అనన్ = ఇట్లు చెప్పఁగాన్, ముందుపద్యములో నివిని యనుదానితో నన్వయించును.

క॥ విని వారల వీడ్కొని నిజ
జనయుతుఁడై ధృష్టకేతు ♦ జనపాలవరే
ణ్యుని జూచుటకు ముకుందుఁడు
చనియెం బూఁదోఁటలో వి ♦ హారంబునకున్॥ 26

ముకుందుఁడు = కృష్ణుఁడు, విని = ఆలకించి, వారలన్ = ఆస్త్రీలను, వీడ్కొని = వెళ్లి వచ్చెద నని చెప్పి విడిచి, నిజజనయుతుఁడై = తనజనులతోఁగూడినవాఁడై, ధృష్టకేతుజనపాలవరేణ్యునిన్ = రాజశ్రేష్ఠుఁడైనధృష్టకేతునిని, చూచుటకున్, పూఁదోఁటలోనివిహారంబునకున్ = ఉద్యానవనములో నున్న చావడిలోనికిన్, చనియెన్ = వెళ్లెను

సీ॥ కరదీప్తకనకకం ♦ కణకలక్వణముతో
రమణీమణులు చామ ♦ రముల వీవ

గానన్పత్యముల జే ♦ జేనాగవాసంపుఁ
జెలువంబు నాటనె ♦ చ్చెలులు చూప
సామంతభూషామ ♦ ణీమయూఖములు సం
ధ్యారుణాతపముల ♦ నౌఘళింపఁ
జరణనూపురముల ♦ సాలభంజికలట్లు
శరణాగతనతారి ♦ వరులుదోఁప
వేడ్కఁ గొలువున్న కైకేయు ♦ విమలగుణని
కాయుఁ గేయూరమకుటాది ♦ కలితకాయు
ధృష్టకేత్వభిధేయు స ♦ ద్విబుధగేయు
నాయదువిభుఁడు గాంచెను ♦ ద్యానసీమ॥ 27

టమణీమణులు = మణులం బోలినస్త్రీలు, కర.....తోన్, కర = హస్తములం దు, దీప్త = ప్రకాశించెడు, కనకకంకణ = బంగారుకడియములయొక్క, కల = మధుర మైన, క్వణమునోఁ = ధ్వనితోఁ, చామరములఁ = వింజామరలను, వీవఁ = విసరు చుండఁగాన్, ఆటనెచ్చెలులు = ఆటకత్తెలు, ( నాట్యము చేయువారు ) గానన్పత్య ములఁ = సంగీతముచేతను నాట్యములచేతను, జేజేనాగవాసంపుఁజెలువంబు = దేవ వేశ్యలయొక్కయందమును, ( స్వర్గములో నుండెడురంభ మొద లగువారియందము నని యర్థము. ) చూపఁ = కనుపఱుపఁగాఁ, సామంత... ..ఖములు, సామంత = తనప్ర భుత్వమునకు లోఁబడినదేశములకుం జుట్టుప్రక్కల నుండుదేశముల నేలురాజులయొక్క (నూఱుగ్రామములం బాలించుటకు రాజుచే నియుక్తు లగునుద్యోగులయొక్క యనియే ని యర్థము. ) భూషా = శరీరమునఁధరించినయాభరణములయందలి, మణి = రత్నములయొ క్క, మయూఖములు = కాంతులు, సంధ్యారుణాతపములఁ = సంధ్యాకాలమందలి యెఱ్ఱనియెండలను, ఔఘళింపన్ = తిరస్కరింపఁగాఁ, శరణాగతనతారివరులు = శరణు పొంది నమస్కరించెడు శత్రురాజులు, చరణ నూపురముల సాలభంజికల ట్లు, చరణనూపురముల = కాలియందెలయందలి, సాలభంజికలట్లు = బొమ్మలువలె, (ని) మంజీరో నూపురోఽస్త్రియాం. అ. తోఁపఁ = కాన్పింపఁగాఁ, (ప్రతిఫలింపఁ గా నని యర్థము. ) ఉద్యానసీమన్ = తోఁటయందుఁ గొలు వున్న కైకేయుఁ = స భచేసి యున్న కేకయదేశాధిపతిని, విమలగుణనికాయుఁ = స్వచ్ఛ మైనశౌర్యధైర్యా

దులసముదాయము కలవానిని, కేయూరమకుటాదికలితకాయుఁ = భుజకీర్తులు కిరీటము మొదలైనవానితోఁ గూడినశరీరము గలవానిని, సద్బుధగేయుఁ = సాధువులచేతను విద్వాంసులచేతను, స్తుతింపఁబడఁదగినవాని, ధృష్టకేత్వభిధేయుఁ = ధృష్టకేతు వను పేరు గలవానిని, కాంచెను = చూచెను

చ॥ అతులితదివ్యమండనయు ♦ తాంగరుచుల్ గనుపట్టుచుండఁగా
నతఁడును దవ్వులన్ సరసి ♦ జాక్షుని జూచి ప్రహర్షలీల నా
యతమణిపీఠి డిగ్గి యెదు ♦ రై చని కౌఁగిటఁ గూర్చ మామయై
నతనకు మ్రొక్కి కృష్ణురత ♦ నంబులగద్దియ నుంచి వెండియున్॥

అతఁడును = ఆకేకయరాజును, అతులిత .....రుచుల్, అతులిత = సాటిలేని, దివ్య = దేవలోకసంబంధమైన, మండన = భూషణములతోన్, యుత = కూడిన, అంగరుచుల్ = శరీరకాంతులు, కనుపట్టుచుండఁగాన్ = ప్రకాశించుచుండఁగాన్, దవ్వులన్ = మిగుల దూరమునుండి, సరసిజాక్షునిన్ = తమ్మికంటిని, చూచి, ప్రహర్షలీలన్ = సంతోషక్రియతోన్ (సంతోషముతో ననియే యర్థము) ఆయతమణిపీఠిన్ = విశాలమైనమణులు దాపినపీఁటనుండి, డిగ్గి, ఎదురై చని = అభిముఖముగా వెళ్లి, కౌఁగిటన్, కూర్పన్ = చేర్చుకొనఁగాన్, మామ యైనతనకున్ = తండ్రితోఁబుట్టువునకు భర్త యైనతనకున్, మ్రొక్కు కృష్ణున్ = నమస్కరించుకృష్ణుని, రతనంబులగద్దియన్ = రత్నములపీఁటయందు, ఉంచి = నిలిపి, వెండియున్ = ఇంకను, ముందుపద్యములోనిసమూపకక్రియతో నన్వయము

వ॥ తక్కినయుద్ధవగదాదిసహచరుల సముచితప్రకారంబుల నాదరించి మించినవేడుకం గేకయరాజేంద్రుం డయ్యాదవేంద్రున కిట్లనియె.

కేకయరాజేంద్రుండు, తక్కినయుద్ధవగదాదిసహచరులన్ = మిగిలిన యుద్ధవుఁడు మొదలైన (కృష్ణుని) తోడివారలను, సముచితప్రకారంబులన్ = తగినరీతిచేతను, ఆదరించి = గౌరవించి, మించినవేడుకన్ = అధికమైనసంతోషముతో, అయ్యాదవేంద్రునకున్ = ఆకృష్ణునకున్, ఇట్లనియెన్

ఉ॥ ఆడఁగఁ బోవుతీర్థ మెదు ♦ రైనగతిన్ భవదాగమంబు బ
ల్వేడుకతో నిరంతరము ♦ వేఁడుచు నుండఁగ నేఁడు మాకుఁ జే
కూడె నభీప్సితంబు లోన ♦ గూడె నమాత్యసుహృజ్జనంబు మా

నాడును భృత్యకోటిసద • నంబులు ధన్యత నొందె మాధవా॥ 30

మాధవా = ఓకృష్ణా! భవదాగమంబు = నీరాకను, బల్వేడుకతోఁ = మిగుల సంతసముతోఁ, నిరంతరము = ఎడతెగక యుండునట్లు, వేఁడుచు నుండఁగఁ = కోరుచుండఁగాఁ, నేఁడు = ఈదినమునందుఁ, ఆడఁగఁ బోవుతీర్థము = స్నానము చేయుటకై వెళ్లెడుపుణ్యజలము, ఎదురైనగతిన్ = ఎదురుగ వచ్చునట్లు, మాకున్, చెకూడెఁ = సంభవించెను. అభీప్సితంబులు = కోరఁబడినవి, ఒనగూడెఁ = సంఘటిల్లెను. కోర్కు లన్నియు సఫల మైన వని యర్థము. అమాత్యసుహృజ్జనంబు = మంత్రులయు మిత్రులయు సముదాయమును, మానాడు = మాదేశమును, భృత్యకోటి = సేవకసముదాయమును. సదనంబులు = ఇండ్లును ధన్యతఁ = కృతార్థత్వమును, ఒందెఁ = పొందెను.

క॥ మాబావకుఁ గుశలంబే
యాబలభద్రునకు భద్ర • మా దేవకి యు
న్నే బాగుగ సఖులకు మే
లే బంధులు రాచవారు • లెస్సలె శౌరీ॥ 31

శౌరీ = ఓకృష్ణా! మాబావకుఁ = వసుదేవునకున్, కుశలంబే = సుఖమా? 'ఏ' యనునది ప్రశ్నార్థకము ఆబలభద్రునకున్ = మీయన్న యగుబలరామునకుఁ, భద్రమా = శుభమా? దేవకి, బాగుగఁ = సుఖముగాన్, ఉన్నే = ఉండునా? సఖులకుఁ = మీచెలికాండ్రకున్, మేలే = మేలు కలదా? బంధులు = మీచుట్టములు, (అగు) రాచవారు = ప్రభువులు. లెస్సలే = సుఖులై యున్నారా?

క॥ అని కుశలం బడిగిన హరి
జనపతి కిట్లనియె నమిత • సౌజన్యశ్రీ
ఘనులుం బెద్దలు నగుమీ
యనుకంపం బ్రిబలు చుండి • రందఱు సుఖులై॥ 32

అని = ఇట్లు, కుశలంబు = సుఖవార్తను, అడిగినఁ, హరి = కృష్ణుఁడు, జనపతికిఁ = రాజునకుఁ, ఇట్లనియెఁ = ఇట్లుచెప్పెను అమిత.....ఘనులుఁ, అమిత = మితము లేని, సౌజన్య = మంచిస్వభావము చేతనును, శ్రీ = సంపదచేతనును, ఘనులుఁ = అధికులును, పెద్దలున్ = వృద్ధులును, అగుమీయనుకంపఁ = మీదయచేతను,

అందఱున్ = మీ రడిగిన యెల్లవారును, సుఖులై = సుఖము కలవారై, వర్ధిల్లుచుండి
రి = వృద్ధి చెందు చుండిరి.

వ॥ అని యెఱింగించి = ఇట్లు తెలిపి. 33

మ॥ తమమేనత్తను నత్తఱిన్ విమలచి ♦ త్తం ధృష్టకేతుప్రభూ
త్తమదేవిన్ శ్రుతకీర్తిఁ దద్భవనసం ♦ స్థం జూడ నద్దేవకీ
ప్రముఖ స్త్రీవసుదేవముఖ్యకుశల ♦ ప్రశ్నంబు లద్దేవి వే
డ్కమెయిం జేయఁగ శౌరి తత్సకలయో ♦ గక్షేమముల్ దెల్పుచున్॥

అత్తఱిన్ = ఆకాలమునందున్, విమలచిత్తన్ = నిర్మల మైనమనసు గలదానిని, తద్భవనసంస్థన్ = తోఁటలోని యాగృహమున నున్నదానిని, ధృష్టకేతుప్రభూత్తమదేవిన్ = ధృష్టకేతుఁ డను రాజశ్రేష్ఠునిభార్యను, తమమేనత్తను = తమతండ్రికిం దోఁబుట్టువును, శ్రుతకీర్తిన్ = ఈపేరు గలయింతిని, చూడన్ = కనుఁగొనఁగాన్, (దీనికింగర్త వెనుకటిపద్యమున నున్నవారు.) అద్దేవి = రాజభార్య యైనశ్రుతకీర్తి, అద్దేవకీ...... ప్రశ్నంబులు, అద్దేవకీప్రముఖ = ఆదేవకి మొదలగు, స్త్రీ = ఆఁడువారియొక్కయు, వసుదేవముఖ్య = వసుదేవుఁడు మొదలగువారియొక్కయు, కుశలప్రశ్నంబులు = క్షేమములఁగూర్చినప్రశ్నములను, వేడ్కమెయిన్ = కుతూహలముతోన్, చేయఁగన్ = కావింపఁగాన్, శౌరి = కృష్ణుఁడు, తత్సకలయోగక్షేమముల్ = మీఁద నడిగినవారి యెల్లరయొక్కయు యోగక్షేమములను (క్రొత్తవానిని సంపాదించుకొనుట యోగము మును పున్నవానిని రక్షించుకొనుట క్షేమము) తెల్పుచున్ = ఎఱిఁగించుచున్, ముందటిపద్యముతో నన్వయము

గీ॥ ఈవిధం బగునిష్టగో ♦ ష్ఠీవినోద
మున నచటఁ గొంతతడవుండ ♦ ముచ్చటించి
వారిని దనదివ్యరత్నమం ♦ దిరమునందుఁ
బరిజనముతోడ విడియించె ♦ ధరణివిభుఁడు॥ 35

ఈవిధంబు = ఈప్రకారంబు (కలది) అగునిష్టగోష్ఠీవినోదమునన్ = అనుకూల మైనసంభాషణమందలి వేడుకతోన్, అచటన్ = ఆస్థలమునందున్, కొంతతడవు = కొంతసేపు, ఉండన్ = (శౌరి) వసింపఁగాన్, ధరణివిభుఁడు = ధృష్టకేతువు, ముచ్చటించి = సల్లాపము చేసి, వారిని = కృష్ణునిన్, పరిజనముతోడన్ = కూడ నున్న

వారితోఁ, తనదివ్యరత్నమందిరమునన్ = తనది యగుసుందర మైనమణులతోఁ గట్టిన మేడయందున్, విడియించెన్ = బసచేయించెను.

ఉ॥ పిమ్మట నందనందనుఁడు ♦ పెల్లనురక్తిని గ్రొత్తప్రాయపుం
గొమ్మను నెమ్మదిం దలఁచి ♦ కొంచు నవారిత మైనమోహభా
రమ్మున నమ్మణీభవన ♦ రంగమునం గలయంగ వేమరుం
గ్రుమ్మరు సంభ్రమించు ధృతి♦కోమలు లారతి ద్రిప్పునైవడిన్ ॥ 36

నందనందనుఁడు = కృష్ణుఁడు, (నందునకుం బుత్త్రుఁ డని యర్థము కృష్ణుఁడు బాల్యమున నొకనిమిత్తమున నందునింట నుండుటచే నతనికిం బుత్త్రుఁ డని వ్యవహరింతురు,) పిమ్మటన్ = ఆగృహమునం బ్రవేశించినతరువాతను, పెల్లనురక్తిన్ = మిక్కిలి యనురాగముచేతను, క్రొత్తప్రాయంపుగొమ్మను = నూతన మైనవయసు గలభద్రను, నెమ్మదిన్ = మనసునందున్, తలఁచికొంచున్ = స్మరించుచున్, అవారితము = నివారింప శక్యము గానిది, అగుమోహభారమ్మునన్ = అగువలపుయొక్క యతిశయముచేతను, అమ్మణీభవనరంగమునన్ = ఆమాణిక్యపుటిల్లను నాట్యస్థలమునందున్, వేమరున్ = మాటిమాటికిన్, సంభ్రమించుధృతి, సంభ్రమించు = తొట్రుపడియెడు, ధృతి = ధీరత యగుదు, కోమలులు = స్త్రీలు, ఆరతి = నీరాజనమును, (కర్పూరపుదీపమును) త్రిప్పునై వడిన్ = త్రిప్పెడువిధముచేతను, కలయంగన్ = అంతటన్, క్రుమ్మరున్ = సంచరించును. (కోమలులు = స్త్రీలు, ఆరతి = నీరాజనమును, త్రిప్పునైవడిన్ = త్రిప్పునట్లు, సంభ్రమించుధృతి = చలించెడుధైర్యముచె (తృతీయార్థమందుఁ బ్రథమ.) క్రుమ్మరున్ = సంచరించు ననియేని యర్థము) ఇందుఁ జాపల మనుసంచారిభావము చెప్పఁబడెను. రాగద్వేషాదులచె నొక్కచో మనసు నిలువమి చాపల మనంబడు.

వ॥ అప్పు డమ్ముకుందుండు నిజాంతర్గతంబున. 37

అమ్ముకుందుండు = ఆకృష్ణుఁడు, అప్పుడు, నిజాంతర్గతంబునన్ = తనది యగు మనస్సునందున్,

సీ॥ తొలిజన్మమునను నె ♦ చ్చెలు లేమినోములు
నోచిరో చెలి చెల్మి ♦ మోచి యుండ
రతనాలవీణ యె ♦ ట్టితపంబు సల్పెనో
బాలిక చేపట్టుఁ ♦ బాయకుండ

సుమణిహారంబు లే • సుకృతం బొనర్చెనో
కాంతాకుచాగ్రభా • గముల మెలఁగ
సదనదర్పణము లే • సద్విధుల్ సలిపెనో
ప్రమదానుబింబభా • గ్యములు గలుగ
నిచటిమణిచిత్రసౌధంబు • లిచటితమ్మి
కొలఁకు లిచ్చటియుపవనీ • కుంజతటులు
నెట్టియుపకృతి గావించి • యొసఁగ నొక్క
రమణికేళీవిహారసం • ప్రాప్తి యొనర॥ 38

నెచ్చెలులు = భద్రిచెలికత్తెలు, చెలిచెల్మిన్ = ప్రియురాలగుభద్రయొక్క స్నేహమును, మోచియుండన్ = వహించియుండుటకు, తొలిజన్మమునన్ = వెనుకటిపుట్టువునందున్, ( ఈపద మెల్లవాక్యములతో సంబంధించును ) ఏమినోములు = ఎట్టివ్రతములను, నోచిరో = చేసిరో, ఈమెచెలికత్తెలు మునుపటిజన్మమున నెవ్వియో గొప్పవ్రతములు చేయుటచేతనే, యీజన్మమున నీమెనెయ్యమును సంపాదించిరని యాశయము. బాలికచెపట్టున్ = భద్రయొక్క చేతియందునికిని, పాయకుండన్ = వదలకుండుటకున్, రతనాలవీణ = మణులతోఁ గూడినవీణయనువాద్యము, ఎట్టితపము = ఎట్టితపస్సును, ( శరీరాయాససాధ్యమైనపుణ్యకర్మము తపంబు నాఁబడు ) చల్పెనో = చేసెనో, సుమణిహారంబులు = ప్రశస్తము లగుముత్యాలు మొదలగువాని దండలు, కాంతాకుచాగ్రభాగములన్ = భద్రయొక్క స్తనములయొక్క చివరప్రదేశములందున్, మెలఁగన్ = సంచరించుటకు, ఏసుకృతంబు = ఎట్టిపుణ్యమును, ఒనర్చెన్ = చేసెనో, సదనదర్పణములు = ఇంటియందలియద్దములు, ప్రమదా......లు, ప్రమదా = (ఈ) సుందరియొక్క, అనుబింబ = ప్రతిబింబముఁ బొందఁగారణమగు, భాగ్యములు = అదృష్టములు, కలుగన్ = సంభవించుటకున్, ఏసద్విధుల్ = ఎట్టిమంచికార్యములను, చలిపెనో = చేసెనో, (ఇచట విధిశబ్దము లక్షణచే సత్కర్మములను బోధించును.) అద్దములు మిక్కిలి పుణ్యము చేయుటచేతనే యామెప్రతిబింబమును బొందుచున్నవని భావము. ఇచటిమణిచిత్రసౌధంబులు, ఇచటి = ఈస్థలమునందున్న, మణి = మాణిక్యములచేత, చిత్ర = పలువన్నెలుగల, సౌధంబులు = మేడలును, ఇచటితమ్మికొలఁకులు = ఈతోఁటలోనితామరపూవులు గలసరసులును, ఇచ్చటియుపవనికుంజతటులు = ఈయుద్యానమునందలిపొదరిండ్లును, రమణి......ప్రాప్తి, రమణి = భద్రయొక్క, కేళీ = ఆటలయొక్కయు, వి

హారి=సంచారములయొక్కయు, సంప్రాప్తి=పొందు (సంబంధ మని యర్థము.) ఒనరన్=కలుగుటకు, ఎట్టియుపకృతి=ఎటువంటిపరోపకారమును, కావించి=చేసి, ఎసఁగెనొక్కొ=అతిశయించెనో.

ఇచటికోలఁకులు మొదలగునవి పూర్వజన్మమున మిగులఁ బరోపకారముం జేసి యే యీమెవిహారాదులసం దగి యుండె నని భావము. ఈమెచెలులు మొదలైనవారు మంచివ్రతములు మొదలగునవి చేసి యీమెస్నేహము మొదలైనవానిని సంపాదించి రని స్తుతించుటవలన నట్టిసత్కర్మములు చెయలేదు గాన నా కామెతో సంబంధము లేకపోయె నని నిందదోఁచుటచే వ్యాజస్తుత్యలంకారము

చ॥ అలచెలియూరురంభల భు ♦ జాచ్ఛబిసంబుల హాసచంద్రికన్
బలితపుగబ్బిగుబ్బవిరి ♦ బంతులఁ జెక్కులికప్పురంపుబి
ల్లల జిగిమోవిపానకము ♦ లం దని వొందినఁ గాక యేక్రియం
దల మగుచున్నయీవిరహ ♦ తాపభరంబు శమించు నా కిఁకన్ ॥39

అలచెలియూరురంభలన్=ఆభద్ర యనుబాలికయొక్క తొడ లనునరఁటికంబములచేతను, భుజాచ్ఛబిసంబులన్=చేతు లనెడునిర్మల మైనతామరతూండ్లచేతను, హాసచంద్రికన్=న వ్వనెడువెన్నెలచేతను, బలితపుగబ్బిగుబ్బవిరిబంతులన్, బలితపు=బలిసిన, గబ్బి=ఉన్నత మైన, గుబ్బవిరిబంతులన్=స్తనము లనెడుపూలబంతులచేతను, చెక్కులికప్పురంపుబిల్లలన్=చెక్కి ళ్లనెడుకర్పూరపుబిళ్లలచేతను, జిగిమోవిపానకములన్=(ఎఱ్ఱని) కాంతి గలయాధరోష్ఠ మనెడుపానకరసములచేతనును, తని వొందినఁ గాక=తృప్తిపొందిననే కాని, నాకున్, దల మగుచున్నయీవిరహతాపభరంబు=అధికమగుచున్నయీయెడఁబాటువలనివేఁడియొక్కభారము, ఇఁకన్=ఇప్పటను, ఏక్రియన్=ఏవ్యాపారముచేతన్, శమించున్=చల్లారును ఈమెయెడఁబాటువలనఁ గలిగినవెట్ట మీఁదఁ జెప్పినశైత్యోపచారములు చేసిననే యడఁగును గాని మఱియొక్కయుపాయముచె నడఁగ దని భావము ఇందుఁ జెప్పినయనఁటులు మొదలగునవి మిగుల శీతలవస్తువులగుటచేఁ దాపనివారకము లని సుప్రసిద్ధము. ఇందు విప్రలంభము (ఎడఁబాటు) వర్ణింపఁబడియె. ఇది యభిలాషేర్ష్యాదులవలనం బుట్టును. ఇచటివిప్రలంభ మభిలాషవలనఁ గలిగెను. సంభోగముకంటె ముందు గలిగిన యనురాగ మభిలాష మనంబడు రూపకాలంకారము

ఉ॥ ఎన్నఁడు కన్నులారఁ దర ♦ ళేక్షణఁ గ్రిమ్మఱఁ గాంతుఁ గాంచి య

య్యన్నులమిన్నతోడ నెన • రానఁగ ముచ్చటలాడి మోవిమేల్
జున్నులు గ్రోలి మక్కువలఁ • జొక్కుచుఁ గౌఁగిట గారవించుచుం
గ్రొన్ననవింటివానిబలు • కూటమి నెన్నఁడు గూడఁ గల్గునో॥ 40

తరళేక్షణన్ = భద్రిక, (చంచలమైనచూపులు గలది) ఎన్నఁడు = ఏదినమునన్, క్రమ్మఱన్ = ఇంకొకమాఱు, కన్నులారన్ = కన్నులునిండఁగా (కన్నులుఫలించునట్లు) కాంతున్ = చూతును, కాంచి = చూచి, అయ్యన్నులమిన్నతోడన్ = ఆస్త్రీశిరోరత్నముతోడన్, నెనరు = ప్రేమము, ఆనఁగన్ = సహాయపడునట్లు, ముచ్చటలాడి = ప్రియవచనములు పలికి, మోవిమేల్జున్నులు = అధరోష్ఠమునందలిప్రశస్తమైన తేనెలను, క్రోలి = త్రావి, మక్కువలన్ = ప్రేమాతిశయముచేతను, చొక్కుచున్ = మైమఱపుఁ జెందుచున్, కౌఁగిటన్ = భుజమధ్యమునందున్, గారవించుచున్ = గౌరవపఱుచుచున్, క్రొన్ననవింటివానిబలుకూటమిన్ = మన్మథక్రీడయందున్, (క్రొన్ననవింటివాఁడు = పూవువింటివాఁడు.) ఎన్నఁడు = ఏనాఁడు, కూడన్ = పొందుట, కల్గునో = సంఘటించునో. ఇందు భద్రిం జూచుటకుఁ ద్వరపడుచుఁ గృష్ణుఁడు కాలమును సహింపనట్లు వర్ణించుటచే నౌత్సుక్య మనుసంచారిభావము కాలాక్షమత్వ మౌత్సుక్య మని. ప్ర.

వ॥ అని యిట్లబ్బాలికారత్నంబువలన విరాలిం దూలి వనమాలి మేలిమిరతనాలశాల నుండ మధ్యాహ్నశంఖఘంటారావంబు లులియుటయుఁ గేకయపతి యతనికి మజ్జనాదికంబు గావింప నూడిగంపుఁజేడియలం బంచి పంచభక్ష్యపక్వాన్నఫలరసాదిపదార్థంబుల నంబుజాక్షుండునుం దానునుం దక్కటిబంధువర్గంబుతోడ భుజియించి సుగంధసలిలంబుల వార్చి కడానిగడితంపుటడపంబులం బడంతు లిడిన విడియంపుమడుపు లందుచు నిష్టగోష్ఠి నుండె నంత॥ 41

అని = ఇటులనుకొని, ఇట్లు = ఈప్రకారము, వనమాలి = కృష్ణుఁడు, (తులసిదళములుం బువ్వులుం గూర్చి కట్టినదండ ధరించినవాఁడు) అబ్బాలికారత్నంబువలనవిరాలిన్ = ఆస్త్రీశ్రేష్ఠమునందలివలపుచేతను, తూలి = చలించి, మేలిమిరతనాలశాలన్ = బంగారుయొక్కయు మణులయొక్కయు నింటియందున్, (బంగారముతోడను మణులతోడను నిర్మింపఁబడినగృహమునం దని యర్థము) ఉండన్ = వసింపఁగాన్

మధ్యాహ్నశంఖఘంటారావంబులు, మధ్యాహ్న = పగటియొక్కమధ్యభాగమునందలి ( రెండుజాములైనట్లు తెలియఁజేయున వి యని యర్థము.) శంఖఘంటారావంబులు = శంఖములయు ఘంటలయు ధ్వనులు, ఉలియుటయుఁ = మ్రోయఁగాఁ, ఇచట 'యుఁ' అనునర్థమునం బ్రయుక్తమయ్యెను. కేకయపతి = ధృష్టకేతుఁడు, అతనికిఁ = కృష్ణునకుఁ, మజ్జనాదికంబు = స్నానము మొదలగువానిని, కావింపఁ = చేయించుటకుఁ, ఊడిగంపుఁజేడియలఁ = ఉపచారము వేయుస్త్రీలను, ( పరిచారికలను ) పంచి = ఆజ్ఞాపించి, అంబుజాక్షుండునున్ = కృష్ణుఁడును, తానును, తక్కటిబంధువర్గంబుతోడన్ = మిగిలినచుట్టములతోన్, పంచ .. ..లఁ, పంచ = ఐదువిధములైన, భక్ష్య = భోజనవస్తువులను, ( భక్ష్య = పిండివంటలు, భోజ్య = అన్నాదులు, లేహ్య = పాయసాదులు, చోష్య = చాఱు మొదలగునవి, పానీయములు = జలము. ఇవి పంచభక్ష్యములు. ) పక్వాన్న = పన్నేరములును, ఫలరసాది = పండ్లరసము మొదలగు, పదార్థంబులన్ = వస్తువులను, భుజియించి = ఆరగించి, సుగంధసలిలంబులఁ = పరిమళము గలనీటితోఁ, వార్చి = ఆచమించి, కడానిగడితంపుటడపంబులఁ, కడాని = బంగారముయొక్క, ( బంగారు వికారమైన,) గడితంపుటడపంబులఁ = దళమైనతములపాకులుండెడుపాత్రములందుఁ, ( పొందాను ) పడంతులు = పరిచారికలు, ఇడినవిడియంపుమడుపులు = ఉంచినతాంబూలములను, అందుచుఁ = పుచ్చికొనుచుఁ, ఇష్టగోష్ఠిఁ = ప్రియసల్లాపముతో, ఉండిరి, అంతఁ = పిమ్మటను ఇందుఁ బక్వాన్నమును, రసాదులును బంచభక్ష్యములలోనివే యైనను మఱలం జెప్పుట యవి భోజనకాలమున మిక్కిలి యుపయోగింపఁబడె నని సూచించు

క॥ ఇటఁ గేకయేంద్రకన్యయుఁ
బటుతరసమ్మోహభార ♦ పారావారో
త్కటచింతాస్ఫుటవీచీ
పటలాంతరతరళధైర్య ♦ పటిమప్లవయై॥ 42

ఇటఁ = తననివాసస్థానమందు, కేకయేంద్రకన్యయుఁ = భద్రయును, పటుతర .. .ప్లవయై, పటుతర = బలిష్ఠమైన, సమ్మోహభార = కామాతిశయ మనెడు, పారావార = సముద్రసంబంధమైన, ఉత్కట = అధికమైన, చింతా = ధ్యాన మనెడు, ఇష్టపదార్థము సంభవింపమిచేఁ గలుగుధ్యానము చింత యనఁబడు. ఇది యొకసంచారిభావము తాపనిశ్వాసాదులు దీనియనుభావములు. ( అనుభావము = కార్యము. )

స్ఫుట=స్ఫుటమైన, వీచీ=తరంగములయొక్క, పటల=సముదాయముచేతను, అంతర=లోపలను, తరళ=చలించుచున్న, ధైర్యపటిమ=ధైర్యసారమనెడు, ప్లవయై=తెప్పగలదై, (ని) ఉడుపంతు ప్లవః కోలః అ. మోహాతిశయముచేఁ జలించిన ధైర్యము గలదియై యని భావము ముందుపద్యముతో నన్వయము

సీ॥ చెలువైనకీచకం ♦ బులరవంబును విన్న
మురళీస్వన మటంచు ♦ మోహ ముంచు
నీరమ్ములను నెమ్మి ♦ యెఱక లించుక కన్న
మౌళిపింఛ మటంచు ♦ మమతఁ బెంచు
సరసులఁ గ్రమ్మిత ♦ మ్మిరజమ్ము తెర లున్న
స్వర్ణాంబర మటంచు ♦ సంభ్రమించు
తలిరులవింతమె ♦ గ్గలచాలు నెలకొన్న
వనమాలిక యటంచు ♦ నలపు నించు
నిగనిగని వేల్పురాచట్టు ♦ నెఱిగొణికల
చాయఁ దిలకించి హరితను ♦ చ్ఛాయ యంచు
నెంచు డాయఁగ గమకించు ♦ నింపు నగ్రు
లతివ తద్రూపభావనా ♦ యత్తమతిని॥ 43

అతివ=భద్ర, తద్రూప .. మతిని, తత్=ఆకృష్ణునియొక్క, రూప=ఆకారముయొక్క, భావనా=తలఁపునకు, ఆయత్త=లోఁబడిన, మతిని=బుద్ధిచేతను, ఎడతెగకుండం గృష్ణుని దలఁచుచుండుటచేత నని యర్థము చెలువైనకీచకంబులరవంబున్=మనోహరమైనబొంగువెదుళ్లధ్వనిని, వాయువుచెతం బూరితములై ధ్వనించువెదుళ్లు కీచకము లనంబడు (ని) వేణవః కీచకా స్తే స్యు ర్యే స్వనంత్యనిలోద్ధతాః అ. విన్నన్=విన్నయెడన్, మురళీస్వనము=పిల్లనగ్రోవివలనిగానధ్వని, అటంచున్=అనుకొనుచు, మోహ ముంచున్, మోహము=భ్రమమును, ఉంచున్ = పొందును. ఈరమ్ములన్=పొదలయందున్, నెమ్మియెఱకలు = నెమిలియీఁకలను, ఇంచుక=కొంచెము, కన్నన్=చూచినన్, మౌళిపింఛ మటంచున్=(కృష్ణుని) శిరమునందలినెమిలిపురి యనుకొంచున్, మమతన్=భ్రమను, పెంచున్=పొందును (మమత యన నభిమాన మని యర్థము, గాని యిట లక్షణచె భ్రమ యని చెప్పవలయును) సరసు

లన్ = కొలఁకులయందున్, కప్రిమ్మతమ్మిరజమ్ము తెరలం = కమ్మకోసెడుతామరపూల యొక్క పుప్పొడితెట్టెలు, ఉన్నన్ = ఉండఁగాన్, స్వర్ణాంబర మటంచున్ = (కృష్ణుఁడుధరించిన) బంగారువన్నె గలవస్త్రము మనుకొనుచున్, సంభ్రమించున్ = తొట్రుపడును, తలిరులన్ = చిగురుటాకులయందున్, వింత మొగ్గలచాలు = క్రొత్త మొగ్గలవరుస నెలకొన్నన్ = ఉండఁగాన్, వనమాలిక యటంచున్ = (కృష్ణుని మెడలోని) దండ యనుకొనుచున్, వలపు = ప్రేమమును, నించున్ = ధరించును నిగనిగని.........చాయన్, నిగనిగని = నిగనిగ లాడెడు. వేల్పురాచెట్టు = ఇంద్రనీలములయొక్క, నెటి = ప్రశస్తమైన, గొణికలచాయన్ = స్తంభములయొక్క కాంతులను, తిలకించి = చూచి, హరితనుచ్ఛాయయంచున్ = కృష్ణుని దేహకాంతి యనుకొంచున్, ఎంచున్ = తలఁచును, డాయఁగన్ = సమీపించుటకు, గమకించున్ = యత్నించును. అశ్రులు = కన్నీళ్లను, నించున్ = ధరించును. సమీపించి తా ననుకొన్నట్లు కాకపోవుటచేఁ గలిగిన దుఃఖమునఁ గన్నుల నీరు పెట్టుకొను నని యర్థము ఇందు భద్ర కాయాయివస్తువుల యందుఁ గలిగినభ్రాంతికిఁ గృష్ణుని నిరంతరము దలఁచికొనుట హేతు వగుటచేఁ గావ్యలింగానుప్రాణిత మైనభ్రాంతిమదలంకారము

చ॥ మృదుమధురోపహారము లొ ♦ కించుక వాచవి కైన మోవిఁ జే
ర్పదు, వరగంధపుష్పయుత ♦ పల్లవ మంటదు కేల నైనఁ? జూ
డదు కడకంట నైన నెదు ♦ టం దగుపంకజపాళి; మై నలం
దదు ఘనసారసాంకవక ♦ దంబము నంబుజనేత్రి చింతచేన్॥ 44

అంబుజనేత్రి = భద్ర, చింతచేన్ = ధ్యానముచేతను, మృదుమధు......ముల్ మృదు = మెత్తని, మధుర = తియ్యని, ఉపహారములు = భోజనపదార్థములను, ఒకించుక = కొంచె మైనను, వాచవికైనన్ = నోటితో రుచిచూచుటకైనను, మోవిన్ = పెదవిని, కూర్పదు = సంఘటింపదు ఎట్టిరసవంత మైనపదార్థము నైనను నోటఁ బెట్టుటలే దని భావము. వరగంధ.....ము, వర = శ్రేష్ఠ మైన, గంధ = పరిమళము గల, పుష్ప = పువ్వులతో, యుత = కూడిన, పల్లవము = చిగురుటాకు నైనను, కేలన్ = చేతితోన్, అంటదు = స్పృశింపదు ఎదుటన్ = కన్నులముందు, తగుపంకజపాళి = ప్రకాశించెడుపద్మసముదాయమును, కడకంట నైనన్ = కనుగొనలచేత నైనను, చూడదు; ఘనసారసాంకవకదంబమున్, ఘనసార = పచ్చకప్పురముయొక్కయు, సాంకవ = పునుఁగుయొక్కయు, కదంబమున్ = సమూహమును, మైన్ = దేహమునందున్, లఅం

దదు=పూసికొవదు. భద్రి కృష్ణునియం దాసక్త మైనమనసు కలది యై భోజనపదార్థములందును, దక్కినసుఖానుకూలము లగుపదార్థములందును బ్రేమ లేనిది యై యుండె నని చెప్పుటచే నిం దరతి యనురెండవపేరు గలవిషయవిద్వేష మనుమన్మథావస్థ చెప్పఁబడియెను. ప్రియునికంటె వేరగువస్తువులయందు వైరాగ్య మరతి యనంబడు.

సీ॥ హృదయస్థితానంగుఁ ♦ డెద నేయుములుకుల
మొనలు పైఁ దోఁచె నా ♦ మొలచెఁ బులక
లానంగశిఖికిఁ దో ♦ డై వచ్చుకమ్మపి
వలు లన వలపుటూ ♦ ర్పులు జనించెఁ
దద్వాతనిహతిచే ♦ త వియోగజలధి యు
ప్పొంగె నా ఘర్మాంబు ♦ పూర మొదవె
నాసీటివెల్లిపై ♦ నలరుడిండీరకాం
తులు నాఁగ నెమ్మోసఁ ♦ దెలుపు వొడమెఁ
దెలుపునకుఁ దోడునీడలై ♦ వెలయుహార
కలితమౌక్తికములు పెనుఁ ♦ గాఁకఁ గ్రాఁగి
బాష్పధారలఁగరఁగి పైఁ ♦ బైనిగ్రమ్మఁ
గొమ్మపాలిం డ్లలరె వెండి ♦ కొండలటుల॥ 45

(భద్రిపక్ష) హృదయస్థితానంగుఁడు=మనసులో నున్న మన్మథుఁడు, ఎద నేయుములుకులమొనలు, ఎదన్=హృదయమునందు, ఏయుములుకులమొనలు=వేయుబాణములకొనలు, పైన్=మీఁదను, తోఁచె నాన్=కనుపడెనో యనునట్లు, పులకలు=గగుర్పాటు, మొలచెన్=ఉత్పన్న మయ్యెను. (ఇది యొకసాత్త్వికభావము) విభావాదిదర్శనంబున నుత్పన్నము లయినరాగాదిమనోవృత్తులవలన జన్యంబులై యాంతరంబు లగురాగాదులకు సూచకంబు లగుశరీర వికారంబులైన స్తంభాదులు సాత్త్వికభావము లనంబడు. రసోత్పత్తికిం గారణము విభావ మనంబడు అది రెండువిధములు. ఆలంబనము, నుద్దీపనము నని శృంగారరసమునకు నాలంబనము నాయికానాయకులు. వారిరూపయౌవనాదిగుణములును, వారిచేష్టలు నలంకారములును మలయానిలాదులును నుద్దీపనవిభావము. (ఆలంబనము=పట్టుఁగొమ్మ ఉద్దీపనము=కలిగినరాగాదులను

వృద్ధి పొందించునది. ) అనంగశిఖికిన్ = మన్మథాగ్నికి, తోడై = సహాయమై, వచ్చుశీ మ్మవీవలు లనన్ = ఏగుదెంచుసుగంధవాయువులువలె, వలపుటూర్పులు = పరిమళించు శ్వాసములు, జనించెన్ = పుట్టెను ఇందుఁ జింత యనుసంచారిభావముయొక్క కార్యమైననిశ్వాసము చెప్పఁబడెను తరంగంబులు సముద్రింబున నుత్పన్నము లగుచు దాని నుత్కర్షంబు గావించుచుఁ దద్రూపముం బొందునట్లు, స్థాయులయందుఁ బుట్టి యుత్కర్షంబు గావించుచు దానిం దమ్ముం బోషించుచు రసరూపముం బొందునవి సంచారు లనంబడు వీనినే వ్యభిచారు లని కొందఱందురు. ఎల్లరసములయందు సంచరించుటచే వీని కీపేరు కలిగెను తద్వాతనిహతిచేతన్ = ఆయూర్పుగాలి తాఁకుటచేతను, వియోగజలధి = వియోగసముద్రము, ఉప్పొంగె నాన్ = వృద్ధిచెందెనో యనునట్లు ఘర్మాంబుపూరము = చెమ్మటనీటిప్రవాహము, ( అధిక మైనచెమట యని యర్థము ) ఒదవెన్ = పుట్టెను. ఇదియు నొకసాత్త్వికభావము ఆనీటివెల్లువపైన్ = ఆజలప్రవాహముమీఁదను, అలరుడిండీరకాంతులు నాఁగన్ = ప్రకాశించునురుగులకాంతు లనునట్లు, నెమ్మేనన్ = శరీరమునందు, తెలుపు = తెల్లనిచాయ, ( వైవర్ణ్యము ) పొడమెన్ = పుట్టెను. తెలుపునకున్, తోడునీడలై = సమానములై, వెలయు .. ..ములు, వెలయు = ప్రకాశించెడు, హారకలితమౌక్తికములు = దండతోఁ బొందు కలిగిన ముత్తియములు, పెనుఁగాఁకన్ = ( శరీరమునందలి ) యధికమగు వేఁడిచేతను, క్రాఁగి = కాలి, బాష్పధారలన్ = కన్నీటిధారలచేతను, కరఁగి = సున్నమై, పైపైని = ( కుచముల ) మీఁదను, క్రిమ్మన్ = వ్యాపింపఁగాన్, కొమ్మపాలిండ్లు = భద్రకుచములు, వెండికొండలటుల = వెండికొండలువలె, అలరెన్ = ప్రకాశించెను ఇందు వయసగఁ బులకము స్వేదము వైవర్ణ్యము బాష్పము ననుసాత్త్వికభావములు చెప్పంబడెను ఉత్ప్రేక్షాలంకారము. వెండికొండలువలెఁ గుచము లలరె ననుచోట నుపమయుఁ గలదు.

క॥ అనిశధ్యాతముకుందవ
దనపూర్ణేందురుచి మరుప్ర ♦ తాపప్రభచే
తను సర్వముకుళితములై
కనుఁదమ్ములు కేకయేంద్ర ♦ కన్యకుఁ దనరెన్॥ 46

కేకయేంద్రకన్యకున్ = కేకయరాజు కూఁతురగుభద్రకున్, అనిశ......రుచిన్, అనిశ = ఎల్లపుడును, ధ్యాత = ధ్యానము చేయఁబడుచున్న, ముకుంద = కృష్ణునియొక్క వదన = ముఖ మనెడు, పూర్ణేందు = నిండుచంద్రునియొక్క, రుచిన్ = కాంతిచేతను, మరు......చేతను, మరు = మన్మథునియొక్క, ప్రతాప = ప్రతాప మనెడు, ప్రభచేత

మ = సూర్యకాంతిచేతనున, (ని) స్యుః ప్రభా రుగ్రుచి స్త్విడ్భాః. అ. కనుఁదమ్ము లు = నేత్రపద్మములు, అర్ధముకుళితములై = సగము ముకుళించినవి యై, తనరెన్ = ప్రకాశించెను.

కన్నుఁదామరలు మనసున నున్న కృష్ణునిముఖచంద్రుని సాన్నిధ్యముచేత సగము ముకుళించి మన్మథునిప్రతాప మనెడుసూర్యకాంతిసాన్నిధ్యముచే సగము వికసించె నని యాశయము చంద్రికాంతిసాన్నిధ్యము తామరలు ముకుళించుటకును సూర్యకాంతిసాన్నిధ్యము వికసించుటకును గారణ మగుట యనుభవసిద్ధము ఆమె కామసంతప్తయై చేయునది లేక కన్నులఱమోడ్చి మనసునఁ గృష్ణుని ధ్యానించు చుండె నని ఫలితార్థము రూపకాలంకారము.

ఉ॥ వారక స్రుక్కెఁ బాహుబిస♦వల్లులు వాడెఁ గుచాబ్జకోశముల్
తోరపుఁగంకణావళుల♦తోడనె జాఱె సమంచితోర్మికల్
సారెఁ గలంగె జీవనము♦శ్వాసమహోష్మసమీరవారవి
స్ఫారగతిన్ వియోగపుఁద♦పర్తుదినంబునఁ గృష్ణవేణికిన్॥ 47

కృష్ణవేణికిన్ = కృష్ణవేణియనుకృష్ణవేణికిన్ (భద్రి యనుకృష్ణానది కని యర్థము.) నల్లనిజడగల దని భద్రాపరము నల్లనిప్రవాహము గల దని నదీపరము (ని) వేణిః ప్రవాహే సరితాం మేళనే కేశబంధనే నా. నా. వియోగపుఁదపర్తుదినంబునన్ = ఎడఁబాటను వేసవికాలమునందున్, (ని) ఉష్ణ ఉష్మాగమ స్తపః అ బాహుబిసవల్లులు = చెతులనుతూండ్లు, వారక = తప్పక, స్రుక్కెన్ = ముడిఁగెను కృశించె నని భావము. వేసవికాలమున నిరు తక్కువగుటచేఁ దామరతూండ్లు తగ్గినట్లు వియోగమున నీమె బాహువులు కృశించె నని భావము నదులయందునుఁ దామరలు గల వని చెప్పుట కవిసమయము. కుచాబ్జకోశముల్ = కుచము లనెడు తామరమొగ్గలు (ని) కోశోఽస్త్రీ కుట్మలే ఖడ్గ పిధానే ర్థౌఘ దివ్యయోః. అ వాడెన్ = వడలెను, సమంచితోర్మికల్ = పూజింపబడినయుంగరము లనెడుతరంగపఙ్క్తులు, తోరపుఁగంకణావళులతోడనె = పెద్దవి యగుకడియాలవరుసలనెడుజలబిందువులతోడనే, జాఱెన్ = వదలెను. (ని) అంగుళీయే తరంగేచ వస్త్రభంగే పి చోర్మికా. నా. నా. (ని) స్యాత్కంకణం హస్తసూత్రే శిఖరె కటకే జలే నా నా వేసవికాలమున నదియందుఁ దరంగములును జలమును జాఱునట్లు (తగ్గునట్లు) వియోగకాలమున నీమెయుంగరములును గడియములును జాఱెను. (వ్రేళ్లుం జేతులుం గృశించుటచె నూడె

ను.) జీవనము=బ్రదుకనెడునీరు, (ని) వృత్తి ర్వర్తన జీవనే యనియును, పయః కీలాల మమృతం జీవనం భువనం వన మనియు నమరుఁడు. శ్వాస.....గతిన్, శ్వాస=ఊర్పు లనెడు, మహోష్మ=గొప్పవేఁడిగల, సమీరవార=వాయుసముదాయముయొక్క, విస్ఫారగతిన్=అధికమైనప్రాప్తిచేతను, అధికమైనపడమటిగాడ్పులచేత నని యర్థము. సారెన్=మాటిమాటికి, కలఁగెన్=చలించెను కలతఁ జెందె నని యర్థము. వేసవికాలపునదివలె వియోగమున నీమె చిక్కె నని చెప్పుటచేఁ గార్శ్యము ను మన్మథావస్థ యిందుఁ జెప్పఁబడియె. (కార్శ్యము=అంగములు చిక్కుట) రూపకాలంకారము.

క॥ సొగ సగుచనుబంతులపై
జిగిఁ దగుమగరాలసరులు ♦ చెలిసాంజననే
త్రగళజ్జలములఁ జయ్యని
పొగ లెగయఁగ నింద్రనీల ♦ ములసరు లయ్యెన్॥ 48

సొగసగుచనుబంతులపైన్=సుందరము లగుపూలబంతులం బోలినస్తనములం దున్, జిగిన్=కాంతిచేతను, తగుమగరాలసరులు=ఒప్పెడువజ్రములదండలు, చెలి.....జలములన్, చెలి=భద్రయొక్క, సాంజన=కాటుకతోఁ గూడిన, నేత్ర=కన్నులనుండి, గళత్=జాఱుచున్న, జలములన్=కన్నీటిచేతను, చయ్యని=ఇది కాలినవస్తువునందేని నిప్పునందేని నీళ్లు పడినప్పు డయ్యెడిధ్వని ననుకరించుశబ్దము పొగలు, ఎగయన్=బయలువెళ్లుచుండఁగా, ఇంద్రనీలములసరులు=ఇంద్రనీలముల దండలు, అయ్యెన్=ఆయెను. మన్మథాగ్నిచేతం దప్తురా లగు నామె మెడలోనివజ్రాలహారములు కాటుకతోఁ గూడినకన్నీళ్లచేతం దడిసి నల్లనికాంతిఁ గలవయ్యె నని భావము. వజ్రములకు వేఁడి దగిలిన నల్లఁబడు ననియుఁ బ్రసిద్ధి మఱియు నిందుఁ గాటుకనీరు దగులుటచె మిగుల నల్లనయ్యెను అతిశయోక్త్యలంకారము

ఉ॥ నూతనమండలీకృతధ ♦ నుర్లతికాపరివేషధారి పాం
థాతతహృద్భయంకరశ ♦ రాళికరప్రకరుండు చిత్తసం
జాతవిభాకరుండు పెలు ♦ చన్ బలుచందములం గలంపఁ గం
జాతముఖీకుముద్వతి వె ♦ సన్ వివశత్వము నొందె స్రుక్కుచున్॥

నూతన .. ..ధారి, నూతన=క్రొత్తదియును, మండలీకృత=గుండ్రనియగు కా

రము గలదిగాఁ జేయఁబడినదియు ( చెవులదనుక నారిని లాగి యెక్కుపెట్టఁబడిన దని యర్థము. ) (అగు) ధనుర్లతికా = తీఁగవంటి విల్లనెడు, పరివేష = గాలిగుడిని, సూర్యునకుం జంద్రునకుం జుట్టునేర్పడు కాంతి (ని) పరివేషస్తు పరిధిః. అ ధారి = ధరించినవాఁడును, పాంథ......కరుండు, పాంథ = వియోగులను తెరువరులయొక్క, ఆతత = అధికమగు, హృత్ = మనస్సునకు, భయంకర = భయమును గలిగించెడు, శరాళికరప్రికరుండు = బాణసముదాయ మనుకిరణసముదాయము గలవాఁడును, (అగు) చిత్తసంజాతవిభాకరుండు = మన్మథుఁ డనెడుసూర్యుఁడు, పెలుచన్ = అతిశయముతోన్, పలుచందములన్ = అనేకప్రకారములచేతను, కలంపన్ = బాధపెట్టఁగాన్, కంజాతముఖీకుముద్వతి, కంజాతముఖీ = భద్ర యనెడు ( తామరపువ్వుం బోలినమోము గలది) కుముద్వతి = కల్వతీఁగె, వెసన్ = మిక్కిలిగన్, స్రుక్కుచున్ = కృశించుచున్, వివశత్వమున్ = చిత్తవైకల్యమును, ఒందెన్ = పొందెను పగటికాలమునఁ గల్వతీఁగవలె మన్మథతాపమున నామె మిగుల వాడె నని భావము రూపకాలంకారము

గీ॥ చెలి విరులపాన్పునను మేను ♦ సేర్ప నవియు
స్మరునిశరములె కాన నేఁ ♦ చం దొడంగెఁ
గడు నలసి ప్రియసఖులను ♦ గన్నొమలంగి
భూరివిరహార్తి నరిగె శృం ♦ గారవనికి॥ 50

చెలి = భద్ర, విరులపాన్పునన్ = పూసెజ్జయందున్, మేను = శరీరమును, చేర్పన్ = కూర్పఁగాన్, ( పూలపాన్పున శయనింపఁగా నని యర్థము ) అవియున్ = ఆపువ్వులును, స్మరునిశరములె = మన్మథునిబాణములె, కానన్ = అగుటచేతను, ఏఁచన్ = బాధించుటకు, తొడంగెన్ = ఆరంభించెను కడున్ = మిక్కిలి, అలసి = శ్రమపడి, ప్రియసఖులను = ఇష్టవయస్యలన్, కన్నొమలంగి = మోసముచేసి, వారికిం దెలియకుండ నని యర్థము. భూరివిరహార్తిన్, భూరి = అధికమైన, విరహ = వియోగమువలని, ఆర్తిన్ = దుఃఖముచేతను, శృంగారవనికిన్ = సింగారపుందోఁటకున్ (పూఁదోఁటకని యర్థము. ) అరిగెన్ = వెళ్లెను ఇందుఁ బువ్వు లామెను బాధించుటకు మన్మథుని బాణము లగుట హేతువుగాఁ జెప్పఁబడినందునఁ గావ్యలింగ మనునలంకారము. మఱియుం జల్లదనమునకుఁ దగినయుపచారము చేయఁగాఁ దాప మెక్కు వయ్యె ననుటచే సంజ్వరమను మన్మథావస్థ చెప్పంబడియె

క॥ కలికి మలయుంపువలిగరు

వలికిం జలదళులబలురవ ♦ వళికి మయూరా
వలికీరశారికామం
డలికిఁ మది నులికి తద్వ ♦ నంబున మెలఁగుఁ॥ 51

కలికి = సుందరి యగుభద్ర, మలయంపువలిగదువలికిఁ = మలయపర్వతమునుండి వచ్చివచల్లనిగాలికిన్ని చలదళులబలురవళికిఁ, చలత్ = తిరుగుచున్న, అళుల = తుమ్మెదలయొక్క, బలు = అధికమైన, రవళికిన్ = ధ్వనికిని, మయూరావలి......మండలికిఁ, మయూర = నెమిళ్లయొక్క, ఆవలి = సముదాయమునకును, కీర = చిలుకలయు, శారికా = గోరువంకలయు, మండలికిఁ = సముదాయమునకును, మదిఁ = మనసునందుఁ, ఉలికి = వణఁకి, భయపడి యని యర్థము. తద్వనంబునఁ = ఆవనమునందుఁ, మెలఁగున్ = సంచరించును.

మలయానిలకీరశారికాదు లుద్దీపనవిభావములు (మనంబునం గలిగినయనురాగము బలపఱుచునవి) కావున నామెయుద్యానమునఁజడియుచు సంచరించుచుండెనని భావము.

సీ॥ తలిరుటాకులజొంప ♦ ములు దావశిఖ లంచు
నెంచి యందులఁ బ్రవే ♦ శించఁజూచు
ననుఁదీవ లురగంబు ♦ లని డాసి తత్పల్ల
వాగ్రజిహ్వాలు కేల ♦ నంటఁ దివురు
విమలమరందముల్ ♦ విషధార లనుచు వి
తర్కించి సారెకుఁ ♦ ద్రావఁ దలఁచు
శశికాంతకృతమహీ ♦ జాతాలవాలంబు
లొనరు డిగ్గియ లంచు ♦ నుఱుకఁ దొడరుఁ
గదిసి మదనుండు వదలక ♦ యద నెఱింగి
పదులు నూఱులు గుదులుగా ♦ నెదఁ గదిమెడు
కుసుమశరముల విసరుల ♦ విసిగి విసిగి
వెసఁ దనువు వీడఁదలఁచి యా ♦ బిసరుహాక్షి॥ 52

మదనుండు = మన్మథుఁడు, అదను = (ఆమెయం దృష్ణయం దభిలాష గలిగిన) సమయమును, ఎఱింగి = తెలిసికొని, కదిసి = సమీపించి, వదలక = విడువక, (ఎడతెగకుండ నని యర్థము.) ఎదన్ = వక్షమునందున్, పసలు = నూఱులు, గుదులు = సమూహములు, కాన్ = అగునట్లు, కదిమెదుపసుమశరములవిసరులన్, కదిమెదు = ఆక్రమించెదు, (పాఱెడు నని యర్థము) కుసుమశరముల = పుష్పబాణములయొక్క, విసరులన్ = వేయుటలచేతను, (ప్రయోగించుటచేత నని యర్థము.) బిసరుహాక్షి = భద్రాకన్య, విసిగివిసిగి = మిక్కిలి విరాగముఁబొంది, వెసన్ = వేగముకోన్, తనువున్ = శరీరమును, వీడన్ = విడుచుటకు, తలఁచి = కోరి, తలిరుటాకులజొంపములు = చివురుటాకులగుంపులు, తలిరు + ఆకు = తలిరుటాకు, కర్మధారయమునందు బేర్వాదుల కచ్చు పరం బగునపుడు టుగాగమంబు విభాష నగును. బా. సం దావశిఖులంచున్ = నిప్పుముద్దలనుచున్, ఎంచి = తలఁచి, అందులన్ = వానియందున్, ప్రవేశింపన్ = పడుటకున్, చూచున్ = యత్నించును ఆమె మన్మథబాధ కోర్వలేక దేహమందు విరాగ మొంది తనకు మిక్కిలి తాపము గలిగించుటచేఁ జివురాకు లగ్ని యని భ్రమించి యందుఁ బడుటకు యత్నించుచుండె నని భావము. నునుఁదీవలు = సన్ననితీఁగెలు, ఉరగంబులని = పాము లని భ్రమసి, డాసి = సమీపించి, తత్పల్లవాగ్రజిహ్వాలు, తత్ = ఆలతలయొక్క, పల్లవ = చిగుళ్లనెడు, అగ్రజిహ్వాలు = జిహ్వాగ్రములను, కేలన్ = చేతితోన్, అంటన్ = ముట్టికొనుటకు, తివురున్ = యత్నించును. సన్ననితీవలం జూచి పాము లనుకొని వానిచివురాకులను నాలుకలుగాఁ దలఁచి ముట్టుటకు యత్నించుచుండె నని భావము విరులమరందముల్ = పువ్వులందలి తేనెలు, విసుధారలనుచున్, వితర్కించి = ఊహించి, సారెకున్ = మాటిమాటికిన్, త్రావన్ = పానముచేయుటకు, తలఁచున్ = యత్నించును. శశికాంత . . . వాలంబులు, శశికాంత = చంద్రకాంతపుమణులతో, క్లృప్త = కట్టఁబడిన, మహీజాత = చెట్లయొక్క, ఆలవాలంబులు = పాదులు, చెట్లమొదటం బటికపురాలతోఁ గట్టినయరఁగుల నని యర్థము ఒనరుడిగ్గియలంచున్ = ఒప్పెడునడబావు లనుకొని, దీర్ఘికా శబ్దభవము డిగ్గియ దిగి నీళ్లు ముంచుకొనఁదగినట్లు మెట్లు గలనూయి నడబావి యనఁబడు ఉఱుకన్ = దుముకుటకున్ (అందుఁ బడుట కని యర్థము) తొడరున్ = యత్నించును చివురాకులు మొదలగునవి యగ్ని మొదలగువానివలెఁ దాపాధిక్యమును గలిగించుటచె వానియం దగ్న్యాదులబుద్ధి గలిగి ప్రాణత్యాగమునకు సాధనము లని తలఁచి యట్లు చెయ యత్నించె నని యిందు వర్ణించుటచే మన్మథావస్థలలోఁ గడపటిది యగుమరణావస్థ చెప్పంబడియె కేవలమరణ మమంగళము గావున మరణప్రయత్నమే మరణావస్థ యని యాలంకారికులు చెప్పుదురు చక్షుఃప్రీతి

(ఆదరముసం బ్రియదర్శనము) మనస్సంగము (ఎల్లకాలము ప్రియునందే మనసు నిలుపుట) సంకల్పము (నాథవిషయమైనమనోరథము) ప్రలాపము (ప్రియగుణస్తుతి) మొదలగునవి మన్మథావస్థలు. ఈయవస్థ లయోగవిప్రలంభశృంగారమునకు నాస్పదములు. అదివఱ కెన్నఁడును గూడనినాయికానాయకులశృంగార మయోగవిప్రలంభము. ఇది యభిలాషమువలనఁ గలుగును మున్నుఁ గూడిననాయికానాయకులకుఁ బ్రవాసాదులవలన విప్రలంభము గల్గును. (విప్రలంభము = వియోగము.)

ఉ॥ నెచ్చెలు లత్తఱిన్ వరమ ♦ ణీభవనాంతరపుష్పశయ్యపై
నచ్చపలాక్షిఁ గానక ర ♦ యంబున మారునిబారి కోర్వలే
కిచ్చటినుండి గోల యిపు ♦ డెచ్చటి కేగెనో యంచు నవ్వనిం
జొచ్చి నికుంజపుంజముల ♦ చోటుల నారసి యందు నొక్కచోన్॥

అత్తఱిన్ = భద్రశృంగారవనమునకుఁ బోయినపుడు, నెచ్చెలులు = ప్రియసఖులు, వర......పైన్, వర = శ్రేష్ఠమైన, మణీభవన = మాణిక్యపుటింటియొక్క, అంతర = లోపలనున్న, పుష్పశయ్యపైన్ = పూలపాన్పుమీఁదను, అచ్చపలాక్షిన్ = ఆభద్రను, కానక = చూడక, గోల = ముద్దరాలగుభద్ర, మారునిబారికిన్ = మన్మథునివలనిబాధకు, ఓర్వలేక = సహించలేక, (బాధను సహింపలేక యని యర్థము.) ఇపుడు = ఈకాలమునన్, ఇచ్చటినుండి = ఈస్థలమునుండి, ఎచ్చటికిన్ = ఏస్థలమునకున్, ఏగెనో = వెళ్లెనో, అంచున్ = అనుకొనుచున్, అవ్వనిన్ = ఆపుష్పవనమును, చొచ్చి = ప్రవేశించి, నికుంజపుంజములచోటులన్ = పొదరుటిండ్లుగలస్థలములందున్, ఆరసి = వెదకి, అందున్, ఒక్కచోన్ = ఒకానొకస్థలమునందున్, ముందుపద్యముతో నన్వయము.

క॥ కలువలచెలి వెలుఁగులచే
నలువుఁ దొలఁగి నిదురఁ జెందు ♦ నలినియుఁబోలెన్
దలమగువలరాయనికాఁ
కల నలయుచు సొలయులలనఁ ♦ గనుఁగొని రొలమిన్॥

కలువలచెలివెలుఁగులచేన్ = చందురునికాంతిచేతను, నలువున్ = చక్కఁదనమును, తొలఁగి = వదలి, నిదురన్, చెందునలినియుఁబోలెన్ = పొందెడుతామరలతవలెన్, దలము = అధికము, అగువలరాయనికాఁకలన్ = అగుమన్మథునితాపముచేతను,

అలయుచున్ = శ్రమపడుచున్, సొలయులలన్ = మూర్ఛపొందు భద్రను, కనుఁగొని = చూచి, ఎలమిన్ = ప్రీతితోన్, మీఁదిపద్యముతో నన్వయము.

క॥ తఱియం జని నునుఁజెక్కులఁ
దొరఁగెడుకన్నీరు ద్రోవఁ ♦ దుడుచుచు నంసో
పరి వ్రిదిలి జాఱుఘనకచ
భరమును సవరించి యిట్లు ♦ పలికిరి చెలిమిన్॥ 55

తఱియం జని = సమీపించి, నునుఁజెక్కులన్ = నున్ననిచెక్కులందున్, తొరఁగెడుకన్నీరు = స్రవించుకన్నీటిని, పోవన్ = పోవునట్లు, తుడుచుచున్, అంసోపరి = భుజముమీఁదను, వ్రిదిలి = వీడి, జాఱుఘనకచము = పడుచున్న గొప్పకొప్పును, సవరించి = బాగుచేసి, ఇట్లు = ఈప్రకారము, చెలిమిన్ = ప్రేమచేతను, పలికిరి = మాటలాడిరి.

చ॥ ఒకనిముసమ్ము మమ్ము నయ ♦ యో యెడఁబాయనిదాన వొంటిఁ గా
నకు నెటు వచ్చితమ్మ కెల ♦ నం దరిలేనిమరందసింధు లిం
తకు నెటు లీఁదితమ్మ యెడఁ ♦ దప్పనిబల్గవురంవుఁదిప్ప లో
ర్వక యెటు దాఁటితమ్మ మగు ♦ వా తెగువల్ తగు నమ్మ యెమ్మెయిన్॥

అయయో! = ఎంతకష్టము. సంతాపార్థక మైనయవ్యయము, మగువా = ఓభద్రా! మమ్మున్, ఒకనిముసమ్ము = ఒకరెప్పపాటుకాలము నయితము, ఎడఁబాయనిదానవు = వదలియుండనిదానవు. (ఎడఁబాయనిది + వు = ఎడఁబాయనిదానవు.) అదిశబ్దమునకు వు, ను లు పరంబు లగునపుడును సంబోధనంబునందును దాన యనునాదేశం బగు. బా. కా ఒంటిన్ = సహాయములేకుండన్, కానకున్ = అడవికిన్, పూఁదోఁటక నియర్థము ఎటు = ఏప్రకారము, వచ్చితమ్మ, కెలనన్ = సమీపమునందున్, దరిలేనిమరందసింధులు = ఒడ్డులేనిపూఁదేనెనదులను, ఇంతకున్ = ఇంతకాలమునకున్, ఎటులు = ఏప్రకారము, ఈఁదితమ్మ = తరించితివి. ఎడన్ = మార్గమధ్యమునందున్, తప్పని... ..తిప్పలు = దాఁటకుండ రావలను లేని పెద్దకప్పురపుదిన్నెలను, ఓర్వక = ఓఁగక, ఎటు, దాఁటితమ్మ = అతిక్రమించితివి. ఎమ్మెయిన్ = ఏప్రకారముచేతనైనను, తెగువల్ = సాహసకార్యములు, తగునమ్మ = యుక్తమా? (కావని యర్థము.)

చ॥ ఇల నెలప్రాయపుం జెలువ♦లిచ్చ వహింపరటమ్మ దివ్యమౌ
చెలువము గల్గు చెల్వలకుఁ♦ జిత్తమునం దిటు తాల్మిఁ దక్కి చిం
తిలుదురటమ్మ మేను వెను♦ దియ్యని తియ్యనివింటి మేటి కాఁ
కల నలయింతురమ్మ కొఱ♦ గాములు చెల్లునటమ్మ యింతికిన్॥ 57

ఇలన్ = భూమియందున్ ( సప్తమ్యర్థమందు ద్వితీయ ) ఎలప్రాయపుం జెలువలు = యౌవ్వనమందున్న స్త్రీలు, ఇచ్చన్ = వలపును, వహింపరటమ్మ = ధరింపరా ( ధరింతు రని యర్థము ) జవ్వనులు తగినపురుషులను వలచుట కలదు గాని దివ్యము = ఒప్పునది, ఔ చెలువము = అయినయందము, కల్గుచెల్వలకున్ = కలిగినప్రియులకున్, ( ప్రియులనిమిత్త మని యర్థము ) చిత్తమునందున్ = మనసునందున్, తాల్మిన్ = ధైర్యమును, తక్కి = విడిచి, ఇటు = ఈప్రకారము, చింతిలుదురటమ్మ = విచారపడుదురా? ( పడ రని యర్థము ) మేను = శరీరమును, వెనుదియ్యని......కాఁకలన్, వెనుదియ్యని = సందేహము నొందని, తియ్యనివింటిమేటి = మన్మథునియొక్క ( చెఱకువిల్లు ధరించినశూరునియొక్క యని యర్థము. ) కాఁకలన్ = తాపముచేతను, అలయింతురమ్మ = శ్రమపెట్టుదురా? శ్రమపెట్ట రని యర్థము ఇంతికిన్ = ఆఁడుదానికిన్, కొఱగాములు = చెడుపనులు, చెల్లునటమ్మ = తగునా? ( తగ దని యర్థము. )

ఉ॥ నెమ్మదిఁ జింత లేల రమ♦ణీ రమణీయత శౌరి నిన్ను శీ
ఘ్రమ్ముగ గారవింప నను♦రాగమునన్ విభవంబు లందె దో
యమ్మరొ నమ్ము నాదుపలు♦కాత్మధనమ్ముగ లెమ్ము రమ్ము తో
రమ్మగునివ్వనమ్మునఁ ది♦రమ్మగుసంపదఁ జూతి మిమ్ములన్॥ 58

రమణీ = ఓచక్కనియింతీ! నెమ్మదిన్ = మనసునందున్, చింతలు = శోకము, ఏల = ఎందువలన్, శోకింపం బనిలే దని భావము శౌరి = కృష్ణుఁడు నిన్నున్, శీఘ్రమ్మగన్ = త్వరగానే, అనురాగమునన్ = ఎక్కువకూరిమితోన్, రమణీయతన్ = ఒప్పిదముతోన్, ( ఒప్పిదముగా నని యర్థము ) గారవింపన్ = గౌరవింపఁగాన్, విభవంబులు = సంపదలను, అందెదు = పొందెదవు ఓయమ్మరో! ( ఇందు రో, ఓ యనుసంబోధనమునం దెలుపుప్రత్యయములు రెండుండుట చింత్యము. ) నాదుపలుకు = నామాటను, ఆత్మధనమ్ముగన్ = దగ్గఱ నున్న సొమ్ముగాను, నమ్ముము = విశ్వసింపుము లెమ్ము, తోరమ్మగునివ్వనమ్మునన్ = గొప్పగి యగునీకోఁటయందున్, తిరమ్మగు

సంపదన్ = ఉన్న (పుష్పఫలాదిరూప మగు) భాగ్యమును, ఇమ్ముల్ = ఆనందము తోన్, చూతము = కనుఁగొందము, రమ్మ

వ॥ అపుడు కలవాణి సంస్కృతంబులై హరిపరంబు లగుశుద్ధాంధ్రవచ
నంబుల నిట్లనియె॥ 59

అపుడు = ఆకాలమునన్, కలవాణి = కలవాణి యను పేరు గలచెలి, సంస్కృతంబులై = సంస్కృతపుమాటలై, హరిపరంబులు = విష్ణువుం దెలుపునవి, అగు, శుద్ధాంధ్రవచనంబులన్ = అచ్చ తెనుంగుమాటలతోన్, ఇట్లనియెన్ = ఈప్రకారము చెప్పెను. విష్ణుపర మైనయర్థమున నే కేవలసంస్కృతములును రెండవయర్థమున నచ్చతెనుంగులు నగుపదములతోఁ జెప్పె నని యర్థము.

ఉభయభాషాకందము.

నీలాగారయనగవే
నాలియమాదానిపాల ♦ నాతిబలారే
మేలానీలావరయమి
వాలాయము నేనకావ ♦ వారకపదమా॥ 60

ఇందలిపదము లొక్కమాఱు కేవలసంస్కృతములును మఱియొక్కసారి యచ్చతెనుఁగువియు నగును

తెనుఁగుపదచ్ఛేదమునర్థమును

నీలాగు, ఆరయన్, నగవు, ఏ, నాలి, అ, మాదానిపాలన్, నాతి, బలారె, మేలు, ఆ, నీలావు, అరయమి, వాలాయము, నేను, అ, కావన్, వారక, పదమా,

నాతి = ఓభద్రా! నీలాగు = నీవిధము, నీవు చేసినపని యని యర్థము ఆరయన్ = ఆలోచింపఁగాన్, నగవే = నవ్వే నవ్వునకుం దగినది యని యర్థము నీవు చేసినపని పరిహాసము చేయుటకుఁ దగినది యని భావము మాదానిపాలన్ = మాయొక్క పనివిషయమై, నివిటకు వచ్చుట మాకుఁ దెలుపుట యనుపనివిషయమై యని యర్థము. నాలియ = వంచనమా. వంచనము చేయవచ్చునా యని యర్థము. (కూడదనుట) 'అ' కాక్వర్థము. బలారే = స్తుతిం దెలుపునవ్యయము కానియిది యిచట విపరీతలక్షణచే నిందం దెలుపును. నివు చెసిన పని నిందింపఁదగిన దని యర్థము. శబ్దమునకు

సందర్భానుసారముగ విరుద్ధార్థమును గలిగించుశక్తి విపరీతలక్షణ యనంబడు. నీలావు=నీశక్తిని, అరయుమి = తెలిసికొనలేకపోవుట, మేలా ? = క్షేమమా ? కా దని యర్థము. ఇట్టిబాధ గలిగినకాలమున మమ్ము విడిచి కాలక్షేపము చేయఁదగినశక్తి నీకుఁ గలదో లేదో తెలిసికొనలేకపోవుట మేలు గా దని భావము. కావఁగ=( నిన్ను ) రక్షించుటకు, వాలాయము=తప్పకుండను. నేన=నేనే నిన్నుఁ గాపాడుట కవశ్యము నే నుండవలె నని యర్థము. వారక=తప్పక, నామాట నిరాకరింపక యని యర్థము. పదము. అ=( తోఁటకు ) నడువుము.

సంస్కృతపదచ్ఛేదము నర్థమును.

నీలాగారయ, నగవ, ఇనాలియ, మా, దానిపాలన, అతిబలారే, మేలానీలావర యమివాల, అ, యమునేన, కా, అవ, వారకపదమ, అ.

నీలాగారయ, నీల=నీలాచల మనెడు, అగార=గృహమును, య=పొందిన స్వామీ. నీలాచలమున వాసము చేయునట్టి ప్రభువా యని యర్థము. జగన్నాథస్వామి వాసముచేయుకొండకు నీలాచల మని పేరు. నగవ=గోవర్ధన మనుపర్వతమును వహించినగోపాలుఁడా. మున్నొకనిమిత్తమున నింద్రుఁడు కోపించి రాలవానం గృష్ణునకు నివాసస్థాన మగువ్రజముపైఁ ( పసులమంద ) గురియింప గోవులను గోపాలురను రక్షింపఁ గృష్ణుఁడు గోవర్ధనంబు కేల ధరియించె నని భాగవతము. ఇనాలియ, ఇన=సూర్యులయొక్క, ఆలి=సముదాయమును, య=పొందినపురుషుఁడా, సూర్యమండలములో బంగారువికార మైనశరీరము గలపురుషరూపమున నీశ్వరుఁ డున్నాఁ డని వేదాంతములయందుఁ బ్రసిద్ధి. దానిపాలన=గజరక్షకుఁడా ( దానము=ఏనుఁగుమదము. అదికలదిదాని=గజము. దానిని రక్షించినవాఁడు=దానిపాలనుఁడు. సంబోధనము. దానిపాలన. ) విష్ణువు గజమును రక్షించినకథ సుప్రసిద్ధము. అతిబలారే=ఇంద్రు నతిక్రమించినబలవంతుఁడా. ( బలారి=బలుఁ డనురక్కసునకు శత్రువు ఇంద్రుఁడు. అతని నతిక్రమించి పారిజాతమును హరించినవాఁ డతిబలారి=కృష్ణుఁడు. సంబోధన మతిబలారే. ) కృష్ణుఁ డింద్రుని జయించి పారిజాతముం దెచ్చి సత్యభామ కిచ్చె ననుకథ మిగులం బ్రసిద్ధము. మేలానీలావర, మా=లక్ష్మికిని, ఇలా = భూదేవికిని, నీలా=నీలాదేవికిని, వర=భర్తా. శ్రీభూనీలాపతీ యని యర్థము. యమిపాల=ఋషులకు రక్షకుఁడా. సత్యము, అస్తేయము ( పరద్రవ్యముహరింపమి ) మొదలగువానిసముదాయము యమము. అది కలవాఁడు యమి. అట్టివారికి రక్షకుఁడా యని యర్థము ఇంక వకారమునకును, పకారమునకును నభేదము గలుగుటచె యమివాల యనుచో

యమిపాల గ్రహింపఁబడె. లో=(సకలలోకములకుఁ) గారణమా. (వి) అకారో బ్రహ్మ విష్ణ్వీశ కమఠే ష్వంగణే రణే గౌర వేంతఃపురే హితా. నా. నా. యమునే న=కాళిందీనాయకుఁడా. యమునా=కాళిందికి, ఇన=ప్రభువా. (వి) కాళిందీ సూర్యతనయా యమునా. అ. కృష్ణుఁడుకాళింది యనుకన్యం బెల్లియాడినట్లు భాగవతమునఁ గలదు. వారకపదమ, వారక=(దోషముల) వారించు, పదమ=పాదశోభ గల, అ=ఓకృష్ణా, మా=నన్ను, కౌ=భూమియందు, (వి) గోత్రా కుః పృథివీ. అ. అవ=రక్షింపుము నాచెలిం గాపాడు మని యర్థము. ఇట్లు కలవాణి చెలినిమిత్తమై కృష్ణునిఁ బ్రార్థించెను.

క॥ అన బాలం గని కేలం
గొని లీలం దిగిచి యెత్తి ♦ కూరిమితోఁ దో
డ్కొని కేళీవనిపాళికిఁ
జనె నాళీజనము మనము ♦ సంతసమందన్॥ 61

అనన్=కలవాణియిట్లు పలుకఁగా, ఆళీజనము=చెలికత్తెలసముదాయము, బాలన్=భద్రను, కేలన్=చెతులతోను, కొని=పట్టుకొని, లీలన్=విలాసముతోఁగా, తిగిచియెత్తి=లాగికొని, కూరిమితోన్=ప్రేమతోఁగా, కేళీవనపాళికిన్=క్రీడావనప్రదేశమునకున్, మనము సంతసమందన్=మనము సంతోష మందఁగా, తోడ్కొని చనెన్=తీసికొనివెళ్లెను.

సీ॥ మోముఁదమ్ములమీఁద ♦ ముసరు తేఁటులచాలు
లలితనాసాగంధ ♦ ఫలులఁ దొలఁగ
నధరబింబములకై ♦ యరుదెంచుశుకములు
తనుసాంకవసువాస ♦ నను దలంక
నక్షిమీనముల డా ♦ యఁగ వచ్చుకోకముల్
నగవువెన్నెలలచే ♦ నెగసిపోవ
భుజమృణాళికలఁ గ ♦ ప్పుమరాళికలు నీల
కబరికాభ్రములచేఁ ♦ గలసిపఱువఁ
జనుచెలులమూఁపులఁ గరంబు ♦ లునిచి పొదల

విరులు నిట్టూర్పుగాడ్పుల ♦ వేఁడి నులియఁ
జివురుటాకులు నెమ్మేనుఁ ♦ దవిలి వాడ
విరహతాపాప్తి వనవీథి ♦ వెడలె రమణి॥ 62

మోముఁదమ్ములమీఁదన్ = ముఖపద్మములందుఁ, ముసరుతేఁటులచాలు = క్రమ్ముకొనుతుమ్మెదలబారు, లలిత.....ఫలులన్, లలిత = మనోహరమైన, నాసా = ముక్కులనెడు, గంధఫలులన్ = సంపెంగలచేతను, తొలఁగన్ = పాఱిపోఁగాన్, వనవిశేషమునకు బయలువెడలిన స్త్రీలమోములం జూచి తుమ్మెదలు పద్మములని భ్రమియించి యందలి మకరందమునకై వచ్చి నాసలంజూచి సంపెంగలని తలఁచి తొలఁగుచుండఁగా ననిభావము వారిమోములు పద్మములను నాసలు సంపెంగలను బోలునని నిష్కర్షము అధరబింబములకై పెదవులనెడు దొండపండ్లకై, అరుదెంచు శుకములు = వచ్చుచిల్కలు, తను.....నను, తను = శరీరమునందలి, (సహజమైన) సాంకవసువాసనను = జవ్వాదిపరిమళముచేతను, తలంకన్ = భయపడఁగాన్, ఈజవ్వనుల పెదవులు దొండపండ్లని చిలుకలు వానికై వచ్చి వారి శరీరములందలి సహజము లగు జవ్వాదివాసనలకుఁ జడిసి తొలఁగుచుండఁగా నని భావము. స్త్రీలదేహము దివ్యపరిమళము గలదని వసుచరిత్రాదులందును గలదు అక్షిమీనములన్ = కన్నులను చేఁపలను, డాయంగన్ = సమీపించుటకు, వచ్చుకోకములు = వచ్చెడు చక్రవాకములు, నగవువెన్నెలలచేన్ = హాసమనెడు వెన్నెలకాంతులచేతను, ఎగసిపోవన్ = ఎగిరిపోఁగాన్, వారికన్నులు మీనములను బుద్ధిచే వాని భక్షింప వచ్చిన జక్కవలు మందహాసమును వెన్నెలగాఁ దలఁచి భయపడి తొలఁగుచుండఁగా నని యర్థము. భుజమృణాళికలన్ = చేతులనెడు తామరతూండ్లను, కప్పుమరాళికలు = ఆక్రమించు వంచలు, నీలకబరికాభ్రములచేన్ = నల్లని కొప్పులనెడు మేఘములచేతను, కలసి = కూడి, పఱువన్ = పాఱిపోఁగాన్, హంసలు వారి బాహువులను దూండ్లనుకొని గ్రహియింపఁ బోయి కచములను మేఘములను కొని తిరిగి పోవుచుండఁగా నని యర్థము. (ఇందుఁ దుమ్మెదలకు సంపెంగలకును, చిలుకలకును సంకుఁబిల్లులకును, జక్కవలకును వెన్నెలలకును, హంసలకును మేఘములకును, సహజవిరోధ మని తెలియవలెను) చనుచెలులమూఁపులన్ = పోయెడు సఖురాండ్ర బుజములమీఁదను, కరంబులు = చేతులను, ఉనిచి = నిలిపి, పాదలవిరులు = పాదములందున్న పువ్వులు, నిట్టూర్పుగాడ్పులవేఁడిన్ = అధికమైన శ్వాసవాయువుల వెచ్చఁదనముచేత, నులియన్ = వాడిపోవఁగాన్, చివురుటాకులు = లేఁత యాకులు, నెమ్మేను = శరీరమును, తవిలి = తాఁకి, వాడన్ = వడలిపోవఁగాన్, (ఇవి

సించుటకు దాపాధిక్యమును సూచించును. ) రమణి = భద్ర, విరహతాపాప్తిన్ = ఎడఁబాటులని కాఁక దగులుటచేత, వనవీథిన్ = వనమార్గమందు, వెడలెన్ = బయలువెడలెను. రూపకమును, నతిశయోక్తియు నలంకారములు

క॥ రాజద్వనభూజసుమస
మాజవిభవ మెఱుకపఱిచె ♦ మానిని కిపు డా
ళీజన మేతత్కథన
వ్యాజంబునఁ బ్రొద్దు పుత్త ♦ మనుచుం బ్రేమన్॥ 63

ఆళీజనము = చెలుల సముదాయము, ఏతత్కథనవ్యాజంబునన్ = దీనిం జెప్పుట యను మిషచేతను, ప్రొద్దు = కాలమును, పుత్తము = కడపుదము. అనుచున్, ప్రేమన్ = స్నేహముచేతను, మానినికిన్ = భద్రికున్, అపుడు = ఆకాలమున, రాజ...... విభవము, రాజత్ = ప్రకాశించుచున్న, వన = తోఁటయందలి, భూజ = వృక్షములయొక్కయు, సుమ = పూవులయొక్కయు, సమాజ = సముదాయముయొక్క, విభవము = సంపదను, ఎఱుకపఱిచెన్ = తెలియఁ జేసెను ఇందు సమాజశబ్దము మనుష్యాదిసముదాయమునకే యుపయోగింపవలసినను లక్షణచే వృక్షాదులకే యుపయోగింపఁబడెను

చ॥ వరసుమనోనురాగవిభ ♦ వంబున గుచ్ఛకుచంబులాని సం
భరితరుచిం జెలంగు మృదు ♦ పల్లవపాణుల భూజనాథుకం
ధరను గవుంగిలించుచు ల ♦ తావనితామణి భృంగనాదసా
దరమృదువాగ్విలాససము ♦ దారత మంతనమాడె నెచ్చెలీ॥ 64

నెచ్చెలీ = ఓసఖీ, లతావనితామణి = తీవ యను స్త్రీశ్రేష్ఠము, వర......... జనన్, వర = శ్రేష్ఠమైన, సుమనః = పూలయొక్క, అనురాగ = రక్తిమయొక్క, విభవంబునన్ = సంపద యనియెడు, మగనియందలిమనఃపూర్వక మైనప్రేమాతిశయముచేతను, గుచ్ఛకుచంబులు = పూగుత్తు లనెడుస్తనములను, ఆని = అదిమి, సంభరితరుచిన్ = నిండయినకాంతిచేతను, చెలంగుమృదుపల్లవపాణులన్, చెలంగు = ప్రకాశించెడు, మృదు = మెత్తని, పల్లవ = చిగుళ్లనెడు, పాణులన్ = హస్తములతోన్, భూజనాథుకంధరన్ = వృక్షరాజ మనుభర్తయొక్క మెడను, కవుంగిలించుచున్ = ఆలింగనము చేసికొనుచున్, భృంగనాద.....సముదారతన్, భృంగ = తుమ్మెదలయొక్క, నాద =

కూఁతలనెడు, మృదు = శ్రావ్యమైన, వాగ్విలాస = మాటలసొంపుయొక్క, సముదారత న్ = ఆధిక్యముతో, మంతన మాడెన్ = రహస్యము చెప్పుచుండెను. లోకమున నేకానేకజవ్వని భర్తయందలియనురాగాతిశయముచె స్తనము లణఁగునట్లు భర్తం గౌఁగిలించుకొనిన ట్లీలత పూలగుత్తులు సోఁకునట్లు వృక్షము నల్లికొనె ననియు నప్పుడామెమాటలుచెప్పుచున్న ట్లందలితుమ్మెదలు మృదువుగా ధ్వనించుచుండె ననియు భావము. సావయవరూపకాలంకారము.

చ॥ మును పువుఁదేనె నల్కి తెలి ♦ మొగ్గల ముత్తెపుముగ్గు వెట్టి యిం
పొనరుపరివాళదీపికలు ♦ నొప్పగుపూఁబఱపుల్ ఘటించి కుం
జనిలయసీమ లిట్లు వరు ♦ సం గయిచేసి మరుద్వరాప్తికై
కనదళివీక్షులై యెదురు ♦ కన్గొనెఁ గంటె లతాసతీతతుల్॥ 65

లతాసతీతతుల్ = తీవ లను స్త్రీసముదాయములు, మును = మొదటను, కుంజనిలయసీమలు = పొదరు లనునిండ్లప్రదేశములను, పువుఁదేనెన్ = మకరందముచేతను, అల్కి = అలికి, తెలిమొగ్గలముత్తెపుముగ్గు = తెల్లని మొగ్గలనెడుముత్యాలముగ్గును, పెట్టి = ఉంచి, ఇంపు = ఆనందమును, ఒనరు......కలు, ఒనరు = కలిగించెడు, (ఇది ప్రేరణార్థక మని తలఁపవలెను) పరివాళదీపికలున్ = చివుళ్లనెడుదీపములును, ఒప్పగు పూఁబఱపుల్ = అందము లగుపూవు లనెడుసెజ్జలును, ఘటించి = కూర్చి, ఇట్లు = ఈప్రకారము, వరుసన్ = క్రమముతో, కయిచేసి = అలంకరించి, మరుద్వరాప్తికై, మరుత్ = వాయువను, వర = భర్తయొక్క, ఆప్తికై = రాకకై, కనదళివీక్షులై, కనత్ = ప్రకాశించెడు, అళివీక్షులై = తుమ్మెద లనుచూపులు గలవియై, యెదురు కన్గొనెన్ = ఎదురు చూచుచుండెను. కంటె = చూచితివా? కామపీడితయై గృహమునం దన్ను నలంకరించుకొని మగనిరాకకై యెదురు చూచునింతి వాసకసజ్జిక యనంబడు ఈపద్యమునం దిట్టినాయికాత్వము లతలయం దారోపింపఁబడెను. అలంకారము మీఁదటి యట్లె.

చ॥ అనిశమహానురాగసము ♦ దంచిత లౌసరసాంతరంగప
ద్మినుల మదాంధతన్ విడచి ♦ తిమ్మెరతుమ్మెద నెమ్మికాఁడు దా
ననయము చూచితే యవిన ♦ యమ్మునఁ బుష్పిణు లైనకొమ్మలన్
నెనరున నొందుచుండె రమ ♦ ణీ మధుపాళుల కేడ నిల్కడల్ ?66

అనిశ......తలు, అనిశ = ఎల్లకాలమును, మహత్ = అధికమైన, అనురాగ = ఎఱ్ఱనికాంతిగలుగుటచేతను, సముదంచితలు = ప్రకాశించునవి ఎల్లకాలము నధికమైన ప్రేమచేఁ బూజింపఁబడువా రని యర్థాంతరము ఔసరసాంతరంగపద్మినులన్ = అగు, సరస = ఉదకముతోఁగూడిన, అంతరంగ = లోపలియవయవము ( [illegible] ) గల పద్మినులన్ = పద్మలతలను, అగుసరసమైనమనసు గలపద్మినీజాతి స్త్రీల నని రెండవ యర్థము మదాంధతన్ = పొగరువలనిగర్విష్ఠతనముచేతను విడచి = వదలి, ద్రిమ్మరుతుమ్మెదనెమ్మికాఁడు = సంచరించెడుతుమ్మెద యనుప్రియుఁడు, తాన్ = తాను, అవినయమ్మునన్ = అవిధేయతచేతను, ( చెడునడవడిచేత నని యర్థము ) పుష్పిణులైనకొమ్మలన్ = పువ్వులు గలచెట్టుకొమ్మలను, రజస్వలలైనస్త్రీల నని రెండవయర్థము. అనయము = అత్యంతము, సెనయుచున్ = నెయ్యముతోన్, పొందుచుండెన్ = పొందుచుండెను. రమణీ = ఓభద్రా! చూచితే = చూచితివా? మధుపాళులున్ = తుమ్మెదలసమూహమునను, మద్యపానముచేయువారల సమూహము నని రెండవయర్థము నిల్కడల్ = మనస్థైర్యములు, ఏడన్ = ఎక్కడన్, ( కల్గున్ ) ఎక్కడను లే దని యర్థము భ్రమరములు పుష్పిణు లగుకొమ్మలను బొందుచున్న వనువిశేషమును మధుపములకు నిల్కడ లే దను సామాన్యమున సమర్థించెం గాన నిం దర్థాంతరన్యాసాలంకారము మఱియును రెండర్థములు గలచోట నర్థద్వయమునకు నభేదనిశ్చయముచే శ్లిష్టరూపకము.

సీ॥ వితతాళిమాలికా ♦ వేణువు మ్రోయించి
బలునెమ్మినటనముల్ ♦ వెలయఁజేసి
కలకంఠకాకలీ ♦ గానంబు లలరించి
ఘనమండలవిలాస ♦ గతులు పూని
కమనీయశుకభాష ♦ ణముల ముచ్చటలాడి
వలపూరవిరులన ♦ వ్వు లొదవించి
మంజుకింజల్కరో ♦ మాంచగుచ్ఛస్తనాం
చద్గోపికాసహా ♦ సములు నెనసి
కమ్రశాఖాభుజంబులఁ ♦ గౌఁగిలించి
కలరవస్వనమణితంబు ♦ లొలయ రాస
కేళిఁ జూపించెఁ దాపింఛ ♦ కృష్ణమూర్తి

యివ్వనంబునఁ గనుఁగొంటె ♦ యిందువదన ! 67

తాపింఛకృష్ణమూర్తి = చీఁకటిమాఁకనుకృష్ణమూర్తి, వితతా......వేణువు, వితత = విశాలమైన, అళిమాలిక = తుమ్మెదలబారనెడు, వేణువు = పిల్లఁగ్రోవిని, మ్రోయించి = ధ్వనించునట్లు చేసి, ఒలునెమ్మినటనముల్ = అధికమైననెమళ్లయొక్క నాట్యములను, నట్టికంతసముతోడినాట్యములను వెలయఁజేసి = ప్రకటించి, (కృష్ణుఁడు రాసక్రీడయందుఁ బిల్లఁగ్రోవితో గానముచేయుచు నాట్యము చేసె నని భాగవతము) కలకంఠ......లు, కలకంఠ = కోయిలలయొక్క, కాకలీ = సూక్ష్మమైనమధురధ్వని యనెడు, గానంబులు = సంగీతములను, అలరించి = ప్రకాశింపఁజేసి, ఘనమండలవిలాసగతులు = మేఘమండలముయొక్కవిలాసముతోఁ గూడినతోవను, ఆకాశము నని యర్థము. (ఈయర్థమున బహువచన మవివక్షితము.) పూని = ధరించి, మేఘమండలములను నౌన్నత్యమున వ్యాపించి యని వృక్షుపరమైనయర్థము. గొప్పవి యగుమండలాకారమైనగమనములను ధరించి యని కృష్ణపరమైనయర్థము. (ఈరెండర్థములకు నిట నభేదాధ్యవసాయము.) కమనీయ......ములన్, కమనీయ = మనోహరములైన, శుకభాషణములన్ = చిలుకపలుకులచేతను, ముచ్చటలాడి = ప్రియవాక్యములు పలికి యని వృక్షుపరము. చిలుకపలుకులం బోలుపలుకులచేతఁ బ్రియవాక్యములు పలికి యని కృష్ణపరము వలపు = పరిమళము, ఊరన్ = అధికము కాఁగాన్, (ప్రేమ మధికము కాఁగా నని కృష్ణపరము) విరులనవ్వులు = పువ్వు లనెడుహాసములను, ఒదవించి = కావించి, పువ్వుంబోలిననవ్వును గావించి యని కృష్ణపరము. మంజు......లన్, మంజు = మృదువులగు, కింజల్క = పువ్వులోనిదారము లనెడు, రోమాంచ = గగుర్పాటు గల, గుచ్ఛ = పూగుత్తు లనెడు, స్తన = కుచములచేతను, అంచత్ = ప్రకాశించుచున్న, గోపికాసహస్రములన్ = శారిబా (సుగంధిపాల) లత లనెడుస్త్రీలయొక్కసహస్రములను (స్త్రీ = గొల్లది) ఎనసి = పొంది, (ని) గోపీ శ్యామా శారిబా స్యాత్. అ. కమ్రశాఖాభుజంబులన్ = మనోహరమైనకొమ్మ లనెడుహస్తములతోన్, కాఁగిలించి = ఆలింగనము చేసికొని, కలరవ......బులు, కలరవ = పావురములయొక్క, స్వన = ధ్వను లనెడు, మణితంబులు = రతికాలమందుఁ గంఠమునఁ బుట్టుధ్వనివిశేషము, (ని) మణితం రతికూజితం. అ ఒలయన్ = వ్యాపింపఁగాన్, రాసకేళిన్ = గొల్లవారాగుకొను నొకయాటను, పెక్కండ్రు గలిసి చేయునాట్య మని కొంద అందురు. ఇవ్వనంబునన్ = ఈతోఁటయందున్, చూపించెన్ = కనుపఱిచెను, ఇందువదన = ఓభద్రా ! కనుఁగొంటె = చూచితివా ? యున్న శ్రీకృష్ణుఁడు మందయందు

రాసముం జూచె నని భాగవతమున నున్నది. ఇప్పు డీవనమునం దున్న తమాలవృక్షమున నైల్యగుణసామ్యముచేఁ గృష్ణత్వ మారోపించి రాసము చూపినప్పుడు కృష్ణుఁడు చేసినగానాదులను నావృక్షమునం దున్న కోయిలలకూఁతలు మొదలగువానియం దారోపించెను; గాన సావయవరూపకాలంకారము.

క॥ వని సాధుమాధుకరగో
ష్ఠిని వర్తిలుచున్నతపసి ♦ చిత్రంబుగ నూ
తనశోభ నలరుగణికల
నెనసి మొగడచన్ను లంటె ♦ నిది గనుఁగొంటే॥ 68

(భద్రా!) వనిన్ = ఈతోఁటయందున్, సాధు......గోష్ఠిన్, సాధు = పరోపకారముచేయు, మాధుకర = మధుకరవృత్తిచే జీవించువారియొక్క, (మధుకరము = తుమ్మెద. దీనివృత్తి పువ్వుపువ్వునకుం బోయి మకరందము గ్రోలుట. ఇట్లే యింటింటికిం బోయి భిక్షుఁ గొని జీవించుట మధుకరవృత్తి. (తుమ్మెదవృత్తిం బోలినవృత్తి యని యర్థము) దీనిచే జీవించువారు మాధుకరులు) గోష్ఠిన్ = సల్లాపములోన్, ఇతరులకు హాని చేయనితుమ్మెదలసముదాయముతో నని ప్రకృతార్థము, మధుకరములసంబంధ మైనగోష్ఠి మాధుకరగోష్ఠి గోష్ఠి = సముదాయము. వర్తిలుచున్నతపసి = ఉన్నతపశ్శాలి, ఉండెడిగొంగ జెట్టని ప్రకృతార్థము. నూతనశోభలన్ = క్రొత్తదీప్తులతోన్ అలరుగణికలన్ = ప్రకాశించు వేశ్యలను, ప్రకాశించునడవిమల్లెల నని ప్రకృతార్థము, ఎనసి = కూడికొని, మొగడచన్నులు = మొలకచన్నులను, చన్నులఁ బోలినమొగ్గల నని యర్థాంతరము. చిత్రముగన్ = వింత గలుగునట్లు, అంటెన్ = స్పృశించెను. ఇది = ఈవింతను, కనుగొంటే = చూచితివా? ఇందుఁ దపసి యనువిశేష్యమునయితము శ్లేషించుటచేఁ బ్రాచీనలు శబ్దశక్తిమూలధ్వని యగు నని యందురు. ఇట్టిచోట్లఁ బ్రకృతాప్రకృతశ్లేష మనియే యప్పయ్యదీక్షితులు చెప్పిరి.

సీ॥ ఆమ్రవల్లరి కేల ♦ నంటు మల్లన బాల
తిలకింపు మిది దీనిఁ ♦ దిలకమేని
సుదతి తాఁచఁగదమ్మ ♦ యిది యశోకపుఁగొమ్మ
కౌఁగలింపుము తావి ♦ గవయుఁ గ్రోవి
యిది ప్రియాళువు నాతి ♦ గదిసి పాడుము గీతి

ముచ్చటాడుచు నేగు ♦ ముదిత గోఁగు
కాంచనం బిది యింతి ♦ నించు మాననకాంతి
చేరి నవ్వుము పొన్న ♦ చెలువమిన్న
శ్వాస మొందింపు మిది సింధు ♦ వార మతివ
యువిద కేసర మిది దీని ♦ నుమియు మద్య
యిటు లొనర్చినఁగాక యి ♦ వ్విటపములు సు
మంబు లీనవు వింటివే ♦ మంజువాణి॥ 69

బాల=ఓముద్దరాలా! ఆమ్రవల్లరి=తియ్యమామిడిచెట్టుయొక్క కొమ్మను, కేలన్=హస్తముతో, అల్లన=మెల్లఁగాన్, అంటుము=ముట్టికొనుము ఇది=ఎదుటనున్న యీచెట్టు, తిలకము=బొట్టుగుచెట్టు, ఏని=అయినయెడల, దీనిన్, తిలకింపుము=చూడుము. సుదతి=ఓభద్రా! (మేలయినదంతములు గలది) ఇది, అశోకపుఁగొమ్మ=అశోక మనుచెట్టుయొక్క కొమ్మ, (అగును) (దీనిన్) తాఁచఁగదమ్మ=తన్నుము. తావి=సుగంధము, కవయన్=క్రమ్ముకొనునట్లు, కోరివిన్=కురవకమును (పూవులగోరంటచెట్టును) కౌఁగలింపుము, నాతి=ఓచిన్నదానా? ఇది, ప్రియాళువు=మోరటిచెట్టు; కదిసి=(దీని) సమీపించి, గీతి=గానమును, పాడుము; ముదిత=ఓస్త్రీ! గోఁగు=ఇది కర్ణికారవృక్షము ముచ్చట=మధురమైనమాటలు, ఆడుచున్=పలుకుచున్, ఏగుము=(దీనిసమీపమునుండి) పొమ్ము ఇంతి=ఓకాంతా! ఇది, కాంచనంబు=సంపెంగచెట్టు. ఆననకాంతి=ముఖశోభను, నించుము=(ఇంపుఁ) బరిసరింపఁజేయుము చెలువమిన్న=ఓసుందరీరత్నమా! పొన్న=(ఇది) పున్నాగవృక్షము చేరి=సమీపించి, నవ్వుము. అతివ=ఓజవ్వని, ఇది, సింధువారము=వావిలిచెట్టు, శ్వాసము=ఊర్పును, ఒందింపుము=(దీనికిం) దాఁకునట్లుచేయుము. ఉవిద=ఓయువతీ! ఇది, కేసరము=పొగడచెట్టు, దీనిన్, ఉమియుము మద్యమ్మ=(మద్యముతో) నుమియుము. మంజువాణి=ఓమృదుభాషిణీ! ఇటులు=నేఁ జెప్పినప్రకారము, ఒనర్చినఁగాక=చేసిననే కాని, ఇవ్విటపములు=ఈచెట్లు, (ఈశబ్దమునకుఁ గొమ్మలసముదాయ మనియేని బోదెలేనిచెట్టనియేని యర్థము, గాని యిచట వృక్షసామాన్యమునకే యుపయోగింపఁబడెను) సుమంబులు=పువ్వులను, ఈనవు=ప్రసవింపవు వింటివే=ఆలకించితివికదా! చెట్లకుం దీవలకు నకాలమునఁ బువ్వులు మొదలగువానిం బుట్టించుక్రియ దోహద మనంబడు. స్త్రీలు చేతఁ దాఁకుట మామిడికిని, చూచుట తిలకమున

కును, కాలం దన్నుట యశోకమునకును, కాఁగిలించుట గోరంటకును, సంభాషించుట కొండగోఁగునకును, ముఖకాంతిం బ్రసరింపఁజేయుట సంపెంగకును, నవ్వుట పొన్నకును, ఊర్చుట వావిలికిని, కల్లుమియుట పొగడకును దోహదములు ఇవన్నియు నిందుఁ జెప్పంబడె.

లయగ్రాహి.

చందనమహీరుహము ♦ లందుఁ బెనఁగొన్న గురు
వెందనునుఁదీవియల ♦ పందిరులలోఁ బెం
పొందువిరవాదిపువు ♦ గందవ్రొడి రేఁచి చను
మందమలయానిలునిఁ ♦ జెందు పెనుతావిం
గ్రందుకొని ఘుమ్మురను ♦ చుం దనరుపూఁబొదల
సందుల మెలంగి పలు ♦ చందములచే మా
కందసుమబృందమక ♦ రందరసబిందువుల
విందులుగఁ గ్రోలెదుమి ♦ళిందములఁ గంటే. 70

( ఓభద్రా ) చందనమహీరుహములందున్ = మంచిగంధపుఁజెట్లయందన్, పెనఁగొన్న గురువెందనునుఁదీవియలపందిరులలోన్ = అల్లుకొన్న గురువెందలయొక్క సన్నని తీఁగెలయొక్క పందిళ్లనడుమను, పెంపొందువిరవాదిపువుగందవ్రొడిన్ = అధికమైనవిరజాజిపువ్వులయొక్క పరాగమును, రేఁచి = రేఁగఁగొట్టి, చనుమందమలయానిలునిన్ = పోయెడుచల్లగాలిని, చెందు పెనుతావిన్ = తగుల్కొనియెడుపరిమళముచేతను, క్రందుకొని = అతిశయించి, ఘుమ్మురనుచున్ = ఘుమఘుమ లాడుచున్, తనరుపూఁబొదలసందునన్ = ప్రకాశించెడుపూవులు గలపొదరిండ్లమధ్యను, పలుచందములన్ = అనేకప్రకారములచేతను, మెలంగి = సంచరించి, మాకంద......బిందువులన్, మాకంద=మామిడి (పూవుల) యొక్క, బృంద = సముదాయముయొక్క, మకరందరసబిందువులన్ = తేనెబొట్లను, విందులుగన్ = ప్రియభోజనములుగాన్, క్రోలెదుమిళిందములన్ = అనుభవించెడుతుమ్మెదలను, కంటే = చూచితివా?

క॥ అని జవ్వని కవ్వనితలు
వనితరువిభవములు దెలిపి ♦ వరసురభిరజం

బునఁ బసిమి దాల్చి తనులత
లొనరఁగఁ బుష్పాపచయస ♦ ముత్సుక లగుచున్ ॥ 71

అవ్వనితలు, అని=ఇట్లు పలికి, జవ్వనికిన్ = భద్రకు, వనితరువిభవములు, వని = తోఁటయందలి, తరు = చెట్లయొక్క, విభవములు = సంపదలను, ( చెట్లయొక్క పుష్ప ఫలాద్యతిశయము నని యర్థము ) తెలిపి = తెలియఁజేసి, వరసురభిరజంబునన్ = శ్రేష్ఠమైనపరిమళము గలపుష్పాదిచేతను, తనులతలు = తీఁగెలవంటిశరీరములు, పసిమిన్ = పచ్చనికాంతిని, తాల్చి = ధరించి, ఒనరన్ = ప్రకాశింపఁగాన్, పుష్పాపచయసముత్సుకలు, పుష్ప = పువ్వులయొక్క, అపచయ = కోయుటయందున్, సముత్సుకలు = వేడుక గలవారు, అగుచున్, ముందరిపద్యముతో నన్వయము.

ఇభగతిరగడ.

పొలఁతి యీగొజ్జంగి ♦ పొదలతేనియసోన
కళులు పటుచాతకము ♦ లై మనలె వనిలోనఁ
జిన్నినునుఁజివురాకుఁ ♦ జిదిమితివె కెంగేలఁ
గన్ను లెఱ్ఱగఁ జేసెఁ ♦ గదవె కోకిలబాల !
ఘనకనకములు గొనుచుఁ ♦ గదలెఁ దెమ్మెఱముగ్ధిచ్చు
వనలక్ష్మిసొమ్ము లని ♦ వదలఁ జేమనవచ్చుఁ
గొమ్మ ! కయి నంటె ననఁ ♦ గోయు మిఁక చంపకము
నెమ్మొగము చాయలన ♦ నిచ్చిన దీచంపకము
కనదనిలగతి నెగయుఁ ♦ గప్రపుమమారములు
గని వెన్నె లనిపఱచెఁ ♦ గదె కోకవారములు
బింబ మనియెదురుకొనె ♦ విడిచి శుక మెలమావి
నంబురుహనయన ద ♦ వ్వరసి నీకెమ్మోవి
జడిగొనఁదొరంగెఁ గే ♦ సరముల మరందములు
దడిసెఁ దద్బిందువుల ♦ ధమ్మిల్లకుందములు

పటుమధుపపటలు ల ♦ భ్రము లనిమయూరములు
నటియించెఁ గంటె త ♦ న్నటనపుటూయారములు,
క్రూరఫణులను జుట్టు ♦ కొనియె నీచందనము
చేరఁబోవకు మటకుఁ ♦ జెలి నీకువందనము
గేదంగి కోయ కే ♦ గెద వేటికి మిటారి
కాదటే మరున కది ♦ గడిబంగరుకటారి
కలికి వనదేవతల ♦ కర్ణికాకారములు
దెలిపె నిచ్చటఁ జూచి ♦ తే కర్ణికారములు
లతలమాటునఁ బెంప ♦ లరునీదుకొనగోరు
నతివ యల్లియది పూ ♦ వని కేలఁ గొనఁగోరు
వేడుకగ వినె దేల ♦ పికకుహూకారములు
చేడె యవి విరహిణుల ♦ చెవులకుఁ గరోరములు
నఱవిరియు మొల్లవిరు ♦ లల్లచట మొల్లములు
మఱచి పోఁదగునటే ♦ మరున కివిభల్లములు
మరువంపుసౌరభము ♦ మఱలించెఁ గురువేరు
సరిగాదు దీని కిఁక ♦ జగతి వేరొకవేరు
సుదతిరో చేకొనవె ♦ సురపొన్నక్రొన్ననలు
చద లంటెఁ బుష్పముల ♦ సారెఁదద్వాసనలు
కొలఁది గనని విరాలి ♦ గొని సొలసినది కొమ్మ
జలజాస్త్రుఁ గొల్త మిఁక ♦ సఖులార రారమ్మ॥ 72

పొలఁతి = ఓ స్త్రీ, ఈగొజ్జంగి . . కడన్, ఈ = దగ్గఱనున్న, గొజ్జంగిపొదలతేనియసోనకున్ = గొజ్జంగిపూవులు గలపొదలయందలి తేనెవర్షమునకున్, అళులు = తుమ్మెదలు, పటుచాతకములై = నేర్పు గలవానకోయిలలై, వనిలోనన్ = ఈతోఁటయందున్, మసలెన్ = విహరించెను. వాన కురియునపుడు చాతకము లాకసమున సంచరించుచు నాజలబిందువులు త్రావునట్లిచటిపొదలందుఁ దేనె యొడతెగకుండ వర్షించు

చుండఁ దుమ్మెదలు ద్రావుచుండె ననియొకచెలి మఱియొకచెలితోఁ జెప్పెను. చిన్ని మను..... తుఱా, చిన్ని = మనోహరమైన, మను = మృదువైన, చివురాకుల = చిగురాకును, కెంగేల = ఎఱ్ఱనిచేతితోఁ, చిదిమితివే = తుంపితివా? (ఈకారణమున) కోకిలబాల = చిన్నవయసునందున్న కోయిల, కన్నులు = నేత్రములను, ఎఱ్ఱగ = ఎఱ్ఱవి యగునట్లు, చెసెఁగదవే = కావించెనుగదా. స్వభావమునసే యెఱ్ఱనికన్నులు గోయిలకుండఁగాఁ జిగురాకుఁ గోయుటచేఁగల్గినకోపమున నవి యట్లయ్యె ననియొకచెలి యుత్ప్రేక్షించెను తెమ్మెరద్రిమ్మరి = వాయువనుదొంగ, ఘనకేసరములు = గొప్పవి యగునాగకేసరపుష్పము లనుబంగారు(వస్తువు)లను, కొనుచున్ = హరించుచున్, కదలెన్ = వెడలిపోయెను. శ్లిష్టరూపకాలంకారము వనలక్ష్మిసొమ్ములు = వనలక్ష్మియొక్క భూషణములు, అని = ఇట్లు తలఁచి, (వానిని) వదలఁడు = విడువఁడు. ఏమనవచ్చున్ = ఏమనుటయుక్తము ఈపుష్పములు వనశోభకుం గారణ మయ్యును విడువక వాయువు హరించుచున్నాఁడు. వీని నేమనవచ్చు ననియొకచెలి మఱియొకచెలితో ననెను గాలిచేతం బువ్వు లెగిరిపోవుచున్న వనిభావము కొమ్మ = ఓచెలియా! కయిజ = చెలితోడ, అంటి = ముట్టుకొని, ననల = పువ్వును, కోయుము. ఇఁకవంపకుము = ఇంతకంటె నధికముగఁ గొమ్మ వంగఁజేయకుము ఈచంపకము = ఈసంపెంగ, నెమ్మొగముచాయలన్ = ముఖకాంతులచేతన్, ననిచినది = పూచినది. ఇది మన ముఖకాంతిచేఁ బూచెను కాఁబట్టి దీనిని వంచి బాధింపక పూలుగోయుమని యొకతె మఱియొకతెతోఁ జెప్పెను. (జవ్వనులముఖకాంతిప్రసారముచే సంపెంగ పూచు ననిదోహదములలోనున్నది) కోకవారములు = జక్కవలగుంపులు, కనదనిలగతిన్ = ప్రకాశించుచున్న వాయుసంచారముచేతను, ఎగయుకప్రపుదుమారములు = ఎగిరెడుకప్పూరపుధూళులను, కని = చూచి, వెన్నెలని = చంద్రునికాంతి యనిభ్రమించి, పఱచెఁగదె = పాఱిపోయెనుగదా! గాలిచేఁ గప్పురపుచెట్లనుండి యెగిరెడుదుమ్ము చూచి తెల్లఁగనుండుటచేఁ జక్రవాకములు వెన్నెల యనిభ్రమించి తమకు దానికి విరోధముగావున మఱలి పోవుచుండె ననియొకతె చెప్పెను. దీనను ముందువాక్యమునను (భ్రాంతిమదలంకారము) అంబురుహానయన = ఓయింతీ! శుకము = చిలుక, దవ్వు = చాలదూరము, అరసి = ఆలోచించి, (మిగుల నాలోచించి యనియర్థము) ఎలమావి = లేఁతమామిడిచెట్టును, విడిచి, నీకెమ్మోవి = నీపెదవి, బింబమని = దొండపండనుకొని, ఎదురుకొనెన్ = ఎదురువచ్చెను మరందములు = పూఁదేనెలు, కేసరములన్ = కేసరపుష్పములనుండి, జడిగొనన్ = ఎడతెగకుండఁగాన్, తొరంగెన్ = స్రవించెను తద్బిందువులన్ = ఆతేనెబిందువులచేతను, ధమ్మిల్లకుందములు = కొప్పులోనిమొల్లమొగ్గలు, తడిసెన్ = నానెను. అతిశయోక్త్యలంకార

ము. మయూరములం = నెమిళులు, పటుఘనపటలులు, పటు = చొరవగల, ఘనపటలులు = తుమ్మెదగుంపులు, అభ్రములని = మేఘములని, నటియించెన్ = నృత్యముచేసెను. దీనియందు భ్రాంతిమదలంకారము. తన్నటనపుటోయాంములు = వారినాట్యపుసొగసులను, కంటె = చూచితివా? చెలి = ఓసఖీ! ఈచందనము = ఈమంచిగంధపుఁజెట్టు, కూర్మరఫణులన్ = ఘాతుకములైనపాములను, చుట్టుకొనియెన్ = తన్నావరించునట్లు చేసికొనెను. అటకున్ = ఆచోటునకున్, చెరఁబోవకుము నిలున్, వందనము = నమస్కారమును, (చేయుదును.) మిటారి = ఓమదవతీ! గేదంగి = మొగలిపూవును, ఏటికి = ఎందులకున్, కోయక, ఏగెదవు = పోయెదవు అది = ఆపువ్వు, మరునకున్ = మన్మథునకున్, కడిబంగినకటారి = పరిమళము గలిగినబంగారుకత్తి, కాదటే = కాదా? (అగు నని యర్థము) మొగలిపువ్వుఁ గోయక యేలపోయెద వనియొకతె చెలి నడుగ నది యాపువ్వు మన్మథుని యాయుధము గాన ముట్టనైతి నని చెప్పెను. కలికి = ఓసుందరీ, ఇచ్చటన్, కర్ణికారములు = కొండగోఁగుపువ్వులు, వనదేవతలకర్ణికాకారములు = వనము బాలించుదేవతలయొక్క కర్ణభూషణములయాకారములను, తెలిపెన్ = ప్రకటించెను (స్త్రీలు చెవులను ధరించెడునొకభూషణము కర్ణిక యనంబడును) కొండగోఁగుపువ్వులు వనదేవతలయొక్క కర్ణభూషణములవలె నుండె నని భావము లతలమాటున్ = తీఁగెలచాటునన్, పెంపలరునీమకొనగోరు = అతిశయముచేఁ బ్రకాశించు నీ గోటితుదను, అల్లయది = ఆకనుపడుస్త్రీ, పూవని = పుష్పమునిగ్రహించి, కేలన్ = చేతితోన్, కొనన్ = తీసికొనుటకు, కోరున్ = అపేక్షించును చెడీ = ఓచెలీ! (ఇదిచెటీశబ్దభవము) పికకుహూకారములు = కోయిలకూఁతలను, వేడుకగన్ = కుతూహలమగునట్లు, వినెదేల = ఎందుచేత వినెదవు. అవి = ఆకూఁతలు, విరహిణులచెవులకున్ = మగనితో నెడఁబాసినస్త్రీలచెవులకున్, కఠోరములు = వినశక్యములుకానివి, (అగున్) అల్లపటన్ = ఆస్థలమందున్, అఱవిరియు మొల్లవిరులు = సగముపూచినకుందపుష్పములు, మొల్లములు = పెక్కులు (కలవు) అవి = ఆపువ్వులు, మరునకున్ = మన్మథునకున్, భల్లములు = బాణములు, ఎఱవిపోన్ = (మన్మథునిబాణము లగుటను) మఱచిపోవుట, తగునటే = తగునా? (తగదనుట) ఆచోట మొల్లలు చాల నున్న వనియొకతె చెప్పఁగాన్ మఱియొకతె యవి మన్మథబాణము లనిన నది యటు పోవకు మనిచెప్పెను కురువేరు = (ఒకసుగంధిద్రవ్యము) మరువంపుసౌరభమున్ = మరువముయొక్క పరిమళమును, మఱలించెన్ = వారించెను దానికంటె నధికముగాఁ బరిమళించుచున్న దనిభావము వేరొకవేరు = ఇంకొకవేరు, జగతిన్ = లోకమునందున్, దీనికిన్ = ఈకురువేరునకున్, సరికాదు. పరిమళమున సమానము కాదు. సుదతిరో = ఓ

సుదతీ! ( మంచిదంతములుకలది ) సురపొన్నక్రొన్ననలు = సురపొన్నలయొక్క నూతనమైనపుష్పములను, చేకొనవె = గ్రహింపుము. ( క్రొత్త + ననలు = క్రొన్ననలు. సమాసంబునఁ బ్రాతాదులతొలియచ్చుమీఁదివర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగా నగు. బా. సం. ఈసూత్రముచేఁ గ్రొత్తశబ్దములోని తకారద్వయమునకు లోపము రాఁగాఁ, గ్రొత్తశబ్దమున కాద్యక్షరశేషమునకుఁ గొన్నియెడల నుగాగమంబును గొన్నియెడల మీఁదివాల్లునకు ద్విత్వంబును నగు బా సం. సూత్రముచే నకారమునకు ద్విత్వము రాఁగా, నీరూపము సిద్ధించెను ) తద్వాసనలు = ఆపొన్నపూవులసుగంధములు, పుప్పొడులన్ = పరాగములచేతను, సారెన్ = మాటిమాటికి, చదలు = ఆకాశమును అంటెన్ = తాఁకెను సఖులారా = ఓ చెలులారా, కొమ్మ = మచ్చెలి యగుభద్ర, కొలఁది గననివిరాలి, కొలఁది = పరిమాణమును, కననివిరాలి = పొందనివలపును, ( అధికమైన వలపు ననియర్థము ) కొని = పొంది, సొలసినది = మూర్ఛఁ జెందినది ఇఁకన్ = పిమ్మటను, జలజాస్త్రున్ = మన్మథుని, కొల్తము = పూజింతము రారమ్మ = రండు.

గీ॥ అనుచు వనకేళి సలిపి ప ♦ ద్మాయతాక్షు
లతులవివిధలతాంతసం ♦ తతులలోన
నమితసౌరభరుచిరము ♦ లైనవాని
నెంచి మదనున కర్పింత ♦ మంచు వెడలి॥ 73

పద్మాయతాక్షులు = ఆస్త్రీలు, ( తామరపువ్వులుంబోలె విశాలములగు కన్నులు గలవారు ) అనుచున్ = ఇట్లొండొరులతోఁ బలికికొనుచున్, వనకేళి = ఉద్యానమందలిక్రీడను, సలిపి = చేసి, వివిధ......లోనన్, వివిధ = పలుతెఱంగుల, లతాంత = పువ్వులయొక్క, సంతతులలోనన్ = సముదాయములందున్, అమితసౌరభరుచిరములు, అమిత = అధికమైన, సౌరభ = పరిమళముచే, రుచిరములు = మనోహరములు, ఐనవానిన్ = అయినపుష్పములను, ఎంచి = ఏర్పఱిచి, మదనునకున్ = మన్మథునకున్, అర్పింతము = ఒసఁగుదము, అంచున్, వెడలి = వెలుపలికి వచ్చి, ముందుపద్యముతో నన్వయము

సీ॥ విమలసన్మానసో ♦ పమభంబుగావున
రాజహంసవిహార ♦ రమ్య మగుచు

వరపద్మముఖ్యావి ♦ స్ఫురితంబుగావున
మృదులహారిశిలీము ♦ ఖేష్ట మగుచు
నురుధార్తరాష్ట్రాభి ♦ యుక్తంబుగావున
గురురవిజాభంగ ♦ గరిమ మగుచు
వర్ణితకమలాధి ♦ వాసంబుగావున
ఘనశంఖచక్రసం ♦ కలిత మగుచు
నంబరమురీతి నలకాపు ♦ రంబుభాతి
నిభపురి తెఱంగు నచ్యుతా ♦ కృతిహరారంగు
వరుస నిరవొందునొకసరో ♦ వరము గాంచి
రంచితారామసీమ న ♦ య్యబ్జముఖులు॥ 74

అయ్యబ్జముఖులు=ఆస్త్రీలు, (చంద్రునిం బోలినముఖములు గలవారు.) అంచిత = మనోహర మైన, ఆరామసీమన్=పూఁదోఁటయందున్, విమల... ...భంబు విమల=స్వచ్ఛ మైన, సత్ =ప్రశస్త మైన, మానసోపమ=మానసరోవరముతో సాటి గల, భంబు=కాంతి గలది, కావునన్ =అగుటచేతను, రాజ... ...రమ్యము రాజహంస=రాయంచలయొక్క, విహార=సంచారముచేతను, రమ్యము=సుందర మైనది, అగుచున్, మానససరసున హంసలు తఱచు వసించును. వీరు చూచిన కొలను దానిం బోలుఁ గాన నిచటను హంసలు పెక్కులు గల వని చెప్పఁబడియెను. ఎఱ్ఱనికాళ్లను ముక్కులుం గలిగి తెల్లనిశరీరచ్ఛాయ గలహంసలు రాజహంస లనంబడు. (ని) రాజహంసాస్తు తే చంచుచరణై ర్లోహితై స్సితాః. అ. విమల=స్వచ్ఛ మైన, సత్ =నక్షత్రములయొక్క, భా=శోభచేతను, నసోపమ=సాటి లేని, భంబు=కాంతిగలది. (ఉపమ=సాదృశ్యము, అదికలది = సోపమము. అట్టిది కానిది, నసోపమము) కావునన్ =కనుకనే, రాజహంసవిహారరమ్యము, రాజ=చంద్రునియొక్కయు, హంస=సూర్యునియొక్కయు, విహార=సంచారముచేతను, రమ్యము=మనోహర మైనది, అగుచున్, (ని) సన్ సత్యే విదుషి శ్రేష్ఠే సాధౌ భవతి చ త్రిషు స త్త్రీబ మ్పృతే. నా. నా. (ని) రాజా మృగాంకే క్షత్రియే నృపే యనియును భాను ర్హంస స్సహస్రాంశు వనియు నమరుఁడు. ఇందుఁ గొలనికి నాకాశముతో సాదృశ్యము చెప్పఁబడెను సన్మానసోపమభత్వమును, రాజహంసవిహారరమ్యత్వమును శబ్దమాత్రముచే రెంటం

గలవు. అర్థముః లేవు. అనఁగా మానససరసునం గలకాంతి చెలువునకు, నక్షత్రములచే నసాధారణమైన కాంతి యాకాశంబునను, రాయంచలసంచారము చెలువునను, సూర్య చంద్రులసంచార మాకాశమునను గలదు. వర... .తంబు, వర=శ్రేష్ఠమైన, పద్మ=తామరపూవులు, ముఖ్య=మొదలైనవానిచే, విస్ఫురితంబు=ప్రకాశింపఁబడినది, కావునన్=అగుటచేత, మృదుల... ..ష్టము, మృదుల=సూక్ష్మములు కాని, హరి=కప్పలకును, శిలీముఖ=తుమ్మెదలకును, ఇష్టము=అనుకూలము, అగుచున్, పద్మములు మొదలైనవి కలవు గనుక నే తుమ్మెదలు మొదలగువాని కీకొలను మిగులఁ బ్రియమైన దని యర్థము వరపద్మముఖ్య=వరము పద్మము మొదలైననవనిధులచేతను (తొమ్మిది దరిద్ర్యరాసులచేతను) విస్ఫురితంబు=ప్రకాశింపఁజేయఁబడినది, కావున్=అగుటచేతను, మృదులహరిశిలీముఖేష్టము, మృదుల=మిక్కిలి దయ గల, హరిశిలీముఖ=శివునకున్, (విష్ణువు బాణముగాఁ గలవాఁడు) ఇష్టము=ప్రియమైనది, అగుచున్, (ని) మహాపద్మశ్చ పద్మశ్చ శంఖో మకరకచ్ఛపౌ ముకుంద కుంద నీలాశ్చ వరశ్చ నిధయో నవ అ. (ని) అళి బాణౌ శిలీముఖౌ అ. (ని) శుకాహి కపి భేకేషు హరి ర్నా కపలే త్రిషు. అ ఇందుఁ గొలని కలకాపురముతో సామ్యము చెప్పఁబడెను. పద్మాదిసంపత్తియు, హరిశిలీముఖేష్టత్వమును వెనుకటియట్లే రెంటను గలవు అర్థమున లేవు. అనఁగాఁ దామరపూవులు మొదలగువానికి లిమి సరసునను, పద్మము మొదలైననిధులకలిమి యలకాపురంబునను, తుమ్మెదలు మొదలైనవానికిఁ బ్రియ మగుట సరసునందును, శివునకుం బ్రియము గావించుట యలకయందును గలవు ఉరు ....యుక్తంబు, ఉరు=గొప్పలగు, ధార్తరాష్ట్ర=నల్లనిముక్కులుం గాళ్ళుఁ గలిగి తెల్లనిదేహకాంతి గలయంచలచే, (ని) ధార్తరాష్ట్రాః సితేతరైః అ అభియుక్తంబు=కూడికొనినది, కావునన్=అగుటచేతను, గురు . .గరిమము, గురు=గొప్పది యగు, రవిజా=యమునానదియొక్క (సూర్యునికిం గూఁతు రని యర్థము) (ని) కాళిందీ సూర్యతనయా అ అభంగ=పూర్ణమైన, గరిమము=గౌరవము గలది, అగుచున్, ధార్తరాష్ట్రము లనునంచలు గలది గావుననే యమునానదిం బోలె నల్లనినీరు గలిగిన దని యాశయము. ఉరు = అధికులైన, ధార్తరాష్ట్రాభియుక్తంబు=ధృతరాష్ట్రపుత్త్రు లనెడుయోధులు కలది, కావునన్, గురు=ద్రోణునియొక్కయు. రవిజ=కర్ణునియొక్కయు, అభంగ = అధికమైన, గరిమము=గౌరవము గలది యగుచు నని యర్థాంతరము. ఇందుఁ గొలనికి నిభపురి (హస్తినాపురము) తోఁ బోలిక చెప్పఁబడియె ధార్తరాష్ట్రాభియుక్తత్వంబును, గురురవిజాభంగగరిమత్వంబును శబ్దమాత్రముచె రెంటం గలవు. గొప్పవి యగుహంసవిశేషములు గలుగుట చెలువుండును ధృతరాష్ట్రపుత్త్రు లనుజోదు

లు గలుగుట హస్తిపురమునందును, యమునానదియొక్క గౌరవము కొలనియందును, ద్రోణునివలనను గర్ణునివలనను గలిగిన గౌరవము హస్తినాపురమునందును గలవు గాన నర్థమున భేదము లేవు వర్ణిత...సంబు, వర్ణిత=స్తుతింపఁబడిన, కమలాధివాసంబు=ఉదకము నునికిపట్టు (వి) కమలం భువనం జలం. అ కావునన్=అగుటచేతను, ఘన... ..కలితము, ఘన=గొప్పవి యగు, శంఖ=శంఖములతోడను, చక్ర=జక్కవపిట్టలతోడను, సంకలితము=కూడుకొన్నది, అగుచున్, వర్ణిత=స్తుతింపఁబడిన, కమలాధివాసంబు=లక్ష్మికునికిపట్టు, కావునన్, (వి) కమలా శ్రీర్హరిప్రియా। అ ఘన=గొప్పది యగు, శంఖ=పాంచజన్య మనుశంఖముతోడను, చక్ర=సుదర్శన మనుచక్రముతోడను, సంకలితము=కూడుకొన్నది అగుచున్, అని రెండవయర్థము. ఇందుఁ బుష్కరిణికి విష్ణువుతో సామ్యము చెప్పఁబడెను సాదృశ్యము మీఁదటియర్థ్లో యూహించునది వరుసన్=క్రమముతో, అంబరమురీతిన్=ఆకాశముతీరున, ఆకాశమువలె నని యర్థము అలకాపురంబుభాతిన్=కుబేరునిపురముయొక్క కాంతిచేతను, కుబేరునిపురమువలె ననియే యర్థము ఇభపురిరీతిన్=హస్తిపురముయొక్క రీతిని, హస్తిపురమువలె నని యర్థము అచ్యుతాకృతిఁ బోలంగ=కృష్ణునియాకారముయొక్క సొగసుం బోలినసొగసుచేతనున (తృతీయార్థమునఁ బ్రథమ) కృష్ణునియాకారమువలె నని యర్థము ఇరవొందెడు నొక సరోవరము=ప్రకాశించుచుండెడు నొక కొలనిని, కాంచిరి=చూచిరి ఇందు శ్లేషాలంకారము

మ॥ కదియం దీరనిషణ్ణయావతదిదృ • క్షాకౌతుకస్ఫూర్తితో
నెదు రేతెంచుజలాధిదేవతలమం • జీరౌఘనాదంబులై
మృదుకాసారమరాళికామదకల • క్రేంకారముల్ మించెఁ ద
ద్వదనాలోలవిలోకనంబులనఁ బ • ద్మప్రోద్గీతాళుల్ దగన్॥ 75

మృదు.. క్రేంకారముల్, మృదు=శ్రావ్యమైన (ఇది క్రేంకారములతో నన్వయించును) కాసార=కొలఁకునందలి, మరాళికా=హంసాంగనలయొక్క, మదకల=మదముచేస్ఫుటముకాని, క్రేంకారముల్=ధ్వనులు, కదియన్=సమీపించునట్లు తీర..... స్ఫూర్తితోన్, తీర=ఒడ్డునందున్, నిషణ్ణ=కూర్చున్న, యావత=స్త్రీసముదాయముయొక్క, దిదృక్షా=చూచుటయందలి, కౌతుక=వేడుకయొక్క, స్ఫూర్తితోన్=కలుగుటతోన్, ఒడ్డునం గూర్చున్న స్త్రీలనుం జూడ వేడుక కలుగుటచే నని యర్థము. (ఇందు దిదృక్షాశబ్దమునకే చూచుకోర్కి యని యర్థము గానఁ గౌతు

కశబ్దప్రయోగ మనావశ్యకము ) ఎదురు = అభిముఖముగాన్, ఏతెంచు...... నాదంబులై, ఏతెంచు = వచ్చెడు, జలాధిదేవతల = జలాధిదేవతలయొక్క, మంజీర = కాలియందెలయొక్క, ఓఘ = సముదాయముయొక్క, నాదంబులై = ధ్వనులై, మించెన్ = ప్రకాశించెను. భద్రయుం జెలికత్తెలును స్నానము చేయఁదలఁచి కొలఁకుదరికిం బోయినప్పు డందలిహంసలు వారిం జూచి చేయుధ్వనులు దరి నున్న వీరిం జూడఁగోరి యెదురువచ్చుచున్న జలాధిదేవతలకాలియందెలచప్పుడువలె నుండె నని భావము పద్మప్రోద్ధితాళుల్ = పద్మమునుండి యెగురుచున్న తుమ్మెదలు, తద్వదనా..... సంబులు, తత్ = ఆజలాధిదేవతలయొక్క, వదన = మోమునందలి, ఆలోల = చలించుచున్న విలోకనంబులు = చూపులు, అనం దగెన్ = అనన ట్లుండెను ఇం దంచకూఁత లందెలచప్పుళ్లనియుఁ, పద్మములనుండి యెగురుతుమ్మెదలు మోమునందలి చూపు లనియు సంభావించెఁ గాన నుత్ప్రేక్షాలంకారము

చ॥ తరగలఁ దేలుమీలకు దు ♦ తంబుగ వ్రాలి ప్రఫుల్లహల్లకో
త్కరసురజఃపిశంగితప ♦ తత్రములై వడి లేచి మింటి కే
గురహి దిటంబు లౌలకుము ♦ కుల్ కమలాకరలక్ష్మి వేడ్క నం
బరరమతోడ నాడుజిగి ♦ బంగరుబంతు లనంగ రాజిలెన్॥ 76

తరగలన్ = అలలయందున్, తేలుమీలకున్ = ఈఁదులాడెడుచేఁపలకున్, (చేఁపలను బట్టుకొనుటకని యర్థము ) ద్రుతంబుగన్ = త్వరగా, వ్రాలి, ప్రఫుల్ల . .. తత్రములై, ప్రఫుల్ల = మిగుల వికసించిన, హల్లక = ఎఱ్ఱకలువలయొక్క, ఉత్కర = సముదయమునందలి, సురజః = పరాగముచేతను, పిశంగిత = పచ్చనికాంతిగల, పతత్రములై = ఱెక్కలు గలవియై, ( ని ) హల్లకం రక్తసంధ్యాకం అ వడిన్ = వేగముగో, లేచి, మింటికిన్ = ఆకసమునకున్, ఏగురహిన్ = పోవునందముచేతను, దిటంబులు = దృఢములు, ఔలకుముకుల్ = అగుటిట్టిభములు, కమలాకరలక్ష్మి = సరోలక్ష్మి, ( కమలాకరము = తామరల కునికిపట్టు, కొలను ) తామరపువ్వులందు లక్ష్మి యుండు నని ప్రసిద్ధి. అంబరరమతోడన్ = ఆకాశలక్ష్మితోన్, ఆడుజిగిబంగరుబంతు లనంగన్ = ఆడెడునవియుఁ గాంతిగలవియు నగు బంగారుబంతులో యనునట్లు, రాజిలెన్ = ప్రకాశించెను. ఆకాశమునం గనిపెట్టుకొనియుండి తరంగములమీఁదిచేఁపల కుఱుకుచు నరగ లేచుచున్నలకుముకు లనుపక్షులు సరసునందలిలక్ష్మిదేవి యాకాశశోభ యనెడుస్త్రీతో నాడుబంగారుబంతులవలెఁ బ్రకాశించు చుండె నని యర్థము. బంతి తాడితమై నేలం

బడి శిఖరిముంగనే పైకి లేచుచుండును. ఈపక్షులు చేపలకై జలంబునందుండి యెత్తరము గ లేచుచుండును గావున వానిలోఁ దాదాత్మ్యము వర్ణింపఁబడెను. లోకమున నం తులు ప్రసిద్ధము లైనను నిట్టి వప్రసిద్ధములు గావున నుత్ప్రేక్షాలంకారము.

సీ॥ పుంశ్చలివలె ఫేన • పుంగాంగు సంగోరు
దిగిచి జక్కవగుబ్బ • సొగసుఁ జూపి
సురతవిహ్వలవోలె • దరనిమీలితనీల
కుముదలోచనముల • కొమరు దాల్చి
చూలింతపోల్కె వి • స్ఫురితకూర్మోదర
ప్రకటశైవలరోమ • రాజి నెఱపి
బాలెంతలీల మ్రా • నాలషోలమరాళ
బాల కశేరవంపు • జోల వాడి
లలిని విలసిల్లునవసరో • లక్ష్మితోడఁ
జెలిమికై కొనక్కయిడి రస • నలరుబోండ్లు
భూషణాంబరములు తటిం • బోవు వెట్టి
వలిపములు గట్టి నీరాడ • వచ్చి రపుడు॥ 77

పుంశ్చలివలెన్ = జారిణివలెన్, ఫేనపుంగాంగు = నురు వనెడుపైఁటకొంగును, సంగోరు = సగముభాగము, దిగిచి = తొలఁగించి, జక్కవగుబ్బసొగసు = జక్కవ లనియెడుకుచములచక్కఁదనమును, చూపి = కనుపఱిచి, ఫేనముం బోలినపైఁట యనియును జక్రవాకములం బోలినకుచములచక్కందన మనియును జారిణీపర మైనయర్థము. సురతవిహ్వలవోలెన్, సురత = సంభోగముచేత, విహ్వలవోలెన్ = పరవశురా లైనస్త్రీవలెను, దర.....కొమరు, దర = కొంచెము, నిమీలిత = మూయఁబడిన, నీలకుముద = నల్లగలువ లనెడు, లోచనములకొమరు = నేత్రములయందమును, దాల్చి = ధరించి, (నేత్రనిమీలనము రతివిహ్వలాధర్మము) చూలింతపోల్కెన్ = గర్భిణివలె, విస్ఫురిత......రాజి, విస్ఫురిత = ప్రకాశించిన, వెల్లడి యైన యని యర్థము. కూర్మ = తాఁబేళ్లను, ఉదర = గర్భమందు, ప్రకట = స్ఫుట మైన, శైవల = నాఁచుఁదీవ లను, రోమరాజి = నూగారును, నెఱపి = ప్రకటించి, నూగారుప్రకట మగుట గర్భిణీధర్మము. బా

రెంతలీలన్ = ప్రసరించిన స్త్రీయొక్క విలాసముచేతను, స్త్రీవలె నని యర్థము. మృణాళడోలన్ = తామరతూండ్లను ఉయ్యెలయందున్, మరాళబాలకున్ = అంచపిల్లకున్, అళిరవంపుజోల = తుమ్మెదరవ మను నిద్రపుచ్చుపాటను, పాడి ఉయ్యెలలందు శిశువుల నుంచి జోలలు పాడుట బాలెంతలధర్మము. లలిని = సొగసుతోన్, విలసిల్లుసరోలక్ష్మితోడన్ = ప్రకాశించుసరశ్శోభయను లక్ష్మితోన్, చెలిమికై = స్నేహముకొఱకు, కాన్కయిడి రేన్ = కానుక నిచ్చిరో యనునట్లు, అలరుఁబోండ్లు = భద్ర మొదలగు స్త్రీలు, ( అలరు + మేను = అలరుఁబోఁడి బహువ్రీహి స్త్రీవాచ్యంబగుచో నుపమానంబుమీఁదిమేనునకుఁ బోఁడి యగు బా. సమా. భూషణాంబరములు = ఆభరణములు, వస్త్రములను, తటిన్ = ఒడ్డునందున్, పోవు పెట్టి = ఊడ్చి పెట్టి, వలిపములు = సన్ననివస్త్రములు, కట్టి = ధరించి, అపుడు = ఆకాలమున, నీరాడన్ = స్నానము చేయుటకు, వచ్చిరి = ఏతెంచిరి

మ॥ లలనామండలి చెట్టవట్టుకొని కే ♦ ళాకూళిలో డిగ్గి గు
బ్బలబంటిం దగుతోయ మొండొరులపై ♦ బంగారుపుంగొమ్ములం
గలయం జిమ్ముచుఁ దేఁటు లబ్జముల రేఁ ♦ గం జల్లు పోరాడి రం
దెలమిం గూడుచు జల్లులాడుకరిణీ ♦ బృందంబుచందంబునన్॥ 78

లలనామండలి = స్త్రీలసమూహము, చెట్ట = (ఒండొరుల) హస్తమును, పట్టుకొని = అవలంబించి, కేళాకూళిలోన్ = క్రీడార్థమైనసరస్సునందున్, డిగ్గి = ప్రవేశించి, అంతన్ = ఆకొలనియందున్, గుబ్బలబంటిన్ = కుచములలోఁతునన్, ఱొమ్ములోఁతున నని యర్థము దఘ్నార్థంబునం బంటిశబ్దం బగు బా. తద్ధి. తగుతోయము = ప్రకాశించుజలమును, బంగారుపుంగొమ్ములన్ = బంగారముతోఁ జేసినచిమ్మనగ్రోవులతోన్, పెండ్లిండ్లయందుఁ బసపునీరును వసంతకాలమున నీటి నొకరిమీఁద నొకరు పరిహాసార్థము చల్లుకొనుకొట్టము చిమ్మనగ్రోవి. ఒండొరులపైన్ = ఒకరొకరిమీఁదను, కలయం జిమ్ముచున్ = ఒడలు తడియునట్లు చల్లికొనుచున్, తేఁటులు = తుమ్మెదలు, అబ్జములన్ = పద్మములనుండి, రేఁగన్ = ఎగయునట్లు, ఎలమిన్ = ప్రీతితోన్, కూడుచున్ = కలియుచున్. జల్లులాడుకరిణీబృందంబుచందంబునన్ = నీరు చల్లుకొనువాఁడేనుఁగులసముదాయముయొక్క విధముచేతను, జల్లుపోరాడిరి = ఒండొరులమీఁద నీరు చల్లికొని వేడుకయాట లాడిరి. దీనికిం గర్త్యైనమండలి యనునది యేకవచనము సమూహార్థకము నైనను సమూహమునందున్న వారికి భేదములేమిచే బహువచనము మహతీవాచకము సగ్రహణ ప్రయోగింపఁబడెను.

క॥ క్రొందరగలఁ దేలుచుఁ దమ
ముందరఁ గలవిమలకమల • ములఁ జేకొని చె
న్నందిరి కొందఱు సుందరు
లం దరవిందగృహ బహుత • నగపడియె ననఁగ॥ 79

కొందఱుసుందరులు=(ఆకొలనిలో దిగినవారిలోఁ) కొంద ఱందఱు స్త్రీలు, క్రొందరగలన్=క్రొత్తయలలయందున్, తేలుచున్=ఈఁదుచున్, తమముందరన్=వారియెదుటను, కలవిమలకమలములన్=ఉన్న మంచితామరపువ్వులను, చేకొని=చేతితోఁ బట్టుకొని, అందున్=ఆసరసునందున్, అరవిందగృహ=లక్ష్మి (తామరపువ్వే యిల్లుగాఁ గలది.) బహుతన్=బహుత్వముచేతను (అనేకరూపములతో నని యర్థము.) అగపడియె ననన్=ప్రత్యక్షమయ్యెనా యనునట్లు, చెన్నందిరి=ప్రకాశించిరి.

చ॥ పొలఁతి యొకర్తు చెంగలువ • పుప్పొడి గప్పిననీరు దోయిటం
జిలికినచోఁ దదంబుపరి • షిక్తపిశంగనిజాంగ కాంశుకం
బులరుచితోడ మించె నొక • ముద్దియ నాలవనాఁటినీటునన్
నెలకొనుమేనిక్రొంబసపు • నిగ్గులతోఁ బసపాడెనో యనన్॥ 80

ఒకర్తుపొలఁతి = ఒకానొకయింతి, చెంగలువపుప్పొడి=ఎఱ్ఱకలువపూలపరాగము, కప్పిననీరు=క్రమ్మిననీటిని (పుప్పొడిచేఁ గప్పఁబడిననీటి నని యర్థము.) దోయిటన్=దోసిలితోన్, చిలికినచోన్=చల్లఁగాన్, ఒకముద్దియ=మఱియొక్కయింతి, తదంబు......తోడన్, తదంబు=ఆనీటిచేతను, పరిషిక్త=తడుపఁబడినది గనుక నే, పిశంగ=పచ్చని, నిజాంగక=తనయవయవములయొక్కయు, అంశుకంబుల=వస్త్రములయొక్కయు, రుచితోడన్=కాంతితోన్, నాలవనాఁటినీటునన్ = రజస్వలయైనవాల్గవనాఁటిసొగసుతోన్, నెలకొనుమేనిక్రొంబసపునిగ్గులతోన్=నిల్కడ గల దేహమందలిక్రొత్తది యగుపసపుకాంతితోన్, పసపాడెనో యనన్=స్నానముచేసెనో యనునట్లు, మించెన్=ప్రకాశించెను. ఒకస్త్రీ కలువపూవులపరాగముతోఁ గూడిననీటిని మఱియొకతెపైఁ జల్లఁగా నామెపచ్చనిపరాగముతోఁ గూడిననీటిచేఁ దడిసి రజస్వలయైనవాలవనాఁడు పసపు పూసికొని స్నానముచేసినదివలెఁ బ్రకాశించెనని తాత్పర్యము.

చ॥ ఒలసిన కెంపుఁదామరల ♦ యోలములో లలి వోల యోల యో
లలన! యటంచు నొక్కనవ ♦ లా సవిలాసజలావగాహన
చ్ఛలన జలంబులో నసె వె ♦ సం జని యంత సరోంతరంబునన్
వెలలె జలాధిదేవత వి ♦ నిర్మలతం బొడచూపెనో యనన్॥ 81

ఒక్కనవలా = ఒకానొకయింతి (ఇది దేశ్యపదము గాన దీర్ఘమునకు హ్రస్వము రాదు.) ఒలసిన......యోలములోన్, ఒలసిన = చుట్టియున్న, కెంపుఁదామరల = ఎఱ్ఱదామరలయొక్క, యోలములోన్ = మఱుఁగైనచోటను, ఎఱ్ఱదామరలచే మఱుఁగైనచోట నని యర్థము. ఓలలన = ఓవేడుకగలయింతీ! ఓలయోల = (ఇది జలక్రీడలాడుకొనునపు డనుకొనుశబ్దము.) అటంచున్, లలిన్ = ప్రేమతోన్, సవిలాస......చ్ఛలనన్, సవిలాస = సింగారముతోఁ గూడునట్లు, జల = నీటియందు, అవగాహన = మునుఁగుట యనెడు, ఛలనన్ = మిషచేతను. జలంబులోనసె = నీటియందే, వెసన్ = త్వరతోన్, చని = పోయి, అంతన్ = పిమ్మట, జలాధిదేవత, వినిర్మలతన్ = (నీరు) నిర్మలముగా నుండుటచేతను, పొడచూపెనో యనన్ = సాక్షాత్కరించెనో యనునట్లు, సరోంతరంబునన్ = కొలఁకునడుమునందున్, (కొలఁకునడుమునుండి యని యర్థము.) వెలలెన్ = వెలుపలికి వచ్చెను. ఒకానొక స్త్రీ మఱియొకతెం జూచి యోల యోల యని చెప్పుచున్ నీట మునిఁగి సాక్షాత్కరించినజలాభిమానదేవతవలె కొలఁకునడుమునుండి వెడలివచ్చె నని తాత్పర్యము ఇందు నాలవచరణమున నున్న వెలలు ననునది వెడలుయొక్కరూపాంతరము

సీ॥ ఆననంబులుగా న ♦ వాంభోరుహములు న
వాంభోరుహములుగా ♦ నాననములు
లోచనంబులుగా వి ♦ లోలమీనములు వి
లోలమీనములుగా ♦ లోచనములు
మదసిజంబులుగాఁ బ ♦ యోజకోశములు ప
యోజకోశములుగా ♦ మదసిజములు
కచనిచయములుగా ♦ ఘనశైవలంబులు
ఘనశైవలములుగాఁ ♦ గచచయములు

దోర్లతలుగా మృణాళపం ♦ క్తులు మృణాళ
పంక్తులుగ దోర్లత లభేద ♦ భావమంద
మందయానలు గొలన న ♦ మందలీల
నోలలాడిరి ఖేలనా ♦ లోల లగుచు॥ 82

మందయానలు=స్త్రీలు, (మెల్లనినడక గలవారు) ఖేలనాలోలలు=ఆటలం దాసక్తి గలవారు, అగుచున్, నవాంభోరుహములు=క్రొత్తగ వికసించినపద్మములు, ఆననములుగాన్=ముఖము లగునట్లును, ఆననములు=ముఖములు, నవాంభోరుహము లు=క్రొత్తగ వికసించినపద్మములు, కాన్=అగునట్లును, క్రొత్తగ వికసించినతామర లు మోము లనియును మోములు క్రొత్తదామర లనియునుం దోంచునట్లుగా నని యర్థము విలోలమీనములు=చలించుచున్న చేఁపలు, లోచనంబులు గాన్=కన్ను లగునట్లును, లోచనములు=కన్నులు, విలోలమీనంబులు గాన్=చలించుచేఁప లగున ట్లును, పయోజకోశములు=తామరమొగ్గలు ఉరసిజంబులు=కుచములు, కాన్, ఉరసిజములు=కుచములు, పయోజకోశములు గాన్=తామరమొగ్గ లగునట్లును, ఘన శైవలంబులు=పెద్దనాచుదీవలు, కచనిచయములు గాన్=కేశపాశము లగునట్లును, కచచయములు=కేశపాశములు, ఘనశైవలములు గాన్=పెద్దనాచుదీవ లగునట్లును, మృణాళపంక్తులు=తామరతూండ్లు, దోర్లతలుగాన్=బాహువులు గాను, దోర్లతలు=బాహువులు, మృణాలపంక్తులు గాన్=తామరతూండ్లు గాను, అభేదభావము=అభేదస్థితిని, అందన్=పొందఁగాన్, పద్మములు చేఁపలు మొదలగుసరసునందలివస్తువులకును, అందుఁ గ్రీడించుచున్న స్త్రీలముఖము కన్నులు మొదలగునవయవములకును, భేదము తెలియ కుండఁగా నని భావము కొలనన్=సరసునందున్, అమందలీలన్=అధికమైన విలాసముతో, ఓలలాడిరి=జలక్రీడ చెసిరి ఇందుఁ బద్మాకరముచఁ బ్రవేశించిన స్త్రీల యవయవములకును బద్మాదులకును సామ్యముచే భేదము తిరోహిత మయ్యెంగాన మీలితాలంకారము.

గీ॥ తేఁటిగమిఁ దోలి తమ్మిపూఁ ♦ దేనెఁ గ్రోలి
సలిలముల వ్రాలి వీచికా ♦ వళులఁ దేలి
చెలి చెలులఁగూడి వెలువడెఁ ♦ గొలన నాడి
యచ్చరలతోడ నమృతాబ్ధి ♦ నబ్జవ్రాలె॥ 83

చెలి=సఖి, తేటిగమిన్=తుమ్మెదలగుంపును, తోలి=ఎగురఁగొట్టి, తమ్మి పూఁదేనెన్=మకరందరసమును, గ్రోలి=త్రావి, సలిలములన్=నీటియందున్, గ్రాలి=దిగి, వీచికావళులన్=తరంగపంక్తులమీఁదను, తేలి=ఈఁది, కొలన్=తటాకమునందున్, ఆడి, అప్సరలతోడన్=రంభాదులతోన్, అమృతాబ్ధిన్=క్షీరసముద్రమునుండి, అబ్జవాలెన్=లక్ష్మివలెనే, చెలులన్=చెలికత్తెలను, కూడి=కలిసికొని, వెలువడెన్=వెలికి వచ్చెను

చ॥ కొలనితటంబుఁ జేరి యనుఁ ♦ గుంజెలు లింతికి నంత కుంతలం
బులతడి యొత్తి క్రొంబసిడి ♦ పుట్టముఁ గట్టి మృగీమదంబునన్
దిలకము దిద్ది కజ్జలము ♦ దీరిచి మైఁ గలపం బలంది సొ
మ్ములు ఘటియించి తారును స ♦ ముజ్జ్వలభూషణభూషితాంగులై॥

అనుఁగుంజెలులు=ఆప్తనెయ్యురాండ్రు, అంతన్=పిమ్మటను, కొలనితటంబున్=సరసునొడ్డును, చేరి=ప్రవేశించి, ఇంతికిన్=భద్రకున్, కుంతలంబులతడి=కురులతడిని, ఒత్తి=ఆర్చి, క్రొంబసిడిపుట్టమున్=క్రొత్తదియుం బంగారుసరిగగలదియు నగువస్త్రమును, కట్టి, మృగమదంబునన్=కస్తూరిచేతను, తిలకము=బొట్టును, దిద్ది=సవరించి, కజ్జలము=కాటుకను, తీరిచి=(కన్నులను) చక్కఁబఱచి, మైన్=దేహమునందున్, కలపము=గంధమును, అలంది=పూసి, సొమ్ములు=నగలను, ఘటియించి=కూర్చి, తారును=చెలులునుసయితము, సముజ్జ్వలభూషణభూషితాంగులై=మిలమిల్లుమన్నభూషణములచే నలంకరింపఁబడినశరీరములు గలవారై ముందుపద్యముతో నన్వయము.

క॥ చిత్రపటంబున మరునివి
చిత్రాకృతి వ్రాసి పూజఁ ♦ జేసి వినతులై
స్తోత్రము లొనర్చి పంకజ
పత్రాక్షులు కేళిసౌధ ♦ భాగము సేరన్॥ 85

పంకజపత్రాక్షులు=(మీఁదటి) చెలులు (తామరరేకులం బోలినకన్నులు గలవారు) చిత్రపటంబునన్=చిత్తరువుపటమునన్, మరునివిచిత్రాకృతిన్=మన్మథునివింతయైనయాకారమును, వ్రాసి=లిఖించి, పూజఁజేసి, వినతులై=నమస్కరించినవారై,

స్తోత్రము లొనర్చి=స్తుతించి, కేళిసౌధభాగము=క్రీడార్థమైన మేడను, చొరన్=ప్రవేశింపఁగాన్, ముందు పద్యముతో నన్వయము

గీ॥ ఇట వసంతోత్సవం బయ్యె ♦ నెల్లి యగు స్వ
యంవరశుభంబు పురమున ♦ నరుగవలయు
నిపుడు మన మని రాజున ♦ కెఱుకపఱిచె
మంతనంబున శ్రుతకీర్తి ♦ మంజువాణి॥ 86

మంజువాణి=మృదుభాషణములు గల, శ్రుతకీర్తి=రాజుభార్య, ఇటన్=ఈయుద్యానమునందున్, వసంతోత్సవంబు=వసంతకాలమున నుద్యానమునం జేయు పండుగ, అయ్యెన్=జరిగెను ఎల్లి=రేపు స్వయంవరశుభంబు=స్వయంవరవివాహ మనెడుశుభకార్యము (సమీభవించిన రాజపుత్త్రులలోఁ గన్య తనకుం దగినవాని వరునిఁ గోరికొని చేసికొను వివాహము స్వయంవరము దీనినే గాంధర్వ మని యందురు) అగున్, ఇపుడు=ఈకాలమునన్, మనము, పురమునకున్=పట్టణమునకున్, అరుగవలయున్=పోవలయును అని=ఇట్లు, రాజునకున్, మంతనంబునన్=ఏకాంతమునన్, ఎఱుకపఱిచెన్=తెలియఁజేసెను

మ॥ జననాథాగ్రణి కేళికావనమున ♦ సౌధంబునన్ శౌరిఁ ద
జ్జనముల్ నిల్పి నిజాప్తవర్గము గజా ♦ శ్వస్యందనారూఢమై
తనుఁ గొల్వం బరిచారికాశతవృతాం ♦ తఃపౌరికారత్నకాం
చనకర్ణీరథపంక్తితో నిజనివా ♦ సంబుం బ్రవేశించినన్॥ 87

జననాథాగ్రణి=రాజశ్రేష్ఠుఁడైన, కేకయప్రభువు, కేళికా.... సౌధంబునన్=పూలతోఁటయందలి మాణిక్యపుమేడయందున్, శౌరిన్=కృష్ణుని, తజ్జనముల్=ఆతనిపరివారమును, నిల్పి=ఉంచి, నిజాప్తవర్గము=తనవారగు సేవకులసముదాయము, గజాశ్వ.. రూఢమై, గజ=ఏనుఁగులను, అశ్వ=గుఱ్ఱములను, స్యందన=రథములను, ఆరూఢమై=ఎక్కినది యై, తనున్ కొల్వన్=తన్ను సేవించుచుండఁగాన్, పరిచారికా.....తోన్, పరిచారికా=సేవకురాండ్రయొక్క, శత=సమూహముచేతను, వృతా=చుట్టుకొనఁబడిన, అంతఃపౌరిక=అంతిపురమున నుండుస్త్రీలయొక్క, రత్న=మణులయొక్కయు, కాంచన=బంగారుయొక్కయు, (రత్నములతోడను

బంగారముతోఁ జేయఁబడిన దని యర్థము.) కర్ణిరథ = విహారార్థ మైనబండ్లయొక్క, (ఇప్పటిగుఱ్ఱపుబండ్లం బోలిన వని యర్థము) పంక్తితోన్ = సమూహముతోన్ నిజావాసంబున్ = తననివాసస్థానమును, ప్రవేశించినన్ = ప్రవేశింపఁగాన్, ముందుప ద్యముతో నన్వయము.

క॥ చరమమహీధరశిఖరాం
తరసరణిం దరణి జరుగఁ ♦ దద్గైరికసాం
ద్రరజశ్ఛన్నత గనె నన
స్ఫురితజపాశోణకిరణ ♦ శోభితుఁ డయ్యెన్॥ 88

తరణి = సూర్యుఁడు, చరమ.... ..సరణిన్, చరమ = పడమటిదిక్కునను న్న, మహీధర = పర్వతముయొక్క (అస్తాచలముయొక్క యని యర్థము.) శిఖరాంతరసర ణిన్ = శిఖరములనడిమిమార్గమునందున్, జరుగన్ = పోవుచుండఁగాన్, తద్గైరిక...... ఛన్నతన్, తత్ = ఆపర్వతసంబంధ మైన, గైరిక = సిందూరాదిద్రవ్యములయొక్క, సాంద్ర = దళ మైన, రజః = పరాగముయొక్క, ఛన్నతన్ = కప్పును, కనెననన్ = క నెనో యన్నట్లు, ఆకొండయందలిసిందూరాదిద్రవ్యములధూళిచేఁ గప్పఁబడెనో యనిన ట్లని యర్థము. స్ఫురిత......శోభితుఁడు, స్ఫురిత = ప్రకాశించెడు, జపా = మంకెన పువ్వువలెన్, శోణ = ఎఱ్ఱని, కిరణ = కాంతులచేతను, శోభితుఁడు = అలంకరింపఁబడిన వాఁడు అయ్యెన్, సూర్యాస్తమయము గావచ్చెం గాఁ గాంతి యంతయుఁ దగ్గుట చే బింబము మిగుల సౌమ్యముగాను సిందూరవర్ణము గలదిగాను నుండె నని తాత్పర్య ము. ఉత్ప్రేక్షాలంకారము

మ॥ తరుసంఘంబుల కెల్లఁ బల్లవితచూ ♦ తత్వంబు గల్పించి భూ
ధరశృంగంబుల కెల్ల మేరుశిఖర ♦ త్వంబుం బ్రసాదించి భా
స్వరసౌధాగ్రనవేందుకాంతములకున్ ♦ సౌగంధికచ్ఛాయలన్
విరచించెన్ జరతారుణాతపము ల ♦ వ్వేళం గకుప్పంక్తులన్॥ 89

జరతారుణాతపములు = ముదిసినసూర్యకాంతులు (నీరెండ లని యర్థము) అవ్వే ళన్ = ఆకాలమందు, కకుప్పంక్తులన్ = దిక్కులందున్, తరుసంఘంబుల కెల్లన్ = చెట్టు లన్నింటికిని, పల్లవితచూతత్వంబు = చిగిరించినమామిడిచెట్లయొక్కభావమును, కల్పిం

చి = కలిగించి, (పొద్దు గ్రుంకుచున్నపుడు కెంజాయలు పర్వుటచే నెట్లన్నియుఁ జిగిరించినమామిడిచెట్లవలె నెఱ్ఱనివిగ నుండె నని యాశయము ముందువాక్యములందు నిట్లే భావము గ్రహింపవలయును.) భూధరశృంగంబుల కెల్లన్ = అన్నికొండకొమ్ములకును, మేరుశిఖరిత్వంబున్ = బంగారుకొండయొక్క శిఖరభావమును, ప్రసాదించి = అనుగ్రహించి (కలిగించి యని యర్థము.) భాస్వర.....కాంతములకున్, భాస్వర = ప్రకాశించెడు, సౌధ = మేడలయొక్క, అగ్ర = చివరనున్న, నవ = నూతనమైన, ఇందుకాంతములకున్ = చంద్రకాంతపురాల (గుబ్బల) కున్, సౌగంధికచ్ఛాయలన్ = ఎఱ్ఱకలువపూవులకాంతిని, విరచించెన్ = సృజించెను. సూర్యాస్తమయకాలమునందలి యెండ పర్వుటచే నెత్తైనస్థలములం దున్నవస్తువు లన్నియు నెఱ్ఱనివై యుండె నని తాత్పర్యము.

క॥ ఖరకరుఁ డరిగెను వెండని
స్ఫురదుదయాచలము వెనుకఁ ♦ జొచ్చినయిరులన్
ద్వరఁ బిలువఁ జనుతెదాపుల
కరణి నరిగె నీడలు దొలు ♦ గడకు నిడుపలై॥ 90

నీడలు = చాయలు, ఖరకరుఁడు = సూర్యుఁడు (తీక్ష్ణమైనకాంతి గలవాఁడు) అరిగెను = పోయెను వెండియు, అని, స్ఫురదుదయాచలము వెనుకన్ = ప్రకాశించుచుండు పూర్వకొండకు వెనుకటిభాగమునందున్, చొచ్చినయిరులన్ = ఉండినచీఁకట్లను, త్వరన్ = శీఘ్రముగాన్, పిలువన్ = పిలుచుటకున్, చనుతదాప్తులకరణిన్ = వెళ్లెడునాచీఁకట్ల మిత్రములవిధముచేత, మిత్రములువలె నని యర్థము నిడుపలై = మిగులదీర్ఘములై, తొలుఁగడకున్ = తూర్పుదిక్కునకున్, అరిగెన్ = పోయెను మీఁకు హానిచేయుసూర్యుఁడు పోయెను నిర్భయముగ రావచ్చు నని చీఁకటులను బిలుచుటకై పోయెడువారిమిత్రములువలె నీడలు మిగులంబొడవులై తూర్పునకుఁ బోవుచుండె నని తాత్పర్యము ఉత్ప్రేక్షాలంకారము

క॥ బారులు దీరుచు గూఁడులఁ
జేరెఁ బతంగములు భాను ♦ శిలలకు దాపం
బారెను మృగతృష్ణావా
ర్ధారల జడి దీఱె మింట ♦ రక్తిమ మీఱెన్॥ 91

పతంగములు=పక్షులు, బారులు దీరుచున్=వరుసలు గట్టుచున్, గూండులన్, చేరన్=ప్రవేశించెను. భానుశిలలన్=సూర్యకాంతపురాలలన్, తాపంబు=వేఁడి ఆరెన్=తగ్గెను, మృగతృష్ణావార్ధారలజడి=ఎండమావులనీటిప్రవాహములవలనిబాధ, తీరెన్=నశించెను. ( ఎడారులయందు వ్యాపించినసూర్యునియొక్క కాంతులు కిరణజ్ఞానములేనిమృగములకు జలము లన భ్రాంతి గల్పించును ; గాన నవి మృగతృష్ణ లనంబడు. ) మింటన్=ఆకసమునన్, రక్తిమ=సంధ్యారాగము, మీరెన్=అతిశయించెను. ఇందు శకటరేఫమునకు రేఫమునకుఁ బ్రాసమున మైత్రి.

మ॥ వరసన్మార్గగతుం డినుండు త్రిజగ ♦ ద్వంద్యుం డనం బొల్చి దు
స్తర మౌ దైవనియుక్తిఁ బంకజరజ ♦ స్సంపర్కుఁ డై సాంద్రశీ
ధురసం బానినపద్మినిం గలసి త ♦ ద్దోషంబు వాయన్ మహా
పరపాథోనిధిలోనఁ దా మునిఁగె నా ♦ భానుండు గ్రుంకెన్ వెసన్॥

వర......గతుండు, వర=శ్రేష్ఠమైన, సన్మార్గ=నక్షత్రముల త్రోవను ( ఆకాశమును ) గతుండు=పొందినవాఁడు, మంచిత్రోవం బోవువాఁ ( మంచినడవడిగలవాఁ ) డని యర్థాంతరము. ఇనుండు=సూర్యుఁడు, ప్రభు వని యర్థాంతరము. ( ని ) ఇనస్సూర్యే ప్రభౌ అ. త్రిజగద్వంద్యుండు=ముల్లోకముల (నున్న వారికి) నమస్కరింపఁ దగినవాఁడు. ( రెంటికి సమానము ) అనన్=అనునట్లు, పొల్చి=ప్రకాశించి, ప్రసిద్ధి చెంది యనియర్థము. దుస్తరము=దాఁట శక్యము గానిది, ఔ దైవనియుక్తిన్=అగునదృష్టముయొక్క యేర్పాటుచేతను, పంకజరజస్సంపర్కుఁడై, పంకజ=పద్మములయొక్క, రజః=పుప్పొడియొక్క, సంపర్కుఁడై=సంబంధము గలదియై, పంక=పాపమువలన, జ=పుట్టిన, రజః=రజస్సుయొక్క ( స్త్రీలబుతువు రజస్సనంబడు. ) సంపర్కుఁడై=సంబంధము గలదియై యని యర్థాంతరము. పూర్వ మింద్రుండు వృత్రాసురుని జంపినప్పుడు పొందినపాపములో నొక్కభాగము స్త్రీలలో సంక్రమించుటచే రజస్సు గలిగె నని భాగవతము. సాంద్రశీధురసంబు=దలమైనమరందరసమును, ఆనినపద్మినిన్=ధరించినపద్మలతను, దలమైనమద్యరసమును త్రావినపద్మినీజాతిస్త్రీ నని యర్థాంతరము. కలసి=కూడి, తద్దోషంబు=పుప్పొడితోఁ గూడినపద్మలతాసంపర్కమువలనిమాలిన్యము, వాయన్=పోవుటకున్, ఆరజస్వలాస్త్రీసంబంధమువలనిదోషము పోవుట కని యర్థాంతరము. మహా.....లోన్, మహత్=గొప్పది యగు, అపరపాథోనిధిలోనన్=పడమటిసముద్రమునందున్, తాన్=తాను, మునిఁగనాన్=

మునింగనో యనునట్లు, భానుండు=సూర్యుఁడు, వేసఁకా=శీఘ్రముగాఁకా, గ్రుంకెఁకా=అస్తమించెను. సూర్యుఁడు కాలమునఁ నే యస్తమించుచుండఁగా నందు శ్లేషచేఁ గలిగిన రెం డర్థములకు నభేదము చేసి దానం బుట్టినదోషము నివర్తించుటకై స్నానము చేయుటకు దిగిన ట్లుత్ప్రేక్షించుటచె శ్లేషమూలకమైన యతిశయోక్తి వలన ననుప్రాశిత మైన యుత్ప్రేక్షాలంకారము.

సీ॥ చరమదిక్చండికా ♦ ర్చాకాలశాక్తేయ
రచితకుంకుమపుంజో ♦ రాశి యనఁగ
సింధునాథసగంధ ♦ సింధురోపరిపరి
ష్కృతరక్తరాంకవ ♦ శ్రీ యనంగఁ
బశ్చిమాంభోనిధి ♦ ప్రాంతసైకతసము
ద్భూతవిద్రుమలతా ♦ జాల మనఁగ
స్ఫుటనటత్పటుమహా ♦ నటశిరస్తటఫణి
శ్వరఫణామణిగణ ♦ చ్ఛాయ యనఁగఁ
గాల మసిమెఱుంబాలగో ♦ పాలకుంపు
జలధియమునాతటస్థాస్తశైలపులిన
మునఁ బ్రబలియున్నమి న్నను ♦ పొన్నగున్న
పైని డాఁచినపసిఁడికెం ♦ బట్టుచీర
చాలొకో యన సంజకెం ♦ జాయ మెఱసె॥ 93

చరమ......రాశి, చరమదిక్=పశ్చిమదిక్కనెడు, చండికా=పార్వతియొక్క (చండుఁ డనురక్కసునిం జంపినది) అర్చా=పూజార్థమై, కాలశాక్తేయ=కాలపురుషుఁ డనుశక్తిపూజచేయువానిచేతను, రచిత=సంపాదింపఁబడిన, కుంకుమపుంజో రాశి=కుంకుమధూళియొక్కప్రోవు, అనఁగఁకా=అనునట్లును, సింధునాథ......శ్రీయనంగఁకా, సింధునాథ=వరుణునియొక్క, సగంధ=మదముతోఁ గూడిన, సింధుర=ఏనుఁగుయొక్క, ఉపరి=మీఁదను, పరిష్కృత=అలంకరింపఁబడిన, రక్తరాంకవ=ఎఱ్ఱనికంబళముయొక్క, శ్రీయనంగఁకా = కాంతియో యనునట్లును, పశ్చిమాంభోనిధి......జాలమనఁగన్, పశ్చిమాంభోనిధి=పడమటిసముద్రముయొక్క, ప్రాంత=సమీపమునను

న్న, సైకత = ఇసుకతిన్నెయందుఁ గల, సముద్భూత = మొలచిన, విద్రుమలతా = పవడపుఁదీవలయొక్క, జాత మనఁగన్ = సముదాయమో యనునట్లును, స్ఫుట...చ్ఛాయయనఁగన్, స్ఫుట = స్పష్టముగా, నటత్ = నాట్యముచేయుచున్న, పటు = నేర్పరియగు, మహానట = శివునియొక్క, శిరస్తట = శిరసునందలి, ఫణీశ్వర = శేషునియొక్క, ఫణా = పడగలయందలి, మణిగణ = మణులసముదయముయొక్క, చాయయనఁగన్ = చాయయో యనునట్లును, కాలమనియెడుబాలగోపాలకుండు = కాల మనియెడుబాలకృష్ణమూర్తి, జలధి.....పులినమునన్, జలధి = సముద్ర మనియెడు, యమునాతటస్థ = యమునానదియొడ్డున నున్న, అస్తశైల = క్రుంకుమెట్టనెడు, పులినమునన్ = ఇసుకతిన్నెయందున్, పరిబలియున్నమిన్ననుపొన్నగున్నపైని = వ్యాపించియున్న యాకసమనుపొన్నచెట్టునందున్, డాఁచిన.. .. చాలోకోయనఁగన్, డాఁచిన = దాఁపరికము చేసిన, పసిఁడి = బంగారువన్నె గల, కెంబట్టుచీరచాలో కో యనఁగన్ = ఎఱ్ఱనిపట్టు (తో చేసిన) కోకలవరుసయో యనునట్లు, సంజకెంజాయ = సంధ్యాకాలమందలియెఱ్ఱనిచాయ, మెఱసెన్ = ప్రకాశించెను

క॥ అనుఁగుజవరాలికవుఁగిటి
నెనయక సుఖ ముడిగి చింత ♦ నేగె రవి సనం
గని యొకజక్కవ యకటా!
యినహీనత నున్నచక్రి మెట్లు ♦ సుఖించున్॥ 94

రవి = సూర్యుఁడు, చనన్ = అస్తమింపఁగాన్, ఒకజక్కవ = ఒకచక్రవాకము, కని = చూచి, అనుఁగుజవరాలికవుఁగిటిన్ = ప్రియురాలైనజవ్వనియొక్క భుజమధ్యమును, ఎనయక = పొందక, సుఖ ముడిగి = సుఖమును వదలి, చింతన్ = విచారముతోన్, ఏగెన్ = పోయెను, అకటా = అయ్యో! సంతాపార్థకమైనయవ్యయము ఇనహీనతన్ = సూర్యునిలేమితోన్, ఉన్న చక్రము = ఉన్న చక్రవాకము, ఎట్లు సుఖించున్ = ఎట్లు సుఖపడును. సుఖపడ దని యర్థము రాజులేమితో నున్నదెశ మెట్లు సుఖించు ననియు ధ్వనించును. (ని) చక్రీః కోకే వజ్రే పుంసి క్లీబం సైన్యరథాంగయోః గ్రామజాలే కుంభకారే ఖాండే చావర్తరాష్ట్రయో యని ప్రతాపుఁడు చెప్పె నని యమర వ్యాఖ్యానము

చ॥ ఇనుఁ డపరాశఁ జెందె నిఁక ♦ నేటికి జీవన మంచుఁ బద్మినీ
వనిత విషాదవేదనలఁ ♦ బొల్పడి తుమ్మెదచాలుపేరిటం

జనువిమధారఁ గ్రోల నని ♦ శం బమృతస్థితి గల్గుటన్ మృతిం
బొానరక మూర్ఛఁ గన్నుఁగిన ♦ మోడ్చె ననన్ ముకుళించెఁ బద్మముల్॥

ఇనుఁడు=సూర్యుఁడను పతి, అపరాశన్=పశ్చిమదిక్కును మఱియొక స్త్రీయందలికోర్కెను, చెందెన్=పొందెను (అపర=మఱియొక స్త్రీయందు, ఆశన్=కోర్కెను,) ఇఁకన్=పిమ్మటను, జీవనము=బ్రదుకు, ఏటికించున్=ఎందుకని, పద్మినీవనిత=తామరలత యనెడు స్త్రీ, విషాదవేదనలన్=విషాదమువలనిబాధలను, (తలఁచినకార్యమునకు భంగము ప్రాప్తించునపుడు దాని వారించునుపాయము తోఁపమిచేఁ గల్గునధైర్యము విషాద మనుసంచారిభావము) పొల్పడి=వహించి, తుమ్మెదలచాలు పేరిటన్=తుమ్మెదలవరుస యను పేరితోన్, చనువిషధారన్=ఒప్పెడుగరళప్రవాహమును, గ్రోలన్=త్రావఁగాన్, అనిశంబు=ఎల్లకాలమును, అమృతస్థితిన్=అమృతమం దునికిచేతన, జలమునం దునికిచేత నని భావము మృతిన్=మరణమును, పొసరక=పొందక, మూర్ఛన్=సొమ్మచెతన, కన్నుఁగవ=నేత్రద్వయమును, మోడ్చె ననన్=మూసెనో యనునట్లు, పద్మముల్=తామరలు, ముకుళించెన్=మొగిడెను. మకరందముకొఱకుఁ బద్మములఁ బ్రాలుతుమ్మెదలు సూర్యాస్తమయమునకు ముందుఁ దగుల్కొని పిమ్మటఁ బద్మము ముకుళింపఁగా మఱలఁ సూర్యోదయమునకు నుండుట సహజము. వీనియందే యిట విషత్వ మారోపించి దీనిం బానము చేయుటఁ బద్మినివనిత మరణముఁ బొందవలసి యున్న నెల్లకాలము నమృతమం దుండుట యను హేతువుచె దానిం బొందక మూర్ఛను జెంది కన్నులు మోడ్చె నని కాలముచేతం బ్రాప్తమైనపద్మముకుళనము సంభావించెఁ గాన నుత్ప్రేక్షాలంకారము ఇది పూర్వార్థమునందలిశ్లిష్టరూపకముచె ననుప్రాణితము.

చ॥ తనపతి వచ్చునంచుఁ బ్రమ ♦ దంబున రేజవరాలు నెమ్మొగం
బున మృగనాభికాతిలక ♦ మున్ ఘటియించె ననన్ దమంబు నొ
య్యన బలుకొప్పుమ్రుడిన్ ముడిచి ♦ నట్టివినూతనఫుల్లమల్లికా
ఘనకుసుమస్రగోఘు మనఁ ♦ గానఁగ నయ్యె నుడుప్రతానముల్॥96

రేజవరాలు=రాత్రి యనునువిద, తనపతి=తనభర్తయగుచందురుఁడు, వచ్చునంచున్, ప్రమదంబునన్=మిగులసంతోషముతోన్, నెమ్మొగంబునన్=ముఖమునందున్, మృగనాభికాతిలకమున్=కస్తూరిబొట్టును, ఘటించెనో యనన్=కూర్చెనో

యనునట్లు, తమంబుల = చీఁకటియును, బలుక్రొమ్ముడిక = పెద్దది యగు కేశపాశము నందుక, ముడిచినట్టి.....మనక, ముడిచినట్టి = ధరించినటువంటి, వినూతన = క్రొత్త గాక, పరిఫుల్ల = వికసించిన, మల్లికాకుసుమ = మల్లెపూవులయొక్క, ప్రసగాఘ మనవ్ = దండలసముదాయమో యనునట్లు, ఉడుప్రతానముక = నక్షత్రసముదాయము ను, ఒయ్యన = క్రమముగానే, కానఁగ నయ్యెక = కనుపింపఁ దొడఁగెను.

సీ॥ వైకుంఠశితికంఠ ♦ వరకంఠకలకంఠ
కాలకంఠాభల ♦ మేలమాడి
తత శైలతనయాల ♦ ఘుతమాలహరినీల
కాకోలరుచులఁ జీ ♦ కాకుపఱిచి
ఘనపుంజమృగభంజ ♦ ననవాంజనసుఖంజ
నాళికుంజరలీల ♦ నవఘళించి
యమునాంబరబలాంబ ♦ రమృడాంబరహిడింబ
కాదంబశంబర ♦ కాంతు లెంచి
వేల్పుదొరమేనిచాయతో ♦ వియ్యమంది
కదిసె సదశాభిసారికా ♦ కాముకప్ర
కామదమృగీమదాలేప ♦ కల్ప మగుచుఁ
గటికిచీఁకటిబ్రహ్మాండ ♦ గహ్వరమున॥ 97

కటికిచీఁకటి = గాఢమైనయంధకారము, వైకుంఠ.....కంఠాభలక, వైకుంఠ = విష్ణునియొక్కయు, శితికంఠ = శివునియొక్క, (ని) ఉగ్రః కపర్దీ శ్రీకంఠ శ్శితికంఠః కపాలభృత్. అ వరకంఠ = ప్రశస్తమైనకత్తుకయొక్కయు, కలకంఠ = కోయిలలయొక్కయు, కాలకంఠ = నెమిళ్లయొక్కయు, ఆభలక = కాంతులను, మేలమాడి = పరిహాసించి, వానిం బోలి యని యర్థము. తతశైల.....రుచులక, తత = అధికమైన, (ఇది రుచులకు విశేషణము) శైలతనయా = పార్వతియొక్కయు, అలఘు = గొప్పలైన, తమాల = చీఁకటిమ్రాఁకులయొక్కయు, హరినీల = ఇంద్రనీలపురాళ్లయొక్కయు, కాకోల = బొంతకాకులయొక్కయు, రుచులక = కాంతులను, చీకాకుపఱిచి = శ్రమపఱిచి, ఘనపుంజ.....లీలన్, ఘనపుంజ = మేఘసముదాయముయొక్కయు,

మృగభంజన = కిరాతులయొక్కయు, నవాంజన = క్రొత్తకాటుక రాసులయొక్కయు, ఖుఖంజన = మంచికాటుకపిట్టలయొక్కయు, అళి = తుమ్మెదలయొక్కయు, కుంజర = ఏనుఁగులయొక్కయు, లీలన్ = విలాసమును, అవఘళించి = అతిశయించి, యమునాంబర......కాంతులు, యమునా = యమునానదియొక్కయు, అంబర = ఆకసముయొక్కయు, యమునానదియొక్కజలమును, ఆకాశమును నల్లని వని ప్రతీతి. బలాంబర = బలరామునివస్త్రముయొక్కయు, (బలరాముఁడు నీలాంబరుఁడు. (ని) నీలాంబరో రౌహిణేయ యనియు నంబరం వ్యోమ్ని వాసని యనియు నమరుఁడు.) మృడాంబర = శివునివస్త్ర మైనగజచర్మముయొక్కయు, హిడింబ = హిడింబుఁ డనురక్కసుని యొక్కయు, కాదంబ = క్రొంచెమెఱుపుగలిసిన నల్లనిరంగుగలకాళ్లను ముక్కులును ఱెక్కలును గలహంసలయొక్కయు, శంబర = శంబరుఁ డనురక్కసునియొక్కయు, కాంతులు = ఛాయలను, ఎంచి = నిందించి, వేల్పుదొరమేనిచాయతోన్ = ఇంద్రునిశరీరకాంతితోన్, వియ్యమంది = సామ్యము నొంది, సదశా......కల్పము, సదశా = సమానమైనస్థితిలో నున్న, అభిసారికా = ప్రియునిఁటికిం బోవుస్త్రీలకున, కాముక = ప్రియులకును, ప్రకామద = సంతసము గలిగించు, మృగీమదాలేప = కస్తూరిపూఁతతోన్, కల్పము = సమానము, అగుచున్, బ్రహ్మాండగహ్వరమునన్ = ప్రపంచ మనుగుహయందు, తదిసెన్ = వ్యాపించెను ప్రియునిఁగూర్చి సంకేతస్థలమునకు మన్మథపీడితయై పోవునది యేని యతని రప్పించునదియేని యగునాయికయభిసారికయనంబడు ఉపమాలంకారమును శబ్దాలంకారము వృత్త్యనుప్రాసము నిందుఁ గలవు.

గీ॥ ఘనతిమిరసంగమున సంధ్య ♦ గాంచి లోక
ములకుఁ బెంచుకొనఁగ నిడ్డ ♦ లలితశీర్ష
ధృతజనకరూపనైజసం ♦ తతు లనంగఁ
గజ్జలయుతాగ్రగృహదీప ♦ కళిక లమరె॥ 98

సంధ్య = సంధ్య యనుస్త్రీ, ఘనతిమిరసంగమునన్ = గొప్పతిమిర (చీఁకటి) పురుషునిసంబంధముచేతను, కాంచి = కని, లోకములకున్ = ప్రపంచమునందలిజనులకున్, పెంచుకొనఁగన్ = పెంచుకొనుటకున్, ఇడ్డ......సంతతులు, ఇడ్డ = ఇచ్చిన, లలిత = సుందరమైన, శీర్ష = శిరసుచేతను, ధృత = ధరింపఁబడిన, జనకరూప = తండ్రియైనతిమిరము నాకారముగల, నైజసంతతులు = సంధ్యాసంబంధమైనశిశువులు, అనంగన్ = అనునట్లు, కజ్జల......దీపకళికలు, కజ్జల = కాటుకతో, యుత = కూడిన,

అగ్ర = చివరభాగములుగల, గృహదీపకళికలు = ఇంటియందలిదీపపుమొగ్గలు, అమరెన్ = ప్రకాశించెను. దీపములు చివర కాటుకను గ్రిందిభాగమున వెల్తురుకాంతిని గలవగుటంజేసి యవి సంధ్య యనుస్త్రీకిని, తిమిరపురుషునకును జన్మించి వా రిద్దఱం బోలినశిశువులవలె నుండె నని భావము భక్తిచే దండ్రిని శిరమున ధరించినశిశువులవలె నుండె నని యేని చెప్పం దగు ఉత్ప్రేక్షాలంకారము

క॥ ఘనకువలయపాలనకుం
జను దెంచెడిరాజు విడియఁ ♦ జతురతఁ బ్రాగ్ది
క్కున ఖేచరు లెత్తినధౌ
తనవపటకుటీర మనఁగ ♦ ధవళిమ దోఁచెన్॥ 99

ఘనకువలయపాలనకున్, ఘన = అధిక మైన, కువలయ = కలువలను భూమండలముయొక్క, పాలనకున్ = రక్షణమునకున్, చను దెంచెడి రాజు = వచ్చెడు చంద్రుఁ డనెడుప్రభువు, విడియన్ = నివసించుటకొఱకున్, ఖచరులు = దేవతలు, చతురతన్ = నేర్పుచేతను, ఎత్తిన .. ..కుటీర మనఁగన్, ఎత్తిన = నిర్మించిన, ధౌత = నిర్మలమైన, నవ = క్రొత్తది యగు, పటకుటీర మనఁగన్ = వస్త్రగృహమో యనునట్లు, పటకుటీరము, పట = బట్టలతో, ( నిర్మించిన ) కుటీరము = ఇల్లు ( డేరా ) ప్రాగ్దిశన్ = తూర్పుదిక్కునందున్, ధవళిమ = తెలుపు, తోఁచెన్ = కాన్పించెను

చ॥ సమయవిటుండు గన్మొఱఁగి ♦ శక్రదిశావిటిగుబ్బచంట సాం
ద్రముగ విదిర్చు చెందిర మ ♦ నం దగెఁ బాటలరేఖ యవ్విభు
న్నెమకి కనంగ నవ్వెలఁది ♦ నెమ్మొగ మెత్తె ననన్ శశాంకబిం
బము వెసఁ దోఁచెఁ గాంచి గరి♦మన్ నగె నా విలసిల్లె వెన్నెలల్॥

సమయవిటుండు = కాలపురుషుఁ డనువిటకాఁడు, కన్మొఱంగి = దాఁగియుండి శక్రదిశావిటిగబ్బిచంటన్, శక్రదిశా = తూర్పుదిక్కనెడు, విటి = విటురాలియొక్క, గుబ్బచంటన్ = గుండ్రమైనస్తనమునందున్, సాంద్రముగన్ = దలముగాన్, విదిర్చు చెందిరమనన్ = చల్లెడుకుంకుమమో యనునట్లు, పాటలరేఖ = ఎఱ్ఱనిగీఱలు, ( ఇది జాత్యేకవచనము ) తగెన్ = ప్రకాశించెను, అవ్వెలంది = మీఁదటిస్త్రీ, అవ్విభున్ = తనమీఁదఁ గుంకుమచల్లినవిటుని, నెమకి = వెదకి, కనంగన్ = చూచుటకున్, నెమ్మొగ

ము = ముఖమును, ఎత్తె ననఁ = ఎత్తెనదో యనునట్లు, శశాంకబింబము = చంద్రమండలము, వెసఁ = త్వరతో, తోఁచెఁ = కాన్పించెను కాంచి = చూచి, (దీనికిం గర్త వెలఁదియును గర్మము కాలపురుషుఁడును) గరిమఁ = గౌరవముతో, నగవాన్ = నవ్వెనో యనునట్లు, వెన్నెలల్ = చంద్రకాంతులు, విలసిల్లెన్ = ప్రకాశించెను. మొదటఁ దూర్పున నెఱ్ఱనిరేఖలును దరువాతఁ జంద్రబింబమును ఁదదుపరి వెన్నెలలును గ్రమముగాఁ దోఁచె నని భావము రూపకానుప్రాణితోత్ప్రేక్షాలంకారము.

గీ॥ సోముఁ డుదయాద్రికైలాస ♦ సీమ వెడలి
లోకభీకరమేదురా ♦ స్తోకతిమిర
హాలహాల మానెఁ గానినాఁ ♦ డంకదంభ
కలితతత్కంఠ కాళిమ ♦ గానఁబడునె॥ 101

సోముఁడు = చంద్రుఁ డనుశివుఁడు, (ని) అబ్జో జైవాతృక సోమ యనియు సోమ శ్శర్వో భవ స్థాణు వనియు నమరుఁడు, ఉదయాద్రికైలాససీమఁ = ఉదయపర్వత మను కైలాసప్రదేశమునుండి, వెడలి, లోకభీకర. .. హాలహాలము, లోక = ప్రపంచమునకు, భీకర = భయమును గలిగించు, మేదుర = దట్టమైన, అస్తోక = అధికమైన తిమిర = చీఁకటియను, హాలహాలము = విషమును, ఆనెఁ = త్రావెను, కానినాఁడు = అట్లు కానియపుడు, అంక. ... కాళిమ, అంక = కళంక మను, దంభ = మిషచే, కలిత = పొందఁబడిన, తత్కంఠకాళిమ = ఆశివుని మెడయందలినలుపు, కానఁబడునె = కనుపడునా? కనుపడ దని యర్థము రూపకాలంకారము.

సీ॥ వనము లెల్లను గల్ప ♦ వనములఁ గావించి
రాల నెల్లను మగ ♦ రాలఁ జేసి
కొండ లెల్లను వెండి ♦ కొండలఁ గావించి
నదుల నెల్లను నభో ♦ నదులఁ జేసి
జలధు లెల్లను దుగ్ధ ♦ జలధులఁ గావించి
కరుల నెల్లను వియ ♦ త్కరులఁ జేసి
సరసు లెల్లను సుధా ♦ సరసులఁ గావించి
నరుల నెల్లను బుర ♦ హరులఁ జేసి

దైవసృష్టికిఁ బ్రతిసృష్టిఁ • దా రచించి
బ్రహ్మయుం బోలె జగదంత • రంబు నిండె
నండజపతుండడిండీర • ఖండకాండ
సమవిమలధామకౌముదీ • సముదయంబు॥ 102

అండజపతుండ.....సముదయంబు, అండజపతుండ=గరుడునియొక్క మోముతోడను, అండజ = గ్రుడ్డువలనఁ బుట్టినవి (పిట్టలు) వానిం బాలించువాఁడు= అండజపుఁడు (గరుడుఁడు) అతనితుండము; డిండీరఖండ=నురువుముక్కలతోడను, కాండ=జలతరంగములతోడను, సమ=తుల్యమైన, విమలధామ=స్వచ్ఛమైనకాంతి గల, కౌముదీ=చంద్రకాంతులయొక్క, సముదయంబు=సమూహము, వనములెల్లన్= ఎల్లతోఁటలను, కల్పవనములన్=కల్పవృక్షపుఁదోఁటలను, కావించి=చేసి, రాల నెల్లన్=అన్నిశిలలను, మగరాలన్=వజ్రములను, చెసి, కొండలెల్లను=అన్నిపర్వతములను, వెండికొండలన్ = కైలాసపర్వతములను, కావించి=చేసి, నదుల నెల్లన్= అన్నినదులను, నభోనదులన్=ఆకాశగంగాప్రవాహములను, చెసి, జలధులెల్లను=సముద్రముల నన్నిటిని, దుగ్ధజలధులన్ = పాలసముద్రములను, కావించి=చెసి, కరుల నెల్లను=ఏనుఁగుల నన్నిటిని, వియత్కరులన్=ఐరావతములను, చెసి, సరసులెల్లను= కొలఁకుల నన్నిటిని, సుధాసరసులన్=అమృతసరసులను, కావించి=చెసి, నరుల నెల్లను = మనుష్యుల నందఱను, పురహరులన్=శివులను, చెసి, దైవసృష్టికిన్=ఈశ్వరునిరచనకున్, ప్రతిసృష్టి, తాన్=వెన్నెల, రచించి=చేసి, బ్రహ్మయుంబోలెన్ = చతుర్ముఖుఁడువలెనే, జగదంతరంబు=ప్రపంచమధ్యమును, నిండెన్=వ్యాపించెను. ము న్నీశ్వరుఁడు పదార్థములను వేరువేరుకాంతులు గలవానిఁ గావించెను. ఇపుడు వెన్నెల సకలపదార్థములను దెల్లనికాంతిగలవానిఁ గావించి యీశ్వరనిర్మాణమునకుఁ బ్రతినిర్మాణము చేసి లోకము లెల్ల వ్యాపించె ననియు నిక్కారణముననే వృక్షాదు లన్నియుఁ గల్పవృక్షాదులువలెఁ దెల్లగ నుండె ననియు భావము ఇందుఁ బదార్థము లెల్లఁ దమగుణము విడిచి యుత్కృష్ట మగ ధావళ్యము గ్రహించుటచేఁ దద్గుణాలంకారము.

క॥ కుముదంబులకు ముదంబులు
కొమరారెఁ జకోరములకుఁ • గోరిక లొదవెన్
రమణులకును రమణులకును

దమి వెలసెం దమియు వెలసెఁ ♦ దనపతిశోభన్॥ 103

కుముదంబులకున్ = కలువలకును, ముదంబులు = సంతసములు, కామరాజన్ = ఒప్పెను, చకోరములకున్ = వెన్నెలపులుఁగులకున్, కోరికలు = అభీష్టములు, ఒదవెన్ = సిద్ధించెను. రమణులకున్ = స్త్రీలకును, రమణులకున్ = పురుషులకును, దమి = కుతూహలము, (వేడుక) వెలసెన్ = హెచ్చెను వెన్నెల యుద్దీపనము గావునఁ గామినీకాముకులకుఁ గోరికలు హెచ్చె నని యర్థము. తమియున్ = రాత్రియును, (వి) రజనీ యామినీ తమీ. అ. తనపతిశోభన్ = తనభర్త యగుచంద్రునివలనఁ గలిగినదీప్తిచేతను, వెలసెన్ = ప్రకాశించెను. ఇందు యమక మనుశబ్దాలంకారము.

క॥ పగటివిరహంపు వేఁడిమి
నొగిలినకుముదినులు చలువ ♦ నూల్కొన సాంద్రం
బుగఁ బన్నిరు కరంబులఁ
దొగచెలి చిలికె నన వ్రాలెఁ ♦ దుహినకణంబుల్॥104

పగటివిరహంపువేఁడిమిన్ = పగటికాలమునం దైనచంద్రుఁ డనుమగనియెడఁబాటువలనఁ గలిగినకాఁకచేతను, నొగిలినకుముదినులు = నొచ్చినకుముద్వతులు, (కలువతీవలు) చలువన్ = శైత్యమును, నూల్కొనన్ = ధరించుటకున్, తొగచెలి = కలువలచెలి (చంద్రుఁడు) కరంబులన్ = (కిరణము లను) చెతులతోన్, పన్నిరు = పన్నీటిని, సాంద్రంబుగన్ = దట్టముగాన్, చిలికెనన్ = చల్లెనో యనునట్లు, తుహినకణంబుల్ = మంచుబిందువులు, వ్రాలెన్ = పడెను; ప్రసరించెను.

వ॥ మఱియు సుధోదయోల్లాసంబున వియదుల్లిధకల్లోలంబై యుల్లసిల్లి పాలవెల్లి వెల్లి వొడిచి పుడమి నెల్లెడల నల్లుకొనియె నన నంతకంత కనంతంబుగా దిగంతంబుల నాక్రమించుచు నంబర తరంగిణీ ఝరంబులనుండి భూమండలంబునకుం డిగ్గుమరాళమాలికలపోలిక నస్తోకవ్యాకోచకైరవవిసరంబు లగుసరోవరపరిసరంబులం బ్రసరించుచు విధుంతుదవదనగహ్వరప్రవేశాభ్యాసంబునంబోలె సాంధేంద్ర నీలజాలగోళంబులం దూఱుచుఁ దిమిరజలదసమయవిగమంబగుట

యుం బెల్లు తెల్లు విరిసె నన విశాలంబు లగుకూలంకషాకూలంబు లం గ్రాలుచుఁ గుసుమసముదయంబుచందంబునం దరులతాచ్ఛాదంబుల ధాళధళ్యంబున మెఱయుచు మదకేసరికిశోరవారంబుతీరున శిఖరిశిఖరంబు లెక్కుచు లీలం దేలి యాడువాలుగమీలబెళుకుల చెన్నున మున్నీటిపెన్నీటికరడులమీఁద దీపించుచుఁ గౌముది దానగుట నభివ్యక్తశుద్ధవర్ణంబై, ద్విజముఖంబుల వ్యాపించుచుఁ జంచద్విధుమండలాంతరవిహారిణీముఖపరిచ్యుత రోమంథబంధురఫేనపుంజంబు లవడువున సంకేతకుంజంబులపై రంజిల్లుచు రంజిల్లుఫుల్లమల్లికామంజరులమేదురామోదంబు రెట్టింప నిట్టట్టు దూలుతఁగలసి యలసినకాముకులను బదరి యుపరిసురతంబు నెఱపుతరుణులసుఖస్ఖలత్కుళల తెఱంగునం గురంగటం గరంగుచుం దొరంగుకురంగధరోపలకుట్టిమంబుల జలజలని తెలిసిటితెళుకుల నేకీభవించుచు ఱింగున నెగసి నింగి నంగారకార్ద్రాదిగ్రహతారల నింగలంబు లని మ్రింగం గడంగుచోఁ బెంపుగాఁ గురియునమృతధారాపరంపరలకు గుంపులై వియత్తలంబునం గుత్తుకబంటిం గ్రోలి వెక్కసంబుగఁ బుక్కిళ్లం బట్టి యొండొంటి కం దిచ్చుచు హెచ్చినమచ్చికలం గలయునచ్చకోరదంపతుల సొంపునం బటికంపుగిన్నెల ము న్నినిచివయన్నారికేళాసవంబు లాసకొలందిఁ గమిచి తదీయమదోన్మాదంబున మోదంబుగాఁ బాడు విపరీతగీతంబుల వ్యత్యస్తసల్లాపంబుల వింతవింత నటనంబుల వికృతచేష్టావిలాసంబుల నకారణహాసంబులఁ జెలంగుచు మెలంగి తెలివి గని వలపు గొని మణిమంజీరశింజితంబు లులియ నలరుఁబోడలకుం గదలి చని వనీపవనంబునం బయ్యెదలు దొలంగింపకయ తొలంగ బంగారుబొంగరాలహారంగునం బొంగారుమొలకచనుంగవల మిలమిలలం గనుపట్టు సిబ్బెంబులు గుబ్బతిల్ల గొబ్బునం గవుంగి

లించు మించుఁబోఁడుల దృగంచలచంచలప్రభల రాణించువిభ్రమరీతుల కుల్లసించు ప్రాణవల్లభులతో మల్లడిగొని వివిధబంధచమత్కారంబులం గూడి క్రీడించునెడ నీటలరు వజ్రతాటంకలాలాటికాచాకచక్యంబులతో సఖ్యం బొనర్చుచు నిట్లఖండపాండురచ్ఛాయామండలంబుల మెండుకొని పండువెన్నెలలు గాయఁ గాయజుం డేయెడం బాయక సాయకనికాయంబు లేయ దాయయై మలయానిలుండు దాయ నుల్లంబు ఝల్లనం దాలిమి దూల నిదుర నొందక కెందలిరుపాన్పు డిగ్గి పవమానవిలోలబాలవల్లరియుంబోలె సోలుచు భద్రాబాలికారత్నంబు నిరంతర నిజస్వాంత చింతిత శ్రీకాంతకాంతాకారంబు గన్నులం గట్టిన ట్లయినఁ గంటిఁ గంటి నని దిగ్గన లేచి బయలు గవుంగిలించుచుం గళవళించుచు నక్కటా దైవంబు నిర్దయుం డయ్యె నేమి సేయుదు నని బుడిబుడి కనుంగవ నీరు జడిగొన నడుగులు తడఁబడ నడుము గడగడ వడఁక వెన్నెలయేట నుఱికెద నని దుముకఁ జుఱుకు చుఱుక్కన నక్కనం జిలుఁగువెన్నెలలు సోఁక మూర్ఛిల్లినం జయ్యన నెయ్యంపుఁదొయ్యలు లెత్తికొని వచ్చి శిశిరజల బిసకిసలయాదుల శీతలోపచారంబు గావింప నెట్టకేలకు సేదదేఱి తేఱిచూచి చంద్రు నుద్దేశించి యుపాలంభంబుగా నిట్లనియె॥ 105

మఱియున్ = ఇంకను, పాలవెల్లి = పాలసముద్రము, సుతోదయోల్లాసంబునన్ = కుమారుఁడైన చంద్రునిపుట్టుకవలనఁ గలిగినసంతోషముచేతను, వియ......లంబై, వియత్ = ఆకాశముచేతను, ఉల్లీఢ = ఒరయఁబడిన, కల్లోలంబై = తరంగములు గలదియై, ఆకసమువఱకుం బోయినతరంగములు కలదియై యని యర్థము. (మిగుల సంతసించినవాఁ డని ధ్వనించును) వెల్లివిరిసి = ప్రవహించి, పుడమిన్ = భూమియందున్, ఎల్లెడలన్ = అన్నిప్రదేశములందున్, అల్లుకొనియె నన్ = వ్యాపించెనో యనునట్లు, అంతకంతకున్ = ఒకక్షణముకంటె నొకక్షణమునకున్, క్రమక్రమముగా ఐని

యర్థము. అనంతంబుగాఁ = అధికముగాఁ, దిగంతంబులఁ = దెసలకడపటిభాగంబులను, ఆక్రమించుచుఁ = వ్యాపించుచుఁ, (దీనికిం దీవితద్యుతాళియసమాపకక్రియలకును గర్తృ మొం దున్న పండువెన్నెల లనునది.) అంబర......నుండి, అంబరతరంగిణీ= ఆకాశగంగయొక్క, ఝరంబులనుండి= ప్రవాహములనుండి, భూమండలంబునకుఁ = మండలాకార మైనభూమికి, డిగ్గురురాశమాలికలపోలికఁ = దిగునంచలబారులసాదృశ్యముచేఁ, అంచలబారులువలె నని యర్థము. అస్తోక......బులు, అస్తోక=అధికముగాను, వ్యాకోచ=వికసించిన, కైరవవిసరంబులు=కలువలసముదాయములు కలవి, అగుసరోవరపరిసరంబులన్ = అయ్యేదుకొలఁకులసమీపములందుఁ, ప్రసరించుచుఁ = వ్యాపించుచుఁ, విధుంతుద.....పోలెఁ, విధుంతుద = రాహువుయొక్క, వదనగహ్వర=కొండగుహవంటినోటను, ప్రవేశాభ్యాసంబునంబోలెన్ = ప్రవేశించుటయందలియలవాటుచేతనువలెనే, సౌధేంద్రనీలజాలగోళంబులన్, సౌధ=మేడలయందలి, ఇంద్రనీల=ఇంద్రనీలములయొక్క, ఇంద్రనీలములతోఁ గట్టఁబడిన యని యర్థము. జాలగోళంబులఁ=గోళాకార మైనకిటికీలయందున్, దూఱుచుఁ = ప్రవేశించుచున్, (హేతూత్ప్రేక్షాలంకారము.) తిమిర......విగమంబు, తిమిర=చీఁకటియును, జలదసమయ=వర్షాకాలముయొక్క, విగమంబు = అవసానము, అగుటయుఁ = అయినతోడనే, (ఇచట 'యుఁ' ననునది యానంతర్యార్థకము.) పెల్లు (కనుము) పెల్లు=అధికముగన్, విరిసె ననఁ=పూచెనో యనునట్లు, (ఇది శరత్కాలమునఁ బూచును.) విశాలంబులు=పెద్దవి, అగుకూలంకపాకూలంబులఁ = అయ్యేదు, కూలంకపా=నదులయొక్క, కూలంబులఁ = ఒడ్లయందు, క్రాలుచుఁ = ప్రకాశించుచుఁ, కుసుమసముదయంబుచందంబునన్ = పువ్వులగుంపుయొక్కరీతిచేతను, తరులతాచ్ఛదంబులఁ, తరు = చెట్లయు, లతా = తీవలయు, ఛదంబులఁ = ఆకులయందుఁ, ధాళధళ్యంబునఁ = ధళధళ యనుకాంతిచే, మెఱయుచున్ = ప్రకాశించుచుఁ, మదకేసరికిశోరవారంబుతీరునఁ, మద = మదముగల, కేసరి = సింగములయొక్క, కిశోరవారంబుతీరునన్ = శిశువులసముదాయముయొక్కరీతిచేతను, శిఖరిశిఖరంబులు = పర్వతాగ్రములను, ఎక్కుచున్, లీలఁ = విలాసముతోఁ, తేలియాడు......చెన్నునఁ, తేలి = నీటిమీఁదనుండి, ఆడు = క్రీడించెడు, వాలుగమీల = చేఁపలయొక్క, బెళుకులచెన్నునఁ = కాంతులయొక్కయందముం బోలినయందముచేతను, (చేఁపలువలె నని యర్థము.) మున్నీటిపెన్నిటికరడులమీఁదఁ = సముద్రమునందలిపెద్దతరంగములయందున్ దీపించుచుఁ=ప్రకాశించుచుఁ, తాఁ = ఆవెన్నెల, కౌముది యగుటన్ = కలువలవికసింపఁ జేయునది గాన, (చంద్రికాంతి యగుటచేత నని యర్థము,) వ్యాకరణ

గ్రింథ మగుటచేత ననియు ధ్వనించును. అభివ్యక్తశుద్ధవర్ణంబై = స్ఫుటమైన తెల్లనివన్నె గలదియై, ద్విజముఖంబులకున్ = చకోరపుంబత్తులనోటను, వ్యాపించుచున్ = స్ఫుటమైనదోషము లేనియక్కరములు గలదియై బ్రాహ్మణులు మొదలగువారినోటను బ్రవేశించి వ్యాపించుచుండె ననియు ధ్వనించును. చంచద్విధు......వదువుసన్, చంచత్ = ప్రకాశించుచున్న, విధుమండల = చంద్రబింబముయొక్క, అంతర్గత = లోపలనున్న, హరిణ = లేడియొక్క, ముఖ = నోటినుండి, పరిచ్యుత = జారిన, రోమంథ = నెమరువేయుటవలన. బంధుర = ప్రకాశించెడు, ఫేన = నురువుయొక్క, పుంజంబులవదువునన్ = సముదాయములవిధముచేతను, (చంద్రునికళంకమును బెక్కండ్రు కవులు హరిణ మని చెప్పి దానిలక్షణము లన్నియు నిందారోపించి వర్ణించుట కలదు గాన నిటఁ జంద్రునిలోనిలేడి నెమరువేయునపుడు జారిననురువులువలె వెన్నెలఁపొదలపైనుండెనని చెప్పెను. సంకేతకుంజములపైన్ = (నాయికానాయకులు కూడుటకు) యేర్పాటు చేసికొన్న పొదరిండ్లమీఁదను, రంజిల్లుచున్, రంజిల్లు...మోదంబునన్, రంజిల్లు = విలసిల్లెడు, ఫుల్లమల్లికామంజరుల = పూచినమల్లెపూగుత్తులయొక్క, మేదురామోదంబునన్ = అధికమైనపరిమళముచేతను, మోదంబు = ఆనందము, రెట్టింపన్ = అధికముకాఁగా, ఇట్టట్టు = ఒకరీతిచేతను, తొలుతన్ = మొదటన్, కలసి = కూడి, అలసిన కాముకులన్ = శ్రమచెందిననాయకులను, పదరి = నిందించి, ఉపరిసురతంబు = ఉపరతిని, నెఱప్ర......తెఱంగునన్, నెఱపు = నెఱవేర్చెడు, తరుణుల = స్త్రీలయొక్క, సుఖస్థలత్కళల తెఱంగునన్ = సుఖముగ జాఱుచున్న కళలరీతిచేతను, కుఱంగటన్ = సమీపమందున్, కరంగుచున్ = విరగుచున్, తొరంగు......లన్, తొరంగు = స్రవించెడు, కురంగధరోపల = చంద్రకాంతపురాలయొక్క, కుట్టిమంబుల = కట్టడపునేలలయొక్క (అరఁగులనుండియనియర్థము.) జలజలని = జలజల ప్రవహించెడు, తెలినిటితటుకులన్ = తెల్లనినీటియొక్క కాంతులతోన్, ఏకీభవించుచున్ = కూడికొనుచున్, తీంగునన్ = తెక్కలవప్పుడు కలుగునట్లు, నెగసి = ఎగిరి, నింగిన్ = ఆకాశమునందున్, అంగారకార్ద్రాదిగ్రహతారలన్ = అంగారకుఁడు మొదలగుగ్రహములను నార్ద్ర మొదలగు నక్షత్రములను, అంగారకుఁడు రక్తవర్ణము కలవాఁడనియు, నార్ద్ర పవడముం బోలినకాంతి గలదనియు జ్యోతిషమునం బ్రసిద్ధము ఇంగలంబు లని = నిప్పుక లని, మ్రింగం గడంగుచోన్ = మ్రింగుటకు యత్నించునపుడు, (ఇంగల మంగారశబ్దభవము) పెంపుగాన్ = అధికముగాన్, కురియునమృతధారాపరంపరలకున్ = వర్షించెడుమంచునీటియొక్క యొడతెగని ధారలకున్, గుంపులై, వియత్తలంబునన్ = ఆకాశమునందున్, కుత్తుకబంటిన్ = కుత్తుకకొలఁదిని, (గొంతువఱకు నని యర్థము.) క్రోలి = త్రావి, వెక్కసంబుగన్ =

అధికముగాన్, పుక్కిళ్లింబట్టి=నోటం బూరించి, ఒండొంటికిన్=ఒకచకోరము మ
ఱియొకదానికిన్, అందిచ్చుచున్, హెచ్చినమచ్చికలన్=అధిక మైనప్రేమచేతను,
కలయుచున్నచకోరదంపతులసొంపునన్=కూడికొనియెడు వెన్నెలపులుఁగుల సొగసుచేత
ను, చకోరదంపతులువలె నని యర్థము. (ఇది గిన్నెల కుపమానము) జాయా+ప
తి=దంపతులు, భార్యాభర్తలు. ఇచట నాఁడు పిట్టలు మొగపిట్టలు నని యర్థము.
పటికంపుగిన్నెలన్=స్ఫటికపాత్రములందున్, మున్నినిచినయన్నారికేళాసవంబులు=
ముందు పోసినకొబ్బెరకల్లులను, ఆసకొలందిన్=ఆశయొక్కపరిమాణముచేతను, ఇచ్ఛ
కలంతవఱకు అని యర్థము కమిచి=పుచ్చికొని, తదీయమదోన్మాదంబునన్=ఆకల్లు
సంబంధ మైన (కల్లుత్రావుటవలనఁ గలిగిన యని యర్థము) సంతోషముచేత నుప్పతి
ల్లిన వెఱ్ఱిచేతను, మోదంబుగాన్=(వినువారి) కింపుగాన్, పాటువిపరీతగీతంబు
లన్=పాడెడునెక్కువతక్కువగానములచేతనును, వ్యత్యస్తసల్లాపంబులన్=తడఁబా
టుగలమాటలచేతనును, వింతవింతనటనంబులన్=అచ్చెరువు బుట్టించునాటలచేతను
ను, వికృతచేష్టావిలాసంబులన్=వికార మైనపనులచేతను, సొగసులచేతనును, అకారణ
హాసంబులన్=కారణము లేనినగవులచేతనును, చెలంగుచున్=ప్రకాశించుచున్, మ
లంగి=సంచరించి, తెలివి గని=(సురాపానమువలనఁ గలిగిన) పరాకు వదలి, వల
పుఁగొని=ఒండొరులం ప్రేమించి, మణిమంజీరశింజితంబులు=మాణిక్యపుటందెలధ్వను
లు, ఉలియన్=మ్రోయఁగాన్, అలరుఁబోదలకున్=పూఁబొదరిండ్లకున్, కదలి చ
ని=బయలువెడలి, వనీపవనంబునన్=తోఁటయందలి (చల్ల) గాలిచేతను, పయ్యెద
లు=పైఁటలు (పయ్యెద యిది వక్రసమాసము పయి+ఎద=పయ్యెద; ఎదపై నుం
డువస్త్రము) తొలఁగింపకయ=యత్నముచేతఁ దీయకయే, తొలంగన్=(గాలిచే)
జాఱిపోఁగాన్, బంగారుబొంగరాలహొరంగునన్=బంగారుబొంగరాలయొక్క సొగ
సుచేతను, బంగారుబొంగరాలువలె నని యర్థము. పొంగారుమొలకచనుంగవలన్=
అతిశయించు లేఁతచనుజంటలయందున్, మిలమిలన్=తళతళలాడునట్లు, కనుపట్టుసి
బ్బెంబులు=కనుపడెడుసుందర మగుపాడలు, గుబ్బటిల్లన్=ఎక్కువ కాఁగాన్,
గొబ్బునన్=వేగముతో, కవుఁగిలించు.....ప్రభలన్, కవుఁగిలించు=ఆలింగనము
చేసికొనెడు, మించుబోఁడుల=స్త్రీలయొక్క, (మెఱపుంబోలినదేహముగలస్త్రీలయొ
క్క) దృగంచల=కనుఁగొనలయందలి, చంచలప్రభలన్=చలనశీల మైనకాంతులచేత
ను, రాణించువిభ్రమంబులకున్=ప్రకాశించెడుశృంగారచేష్టలకున్, ఉల్లసించుప్రాణ
వల్లభులతోన్=సంతోషించెడుప్రియులతోన్, మల్లడిగొని=పెనఁగులాడి, వివిధబంధ
చమత్కారంబులన్=పలుతెఱంగులసంయోగములందలినేర్పులతోన్, కూడి=చేరి,

క్రీడించునెడన్ = విహరించునపుడు, నీటు = సొగసుచేతను, తృతీయార్థమునం బ్రథమ. అలరు......చాకచక్యంబులతోన్, అలరు = ప్రకాశించెడు, వజ్రతాటంక = వజ్రపుఁగమ్మలయొక్కయు, లాలాటికా = (వజ్రపుఁ) బాపటబొట్టుయొక్కయు, చాకచక్యంబులతోన్ = చకచకలాడుకాంతులతోన్, సఖ్యంబు = నెయ్యమును, ఒనర్చుచున్ = చేయుచున్, ఇట్లు = ఈప్రకారము, అఖండ ...మండలంబులన్, అఖండ = పూర్ణమైన, పాండుర = తెల్లని, చ్ఛాయామండలంబులన్ = కాంతులసమూహములచేతను, మెండుకొని = (అంతటను) నిండి, పండువెన్నెలలు = ముదురువెన్నెలలు, కాయన్ = ప్రకాశింపఁగాన్, కాయజుండు = మన్మథుఁడు, ఏయెడన్ = ఏస్థలమునందును (అన్నిస్థలములయందని యర్థము) వాయక = విడువక, సాయకనికాయంబులు = బాణసమూహములను ఏయన్ = ప్రయోగింపఁగాన్, మలయానిలుండు = పయ్యెర (దక్షిణపుగాలి) దాయయ్యె = (విరహులకు) విరోధియై, దాయన్ = (భద్రము) సమీపింపఁగాన్, దప్పక లోనగువాని దాఁగ డకారంబు విభాష నగు బా. ప్ర. ఉల్లంబు = మనసు, ఝల్లనన్ = (ఇది యనుకరణము) చెదరఁగాన్, దీనిం బెక్కండ్రు జల్లని వాడుదురు తాలిమి దూలి = ధైర్యమును విడిచి, నిదుర సొందక, కెందలిరుపాన్పున్ = చిగురాకుసెజ్జయందు, డిగ్గి = దిగి, పవమాన....బోలెన్, పవమాన = గాలిచేతను, విలోల = కంపించెడి, బాలవల్లరియుంబోలెన్ = లేఁతతీవవలెన్ సోలుచున్ = పరవశురాలయిపడుచున్, వ్రజబాలికారత్నంబు, నిరంతర ....కారంబు, నిరంతర = ఎడతెగనందువల్లను, నిజస్వాంత = తనమనసునన్, చింతిత = తలంపఁబడియెడు, శ్రీకాంత = కృష్ణునియొక్క, కాంతాకారంబు = మనోహరమైనయాకారము, కన్నులంగట్టినట్లైనన్ = కన్నులకుంగానిపించినట్లుకాఁగాన్, కంటిం గంటి నని = (ఏను కృష్ణునిం) జూచితిఁ జూచితి నని భ్రమపడి, దిగ్గన లేచి = శీఘ్రముగాన్ లేచి, బయలు = ఆకసమును, కవుంగిలించుచున్ = ఆలింగనముచేసికొనుచున్, కళవళించుచున్ = క్షోభపడుచున్, అక్కటా = అయ్యో! (సంతాపార్థకము) దైవంబు, నిర్దయుండు = కరుణలేనివాఁడు, (నాకు సుఖముం బోఁగొట్టునిచ్చలేనివాఁడు) అయ్యెన్, ఏమి = ఏకార్యమును, చేయుదున్ = కావింతును, అని = ఇట్లు బుడిబుడికనుంగవనీరు = కొంచెము కన్నీరు, జడిగొనన్ = ఎడతెగక వచ్చుచుండఁగాన్, అడుగులు తడఁబడన్ = పాదములు తొట్రుపడఁగాన్, నడుము = మధ్యము, గడగడవడఁకన్, వెన్నెలయేటన్ = చంద్రికాప్రవాహమునందున్, ఉఱికెద నని, దుముకన్ = గంతు గొనఁగాన్. చుఱుకుచుఱుక్కనన్ = మిక్కిలివాఁడితోన్, అఱ్ఱునన్ = ఱొమ్మునందున్, జిలుఁగువెన్నెలలు = సన్ననిచంద్రకిరణములు, సోఁకన్ = తగులఁగాన్, మూర్ఛిల్లినన్ = సొమ్మసిల్లఁగాన్,

చయ్యనన్ = శీఘ్రముగాన్, నెయ్యంపుఁదొయ్యలులు = ప్రియసఖులు, ఎత్తికొనివచ్చి = తీసికొనివచ్చి, శిశిర......యాదులన్, శిశిరజల = పన్నీటిచేతనను, బిస = తామర తూండ్లచేతనను, కిసలయాదులన్ = చిగురాకులు మొదలగువానిచేతనును, శీతలోప చారంబులు = చల్లనియుపచారములను, కావింపన్ = చేయఁగాన్, ఎట్టకేలకున్ = చిట్టచివరకున్, సేదదేరి = తెప్పిరిల్లి, (మూర్ఛనుండి తెలిసి) తేటిమాచి = బాగుగఁజూచి, చంద్రు నుద్దేశించి = చంద్రునిం దలఁచి, ఉపాలంభంబు గాన్ = నింద గలుగునట్లు, ఇట్లనియెన్ = ఈప్రకారము చెప్పెను.

మ॥ సుమనఃప్రీతి యొనర్చి సత్పథచరి ♦ ష్ణుత్వంబు సర్వజ్ఞమౌ
ళిమణిత్వంబును గాంచు రాజ వయి హా♦ళిన్ శంబరారాతి స
ఖ్యమునన్ మీఱుచు భీరుతాకలితపాం♦థాళిన్ దయాశూన్యతన్
శ్రమ మొందించి కలంచు టెంచనృపధ♦ర్మంబే నిశానాయకా॥106

నిశానాయకా = ఓచంద్రుఁడా! సుమనఃప్రీతి = దేవతలకు సంతోషమును, ఒనర్చి = చేసి, (చంద్రుఁడు దనకళలం ద్రావ నిచ్చి దేవతలఁ దృప్తి నొందించు నని పురాణగాథ కలదు.) విద్వాంసులకుం బ్రీతి చేసి యని యర్థాంతరము. సత్పథచరిష్ణుత్వంబున్, సత్ = నక్షత్రములయొక్క, పథ = మార్గమునందున్, (ఆకాశమునందున్) చరిష్ణుత్వంబున్ = సంచరించుస్వభావమును, మంచిమార్గమునందు సంచరించుస్వభావము అని యర్థాంతరము సర్వజ్ఞ... బును, సర్వజ్ఞ = శివునియొక్క, మౌళీ = శిరసునకు, మణిత్వంబును = మాణిక్యమగుటను, (అలంకారభావము అని యర్థము) సర్వజ్ఞ = అన్నిటిం దెలిసినవారికి (విద్వాంసులకు) మౌళిమణిత్వంబును = శిరోమణిత్వంబును, విద్వాంసులలోనుత్తమత్వము అని యర్థాంతరము కాంచు రాజవు = పొందునట్టిచంద్రుఁడవు, పొందునట్టిప్రభువ వని యర్థాంతరము. అయి, హేళిన్ = సంతసముతోన్, శంబరారాతిసఖ్యమునన్, శంబరారాతి = మన్మథునియొక్క (శంబరుఁ డనురక్కసునకు శత్రువు (ని) శంబరారి ర్మనసిజః అ) సఖ్యమునన్ = స్నేహముచేతను, శంబరారాతి = ఎలుకవాండ్రయొక్క (లేళ్లకు శత్రువులు (ని) కృష్ణసార రురు న్యంకు రంకు శంబర రౌహిణాః అ) సఖ్యంబునన్ = స్నేహముచేతను, మీఱుచున్ = అతిశయించుచున్, భీరుతాకలితపాంథాళిన్, భీరుతా = స్త్రీత్వముతో, ఆకలిత = కూడిన, పాంథాళిన్ = వియోగులయొక్క సముదాయమును, విరహిణుల అని యర్థము (భయపడుటతోఁ గూడిన) భయముతోఁ గూడిన తెరువరులయొక్క సముదాయము అని

యర్థాంతరము. ( ని ) విశేషా స్త్వంగనా భీరుః కామిని వామలోచనా యనియును త్రస్నౌ భీరు భీరుక భీలుకా యనియు నమరుఁడు శ్రమ మొందించి=ఆయాసపెట్టి, దయాశూన్యతన్=దయలేమిచే, కలంచుట=క్షోభపెట్టుట, ఎంచన్=ఆలోచింపఁగాన్, నృపధర్మంబే=రాజధర్మమా? కా దని యర్థము. దేవతలకు స్వదేహము నిచ్చి తృప్తిపొందించి దేవతలకునెల్ల దేవుఁ డగుశివునిచె శిరసున ధరియింపఁబడి ( సన్మార్గమునను ) యాకాశమార్గమునను నే సంచరించురాజవు ( ఎల్లవారిని సంతోషపెట్టువాఁడవు ) అగునీవు మన్మథునిసెయ్యము సంపాదించి మగని నెడఁబాసినయాఁడువారి బాధింపరా దని మొదటియర్థమును, విద్వాంసులకు మిగుల సంతసము పుట్టించి యన్నియుం దెలిసినవారిలో నగ్రేసరుఁడవై మంచినడవడి గలప్రభు వగునీవు కిరాతులతో మైత్రిఁ జెంది భయపడుమార్గస్థులను బాధించుట న్యాయము గా దని రెండవయర్థమును దాత్పర్యము. శ్లేషాలంకారము.

చ॥ హితసరణిన్ శిరంబున వహించె మహేశ్వరుఁ డంచు గర్వభా
సితగతి మిన్ను ముట్టెదు శశీ! మఱి నిన్ను అకాలఁ దన్ని ము
న్నతఁడెకదా కళాగతివటంచు దయ న్విడిచెన్ గతావమా
నతఁ గని సిగ్గుఁ జెందవు మనంబున నీకుఁ బరాకు వచ్చెనే. 107

శశీ!=ఓచందురుఁడా, ( చందురునిలోని కళంకము కుందే లని కొందఱు చెప్పుదురు దానిని ధరించినవాఁడు గావున శశి యని చెప్పంబడు ) మహేశ్వరుఁడు=శివుఁడు, హితసరణిన్=అనుకూలమైనమార్గముచేత, శిరంబునన్=తలయందున్, వహించె నంచున్=ధరించె ననుచున్, గర్వభాసితగతిన్=గర్వముచే విలసిల్లినరీతిచేతను ( గర్వముచేత నని యర్థము ) మిన్నుముట్టెదు=ఆకాశమును దాఁకెదవు. ఉప్పొంగెద వని యర్థము మఱి=ఇంకను, అతఁడే=ఆయీశ్వరుఁడే, మున్ను=పూర్వము, దక్షునిజన్నముం జెఱచునపు డని యర్థము. నిన్నున్, అకాలన్=కాలియడుగుభాగముతోన్, తన్ని, కళాగతివి=విద్యలకెల్ల వాసస్థానమవు, కాంతులకు వాసస్థాన మని భావము అటంచున్, దయన్=కనికరముచేతను, విడిచెఁగదా=వదలెనుగదా! గతావమానతన్=( లోకముచేఁ ) దెలియఁబడినయవమానము గలుగుటను తెలియఁబడినయవమానము నని యర్థము కని=పొంది, సిగ్గున్=లజ్జను, చెందవు=పొందవు నిజమున్, మనంబునన్=మనసునందున్, పరాకువచ్చెనే=ప్రమాదమువచ్చెనా యని ప్రశ్నము

క॥ తొలి లోకములకు వంకర
గలిగింతువటంచు నెంచి ♦ కమలభవుఁడు ని
న్నిలఁ బుట్టినపుడె వంకర
గలవాఁడుగఁ జేసెఁ గాదె? ♦ కమలవిరోధీ! 108

కమలవిరోధీ! = ఓతమ్ములదాయా! (చంద్రా!) కమలభవుఁడు = తమ్మిమాలి, (బ్రహ్మ) తొలి = పూర్వమందన్, లోకములకున్, ప్రపంచమునందలిజనులకుఁ, వంకర = చెడుకార్యమును (అపకారము అని యర్థము) కలిగింతువటంచుఁ = చేయుదు వని, ఎంచి = ఆలోచించి, ఇలఁ = భూమియందుఁ, పుట్టినపుడె = జన్మించినపుడే నిన్నుఁ, వంకర గలవాఁడుగఁ = కౌటిల్యము కలవాఁ డగునట్లు, వక్రమైనయాకారము గలవాఁ డగున ట్లని భావము. చేసెఁగాదె = చేసెనుగదా! వంకరవాఁడు వంకర పనులఁ జేయుట సహజ మని తాత్పర్యము

సీ॥ ఇందిరావిభుఁ డాత్మ ♦ హృదయస్థితుని నిన్ను
దోషాకరుఁడ వంచుఁ ♦ దొలఁగఁ ద్రోచె
నపుడు ధాతయు స్వకీ ♦ యాబ్జపీఠికిని జే
టొదవు నంచును నతి ♦ కొప్పగించె
నందుండి తారాప ♦ హారణవైఖరిఁ జూప
నతఁడు పాథోరాశి ♦ యందు వైచె
నచట రాజీవసం ♦ హారణంబు గావింతు
వని యబ్ధి యంబరం ♦ బునకుఁ ద్రోచె
నచట రాహువు మ్రింగియు ♦ నఱుగ కుమికి
మరలఁ గ్రక్కంగ నీ విట్లు ♦ మసలి జగతి
నందఱకుఁ గంటకుఁడ వౌచు ♦ నింద నొందు
నీకు నిల్కడ గల్గునే ♦ నీరజారి! 109

నీరజారి = ఓపద్మవైరీ! ఇందిరావిభుఁడు = విష్ణువు, ఆత్మహృదయస్థితునిన్ = తనమనసున నున్నవానిని, నిన్నున్, దోషాకరుఁడ వంచుఁ = పాపముల కునికిప ట్టను

చున్, రాత్రికిం బ్రభు వనుచు ననియు నర్థము. (ని) సాయం నిశ్యవ్యయం దోషా త్రియామా దూషణాఘరోః. నా నా తొలఁగన్, ద్రోచెన్ = వెడలఁ ద్రోచెను. పాపాత్ముఁడు లోనుండఁ దగఁ డని విష్ణువు నిన్ను వెలువరించె నని యర్థము. చంద్రుఁడు విష్ణువు మనసునం బుట్టె నని భావము అపుడు = ఆకాలమందు, ధాతయున్ = బ్రహ్మయును, స్వకీయాబ్జపీఠికిన్ = తనది యగు తామరపూవుగద్దియకున్, చెటు = హాని, ఒదవునంచున్ = పుట్టునని, అత్రికిన్ = అత్రి యనుమునికిన్, ఒప్పగించెన్ = ఇచ్చెను. చంద్రునియుదయమునఁ బద్మములు ముకుళించుఁ గానఁ దనపీఠ మగుపద్మము ముకుళించిన సుఖస్థితి సంభవింప దని యెంచి బ్రహ్మచంద్రు నత్రి కిచ్చె నని తాత్పర్యము. బ్రహ్మ యనుగ్రహమువలనఁ జందురుఁ డత్రికిఁ బుత్రుఁడై జన్మించె నని పురాణములం బ్రసిద్ధము. అందుండి = అత్రియొద్దనుండి, తారాపహరణవైఖరిన్ = తార యను పేరు గలబృహస్పతిభార్యయొక్క దొంగిలించుటయొక్క రీతిని, చూపన్ = (చంద్రుఁడు) కనుపఱుపఁగాన్, బృహస్పతిభార్యను గొంగిలింపఁగా నని యర్థము అతఁడు = అత్రి, పాథోరాశియందున్ = సముద్రమునందున్, వైచెన్ = విసరివేసెను. ఆతతాయి (పరభార్యను హరించువాఁడు) గాన నింటనుండఁ దగఁ డని సముద్రమున నత్రి పాఱవైచె నని తాత్పర్యము. అచటన్ = ఆసముద్రమునందున్, రాజీవసంహారణంబు, రాజీవ = చేఁపలయొక్క, సంహారణంబు = సంహారమును, కావింతు వని = చెయుదు వని, పద్మసంహారము చెయుదు వని భావము (ని) రాజీవ మబ్జే రాజీవో మృగే మత్స్యే. నా నా అబ్ధి = సముద్రుఁడు, అంబరంబునకున్ = ఆకాశమునకున్, ద్రోచెన్ = ఎగచెను అచటన్ = ఆకాశమునందున్, రాహువు, మ్రింగియున్, ఈవు అఱుగమికిన్ = జీర్ణము కాకుండుటచేన్, మరలన్, క్రిక్కంగన్, ఇట్లు = ఈప్రకారము, మసలి = తిరిగి, జగతిన్ = లోకమునందున్, అందఱకున్, కంటకుఁడవు = నిచశత్రుఁడవు, ఔచున్, నింకన్, ఒందునిసున్ = అనుభవించెదునీవున్, నిల్కడ = స్థైర్యము, శాశ్వతజీవన మని భావము. కల్గునే = ఉండునా? ఉండ దని యర్థము. ఇందొక్కఁ డగుచంద్రునకుఁ బర్యాయమునం బెక్కుస్థలములం దునికిఁ జెప్పుటచేఁ బర్యాయాలంకారము

ఉ॥ ఇంతటివాని నిన్నుఁ దన ♦ హృత్పథమందుఁ దలం ధరించు శ్రీ
కాంతునకుం గిరీశునకుఁ ♦ గానన దావహలాహలానలా
నంతనితాంతకీలముల ♦ నానుట యెంతటివింత యామినీ
కాంత తలంపఁ దద్వ్యయము ♦ గాంచునె ధాత్రి భవత్సమోగ్రతన్॥

యామినీకాంత = రేరేఁడా! (చంద్రుఁడా!) ఇంతటివానిన్ = ఇంతవాఁడికి గుణములు గలవానిన్, నిన్నున్, స్వాంతపథమునందున్ = మనోవీధియందున్, తలన్ = శిరసునందును, ధరించు శ్రీకాంతునకున్ = ధరించిన విష్ణువునకును, గిరీశునకున్ = శివునకును మనమున ధరించిన విష్ణునకును శిరసున ధరించిన శివునకు నని క్రమముగ నర్థము కానన ......కీలములన్, కానన = అడవియందలి, దావ = అగ్ని యొక్కయు, హాలాహాలానల = అగ్నిం బోలిన కాలకూటము యొక్కయు, అనంత = అంతములేని, నితాంత = అధికమయిన, కీలములన్ = మంటలను, ఆనుట = మ్రింగుట, ఎంతటివింత = ఎంతయాశ్చర్యము? ఆశ్చర్యము కాదని భావము. తలంపన్ = ఆలోచింపఁగాన్, తద్ద్వయము = వెనుకటి రెండువిధముల జ్వాలలును, ధాత్రిన్ = భూమియందున్, భవత్సమాగ్రితన్ = నీకుం దుల్యమైన భయంకరత్వమును, వాఁడిమి నని యర్థము. కాంచునె = పొందునా? పొంద దని యర్థము శివుఁడు లోకసంరక్షణార్థము కాలకూటముం ద్రావె ననియుఁ గృష్ణుఁడు గోపసంరక్షణార్థము కారుచిచ్చుఁ ద్రావెననియు భాగవతము

వ॥ అని పలికి తళుకుటలరుములుకులు చిలుకువలఱేని నుద్దేశించి॥ 111

అనిపలికి = ఇట్లు చెప్పి, తళుకుటలరుములుకులు = మిక్కిలి ప్రకాశించు పూవుబాణములను, చిలుకువలఱేని = ప్రయోగించెడు మన్మథునిని, ఉద్దేశించి = తలఁచి,

క॥ కమలాక్షునికొమరుఁడవై
సుమనోధర్మంబు పూను ♦ మంబ్రవర్తిలియుం
గమలాక్షుల నేఁచెదవొ
మమతమధువ్రతగుణంబు ♦ మానవుమదనా! 112

మదనా = ఓ మన్మథుఁడా! కమలాక్షునికొమరుఁడవై, కమలాక్షుని = విష్ణువు యొక్క (పద్మములం బోలిన కన్నులు గలవాఁడని యర్థము) కొమరుఁడవై = పుత్త్రుఁడవై, సుమనోధర్మంబు = దేవత్వమును, పాండిత్యము ననియు నర్థము పుష్పధనుస్సు నని భావము (ని) సుమనాః పుష్పమాలత్యోః స్త్రియాం దేవే బుధేచనా యనియును, ధర్మోస్త్రీ పుణ్యే సామాన్యభావయోః చాపన్యాయాధ్వరాహింసాయజ్యాచారయమేషునా యనియు నానార్థరత్నమాల పూనుచున్ = ధరించుచున్, ప్రవర్తిలియున్ = ఉండియును, కమలాక్షులన్ = కమలాక్షుని మట్టములను, ( తామరపూ

వులం బోలినకన్నులు గలవారిని నీతండ్రి కమలాక్షుఁడు మేముం గమలాక్షులము. మఱియు నీ వన్నియు నెఱిఁగినవాఁడవు, (నామసామ్యముచె) నీతండ్రిబంధుల మగుమమ్మేల ) ఏఁచెదవు = బాధింతువు, ఔర = ( ఇది ) తగును విపరీతలక్షణచేఁదగదని యర్థము మమతన్ = అభిమానముచేతను, మధువ్రతగుణంబు = మద్యమునందలివ్రతము నగుణమును, త్రాగుడుఁబోతుతనము నని యర్థము తుమ్మెదనారి నని భావము మానవు = విడువవు. అవశ్యము విడువవలయు నని యర్థము

గీ॥ తొలుతఁ గుజనుల నలరించు ♦ చెలిని బంచి
బలము నడవుల విడియించి ♦ పాంథజనుల
మానధనములు గొనుచు దు ♦ ర్మార్గనియతి
నలరుశంబరఘాతి వీ ♦ వబ్జబాణ॥ 113

అబ్జబాణా = ఓమన్మథుఁడా, ఈవు, తొలుతన్ = మొదటను, కుజనులన్ = వృక్షములను ( కు = భూమియందు, జని = ఉత్పత్తి కలది, కుజని దీనిబహువచనము కుజనులు. ) అలరించు చెలిన్ = వికసింపఁజేయుమిత్రునిని ( చైత్రునిని ), పంచి = ఆజ్ఞాపించి కుజనులన్ = దుర్జనులను, అలరించు చెలిన్ = సంతోషపెట్టుమిత్రునిని, పంచి = ఆజ్ఞాపించి, యని యర్థాంతరము బలమున్ = చిలుకలు, కోయిలలు మొదలగు సేనను, సేన యని యర్థాంతరము అడవులన్ = అరణ్యములందున్, విడియించి = ఉండునట్లొనర్చి, పాంథజనులమానధనములు = విరహిజనులమానము లనెడుద్రవ్యములను, మార్గస్థులగౌరవమును ద్రవ్యము నని యర్థాంతరము గొనుచున్ = అపహరించుచున్, దుర్మార్గనియతిన్ = చెడునడవడియందలియేర్పాటుచేతను, అలరుశంబరఘాతివి, అలరు = సంతసించెడు ( ఇది శంబరునకు విశేషణము ) శంబరఘాతివి = శంబరుఁ డనురక్కసుని జంపినవాఁడవు చెడునడవడియందలినియమముచేతను ప్రకాశించెడుకిరాతుఁడ వని యర్థాంతరము శ్లేషచేఁ బ్రాప్తమైన యర్థద్వయమునకు నభేదారోపము చేయఁగా నింద తోఁచును శ్లేషమూలకాతిశయోక్త్యలంకారము

క॥ యుగవిగమజగత్క్షయదం
బగుశర్వానికంటిమంట ♦ నంటి కెరసియు
న్నగుడం బ్రదికితి వీ వ
ధ్వగజనమరితమునఁగాదె ♦ వారిచరాంకా॥ 114

వారిచరాంకా = మన్మథుఁడా! చేఁపగుఱుతు టెక్కెమునం గలవాఁడని యర్థము ఈవు, యుగవిగమ. . .బు, యుగవిగమ = ప్రళయకాలమందున్, జగత్ = లోకమునకు, క్షయదంబు = నాశము గలిగించునట్టిది, అగుశర్వకంటిమంటన్ = అయ్యీశ్వరుని కంటియందలి యగ్నిజ్వాలను, అంటి = తాఁకి, కెడసియున్ = చచ్చియును, అధ్వగ . . .గాదె, అధ్వగజన = విరహిజనులయొక్క, దురితమునఁగాదె = పాపముచేతనే కదా, మగుడన్ = తిరిగి, బ్రదికితివి = జీవించితివి. మున్ను శివుండు హిమాలయంబుకడఁ దపంబు సేయుచుండ దేవతలు బ్రహ్మకడకుం బోయి తారకుండు మిగుల బాధించుచున్నాఁడని మొఱలిడ నాతఁడు శివునకుం బార్వతికి సంయోగంబు గలిగినఁ గుమారుండు పుట్టి వానిం జంపు ననుడు నింద్రుండు మన్మథుని [illegible] యీశుఁ [illegible] బార్వతియం దనురాగము గలిగింపుమని ప్రార్థింప నతఁడు దానికై యత్నించి యీశునికంట నున్న యగ్నిచే దగ్ధుఁడై రతిప్రార్థనంబున ననుగ్రహించిన శివునిచే మరల నుజ్జీవితుం డయ్యె ననుపురాణగాథ యిట గ్రహింపఁబడియె. ఉత్ప్రేక్షాలంకారము.

ఉ॥ శంబరదానవుండు నినుఁ ◆ జౌర్యమునం గొనిపోయి వార్ధిలో
నం బడఁద్రోయ నందొకఝ ◆ షంబగుమీనము మ్రింగ దానిగ
ర్భంబున నప్డు జీర్ణతను ◆ బాటిలినన్ విరహివ్రజంబు లో
కంబునఁ దాపవహ్ని నిటు ◆ గ్రాఁగి కృశింపదుగా మధుప్రియా॥

మధుప్రియా! = ఓమదనుఁడా, (వసంతుని చెలికాఁడా యని యర్థము) మద్యముం బ్రేమ కలవాఁడని ధ్వనించును. శంబరదానవుండు = శంబరుఁడను పేరు గల రక్కసుఁడు, నినున్, చౌర్యమునన్ = దొంగతనముచేతను, కొనిపోయి = తీసికొనివెళ్లి, వార్ధిలోన్ = సముద్రమందున్, పడఁద్రోయన్, అందున్ = ఆసముద్రమునన్, ఒకఝషంబగుమీనము = ఒకగొప్పదియగుచేప, మ్రింగన్ = గ్రసింపఁగాన్, అప్డు = అట్లు మ్రింగినకాలమందున్, దానిగర్భంబునన్ = ఆచేఁపయొక్కకడుపునందున్, జీర్ణతను = అఱుగుటను, పాటిలినన్ = పొందినయెడన్, లోకంబునన్ = ప్రపంచమునందు, విరహివ్రజంబు = ఎడఁబాసిననాయికానాయకులసముదాయము, తాపవహ్నిన్ = అగ్నిం బోలినతాపముచేతను, ఇటు = ఈప్రకారము, క్రాఁగి = బాధనొంది, కృశింపదుగా = క్షీణింపదుగదా. మున్ను శంబరాసురుఁడు మన్మథుఁడు ప్రద్యుమ్నరూపంబునం గృష్ణునివలన రుక్మిణియందుఁ జన్మించి తన్ను సంహరించునని యెఱిఁగి యతనిజన్మము నిరీక్షించి పురిటింట నున్నపుడే వాని నెత్తుకొనిపోయి సముద్రమునం బాఱవైచె ననియు

నతని నొకచేఁప మ్రింగె ననియు నాచేఁప శంబరునింటికే బెస్తలచేఁ గానుకగాఁ గొనిపోఁబడె ననియు నందున్న శిశువు ( మన్మథుఁడు ) సురక్షితుండై జవ్వనంబున రతిచేఁ బ్రబోధితుండై శంబరు సంహరించి ద్వారకం జేరె ననియు భాగవతము.

వ॥ అని పలికి చెంగటం జెంగలువపుప్పొడులఁ జిమ్ముకమ్మదెమ్మెరపై నలిగి. 115

అని పలికి = ఇట్లు మన్మథుని నిందించి, చెంగటన్ = సమీపమందున్, చెంగలువపుప్పొడులన్ = ఎఱ్ఱగలువపుప్పొడులను, చిమ్ముకమ్మదెమ్మెరపైన్ = చిలికెడుపరిమళించుగాలిమీఁదను, అలిగి = కోపించి, దీనికిం గర్త పైవచనములోని భద్రాబాలికారత్నము

క॥ జగమునకుం బ్రాణం బని
పొగడుదు రందఱును నిన్ను ♦ భువిలో హృదయా
శుగ మగుట యెఱుఁగ రిఁక నీ
దగునడువడి యేమి చెప్ప ♦ నగును సమీరా. 116

సమీరా = ఓవాయూ ! భువిలోన్ = భూమియందున్, అందఱును, నిన్నున్, జగమునకున్ = లోకమునకున్, ప్రాణం బని, పొగడుదురు = స్తుతింతురు లోకమెల్ల వాయువువలనఁ బ్రదుకుఁ గాన జగత్ప్రాణుఁ డని వాయువునకుఁ బేరు హృదయాశుగ మగుట = హృదయాశుగ మను పేరు గలుగుటను, ఎఱుఁగరు = తెలియరు. హృదయాశుగము = హృదయమునందు నాటెడుబాణము, లోపల నున్న వాయు వనియు నర్థము జగత్ప్రాణుఁ డని పేరుండుటచే ని న్నెల్లవారు స్తుతింతురు గాని, ఎల్లవారిని బాధించునాశుగ మను పేరు నీకుఁ గల దని యాలోచింపరు ( హృదయాశుగశబ్దమునఁ గలయర్థద్వయమునకు నభేదనిశ్చయముచె నింద గమ్యము. ) ఇఁకన్ = పిమ్మటను, నీదగునడవడి = నీసంచారమును, నీచరిత మనియు నర్థము ఏమి చెప్ప నగున్ = ఏమి చెప్పవచ్చును నీచరితము నింద్య మైన దని యర్థము నీసంచారము చెప్ప నలవిగా దని భావము.

క॥ ఘనతరులకు ఫలభంగం
బొనరించుటచే జనించు ♦ నురుపాపము లె

ల్లను గాలభుజగరూపము
లను నినుఁ గబళించుఁ జంచ ♦ లగుణా పవనా॥ 117

చంచలగుణా = నిలుకడలేనిగుణములు గల, పవనా = ఓ వాయూ! అస్థిర మైనస్వభావము గలవాయువా యని యర్థము ఘనతరులకున్ = గొప్పవృక్షములకును, మిగులగొప్పవారల కని యర్థాంతరము ఫలభంగంబు = పండ్లు రాల్చుటను, కార్యహాని యని యర్థాంతరము. పొనరించుటచేన్ = చేయుటచేతను, జనించునురుపాపము లెల్లన్ = పుట్టినగొప్పపాపము లన్నియును, కాలభుజగరూపములను = నల్లత్రాఁచులయాకారము చేతను, నినున్, కబళించున్ = మ్రింగుచుండును వాయువు పాములకు నాహార మై యుండఁగా నిచట ఘనతరులకు ఫలభంగముచేయుట యనుచోఁ గల్గినయర్థద్వయమునకు నభేదము కల్పించి దానం గల్గినపాపమే భుజంగరూపముం బొంది మ్రింగుచుండె నని యుత్ప్రేక్షించెను.

చ॥ అని హరిణాంకజీవనచ ♦ రాంకసమీరుల దూఱి వారిజా
నన మణిమందిరాంతరము ♦ న న్విరిపాన్పుపయి న్విరాలి నొం
దిన నిదె శౌరిఁ దెత్తు నని ♦ నెచ్చెలి యోర్తు తదాకృతిన్ లిఖిం
చినపటు మీయఁ గూర్మి నది ♦ చేకొని యక్కునఁ జేర్చె ముగ్ధతన్.

అని = ఇట్లు పలికి వారిజానన = పద్మ, హరిణాంక . . .సమీరులన్ హరిణాంక = చంద్రునిని, (లేడిగుఱుతుగాఁ గలవాఁడు) జీవనచరాంక = మన్మథునిని (జీవన = నీటియందు, చర = తిరుగునది = చేఁప అదియే, అంక = (టెక్కెమున) గుఱుతుగాఁ గలవాఁడు) సమీరులన్ = వాయువును, దూఱి = నిందించి, మణిమందిరాంతరంబునన్ = మానికపుటింటిలోన్, విరిపాన్పుపయిన్ = పూలసెజ్జమీఁదను, విరాలి నొందినన్ = వలపువలనిబాధను జెందినన్, ఓర్తు నెచ్చెలి = ఒకానొకసఖురాలు, ఇదె = ఇదిగో, శౌరిన్ = కృష్ణునిని, తెత్తు నని = తీసికొనివత్తు నని, తదాకృతిన్ = ఆకృష్ణునాకారమును, లిఖించినపటము = వ్రాసినచిత్రమును, ఈయన్ = ఈయఁగాన్, కూర్మిన్ = ప్రేమచేతను, అది = ఆపటమును, చేకొని = పుచ్చుకొని, ముగ్ధతన్ = ముద్దరాలితనముచేతను, అక్కునన్ = వక్షమునందున్, చేర్చె = ధరించెను.

వ॥ అనిన శుకయోగీంద్రుం బరీక్షిన్నరేంద్రుం డవ్వలికథ యెఱింగింపు మని యడుగుటయు. (సుగమము)

మ॥ అతులాబ్ధ్యంతిక కాకినాడనగరో ♦ పాంతస్థలస్థాపితా
యతసత్త్రాయతనాదిసంకలితసూ ♦ ర్యారాయపేటాఖ్యభూ
రితరగ్రామనిదానదానపటిమ ♦ వ్రీడాస్పదీభూతక
ల్పతరుక్షీరధిచంద్రచంద్రశకల ♦ భ్రాజద్యశోమండలా॥ 119

అతుల......నిదాన, అతుల = సాటిలేని (ఇది పురవిశేషణము) అబ్ధి = సముద్రముయొక్క, అంతిక = సమీపమునను న్న, కాకినాడనగర = కాకినాడపురమునకు, ఉపాంతస్థల = సమీపస్థలమునందు, స్థాపిత = కట్టింపఁబడిన, ఆయత = విశాలమైన, సత్త్ర = సత్త్రము, (అన్నదానము చేయుగృహము) ఆయతన = దేవాలయము, ఆది = మొదలగువానితో, సంకలిత = కూడుకొనిన, సూర్యారాయపేటాఖ్య = సూర్యారావుపేట యను, భూరితరగ్రామ = మిగులఁ బెద్దది యగుగ్రామమునకు, నిదాన = కారణమా, సముద్రపుటొడ్డున నున్న కాకినాడదగ్గఱ సత్త్రము మొదలగువానితోఁ గూడిన సూర్యారావుపేటను గట్టించినప్రభువా యని యర్థము. దానపటిమ......చంద్ర, దానపటిమ = దానమందలినైపుణ్యముచే, వ్రీడాస్పదీభూత = లజ్జకాస్పదములైన, (లజ్జకాస్పదముగాఁ జేయఁబడిన యని యర్థము) కల్పతరు = దేవవృక్షములును, క్షీరధి = పాలసముద్రమును, చంద్ర = చంద్రుఁడును గలస్వామీ, కల్పతరులు మొదలగునవి దానమునం బ్రసిద్ధములు దానమహిమచే వానికి లజ్జ గలిగించిన ప్రభువా యని భావము చంద్ర.....మండలా, చంద్రశకల = కప్పురపుముక్కలువలె, భ్రాజత్ = విలసిల్లుచున్న యశోమండలా = కీర్తిమండలముగలవాఁడా.

క॥ శూరమహోదారసదా
ధారసుధాసారసహిత ♦ తతవచనఝురీ
వారాశిగభీరానగ
ధీరాసుందరశరీర ♦ దృఢభుజసారా॥ 120

శూర = పరాక్రమశాలీ, మహోదార = గొప్పదాతృఁడా, సదాధార = సజ్జనులకాధారమా, సజ్జనుల రక్షించుప్రభువా యని భావము సుధాసార......ఝురీ, సుధాసార = అమృతసారముతో, సహిత = కూడినదియును, తత = అధికమైనదియును, (అగు) వచనఝురీ = వాక్ప్రవాహముగలవాఁడా, వారాశిగభీరా = సముద్రమువలె గంభీరుఁడా, నగధీరా = పర్వతమువలె ధీరుఁడా, సుందరశరీర = చక్కనిదేహము గలప్రభువా, దృఢభుజసారా = గట్టియైనచేతులబలము గలప్రభువా!

స్రగ్విణీవృత్తము.

శ్రీజగన్నాథకా • శీప్రయాగాదివి
భ్రాజితక్షేత్రయా • త్రాఫలప్రాపితేం
ద్రాజలోకాధివా • సాధికాజస్రని
ర్వ్యాజసౌఖ్యోదయ • స్వాన్వవాయోద్భవా! 121

శ్రీజగన్నాథ......స్వాన్వవాయోద్భవా, శ్రీజగన్నాథ=పురుషోత్తమస్థానము, కాశీ, ప్రయాగ, ఆది = మొదలైన, విభ్రాజిత = ప్రకాశించెడు, క్షేత్ర=పుణ్యస్థలములకు, యాత్రా=పోవుటచేతను, (గల్గిన) ఫల=పుణ్యముచేతను, ప్రాపిత=పొందింపఁబడిన, ఇంద్ర=ఇంద్రునియొక్కయు, అజ=బ్రహ్మయొక్కయు, లోక=(స్వర్గ, సత్య) లోకములయందలి, అధివాస=ఉనికిచేతను, అధిక=ఎక్కువైన, అజస్ర=నిరంతరమైన, నిర్వ్యాజ=కపటములేని, సౌఖ్యోదయ=సుఖాతిశయముగల, స్వాన్వవాయోద్భవా=ఆత్మీయులగువంశస్థులుగలరామరాయప్రభూ! జగన్నాథము మొదలగుపుణ్యస్థలములకుం బోయి యచ్చటఁ బెక్కు లగుసత్కార్యములు చేసి వానివలనఁ గలిగినపుణ్యముచేఁ బ్రాచీను లగువంశస్థుల కింద్రాదిలోకములఁ గల్గించినప్రభువా యని యర్థము.

గద్యము.—ఇది శ్రీమహాభారతీప్రసాదాసాదితకవితామతల్లికా
ల్లమరాజవంశజాపస్తంబసూత్రవదెల్లనార్యపౌత్త్ర
రంగశాయినామార్యపుత్త్ర హారితసగోత్ర
పవిత్ర సుకవిజనవిధేయ సుబ్రహ్మణ్యక
వినామధేయప్రణీతం బైనభద్రాపరిణ
యం బనుమహాప్రబంధంబునందుఁ
దృతీయాశ్వాసము.

శ్రీ ర స్తు

శు భ మ స్తు.

అ వి ఘ్న మ స్తు.

# భ ద్రా ప రి ణ య ము.

## చ తు ర్థా శ్వా స ము.

శ్రీరాజితవిబుధగణవి
హారాంచితపీఠపురవ ♦ రామరనగరీ
చారుసభాభవనసుధ
ర్మారుచిరసురేంద్ర రామ ♦ రాయనరేంద్రా. 1

శ్రీరాజిత......సురేంద్ర, శ్రీ=సంపదచేతను, రాజిత=ప్రకాశింపఁజేయఁబడిన, విబుధగణ = విద్వాంసులనుదేవతాసముదాయముయొక్క, విహార = సంచారముచేతను, అంచిత=పూజింపఁబడిన, పీఠపురవర = శ్రేష్ఠమైనపీఠికాపుర మను, అమరనగరీ=అమరపురము (అమరావతి) యొక్క, చారు=సుందరమైన, సభాభవన=సభాగృహ మనెడు (కచ్చేరి) సుధర్మా=ఇంద్రసభను, (ని) స్యాత్సుధర్మా దేవసభా. అ రుచిర=మనోహరుఁ డగు, సురేంద్ర=ఇంద్రుఁడా, రామరాయనరేంద్రా=ఓరామరాయప్రభూ! ముందుపద్యముతో నన్వయము

గీ॥ అవధరింపుము శౌరిభ ♦ వ్యచరితంబు
తొల్లి సూతుండు శౌనకా ♦ దులకుఁ జెప్పి 8
నట్టిరీతిఁ బరిక్షిద్ధ ♦ రాధినాథ
తిలకమున కిట్లు శుకయోగి ♦ దెలు

భర్తనోఁ, శూ -శ్రీమపడె, నిద్రించిన ంచెను. ఒగిన్ = క్రమము

తొల్లి=పూర్వము, సూతుండు, శౌనకాదులకు

కారముచేతను, శౌరిభవ్యచరితంబు = కృష్ణునిశుభమైనచరిత్రమును, అవధరింపుము = చిత్తగింపుము. శుకయోగి, పరిక్షిద్ధరాధినాథతిలకమునకున్ = పరిక్షీతుఁ డనురాజశ్రేష్ఠునకున్, ఇట్లు, తెలుపఁదొడఁగెన్ = చెప్పుటకు నారంభించెను. ( ముందు శౌరిభవ్యచరితంబు చిత్తగింపు మని వ్రాసి పిమ్మటఁ దొల్లి సూతుండు చెప్పినరీతినే శుకయోగి పరిక్షిన్మహారాజున కిట్లు చెప్పఁదొడఁగె నని యేని యన్వయింపఁదగును. )

క॥ అటు లంతఃపురగృహమునఁ
బటుతరవిరహాభర ముూను ♦ బాలామణి ము
చ్చటల న్నెచ్చెలు లపు డ
చ్చట నూరార్పఁగఁ బ్రభాత ♦ సమయం బయ్యెన్॥ 3

అటులు = వెనుకటియాశ్వాసాంతమునఁ జెప్పినప్రకారముగాన్, అంతఃపురగృహమునన్ = అంతిపురములోనియొకయింటియందున్, పటుతరవిరహాభరము = అధికమైనవియోగ మను ( ఎడఁబాటను ) బరువును, ఊనుబాలామణిన్ = ధరించినబాలికాశ్రేష్ఠమును, ( భద్రను ) నెచ్చెలులు = సఖురాండ్రు, అచ్చటన్ = ఆయమ యున్నస్థలమునందున్, ముచ్చటలన్ = మంచిమాటలచేతను, ఊరార్పఁగన్ = ఊఱడింపఁగాన్, అపుడు, ప్రభాతసమయము = సూర్యోదయకాలము, అయ్యెన్

సీ॥ కాలజ్ఞతను రథాం ♦ గములకు రవిరాకఁ
దెలుప నాఁ గృకవాకు ♦ లెలమి మ్రోసెఁ
దనరాక నినుఁడు ప ♦ ద్మినికిఁ జెప్పఁగఁ బంపు
శుభదూత యన వేగుఁ ♦ జుక్క పొడిచెఁ
దపనుండు నిజసంప ♦ దలు గొను నను భీతి
నన దీపికలు వెల్ల ♦ నై వడంకె
వరుణదిశతుఱ్ఱిట ♦ ద్వారుణాస్తనహార
మండనం బన సుధాం ♦ శుండు గ్రుంకెఁ
గ నరుగుదెంచుకమలబాం ♦ ధవుని మేటి
కను గనుపట్టు ♦ తెల్లపట్టు

తెక్కియపుఁజాయ యనఁగఁ బెం • పెక్కి ప్రాచి
నల్లనల్లనఁ దొలివెల్ల • తెల్లమయ్యె॥ 4

కృకవాకులు=కోళ్లు, (ని / కృకవాకు స్తామ్రచూడ యని యమరుఁడు.) కాలజ్ఞతన్ = కాలము తెలియుఁగుటచేతను, రథాంగములకున్ = చక్రవాకములకున్, రవిరాకన్ = సూర్యునిరాగమనమును, తెలుపనాన్ = తెలుపుటకో యనునట్లు, ఎలమిన్ = సంతసముతోన్, మ్రోసెన్ = ధ్వనించెను సూర్యోదయకాలమందుఁ గోళ్లు కూయుట సహజమై యుండఁగ సూర్యునిరాకం దెలుప్రటకో యనునట్లు కూసె నని చెప్పుటచే నుత్ప్రేక్షాలంకారము. ముందు పాదములయందు నిట్లే యీయలంకారము గ్రహింపవలెను. ఇనుఁడు=సూర్యుఁడు, (భర్త యనియు ధ్వనించును) తనరాకన్ = తన వచ్చుటను, పద్మినికిన్ = పద్మలతకున్, (పద్మినిజాతిస్త్రీ యగుభార్య కనియు ధ్వనించును.) చెప్పఁగన్ = తెలియఁజేయుటకై, పంపుశుభదూతయనన్ = పంపించినమేలువార్తఁ జెప్పురాయబారి యనునట్లు, రాయబారి వలె నని యర్థము వేగుఁజుక్క = శుక్రుఁడు, పొడిచెన్ = ఉదయించెను. తపనుండు = సూర్యుఁడు, నిజసంపదలు = తమవి (దీపములవి) యగుభాగ్యములను, దీపములకాంత్యతిశయము నని యర్థము. కొనువనఁ భీతి నన్ = అపహరించు ననుభయముచేతనో యనునట్లు, దీపికలు = దీపములు, వెల్లనై = కాంతి లేనివై, వడంకెన్ = గజగజ వడఁకెను. సూర్యోదయము సమీపించుటచేతనును, ప్రాతఃకాలమునఁ జల్లగాలి వీచుటచేతనును దీపములు వడఁకుచుండె నని భావము. వరుణ... మండనం బనన్, వరుణ = వరుణదేవునియొక్క, రతి = సంయోగకాలమున, త్రుటత్ = తెగిపోవుచున్న, వారుణీస్తన = వరుణదేవునిభార్యయొక్క స్తనములందలి, హీరమండనం బనన్ = వజ్రములభూషణమో యనునట్లు, సుధాంశుఁడు = చంద్రుఁడు, కుంకెన్ = అస్తమించెను. త్వరన్ = వేగముతోన్, అరుగు......మీఁదను, అరుగుదెంచు = వచ్చెడు, కమలబాంధవుని = సూర్యునియొక్క, మేటి = గొ దియగు, తేరిమీఁదను = రథముమీఁదను, కనుపట్టుతెల్లపట్టు తెక్కియపుఁజా
యనఁగన్ = కానుపించెడు తెల్లనిచాయ గలపట్టుగడ్డజెండాయొక్క కాంతియనఁ
బెంపెక్కి = అధికమై, ప్రాచిన్ = తూర్పుదెసయందున్, అల్ల

గాన్, తొలివెల్ల = మొదటఁగాన్పించుతెలుపు, తెల్లమయ్యెను॥ 8

ర్పసం దెల్లవారె నని యర్థము

చ॥ అలవిరహివ్రజంబుల న • నంగుఁడు ... ను, అలసి = శ్రమపడి, నిద్రించిన యునితోన్ = భర్తతోన్, కూ
కలితనిజాశుగప్రతతిఁ • గ్రమ్మఱి ... వన్ = ముకుళించెను. ఒగిన్ = క్రమము

గలసి రతాంతతాంతలగు ♦ కాంతలకన్నులకెంపు రాజిలెం
జలువ వహించెఁదెమ్మెరయుఁ ♦ జానలచన్గవలందు హారముల్॥ 5

అనంగుఁడు = మన్మథుఁడు, అలవిరహివ్రజంబులన్ = ప్రసిద్ధ మగువియోగిసము దాయములను, గెల్చి = జయించి, తదస్రి ... ప్రతతిన్, తత్ = ఆవియోగులయొక్క, అస్ర = రక్తమనెడు, పంక = బురదతోన్, సంకలిత = కూడిన, నిజ = తనవి యగు, ఆశుగ = బాణములయొక్క, ప్రతతిన్ = సమూహమును, క్రమ్మఱన్ = మఱలన్, ఇరిదులన్ = ఈస్థలములందున్, (ఆఁడువారియందున్,) గాఁచె నాన్ = దాఁపఁబెట్టె ము చేసెనో యనునట్లు, ప్రియున్ = భర్తను, కలసి = కూడి, రతాంతతాంతలు, రతాంత = సంభోగాంతమునందున్, తాంతలు = అలసినవారు, అగుకాంతలకన్నులకెంపు = అగువాఁడువారికన్నులయందలియెఱ్ఱఁదనము, (ఎఱ్ఱనికన్నులని యర్థము) రాజిలెన్ = ప్రకాశించెను. తెమ్మెరయున్ = (ప్రాతఃకాలపు) గాలియును, చానలచన్గవలందున్ = స్త్రీలచనుజంటలయందున్, హారముల్ = ముత్యాలదండలును, చలువ = శైత్యమును, వహించెన్ = ధరించెను. సంభోగమువలనిజాగరమువలన నెఱ్ఱనివి యైన స్త్రీలనేత్రములు మన్మథుఁడు వియోగులను సంహరించి వారియొద్ద దాఁచినరక్తముతో నుండినబాణములువలె నుండె ననియుత్ప్రేక్ష. ఇందు, "కన్నులకెంప" నుపదమును గెంపుఁగన్ను లనుటకు మాఱుగా నుపయోగించినట్లు తోఁచెడిని అట్లయిన నే యాశుగోపమానము దీనికి సరిపడును. కాని యిట్టిసమాసము దుర్లభముగాఁ గా న్పించును గాన "కెంపుఁగనుల్ విరాజిలెన్" అనిపాఠముండిన బాగుగనుండు నని తోఁచును.

శ్రీ ఉదయనగాగ్రవేదిపయి ♦ నుజ్జ్వలకల్యవరుండు సంభ్రమం
బు ద్విజావళీశ్రుతిహి ♦ తోక్తి శుభస్వనముల్ సెలంగఁ బ్రా
క్కంఠమునఁ ♦ గట్టినకాంచనపద్మరాగసం
గాళిబొట్టనఁగ ♦ భాస్కరబింబము దోఁచెఁ దూర్పునన్॥

వరుణారితిల, ఉజ్జ్వల = ప్రకాశించెడు, కల్య = ప్రాతఃకాల మనెడు, మంచి గాత్రిత్వ్రాషోహార్యమ్ఖంకల్యం అ ఉదయనగాగ్రవేది క నరుగు దెపెళ్లియరఁగుమీఁదను, సంభ్రమంబు = సంతసము, కను గన్నుతోక్తి శుభస్వనముల్ = ద్విజావళీ = (శుకములు

మొదలగు) పక్షిసముదాయ మనెడుబ్రాహ్మణసముదాయముయొక్క, (ని) దంతవిప్రాండజాద్విజాః. అ. శ్రుతిహితోక్తి = చెవులకింపు లగుపలుకు లనెడువేదవాక్యములయొక్క, శుభస్వనముల్ = మనోహరమైనధ్వనులనెడుమంగళధ్వనులు, శ్లిష్టరూపకము. చెలంగన్ = ప్రకాశింపఁగాన్, ప్రాక్సదమలకన్యకంఠమునన్ = తూర్పుదిక్కనెడునిర్మలయైనకన్యయొక్క మెడయందున్, కట్టిఁ... ..సంపదన్, కట్టిన = కట్టినట్టి, కాంచనపద్మరాగసంపదన్ = బంగారముయొక్కయుఁ బద్మరాగముయొక్కయు శోభతోన్, తగుతాళిబొట్టనఁగన్ = ప్రకాశించుమంగళసూత్రమందలిస్వర్ణాభరణమో యనునట్లు, భాస్కరబింబము = సూర్యమండలము, తూర్పునన్ = తూర్పుదిక్కునందన్, తోఁచెన్ = ఉదయించెను రూపకానుప్రాణితోత్ప్రేక్షాలంకారము.

క॥ ఇనుఁడు వియల్లక్ష్మిఁ గవయఁ
జనుదెంచె న్మనకు నిపు డి ♦ చట నుండంగాఁ
బనిలే దనుచుఁ దదాళీ
జన మల్లన నరిగె ననఁగ ♦ జరిగెం జుక్కల్॥ 7

ఇనుఁడు = సూర్యుఁడు, భర్తయనియుధ్వనించును. వియల్లక్ష్మిన్ = ఆకాశలక్ష్మిని కవయన్ = కూడుటకు, చనుదెంచెన్ = వచ్చెను ఇపుడు = ఈకాలమునందన్, ఇచటన్ = ఈస్థలమునందన్, మనకున్ = మన మనియర్థము. ఉండంగాన్ = ఉండుటకు, పనిలేదనుచున్, తదాళీజనము = ఆకాశలక్ష్మియొక్క చెలికత్తెలు, అల్లనన్ = క్రమముతోన్, అరిగెననఁగన్ = వెళ్లెనో యనునట్లు. చుక్కల్ = తారలు, జరిగెన్ = అస్తమించెను. ఉత్ప్రేక్షాలంకారము ఇం దినశబ్దస్వారస్యముచేతను వియల్లక్ష్మీశబ్దస్వారస్యముచేతను నాయికానాయకవ్యవహారము గమ్యము.

గీ॥ ప్రియునితోఁ గూర్మి రేయెల్లఁ ♦ గ్రీడసల్పి
యలసి నిద్రించె ననఁ గలు ♦ వలు మొగిడ్చె
నొగి నినకరాళిగిలిగింత ♦ దగిలి పద్మి
నీతతులు నవ్వె నన విచ్చె ♦ నీరజములు॥ 8

కలువలు, రేయెల్లన్ = రాత్రియంతయును, ప్రియునితోన్ = భర్తతోన్, కూర్మిన్ = ప్రేమచేతను, క్రీడసల్పన్ = క్రీడించుటచేతను, అలసి = శ్రమపడి, నిద్రించెనన్ = నిద్రపొందెనో యనునట్లు, మొగిడ్చెన్ = ముకుళించెను. ఒగిన్ = క్రమము

గాన్, ఇనకరాళిగిలిగింత = సూర్యుఁడనుభర్తయొక్క కిరణములను చేతులవలని చక్కిలిగింతను, తగిలి = పొంది, పద్మినీతతులు = పద్మలతాసమూహము లను పద్మినీజాతిస్త్రీలు, నవ్వెననన్ = నవ్వుచూయనునట్లు, నీరజములు = పద్మములు, విచ్చెన్ = వికసించెను. శ్లిష్టరూపకానుప్రాణితోత్ప్రేక్షాలంకారము. సూర్యోదయమగుటచేఁ గలువలు మొగిడె ననియుఁ బద్మములు వికసించె ననియు భావము.

క॥ మక్కువ వలర నక్కున నిడి
చెక్కులతోఁ గాఁగిలించు ♦ చెలికి ముద్దుల్
గ్రక్కునఁ దనముక్కున నిడి
జక్కవకవ గూడె నొక్క ♦ జలజపుఁ డెంకిన్॥ 9

ఒక్క జలజపుఁ డెంకిన్ = ఒక్క తామరపూలు గలకొలనియందున్, జక్కవ = ఒకచక్రవాకాంగన, మక్కువ = ప్రేమము, అలరన్ = ప్రకాశింపఁగాన్, అక్కునన్ = ఱొమ్మునందున్, ఇడి = ఉంచుకొని, చెక్కులతోన్, కాఁగిలించు చెలికిన్ = కాఁగిలించుకొనెడు మగనికిన్, ముద్దుల్ = ముద్దులను, ముక్కునన్ = ముక్కుతోన్, ఇడి = ఇచ్చి, కవగూడెన్ = జతగూడెను కలసికొనె నని యర్థము ఇందు వృత్త్యనుప్రాసము శబ్దాలంకారము.

చ॥ ఒకపొలయల్కచేఁ గలయ ♦ నొల్లక పంతము లాడి గుట్టు వ
చ్చక తటితీపుఁజూపులనె ♦ జాగొనరించి పిఱుందఁ గూడి కూ
రుకు గనినట్టిదంపతుల ♦ రూఢిగ మేల్కొలుపం దలంచె నా
శుకపికశారికల్ పలుకఁ ♦ జొచ్చె గృహాంతరపంజరంబులన్॥ 10

ఒకపొలయల్కచేన్ = ఒకానొకప్రణయకలహముచేతను, (నాయికానాయకుల కొండొరులయాజ్ఞ నతిక్రమించుట మొదలగువానిచేఁ గల్గుకోపము పొలయల్క యనంబడు.) పంతములాడి = పట్టుదలమాటల నాడికొని, కలయన్ = కూడుటకు, ఒల్లక = అంగీకరింపక, గుట్టు = కిటుకును (లోపల నున్న యభిలాషము నని యర్థము.) వచ్చక = వెలిపలికిం దెలియనీయక, కలియవలె నన్న యభిలాష మున్న నభిమానముచేఁ దెలియనీయక యని యర్థము. తటితీపుఁజూపులనె = ఉపేక్షం దెలియజేయుచూపుల చేతనే, జాగొనరించి = ఆలస్యముచేసి, పిఱుందన్ = తరువాతికాలమందున్, కోపము శాంతించినతరువాత నని యర్థము. కూడి = కలసి, కూరుకు గనినట్టిదంపతులను, కూ

కుసు=నిద్రను, కనిఁట్టిదంపతులకా=పొందినభార్యాభర్తలను, మేల్కొలుపన్=నిద్ర నుండిలేపుటకుఁ, తలంచెనాఁ=తలఁచికొనెనో యనునట్లు, శుకపికశారికల్=చిలుకలు, కోయిలలు, గోరంకలును, గృహాంతరపంజరంబులన్=ఇండ్లలోనిపంజరములందుఁ, రూఢిగఁ=స్పష్టముగాన్, పలుకఁజొచ్చెన్=కూయుట కారంభించెను. సూర్యోదయకాలమం దెల్లపక్షులు గూయుట సహజమై యుండ నిందుఁ బ్రణయకలహముచే మొదటఁ గూడక తరువాతఁ గలసి పిమ్మట నిద్రించుటచే సూర్యోదయకాలము నను మేల్కొనినిదంపతుల మేల్కొల్పుటకుఁ దలఁచినవి వలెఁ బెంపుడుచిలుకలు మొదలగునవి గూయఁజొచ్చె నని యుత్ప్రేక్షించెను. చిలుకలను గోరంకలను బంజరములనుంచి పెంచుట గలదు గాని కోయిల నట్లు చేయుట యప్రసిద్ధము కావున నవి యుఁ బంజరములనుండి కూయునట్లు చెప్పుట చింత్యము.

ఉ॥ రాతిరి చంద్రికాంతి తిమి ♦ రంబుల గీటడఁగింపఁ దచ్ఛిశు
వ్రాతము లబ్జకోశవివ ♦ రంబుల డాఁగి భయాప్తి నాత్మరూ
పాతిశయంబు మాని యిత ♦ రాకృతి దైకొనెనో యనఁ సరో
జాతరజఃపిశంగతను ♦ సంగతిఁ బొల్చి మెలంగె భృంగముల్॥ 11

రాతిరి=రాత్రికాలమునను, చంద్రకాంతి=వెన్నెల, తిమిరంబులన్=చీఁకటులను, గీటడఁగింపఁ=హింసింపఁగాఁ, తచ్ఛిశువ్రాతము, తత్=ఆచీఁకటులయొక్క, శిశువ్రాతము=పిల్లలసమూహము, భయాప్తిన్=భయముగలుగుటచేతను, అబ్జకోశవివరంబులఁ=తామరమొగ్గలగర్భములందుఁ, డాఁగి=దాఁగి, ఆత్మరూపాతిశయంబు=తమయొక్కరూపాధిక్యమును, (తమరూపము నని యర్థము) మాని=విడచి, ఇతరాకృతి=మారువేషములను, దైకొనెనో యనన్=ధరించెనో యనునట్లు, (పగవారికి జడిసినవారు మాఱువేసముతో సంచరించుట లోకప్రసిద్ధము.) భృంగముల్=తుమ్మెదలు, సరోజాత.....సంగతిఁ, సరోజాత=తామరపూవులసంబంధమైన, రజః=పుప్పొడిచేతను, పిశంగ=పచ్చనివర్ణము గల, తనుసంగతిఁ=శరీరసంబంధముచేతను, పొల్చి=ప్రకాశించి, మెలంగెఁ=సంచరించెను. సూర్యాస్తమయకాలమున మరందపానముచేయఁ బద్మములందుఁ బ్రవేశించి రే యెల్ల నందుండి యందలిపుప్పొడి గాత్రమున నంటుటచేఁ బచ్చనివియై యుదయము వెడలుతుమ్మెదలు రాత్రివెన్నెల చీఁకటిని బట్టి బాధింపఁగా నది తమ్ముఁను బాధించు ననుభయమునఁ దామరలలో డాఁగి పిమ్మట మాఱువేషముల ధరించి సంచరించుచీఁకటిశిశువులుంబోలె నుండె నని భావము. ఉత్ప్రేక్షాలంకారము.

సీ॥ ఈరీతి నిజవిభా ♦ పూరితాఖిలదిశా
మండలుం డగుచు భా ♦ నుండు దోఁప
నపుడు వైతాళికా ♦ ఖ్యాతమంగళగీత
కలన మేల్కాంచి కే ♦ కయవిభుండు
తత్సమయార్హకృ ♦ త్యములు నిర్వర్తించి
గురుమంత్రిమిత్రాది ♦ పరివృతముగ
నాస్థానిఁ గొలువుండి ♦ యదువల్లభుని సేమ
మరయ సంతర్దను ♦ నాత్మసూనుఁ
బనిచి శోభనవస్తుసం ♦ భార మెల్ల
విడిదిగృహముల సమకూర్ప ♦ వివిధజనము
నందు నియమించి పురమును ♦ నంతిపుర మ
లంకరింపఁగఁ గూటపా ♦ లకుల ననిచె॥ 12

భాముండు=సూర్యుఁడు, ఈరీతిన్=పైనిజెప్పినరీతిచేతను, నిజ......మండలుఁడు, నిజ=తనదియగు, విభా=కాంతిచేతను, పూరిత=నింపఁబడిన, అఖిలదిశా=అన్నిదిక్కులయొక్క, మండలుండు=సముదాయముగలవాఁడు, అగుచున్, తోఁపన్=ఉదయింపఁగాన్, అపుడు=ఆకాలమున కేకయవిభుండు=కేకయరాజు, వైతాళికా..... కలనన్, వైతాళిక=మేలుకొలుపువారిచేతను, (మంగళగీతములం బాడుచు సూర్యోదయమునకు మున్న రాజుల మేల్కొలుపువారు వైతాళికులు) (ని) వైతాళికా బోధకరాః. అ ఆఖ్యాత=గానముచేయఁబడిన, మంగళగీత=శుభముం దెలుపుపాటలయొక్క, కలనన్=వినికిచేతను, మేల్కాంచి, తత్సమయార్హకృత్యములు=ఆకాలమునకుం దగినపనులను, (అపుడు చేయవలసినపనుల నని యర్థము.) నిర్వర్తించి=చేసి, ఆస్థానిన్=సభయందున్, గురుమంత్రిమిత్రాదిపరివృతముగన్=పురోహితులతోడను మంత్రులతోడను నెయ్యురతోడను, నావరింపఁబడునట్లు, మంత్రులు మొదలగువారితోఁ గూడునట్లుగా నని యర్థము. కొలువుండి=సభచేసి, ఆత్మసూనున్=తనకొమరుని, సంతర్దనున్=సంతర్దనుఁ డనుపేరు గలవానిని, యదువల్లభుని సేమము=కృష్ణునిక్షేమమును, అరయన్=తెలిసికొనుటకున్, పనిచి=ఆజ్ఞాపించి, శోభనవస్తుసంభారము=శుభమైనవస్తుసముదాయమును, ఎల్లన్=అంతయును, గృహాము

నకుం దగినవస్తుసామగ్రి యని యర్థము. విడిదిగృహములన్ = పెండ్లివారుండునిండ్లయందుఁ, సమకూర్పన్ = సంఘటించుటకున్, వివిధజనమున్ = పెక్కుతెఱంగులవారిని, అందన్ = ఆవస్తువులు సంపాదించుటకు, నియమించి = ఏర్పఱచి, పురమును = పట్టణమును, అంతిపురము = అంతఃపురమును, అలంకరింపఁగన్ = అలంకరించుటకు, కూటపాలకులన్ = ద్వారపాలకులను, ఇంటికావలివారి ననియేని యర్థము. అనిచెన్ = ఆజ్ఞాపించెను.

వ॥ ఇట్లు నియోగించిన వార లాసమయమున (సుగమము.)

సీ॥ అపరంజినీట నూ ♦ త్నపుఁజాయఁ దేర్చిరి
కోటకొమ్మల హర్మ్య ♦ కూటములను
గలయఁ బన్నీటిచేఁ ♦ గలయంపి చల్లిరి
రాజమార్గాంగణ ♦ రంగములను
గనకాంబరపుఁబతా ♦ కలు నిల్పి రున్నత
ప్రాసాదగోపురో ♦ పరితటులను
గస్తూరికాగరు ♦ కర్దమద్రవముల
నలికిరి కేళికా ♦ నిలయములను
నెల్లెడల ముత్తియపుముగ్గు ♦ లుల్లసిల్లఁ
గదళికాక్రముకస్తంభ ♦ కలితనలద
కాయమానహరిన్మణీ ♦ ఖచితతోర
ణములు వన్నిరి ద్వారభా ♦ గములగముల. 13

కోటకొమ్మలన్ = బురుజులందును, హర్మ్యకూటములను = మేడలయందును, (సభా)గృహములందును, అపరంజినీటన్ = బంగారునీటిచేతను, కరఁగినబంగారుపూఁతచేత నని యర్థము నూత్నపుఁజాయన్ = క్రొత్తకాంతిని, తేర్చిరి = కలిగించిరి. దీనికి నిందున్న యితరక్రియలకును మీఁదటివచనమున నున్న 'వారలు' కర్తలు. రాజమార్గాంగణరంగములను = పెద్దబాటలతుదు సంగడివీథులయందును, పన్నీటిచేన్ = మంచునీటిచేతను, కలయన్ = అంతటను, కలయంపి = దుమ్మణఁగుటకై చల్లునీటిని, చల్లిరి. దుమ్మణఁగునట్లు చల్లగ నుండునట్లు పన్నీరే వీథులందుఁ జల్లి రని యర్థము. ఉన్నత

......తటులను, ఉన్నత=ఎత్తైన, ప్రాసాద=రాజగృహములయు, గోపుర = పెద్ద వాకిళ్లయు, ఉపరితటులన్ = మీఁదిప్రదేశములందున్, కనకాంబరపుఁబతాకలు=బంగారుపసిఁడివస్త్రము గలజెండాలను, నిల్పిరి; కేళికానిలయములను =క్రీడాగృహములను, ఆటలాడుకొనుటకైనిర్మింపఁబడినగృహముల నని యర్థము కస్తూరికాగరుకర్దమద్రవములన్=కస్తురియొక్కయు అగురుయొక్కయు బురదతడిచేతను, అలికిరి; ఎల్లెడలన్ = అన్నిస్థలములయందును, ముత్తియపుముగ్గులు=ముత్యాలముగ్గులు, ఉల్లసిల్లన్ =ప్రకాశింపగాన్, కదళికా......తోరణములు, కదళికా=అనఁటులయొక్కయు,క్రముక = పోఁకలయొక్కయు, స్తంభ=కంబములతోడను, కలిత=పొందఁబడిన, ( నిర్మింపఁబడిన యని యర్థము. ) నలదకాయమాన=వట్టివేళ్లపందిరులును, హరిన్మణీఖచితతోరణములు= గారుత్మతమణులతో ( గరుడపచ్చలతో ) నిర్మింపఁబడినతోరణములును, ద్వారభాగములగములన్ =గుమ్మములసమూహములందున్, పన్నిరి=నిర్మించిరి.

లయగ్రాహి.

లీల గృహలక్ష్మిగళ ♦ మాలిక లనం దనరు
పోలికలఁ గ్రాలుమణి ♦ డోలికలకీవిన్
బాలికలమొత్తముల ♦ కేలికలనం బెళుకు
వాలికలదృగ్జలజ ♦ పాళికలరేవన్
మేలగుకపోతకుల ♦ పాలికల వ్రాలినమ
రాళికల నోలిఁ దగు ♦ శాలికలవన్నెన్
హేళికలనాంచితమ ♦ దాళికచ లాడువచ
నాళికలనాదములఁ ♦ బ్రోలికళ మించెన్. 14

లీలన్ =విలాసముతోన్, గృహలక్ష్మిగళమాలికలనన్ =గృహములయందుండు లక్ష్మియొక్క మెడలోనిదండ లనునట్లు, తనరుపోలికలన్ = ఒప్పెడుపోలికలచేతన్, క్రాలుమణిడోలికలకీవిన్ =ప్రకాశించు మాణిక్యపుటుయ్యేలలవైభవముచేతను, బాలికలమొత్తములకేలికలనన్, బాలికలమొత్తముల=స్త్రీసముదాయముయొక్క, కేలికలనన్ =ఆటలాడుటచేతను, బెళుకు......రేవన్, బెళుకు = తళతళలాడెడు, వాలికల=దీర్ఘములైన ( సోఁగలైన ) దృగ్జలజ=పద్మములంబోలిన, కన్నులయొక్కపాళికల=సముదయముయొక్క, రేవన్ = చక్కఁదనముచేతను, మేలగు......పాలికలన్

మేలగు = ప్రశస్తమైన, కపోతకులపాలికలన్ = కపోతపాలికలయందున్, చూరుపట్టె లయొద్దఁ బత్తు లుండుట కేర్పఱిచినగూండ్లు కపోతపాలికలనంబడు. మేడలు మొద లగువిహారస్థానములయందుఁ బత్తు లుండెడుచతురస్రములైనగూండ్లు గలస్తంభములును గపోతపాలిక లనంబడు. వ్రాలినమరాళికలన్ = వ్రాలినహంసలచేతనును, ఓలిన్ = క్రమముతోన్, తగుశాలికలవన్నెన్ = ఒప్పెడుగోరంకలయొక్క కాంతిచేతనును, కేళికల......కచలు, కేళికలన = ఆటలాడుటచేతను, అంచిత = ఒప్పుచున్న, మదాళికచ లు = యువతులు, (మదించినతుమ్మెదలం బోలినకేశపాశములు గలవారు) ఆడువని శాళికలనాదములన్, ఆడు = పల్కెడు, వచనాళి = వాక్యసముదాయముయొక్క, కలనాదములన్ = సుందరమైనధ్వనులచేతనును, ప్రోలికళ = పట్టణపుశోభ, మించెన్ = అతిశయించెను.

మ. వనజాక్షుండు ప్రభాతకృత్యములు ని◆ర్వర్తించి యా కేళికా
వనసౌధాంతరసీమ సాత్యకిముఖా◆ప్తశ్రేణితోఁ గొల్వు దీ
ర్చిన సంతర్దనుఁ డేగుదెంచి నియతిం◆జేమోడ్చ నర్ధాసనం
బునఁ దా నాతని నుంచి మంచిసరసం◆పుంబల్కులన్ దన్పఁగన్.

వనజాక్షుండు = కృష్ణుఁడు, ప్రభాతకృత్యములు = ప్రాతఃకాలమునం జేయువ లయుపనులను, నిర్వర్తించి = చేసి, ఆకేళికావనసౌధాంతరసీమన్ = మీఁదఁ జెప్పిన యుద్యానవనమందలి మేడలోపలిప్రదేశమందున్, సాత్యకిముఖాప్తశ్రేణితోన్ = సాత్యకి మొదలగుబంధుసముదాయముతోన్, కొల్వుదీర్చినన్ = సభ చేయఁగాన్, సభయం దుండఁగా నని యర్థము. సంతర్దనుఁడు, ఏగుదెంచి = వచ్చి, నియతిన్ = విధేయత తోన్, చేమోడ్పన్ = నమస్కరింపఁగాన్, తాను = కృష్ణుఁడు, ఆతనిన్ = సంతర్దనుని, అర్ధాసనంబునన్ = తాను గూర్చున్న పీఠమందలిభాగమునన్, ఉంచి = నిల్పి, మంచిస రసంపుంబల్కులన్ = మృదువులును మనోహరములు నగుమాటలచేతను, తన్పఁగన్ = తృప్తిచేయఁగాన్, ముందుపద్యముతో నన్వయము

సీ॥ రమణీయఘుసృణభా◆సమజటాపటలంబు
కొమరు కెంజిగురుజొం◆పముగ వఱలఁ
జలదకృష్ణమాలికాం◆గుళినఖంబులు భ్రమ
ద్భ్రమరాళిదళకోర◆కము లయి తగ

బాహావిపంచికా ♦ పంచమస్వరము శా
ఖలను గోకిల గూయు ♦ కరణి నొనర
శేషాహిరుచి హాసిం ♦ చెడిశరీరచ్ఛాయ
యమితప్రకాండపాం ♦ డిమము గాఁగ
నవ్యరసపూర్ణమణికమం ♦ డలువు పక్వ
ఫలముగతిఁ దోఁప దివినుండి ♦ యిలకు డిగ్గు
కల్పతరువో యనఁగ వచ్చెఁ ♦ గాంతిజితక
నచ్ఛరన్నారదుం డగు ♦ నారదుండు. 16

రమణీయ......కొమరు, రమణీయ=మనోహరమైన, ఘుసృణ=కుంకుమయొక్క, భా=కాంతితో, సమ=తుల్యమైన, జటాపటలంబు=జడలసముదాయముయొక్క, కొమరు=చక్కఁదనము, (కాంతి) కెంజిగురుజొంపముగన్=ఎఱ్ఱనిచిగుళ్లసముదాయముగాను, వఱలన్=ప్రకాశింపఁగాన్, చలదక్ష......లు, చలత్=కదలుచున్న, అక్షమాలికా=(జపమునకై చేతంబూనిన) రుద్రాక్షలదండయును, అంగుళి=వ్రేళ్లును, నఖాంబులు=గోళ్లును, భ్రమ......కోరకములు, భ్రమత్=తిరుగుచున్న, భ్రమర=తుమ్మెదలయొక్క, ఆళి=సముదాయమును, దళ=ఆకులును, కోరకములు=మొగ్గలును, అయి తగన్=అయి ప్రకాశింపఁగాన్, రుద్రాక్షలు తుమ్మెదలువలెను వ్రేళ్లు చిగురాకులువలెను గోళ్లు మొగ్గలువలెను బ్రకాశింపఁగా నని భావము బాహా......స్వరము, బాహా=చేతియందలి, విపంచికా=వీణయొక్క, పంచమస్వరము=పంచమధ్వని, శాఖలను=కొమ్మలందున్, కోకిలగూయుకరణిన్=కోకిల గూయువిధము చేతను, ఒనరన్=ప్రకాశింపఁగాన్, శేషాహిరుచిన్=శేషుఁ డనుపాఁపతెలికాంతిని, హసించెడిశరీరచ్ఛాయ=ఎగతాళిచేసెడుదేహకాంతి, అమిత ....ము, అమిత=మితములేని, ప్రకాండ=చెట్టుమొదటిభాగమందలి, పాండిమము=తెలుపు, కాఁగన్, (స) అత్రి ప్రకాండః స్కంధ స్స్యా న్మూలా చ్ఛాఖావధే స్తరోః అ. నవ్య......వు, నవ్య=నూతనమైన, రస=జలముతోడను, పూర్ణ=నిండిన, మణికమండలువు=మాణిక్యపుఁగుండిక, పక్వఫలముగతిన్=పండినపండుయొక్కరీతిచేతను, తోఁపన్=కాన్పింపఁగాన్, దివినుండి=స్వర్గలోకమునుండి, ఇలకున్=భూమికిన్, డిగ్గుకల్పతరువో యనఁగన్=దిగియెడుకల్పవృక్షమో యనునట్లు, కల్పవృక్షమువలె నని యర్థము.

కాంతి......దుండు, కాంతి = (తన) తేజముచేతను, జిత = ఓడింపఁబడిన, కవత్ = పరిహాసించుచున్న, శరదంబుదుండు = శరత్కాలమేఘము గలవాఁడు, శరత్కాల మందలి మేఘముం బోలిన తెల్లనిశరీరకాంతి గలవాఁడు, అగు నారదుండు, వచ్చెన్ = ఏగుదెంచెను. రూపకోపమానిదర్శనలతోఁడియుత్ప్రేక్షాలంకారము

మ॥ కని శ్రీకృష్ణుఁడు లేచి యమ్మునికి మ్రొ ♦ క్కన్ వాని భద్రాప్తిర
స్తని దీవించిన నవ్వి సద్విధులతో ♦ నర్చించి సింహాసన
స్థునిఁ గావింప నతండు హర్షజనితా ♦ శ్రుల్ గ్రమ్మి కన్గోనలన్
దనుకన్ మై పులకింప భక్తి నిటు చెం ♦ తన్ సన్నుతించెన్ హరిన్॥

శ్రీకృష్ణుఁడు, కని = (దేవలోకమునుండి వచ్చిన నారదుని) చూచి, లేచి, అమ్మునికిన్ = ఆనారదునకున్, మ్రొక్కన్ = నమస్కరింపఁగాన్, వాని = ఆనారదుఁడు, భద్రాప్తిరస్తని, భద్రాప్తిః = మేలుయొక్కపొందు, అస్తని = అగుఁగాకని, భద్ర యనుకన్న యాపొం దగుఁగాక యని యర్థాంతరము కేవలసంస్కృతపదములకేని వాక్యములకే నిందుఁ బ్రయోగములేదు కాని యనుకరణమున వాని కిందుఁ బ్రయోగంబు గల దని నన్నయభట్టారకుఁడు దీవించినన్ = ఆశీర్వదింపఁగాన్, నవ్వి, (దీనికిఁ గృష్ణుఁడు కర్త) సద్విధులతోన్ = మంచియేర్పాటులతోన్, అర్చించి = పూజించి, సింహాసనస్థునిన్ = పీఠమునం గూర్చున్నవానిని, కావింపన్ = చేయఁగాన్, అతండు = ఆనారదుఁడు, హర్షజనితాశ్రుల్ = సంతోషమునం బుట్టినకన్నీళ్లు, క్రమ్మి = (కన్నుల) నలమికొని, కన్గోనలన్ = కంటికొలుకులందున్, దనుకన్ = వ్యాపింపఁగాన్, మై = శరీరము, పులకింపన్ = గగుర్పొడువఁగాన్ భక్తిన్ = భక్తిచేతను, చెంతన్ = సమీపమందున్, హరిన్ = కృష్ణునిని, ఇటు = ఈక్రిందిరీతిని, సన్నుతించెన్ = స్తోత్రము చేసెను.

సీ॥ హరవిరించివజ్రి ♦ ధరులకు నైనను
గాన నలవి గాని ♦ ఘనుని నిన్ను
నేను గన్నులార ♦ నేఁ డిటుఁ గంటి నీ
దయను నెమ్మిఁ గంటిఁ ♦ దమ్మికంటి॥ 18

తమ్మికంటి = ఓకమలాక్షా!, హ . . . . నకు, హర = శివునకున్, విరించి =

బ్రహ్మకును; వజ్రిధరులకున్ = ఇంద్రునకును, ఐనను, అయినప్పటికిని, కానన్ = చూచుటకున్, అలవికానిఘనునిన్ = శక్యముగానిగొప్పవానిని, (సాధ్యుఁడు కానివాఁడని యర్థము.) నిన్నున్, కన్నులారన్ = కన్నులనిండన్, ఇటన్ = ఈస్థలమునందున్, నేఁడు = ఈదినమునన్, నేను, కంటిన్ = చూచితిని, నెమ్మిన్ = సంతసముతోన్, నీ దయన్ = నీకృపను (నీయనుగ్రహమును), కంటిన్ = పొందితిని.

వ॥ అని మఱియును. 19

ఉభయభాషార్థానులోమవిలోమకందము.

మానుగిరివ దేసమవరి
గానుసనీ తేరిలసవ ♦ గానివిడినురా
రానుడివినిగావనలరి
తేనీసనుగారవమన ♦ దేవరిగినుమా॥ 20

ఈపద్యముయొక్క మొదటిసగము క్రమముగఁ జదివినపుడు సంస్కృతమును, తలక్రిందుగఁ జదివినపుడు తెలుఁగు నగును, గావున నీపేరు పెట్టఁబడియెను.

పదచ్ఛేదము.

మా - అనుగిరివత్ - ఏసమ్ - అవ - రిగానుసనీతే - అరిల - నవగానివిడినుర - అ.

రానుడి - విని - కావన్ - అలరితి - ఏన్ - ఈసనున్ - గారవము - అనన్ - దేవర - కనుమా.

రిగానుసనీతే = దేవతలస్తుతులు కలవాఁడవును, నశించినబాదలు కలవాఁడవు నగునో కృష్ణా యని సంబుద్ధి (రి = ఆకాశమునందున్, గ = పోవువారు దేవతలు, (ని) రిం శ్లో బే రుధిరే మూర్ధ్ని ధ్యానే వ్యోమ్ని మాండ కక్షేషు నా. నా. రిగ = దేవతలయొక్క, అనుః, అ = అధికమైన, నుః = (దీనిబహువచనము నవః) స్తుతు లెవనికిఁ గలవో యతఁడు, రిగానుః (ని) ను శ్శబ్దస్తు నతౌ స్త్రీస్యాత్ నా. నా. న = నశించిపోయిన. ని + ఈతిః = (దీనిబహువచనము ఈతయః) అధికమైనబాదలు కలవాఁడు; ఏ నీతిః ఎవనికధికమైనబాధలు నశించి పోయినవో యతఁడు నీతి యనఁబడును. ఏమ్మట [illegible]

ము చేయు నగాయకనీతి యని యగును. దీనిసంబుద్ధి నగాయకనీతే.) నవగానివిడిచురః. అ=క్రొత్తది యగుగానము గలజనులయొక్క రత్నములం బోలిస్తుతులను గ్రహియించువిష్ణూ! (నవ=క్రొత్తది యగు, గానం=సంగీతము; నవగానం. అది కలవాఁడు, నవగానీ, దీనికిబహువచనము నవగానినః=క్రొత్తగానము కలవారు, విట్=జనుఁడు దీనిబహువచనము విశః. (సూ) వైశ్యే జనే పురీషే వి ట్ప్రియా స్సుంసి ద్వయోస్త్రీప్రియాం. నా. నా రెంటికిని గర్మధారయము చేయఁగా నవగానివిట్టులు, క్రొత్త గానము గలజను లని యర్థము వారియొక్క, ఇ=రత్నముం బోలిన, (సూ) ఇకారః ఫణిరత్నార్చిషు. నా నా ను=స్తుతులను, ర=గ్రహించునట్టి, ఇట రలల కభేదము (సూ) లః ఖండనే త్రిష్వాదానే. నా నా అ=విష్ణూ! అకారో బ్రహ్మ విష్ణ్వీశ కమఠేషు నా నా ఇదియును సంబుద్ధియే) అరిల=ఓచక్రధారీ, (అరి=చక్రమును, ల=ధరియించువాఁడు.) అనుగతవదేనం, అనుగతవత్=అనుసరించినధ్యానము కలవానివలె, ని న్నెప్పుడు ధ్యానించువానివలె నని యర్థము (అనుగ=(నిన్ను) ననుసరించిన, త=ధ్యానమెవనికిఁ గలదో యతఁడు, అనుగతః అనుగతవత్=అతనివలెనే) ఏనం=[illegible], మా=నన్ను, అవ=రక్షింపుము

దేవప=ఓపరిభువా! రాసుధీ=ప్రశస్తమైన (నాస్తుతి) వాక్యము, వివి=ఆలకించి, ఈనను=నీసంబంధినైనవన్నన్, (నీభక్తుఁడనైనవన్న నియర్థము) కావన్=రక్షించుటకున్, అలంకృతేః=సంతోషపడితివే, గానము=ప్రేమము, అనః=కల దనునట్లు, నాయందు నిలిచె బ్రేమ గలదని మెల్లవారు లనుకొనున ట్లని యర్థము కను మా=కనుఁగొనిరక్షింపుము

ఈపద్యమునాల్గవచరణమున నిత్యయతి వేయఁబడెను. '౦॥ ఏని యను నాంధ్రిశబ్దము। తో నదికినపూర్వపదము ♦ తుదిఁబ్రాయుకి న। చ్చెను వ్యంజనవర్గం । బైరచింపుముగ నిత్య ♦ యతు లను మఁ గవుల్॥' అప్పకవీయము

## దండకము.

శ్రీమజ్జగద్రక్షణాక్షీణదక్షా భృదీశా! సముంచత్కటాక్షస్వపక్షామరక్షేమకృత్కార్యదక్షా! విపక్షోరురక్షోగణక్షోభకృద్విక్రమానీడజేంద్రక్రియా! యిందిరాసుందరీహృన్నలేందిందిరా! మానిభాస్వన్మనోమందిరా! బాహుపీరాంగదామందరత్నిభవన్మందరా! సుందరాకార! గోవింద! దామోదరా! సాదరానంతకల్యాణచంచద్గుణా!

చారుమందస్మితోద్యన్మకరందావృతాస్యారవిందా! ముకుందా! శతా
నందసంక్రందనాద్యర్చితాంఘ్రిద్వయా! భక్తరాజీవరాజీవబంధూద
యా! మండితాఖండలోద్దండవేదండశుండాభదోర్దండదీవ్యద్గదాశంఖచ
క్రాసిశార్ఙ్గప్రభాహారి! శౌరీ! మురారీ! హరీ! మత్స్యకూర్మాద్యనం
తావతారా! శతారాబ్జతారాసుధారశ్మిమందారడిండీరహీరాదిరాజద్య
శఃపూరకర్పూరవారప్రపూర్ణత్రిలోకీకరండా! మహాఖండవేధోండభాం
డప్రకాండాధివాసప్రచండా! ప్రచండోష్ణరుఙ్మండలీమధ్యవర్తీ! హృషీ
కేశ! విశ్వంభరా! నీమహత్త్వం బచింత్యంబు వంద్యం బమేయం బ
నంతంబు సర్వాత్మకా! నీకచంబుల్ మహామేఘముల్ లోకనాథా సు
ధాభానుభానుల్ భవన్నేత్రముల్ శేషదృక్కర్ణతల్పా! కకుబ్భాగ
ముల్ నీకుఁ గర్ణంబు లంభోజపత్త్రేక్షణా! యంతరిక్షంబు నీనాభికా
క్రోడ మీశా! త్వదీయోరుపాదంబు లీభూతలం బచ్యుతా! నీశరీరం
బు విశ్వంబుభూతాంతరాత్మా! సముద్రంబునం దూర్మికాబుద్బుదశ్రేణి
చందంబునన్ దేవతిర్యఙ్నరాదిప్రపంచంబు నీయంద సర్గప్రవృద్ధ్యంతము
ల్గాంచు చుండుం జగన్నాటకప్రక్రియాసూత్రధారీ! శిఖావంతుఁ డిధ్మం
బులందున్నమాడ్కిన్ మనోబుద్ధిదేహేంద్రియాద్యేకసంద్రష్టవై ప్రాణు
లం దెల్లెడన్ జీవసంజ్ఞం బ్రవర్తింతు వీవేకదా సచ్చిదానందరూపా!
జితక్రోధమోహుల్ సమస్తాగమార్థజ్ఞు లధ్యాత్మనిత్యుల్ వివిక్తస్థలాసీ
ను లాచారవంతుల్ మునుల్ నిన్ను వీక్షింతు రాదిత్యచంద్రాగ్నితా
రాతటిత్పంక్తు లెచ్చోటఁ దేజంబు వాటింపఁగాఁజాల వెద్దాని ధీరుల్
ప్రవేశించి భూయోభవప్రాప్తి లేకుందు రచ్చోటు నీదివ్యధామంబు
నీతత్త్వ మెవ్వారి కైనన్ నిరూపింప శక్యంబుగా కుండు నే నేమి వ
ర్ణింపఁగా నేర్తు నుద్యద్దయాదృష్టి నీక్షించి రక్షింపు మోభక్తచింతా
మణీ! దైవచూడామణీ! వాసుదేవా! నమస్తే నమస్తే నమః. 21

శ్రీమ......భృదీక్షా, శ్రీమత్ = శోభ గల ( ఇది యీక్ష యనుదానివిశేషణము. ) జగత్ = లోకములయొక్క, రక్షణ = కాపాడుటయందు, అక్షీణ = పూర్ణమైన, దీక్షా = నియమమును, భృత్ = భరించిన, ఈక్షా = చూపు గలదేవా! సమంచ......దక్షా, సమంచత్ = ప్రకాశించుచున్న, కటాక్ష = క్రీఁగంటిచూపులచేతను, స్వపక్ష = తనప్రక్కవారైన, అమర = దేవతలయొక్క, క్షేమ = మేలును, కృత్ = చేయునట్టి, కార్య = పనులయందు, ( పనులుచేయుటయందు ) దక్షా = సమర్థుఁడా, విపక్షోరు......ద్విక్రమా, విపక్ష = శత్రులును, ఉరు = అధికులు నగు, రక్షస్ = రాక్షసులయొక్క, గణ = సముదాయమునకు, క్షోభకృత్ = కలఁతఁ గలిగించెడు, విక్రమా = పరాక్రమము గలస్వామీ, నీడజేంద్రక్రమా = గరుడగమనుఁడా, ( నీడ = గూఁటియందున్, జ = పుట్టినవి, పక్షులు, వాని కింద్రుఁడు = ప్రభువు, గరుడుఁడు. అతనిచేఁ గ్రమము = గమనము, కలవాఁడు నీడజేంద్రక్రముఁడు = దీనిసంబుద్ధి నీడజేంద్రక్రమా, ఇందిరా......రా, ఇందిరాసుందరీ = లక్ష్మియొక్క, వ్యాప్తల = వ్యాప్తదయ మనెడుపద్మమునకున్, ఇందిందిరా = భ్రమరమా! ( రూపకాలంకారము. ) మాని......మందిరా, మాని = ధ్యానముచేయువారియొక్క, భాస్వత్ = ప్రకాశించు, మనోమందిరా = మనసే యిల్లుగాఁ గలప్రభువా! భక్తులమనసులందు వాసముచేయుసామీ యని యర్థము. బాహు......భవన్మందరా, బాహుపీఠ = పీఠముం బోలిన భుజమునందలి) అంగద = బాహుపురికిన్, అమంద = పెద్దది యగు, రత్నభవన్మందరా = రత్న మగుచున్న మందరపర్వతము గలవిష్ణూ? విశాల మైనభుజమునందున్న భుజకీర్తియందలిరత్నమువలె నున్న మందరపర్వతమును ధరించినవాఁడా యని యర్థము సుందరాకార = మనోహరశరీరుఁడా! గోవింద = గోవులను వశపఱుచుకొన్న గోపాలుఁడా! దామోదరా = దమము మనసున ధరించినవారికిం బూజ్యుఁడా! ( దమము = ఇంద్రియనిగ్రహము ) సాదరా......గుణా, సాదర = మన్ననతోఁ గూడిన, అనంత = పెక్కులగు, కల్యాణ = మంగళమైన, చంచద్గుణా = ప్రకాశించుగుణములు గలస్వామీ! చారు......విందా, చారు = సుందరమైన, మందస్మిత = చిఱునగవనెడు, ఉద్యత్ = ఉదయించుచున్న, మరంద = పూఁదేనెచేతను, ఆవృత = ఆవరింపఁబడిన, ఆస్యారవిందా = మోముదామరఁగలవారీ! ముకుందా = మోక్షమునిచ్చు దేవా! శతానంద......ద్వయా, శతానంద = బ్రహ్మదేవుఁడు, సంక్రందన = ఇంద్రుఁడు, ఆది = మొదలగువారిచేతను, అర్చిత = పూజింపఁబడిన, అంఘ్రిద్వయా = పాదములజంట గలదేవా! భక్త......దయా, భక్త = సేవకులనెడు, రాజీవ = తామరలకు, రాజీవబంధూదయా = సూర్యోదయమా! మండిత......హారి, మండిత = అలంకరింపఁబడిన, ఆఖండల = యింద్రునియొక్క

ఉద్దండ=పొడవైన, (ఇది తుండమునకు విశేషణము) వేదండ=ఏనుఁగుయొక్క,
(ఐరావతముయొక్క, శుండాభ=తుండపుఁగాంతిగల, (తుండముతో సమాన మైన
యని యర్థము.) దోర్దండ=బాహుదండములందుఁ, దీవ్యత్=ప్రకాశించుచున్న,
గదా=కౌమోదకి యనుగదియయొక్కయు, శంఖ=పాంచజన్యముయొక్కయు, చ
క్ర=సుదర్శనముయొక్కయు, అసి=నందక మనుకత్తియొక్కయు, శార్ఙ్గ=ధనువు
యొక్కయు, ప్రభా=కాంతిచేతను, హరి=మనోహరుఁడా! శౌరి=ఓశూరకులోత్ప
న్నుఁడా! మురారీ=మురసంహారకా! మున్ను దితికుండలంబులను వరుణునిశ్వేతచ్ఛ
త్రంబును నరకుండు హరించె నని యింద్రుండు కృష్ణునకుం జెప్పఁగా నతఁడు వానిఁ జ
యింపఁబోయి మొదట వానిపక్షమున యుద్ధము సేయ వచ్చినమురుని సంహరించుటచేఁ
గృష్ణునకీపేరు గలిగెను. హరీ!=(భక్తులపాపములను) హరించుస్వామీ! మత్స్య
కూర్మాద్యనంతావతారా=మత్స్యము, కూర్మము మొదలగు ననేకశరీరముల ధరించిన
యీశ్వరుఁడా!, శతారాబ్జ . . .కరండా, శతార=వజ్రాయుధమువలెను, (నూఱం
చులవాలు) అబ్జ=పద్మములవలెను, తారా=నక్షత్రములవలెను, సుధారశ్మి=చం
ద్రుఁడువలెను, మందార=దేవవృక్షములువలెను, డిండీర=నురువువలెను, హీరాది=
వజ్రములు మొదలగువానివలెను, రాజత్=ప్రకాశించుచున్న. యశఃపూర=కీర్తిప్రవా
హ మనెడు, కర్పూరవార=కప్పురపుంబలుకులసముదాయముచేతను, పరిపూర్ణ=నిం
పఁబడిన, త్రిలోకీ=మూఁడులోకములసముదాయ మనెడు, కరండా=బరణి కలప్ర
భువా! మహా . . .పిచండా, మహత్=గొప్పవియును, అఖండ=అన్నియు నగు,
వేధోండభాండ=కడవలం బోలిన బ్రహ్మాండములయొక్క, ప్రకాండ=సముదాయము
లకు, అధివాసత్=నివాస మగుచున్న, పిచండా=గర్భము గలదేవా! ప్రచండోష్ణ
. . . వర్తీ, ప్రచండ=తీక్ష్ణమైన, ఉష్ణరుఙ్మండలీ=సూర్యమండలముయొక్క (ఉష్ణ=
వెచ్చని, రుక్=కిరణములు గలవాఁడు; అతనియొక్కమండలము, ఉష్ణరుఙ్మండలి)
మధ్యవర్తీ=నడుమ నుండుదేవా! (భక్తులకు ధ్యానార్హ మైనసువర్ణాకారముతో భగ
వంతుఁడు సూర్యమండలమునడుమ నుండు నని శ్రుతిస్మృతులయందుఁ బ్రసిద్ధము.)
హృషీకేశా=ఇంద్రియాధిపతి! విశ్వంభరా!=ప్రపంచమునకుం బోషకుఁడా! నీమహ
త్త్వంబు=నీగొప్పతనము, అచింత్యంబు=ఆలోచింప శక్యము గానిది; వంద్యంబు=న
మస్కరింపఁదగినది. అమేయంబు=ప్రమాణములచేఁ దెలియ సాధ్యము గానిది, అనం
తంబు=నాశములేనిది; సర్వాత్మకా=సర్వస్వరూపుఁడా! మహామేఘముల్=గొప్ప
మేఘములు, నికచంబుల్=నీతలవెండ్రుకలు, లోకనాథా=ప్రపంచాధిపా! సుధా
భానుభానుల్=చంద్రుఁడును, సూర్యుఁడును, (సుధాభానుఁడు=అమృతమయ మై

సకిరణములు గలవాఁడు, చంద్రుఁడు.) భవన్నేత్రముల్ = నీకన్నులు; శేషదృక్కర్ణతల్పా = శేషశాయీ! [శేష = శేషుఁడను, దృక్కర్ణ = పాము (దృక్ = నేత్రములే కర్ణ = చెవులుగాఁ గలది,) తల్పా = పాన్పుగాఁ గలవాఁడా] దిక్ఛ్రోత్రముల్ = దిక్కులు, నీకున్, కర్ణంబులు = చెవులు; అంభోజపత్రేక్షణా = పద్మదళనేత్రా! అంతరిక్షంబు = ఆకసము, నినాభికాక్రోడము = నీనాభిమధ్యము ఈశా!, భూతలంబు = ఈభూలోకము, త్వదీయోరుపాదంబులు = నీవి యగు పెద్దయడుగులు, అమృతా = ఓనాశరహితుఁడా! విశ్వంబు = ప్రపంచము, నిశరీరంబు = నీదేహము, భూతాంతరాత్మ = ఎల్లజంతువులలో నుండి కర్మానుసారముగం బ్రేరించుదేవా! సముద్రంబునందున్, ఊర్మికాబుద్బుదశ్రేణిచందంబునన్ = తరంగములయు బుగ్గలయు సముదాయముయొక్క విధముచేతను, దేవ . . ంబు, దేవ = దేవతలు, తిర్యక్ = పశుపక్ష్యాదులు, నరాది = మనుష్యులు మొదలగు, ప్రపంచంబు = లోకము నీయంద = నీయందే, సర్గప్రవృద్ధ్యంతముల్ = పుట్టువును పెంపును నాశమును, కాంచుచుండున్ = పొందుచుండును జగన్నాటకప్రక్రియసూత్రధారీ = ఈలోక మను నాటకవ్యాపారమునకు సూత్రధారుఁడా! సాత్వికాదులగు నాల్గువిధములగు నభినయములను సూచించువాఁడు సూత్రధారుఁడు శిఖావంతుడ = అగ్నిహోత్రుఁడు, ఇధ్మంబులందున్ = కట్టెలయందున్, ఉన్నమాడ్కిన్ = ఉన్నరీతిచేతను, మనోబుద్ధి . . వై, మనః = మనసు, (సంకల్పవికల్పాత్మక మైనయంతఃకరణవృత్తి) బుద్ధి = నిశ్చయాత్మక మైనవృత్తి దేహ = శరీరము, ఇంద్రియాది = ఇంద్రియములు మొదలైనవానికి, ఏకసంద్రష్టవై = ఏకసాక్షివై, (మనసు బుద్ధి యింద్రియములు మొదలగువానియొక్క వ్యాపారముల నొక్కఁడవే చూచువాఁడవై యని యర్థము.) ప్రాణులందున్ = జంతువులయందున్, ఎల్లెడన్ = అన్నిస్థలములయందును, జీవసంజ్ఞన్ = జీవుఁడను పేరితో, ఈవే కదా = నీవే కాదా, ప్రవర్తింతువు = ఉందువు, సచ్చిదానందరూపా = సత్తయు (సత్యము) జ్ఞానము నానందమే యాకారముగఁ గలవాఁడా! జితక్రోధమోహాల్ = జయింపఁబడినకోపము నజ్ఞానముఁ గలవారు, సమస్తాగమార్థజ్ఞులు = అన్ని వేదములయర్థము తెలిసినవారు, అధ్యాత్మనిత్యుల్ = ఆత్మజ్ఞానమున నాసక్తి గలవారు, వివిక్తస్థలాసీనులు = ఏకాంతమున గూర్చున్నవారు, ఆచారవంతుల్ = మంచినడవడి గలవారును, (అగు) మునుల్ = బ్రహ్మవిచారము చేయువారు, నిన్నున్, వీక్షింతురు = చూతురు ఆదిత్య ...పంక్తులు ఆదిత్య = సూర్యుఁడు చంద్ర = చంద్రుఁడు, అగ్ని, తారా = నక్షత్రములు, తటిత్పంక్తులు = మెఱుములసముదాయములును, ఎచ్చోటన్ = ఏస్థలమందును, తేజంబు = కాంతిని ప్రకటింపఁగాఁ జాలవు = ప్రసరింపఁ జేయలేవో, ధీరుల్ = విద్వాంసులు, ఎద్దా

నిక్ = ఏస్థలమును, ప్రవేశించి=పొంది, భూకోభవప్రాప్తి = మఱల జన్మముపొందు ను, లేరుందురు = అనుభవింపరో, అచ్చోటు = ఆస్థలము, నిదివ్యధామంబు = నీస్వచ్ఛమైననివాసస్థలము; నీతత్త్వము = నీస్వరూపము, ఎవ్వారికైనన్ = ఎంతచదివినవారికిని నిరూపింపన్ = నిశ్చయించిపలుకుటకున్, శక్యంబు=సాధ్యము, కాకుండున్; నేను, ఏమి = ఏరూపమును, వర్ణింపఁగాన్ = స్తుతించుటకు, నేర్తున్ = శక్తుఁడనగుదును. ఓ భక్తచింతామణీ = సేవించినవారికిం జింతామణిం బోలినస్వామీ! (సముద్రమును మథించినపుడు కల్పవృక్షాదులతో నుత్పన్నమైనదియు నెవ్వ రేది కోరిన నిచ్చునదియు నగుస్వర్గలోకమునందలియొకమణి చింతామణి యనంబడును.) ఉదయద్దయాదృష్టిన్ = ఉదయించుచున్నదయ గలచూపుతోన్, ఈక్షించి = చూచి, రక్షింవుము = (నన్నుఁ) గాపాడుము దైవచూడామణీ = దేవతాశిరోభూషణమా! వాసుదేవా! = ఎల్లజగంబుల వసియించి యెల్లజగంబుల నీయందు వసింపఁజేయు దేవా! నమస్తే, తే = నీకొఱకు, నమః = నమస్కారము (అగుఁగాక)

చ॥ అని వినుతించి మౌనివరుఁ ♦ డానలినాక్షు ననుజ్ఞ నొంది నె
మ్మనమునఁ దద్గుణావళులు ♦ మాటికిమాటికిఁ బ్రస్తుతించుచున్
వినయ మెలర్పఁగా నచటు ♦ వీడ్కొని వేఱొకచోటి కేగుచో
జననుతమై తనర్చునొక ♦ సత్పథమధ్యమునందు ముందరన్. 22

మౌనివరుండు = మునిశ్రేష్ఠుఁడగు నారదుఁడు, అని వినుతించి = ఇట్లు స్తుతించి, ఆనలినాక్షునను జ్ఞ = ఆకృష్ణునిసెలవును, ఒంది = పొంది, నెమ్మనమునన్ = మనసునందున్, తద్గుణావళులు = ఆయనమంచిగుణములసముదాయమును, మాటికిమాటికిన్ = పలుమారు, ప్రస్తుతించుచున్ = స్తోత్రముచేయుచున్, వినయము = అడఁకువ, ఎలర్పఁగాన్ = అతిశయింపఁగాన్, అచటు = ఆస్థలమును, వీడ్కొని = వదిలి, వేఱొకచోటికిన్ = మఱియొకస్థలమునకున్, ఏగువోన్ = వెళ్లునపుడు, జననుతమై = మనుజులచే స్తుతింపఁదగినదియై, తనర్చునొకసత్పథమధ్యమునందున్ = ప్రకాశించునొకమంచిత్రోవనడుమునన్, ముందరన్ = ఎదుటను, ముందుపద్యముతో నన్వయము.

గీ. మొనసి భద్రాస్వయంవరం ♦ బునకు నరుగు
వారిరథములపై నున్న ♦ వారి ధరణి
విభుల నిర్వుర వీందాన ♦ వీందు లనెడు
వారిఁ జూచిన ముని కేల్లు ♦ వార లనిరి. 23

మొనసి = యుద్ధప్రయత్నము చేసి, భద్రాస్వయంవరంబునకున్ = భద్రయనుకన్యయొక్క గాంధర్వవివాహంబునకున్, అరుగువారిన్ = పోవువారిని, రథములపైన్ = అరదములపైని, ఉన్నవారిన్, విందానువిందులనెడువారిన్ = విందుఁడు ననువిందుఁడు నను పేరు గలవారిని, ఇర్వుర ధరణివిభులన్ = ఇద్దఱు రాజులను, చూచినన్ = ( నారదుఁడు ) చూడఁగాన్, వారలు = ఆ రాజులు, మునికిన్ = నారదునకున్, ఇట్లు = ఈరీతిగాన్, అనిరి = పలికిరి.

క. మునినాథ! మీ రెఱుంగని
పని యెందు నొకింత లేదు ♦ పలుకుము భద్రాం
గన మాయిర్వురిలోపల
ననువుగ నెవ్వని వరించు ♦ నని యడుగుటయున్. 24

మునినాథ = ఓనారదుఁడా! మీ రెఱుంగనిపని = మీ రెఱుఁగనికార్యము, ఎందున్ = ఏస్థలమునందును, ఒకింత = కొంచెమైనను, లేదు భద్రాంగన = భద్ర యనుకన్నియ, మాయిర్వురిలోపలన్ = మాయిద్దఱియందును, ఎవ్వనిన్, అనువుగన్ = అనుకూలముగాన్, వరించును = కోరి వివాహము చేసికొనును పలుకుము = చెప్పుము, అని యడుగుటయున్ = ఇట్లడుగఁగాన్, ముందుపద్యముతో నన్వయము.

వ. అప్పు డప్పోరోగిరంపుఁదపసి భద్రాంగనారత్నం బిందిరాంశసంభవ గావున గోవిందునిం దక్క వేఱొక్కని వరింప దిది నిక్కం బని నొడివి యుడువీథి యథేచ్ఛం జనియె ననంతరం బవ్విందానువిందులు మునివచనంబులు నిరాకరించి మత్సరంబున ననేకానీకసమేతులై కేకయపురంబు ప్రవేశించి రంత. 25

అప్పుడు, అప్పోరోగిరంపుఁదపసి = ఆనారదుఁడు ( పోరు + ఓగిరము + తపసి = యుద్ధమే భోజనముగాఁ గలముని ఇది కలహాశనుఁ డనుతత్సమమునకు సరియైన తెనుఁగు. ) భద్రాంగనారత్నంబు = భద్ర యనుస్త్రీశ్రేష్ఠము, ఇందిరాంశసంభవ = లక్ష్మియంశమునం బుట్టినది, కావునన్ = అగుటచేతను, గోవిందునిందక్కన్ = కృష్ణుని విడిచి, వేఱొక్కనిన్, వరింపదు = వివాహము చేసికొనదు ఇది = నేఁ జెప్పినది, నిక్కంబు = సత్యము. అని నొడివి = ఇట్లు చెప్పి, ఉడువీథిన్ = ఆకసమునను, ( నక్షత్రములత్రోవను ) యథేచ్ఛన్ = ఇచ్చ వచ్చినట్లుగాను, చనియెన్ = పోయెను. అనంత

రంబు = పిమ్మట, అవ్విందానువిందులు, మునివచనంబులు = నారదునిపలుకులను, నిరాకరించి = అలక్ష్యముచేసి, మత్సరంబునన్ = ఓర్వలేమిచేత, అనేకానీకసమేతులై = పెక్కుసేనలతోఁ గూడుకొనినవారై, కేకయపురంబు, ప్రవేశించిరి. అంతన్ = పిమ్మటను.

సీ॥ కాళింగభటులు మ్రొ ♦ క్క మదేభ మెక్కి హే
మాంగదాంచితుఁడు హే ♦ మాంగదుండు,
కనకనిర్మితశతాం ♦ గము నెక్కి పరివృత
మాగధుండై నట్టి ♦ మాగధుండు,
కర్ణీరథము నెక్కి ♦ ఘనజవాన్వితమహా
సైంధవుం డైనట్టి ♦ సైంధవుండు
పటుతురంగము నెక్కి ♦ భామినీనిచయపాం
చాలుఁడై మించుపాం ♦ చాలవిభుఁడు
మఱియుఁ జతురంగసేనాస ♦ మగ్రులగుచు
మత్స్యకుంతలకోసల ♦ మద్రకుకుర
చోళనేపాళమాళవ ♦ శూరసేన
భూపముఖ్యులు వచ్చిర ♦ ప్పురము సొరఁగ. 26

కాళింగభటులు = కళింగదేశపుబంట్లు, మ్రొక్కన్ = నమస్కరించుచుండఁగాన్, మదేభము = మదగజమును (ఇట ద్వితీయార్థమునఁ బ్రథమ. కొన్ని యెడల నజడంబుద్వితీయకును బ్రథమ గానంబడియెడి. (బా. కా.) ఎక్కి = ఆరోహించి, హేమాంగదాంచితుఁడు, హేమ = బంగారువికారమైన, అంగద = భుజకీర్తులచే, అంచితుండు = పూజింపఁబడినవాఁడు, (బంగారుభుజకీర్తులను ధరించినవాఁడు) (అగు) హేమాంగదుండు, కనకనిర్మితశతాంగమున్ = బంగారుచే నిర్మింపఁబడినరథమును, ఎక్కి, పరివృతమాగధుండు = చుట్టుకొనఁబడినస్తుతిపాఠకులుగలవాఁడు, (స్తుతిపాఠకులచే నావరింపఁబడినవాఁ డనియర్థము,) ఐనట్టిమాగధుండు = అయినమగధదేశపురాజును, కర్ణీరథమున్ = క్రీడారథమును, (వినోదార్థమై యెక్కుడుగుఱ్ఱపుబండి యని యర్థము) ఎక్కి, ఘన......డు, ఘన = గొప్పదియగు, జవ = వేగముతోన్, అన్విత = కూడిన, మహాసైంధవుండు = గొప్పగుఱ్ఱములు కలవాఁడు, ఐనట్టిసైంధవుండు = అయిన

సింధుదేశపురాజును, పటుతురంగమును = బలముగలగుఱ్ఱమును, ఎక్కి, భామినీనిచయపాంచాలుఁడు = భామినీనిచయ = స్త్రీసముదాయమునకు, పాంచాలుఁడు = పాంచాలజాతిపురుషుఁడు (మనోహరుఁ డనియర్థము.) ఐ, మించుపాంచాలవిభుఁడు = ప్రకాశించుపాంచాలదేశపురాజును, మఱియుఁ = ఇంకను, మత్స్య......భూపముఖ్యులు, మత్స్య, కుంతల, కోసల, మద్ర, కురుర, చోళ, నేపాళ, మాళవ, శూరసేనదేశముల యొక్కరాజశ్రేష్ఠులు, అప్పురము = ఆకేకయపురమును, చొరఁగన్ = ప్రవేశింపఁగన్ వచ్చిరి.

ఉ. ఈగతి సర్వదేశధర ♦ ణీశులు కేకయపట్టణావనీ
భాగము సేరఁ గేకయనృ ♦ పాలుఁడు వారిముదావహార్హలీ
లాగతి నందఱన్ విడుదు ♦ ల న్విడియింప నమాత్యవర్గమున్
నాగరికాళి మంచెల నొ ♦ నర్పఁగఁబంచెఁ బురాంగణంబునన్. 27

సర్వధరణీశులు = ఎల్లదేశములరాజులును, ఈగతిన్ = ఈప్రకారముచేతను, కేకయపట్టణావనీభాగము = కేకయరాజుపట్టణముయొక్కప్రదేశమును, చేరన్ = సమీపింపఁగాన్, కేకయనృపాలుఁడు = కేకయరాజు, వారిన్ = ఆవచ్చినరాజులను, ముదావహార్హలీలాగతిన్, ముదావహ = సంతసమును గలిగించెడు, అర్హ = తగిన, లీలాగతిన్ = విలాసముతోన్, అందఱన్ = ఎల్లవారిని, విడుదలన్ = బసలందున్, విడియింపన్ = ప్రవేశపెట్టుటకు, అమాత్యవర్గమున్ = మంత్రులసముదాయమును, పురాంగణంబునన్ = పట్టణముయొక్క వెలుపటిప్రదేశమందున్, మంచెలన్ = (స్వయంవరార్థము వచ్చినరాజపుత్త్రిలు, చూచ్చుండుటకుం దగిన) యాసనముల నుంచెడునున్నతస్థానములను, ఒనర్పఁగన్ = నిర్మించుటకున్, నాగరికాళిన్ = (తెలివి గల) నగరవాసులసముదాయమును, పంచెన్ = ఆజ్ఞాపించెను

ఉ. ముత్తెపుఁబాలగచ్చుజిగి ♦ ముంపగు కెంపుటరంగుటోరులం
గ్రొత్తగుకప్రపుంజికిలి ♦ ముగ్గులనిగ్గులు దేరుగుత్తపుం
జిత్తరువ్రాఁతలం జెలుగు ♦ చెక్కడపున్మగరాలనాలలం
బుత్తడియిండ్లు బందులకుఁ ♦ బొందుగ విందులు గూర్చె నప్పురిన్.

అప్పురిన్ = ఆపట్టణమునందున్, పుత్తడియిండ్లు = బంగారుపూఁతఁబూసినయిండ్లు, ముత్తెపుఁబాలగచ్చుజిగిన్ = ముత్తియములసంబంధమైనసన్నసున్నపుంబూఁతయొ

క్క కాంతిచేతనును, ముంపగు......లన్, ముంపు=అధికము, అగు, కెంపుటరంగు టోరులన్=కెంపులయొక్క తిన్నెలయొక్క పట్టెలచేతనును, (కెంపులతోఁ గట్టఁబడినతిన్నెలయందలిపట్టెలచేత నని యర్థము.) క్రొత్తగ కప్పపుంజికిలిముగ్గులన్=అప్పుడే సిద్ధము చేసినది యగు కెంపుసంబంధమైన బాగుచేసిన ముగ్గులచేతనును, నిగ్గులు జేయు=మెఱపెడు, గుత్తపుంజిత్తరువాతలన్=బిగువైన చిత్తరువులు వ్రాఁతపనుల చేతనును, జిలుగు చెక్కడపు నగరాలపాలలన్=తీఁగెలుగాఁ జెక్కినవజ్రములయొక్క (వజ్రములు తాపిన) చావడులచేతనును, చెక్కడము + నగరాలు=చెక్కడపునగరాలు, (కర్మధారయంబున ముపర్ణమునకుఁ బుంపులగున్. బా. సం ఉదంత స్త్రీసమంబులకును బుంపులకును బరుసరళంబులుపరంబులగునపుడు నుగాగమంబగు నను సూత్రముక్రింద నీయాగమం బౌకానుకచో స్థిరముపరంబగునపుడు గానంబడియెడు నని బా సం. చెక్కడపునగారాలు ) బందులకున్=చుట్టములకున్, పొందుగన్=బాగుగాన్, విందులు=ప్రేమలను, బహువచనమాధిక్యముం దెలుపును. ప్రేమాతిశయము నని యర్థము. కూర్చెన్=సంఘటించెను

గీ. వఱలు నగరాంగణంబున ♦ వట్టివేళ్ల
చప్పరములందు నిరువంక ♦ నొప్పు మిగులు
మంచెలను మించురత్నస ♦ మంచితాస
నముల నాసీనులైరి భూ ♦ నాథవరులు. 29

భూనాథవరులు=రాజశ్రేష్ఠులు, వఱలునగరాంగణంబునన్=ప్రకాశించుచున్నట్టినసమీపమందున్, వట్టివేళ్లచప్పరములందున్=వట్టివేళ్ల పందిరులయందున్, ఇరువంకన్=రెండుప్రక్కలయందున, ఒప్పుమిగులుమంచెలను=అందము వెతిశయించెడు నున్నతప్రదేశములందున్, మించురత్నసమంచితాసనములన్, మించు=అతిశయించెడు, రత్న=రత్నములచేతను, సమంచిత=పూజింపఁబడిన, ఆసనములన్=పీఠములందున్, రత్నములతోఁ గూర్పఁబడినసుందరము లగుపీఠములం దని యర్థము. ఆసీనులైరి=కూర్చుండిరి.

ఉ. కొందఱు మన్మథోపములు ♦ కొందఱు చంద్రసమానసుందరుల్
కొందఱు యక్షసూనునిభ ♦ కోమలదేహులు కొంద ఱల్లసం
క్రందననందనప్రతిమ ♦ రమ్యశరీరులు కొంద ఱవ్వసం

తుం దెగడంగఁ జాలినఘ ♦ నుల్ నివసించిరి రాకుమారకుల్. 30

రాకుమారకుల్ = రాజపుత్త్రులు, (ఈపదము క్రింద అనుసర్వనామము లన్నింటితో నన్వయించును) కొందఱు, మన్మథోపములు = మన్మథునితో సామ్యము గలవారును, మన్మథుం బోలినవా రని యర్థము కొందఱు, చంద్రసమానసుందరుల్ = చంద్రునితో సమానులు గనుక నే యందగాండ్రును, కొందఱు, యక్షసూనునిభకోమలదేహులు, యక్షసూను = నలకూబరునితో, నిభ = సమానమగు, కోమల = మృదువైన, దేహులు = శరీరములు కలవారు, కొందఱు, అల్లసంక్రందననందనప్రతిమరమ్యశరీరులు, అల్ల = ప్రసిద్ధుఁడయిన, సంక్రందననందన = ఇంద్రపుత్త్రునితోన్, (జయంతునితోన్) ప్రతిమా = పోలిక గల, రమ్య = మనోహరమైన, శరీరులు = దేహము గలవారు జయంతుఁడు సాటిగలదేహము గలవా రని యేని యర్థము. కొందఱు, అవ్వసంతున్ = వసంతఋతువున కధిదేవత యగువానిని, తెగడంగన్ = నిరసించుటకున్, చాలినఘనుల్ = సమర్థులగు గొప్పవారును, వసంతునిం బోలినమ్మోహనులని యర్థము నివసించిరి = అందుండిరి ఉపమాలంకారము.

మ. ఎలమిన్ స్వాప్తసుహృత్సమన్వితుఁడు శ్రీ♦కృష్ణుండు మాణిక్యకుం
డలకేయూరకిరీటహారరుచిసం♦ధ్యాలక్ష్మికిం జుట్టమై
వెలుఁగన్ దివ్యవిమానమం దలరున♦వ్వేగంటిచందంబునన్
జెలువొప్పన్ ఘనమంచకోపరిలస♦త్సింహాసనాసీనుఁడై 31

స్వాప్త . . తుఁడు, స్వ = తనయొక్క, ఆప్త = బంధువులతోడను, సుహృత్ = స్నేహితులతోడను, సమన్వితుఁడు = కూడినవాఁడు, (అగు) శ్రీకృష్ణుండు, మాణిక్య . . రుచిన్, మాణిక్య = మాణిక్యవికారమైన, కుండల = కమ్మంట్లయొక్కయు, కేయూర = భుజకీర్తులయొక్కయు, కిరీట = శిరోభూషణముయొక్కయు, హార = ముత్యాలదండలయొక్కయు, రుచి = కాంతి, సంధ్యాలక్ష్మికిన్ = సంధ్యాకాలపుశోభకున్, చుట్టమై = బంధువై (సమానమై యని యర్థము) వెలుఁగన్ = ప్రకాశింపఁగాన్, దివ్యవిమానమందున్ = దేవలోకమందలివిమానమందున్, అలరు నవ్వేగంటి చందంబునన్ = ప్రకాశించునింద్రునివిధమువంటివిధముచేతను, ఎలమిన్ = సంతసముతోన్, ఘన.....సీనుఁడై, ఘన = గొప్పదియగు, మంచక = మంచెయొక్క, ఉపరి = మీఁదిభాగమునందున్న, లసత్ = ప్రకాశించుచున్న, సింహాసన = సింహాసనమందున్, ఆసీనుఁడై = కూర్చున్నవాఁడై, చెలువు = అందముచేతను, (తృతీయార్థమందుఁ బ్రథ

ము) ఒప్పెన్ = ప్రకాశించెను.

సీ. ఈరీతి నఖిలధా ♦ త్రీశకుమారులు
నున్నతమంచభాగర ♦ త్నమయచిత్ర
సింహాసనముల నా ♦ సీనులై యున్నచో
జనకునను జ్ఞచే ♦ సఖులు దివ్య
నవరత్నమయభూష ♦ ణములఁ గైసేయ లో
కైకమోహనరూప ♦ కేకయనృప
కన్యాలలామం బ ♦ నన్యసామాన్యలా
వణ్యంబు మెఱయ సౌ ♦ వర్ణఖచిత
రుచిరచతురంతయానాధి ♦ రూఢ యగుచు
క్షీరవారాశి వెడలుల ♦ క్ష్మియునుబోలె
రమ్యపరిచారికాసహ ♦ స్రంబు గొలువ
సంతిపుర మప్డు వెడలెఁ దూ ♦ ర్యంబు లులియ. 32

ఈరీతిన్ = ఈవిధముచేతను, అఖిలధాత్రీశకుమారులు = ఎల్లరాజపుత్త్రులును, ఉన్నత .. .లన్, ఉన్నత = పొడవైన, మంచభాగ = మంచెలయందున్, రత్నమయ = రత్నములవికారమైన, చిత్ర = పలువన్నెలు గల, సింహాసనములన్ = పీఠములందున్, ఆసీనులై యున్నచోన్ = కూర్చుండియున్నపుడు, జనకునను జ్ఞచేన్ = తండ్రియానతిచేతను, సఖులు = చెలికత్తెలు, దివ్య .. .లన్, దివ్య = మనోహరమైన, నవరత్నమయ = ప్రసిద్ధమైన తొమ్మిదివిధములరత్నములుగల, భూషణములన్ = నగలచేతను, కైసేయన్ = అలంకరింపఁగాన్, లోకైకమోహనరూప, లోక = జనులకున్, ఏక = కేవలము, మోహన = పారవశ్యమును బుట్టించు, రూప = ఆకారముగలది, కేకయనృపకన్యాలలామంబు = కేకయరాజుయొక్క కన్యాశ్రేష్ఠము, కేకయరాజుకూఁతు రని యర్థము. అనన్య.....బు, అనన్యసామాన్య = ఇతరులకు లేని, లావణ్యంబు = కాంతి, మెఱయన్ = ప్రకాశింపఁగాన్, సౌవర్ణ .....రూఢ, సౌవర్ణ = బంగారుచిత్రములచేతను, ఖచిత = చెక్కఁబడిన, (బంగారుచిత్రములచే నలంకరింపఁబడిన యని యర్థము) రుచిర = సుందరమైన, చతురంతయాన = పల్లకీని, అరూఢ = ఎక్కినదియై, (చెక్కఁబడి

నబంగారుచిత్రములచేతి మనోహరమైనపల్లకి నెక్కినదై యనియర్థము.) అగుచున్, క్షీరవారాశిన్ = పాలసంద్రమునుండి, వెడలులక్ష్మియునుబోలెన్ = బయలుదేరెడులక్ష్మీదేవివలెనే, రమ్యపరిచారికాసహస్రంబు = అందగత్తెలగు సేవకురాండ్రయొక్కవేయి, వేగురుపరిచారిక లని యర్థము కొలువన్ = సేవించుచుండఁగాన్, తూర్యరవంబులు = భేరులధ్వనులు, ఉలియన్ = వ్యాపింపఁగాన్, అంతిపురము = అంతఃపురమునుండి, అప్డు = అపుడు, వెడలెన్ = బయలువెడలెను.

క. ఈపగిది వెడలి దివ్యక
లాపకలాపరుచిదిక్కు ♦ లం బఱవఁగ భ
ద్రాపూర్ణచంద్రముఖి ఘం
టాపథమున రాఁగ నయ్యె♦డం గడఁకమెయిన్. 33

భద్రాపూర్ణచంద్రముఖి = భద్ర యనుకన్నియ, (నిండుచంద్రునిబోలినమోము గలది యనుఘదర్థ) ఈపగిదిన్ = ఈప్రకారముచేతను, వెడలి, దివ్యకలాపకలాపరుచి, దివ్య = సుందరమైన, కలాప = భూషణములయొక్క, కలాప = సముదాయముయొక్క, రుచి = కాంతి, (ని) కలాపో భూషణే బర్హే తూణీరే సంహతావపి. అదిక్కులన్ = దెసలందున్, పఱవఁగన్ = వ్యాపింపఁగాన్, ఘంటాపథమునన్ = పెద్దబాటచేతను, రాఁగన్ = వచ్చుచుండఁగాన్, అయ్యెడన్ = ఆస్థలమునందున్, కడఁకమెయిన్ = ప్రయత్నముతోన్, ముందుపద్యముతో నన్వయము

మ. స్థిరబాహాబలదర్పజృంభితమదాం♦ధీభూతచేతస్కులై
విరసత్వంబున సైన్యయుక్తు లగుచున్ ♦ విందానువిందు ల్మహా
త్తరభద్రాచతురంతయానమును ద♦త్సఖ్యాళితోఁ గ్రమ్మఱిం
చి రహిం దోడ్కొని కొంతద వ్వరుగు దో♦శ్రీకృష్ణుఁ డవ్వార్త కిం
కరుఁ డొక్కం డెఱిఁగింపఁగాఁ దెలిసి వే♦గన్ స్యందనారూఢుఁడై.

విందానువిందుల్ = అవంతి కధిపతు లగువిందుఁడు ననువిందుఁడు ననువారు, స్థిర ....లై, స్థిర = నిలువరమైన, బాహాబల = చేతులబలముచేతను, దర్ప = గర్వముచేతను, జృంభిత = అతిశయించిన, మద = క్రొవ్వుచేతను, అంధీభూత = గ్రుడ్డిదైన (మంచిచెడ్డలు తెలియనీయని) చేతస్కులై = మనసుగలవారలై, సైన్యయుక్తులు = దండుతోఁగూడినవారు, అగుచున్, మహాత్తరభద్రాచతురంతయానమును, మహాత్తర = మిగులగొ

ప్పుడియగు, భద్రాదత్తురంతయానము = భద్రయొక్క వాహనమును, తత్సఖ్యాళితోన్ = ఆమె చెలికత్తెలసముదాయముతోఁగూడను, విరసత్వంబునన్ = రసము లేమితోను, రసభంగముగల్గునట్లనియర్థము కరిమ్మగించి = వెనుకకు మరలించి, రహిన్ = ఆనందముతోన్, తోడ్కొని = తీసికొని, కొంతదవ్వు = కొంతదూరము, అరుగుచోన్ = పోవునపుడు, అవ్వార్త = ఆవృత్తాంతమును, ఒక్కండు కింకరుఁడు = ఒక సేవకుఁడు, ఎఱిఁగింపన్ = తెలుపఁగాన్, శ్రీకృష్ణుఁడు, తెలిసి = ఎఱిఁగి, వేగన్ = త్వరతోన్, స్యందనారూఢుఁడై = రథము నెక్కినవాఁడై, ముందుపద్యముతో నన్వయము ఇం దైదు పాదములు గలవు భారతాదుల నట్టిపద్యములు గాన్పింపవు కాని యాధునికులు పెక్కండ్రు చెప్పుచుండిరి

మ. గదుఁడున్ సాత్యకి లోనుగా ననుజవ◆ర్గంబున్ గదాకార్ముక
ప్రదరాద్యాయుధపాణులై యరుగుదే◆రన్ వారలం గూడి వాఁ
డి దలిర్పన్ బరతెంచి మించి మృగరా◆డ్డింభంబు కుంభీంద్రపం
క్తిఁ దగి న్మార్కొనుభంగిఁ దాను గవిసె◆న్విందానువిందాదులన్.

గదుఁడున్, సాత్యకియున్, లోనుగాన్ = మొదలుగాన్, అనుజవర్గంబున్ = సోదరసముదాయమును, ఇందును సముచ్చయము (వీరు కృష్ణునకు దాయాదులగు సోదరులు) గదా . . లై, గదా = గుదియ, కార్ముక = విల్లు, ప్రదర = బాణము, ఆది = మొదలైన, ఆయుధ = యుద్ధసాధనములు, పాణులై = చేతులందుఁ గలవారై, అనుజవర్గమునకు ననుజులకు భేదము లేదు గావున నిది యనుజవర్గమునందలి యనుజులకు విశేషణము అరుగుదేరన్ = కూడ రాఁగాన్, వారలం గూడి = వారిం గలసికొని, వాఁడి = ప్రతాపము, దలిర్పన్ = చిగురింపఁగాన్, (అతిశయింపఁగా నని యర్థము) పరతెంచి = త్వరపడివచ్చి, మించి = అతిక్రమించి, మృగరాడ్డింభంబు = సింగపుంగొదమ, కుంభీంద్రపంక్తిన్ = గజసముదాయమును, తగన్ = యుక్తముగాన్, మార్కొనుభంగిన్ = ఎదుర్కొనురీతిని, విందానువిందాదులన్ = విందుఁడు ననువిందుఁడు మొదలగువారిని, తాన్ = కృష్ణుఁడు, కవిసెన్ = తాఱసించెను

శా. అంభోదస్తనితారవార్భటికి వి◆య్యాంబైననాదంబుతో
నంభోజాక్షుఁడు శంఖమొత్తుటయు సా◆త్యక్యాదివీరుల్ భుజా
స్తంభాదంభవిజృంభితాసితటిద◆ద్యద్దీప్తులన్ శౌర్యసం
రంభం బేర్పడఁ దాఁకి రవ్విమతవీ◆రస్ఫారసైన్యంబులన్. 36

అంభోజాక్షుఁడు = కృష్ణుఁడు, అంభోద . . కిన్, అంభోద = మేఘములయొక్క, స్తనిత = ఉరుముసంబంధమైన, ఆరవ = ధ్వనియొక్క, అస్ఫటికిన్ = అతిశయమునకున్, విస్ఫూర్జితంబైన నాదంబులోన్ = మట్టుమైన ధ్వనిలోన్, (సమానమైనధ్వనితో నని యర్థము) శంఖము, ఒత్తుటయున్ = పూరించినోడనే, (ఇచట 'యున్' ఆనంతర్యార్థమున నుపయోగింపఁబడెను) సాత్యక్యాదివిభుల్ = సాత్యకి మొదలగు పరాక్రమశాలులు, భుజా . . లన్, భుజాస్తంభ = స్తంభములం బోలినచేతులయందలి, అదంభ = నిష్కపటముగా, విజృంభిత = చెలరేఁగిన, అసి = కత్తులనెడు, తటిత్ = మెఱుములనుండి, ఉద్యత్ = బయలువెడలుచున్న, దీప్తులన్ = కాంతులచేతన్, శౌర్యసంరంభంబు = విక్రమాతిశయము, ఏర్పడన్ = వెల్లడియగునట్లు, అవ్విమత . . లన్, అవ్విమత = పైఁ జెప్పినపగవారైన, వీర = పరాక్రమశాలులయొక్క, స్ఫార = అధికమైన, సైన్యంబులన్ = సేనలను, తాఁకిరి = మాఱొకొనిరి (యుద్ధముచేయ నెదిరించిరని యర్థము)

క. చిందంబులు పూరించుచు
స్యందనముల నిలిచి వింట్ల ♦ నరులు మొఱయ న
వ్విందానువిందు లపుడు ము
కుందునిపై విడిచి రమిత ♦ ఘోరశరంబుల్ 37

అవ్విందానువిందులు, అపుడు = ఆకాలమున, స్యందనములన్ = రథములందున్, నిలిచి, చిందంబులు = శంఖములను, పూరించుచున్ = ఊఁదుచున్, నరులు = బాణముల సంధానముచేసెడు వింటినారిఁడిమితావులు, మొఱయన్ = ధ్వనింపఁగాన్, (శత్రువులు మొఱ్ఱలిడఁగా నని యుఁ గొందురు) ముకుందునిపైన్ = కృష్ణునిమీఁదను, అమితఘోరశరంబుల్, అమిత = కొలఁదిలేని, ఘోర = క్రూరములగు, శరంబుల్ = బాణములను, వింట్లన్ = ధనువులనుండి విడిచిరి = ప్రయోగించిరి

స్రగ్విణీవృత్తము
వీరహుంకారముల్ ♦ ధ్వజటంకారము
ల్కార వేభేంద్రఘీంకారముల్ ♦ దిక్కులన్
భోరు కల్గం జమూ ♦ ద్భూత రేణుచ్ఛటల్
వారిదాధ్వంబు గ ♦ ప్ప న్మొనల్ దాఁకినన్. 38

వీర.....ఘీంకారముల్, వీర=పరాక్రమశాలులయొక్క, హుంకార = హుమ్మనుధ్వనులును, మౌర్వీజ = నారి ( నిలాగివిడుచుట ) వలనఁ గలిగిన, టంకార=టమ్మనుధ్వనులును, ఢక్కారవ=వాద్యములధ్వనులును, ఇభేంద్ర=గజశ్రేష్ఠములయొక్క, ఘీంకారముల్=గీఁకలును, దిక్కులన్=అన్నిదిశలయందును, ఘోరకల్గన్= ధ్వనింపఁగాన్, చమూ.....చ్ఛటల్, చమూ=సేనలవలన, ( సేనలకాలిత్రొక్కుడువలన నని యర్థము ) ఉద్భూత=పుట్టిన, రేణుచ్ఛటల్=పరాగసముదాయములు వారిదాధ్వంబు=ఆకాశమును, ( మేఘమార్గమును ) కప్పన్=ఆక్రమింపఁగాన్, మొనల్=సైన్యములు, తాఁకినన్ = ( యుద్ధముచేయ ) నెదుర్కొనఁగాన్ ( ముందుపద్యముతో నన్వయము. )

మ. హిమసంఘాతము బంధురం బగుచు శైలేంద్రంబుపైఁ గ్రమ్ముచం
దమునన్ శాత్రవచాపముక్తనిశితాస్త్రంబుల్ నిజాంచచ్ఛతాం
గముపైఁ గప్పిన నయ్యదూద్వహుఁడు శార్ఙ్గక్రూరనారాచసం
ఘముచే వానిఁ దెరల్చెఁ దుత్తుమురుగాఁ ఖండించి యొక్కుమ్మడిన్.

హిమసంఘాతంబు= మంచుసముదాయము, ( అధిక మైనమం చని యర్థము ) బంధురంబు=ఒప్పినది, అగుచున్, శైలేంద్రంబుపైన్=గొప్పపర్వతమువీఁదిభాగమును, క్రమ్మునందమునన్=ఆవరించినవిధముచేతను, శాత్రవ ... బుల్, శాత్రవచాప=పగవారివింటినుండి, ముక్త=విడువఁబడిన, నిశితాస్త్రంబుల్=వాఁడిగలబాణములు, నిజాంచ ..పైన్, నిజ=తనది ( కృష్ణునిది ) యగు, అంచత్=ప్రకాశించుచున్న, శతాంగముపైన్=రథమువీఁదిభాగమును, కప్పినన్=ఆవరింపఁగాన్, అయ్యదూద్వహుఁడు=ఆకృష్ణుఁడు, ( యదువంశస్థుల కౌన్నత్యముం గలిగించువాఁడు ) శార్ఙ్గక్రూరనారాచసంఘముచేన్=శార్ఙ్గమనుధనువునుండి(విడువఁబడిన) క్రూరమైన బాణములసముదాయముచేన్, వానిన్=ఆశత్రువులు ప్రయోగించినబాణములను, తుత్తుమురుగాన్=పొడి యగునట్లు, ఖండించి=నఱికి, ఒక్కుమ్మడిన్=ఒక్కమాఱే, తెరల్చెన్=తొలఁగించెను.

మహాస్రగ్ధర.

గదుఁ డుగ్రక్రోధతామ్రీకృతవిలయచరత్కాలకాలుండువోలెన్
గదనక్షోణిన్ భుజాగ్రగ్రథితధగధగత్ఖడ్గధారాహతిం బల్

మదమాతంగంబులం ద్రుం ♦ప నవి పవిహతి ♦ క్ష్మాధ్రజాలంబులీల
న్రొదతోడంగూలమావం ♦ తులువడిమడియన్ ♦ ఘోరయుద్ధంబొనర్చెన్

గదుఁడు, ఉగ్ర .. .తన్, ఉగ్ర = భయంకరమైన క్రోధ = కోపముచేతను, (పరులు చేసినయపకారము సహింపమిచే మనసునం గల్గినకారము క్రోధము.) తామ్రేక్షతన్ = ఎఱ్ఱనికన్నులు గలుగుటచేతను. విలయ ..వోలెన్, విలయ = ప్రళయకాలమందున్, చరత్ = తిరుగుచున్న, కాలకాలుండువోలెన్ = రుద్రుఁడువలె, కదనక్షోణిన్ = యుద్ధభూమియందున్, భుజాగ్ర . .హతిన్, భుజాగ్ర = చేతిచివరను, గ్రథిత = కూర్పఁబడిన, ధగధగత్ = మెఱయుచున్న, ఖడ్గ = కత్తియొక్క, ధారా = వాయియొక్క, ఆహతిన్ = దెబ్బచేతను, బలిమదమాతంగంబులన్ = బలిష్ఠమైనమదపుటేనుఁగులను, త్రుంపన్ = నఱుకఁగాన్, అవి = ఆయేనుఁగులు, పవి... .లీలన్, పవి = వజ్రాయుధముచేతను, హతి = కొట్టఁబడిన, క్ష్మాధ్రజాలంబు = పర్వతసమూహముయొక్క, లీలన్ = విలాసముచేతను, (విధముచేతనని యర్థము) రొదతోడన్ = ధ్వనితోన్, కూలన్ = పడిపోవఁగాన్, మావంతులు = మావటీవాండ్రు, పడి = భూమియందుఁబడి, మడియన్ = చావఁగాన్, ఘోరయుద్ధంబు = భయంకరమైనయుద్ధమును, ఒనర్చెన్ = చేసెను

చ. యదుపతి విందుసారథి నొ ♦ కమ్మునఁ ద్రుంచిననంత శౌరిపై
గద ననువిందుఁ డేయఁ బరి ♦ ఘమ్మున దాని నడంచి నిష్ఠుర
ప్రదర మతండు నైవ నుద ♦ రం బదరన్ భిదురంబు దాఁకి న
ట్లెద విదళించి పోయిన మ ♦ హిం బడె నయ్యనువిందుసాదియున్.

యదుపతి = కృష్ణుఁడు, విందసారథిన్ = విందునియొక్కయరదము తోలువానిని, ఒకమ్మునన్ = ఒకబాణముచేతన, త్రుంచినన్ = సంహరించినన్, అంతన్ = పిమ్మటను, అనువిందుఁడు, శౌరిపైన్ = కృష్ణునిమీఁదను, గదన్, ఏయన్ = ప్రయోగింపఁగాన్, పరిఘమ్మునన్ = పరిఘ మనునాయుధముచేతన, అతఁడు = ఆగోపాలుఁడు, దానిన్ = అనువిందుఁడు ప్రయోగించినగదను, అడంచి = త్రుంచి, నిష్ఠురప్రదరము = కఠినమైనబాణమును, వైవన్ = వేయఁగాన్, ఉదరంబు = గర్భము, అదరన్ = చలింపఁగాన్, గుండెలు పగులఁగా నని యర్థము భిదురంబు = వజ్రాయుధము, తాఁకినట్లు = తగిలినట్లు, ఎదన్ = హృదయమును, విదళించి = (ఆబాణము) చీల్చి, పోయి

నన్=పోఁగాన్, అయ్యనవిందసాదియున్=ఆయనువిందునిరథము గడపువాఁడు సయితము, మహిన్=భూమిమీఁదను, పడెన్=పడియెను, మృతినొందె నని యర్థము.

మ. కడిఁదిన్ సాత్యకితో ద్విషన్నృపులు వీఁ◆కం దాఁకి క్రొవ్వాఁడి నూ
పెడితూపుల్ వరఁగించి రథ్యముల నొ◆ప్పింపన్ దృఢక్రోధుఁడై
వడి నాతం డరియోధయూథము మహా◆భ్రశ్రేణి ఝంఝానిలం
బెడలం దోలిచినభంగి సాయకమహా◆వృష్టిం దొలంగించినన్. 42

ద్విషన్నృపులు=శత్రురాజులు, కడిఁదిన్=కఠినముగాన్, సాత్యకితోన్, తాఁకి=ఎదుర్కొని, వీఁకన్=ఉత్సాహముతోన్, క్రొవ్వాఁడి=ఎక్కువపదనుగ, నూపెడితూపులు=కనపఱచుబాణములను, (పదను గలబాణముల నని యర్థము) పరఁగించి=ప్రయోగించి, రథ్యములన్=గుఱ్ఱములను, నొప్పింపన్=బాధింపఁగాన్, ఆతండు=ఆసాత్యకి, దృఢక్రోధుఁడై=బలమైనకోపము గలవాఁడై, వడిన్=వేగముతోన్ అరియోధయూథమున్=శత్రుపరాక్రమశాలులసముదాయమును, సజాతీయైః కులం యూథం తిరశ్చాం పుంనపుంసకం అ యూథశబ్దము పశ్వాదులసముదాయమునకే యుపయోగింపవలయు నని యమరుఁడు చెప్పెను గాని కవు లన్నిసముదాయములకు వాడుచునే యున్నారు ఝంఝానిలంబు=వానతోఁ గూడినగాలి, మహాభ్రశ్రేణిన్=పెద్దమేఘములసముదాయమును, ఎడలం దోలిచినభంగిన్=కొట్టివేయురీతిచేతను సాయకమహావృష్టిన్=బాణములగొప్పజడివేన్, తొలంగించినన్=(యుద్ధభూమినుండి) తొలఁగాన్, ముందుపద్యముతో నన్వయము.

ఉత్సాహావృత్తము.

అత్తఱిన్ హాళాహళుల్ వి◆యత్తలంబు గ్రమ్మ రా
హుత్తరాజితత్తడుల్ స◆ముత్కటంపునెత్తుటం
జొత్తిలంగ డంగి సంద◆సూనుమీఁద విందుఁడు
వ్వెత్తుగా నిగుడ్చె నంత◆ వీతిహోత్రబాణమున్. 43

అత్తఱిన్=ఆకాలమునందు, హాళాహళుల్=గొప్పధ్వనులు, వియత్తలంబు=ఆకాశమును, క్రమ్మన్=ఆక్రమింపఁగాన్, రాహుత్తరాజి=గుఱ్ఱపురౌతులసముదాయమును, తత్తడుల్=గుఱ్ఱములును, సముత్కటంపునెత్తుటన్=అధికమైనరక్తముచే, జొత్తిలన్=ఎఱ్ఱవాఱఁగాన్, (గుఱ్ఱపురౌతులు గుఱ్ఱములును రక్తముచేఁ దడిసిఁగా

అని యర్థము ) విందుఁడు, నందసూనుమీఁదన్ = నందునికొమరునిమీఁదను, కడంగి = ప్రయత్నించి, అంతన్ = పిమ్మటను, వీతిహోత్రబాణమున్, ఆగ్నేయాస్త్రమును, ( వీతి = అశ్వము, హోత్రము = హోమద్రవ్యము గాఁ గలవాఁడు వీతిహోత్రుఁడు = అగ్ని, అతఁ డధిదేవతగాఁ గలబాణము = వీతిహోత్రబాణము ) ఉద్వృత్తిగాన్ = ఒక్కమాఱుగాన్, ( త్వరగా అని యర్థము ) నిగుడ్చెన్ = ప్రయోగించెను.

మహాస్రగ్ధర

అతఁ డాగ్నేయాస్త్రమ ట్లేయఁగ నది గగనం♦బంటి హాలాహలోల్కా
ప్రతిమంబై సేన గంపిం♦పఁగ భుగభుగరు♦క్పరిజ్వలజ్జ్వాలజాల
ప్రతతోద్యద్విస్ఫులింగ♦ప్రకటచిటచిట♦ధ్వానమై వేగ రా న
ద్భుత మొప్పన్ వారుణాస్త్రం♦బున జలరుహనా♦భుండు వారించె దానిన్.

అతఁడు = ఆవిందుఁడు, ఆగ్నేయాస్త్రము = అగ్నిబాణమున, అట్లు, ఏయఁగన్ = గొప్పపూనికతోఁ బ్రయోగింపఁగాన్, అది = ఆయస్త్రము, గగనంబు = ఆకసమును, అంటి = తాఁకి, హాలా . . బై, హాలాహల = కాలకూట మనువిషముయొక్క, ఉల్కాప్రతిమంబై = జ్వాలయే సాటిగాఁ గలదియై, ( ఉల్కాశబ్దమునకుఁ గొఱవి యనియే యర్థముగాని సందర్భమునుబట్టి యిట జ్వాల యని చెప్పవలెను ) సేన = దండు ( లోనిజనులు ) కంపింపన్ = భయమును వహించుచుండఁగాన్, భుగభుగ . . ధ్వానమై, భుగభుగ = భుగభుగ లాడెడు (ఇది మంటయందలి చప్పుడు ననుకరించెడిశబ్దము ) రుక్ = కాంతిచేతను, పరిజ్వలత్ = మండుచున్న, జ్వాలాజాల = మంటలగుంపునుండి, ప్రతత = అధికముగాన్, ఉద్యత్ = ఎగయుచున్న, విస్ఫులింగ = మిణుఁగుఱులయొక్క, ప్రకట = ప్రసిద్ధమైన, చిటచిటధ్వానమై = చిటచిటయనుధ్వనిగలదై, వేగన్ = త్వరితముగాన్, రాన్ = రాఁగాన్, జలరుహనాభుండు = కృష్ణుఁడు, అద్భుత మొప్పన్ = వింతపుట్టునట్లు, వారుణాస్త్రంబునన్ = వరుణదేవతాక మైనయస్త్రముచేతను, దానిన్ = ఆగ్నేయబాణమును, వారించెన్ = అడ్డగించెను విందుఁ డేసినయాగ్నేయబాణమువలన నగ్ని పుట్టి సేనలఁ గాల్పఁగాఁ గృష్ణుఁడు వరుణదేవతాక మైనవారుణాస్త్రమున జలము పుట్టించి దాని వారించెను

ఉ. విందుఁడు శక్తిబాణ మను♦విందుఁడు నూఱుశరంబు లేయ గో
విందుఁడు వాని నెల్లనుబ♦విప్రతిమానని శాతసాయకా

ళిం దునుమాడి శౌర్యము ద ♦ లిర్పఁగ నొక్కట వారిరథ్యము
ల్గుందుచు వ్రీలఁ జాపములు ♦ గూల సిడంబులు వ్రాల నేసినన్. 45

విందుఁడు, శక్తిబాణము = శక్తియను నాయుధమును, అనుగొంపఁగను, నూఱుశరంబులు = నూఱు బాణములను, ఏయన్ = ప్రయోగింపఁగాన్, గోవిందుఁడు = కృష్ణుఁడు వానినెల్లను = వారు ప్రయోగించినయాయుధములన్నిటిని, పవి ... .ళిన్, పవి = వజ్రాయుధమే, ప్రతిమాన = సాటిగాఁగల, నిశాత = వాఁడిమైన, సాయక = బాణముల యొక్క, ఆళిన్ = సముదాయముచేతను, తునుమాడి = ముక్కలుచేసి, శౌర్యము = పరాక్రమము, తలిర్పఁగన్ = అతిశయింపఁగాన్, ఒక్కటన్ = ఒకకాలమందే, వారిరథ్యముల్ = వారిగుఱ్ఱములు కుందుచున్ = దుఃఖించుచు, కూలన్ = పడిపోవునట్లును, చాపములు = విండ్లు, వ్రీలన్ = ముక్కలగునట్లును, సిడంబులు = జెండాలు, వ్రాలన్ = విఱుగునట్లును, ఏసినన్ = కొట్టఁగాన్, ముందుపద్యముతో నన్వయము

గీ. విరథులై యల్గి విందాను ♦ విందు లపుడు
కేడెములు వాలుటడిదముల్ ♦ కేల్లఁ గొనుచు
నురిక లంఘించి రాఁగ న ♦ చ్యుతుఁడు శితశ
రములు పరఁగించెఁ దత్తను ♦ త్రములు పగుల. 46

విందానువిందులు, విరథులై = రథములుపోయినవారై, (పోయినరథములు కల వారై) అపుడు = ఆకాలమున, అల్గి = కోపించి, కేడెములు = డాలులను, (ఇది ఖేటశబ్దభవము) వాలుటడిదముల్ = పొడుగగు కత్తులను, కేల్లన్ = చేతులతోన్, కేలుశబ్దము నిత్యైకవచనాంతమని చెప్పుదురు దీనికి బహువచనము వివక్షించునపుడు పూర్వ 'మను' గాని మున్ను 'దోయి' గాని యుపయోగింతురు. ప్రయోగములు సైత మేకవచనముననే తెలుపు గాన్పించును. గాని బహువచనము సైత మొకటి రెండు ప్రయోగము లాముక్తమాల్యదయందుమాత్రము గాన్పించుచున్నవి కొనుచున్ = ధరించుచున్, ఉరక = మానక, లంఘించి = దాఁటి, రాఁగన్ = వచ్చుచుండఁగాన్, అచ్యుతుఁడు = వాసుదేవుఁడు, తత్తనుత్రములు = వారికవచములు, పగులన్ = పగిలిపోవునట్లు, శితశరములు = వాఁడిబాణములను, పరఁగించెన్ = ప్రయోగించెను.

క. ఆయమ్ము లతిరయమ్మున
నాయమ్ముల నాటి పాటి ♦ తాస్థికములుగాఁ

గాయమ్ముల నెత్తురోలుకు
గాయమ్ముల వారు భీతి • గని పఱచి రొగిన్. 47

ఆయమ్ములు=కృష్ణుఁడు వేసినబాణములు, అతిగాయమ్మునన్=మిక్కిలి వేగముతోన్, ఆయమ్ములన్=ఆయువుపట్టులందున్, నాటి=గ్రుచ్చుకొని, పాటితాస్థికములు=పగులఁగొట్టఁబడినయెముకలు గలవి, కాన్=కాగాన్ కాయమ్ములన్=శరీరములందున్. నెత్తురోలుకుగాయమ్ములన్=నెత్తురుగారెడుపుండ్లచేతను, వారు = ఆవ్వింధానువిందులు, భీతిగని=భయపడి, ఒగిన్=ఒక్కసారియే, పఱచిరి= పాఱిపోయిరి. ఇందుఁ ద్వ్యక్షరప్రాసము వేయఁబడెను

గీ. వీఁగి యీగిలి విందాను • విందు లరుగఁ
దోన సేనాధిపులు వారి • తోన మొనలు
విఱిగి తిరుగక యేడ్తెఱ • వెఱచి పఱచెఁ
గ్రోల్పులికిఁ గాలుమార్గంపు • గుంపువోలె 48

విందానువిందులు, ఈగిలిన్=ఈప్రకారముచేతను, వీఁగి=భయపడి, అరుగన్=పాఱిపోఁగాన్, తోన=వెంటనే, సేనాధిపులు=సేనానాయకులును, వారితోన=ఆసేనానాయకులతోడనే, మొనలు=సైన్యములును, గ్రోల్పులికిన్=పెద్దపులికిన్, కాలుమార్గంపుగుంపువోలెన్=పాఱిపోవుమృగములసముదాయమువలెను (మృగముల సంబంధమైనదిమార్గము. ఇది సముదాయమైనను లేక వానియందుండుకస్తూరి మొదలగువస్తువైనను గావచ్చును.) వెఱచి=భయపడి, ఏడ్తెఱన్=అతిశయముతోన్, తిరుగక=వెనుకకుఁ దిరుగక, విఱిగి=చెదరి, పఱచెన్=పాఱిపోయెను.

మ. కమలాక్షుం డిటు శాత్రవప్రతతి సం • గ్రామంబునం గెల్చి చిందము పూరించి నిజాప్తయుక్తుఁ డయి భ • ద్రాకన్యకామూల్యరత్నముఁ దాఁ దోడ్కొని వచ్చి తజ్జనకునిం • ట న్నిల్చి దివ్యప్రభారమణీయోపవనీకనత్కనకహ • ర్మ్యస్థాయియై యున్న దోన్. 49

కమలాక్షుండు=శ్రీకృష్ణుఁడు ఇటు=మీఁదటిప్రకారమునను, శాత్రవప్రతతిన్=పగవారిసముదాయమును, సంగ్రామంబునన్=యుద్ధమునందున్, గెలిచి=జ

యించి, చిందము=శంఖమును, పూరించి=ఊఁది, నిజాప్తయుక్తుఁడై=తనవారిగా,బంధువులతోఁ గూడినవాఁడై, భద్రాకన్యకామూల్యరత్నమున్=భద్రాకన్య యనువెలలేని రత్నమును, శౌరి=కృష్ణుఁడు, గొనితెచ్చి=తిసికొనివచ్చి,తజ్జననింటన్=ఆ మెతండ్రియింటియందున్, నిల్పి=ఉంచి, దివ్య        స్థాయియై, దివ్య=సుందరమైన, ప్రభా=కాంతిచేతను, రమణీయ=మనోహరమైన,ఉపవని=తోఁటయందున్ కనత్=ప్రకాశించుచున్న, కనకహర్మ్యస్థాయియై=బంగారుమేడం బ్రవేశించినవాఁడై, ఉన్న వాన్=ఉన్న ప్రభువు, ముందుపద్యముతో నన్వయము

ఉ. కేకయభర్తయుం గొమరి ♦ కిం దగినట్టివిభుండు సర్వలో
కైకనుతప్రతాపుఁ డగు ♦ కృష్ణుఁడుదక్కఁ గలండె యంచు సు
శ్లోకుఁ బురోహితుం బిలిచి ♦ శోభనరేఖ యొసంగి శౌరి వే
తోఁకొనరమ్మటంచు శుభ ♦ దుందుభిభద్రగజాశ్వరాజితోన్. 50

కేకయభర్తయున్ = కేకయదేశముయొక్క రాజును, కొమరికిన్ = కూఁతునకున్ తగినట్టివిభుండు=తగినమగఁడు, సర్వలోకైకనుతప్రతాపుఁడు=ఎల్లజనులచేతను బొగడఁబడినతేజము గలవాఁడు, (లే) సప్రతాపః ప్రభావశ్చ యత్తేజః కోశదండజం అ బండారమువలనను దండువలనను గలిగినతేజము ప్రతాపము నగును ‒ అని యమరము అగు కృష్ణుఁడుదక్కన్ = అయినకృష్ణమూర్తిగాక, కలండె = కలఁడా? లేఁడనియర్థము అంచున్ = అనియాలోచించుచున్, సుశ్లోకున్ = మంచికీర్తి గలవానిని, పురోహితున్ పిలిచి, శౌరిన్ = కృష్ణుని, వే = శీఘ్రముగాన్, తోడ్కొనిరమ్ము = తీసికొనిరమ్ము, అటంచున్, శోభనరేఖ = శుభరేఖను, (వివాహమును దెలుపుకమ్మను,) ఒసంగి = యిచ్చి, శుభ.      రాజితోన్, శుభ = మంగళమును దెలిపెడు, దుందుభి = భేరులయొక్కయు, భద్రగజ = భద్రజాతియేనుఁగులయొక్కయు, అశ్వ = గుఱ్ఱములయొక్కయు, రాజితోన్ = సమూహముతోన్, (పంపెన్)

వ. ఇట్లు పంచినం బురోహితుండు ముకుందుని సందర్శించి శుభరేఖ యొసంగి యతనివలన నమస్కారాదివిధుల నారాధితుండై పెండ్లికొడుకవు గమ్మని దీవించె నిటఁ గేకయేంద్రుండును శ్రీకృష్ణకళ్యాణోత్సవసందర్శనోత్సుకులై వచ్చినభూమార్జనకులసహదేవులనుఁ

కుంతలకోసలాదిదేశాధీశు లగుబంధువులను సవినయప్రియసంభాషణాలింగనాదుల నాదరించి తగినవిడిమట్టుల విడియించి మగిడి యాస్థాని కేతెంచి పెండ్లికొడుకుం గావించుటకుం బంచినం బుణ్యాంగనలు మంగళగీతంబులతో శోభనహరిద్రాక్షతంబులు గోపాలుఫాలతలంబున నునిచి రంత 51

ఇట్లుపంచినన్ = ఈప్రకారము పురోహితు నంపఁగాన్, పురోహితుండు, ముకుందునిన్ = కృష్ణునిని, సందర్శించి = చూచి, శుభరేఖ = పెండ్లికమ్మను, ఒసంగి = ఇచ్చి, అతనివలనన్ = కృష్ణునివలనన్, నమస్కారాదివిధులన్ = నమస్కారము మొదలగు నేర్పాటులచేతను, ఆరాధితుండై = పూజింపఁబడినవాఁడై, పెండ్లికొడుకవు, కమ్మని = అగుమని, దీవించెన్, ఇటన్ = పురమునందున్, లోకయేంద్రుండును = లోకయపరిభ్రమండును, శ్రీకృష్ణ.. .వై, శ్రీకృష్ణ = కృష్ణునియొక్క, కళ్యాణ = వివాహమునెడు, ఉత్సవ = వేడుకను, సందర్శన = చూచుటయందు, ఉత్సుకులై = ప్రయత్నించినవారై, వచ్చిన భీమార్జుననకులసహదేవులను, కుంతలకోసలాదిదేశాధీశులు = కుంతలము, కోసలము మొదలగు దేశములకుఁ బ్రభువులు, అగు బంధువులను = అగు చుట్టములను, సవి-య . . . లన్, సవినయ = అడఁకువతోఁ గూడినవినయము, ప్రియ = ఇష్టములు నగు, సంభాషణ = మాటలచేతను, ఆలింగనాదులన్ = కౌఁగిలింతలు మొదలైనవానిచేతను, ఆదరించి = గౌరవించి, తగినవిడిమట్టులన్ = అనుకూలమైనవిడుదులందున్, విడియించి = ప్రవేశపెట్టి, మగిడి = తిరిగి, ఆస్థానికిన్ = సభకున్, ఏతెంచి = వచ్చి, పెండ్లికొడుకుం గావించుటకున్, (కృష్ణునిని) పెండ్లికిం దగినయలంకారము గలవానిని జేయుటకున్, పంచినన్ = ఆనతీయఁగాన్, పుణ్యాంగనలు = ముత్తైదువలు, మంగళగీతంబులతోన్ = శుభములగుపాటలతోన్, శోభనహరిద్రాక్షతంబులు = పక్కినిపసపు(...)లగ, గోపాలుఫాలతలంబునన్ = కృష్ణునొసటను, ఉనిచిరి = ఉంచిరి అంతన్ = పిమ్మటను,

ఉ. సంపఁగెనూనె నంటి పెలు ♦ చన్ బస ప్రాసఁగి నల్గువెట్టి మే
ల్కెంపులనత్తుసొంపులకు ♦ కింపఁ బుటుంగు చనుంగివం గుబా
ళింప మెఱుంగుముంగురులు ♦ లేఁజెమటం బదునై నటింప నై
లింపవధూసమాన యొక ♦ లేమ మురాసురమర్మభేదికిన్. 52

నైలింపవధూసమాన = దేవతాస్త్రీతో సమానురాలు, ఒకలేమ = ఒకయంగన,

మేల్కెంపులసత్సొంపు = ప్రశస్తమైన కెంపులు తాపినముక్కుపోఁగుయొక్క చక్కఁదనము, తులకింపన్ = ప్రకాశింపఁగాన్, చనుఁగవన్ = చన్నులదంటయందున్, పునుఁగు = జవ్వాది, గుబాళింపన్ = పరిమళింపఁగాన్, మెఱుఁగుముంగురులు = మెఱయుచున్న నొసటిపై నున్న వెండ్రుకలు, లేఁజెమటన్ = అల్పమైనచెమ్మటచేతను, పదనై = తడిసినవియై, నటియింపన్ = ఆడుచుండఁగాన్, మురాసురమర్మభేదికిన్ = కృష్ణునకున్, (మురుఁడను రక్కసుని యాయువుపట్లు భేదించినవానికిన్) సంపఁగనూనెన్ = మంచివాసన గలనూనెన్, అంటి = (శిరమున) రాచి, వెలుచన్ = అతిశయముతోన్, పసపూఁతన్ = పచ్చనికాంతి (శరీరమునఁ) గల్గునట్లు, నల్గువెట్టెన్ = పరిమళద్రవ్యములతోఁ గూడినపిండిని బూసెను.

క. అలకములు విప్పి గంధా
మలకం బిడి చెలులు సంతస ♦ మదపుమెఱుఁగుతోఁ
దెలిగొజ్జఁగిపన్నీటం
జలకము లాడించి రెలమి ♦ జలజదళాక్షున్. 53

చెలులు = కొందఱుస్త్రీలు, ఎలమిన్ = సంతోషముతోన్, అలకములు = కురులను, విప్పి, గంధామలకంబు = పరిమళము గలయుసిరికపప్పును, ఇడి = వానిపైనుంచి, ఉసిరికపప్పుతో రుద్దియని యర్థము సంతసమదపుమెఱుఁగుతోన్ = పునుఁగుతోఁ గాఁచిననూనెపూఁతతోన్, తెలిగొజ్జఁగిపన్నీటన్ = తెల్లనిది యగుగొజ్జఁగిపూలనుండి జాఱిన మంచునీటిచేతన్, జలజదళాక్షున్ = కృష్ణుని, జలకము లాడించిరి = స్నానము చేయించిరి

సీ. వలిపమెఱుంగుచేఁ ♦ జెలి యొత్తె తడి యొత్తెఁ
గనకాంబరం బొర్తు ♦ గట్టనొసఁగెఁ
గప్రసఁ దిలకము ♦ కస్తురి దిద్ద నొకతె సాం
కిఱుఁటీరాగరు ♦ కలప మలఁదె
మౌళిపై నొక్కతె ♦ మకుటంబు సంధింప
నొకతె ముత్యాలహా ♦ రికము గూర్చె
నొకతె కేయూరహా ♦ రికలాపములు గూర్చ

నొక్కతె కట్టాణి ♦ యొంటు లునిచె
నొకతె కౌస్తుభరత్నమా ♦ లిక ఘటింప
నొకతె కంకణరత్నము ♦ ద్రికలు గూర్చె
నఖిలభూషణభూషితుఁ ♦ డగుచు యదువి
భుండు రంజిల్లెఁ బూర్ణచం ♦ ద్రుండుపోలె. 54

ఓర్తు చెలి = ఒకానొక స్త్రీ, వలిపమణుంగు వెంటన్ = సన్నమైనదియు నుదికినదియు నగు తెల్లబట్టచేతన్, తడియొత్తన్ = తడిని దుడుచుచుండఁగాన్, ఓర్తు = మఱియొకతె, కనకాంబరంబు = బంగారు ( సరిగగల ) వస్త్రమును, ( మధ్యమపదలోపసమాసము ) కట్టనొసఁగెన్ = ధరించుటకు నిచ్చెను ఒక్కతె, కప్రానన్ = కప్పురముతోన్, తిలకము = బొట్టును, దిద్దన్ = సవరింపఁగాన్, ఒకతె = ఇంకొకతె, సాంకవపటీరాగరుకలపము = పునుఁగు మంచిగంధము నగరు మొదలగుపరిమళవస్తువులతోఁ గూర్చినపూఁతను, అలఁదెన్ = ( మేనఁ ) బూసెను. ఒకతె, మౌళిపైన్ = శిరమునందున్, మకుటంబు = కిరీటమును, సంధింపన్ = కూర్పఁగాన్, ఒకతె, ముత్యాలబాసికము = ముత్యములతోఁ గట్టినలలాటికమును, ( పెండ్లికాలమున వధూవరులమోమునం గట్టుకొనుభూషణము. ) కూర్పన్ = ఉంచెను ఒకతె, కేయూరహారకలాపములు = భుజకీర్తులు ముత్యాలదండలు ననుభూషణములను, కూర్పన్ = సంఘటింపఁగాన్, ఒక్కతె, కట్టాణియొంటులు = మంచిముత్యములతమ్మంటులను ఉనిచెన్, ఒకతె, కౌస్తుభరత్నమాలికన్ = కౌస్తుభమనురత్నముతోఁ గూడినదండను, ( కుస్తుభము = సముద్రము. దానం బుట్టినది కౌస్తుభము దేవదానవులు సముద్రమును మథించినప్పుడందుఁ బుట్టినయొక కెంపు కౌస్తుభ మనంబడు ) ఘటింపన్ = ( మెడయందుఁ ) జేర్పఁగాన్, ఒకతె, కంకణరత్నముద్రికలు = కడియములను రత్నపుటుంగరములను, కూర్చెన్ = తొడిగెను యదువిభుండు = కృష్ణుఁడు, అఖిలభూషణభూషితుండు = ఎల్లయాభరణములచే నలంకరింపఁబడినవాఁడు అగుచున్, పూర్ణచంద్రుండుపోలెన్ = నిండుచంద్రుఁడువలె, రంజిల్లెన్ = ప్రకాశించెను ఉపమాలంకారము.

శా. సంధింపన్ శుభలగ్నముం గదిసె న ♦ బ్జాతాక్షుఁ దెండంచు వే
బంధుక్షత్త్రికుమారులం దొరల సం ♦ పన్ వారి లాందోళికా

గంధేభేంద్రరథాధిరూఢు లయి వే । గన్ శౌరి మత్తద్విప
స్కంధారూఢుని జేసి రుత్సవ మెసం । గం గాహళుల్ మ్రోయఁగన్.

సంధింపన్ = (పెండ్లివారి) నెదుర్కొనుటకున్, శుభలగ్నమున్ = (శుభకార్యమునకు) వివాహమున కేర్పడినకాలమును, ఇట సువర్ణము పాదపూరణార్థము కదిసెన్ = సమీపించెను అబ్జాతాక్షున్ = కృష్ణునిని, వే = శీఘ్రముగాన్, తెండంచున్ = తోడ్కొనిరండని, బంధుక్షత్రకుమారులన్ = చుట్టములగు రాచకొమరులను, దొరలన్ = (కొందఱు) సోదులను, అంపన్ = (కేకయరాజు) పంపఁగాన్, వారలు, ఆందోళికా... . .. లై ఆందోళికా = అందలములను, గంధేభేంద్ర = మదపుటేనుఁగులను, రథ = రథములను, అధిరూఢులై = ఎక్కినవారై, వేగన్ = త్వరతోన్, ఉత్సవము = వేడుక, ఎసంగన్ = అధికము కాఁగాన్, కాహళుల్ = దండుబూరలు, మ్రోయఁగన్ = ధ్వనింపఁగాన్, శౌరిన్ = కృష్ణునిని, మత్తద్విపస్కంధారూఢునిన్ = మదపుటేనుఁగుమెడ నెక్కినవానిని, చేసిరి = కావించిరి

మ. త్వరతో నత్తఱిఁ బౌరవారవనితా । వారంబు బహుప్రహా
ర్షరసం బుప్పతిలం గృహాంగణమణీ । సౌధంబులన్ నిల్చి భా
స్వరభద్రేభముపై సువాణిపనిహొం । జౌడోలునందుండి బం
ధురఘంటాపథసీమ వచ్చుయదుసూ । నుం గాంచె నంచద్గతిన్ 56

అత్తఱిన్ = ఆకాలమునందున్, పౌరవారవనితావారంబు = పట్టణమందలి వేశ్యాస్త్రీలసముదాయము, గృహాంగణమణీసౌధంబులన్ = ఇంటిముంగిట నున్న మణులతోఁ గట్టఁబడిన) మేడలందున్, నిల్చి = ఉండి, భాస్వరభద్రేభముపైన్ = ప్రకాశించుభద్రజాతిగజముమీఁదను (భద్రగజమును వివాహాదిశుభకార్యము లందుఁ దఱచుగఁ బెండ్లికొమరుఁ డూరేగునపు డారోహించుచుండును) సువాణీ. . డీ, సువాణి = మంచిముత్తెములయొక్క, పని = రచనగల, హొంజౌడోలునందున్ = బంగారుపుటంబారియందున్, హొన్న + చౌడోలు = హొంజౌడోలు సమాసంబులం బ్రాతాదులతొలియచ్చుమీఁదివర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగా నగు. బా. సం. ఈసూత్రముచే హొన్నశబ్దములోని మొదటియక్షరము మాత్రము మిగులఁగా 'హొం + చౌడోలు' అని యయ్యెను అప్పుడు లుప్తశేషమునకుఁ బరుషములు పరము లగునపుడు నుగాగమం బగు నను (బా. సం) సూత్రముచే నుగాగమంబు ప్రాప్తింప హొను +

చౌడోలు నగును. పిమ్మటఁ బరువమునకు సంశాదేశమును ద్విత్వముఁ గనుస్వారాదేశమును రాఁగా హొంజోడోలనరూపము సిద్ధమయ్యెను. ఇచట ద్రుతమునకుఁ బూర్ణానుస్వార మొక్కటియే యాదేశమగును, గాని సత్వాదులు రావు ఉండి, ఒంపు ర . సీమన్, బంధుర = మనోహరమైన, పంటాపథసీమన్ = పెద్దబాటయందున్, అంచద్గతిన్ = ప్రకాశించుచుండెడి తోన్, (ఒందగమునముతో నని యర్థము) వచ్చునా దనూనున్ = వచ్చెడుకృష్ణునిని, అపార... రసంబు, అపార = అంతములేని, ప్రహర్షరసంబు = సంతోషానురాగములసముదాయము, ఉప్పతిలన్ = పుట్టఁగాన్, కాంచెన్ = చూచెను

చ. బలుఁదమి మీఱఁ జెందిరిక ♦ పావడపై సరిగంచుచీర కెం
దళుకులు దేరఁ బెన్నెరుల ♦ తావికిఁ దేఁటులు చేరఁ గొల్కులం
గళుకులు వారఁ దారకడ ♦ కింటికిఁ దారి దృగంశుపాళిక
ల్వలజిగి గేర శౌరి నొక ♦ వారవిలాసిని చూచె నోలగన్. 57

ఒకవారవిలాసిని = ఒకవేశ్య, బలుఁదమి = అధికమైనకోర్కి, మీఱన్ = అతిశయింపఁగాన్, జెందిరికపావడపైన్ = కుసుంబారంగుగలపావడమీఁదను, సరిగంచుచీర కెందళుకులు = జలతారుచుట్టునుం గలకోకయొక్క యెఱ్ఱనికాంతులు, తేరన్ = తేటపడఁగాన్, పెన్నెరులతావికిన్ = గొప్పవి యగు తలవెండ్రుకలపరిమళమునకున్, తేఁటులు = తుమ్మెదలు, చేరన్ = సమీపింపఁగాన్, కొల్కులన్ = కంటితుదలందున్, కళుకులు వారన్ = కాంతులు ప్రకాశింపఁగాన్, తార = కనుగ్రుడ్డు, కడకింటికిన్ = కంటితుదకున్, తారన్ = ప్రసరింపఁగాన్, దృగంశుపాళి = నేత్రకాంతులసముదాయము, కల్వలజిగి = కల్వలకాంతిని, గేరన్ = పరిహసింపఁగాన్, శౌరిన్ = కృష్ణుని, ఓలగాన్ = ప్రక్కగాన్, చూచెన్ = కనుఁగొనెను

చ. పగడపుమోవితో జిలుఁగుఁ ♦ బయ్యెదతో విడియంపుసొంపుతో
నిగనిగ నుబ్బుసిబ్బెముల ♦ నిగ్గులతోఁ దగుగుబ్బదోయితో
సొగసగువేశితో బెళుకు ♦ చూపులతో లలిలేఁతనవ్వుతో
జిగివగ గుల్క వచ్చి యొక ♦ చేడియ చూచెఁ ద్రిలోకమోహనున్.

ఒకచేడియ = ఒకానొకస్త్రీ, పగడపుమోవితోన్ = పగడముం బోలినయధరముతోను, జిలుఁగుఁబయ్యెదతోన్ = సన్నమైనపైటతోను, విడియంపుసొంపుతోన్ = తాం

బూలప్రహాసు గోను, నిగనిగనుబ్బుసిబ్బెములనిగ్గులతోఁ = నిగనిగతో నుప్పొంగెడుమూ న్నలకాంతితోఁ, తగుగుబ్బదోయితోఁ = ప్రకాశించుచన్నుఁగవతోను, సొగసగువే ణితోఁ = అందపుజడతోను, బెళుకుమూపులతోఁ = తళతళలాడుకన్నులతోను, లేఁత నవ్వుతోఁ = మందహాసముతోడను, జిగి = కాంతియును, వగ = విలాసమును, కు ల్కఁ = వ్యాపింపఁగాన్, వచ్చి = ఏతెంచి, త్రిలోకమోహనుఁ = ముల్లోకములవారి ని వలపింపఁజేయువానిని (కృష్ణుని) లలిఁ = ఉత్సాహముతోఁ, చూచెఁ.

ఉ. బాలిక యొర్తు వేగఁ జని ♦ బంగరుమేడను నిల్చి వేడ్కఁ గో
పాలుని లీలఁ జూచునెడఁ ♦ బయ్యెద యూర్పులగాలిఁ దూలినం
గేల నమర్చుచోఁ దమిబి ♦ గిఁ విడి నీవియె జాఱ భర్మపాం
చాలికమాటుఁ జేరెఁ గర ♦ సంగ్రథితాంశుకయై త్రపాగతిన్. 59

ఒర్తుబాలిక = ఒకానొకజవ్వని వేగన్ = త్వరతోఁ, చని = వెళ్లి, బంగరుమే డను, వేడ్కన్ = అభిలాషతోన్, నిల్చి = ఉండి, గోపాలునిఁ = కృష్ణునిని, లీలఁ = విలాసముతోన్, చూచునెడన్ = చూచునప్పుడు, పయ్యెద = పయిఁట, ఊర్పులగా లిన్ = ఊర్పులగాలిచేతను, తూలినఁ = ఎగిరిపోఁగాన్, కేలఁ = చేతితోఁ, అమర్చు చోన్ = చక్కఁజేసికొనునపుడు, తమిబిగిఁ = వలపుయొక్కబలముచేతను, విడి = వదలి, నీవియె = పోఁకముడియే, జాఱన్ = ఊడిపోఁగాన్, కరసంగ్రథితాంశుకయై, కర = చే తితో, సంగ్రథిత = కూర్పఁబడిన, అంశుకయై = వస్త్రముకలదియై, భర్మపాంచాలిక మాటుఁ = బంగారుబొమ్మచాటును, చేరెఁ = ప్రవేశించెను.

సీ. హీరభూషణధౌత ♦ యై రాచిలుకఁ గేలఁ
గొని చూచె నజురాణి ♦ యనఁగ నొకతె
కిసి మోహావివశయై ♦ కదలక మేడయం
దున నిల్చె మణిపుత్రి ♦ యనఁగ నొకతె
హారినీలమంచకో ♦ పరి నుండి వీక్షించె
ఘనముపై మించుమిం ♦ చనఁగ నొకతె
పగడంపుగాళిక ♦ పుగ హత్తి చూచెఁ ద
ద్ఘటితకాంచనవల్లి ♦ క యన నొకతె

కంఠమునఁ గాంచికయుఁ బైడి ♦ కంటె మొలను
బాదముల బాహుపురులును ♦ బాహుయుగళిఁ
బాదకటకంబులు ధరించి ♦ భామ యొకతె
సంభ్రమాయత్తగతి వచ్చి ♦ శౌరిఁ గనియె. 60

ఒకతె=ఒకానొక స్త్రీ, హీర... ...యై, హీరభూషణ=వజ్రపుఁగలచేత, ధౌత=శుద్ధిచేయఁబడినదియై, (వజ్రపునగలు ధరించుటచేఁ దెల్లనిచాయ గలదియై యని యర్థము.) అజురాణి యనఁగన్=సరస్వతివలె, కేలన్=హస్తమునందున్, గాచిలుకన్, కొని=ధరించి, శౌరిన్=కృష్ణుని, చూచెన్=కనుఁగొనెను. ఒకతె=ఇంకొకతె, కని=(కృష్ణుని) జూచి, మోహావశయై=వలపుచే నొడలెఱుఁగనిదియై, మణిపుత్త్రి యనఁగన్=మాణిక్యపుబొమ్మవలెన్, మేడయంచునన్=మేడకొనను, నిల్చెన్=నిలువఁబడెను, ఒకతె, ఘనమునైలిందిమిం చనఁగన్=మేఘము మీఁది మెఱపువలె, హరినీలమంచకోపరినుండి=ఇంద్రనీలముల పీఁటముపైనుండి, వీక్షించెన్=చూచెను. ఒకతె, పగడంపుఁగొణికి=పగడపురాతిస్తంభమును, దాపునన్=దగ్గఱగాన్, ఒత్తి=అంటుకొని, తద్ఘటితకాంచనవల్లిక యనన్=ఆకంబమునఁ జెక్కఁబడిన బంగారుతీవవలె (నుండి) చూచెన్=(కృష్ణుని) గనుఁగొనెను. ఒకతెభామ=ఒకానొక స్త్రీ, కంఠమునన్=మెడయందున్, కాంచికయున్=ఒడ్డాణమును, మొలను=నడుమునందున్, పైఁడికంటెన్=బంగారుకంటెను, పాదములన్=కాళ్లను, బాహుపురులును=దండకడియములను, బాహుయుగళిన్=బాహుద్వయమునందున్, పాదకటకంబులు=అందెలను, ధరించి, సంభ్రమాయత్తగతిన్=త్వరపడిన నడకతోన్, (త్వరగాన్) వచ్చి కనియెన్=వచ్చి కృష్ణుని జూచెను. ఇందు ఉపమాలంకారము. మఱియు బద్ధముకుటీబాగమునఁ సంభ్రమముచే నొకచోట ధరింపవలసిన భూషణములను మఱియొకచో నొకానొక స్త్రీ, ధరించినదని చెప్పుటచే విభ్రమ మను శృంగారచేష్ట ప్రవర్తింపఁబడియెను

చ. తుఱుము మఱపిడ ముంగురులు ♦ తొంగలిఱెప్పలఁ దొంగిచూడ ని
బ్బఱపు మెఱుంగుఁజన్నుఁగవ ♦ పయ్యెద దాఁగిలిమూఁత లాడ వా
తెఱపలుగెంపుల న్నగవు ♦ తేటలు గూడ నిజేశు కౌఁగిటం
దొఱఁగి రయంబునం జని వ♦ధూమణి యొక్కతె గాంచె వెన్నునిన్.

ఒక్క తెలవధూమణి = ఒకానొక స్త్రీశ్రేష్ఠము, కుఱుము = కొప్పు, అఱ = సగము, వీడఁగన్ = విడఁగాన్, ముంగురులు = అలకములు, తొంగలిఱెప్పలన్ = వికసించిన ఱెప్పలను, తొంగిమాడన్ = ముంగురులు కన్నులమీఁద వ్రాలఁగా నని యర్థము నిబ్బఱపుమెఱుంగుఁజన్నుఁగవ = అధికమైనదియు గొప్పకాంతిగలదియు నగుచన్నులజంట, పయ్యెదన్ = పయఁటయందున్, దాఁగిలిమూఁతలాడన్ = (పిల్ల లొకసారి కన్పించుచు నొకసారి గన్పింపక యాడుపాట) అట్టియాటలనాడుచుండఁగాన్, (కుచములజంట యొకసారి కన్పించుచు నొకసారి గన్పింపక నటించుచుండఁగా నని యర్థము) వాతెఱ = అధరోష్ఠము, పలుగెంపులన్ = కెంపులం బోలినదంత(క్షత)ములను, నగవుతేటలు = నగవుకాంతులను, నూనన్ = పొందఁగాన్, విజేశుకాఁగిటన్ = తనభర్తభుజాంతరమును, తొఱఁగి = విడిచి, రయంబునన్ = వేగముతోన్, చని = వెళ్లి, వెన్నునిన్ = కృష్ణుని, కాంచెన్ = చూచెను

ఉ॥ ఉల్లము లుల్లసిల్లఁ బను ♦ లొల్లక గొల్లమిటారు లెల్ల వ్రే
పల్లె మెలంగుచున్నఁ గన ♦ వచ్చుతెఱంగునఁ బట్టణంబునం
బల్లవసంగతుల్ మఱచి ♦ ద్వారతటంబుల నిల్చి వల్లవీ
పల్లవుఁ జూచి రెల్లవెల ♦ పల్లవపాణులు మొల్లమౌతమిన్. 62

ఉల్లములు = మనసులు, ఉల్లసిల్లన్ = వికసింపఁగాన్, గొల్లమిటారులెల్లన్ = గోపయువతు లందఱును, పనులు = వారుచేయుకార్యములను, ఒల్లక = అంగీకరింపక, విడిచి యని యర్థము వ్రేపల్లెన్ = గొల్లపల్లెయందున్, మెలంగుచున్నన్ = సంచరించెడుచున్నన్, (కృష్ణుని) కనవచ్చుతెఱంగునన్ = చూడవచ్చినరీతిచేతను, పట్టణంబునన్, ఎల్లవెలపల్లవపాణులు = పట్టణమందు (వాసముచేయు) నందఱు వేశ్యలును, పల్లవసంగతులు = విటులసహవాసమును, మఱచి, ద్వారతటంబులన్ = గుమ్మముగలచోట్లను, గుమ్మముదగ్గఱ నని యర్థము. నిల్చి = ఉండి, వల్లవీపల్లవున్ = వ్రేతలవిటకానిని, మొల్లమౌతమిన్ = అధికమైనకోర్కెతోన్, చూచిరి = కనుఁగొనిరి.

వ॥ ఇత్తెఱంగున ముదాయత్తంబు లగుచిత్తంబుల నలరునత్తామరసనయనల తరళతర ళావళి ధవళధవళేతర దృక్ప్రసారంబుల కనుసారంబు లగు కైరవేందీవరతోరణంబు లుద్దామచామరసమీరవారంబులం జలింప నిలింప కింపురుష చంపకగంధులసొంపునుం గికురింపఁ

దగుసింధురయానలచికురబంధబంధుర చంపకకుసుమగంధంబులకు
వెఱచి పఱచుచు మదకుంభికుంభంబుల క్రాలుబంధురంబులరొద
లం బొదవునారట్టజఘోట్టాణ ఘోటకగళాటక హాటకకటక కింకి
ణీగణనటీజన కంకణమంజుమంజీర శింజితంబుల దిదృక్షుజనవచన
కోలాహలంబులం గ్రిందుపఱచి క్రిందుకొను సురదుందుభి ఢమామి
కా కాహళాపణవ మృదంగ పుంఖానుపుంఖ శంఖవేణువీణాదివాద
ననినాదంబులు రోదసి నిండ నిండార విరిసినపుండరీకమండలంబుల
గం డడంచుపాండురపుండరీకంబుల మెండుమీఱిన ముత్తెంపుజల్లుల
జిగివెల్లువల నల్లుకొను వెల్లపట్టుసిడంబులనుమం బగడంబుడంబు
విడంబించు దట్టంపుఁ గెంపుటాలవట్టంబులకైట్టాఱనిగ్గులకుం జుట్టంబు
లై నట్టువచెలులయంగదట్టంబులం గట్టినపుట్టంబులం గప్పు యుప్ప
రంబున కెగయునామంతమహీకాంతమకుటాంగదాది సంఘట్టన జ
నిత మణిరజంబులు మెఱయ నెఱయుపొగడవిరివలపులు వలచు
డిండిమవాదనోత్పాదిత వేదండగండజాల మదధారలం బంకిలం బ
గునేలం గాలూనక సమ్మర్దంబునఁ ద్రోపాడఁ గిక్కిఱిసి యెగయు
పౌరులం గనుసన్నల నొగుచు మాఱుజకిచరమాంగంబుల నొఱిగి
చనునాగవాసంపుసంగనాచులపయిం గన్ను వేసి ప్రక్కం జనువారి
యక్కులకు వింతబొజుంగు లిడు విడియంబులపేరింటిలాంచి గనుప
ట్టం బట్టపగలుగాఁ జంద్రజ్యోతులు వెలుంగఁ జతురంగబలసంగత
మంగళోత్సవమునకు దివంబున నున్నవారిం బిలువంబోవువిధంబున
నంబరతలంబున కెగసి తారాకావారంబులం దోడ్కొని వచ్చుచె
న్నున వెన్నముద్దలంబోని సితచ్ఛవిగుచ్ఛంబులతో క్రాలుతారా
బాణంబులవిన్నాణం బెసంగ సభంగశృంగారరసతరంగంబులు దొ
రంగు తెఱంగున సంరంగధరమరీచిసద్రక్షీచీనం బై చీనిచీనాంబరాభర

ణాహీరచాకచక్యంబులు చెన్నొందఁ మందగమనంబునం దగుచతు
ర్దంతిసమసమదదంతావళంబుపై నిందుఁడుంబోలె యాదవేం
దుఁడు రాజభవనాంగణంబు సేరివచ్చె సంతనిక్కడ. 63

ఇత్తెఱంగునన్ = ఈప్రకారముచేతను, ముదాయత్తంబులు = సంతసమునకులోఁ బడినవి, ( సంతసము కలవి యని యర్థము ) అగుచిత్తంబులన్ = అగుమనసులతోన్, అలరు .....ప్రసారంబులకున్, అలరు = ప్రకాశించెడు, అత్తామరసనయనల = విూఁదఁ జెప్పినస్త్రీలయొక్క, తరళతరళ = మిక్కిలిచంచల మైనవియు, అవిరళ = దట్ట మైనవియు, ధవళధవళేతర = మిక్కిలి తెల్లనివి కానివియును, ( అగు ) దృక్ప్రసారంబుల కున్ = చూపులవ్యాపనములకు, అనుసారంబులు = అనుసరించునవి, చూపులం బోలినవి యని యర్థము అగు, కైరవేందీవరతోరణంబులు = తెల్లగలువలయు, నల్లగలువలయు మాలికలు, ఉద్దామ ..... వాణంబులన్, ఉద్దామ = అధిక మైన, చామర = వింజామర లయొక్క, సమీర = గాలియొక్క, వారంబులన్ = సముదాయముల చేతను, చలిం పన్ = కదలుచుండఁగాన్, నిలింప... సొంపునన్, నిలింప = దేవతలయొక్కయు, కింపురుష = కింపురుషులయొక్కయు ( గుఱ్ఱపుమోమును మనుష్యశరీరమును గల దేవ యోనులు కింపురుషు లనంబడుదురు ) చంపకగంధుల = స్త్రీలయొక్క, ( చంపకముం బోలినసహజ మైనపరిమళము గలవారు ) సొంపునన్ = చక్కఁదనమును సయితము, కిమురింపన్ = వంచించుటకున్ ( తిరస్కరించుట కని యర్థము ) తగు . . గంధం, బులకున్, తగు = ఒప్పెడు, సింధురయానల = స్త్రీలయొక్క, ( ఏనుఁగునడలం బోలిన నడకలు గలవారు ) చికురబంధ = కొప్పులయందలి, బంధుర = సుందర మైన, చంపక కుసుమ = సంపంగపూలయొక్క, సుగంధంబులకున్ = పరిమళములకున్, వెఱచి = భయ పడి, పఱచుచున్ = పాఱిపోవుచున్, మదకుంభికుంభంబులన్ = మదపుటేనుఁగులకుంభ స్థలములందున్, భ్రాలుబంభరంబులరొదలన్ = ప్రవేశించెడుతుమ్మెదలధ్వనుల చేతను, పొదలు. . శింజితంబులన్, పొదలు = అభివృద్ధిపొందెడు, ఆరట్టజ = ఆరట్టదేశము నం బుట్టినట్టియు, ఘోట్టాణ = ఘోట్టాణదేశసంబంధ మైనట్టియు, ఘోటక = గుఱ్ఱముల యొక్క, గళాటక = మెడయందుఁ గదలుచున్న, హాటక = బంగారువికారమైన, కట క = పట్టెడలయందలి, కింకిణీగణ = మువ్వలసముదాయముయొక్కయు, నటీజన = నా ట్యముచేయువారియొక్క, కంకణ = కడియములయొక్కయు, మంజు = శ్రావ్యమైన, మంజీర = కాలియందెలయొక్కయు, శింజితంబులన్ = ధ్వనులను, దిదృక్షుజన లన్, దిదృక్షుజన = చూడఁగోరి (వచ్చి) నజనులయొక్క, వచన = మాటలయొక్క కో

లాహలంబులన్ = ధ్వనులను, క్రిందుపఱిచి = తిరస్కరించి, క్రిందుకొను......నినా
దంబులు, క్రిందుకొను = అతిశయించెడు, సురదుందుభి = దేవతలభేరులయొక్కయు,
ఝమామికా = ఝమామికయనువాద్యముయొక్కయు, కాహళా = బూరలయొక్కయు,
పణవ = పణవము లనువాద్యములయొక్కయు, మృదంగ = మద్దెలలయొక్కయు, పుం
ఖానుపుంఖ = ఎడతెగని, శంఖ = శంఖములయొక్కయు, వేణు = పిల్లనగ్రోవులయొక్క
యు, వీణాది = వీణె మొదలగువానియొక్కయు, నినాదంబులు = ధ్వనులు, రోదసీ =
భూమ్యాకాశములను, నిండన్ = పూరింపఁగాన్, నిండారన్ = పూర్ణముగాన్, విరిసిన
పుండరీకమండలంబులగండు = వికసించిన తెల్లదామరపూవుసముదాయములయొక్క బల
మును, ( తామ పూలసోగసు అని యర్థము ) అపహంచుపాండురపుండరీకంబులన్ =
పోఁగొట్టు తెల్లగొడుగులయందున్ ( ని ) 'పుండరీకం సితచ్ఛత్రే సితాంభోజేపి కీర్తి
త'' మని యజయ్యుఁడు మెండు వెల్లువలన్, మెండుమీఱిన = అతిశయించిన,
ముత్తెంపుజల్లుల = ముత్యాలజాలరులయొక్క, జిగివెల్లువలన్ = కాంతిప్రవాహములను
అల్లుకొను వెల్లపట్టుసిడంబులందున్ = వ్యాపించెడు తెల్లపట్టు టెక్కెములమధ్యమం,
దున్, పగడంబుడంబు = పగడపుఁగాంతిని, విడంబించు .నిగ్గులకున్, విడంబించు =
అనుకరించెడు, దట్టంపుఁగెంపుటాలవట్టముల = దృఢమైన కెంపుల (పెడిగల) పెద్దవివనల
యొక్క, కట్టెఱ్ఱనిగ్గులకున్ = మిగుల నెఱ్ఱనికాంతులకున్, చుట్టంబులై = బంధువులై ( స
మానములై యని యర్థము ) నట్టువచెలులయంగదట్టంబులన్, నట్టువచెలుల = నాట్య
ము చేయు స్త్రీలయొక్క, అంగదట్టంబులన్ = తాబందులయందున్, కట్టినపుట్టంబులన్ =
ధరించినవస్త్రములను, పయ్యెదగా ధరించినవస్త్రముల ని యర్థము. కప్పి = ఆవరించి,
ఉప్పరంబునకున్ = ఆకాశమునకున్, ఎగయు .. రజంబులు, ఎగయు = ఎగిరెడు,
( ఇది రజమను దానితో నన్వయించును ) సామంతమహీకాంత = సామంత రాజులయొ
క్క, తనదేశమునకు సమీపమునందు దేశముఁ బాలించువారు సామంతులు మకు
ట = కిరీటములయొక్కయు, అంగదాది = బాహుపురులు మొదలగ వానియొక్కయు,
సంఘట్టనంబునన్ = తాపిడిచేతను, జనిత = పుట్టింపఁబడిన, మణిరజంబులు = మాణిక్య
పుధూళులు, మెఱయన్ = ప్రకాశింపఁగాన్, నెఱయుపొగడవిరివలపులు = వ్యాపించె
డుపొగడపూవులపరిమళములను, వలచు . ధారలన్, వలచు = వ్యాపింపఁజేసెడు
( ఇది మదముతో నన్వయించును. ) డిండిమవాదన = డిండిమ మనువాద్యవిశేషముయొ
క్కవాయించుటచేతను, ఉత్పాదిత = పుట్టింపఁబడిన, వేదండ = ఏనుఁగులయొక్క,
గండజాల = చెక్కిళ్లసముదాయమునందలి, మదధారలన్ = మదోదకప్రవాహములచేత
నుం, పంకిలంబు = బురదకలది, అగసేఁన్ = అగభూమియందున్, కాలూనక = కాలిని

నిలుపలేక, సమ్మర్దంబునఁ = ఇఱుకటముచేతను, త్రోపాడఁ = గెంటికొనఁగాఁ, క్రి క్కిఱిసి = ఇఱుకుకొని, ఎగయుపౌరులన్ = ఎగిరెడుపురజనులను, కనుసన్నలఁ = కంటిసంజ్ఞలచేతను, నగుచుఁ = పరిహాసించుచున్, మౌరజికచరమాంగంబులఁ, మౌరజిక = మద్దెలవాయించువారియొక్క, చరమాంగంబులఁ = వీఁపులను, ఒదిఁగి = తొలఁగి (దాఁగి యని యర్థము) చను .. .పైఁ, చను = వెళ్లెడు, నాగవాసంపుసంగవాచులపయిన్ = వేశ్యాసమూహమునందలిప్రౌఢాంగనలమీఁదను, కన్నువేసి = కన్నునిలిపి, ప్రక్కఁ = సమీపమునను, చనువారియక్కలకుఁ = వెళ్లెడువారితల్లులకుఁ, వింతబొజుంగులు = క్రొత్తవిటకాండ్రు, (బొజుఁగు = భుజంగశబ్దభవము) ఇడు . లాంచి, ఇడు = ఇచ్చెడు, విడియంబులపేరింటి = తాంబూల మను పేరుగల, లాంచి = లంచము, కనుపట్టఁ = కనుపడులట్లుగాన్, పట్టపగలుగాన్ = పగలయ్యెడులాగున, చంద్రజ్యోతులు = పగలువత్తులు, (వెన్నెలంబోలుకాంతిగలవి మతాబులు) వెలుంగఁ = ప్రకాశింపఁగాఁ, చతురంగ కుఁ, చతురంగబల = గజములు మొదలగు నాల్గు తెఱఁగులసేనలతోఁ, సంగత = కూడిన, మంగళోత్సవమునకుఁ = పెండ్లివేడుకకుఁ, దివంబునఁ = స్వర్గమునందుఁ, ఉన్నవారిఁ, పిలువంబోవుగతిం బున్ = పిలుచుటకు వెళ్లుచున్న ప్రకారముచేతను, (పిలుచుటకు వెళ్లుచున్నటని యర్థము) అంబరతలంబునకుఁ = ఆకసంబునకున్, ఎగసి, తారకావారంబులఁ = నక్షత్రసముదాయములను, తోడ్కొనివచ్చు చెన్నునన్ = తిసికొనివచ్చునందముతోఁ, (తోడ్కొనివచ్చుచున్నట్లని యర్థము) వెన్నముద్దలం . తోఁ, వెన్నముద్దలంబోని = వెన్నముద్దలంబోలిన, సితచ్ఛవి = తెల్లకాంతులయొక్క, గుచ్ఛంబులతోన్ = గుత్తులతోన్, వ్రాలుతారాబాణంబులవిన్నాణంబు = క్రిందఁబడియెడుతారాజువ్వలయొక్కసొగసు, ఎసంగఁ = అతిశయింపఁగాన్, అభంగశృంగారరసతరంగంబులు = నిండైనశృంగారరసముయొక్కకెరటములు, తొరంగుతెఱంగునఁ = స్రవించుచున్నరీతిచేతను, కురంగ

బై, కురంగధర = చంద్రునియొక్క, మరీచి = కాంతితో, సధ్రీచీనంబై = సమానమై, చీనిచీనాంబరా.. లు, చీని = బంగారుజరీగల, చీనాంబర = చీనాదేశమందు నేసినపట్టువస్త్రములయు, ఆభరణ = నగలయందలి, హీర = వజ్రములయొక్కయు, చాకచక్యంబులు = కాంతులు, చెన్నొందఁ = అందముగాఁ ప్రకాశింపఁగాఁ, మందగమనంబునన్ = మెల్లనినడకతోఁ, తగు.... .పైఁ, తగు = ప్రకాశించు, చతుర్దంతి = ఐరావతముతోఁ, (నాల్గుదంతములుగలది) సమ = సమానమైన, సమద = మదముతోఁ గూడిన, దంతావళంబుపైఁ = ఏనుఁగమీఁదను, ఇంద్రుండునుంబోలె = ఇంద్రుఁడువలెనే, యాదవేంద్రుండు = కృష్ణుఁడు, రాజభవనాంగణంబు = రాచగీముముం

గిటివి, చెరన్ = సమీపించునట్లు, వచ్చెన్, అంతన్ = పిమ్మటను, ఇక్కడన్ = రాజగృహమునందున్,

క. సుందరు లప్పుడు బంగరు
బిందెల పాటీరసలిల ♦ పృథుధారల న
య్యిందుముఖి జలకమార్చి ర
హిం దడియొత్తిరి లతాంత ♦ మృదుచేలములన్. 64

అప్పుడు = పెండ్లికొమరుఁడుగుమ్మములోనికి వచ్చినపుడు, సుందరులు = (కొందఱు) స్త్రీలు, బంగరుబిందెలపాటీరసలిలపృథుధారలన్ = బంగారుకుండలయందు దున్న మంచిగంధపునీటిపెద్దధారలతోన్, అయ్యిందుముఖిన్ = ఆబిదరిని, జలకమార్చి = స్నానము చెయించి, రహిన్ = సంతసముతోన్, లతాంతమృదుచేలములన్ = పూవులవలె మెత్తనివైనవస్త్రములతోన్, తడియొత్తిరి = తుడిచిరి

చ. కళుకుదుకూల మింపలరఁ ♦ గట్టి లలిం దిలకంబు దిద్ది క
జ్జల మిడి పారిజాతసుమ ♦ సంఘములుం గలపంబుఁ గూర్చిస
ల్లలితమణిస్ఫుటాఖిలక ♦ లాపకలాపములన్ ఘటించి కాం
త లపుడు దెచ్చి రవ్వికచ ♦ తామరసాక్షివివాహవేదికన్. 65

కాంతలు = చెలులు, ఇంపలరన్ = సంతసము గలుగునట్లు, కళుకుదుకూలము = (తళతళలాడు) కాంతిగలపట్టువస్త్రమును, కట్టి = ధరింపించి, లలిన్ = ఉత్సాహముతోన్, తిలకంబు = బొట్టును, దిద్ది = సవరించి, కజ్జలము = కాటుకను, ఇడి = (కన్నుల) నుంచి, పారిజాతసుమసంఘములున్ = పారిజాతపుఁబువ్వులసముదాయమును, (సముద్రమునం బుట్టినయొకానొకదేవవృక్షము పారిజాతము మఱియు నియ్యవి నాల్గు గలవు. (ని) పంచైతే దేవతరవః మందారః పారిజాతకః సంతానః కల్పవృక్షశ్చ పుంసి వా హరిచందనం అ) కలపంబున్ = పరిమళవస్తువు లగుకస్తూరి మొదలగువానిఁ గూర్చినసిరిగంధమును. కూర్చి = సంఘటించి, సల్లలిత కలాపములన్, సల్లలిత = మనోహరమైన, మణి = మణులచేతను, స్ఫుట = వికసించిన, అఖిల = సమస్తమైన, కలాప = నగలయొక్క, కలాపములన్ = సముదాయములను, ఘటించి = కూర్చి, అవ్వికచతామరసాక్షిన్ = ఆభద్రను, (వికసించినతామరపూవులం బోనికన్నులుగలదానిని) అపుడు = ఆకాలమున, వివాహవేదికన్ = పెండ్లియరఁగుమీఁదికి, తెచ్చిరి = తీసికొనివచ్చిరి.

క. ఇట భవనద్వారముమున్
దటికి న్వచ్చుయదుతనయు • నకు నెదురుగ నం
తటఁ గేకయపతి చని చెం
గటఁ గరి డిగి మ్రొక్కునతనిఁ • గని దీవించెన్. 66

ఇటన్ = ఇక్కడను, భవనద్వారముముందటికిన్ = ఇంటిగుమ్మమునెదుటికిన్, వచ్చుయదుతనయునకున్ = వచ్చుకృష్ణునకున్, కేకయపతి = కేకయరాజు, ఎదురుగన్ = అభిముఖముగాన్, చని = వెళ్లి, అంతటన్ = పిమ్మటను, కరిన్ = ఏనుఁగును, చెంగటన్ = సమీపమందున్, డిగి = దిగి, మ్రొక్కునతనిన్ = నమస్కరించుకృష్ణుని, కని = చూచి, దీవించెన్ = ఆశీర్వదించెను.

వ. మఱియు సతంబు భూసురాశీర్వాదంబులును, వందిమాగధవారంబులకైవారంబులును, మేటిగాణియలలక్ష్మీనారాయణకల్యాణంపుఁబాటలసన్నంపుఁదెలుంగులును, మంగళేతరజైత్రవాదిత్రంబులును, భూనభోంతరంబు నిండ నభ్యంతరనిశాంతంబునకు హితమంత్రిసహితంబుగాఁ దోడ్కొని యేఁగుచో వసుదేవనందనుం డందందుఁ బుణ్యాంగనాజనమణీభాజననీరాజనోపచారంబు లాదరించుచుఁ గన్యాంతరద్వారపార్శ్వనిక్షిప్తసువర్ణపూర్ణకలశముకురబింబబింబితకర్పూరదీపికల విలోకించుచు, నర్జునుం డొసఁగునారదానీతం బగు నీఁగిమ్రానిపువ్వులకైదండఁ గొనుచు నల్లనల్లన నడచి గారుత్మతతోరణాత్యుదగ్రవిద్రుమస్తంభసంభార బింబితరంభాది దివిజరంభోరుచారుసైరంధ్రికరహల్లకసముల్లసిత శుభవస్తుప్రశస్తంబును, బురోహితబ్రాహ్మణపురంధ్రీబృందనిరంధ్రంబును, వికచకమలకుముదసముదయభ్రమదసంకుమదమృగమదానులిప్తనవరంగ మౌక్తికరంగవల్లీసుందరం బగువైవాహికమందిరంబునడుమ నడరుమరకతమణివేదికోపరికురువిందచరణాంచితకాంచనపీఠంబున నధివసించెనప్పుడు.

మఱియుఁ = ఇంకను, అతండు = ఆశేకయరాజు, భూసురాశీర్వాదంబులును = బ్రాహ్మణులదీవనలును, వంది ..... కైవారంబులును, వంది = పరాక్రమమును స్తుతించువారియొక్కయు, మాగధ = వంశమును స్తుతించువారియొక్కయు, వారంబుల = సముదాయములయొక్కయు, కైవారంబులును = స్తుతులును, (ని) వ్యూర్స్మాగధాస్తు మగధా వందిన స్తుతిపాఠకాః అ మేటిగాణియల . .ను, మేటి = శ్రేష్ఠురాండ్రగు, గాణియల = పాటకత్తియలయొక్క, లక్ష్మీనారాయణ = లక్ష్మీనారాయణులయొక్క, కళ్యాణంపుఁబాటల = పెండ్లినిఁదెలియఁజేయుపాటలయొక్క, సన్నంపు టెలుంగులును = సన్నపుధ్వనులును, మంగళతరజైత్రవాదిత్రంబులును = శుభమునుఁ దెలుపుజయశీలమైన వాద్యధ్వనులును, భూ-భోంతరంబు = భూమ్యాకాశములయొక్క మధ్యభాగమందుఁ, (ఇట సప్తమ్యర్థమందుఁ బ్రథమ) నిండన్ = పూర్ణముకాఁగాన్, అభ్యంతరనిశాంతంబునకుఁ = లోపలియింటికిన్, (అంతఃపురమునకుఁ) హితమంత్రిసహితంబుగాఁ = చుట్టములతోడను, మంత్రులతోడనుగూడ, తోడ్కొని = (కృష్ణుం) దీసికొని, ఏగుచోఁ = వెళ్లునప్పుడు, వసుదేవనందనుండు = కృష్ణుఁడు, అందందుఁ = అక్కడక్కడను, పుణ్యాంగనాజన . .లు, పుణ్యాంగనాజన = ఐదువరాండ్రయొక్క, మణిభాజన = మాణిక్యపుంబళ్లెరములందలి, నీరాజనోపచారంబులు = మంగళహారతులనెడునూడిగములను, ఆదరించుచుఁ = మన్నించుచుఁ, (స్వీకరించుచు నని తా త్పర్యము.) కక్ష్యాంతర దీపికలన్, కక్ష్యాంతర = నాలుగిండ్లవాకిళ్లయొక్క, ద్వార్పార్శ్వ = గుమ్మముపక్కలయందు, నిక్షిప్త = నిలుపఁబడిన, సువర్ణ = బంగారుతోఁ జేయఁబడినవియు, పూర్ణ = నీటితో నింపఁబడినవియు నగు, కలశ—ఘటములందున, ముకురబింబ = అద్దములందున, బింబిత = ప్రతిఫలించిన, కర్పూరదీపికలన్ = కర్పూరపుదివ్వెలను, విలోకించుచుఁ = చూచుచును, అర్జునుండు, ఒసంగు కైదండన్, ఒసంగు = ఇచ్చెడు ఇది కైదండతో నన్వయించును నారదాపితంబు = నారదునిచే దీసికొనిరాఁబడినది, అగనీఁగ్రమాని ప్వవ్వలకైదండన్ = అగుకల్పవృక్షముయొక్క పువ్వులను గలచాస్త్రాంగలంబైనమున, కొనుచుఁ = గ్రహించుచుఁ, అల్లనల్లనఁ = మెల్లమెల్లఁగాన్, నడచి, గారుత్మత ప్రశస్తంబైన, గారుత్మతతోరణ = పచ్చలతోరణములుగల, అమందర = గొప్పవియగు, విద్రుమస్తంభసంభార = పగడపుస్తంభములయొక్క సముదాయమునందున్, బింబిత = ప్రతిఫలించిన, రంభాది = రంభ మొదలగు, దివిజసంభోరు = దేవతాస్త్రీలువలెన్, చారు = అందకత్తెలగు, సైరంధ్ర = పరిచారికలయొక్క, పరులయింట నుండియు స్వతంత్రురాలై గంధలేపనతిలకనిర్మాణాదులం జేయువనిత సైరంధ్రి యనంబడు. (ని) సైరంధ్రీ పరవేశ్మస్థా స్వవశా శిల్పకారికా అ కరహల్లక =

ఎఱ్ఱగలువలం బోలినచేతులచే, సముల్లసిత=ప్రకాశింపఁజేయఁబడు, శుభవస్తు=మంగళవస్తువులచేతను, ప్రశస్తంబును=శ్లాఘింపఁబడినదియును, పురోహితబ్రాహ్మణపురంధ్రీబృందనీరంధ్రంబులు=పురోహితులయొక్కయు, బ్రాహ్మణులయొక్కయు, ముత్తైదువులయొక్కయు, సముదాయముచేతను, సందులేనిదియును, వికచ.... సుందరంబు, వికచ=వికసించిన, కమల=తామరలయు, కుముద=కలువలయు, సముదయ=సముదాయముయొక్క, భ్రమద=భ్రమనుగల్పించెడు, (ఇది రంగవల్లితో నన్వయించును.) సంకుమద=జవ్వాదిచేతను, మృగమద=కస్తూరిచేతను, అనులిప్త=పూయఁబడిన, నవరంగ=ఒకవిధమైనగృహమునందలి, మౌక్తికరంగవల్లీసుందరంబు=ముత్తెములముగ్గులచే మనోహరమైనది (పురుగుమొదలయినవానిచే నలుకఁబడినదియుఁ బద్మములనియుఁ గలువలనియు భ్రాంతిపుట్టించెడునట్లు నానావిధముగా నలంకరించిన ముగ్గులచే మనోహరమైనదియును,) అగు, వైవాహికమందిరంబునడుమన్=పెండ్లియింటిమధ్యమందున్, అదరు పీఠంబునన్, అదరు=ప్రకాశించెడు, మరకతమణివేదికా=మరకతపురాలతిన్నెయొక్క, ఉపరి=మీఁదను, కురువిందచరణాంచిత=కెంపురాలకోళ్లచే నలంకరింపఁబడిన, కాంచనపీఠంబునన్=బంగారుపీఁటయందున్, అధివసించెన్=కూర్చుండెను, అప్పుడు,

క. ఆగమవిధిసహితముగా
నాగోత్రాపతి యొసంగె ♦ యదుపతికిన్ స
ద్యోగోదధిమధుగుడసుష
మాగుంఫితమై తనర్చు ♦ మధుపర్కంబున్. 68

ఆగోత్రాపతి=ఆకేకయరాజు యదుపతికిన్=కృష్ణునకున్, ఆగమవిధిసహితముగాన్=వేదమందలియాగ యెట్లుతోఁ గూడునట్లుగాన్, సద్యోగో . . మై, సద్యోగోదధి=నిన్నఁబిదికినయావుపాలవలనఁగలిగినపెరుఁగయొక్కయు, మధు=తేనెయొక్కయు, గుడ=బెల్లముయొక్కయు, సుషమా=ఎక్కువకాంతితో, గుంఫితమై=కూర్పఁబడినదియై, తనర్చుమధుపర్కంబున్=ఒప్పుమధుపర్కద్రవ్యమును, ఒసంగెన్=ఇచ్చెను పెరుఁగు, తేనెయు, బెల్లమును గలసినది మధుపర్కమందురు కొందఱు పెరుఁగుతోఁ గూడిన తేనెయే మధుపర్కమందురు.

గీ. పాలవెల్లిఁ గన్న • బాలికపోలికఁ
దనరుముద్దుకూఁతుఁ • దాను సతియు
నర్చఁ జేసి హరికి • సాలంకృతంబుగా
ధారవోసి రెంత • ధన్యతములొ. 69

పాలవెల్లి = క్షీరసముద్రము, కన్న బాలికపోలికన్ = కన్న బాలసామ్యముచేతను, (లక్ష్మివలె నని యర్థము.) తనరుముద్దుకూఁతున్ = ప్రకాశించుచక్కనిబాలికను, తానున్ = కేకయరాజును, సతియున్ = భార్యయును, అర్చ చేసి = పూజించి, హరికిన్ = కృష్ణునకున్, సాలంకృతంబుగాన్ = అలంకారములతోఁ గూడునట్లు, ధారవోసిరి = ధారాపూర్వకముగ నిచ్చిరి ఎంతధన్యతములో = (వారు) ఎంతపుణ్యాత్ములో, మిగులఁ బుణ్యాత్ము లని యర్థము విష్ణుప్రీతిగాఁ గన్యాదానము చేయువారి లోకమునం బుణ్యాత్ము లని శాస్త్రములం బ్రసిద్ధి యుండఁగా విష్ణువునకే కన్యాదానము చేయువా రెంతపుణ్యాత్ములో యెవ్వరుం జెప్పలే రని యాశయము

మ. చెలువౌ ముత్తెపుఁబ్రాలపుట్టికలపై • జీరాడఁగాఁ బెందెరన్
నెలఁత ల్వంపఁగ శౌరి నెమ్మొగమున • న్మీనాక్షి వాలారుఁజూ
పులు వ్రాలెన్ శరదంబుదంబు జరుగన్ • బూర్ణేందుబింబంబుపైఁ
బొలుపై వ్రాలుచకోరికానికరము • ల్పోలెం ద్రపాలోలతన్. 70

చెలువు = అందమును, ఔ ముత్తెపుఁబ్రాలపుట్టికలపైన్ = పొందుముత్యాలతలఁబ్రాలుగల బుట్టలమీఁదను, జీరాడఁగాన్ = వ్రేలాడుచుండఁగాన్, (దీనికిం దెరకర్త) నెలఁతల్ = చెలులు, పెందెరన్ = పెద్దదియగుతెరను, వంపఁగన్ = తగ్గింపఁగాన్, మీనాక్షివాలారుఁజూపులు = భద్రయొక్క (చేఁపలంబోలినకన్నులుగలది) వాఁడిచూపులు, శౌరినెమ్మొగమునన్ = కృష్ణునిమొగమునందున్, శరదంబుదంబు = శరత్కాలమందలిమబ్బు, (ఆశ్వయుజకార్తికమాసములు శరత్కాలము) జరుగన్ = పోఁగాన్, పూర్ణేందుబింబంబుపైన్ = నిండుచంద్రునిమండలమువిూఁదను, పొలుపై = ఒప్పై, వ్రాలుచకోరికానికరముల్పోలెన్ = వ్రాలెడుచకోరికలసముదయమువలెన్, త్రపాలోలతన్ = లజ్జవలనం గలిగినచాంచల్యముతోన్, వ్రాలెన్ = ప్రవేశించెను ఉపమాలంకారము.

క. కమలాక్షుచూపులకు వా

కొమరివిలోకనము లెదురు ♦ కొనియెను మదనా
స్త్రముల కెదుర్కొనుమదభృం
గముల తెఱంగున ననూన ♦ కౌతుక మలరన్. 71

రాకొమరివిలోకనములు = రాచకూఁతుచూపులు, కమలాక్షుచూపులకున్ = కృష్ణునిచూపులకున్, మదనాస్త్రములకున్ = మదనునిబాణములకున్, (పుష్పములకనియర్థము) ఎదుర్కొనుమదభృంగముల తెఱంగునన్ = ఎదురేగెడుమదముగలతుమ్మెదలవిధముచేతను, అనూనకౌతుకము = అధికసంతోషము, అలరన్ = ప్రకాశింపఁగాన్, ఎదురుకొనియెను. అభిముఖము లయ్యెను నిదర్శనాలంకారము

చ. తొలిమణికంకణధ్వనులు ♦ తూర్యరవంబుల మేళవింప ఱె
ప్పలఁ గనుపాప లందుకొన ♦ బాహుయుగాంగదనూత్నరత్నకం
దళరుచి చెక్కుటద్దములఁ ♦ దార్కొన నున్ముఖయై నిజేశునా
దలఁ దలఁబ్రాలు వోసె వని♦తామణి నెచ్చెలు లూఁతసేయఁగన్

తొలి = మొదటను, మణికంకణధ్వనులు = మణులతోఁ గూడినకడియములధ్వనులు, తూర్యరవంబులన్ = వాద్యములధ్వనులతోన్, మేళవింపన్ = కలసికొనఁగాన్, కనుపాపలు = కంటిగ్రుడ్లు, ఱెప్పలన్, అందుకొనన్ = ముట్టికొనఁగాన్, బాహు . . రుచి, బాహుయుగ = చేతులజంటయందున్న, అంగద = భుజకీర్తులయొక్క (దండగడియములయొక్క) నూత్నరత్నకందళ = క్రొత్తవియగురత్నపుమొలకలయొక్క, రుచి = కాంతి, చెక్కుటద్దములన్ = అద్దములంబోలినచెక్కులను, దార్కొనన్ = సవిూపింపఁగాన్, వనితామణి = భద్ర, ఉన్ముఖయై = ఎత్తినమోముగలదియై, నెచ్చెలులు = చెలికత్తెలు, ఊఁతసెయఁగన్ = సహాయపడఁగాన్, నిజేశునాదలన్ = ఆత్మీయుఁడగు భర్తశిరసునందున్, తలఁబ్రాలు = తలఁబ్రాలను, పోసెన్. తలన్ + ప్రాలు = తలఁబ్రాలు = (వివాహకాలమందు వధూవరు లొండొరులశిరసునం బోసికొనెడుబియ్యము తలఁబ్రాలు) ధనవంతులు బియ్యమునకు బదులు ముత్యముల నుపయోగింతురు

మ. శతపత్రాయతనేత్రి ముత్తియపుసే ♦ సల్ దోయిటం గూర్చి యె
త్తుతఱిన్ సిబ్బెపుగబ్బిగుబ్బజిగికిం ♦ దోడైనదోర్మూలదీ
ధితిపైఁ జెల్వునిదృష్టి ఱవ్వఁ దిరిపా ♦ ప్రం బాణియుగ్మంబు వం

చి. తదీయంబగుమౌళిమీఁదికి వెసం ♦ జిమ్మెన్ స్మితాస్యాబ్జయై. 73

శతపత్త్రాయతనేత్రి = భద్ర; (కమలములవలె విశాలమైనకన్నులుగలది) (ని) సహస్రపత్త్రం కమలం శతపత్త్రం కుశేశయం. అ. ముత్తియపుసేసల్ = ముత్తియములనుఁబ్రాలను, (సేస యిది శేషాశబ్దభవము) దోయిటన్ = దోసిలియందున్, కూర్చి, ఎత్తుతఱిన్ = (దోసిలిని) మీఁది కెత్తునపుడు, సిబ్బెపు.........జిగికిన్, సిబ్బెపు = అందమైనమచ్చలుగల, గబ్బి = గొప్పలైన, గుబ్బజిగికిన్ = కుచములకాంతికిన్, తోడైనదోర్మూలదీధితిపైన్ = సహాయపడినట్టిస్తనములమీఁదిచోటికాంతిమీఁదను, చెల్వునిదృష్టి = ప్రియునిచూపు, పర్వన్ = తాఁకఁగాన్, త్రపాప్తిన్ = సిగ్గుకలిమిచేన్, పాణియుగ్మంబున్ = దోసిలిని, వంచి, స్మితాస్యాబ్జయై = మందహాసముతోఁ గూడిన మోముఁదమ్మి గలదియై, తదీయంబగుమౌళిమీఁదికిన్, తదీయంబు = ప్రియునిసంబంధమైనది, అగు, మౌళిమీఁదికిన్ = శిరసుమీఁదికిన్, వెసన్ = త్వరతోన్, జిమ్మెన్ = (ప్రాలను) విసరెను. భద్ర కాంతునిశిరసునం బోయఁ బ్రాలం జేతులఁ బట్టికొని మీఁది కెత్తఁగాఁ గాంతునిచూపు లామెస్తనసమీపప్రదేశముం బర్వఁ దెలిసికొని సిగ్గుపడి తలవంచికొని చేతుల వంచియే ప్రాలను గాంతునిమౌళిపై విసరెనని యాశయము.

మ. అలపూర్వాచలసానువం దలరుబా ♦ లార్కప్రతిబింబం బనం
బలితంబౌకుచమండలిన్ మకరికా ♦ పత్త్రాకృతిన్ వ్రేఁ గెం
పుల మేల్బంగరుతాళిబొట్టు వినతాం ♦ భోజాస్యయై యొప్పెత
త్కలకంఠీమణికంఠసీమఁ బతి దాఁ ♦ గట్టన్ మహోత్కంఠతన్.

పతి = భర్తయగుకృష్ణుఁడు, అలపూర్వాచలసానువందున్, అల = ప్రసిద్ధమైన, పూర్వాచల = ఉదయపర్వతముయొక్క (సూర్యుఁ డుదయించుకొండ) సానువందున్ = చఱియయందున్, అలరుబాలార్కప్రతిబింబంబనన్ = ప్రకాశించులేఁతసూర్యబింబమువలెన్, బలితంబు = మిగులబలసినది, ఔకుచమండలిన్ = అగుస్తనసమీపమందున్, మకరికాపత్త్రాకృతిన్ = మకరికాపత్త్రములయాకారముచేతను, మకరికాపత్త్రము వలె ననుభావము (స్త్రీలచెక్కులు మొదలగుతావులందుఁ గస్తూరిమొదలగువానితోఁ వ్రాయురేఖలు మకరికాపత్త్రములు. అవిమకరములం బోలుఁగాన నీపేరుగలిగెను.) వ్రేఁగన్ = వ్రేలునట్లు, కెంపులమేల్బంగరుతాళిబొట్టు = కెంపులుతాపినమేలిమిబంగారు (తోఁజేయఁబడిన) బొట్టును (మంగళసూత్రమునఁ గట్టుసువర్ణాభరణము బొట్టనంబడు.) విన

తాంభోజాస్యయై = వంపఁబడిన మోముఁదామర గలదియై, ఒప్పుతత్కాలకంఠీమణికంత సీమన్ = ప్రకాశించు నా భద్రయను స్త్రీరత్నము యొక్క మెడయందున్, తాన్ = కృష్ణుఁడు, మహోత్కంఠతన్ = మిగుల వేడుకతోన్, కట్టెన్ = బంధించెను. ఇష్టవస్తుసంపాదనకై వేగిరపాటుత్కంఠ యనంబడు. ఇందుపమయు నిదర్శనయుఁ గలవు.

క. లలి నపుడు పెండ్లిపనులన్
వలఁతు లగుపురంధ్రు లచట ♦ వహ్ని నిలిపి రం
దలఘుమణీపీఠాసీ
ను లయి వధూవరులు ద్విజము ♦ నులయనుమతిచేన్.

అపుడు = ఆకాలమునన్, పెండ్లిపనులన్ = పెండ్లితో సంబంధించినకార్యములందున్, వలఁతులు = నేర్పరులు, అగుపురంధ్రలు = అగుసువాసినులు, అచటన్ = ఆ పెండ్లియరఁగుమీఁదను, వహ్నిన్ = అగ్నిని, నిలిపిరి = ప్రతిష్ఠించిరి వధూవరులు = పెండ్లికొడుకుఁ బెండ్లికూఁతురును, అలఘుమణీపీఠాసీనులు = గొప్పది యగుమణిపీఠమునందుఁ గూర్చున్నవారలు, అయి, ద్విజమునులయనుమతిచేన్ = బ్రాహ్మణులైనమునుల యాజ్ఞచేతను, అందున్ = ఆయగ్ని యందున్, ముందుపద్యముతో నన్వయము

ఉ. ఓజ శమీశిఖాపరిక ♦ రోన్నతి యొప్పఁగ వేల్చి రాహుతుల్
లాజలు దోయిలించి నవ ♦ లానవలాలితరీతి వేల్చుచో
లేఁజెమటం గరాంగుళుల ♦ లీలఁగ నంటినకొన్ని వాల్చె నం
భోజదళంబులం బొదువు ♦ ఫుల్లత దాల్చినమల్లెపూలనన్. 76

శమీశి.....ఖాపరికరోన్నతి, శమీ = జమ్మియొక్క, శిఖా = చిన్నకొమ్మలనియెడు, (సమిధలు) పరికర = సాధనముయొక్క, ఉన్నతి = అతిశయము, ఒప్పఁగన్ = ప్రకాశింపఁగాన్, ఓజన్ = క్రమముగాన్, ఆహుతుల్ = హోమద్రవ్యములను, వేల్చిరి = హోమము చేసిరి. వెనుకపద్యమునందలి వధూవరులు దీనికిం గర్తలు నవలా = ఆస్త్రీ (భద్ర) లాజలు = పేలాలను, నవలాలితరీతిన్ = క్రొత్తసొగసైనరీతి చేతను, దోయిలించి = దోసిటం బట్టికొని, వేల్చుచోన్ = హోమము చేయుచుండఁగాన్, లేఁజెమటన్ = కొలఁదిచెమటచేతను, కరాంగుళులన్ = చేతివ్రేళ్లయందున్, లీలగన్ = చక్కఁగాన్, అంటినకొన్ని = తగుల్కొన్నకొన్నిలాజలు, అంభోజదళంబులన్ = తామరరేకులను, పొదువు.....పూలనన్, పొదవు = అంటికొనియెడు,

( ఇఁగిపూలకువిశేషణము. ) ఫుల్లతజాల్చిన = వికాసముపొందిన, మల్లెపూలనన్ = మల్లెపువ్వులువలె, పాల్పెన్ = కాన్పించెను. ఆమె లాజలు హోమముచేయునపుడు నాయకునిసాన్నిధ్యముచేఁ గల్గినచెమటచే నన్నియు నగ్నిం బడక వ్రేళ్ల నంటికొని యవి తామరతీఁకులమీఁద నున్న మల్లెపూలువలెఁ గాన్పించె ననిభావము. ఉపమాలంకారము.

క. సనికల్ ద్రొక్కించునెడల
నెనసె సతీపతులచరణ ♦ మృదుశాఖాంగుళులం
బెనుపగు కెంజిగి యిరువురి
కనురాగం బిట్లు బహుళ ♦ మగు మీఁదట నాన్. 77

సనికల్ = పిండి నూరుకొను రాతిని, ద్రొక్కించునెడలన్ = త్రొక్కించునపుడు, సతీపతులచరణమృదుశాఖాంగుళులన్, సతీపతుల = వధూవరులయొక్క, చరణ = పాదమునందును, మృదుశ = మెత్తని, అంగుళులన్ = వ్రేళ్లయందును, ( వధువుయొక్క పాదమందును వరునియొక్క చేతివ్రేళ్లయందును నని యర్థము ) పెనుపగుకెంజిగి = అధికమైనయెఱ్ఱనికాంతి, ఇరువురకున్ = ఈదంపతులకును, మీఁదటన్ = ఉత్తరకాలమందున్, అనురాగంబు = ప్రేమము, ఇట్లు = ఈపాదమునందును వ్రేళ్లయందు నున్నయుట్టువలెనే, బహుళ మగునాన్ = అధిక మగు నని చెప్పుచున్నట్లు, ఎనసెన్ = పొందెను. వివాహమునాఁడు పెండ్లికొడుకు తనచేతితోఁ బెండ్లికూఁతుపాదము పట్టికొని సన్నికలు ద్రొక్కింపవలయు ననువిధికలదు. ఈపెండ్లికొడు కట్లుచేయునపుడు తనమృదువు లగువ్రేళ్లతో ముట్టఁగనే యామెపాదమును, పాదము సోఁకఁగనే యాతనివ్రేళ్లును నెఱ్ఱనయ్యెను. ఈయారుణ్యము భార్యాభర్తలకు ముందు ప్రేమాధిక్యము గల్గ ననిసూచించుటకుఁ బుట్టెనో యనున ట్లుండె ననిభావము. ఉత్ప్రేక్షాలంకారము.

క. కొంగులు ముడియిడుచోఁ బు
ణ్యాంగన లెత్తిరట మంగ ♦ ళారాత్రికముల్
నింగి సరుంధతి ధ్రువుని గ
నుంగొనిరి వధూవరులు మ ♦ నోమోదమునన్. 78

కొంగులు ముడియిడుచోన్ = వధూవరులకొత్తవస్త్రములయంచులు ముడివేయునపుడు, పుణ్యాంగనలు = పేరంటాండ్రు, మంగళారాత్రికముల్ = ఆరతులను, ఎత్తిరి = ఒసంగిరి. అటన్ = పిమ్మటను, వధూవరులు = పెండ్లికూఁతురును పెండ్లికొడుకును

ను, మనోమోదమునన్ = మనస్సంతోషముతోడన్, నింగిన్ = ఆకాశమునందున్, అరుంధతిన్ = నక్షత్రరూపమున నున్న యరుంధతిని, ధ్రువునిన్ = అట్టిధ్రువునిని, కనుంగొనిరి = చూచిరి. వివాహానంతరమున నరుంధతిని ధ్రువుని నాయుర్వృద్ధికై కాన్పింతురు.

గీ. అపుడు పాండవులాదిగా ♦ నఖిలబాంధ
వావళు లనర్ఘరత్నాంబ ♦ రాభరణము
లెలమి దంపతులకుఁ బురో ♦ హితునిచేత
కట్నములు చదివించిరి ♦ ఘనతరముగ. 79

అపుడు = వివాహానంతరమున, పాండవులు, ఆదిగాన్ = మొదలుగాఁ, అఖిలబాంధవావళులు = ఎల్లచుట్టములసముదాయములును, దంపతులకున్ = భార్యాభర్తలకున్, ( జాయా + పతి = దంపతులు ) ఎలమిన్ = సంతోషముతోడన్, అనర్ఘ . . . లు, అనర్ఘ = వెలలేని, ( ఎక్కువ వెలగల యనియర్థము. ) రత్న = మణులను, అంబర = వస్త్రములను, ఆభరణములు = భూషణములను, పురోహితునిచేతన్, ఘనతరముగన్ = అధికముగాన్, కట్నములు = కానుకలను, చదివించిరి.

క. హేమము లుద్దామమణి
స్తోమములును దక్కులోన ♦ దొరకెడుక్షేత్రా
రామము లొసరి నృపాలుఁడు
గ్రామము లొసఁగెం గుమారి ♦ కకుఁ బసపునకై. 80

నృపాలుఁడు = కేకయరాజు, హేమములు = బంగారునాణెములును, ఉద్దామమణిస్తోమములును = పెద్దమణులసముదాయములును, దక్కులోనన్ = దున్నుటలోనే, దొరకెడుక్షేత్రారామములు = దొరకెడుపొలములును, తోఁటలును, ఒసరన్ = కలుగునట్లుగా, గ్రామములు = గ్రామములను, కుమారికకున్ = కూఁతునకున్, పసపునకై = పసపునకన్ గుంకుమము మొదలగువానికనియర్థము ఒసఁగెన్ = ఇచ్చెను.

సీ. పంచధారాసమ్మృ ♦ ద్ధ్వంచితాశుగమనో
చ్ఛ్రముల శ్రీవృక్షకి ♦ సైంధవముల
దిక్కరీంద్రంబుల ♦ ధిక్కరింపఁగఁజాలు
పృథుసారగంభీర ♦ వేదితతులఁ

తప్తకాంచనమణి ♦ స్థగితంబు లగు మేరు
మందర సుందర ♦ స్యందనములఁ
జెలఁగెంటి పూఁబోండ్ల ♦ తెలఁగెంటి కంటి కిం
పగు జవ్వనంపుటూ ♦ డిగపుఁ జెలుల
మఱియు నానావిధానూన ♦ మహాప్రకాశ
మానమణిభూషణాదుల ♦ మానము యొసఁగి
నుడుగిరులుగా మహోత్సాహ ♦ మొలయ మించ
నర్పించె యాదవాగ్ర్యుఁ ♦ డావిభునకు. 81

యాదవాగ్ర్యుఁడు=ధృష్టకేతుఁడు, పంచధారా .... సైంధవములన్, పంచధారా=ఐదువిధములైన గమనవిశేషములయొక్క, సమృద్ధి=సంపదచేతను, అంచిత=పూజింపఁబడినవియు, (ని) ఆస్కందితంధోరితకం రేచితం వల్గితం ప్లుతం గతమోమూః పంచధారాః అ ఆశుగ=గాలికంటెను, మనః=మనసుకంటెను, ఉచ్చములన్=(వడిచే) అధికములను, శ్రీవృక్షకి సైంధవములన్=శ్రీవృక్షకు లను పేరుగల గుఱ్ఱములను, (గుఱ్ఱములపై రోమముల సంగిలసుడి శ్రీవృక్షకమనియు నట్టిసుడి గలగుఱ్ఱములు శ్రీవృక్షకులనియుఁ జెప్పంబడును ఇవి సంగ్రహించినవారి కవితసంపదల నిమ్మన ) దిక్కరీంద్రంబులన్=దిగ్గజములను, ధిక్కరింపఁగన్=తిరస్కరించుటకైన్, చాలు .... తతులన్, చాలు=తగిన, పృథుసార=అధికబలముగల, గంభీరవేదితతులన్=గంభీరవేదు లను యేనుఁగుల సమూహములను, ("చర్మము చీల్చుటవలనను రక్తము స్రవించుటవలనను గూడఁ దన్నుఁ దెలిసికొనఁజాలని యేనుఁగు గంభీరవేది" మిగల వదించిన దనియర్థము.) తప్త.....తంబులు, తప్త=పుటము వేయఁబడిన, కాంచన=బంగారము చేతను, మణి=రత్నములచేతను, స్థగితంబులు=కప్పఁబడినవి, అగు . నములన్, అగు, మేరు=మేరుపర్వతమువలెను, మందర=మందరపర్వతమువలెను, సుందర=అందముగల, స్యందనములన్=రథములను, తెలఁగంటిపూఁబోండ్లతెలఁగు, తెలఁగంటి=దేవతలయొక్క, పూఁబోండ్లతెలఁగు=స్త్రీలయొక్క విధమును, అంటి=స్పృశించి, దేవతాస్త్రీలం బోలి యనియర్థము కంటికిన్=నేత్రములకున్, ఇంపు=సంతోషమును, అగు .....లన్, అగు=కల్గించెడు, జవ్వనంపు.....టూడిగపుఁజెలులన్=పడుచుఁదనము గలపనికత్తెలను, మఱియున్=ఇంకను, నానావిధ.....భూషణాదులన్, నానావిధ=పె

క్కు తెలుంగులుగల, అనుపమ = సాటిలేని, ప్రకాశమాన = తేజరిల్లుచున్న, మణిభూషణాదులన్ = మాణిక్యముల (తోఁ గూడిన) నగలు మొదలగువానిని, యాదవాన్వయవల్లభునకున్ = యదువంశపురాజునకున్, అల్లునకున్, మహోత్సాహము = మిగులసంతోసము, బలయుచుండన్ = కలుగుచుండఁగాన్, ఉడుగరలుగాన్ = కానుకలుగాన్, ఒసఁగెన్ = ఇచ్చెను

చ. అనుపమరత్నకాంచనమ యాభరణంబులు పట్టుపుట్టముల్
పునుఁ గగరుల్ మృగీమదముఁ బొల్పగుదంతపుఁ బేటికల్ సఖీ
జనము మహామణుల్ పస నెసంగెడుపచ్చలకోళ్లమంచముల్
గనకకళాచికల్ మొదలుగా శుభవస్తువు లిచ్చెఁ బుత్త్రికిన్. 82

అనుపమ . . . లు, అనుపమ = సాటిలేని, రత్న = మణులయొక్కయు, కాంచన = బంగారముయొక్కయు, మయ = వికారములైన. ఆభరణంబులు = భూషణంబులును, పట్టుపుట్టముల్ = పట్టువస్త్రములును, పునుఁగు = జవ్వాదిని, అగరున్, మృగీమదమున్ = కస్తూరిని, పొల్పగుదంతపుఁబేటికల్ = ఒప్పైన (యేనుఁగు) దంతములతోఁ జేసిన పెట్టెలను, సఖీజనమున్ = చెలికత్తెలను, మహామణుల్ = గొప్పరత్నములును, పసన్ = కాంతితోన్, ఎసంగెడుపచ్చలకోళ్లమంచముల్ = ప్రకాశించుపచ్చరాలకోళ్లు గలమంచములును, కనకకళాచికల్ = బంగారుతమ్మపడిగెలును, మొదలుగాన్, శుభవస్తువులు = మంచివస్తువులను, పుత్త్రికిన్ = కూఁతునకున్, ఇచ్చెన్ = (కేకయరాజు) ఇచ్చెను.

వ. ఇవ్విధంబునం గల్యాణమహోత్సవంబు గావించి భూవరుండు సకలదేశాగతు లగుబంధుమిత్త్రామాత్యులకు విప్రబృందంబునకు వందిమాగధవైతాళికగణికాదిజనంబునకుఁ దత్తదుచితప్రకారంబునం బారితోషికంబులు నభీష్టార్థంబు లొసంగి వీడ్కొల్పె ననంతరంబ నిజకాంతామణి యగుశ్రుతకీర్తియుం బతియనుమతిం గొమరిని రమణునికడ కనుపందలంచి యొక్కశుభదినంబున. 83

ఇవ్విధంబునన్ = ఈప్రకారముచేతను, భూవరుండు = రాజు, కల్యాణమహోత్సవంబు = పెండ్లివేడుకను, కావించి, సకలదేశాగతులు = ఎల్లదేశములనుండి వచ్చినవారు,

అనుబంధుమిత్రామాత్యులకున్ = అనుచుట్టములకున్, నెయ్యురకున్, మంత్రులకును, విప్రబృందంబునకున్ = బ్రాహ్మణసముదాయమునకున్, వంది .....జనంబునకున్, వంది = పరాక్రమమును స్తుతించువారును, మాగధ = వంశమువారిని గొనియాడువారును, వైతాళిక = మేలుకొల్పులు పాడువారును, గణికాది = వేశ్యలు మొదలగువారు (నగు) జనంబునకున్, తత్తదుచితప్రకారంబునన్ = వారివారికిం దగినరీతిచేతను, పారితోషికంబులున్ = బహుమానములను, అభీష్టార్థంబులు = కోరినవస్తువులను, ఒసంగి = యిచ్చి, వీడ్కొల్పెన్ = సెలవిచ్చి పంపెను అనంతరంబ = పిమ్మటను, నిజకాంతామణి = తన భార్య, అనుశ్రితకీర్తి, పలియనుమతిన్ = భర్తసమ్మతిచేతను, రమణునికడకున్ = భర్తదగ్గఱకున్, కొమరిన్ = కూఁతురగుపద్మను, అనుపన్ = పంపుటకున్, తలంచి (భర్తతోఁ గూర్పఁదలఁచి యనియర్థము) ఒక్కశుభదినంబునన్ = ఒకమంచిదినమున, ముందుపద్యముతో నన్వయము

చ. జలకములార్చి పెన్నెరుల • సాంద్రితరాగరుధూపవాసనల్
గలపి చతుర్విధాభరణ • గా లతకూన నలంకరించి నె
చ్చెలులును దానుఁ గేళితతిఁ • జేయఁగ నొప్పువిలాసచేష్టితం
బుల నెఱిఁగించి రాముఁడద • ముద్దులగుమ్మకు మంతనంబునన్.84

జలకములార్చి = స్నానముచెయించి, పెన్నెరులన్ = పొడవు లగుకురులందున్, సాంద్ర వాసనల్, సాంద్రతర = మిక్కిలియధికమైన, అగరుధూపవాసనల్ = అగరుపొగయొక్క పరిమళములను, కలపి = సంఘటించి, లతకూనన్ = కూఁతు రగుపద్మను, (లేఁదీవవలె మృదు వగుశరీరము గలదానిని) చతుర్విధాభరణగాన్ = ముత్యాలదండలు. కడియములు, కర్ణభూషణములు, బాహుపురులు నను నాల్గువిధము లగునలంకారములు గలదియగునట్లుగాన్, అలంకరించి = సింగారించి, తాను = తల్లియును, నెచ్చెలులును = చెలికత్తెలును, కేళితతిన్ = (మగనితోఁ)గ్రీడించునప్పుడు, చేయఁగన్ = చేయుటకున్, ఒప్పువిలాసచేష్టితంబులన్ = ఒప్పెడుశృంగారచేష్టలను, (చేయవలయు శృంగారప్రబంధనలను) మంతనంబునన్ = ఏకాంతమందున్, ఆముగ దముద్దులగుమ్మకున్ = ఆముగ్ధయగుసుందరికిన్, ఎఱిఁగించిరి = తెలిపిరి

సీ. వింజామరలు వీచు • వింతకీల్బొమ్మలు
తళుకారునిల్వుటద్దములఁ దోఁచు

బవడంపునునుఁగోళ్ల • పందిరిమంచంబు
తెరలు ముత్యాలజా • లరుల నెసఁగ
రంగుబంగరునీటి • వ్రాఁతచిత్తరువుల
దంపతుల్ మదనతం • త్రంబుఁ జూపఁ
బల్లటీల్గోణిగల • పై నారజపుటెలుం
గులు గ్రొత్తవలపులు • గ్రుమ్మరింప
గంధరాజంబు లోనుగాఁ • గలసుగంధ
వస్తువులు వీడియపుజాల • వల్లికలును
దమ్మికెంపులకాళాంజి • తమ్మపడిగె
లుం బొదలుచుండు కేళిసౌ • ధంబుమీఁద. 85

వింజారలు = తెల్లనిసవరములను, వీచువింతకీల్బొమ్మలు = విసరుచిత్రము లగు జంత్రపుబొమ్మలు, తళుకారునిల్వుటద్దములన్ = మెఱసెడి పెద్దయద్దములందున్, తోఁపన్ = ప్రతిఫలింపఁగాన్, పవడంపు.... తెరలు, పవడంపు = పగడపురాతియొక్క, నునుఁగోళ్ల = నున్ననికోళ్లుగల, పందిరిమంచంబుతెరలు = పందిరిమంచమునకుఁ జుట్టునుండు (దోమలు మొదలగునవి రాకుండఁ గట్టెడు) తెరచీరలు, ముత్యాలజాలరులన్ = ముత్తెములు గూర్చినజాలెలచేతను, ఎసఁగన్ = ప్రకాశింపఁగాన్, రంగు ..... చిత్తరువులదంపతుల్, రంగు = మంచికాంతిగల, బంగరునీటి = బంగారునీటియొక్క వ్రాఁతచిత్తరువులదంపతుల్ = వ్రాఁత గలపటములం దున్న భార్యాభర్తలు, (బంగారునీటితోఁ బటములందు భార్యాభర్తృరూపముగ వ్రాసినబొమ్మ లనియర్థము) మదనతంత్రంబు = మన్మథవ్యాపారమును, చూపన్ = బోధింపఁగాన్, పల్లటీల్ = పావురములు, కోణిగలపైన్ = చూరుపట్టెలమీఁదను, ఆరజపుటెలుంగులు = చక్కనికూఁతలచేతను, క్రొత్తవలపులు = క్రొత్తకోరికలను, క్రుమ్మరింపన్ = ప్రకటింపఁగాన్, గంధరాజంబు = ఒకానొకమంచివాసనగలవస్తువు, లోనుగాన్ = మొదలుగాన్, కలసుగంధవస్తువులు = కలపరిమళద్రవ్యములును, వీడియపుజాలవల్లికలును = తాంబూలకరండములును (పాందానులు) తమ్మి .....లున్, తమ్మికెంపుల = పద్మరాగములయొక్క, (వికారమైన) కాళాంజితమ్మపడిగెలున్ = పతద్గ్రహములును, (పీకదాన్లు) పొదలుచుండు కేళిసౌధంబుమీఁదన్ = వ్యాపించి యుండెడు సింగారపుమేడయందున్,

( ముందుపద్యముతో నన్వయము )

క. మేలగువిరిపాన్పున గో
పాలుఁడు భద్రాంగనావి ♦ భాసితలీలా
కేళీలాలసమానసుఁ
డై లాలితరీతి నుండ ♦ నాసమయమునన్. 86

మేలగువిరిపాన్పునన్ = శ్రేష్ఠ మగుపూసెజ్జయందున్, గోపాలుఁడు = కృష్ణుఁడు భద్రాంగనా... ..మానసుఁడై, భద్రాంగనా = భద్రయను నింతియొక్క, విభాసిత = ప్రకాశించెడు, లీలా = విలాసముతోఁ గూడిన, కేళీ = క్రీడయందున్, లాలసమానసుఁడై = ఆసక్తి గలమనసు గలవాఁడై, లాలితరీతిన్ = చక్కనిరీతితోన్, ఉండన్ = ఉండఁగాన్, ఆసమయమునన్ = ఆకాలమందున్, ముందుపద్యముతో నన్వయము.

సీ. తననునుఁజెక్కుట ♦ ద్దపుఁదళత్తళలకు
వజ్రకర్ణికలు ని ♦ వ్వాళు లొసఁగఁ
దనబెళ్కువాల్చూపు ♦ లనిగన్నిగలను మేల్
కిరణీచెంపలనిగ్గు ♦ గదిసి యొదుగఁ
దననిస్తులస్తన ♦ ద్వయి మిసమిసలకు
హారాంగదములు దా ♦ స్యంబు సలుపఁ
దనరత్నమేఖలా ♦ భాగధగ్యములకుఁ
గుంకుమాంశుకము సి ♦ గ్గువడి ముఱుఁగ
రమణు లిర్వంకలను గరా ♦ గ్రములు వట్టి
యల్లనల్లనఁ దోతేర ♦ ఘల్లుమనుచు
నందియలు మ్రోయఁ గేళీగృ ♦ హంబుచెంత
కతివ యరుదెంచె మదమోహ ♦ నాస్త్రమనఁగ. 87

తన......శలకున్, తన = భద్రయొక్క, నునుఁజెక్కుటద్దపుఁదళత్తళలకున్ = నున్ననియద్దములం బోలినచెక్కులయొక్క తళతళ మనియెడు కాంతులకున్, వజ్రకర్ణికలు = వజ్రములు తాపినకర్ణపుష్పములు, నివ్వాళులు = ఆరతులను, ఒసఁగన్ = ఇయ్యఁ

గాన్, తనచెలువు వాల్చూపులనిగ్గులకున్ = తనయొక్క చలించెడు వాఁడిచూపుల యొక్క నిగనిగలాడెడు కాంతులకున్, మేల్ కరిణిచెంపలనిగ్గు = శ్రేష్ఠమగు ముంగురులకాంతి, కదిసి = సమీపించి, ఒదుగన్ = అధికముకాఁగాన్, తననిస్తులస్తనద్వయిమిసమిసలకున్ = తనయొక్క సాటిలేని కుచములజంటయొక్క మిసమిసలాడుకాంతికిన్, హారాంగదములు = ముత్యాలదండలు భుజకీర్తులును దాస్యంబు = సేవను, సలుపన్ = చేయఁగాన్, తనరత్నమేఖలాధాగధగ్యములకున్ = తనయొక్క రత్నములతోఁ గూడిన మొలనూలియొక్క ధగధగలాడెడుకాంతికిన్, కుంకుమాంశుకము = కుంకుమవన్నెగలవస్త్రము, సిగ్గువడి = లజ్జనొంది, ముణుఁగన్ = ముడిఁగిపోఁగాన్, రమణులు = మనోహరలగుచెలులు, ఇరువంకలన్ = రెండువైపులను, కరాగ్రములు = చేతులను, పట్టి = పట్టుకొని, అల్లనల్లనన్ = మందమందముగాను, తోతేరన్ = తీసికొనిరాఁగాన్, అందియలు, ఘల్లురనుచున్ = ఘల్లుఘల్లు మనుచున్, మ్రోయన్ = ధ్వనింపఁగాన్, అతివ = బదరి, మరుమోహనాస్త్ర మనఁగన్ = మన్మథనిమోహనబాణమువలెన్, (మూర్ఛను గలిగించుబాణము మోహనబాణము) శౌరిగృహంబుచెంతకున్ = (కృష్ణుఁడున్న) క్రీడాగృహముదగ్గఱకున్, అరుదెంచెన్ = వచ్చెను

క. పొడమినలజ్జాభరమున
నడుగామడ యైనముగుద ♦ యపు డీడిగిలం
బడి పడకయిల్లు సొరక
ప్పడఁతుల వెసఁ గసరి యిట్లు ♦ పలికెం గలఁకన్ 88

ముగుద = ముగ్ధ యగు బదరి, (ఉదయించుచున్న జవ్వనము గలదియై సిగ్గువమయని జయించుబాల ముగ్ధ యనంబడు) పొడమినలజ్జాభరమునన్ = పొడమినసిగ్గుయొక్క యతిశయముచేతను, అడుగ = అడిగాఁడదూరము, ఆమడయైనన్ = ఆమడ (దూరపుప్రయాణముతో సమము) కాఁగాన్, ఈడిగిలంబడి = రానని పట్టుపట్టి కూర్చుండి, అపుడు, పడకయిల్లు = పరుండుకుంటిని, చొరక = ప్రవేశింపక, అప్పడఁతులన్ = ఆచెలులను, వెసన్ = వేగముతోన్, కసరి = కోపించి, కలఁకన్ = క్షోభముతోన్, ఇట్లు = ఈప్రకారము, పలికెన్ = చెప్పెను.

ఉ. అక్కట! నన్ను మీర లిపు ♦ డందఱు నాఱడిపెట్టి మాయలం
జిక్కఁగఁ జేసి కన్మొఱఁగి ♦ చెచ్చెర నేఁగఁ దలంచినార ల

మ్మక్కరో! మీవివేకము లహో! తెలిసెన్ మిముఁ బాసి యొంటిమై
నొక్కనిమేషముం మెలఁగ నొల్లఁజుఁడీ వెనువెంట వచ్చెదన్. 89

అక్కట=అయ్యో (సంతాపార్థక మైనయవ్యయము) మీర లందఱు, ఇప్పుడు=ఈకాలమునన్, నన్నున్, అఱడివెట్టి=నిందించి, మాయలన్=మోసములందున్ చిక్కఁగఁజేసి=తగుల్కొనఁజేసి, కన్మొఱఁగి=వంచించి, చెచ్చెరన్=శీఘ్రముగాన్, ఏగన్=పోవుటకున్, తలంచినారలు, అమ్మక్కరో=ఎంతవింతి, (ఆశ్చర్యమును దెలియఁజేయును) మీవివేకములు=మీతెలువులు, తెలిసెన్; అహో!=ఎంత ఖేదము! మిమున్, పాసి=విడిచి, ఒంటిమైన్=ఒంటరితనమునన్, ఒక్కనిమేషముం=ఒక్క ఱెప్పపాటుకాలమైనను, మెలఁగన్=ఉండుటకున్, ఒల్లఁజుఁడీ=ఇష్టపడనుజుఁడీ! (చుఁడీ చూచుధాతువు వార్థ్యర్థక మధ్యమపురుష బహువచనము.) వెనువెంటన్=మీవెనుకను, వచ్చెదన్=వచ్చెదను

వ. అనిన నచ్చిన్నియన్నులతలమిన్న కన్నెలంత లొత్తి యిట్లనిరి. 90

అనినన్=(భద్ర) యిట్లుచెప్పఁగాన్, అచ్చిన్నియన్నులతలమిన్నకున్=ఆ బాలికాశిరోరత్నమునకున్, అన్నెలంతలు=ఆచెలులు, ఒత్తి=బలాత్కరించి, ఇట్లు=ఈక్రిందివాక్యములను, అనిరి=పలికిరి.

చ. అవు నవు మంచిదాననవె బళా వెఱ పేమిటి కమ్మ! నీవు గో
రి వలచినట్టిచెల్వుఁ డమరెం బ్రమదాంబుధి నోలలాడెదో
యువిదలమిన్న! మిన్నక యయో చల మేల యొనర్చెదమ్మ! బే
లవె సకలం బెఱెంగినప లంతివి రాఁగదవమ్మ! చెచ్చెరన్. 91

ఓయువిదలమిన్న=ఓ స్త్రీరత్నమా! (యువతిశబ్దభవము, ఉవిద మిన్న=రత్నము) బళా!=(నీవు చెప్పినమాటలు) ఎంతప్రశస్తములుగా నున్నవి! అవునవున్=(ఇది యంగీకారముఁ దెలుపుఁ గాని యిచటదీనికిని వెనుకటిబళా యనునవ్యయమునకును విపరీతలక్షణచె విరుద్ధార్థము చెప్పవలయును) మంచిదాననవె!=మనసున నున్న దానికంటె వేఱువిధమును బ్రకటించు చున్నదానవుకావున మంచిదానవు కావని పరిహాసము వెఱపు=భయము, ఏమిటి కమ్మ=ఎందున కమ్మ? భయపడ వలదని భావము నీవు, కోరి=కామించి, వలచినట్టిచెల్వుఁడు=ప్రేమించినప్రియుఁడు, అమరెన్=సమకూడెను ప్రమదాంబుధిన్=సంతోషసముద్రమునందన్, ఓలలాడెదు=

క్రీడింతువు అహో = ఎంతకష్టము! మిన్నక = వ్యర్థముగాన్, చలము = మచ్చరమును, ఏల = ఎందులకున్, ఒనర్చెదమ్మ = చేసెదవు? పట్టు పట్టు బెందుల కనియర్థము. జేల వె = ఎఱుఁగనిదానవా? (కావనియర్థము) సకలంబు = అంతయు, ఎఱింగినవలంతి వి = తెలిసిననేర్పరివి. చెచ్చెరన్ = శీఘ్రముగాను, రాఁగదమ్మ = రమ్మ

క. మిగుల వలపూని మము మొ
న్నఁగదే బతిమాలుకొంటి నాథుని గూర్పం
బిగిసెద వేమే యోసెమ
వగ లేటికి రమ్మ మేల్మి బంగిరుబొమ్మా! 92

మిగులన్ = అధికముగాను, వలపు = కోరికను, ఊని = దరించి, నాథునిన్ = భర్తను, కూర్పన్ = సంఘటించుటకున్, మొన్నఁగదే = నిన్నటికిఁ బూర్వదినమునసే కదా, బతిమాలుకొంటి = దైన్యముతో నడిగితివి ఓసెమ = ఓయమ్మా, బిగిసెదవేమే = బింకములు చేసెద వేమే, మేల్మిబంగరుబొమ్మ = పుటము వేసిన బంగారుబొమ్మం బోలినభద్రా, వగలు = విలాసములు, ఏటికిన్ = ఎందునకున్, (అగును) రమ్మ = ఏతెమ్మ.

చ. అని సఖు లూఱడించి కమలాక్షుని చెంతకు ముద్దరాలిఁ దో
డ్కొని చని పూలపాన్పుదరిఁ గోమలి నుంచి యొయారికృష్ణ యీ
యనుపమసుందరాంగిని బ్రియం బలరారఁగ నేలుకొమ్ము కొ
మ్మని తగ నప్పగించి వెస నందఱు జాఱిరి మన్కిపట్లకున్. 93

అని = ఈప్రకారము, సఖులు = చెలికత్తెలు, ఊఱడించి = సమ్మతిపఱిచి, ముద్దరాలిన్ = ఆభద్రను, కమలాక్షుని చెంతకున్ = కృష్ణునిసమీపమునకున్, తోడ్కొని చని = తీసికొనివెళ్లి, పూలపాన్పుదరిన్ = పూలసెజ్జసమీపమందున్, కోమలిన్ = ఆ స్త్రీని, ఉంచి = నిలిపి, ఒయారి = ఓసొగసుకాఁడా, కృష్ణ, ఈ యనుపమసుందరాంగిన్ = ఈ సాటిలేని సొగసుకత్తెను, ప్రియంబు = ప్రేమము, అలరారఁగన్ = అతిశయించునట్లు, ఏలుకొమ్ము = పాలింపుము. కొమ్ము = పరిగ్రహింపుము, అని = ఇట్లు చెప్పి, తగన్ = బాగుగాన్, అప్పగించి, అందఱు, వెసన్ = త్వరతోన్, మన్కిపట్లకున్ = (వారు) నివసించుతావులకున్, జాఱిరి = క్రమముగా వెళ్లిరి.

చ. అపుడు ముకుందుఁ డవ్వికసితాంబురుహాంబకసోయగంబు గా
టపుఁదమి మీఱఁ గన్గొని తటాలున ముంజెయి పట్టి పూలపా
నుపునకుఁ జేర్పఁగాఁ జెలఁగె నూపురభూరిఝణంఝణధ్వనుల్
విపులధనుర్గుణధ్వనులు వేడ్క మరుం డొనరించెనో యనన్. 94

ముకుందుఁడు = కృష్ణుఁడు, అపుడు, అవ్వికసితాంబురుహాంబకసోయగంబు = ఆభద్రయొక్క చక్కందనము, ( వికసిత = పూచిన, అంబురుహ = తామరపూవులంబోలిన, అంబక = కన్నులుగలది. వికసితాంబురుహాంబక ) గాటపుఁదమి = అధికమైన వలపు, మీఱన్ = ప్రకటముకాఁగాన్, కన్గొని = చూచి, తటాలునన్ = మిగుల వేగముగాన్, ముంజెయి = హస్తాగ్రమును, పట్టి = పట్టుకొని, పూలపానుపునకున్ = పుష్పశయ్యకున్, చేర్పఁగాన్ = ఆకర్షింపఁగాన్, చేరునట్లు చేయఁగా నని యర్థము. నూపురభూరిఝణంఝణధ్వనుల్ = అందెలయొక్క యధికమైన ఝణఝణ యనెడుధ్వనులు, మరుండు = మన్మథుఁడు, విపులధనుర్గుణధ్వనులు = అధికమైన వింటినారిటంకారములను, వేడ్కన్ = సంతసముతోన్, ఒనరించెనో యనన్ = చేసెనో యనునట్లు, చెలఁగెన్ = ప్రకాశించెను. ఉత్ప్రేక్షాలంకారము

ఉ. పానుపు నొందకప్పుడు త్రపాభయసంచలితాంతరంగయై
మానిని మోహసంభ్రమసమగ్రత మైపులకింప ఘర్మసాం
ద్రాననయై కనుంగవ ముదశ్రులు గ్రమ్మ వినిశ్చలత్వముం
బూనుచు నిల్చె దివ్యమణిపుత్త్రికకైవడి శౌరిముందటన్. 95

మానిని = భద్ర, ( గొప్పమనసుగలది ) అప్పుడు, పానుపు = శయ్యను, ఒందక = ప్రవేశింపక, త్రపా ....యై, త్రపా = సిగ్గును, భయ = భయమును, సంచలిత = వణఁకింపఁబడిన, అంతరంగయై = మనసు గలదియై, మోహసంభ్రమసమగ్రతన్ = వలపుయొక్కయు వేగిరపాటుయొక్కయు సంపూర్తిచేతను, మై = శరీరము, పులకింపన్ = గగుర్పాటువడఁగాన్, ఘర్మసాంద్రాననయై = చెమటచే నిండినమోముగలది యై, ముదశ్రులు = సంతోషబాష్పములు, కనుంగవన్ = కన్నులజంటయందున్, గ్రమ్మన్ = వ్యాపింపఁగాన్, దివ్యమణిపుత్త్రికకైవడిన్ = సుందరమైనమాణిక్యపుబొమ్మవిధముచేతను, వినిశ్చలత్వమున్ = కదలకుండుటను, పూనుచున్ = ధరించుచున్, నిల్చెన్ = ఉండెను. ఇందుస్తంభము, గగుర్పాటు, స్వేదము, అశ్రువు ననుసాత్త్వికభావములును, త్రి

ప, భయము ననుసంచారిభావములును జెప్పఁబడియె. రోగభయాదులవలనం గదలకుండుట స్తంభమును, సుఖాదులయతిశయమువలన నుత్పన్నమైనరోమాంచము గగుర్పాటును, లజ్జాభయక్రోధాదులవలన శరీరమునం బుట్టినజలము స్వేదమును, హర్షాదులవలన జనితంబైనకన్నీరు అశ్రువును, మన్మథనిమిత్తమైనరాగాదులచేఁ గల్గినమనస్సంకోచము త్రపయును, భయహేతువువలని చిత్తక్షోభము త్రాసము ( ఇదియే భయ మనంబడు ) ననియు నాలంకారికులు.

క. నాన నొదిఁగె దేటికి నలి
నానన కెమ్మోవి తేనె ♦ నాన నొసఁగి న
న్నా ననవిల్తుని దురమున
నానందసమగ్రుఁ జేయు ♦ మనిబలుకూర్మిన్. 96

నలినానన = ఓభద్రా ( తామరపూవుం బోలినముఖము గలదానా ) నానన్ = సిగ్గుచేతను, ఏటికిన్ = ఎందునకున్, ఒదిఁగెదు = తొలఁగెదవు కెమ్మోవి తేనె = ఎఱ్ఱని పెదవి యందలి తేనెను, ఆనన్ = త్రావుటకున్, ఒసఁగి = ఇచ్చి, నన్నున్, ఆననవిల్తునిదురమునన్ = మన్మథయుద్ధమందున్, ( నన = పుష్పము, విల్లు = ఎవనికి ధనువో యతఁడు, ననవిల్తుఁడు. తకారము సమాసాంతప్రత్యయము ) ఆనందసమగ్రున్ = సంతోషపూర్ణునిన్, చేయుము అని = కావింపుము అని, బలుకూర్మిన్ = అధికమైనసెయ్యముతోన్, ముందుపద్యముతో నన్వయము

క. మునుకొని ముంజెయిఁ జేకొని
కనకాంబరుఁ డపుడు బాలి ♦ కారత్నము నొ
య్యనఁ బుష్పతల్పమున క
త్యనురక్తిం దిగిచి సంస్మి ♦ తాననుఁ డగుచున్. 97

కనకాంబరుఁడు = కృష్ణుఁడు ( బంగారముం బోలినపచ్చనివస్త్రము గలవాఁడు. ) అపుడు, మునుకొని = ముందునకుం బోయి, ముంజెయి = హస్తాగ్రమును, చేకొని = పట్టుకొని, అత్యనురక్తిన్ = మిగుల ననురాగముతోన్, ఒయ్యనన్ = మెల్లఁగాన్ బాలికారత్నమున్ = భద్రను, పుష్పతల్పమునకున్ = పూలపాన్పునకున్, తిగిచి = ఆకర్షించి, సంస్మితాననుఁడు = చిఱునవ్వుతోఁ గూడినమోము గలవాఁడు, అగుచున్, ముందుపద్యముతో నన్వయము.

సీ. చేర్పుకక్కరాయిడిఁ ♦ జెదరె నీబొట్టంచు
గోట దిద్దుచును ముం ♦ గురులు దువ్వి
చిలికె నీమకరికల్ ♦ చిత్రవాసన లంచు
మూర్కొంచుఁ జెక్కిలి ♦ ముద్దులాడి
హృదయంబు విరహార్తి ♦ నెంత గ్రాఁగెనొ యంచు
నెదను జెయ్యిడుచుఁ బా ♦ లిండ్లు పట్టి
యొదిఁగె నీకుచ్చిళ్ల ♦ నొడ్డాణపుంగింట
లనుచుఁ జేకొనుచు నీ ♦ వివి వదల్చి
నాదుకౌస్తుభమణియు నీ ♦ నవ్యరత్న
మాలికానాయకమును స ♦ మంబు లగునొ
కావొ యని యుర మురమునఁ ♦ గదియఁ గూర్చి
కలికి చెలువంపుమెయిదీఁగెఁ ♦ గౌఁగిలించె. 98

చేర్పుకక్కరాయిడిన్ = పాపటబొట్టుయొక్క (నుదుట నలంకరించుకొను నాభరణముయొక్క) రాపిడిచేతను, నీబొట్టు = నీతిలకము, చెదరెన్ = పోయెను, అంచున్ = ఇట్లు చెప్పుచున్, గోటన్ = గోరితోన్, దిద్దుచున్ = (బొట్టును) సవరించుచున్, ముంగురులు = అలకములను, దువ్వి = నిమిరి, నీమకరికల్ = నీయొక్క మకరాకారమైన గంధపుంబూఁతలు, చిత్రవాసనలు = అపూర్వమైనపరిమళములను, చిలికెన్ = ప్రసరింపఁజేసెను అంచున్, మూర్కొంచు = వాసనచూచుచు, చెక్కిలి = చెక్కిలిని, ముద్దులాడి = ముద్దువెట్టికొని, విరహార్తిన్ = వియోగము కలుగటచేతను, హృదయంబు, ఎంతగ్రాఁగెనొ యనుచున్ = ఎంతవెచ్చనయ్యెనో యనుచున్, ఎదను = ఱొమ్మునందున్, చెయ్యిడుచున్ = హస్తముంచుచున్, పాలిండ్లు = స్తనములను, పట్టి, ఒడ్డాణపుంగంటలు = ఒడ్డాణమందున్న మువ్వలు, నీకుచ్చిళ్లన్ = నీకట్టుముడుతలయందున్, ఒదిఁగెన్ = దాఁగెను, అనుచున్, చేకొనుచున్ = గ్రహించుచున్, నీవి = పోఁకముడిని, వదల్చి = సడలించి, నాదుకౌస్తుభమణియు = నామెడలోనిహారములో నున్నమణియు, నీనవ్యరత్నమాలికానాయకమును = నీయొక్క క్రొత్తరత్నములదండయందున్న నాయకమణియును, (హారమునడుమ నున్న పెద్దమణి నాయకము) సమంబులు = తుల్యములు, అగునొ కావొ యని, ఉరము = తనవక్షమును, ఉరమునన్ = ఆమెవక్షస్థల

మందుక౯, కదియక౯, కూర్చి = సంఘటించి, కలికిచెలువంపుమెయిదీఁగె౯ = ఆభద్ర యొక్క సుందరమైనతనూలతను, కౌఁగలించెక౯ = ఆలింగనము చేసికొనెను.

ఇందుఁ గృష్ణుఁ డొక్కొక్కనెపముచే నొక్కొక్కయిష్టకార్యమును సాధించుకొనె ననిచెప్పుటచేఁ బర్యాయోక్త్యలంకారము.

సీ. పుక్కిటిపచ్చక ♦ ప్పురపువీడె మొసంగి
కలికి కెమ్మోవి ప ♦ ల్లం ట్లొనర్చి
కటిసీమఁ గొనగోరు ♦ ఘటియించి గుబ్బల
మురువుగా మేలుట ♦ త్తరువుఁ జిలికి
తొడతొడం బెనచి ముం ♦ దుగ ముత్తెసరులచి
క్కెడలించి నునుఁబోఁక ♦ ముడి వదల్చి
చెక్కు చెక్కుటఁ జేర్చి చే ♦ వేణిఁ గీలించి
భుజము భుజంబునఁ ♦ బొందుపఱచి
చిఱుచెమట లాఱ నెఱిపూవు ♦ సురటి విసరి
గిళిరింపంబులు పిలసిల్లఁ ♦ గలసి మెలసి
పలచి పలపింపఁ జేయుచు ♦ నలరుపిల్లు
కేళిఁ దేలించె నవ్వుద్ది ♦ రాలి శౌరి. 99

శౌరి=కృష్ణుఁడు, పుక్కిటిపచ్చకప్పురపువీడెము = నోటియందలి పచ్చకప్పురముతోఁ గూడినతాంబూలమును, ఒసఁగి = (భద్రకు) నిచ్చి, కలికికెమ్మోవి = సుందరి యగుభద్రయొక్క యెఱ్ఱనిపెదవియందున్, ఇట సప్తమ్యర్థమందుఁ బ్రథమ. పల్లంట్లు = దంతక్షతములను, ఒనర్చి = చేసి, కటిసీమ౯ = కటిస్థలమునందున్, కొనగోరు = గోటిచివరను, ఘటియించి = కూర్చి, (నఖక్షతములు చేసి) గుబ్బలన్ = స్తనములందుక౯, మురువుగా = చక్కఁగాక౯, మేలుటత్తరువుక౯ = ప్రశస్తమైనగంధతైలమును, చిలికి = చల్లి, తొడ, తొడక౯, పెనచి, ముందుగాక౯ = మొట్టమొదటను, ముత్తెసరుల చిక్కు = ముత్యాలదండలచిక్కును, ఎడలించి = తీసివేసి, నునుఁబోఁకముడిక౯, వదల్చి, చెక్కు = తనచెక్కిలిని, చెక్కుటక౯ = భద్రచెక్కిలిని, చేర్చి, చేక౯ = హస్తముతోక౯, వేణిన్ = జడను, కీలించి = పట్టుకొని, భుజము భుజంబునక౯, పొందుపఱచి = కూర్చి,

చిఱుచెమటలు, ఆఱన్ = పోవునట్లు, నెఱిపూవుసురటిన్ = మంచిపూవులవిసనకఱ్ఱతోన్ విసరి, గళరవంబులు = గొంతులోనికూఁతలు, ( మణితము ) చిలుపిల్లన్ = ప్రకాశింపఁగాన్, అమ్ముద్దరాలిన్ = ఆముగ్ధాంగనను, కలసిమెలసి = కూడి, వలచి = ప్రేమించి, వలపింపఁజేయుచున్ = ఆమెకుఁ దనయందుఁ బ్రేమ పుట్టునట్లు చెసికొనుచున్, అలరువిలుతుకేళిన్ = మన్మథక్రీడయందున్, తేలించెన్ = తృప్తిపఱిచెను

సీ. అధరామృతము విభుం ♦ డానఁ బల్నాటిన
హాయించుఁ గన్బొమ ♦ దోయి యెంచుఁ
గాంతుండు ముందుగాఁ ♦ గరఁగిన చో విన్నఁ
బోవుట వాలుచూ ♦ పులనె కాంచుఁ
జెలువుండు గనుదామ ♦ రలు ముద్దులిడ నంటు
కాటుక కెమ్మోవిఁ గాంచి నవ్వు
వరుఁడు పైకొని వేడ్క ♦ మరుతావు లంటినఁ
గరఁగి సిబ్బితి నెమ్మొ ♦ గంబు వంచు
వింతగిలింతలకు నుల్కు ♦ వీడియంపుఁ
వలపులకుఁ జొక్కు వల పను ♦ వలను జిక్కుఁ
దక్కుదొంతరముద్దుల ♦ మక్కు వలర
మరునిపనిఁ దేలువేళ న ♦ మ్మగువమిన్న. 100

అమ్మగువమిన్న = ఆస్త్రీరత్నము, మరునిపనిన్ = మన్మథక్రీడచేన్, ఆనన్ = త్రావఁగాన్, విన్నఁబోవుటన్ = తెలతెలఁబోవుటను, చెలువుండు = ప్రియుఁడు, మరుతావులు = కళాస్థానములను, సిబ్బితిన్ = సిగ్గుతోన్, ఉల్కున్ = జడియును, వీడియంపువలపులకున్ = తాంబూలము నందలిసువాసనలకున్, చొక్కున్ = పరవశురాలగును. వల పనువలన్ = మోహ మనువలయందున్, దొంతరముద్దుఁలన్ = ఎడతెగని చుంబనములందున్, మక్కువ = కూరిమి. తక్కినది సుగమము.

వ. ఇవ్విధంబున నవ్వారిజాక్షి మవ్వంపుజవ్వనంపుఁగ్రొవ్వారుతమకం బవ్వారిగా నవ్వారిజాక్షుండు తదీయమాధ్యలజ్జాపరిత్యాగంబు గా

వించి మించినయనురాగంబున వివిధబంధవిచిత్రక్రీడావినోదంబులం
దేలించుచు నంచితభోగంబులఁ జొక్కం బగునక్కేకయపురంబునం
గొన్నిదినంబు లుండి యత్తమామ లగుశ్రుతకీర్తిధృష్టకేతులయను
మతి నొంది వందనం బిడి తదీయపురోహితబంధుమిత్రామాత్యుల
కు వాంఛితార్థప్రదానంబుల నానందంబు గూర్చి కనకమణిమయా
భరణాంబరసుగంధద్రవ్యపరిపూర్ణపేటికాందోళికాది సమస్తవస్తుసం
పదలతోడం బరిచారికాశతసహితంబుగా భద్రాంగనారత్నంబుం
దోడ్కొని చతురంగబలవిలసితనిజపరివారంబుతో వెడలి కతిపయ
ప్రయాణంబుల నిఖిలమంగళాకరం బగుద్వారకానగరంబుఁ బ్రవే
శించి రుక్మిణీసత్యభామాదిదేవీకలితనిరంతరభోగంబు లనుభవించు
చు సుఖం బుండె ననిశుకయోగీంద్రుండు పరీక్షిన్నరేంద్రునకుం
దెలిపె. 101

అవ్వారిజాక్షుండు = ఆకృష్ణుఁడు, ఇవ్విధంబునన్ = ఈప్రకారముచేతను, అవ్వారిజాక్షీ... తమకంబు, అవ్వారిజాక్షి = ఆభద్రయొక్క, మవ్వంపు = కోమలమైన, జవ్వనంపు = పడుచుఁదనమువలనఁ (కలిగిన) క్రొవ్వారుతమకంబు = మదముతోఁ గూడినమోహము, అవ్వారి = అధికము, కాన్, తదీయ......గంబు, తదీయ = ఆభద్రాసంబంధమైన, మౌగ్ధ్య = ముద్దరాలితనముచేఁ (కలిగిన) లజ్జా = సిగ్గుయొక్క, పరిత్యాగంబు = విడుపును, కావించి = చేసి, మించినయనురాగంబునన్ = అధికమైనయనురాగముచేతను, వివిధ......లన్, వివిధ = పెక్కుతెఱంగులు గల, బంధ = సంభోగవిశేషములచేతను, విచిత్రక్రీడావినోదంబులన్, విచిత్ర = ఆశ్చర్యమును గలిగించెడు, క్రీడా = ఆటలయందలి, వినోదంబులన్ = వేడుకలచేతనును, తేలించుచున్ = తృప్తిపఱుచుచున్, అంచితభోగంబులన్ = మనోహరమైనసుఖానుభవములచేతను, చొక్కంబు = స్వచ్ఛమైనది, (సంతసము నిచ్చునది) అగునక్కేకయపురంబునన్, కొన్ని దినంబులు, ఉండి, అత్తమామలగుశ్రుతకీర్తిధృష్టకేతులయనుమతిన్, ఒంది = పొంది, వందనంబిడి = నమస్కరించి, తదీయపురోహితబంధుమిత్రామాత్యులకున్ = వారిసంబంధు లగుపురోహితులకుఁ జుట్టములకుఁ జెలికాండ్రకు మంత్రులకును, వాంఛితార్థప్రదానంబులన్ = కోరినవస్తువుల నిచ్చుటచేతను, ఆనందంబు = సంతసమును, కూర్చి = ఘ

టించి, కనక......తోడన్, కనకమణిమయ=బంగారుయొక్కయు మణులయొక్కయు వికారమైన, ఆభరణ=నగలతోడను, అంబర=వస్త్రములతోడను, సుగంధద్రవ్య=పరిమళవస్తువులతోడను. పరిపూర్ణ=నిండిన, పేటికా=పెట్టెలు, ఆందోళికాది=అందలములు మొదలగు, సమస్తవస్తుసంపదలతోడన్=సకలపదార్థములసంపత్తుతోన్, పరిచారికాశతసహితంబుగాన్, పరిచారికా=పనికత్తెలయొక్క, శత=శతముతో, సహితంబుగాక=కూడునట్లు, పెక్కండ్రుపరిచారికలతో ననియర్థము. భద్రాంగనారత్నంబున్, తోడ్కొని=తీసికొని, చతురంగబలవిలసితనిజపరివారంబుతోన్=నాల్గువిధములబలముతోఁ బ్రకాశించుతనపరిజనముతోన్, వెడలి, కతిపయప్రయాణంబులక=కొన్ని పయనములచేతను, నిఖిలమంగళాకరంబు=ఎల్లశుభములకునికిపట్టు, అగుద్వారకానగరంబుక, ప్రవేశించి, రుక్మిణీసత్యభామాదిదేవీకలితనిరంతరభోగంబులు=రుక్మిణి, సత్యభామ మొదలగుభార్యలతోఁ బొందఁబడిన యెడతెగనిసుఖములను, అనుభవించుచున్, సుఖంబు=సుఖముతోక, ఉండెక, అని, శుకయోగీంద్రుండు, పరీక్షన్నరేంద్రునకుక, తెలిపెక.

> క. శుభదాశ్రీకృష్ణుల
> శోభనచరితంబు వినిన ♦ సుస్థిరచిత్తుం
> డై భువిఁ జదివిన వ్రాసిన
> నాభక్తుఁడు గాంచు నిహప ♦ రానందంబున్. 102

(సుగమము.)

> శా. తేజఃపంకజరాజ రాజ జనతా ♦ ధృగ్గౌతమీతీరవి
> భ్రాజద్రాజమహేంద్రపట్టణవర ♦ ప్రాంతస్థిరస్థాపితా
> వ్యాజాన్నప్రదసత్త్ర సత్ప్రపర ♦ త్వన్మధీశ ధీశాలితాం
> భోజాతప్రభవా భవాచ్యుతసమ ♦ ప్రోద్యన్మనోభావనా. 103

తేజఃపంకజరాజ, తేజః=ప్రకాశముచేతను, పంకజరాజ=సూర్యుఁడా, (సూర్యసదృశుఁడాయనియర్థము.) రాజ=జనులరంజించుప్రభువా, జనతా.....సత్ప్ర, జనతా=జనసమూహమును, ధృత్=ధరించినట్టియు, గౌతమీతీర=గౌతమి యనునదియొడ్డున, విభ్రాజత్=ప్రకాశించునట్టియు, రాజమహేంద్రిపట్టణవర=రాజమహేంద్రి యనుపట్టణశ్రేష్ఠముయొక్క, ప్రాంత=సమీపప్రదేశమందుఁ, స్థిర=స్థిర

ముగాఁ, స్థాపిత=కట్టింపఁబడిన, అవ్యాజ=దంభము లేకుండునట్లుగాన్, అన్నప్ర ద=అన్నము నిచ్చెడు, సత్రి=సత్రముగలప్రభువా! సత్రప..... శ, సత్రప=లజ్జ తోఁగూడిన, (లజ్జపొందిన యనియర్థము) పరక్ష్మాధీశ=శత్రురాజులు గలప్రభువా! (దానశౌర్యాదులచేఁ బగవారికి లజ్జ పుట్టించువాఁడా యనియర్థము.) ధీశాలి... ...ప్రభువా, ధీశాలితా=బుద్ధికలిమిచేతను, అంభోజాతప్రభవా=బ్రహ్మదేవుఁడా! భవా......భావనా, భవ=శివునందును, అచ్యుత=విష్ణువునందును, సమ=తుల్య ముగాన్, ప్రోద్యత్=ఉదయించుచున్న, మనోభావనా=మనసునందలితలఁపు గల స్వామీ! (శివకేశవు లిద్దఱియందును సమానాభిప్రాయము గలప్రభువా యనియర్థము)

క. భీమధ్వనిభరితజయఢ
మామాచౌహత్తిమల్ల ♦ మల్లవరాఖ్య
గ్రామోపాంతవినిర్మిత
భూమహితాంభోధితులిత ♦ భూరితటాకా. 104

భీమధ్వని......ఢమామా, భీమ=భయంకరమైన, ధ్వని=ధ్వనితో, భరిత=పూర్ణమైన, జయఢమామా=జయభేరి గలప్రభువా! చౌహత్తిమల్ల=చౌహత్తిమల్లుఁ డను బిరుదు గలవాఁడా! మల్లవరాఖ్య......తటాకా, మల్లవరాఖ్య=మల్లవరమను పేరు గల, గ్రామ=గ్రామముయొక్క, ఉపాంత=సమీపమందు, వినిర్మిత=త్రవ్వింపఁబడినదియును, భూమ=బాహుళ్యముచె, హిత=(జనులకు) మేలుచేయునదియును అంభోధితులిత=సముద్రముతోఁ బోల్పఁబడిన, భూరితటాకా=పెద్దది యగుచెఱువు గలస్వామీ! మల్లవరగ్రామమున సముద్రముంబోలిన పెద్దచెఱువు త్రవ్వించినప్రభువా యనియర్థము

విలోమసర్వగ్వృత్తము.

రాజజాకారితా ♦ రామరాయాజతా
దాజగోధీశమా ♦ ధారనారాజమా
మాజరానారధా ♦ మాశధీగోజదా
తాజయారామరా ♦ తారికాజాజరా. 105

దీనిని మొదటినుండి కడవఱకుం జదివినట్లే కడనుండి మొదటివఱకుం జదివినను భేద ముండదు.

## పదచ్ఛేదము.

రాజజాకారితా - రామరాయా - జతాదా - జగోధీశ - మాధార - సారాజమా - మాజరా - సారధామా - శధీ - గోజ - దాతా - జయారామ - రాతారి - కాహాజరా

రాజజాకారితా = జయంతునియాకారముం బోలినయాకారము గలప్రభువా! (రాజ = ఇంద్రునివలనను, జ = జన్మించినవాఁడు, రాజజుఁడు = జయంతుఁడు. అతనియాకారము = రాజజాకారము. అది యితరులకు సంభవింపమిచే దానిం బోలినయాకారము గలవాఁడు రాజజాకారితుఁడు దీనిసంబోధనము రాజజాకారితా (ని) రాజా ప్రభౌనృపే చంద్రేయక్షే క్షత్రియశక్రయోః ఇ) జతాదా, జ = జయమును, తా = కరుణయును, దా = మాపులయందుఁ గలప్రభువా (ని) జోజవేవిజయేమేకా యని యును, తకబ్దః పుంసిసంభోగేనిశ్చయేకోపవ్రుచ్చమోఃదాతువాదపదాహో శకరుణా యాంతుతాస్త్రీ యీనా మనియును దంక్షిబేపాః వైరాగ్యకేక్రేష్వవలోకనే యనియును నానార్థరత్నమాల. జగోధీశ, జ = తేజముచే, గోధీశ = సూర్య (సదృశుఁడా) గో + అధిశుఁడు = గోధిశుఁడు, గో = కిరణములం, అధీశుఁడు = ప్రభువు. సంబుద్ధిగోధీశ (ని) జంకేజేభూమవేపత్నాన్యంతే. స్యంబునిజన్మని యనియును గౌః క్రితే వృషభే చంద్రే వాగ్బాణస్థేనపుంస్త్రియాంద్వ యోస్తుశ్మద్విగ్వాక్స్వర్గక్రాంబులోవస ని యును నానార్థరత్నమాల) మాధార, మ = జనముదాయమునకు, ఆధార = ఆశ్ర యుఁడా! (ని) మాస్యయంప్రతిషేధే. జనేతుస్యాన్నపుంసకం. నా నా సారాజ మా, సా = దేవాకాంగిచేతను, రాజమా = సందర్శింపఁదగలప్రభూ, (ని) మాశ్రీమా నేమృతౌ వేలామేధాశ్రీమద్యమాతృషు అనియు సశిపుంస్యమాసుతేవాయాదేవాకాం తౌతుసాస్త్రియాం అనియునానార్థరత్నమాల మాజరా, మా = మరల్పదయు సెడు, జ = భూమనమును, రా = గ్రహించినప్రభువా! రాతదానే ధా. కృ. సారధామా = బలమునకు నివాసస్థానమా, (ని) సారోబలేస్థిరాంసేచ యనియును, సంస్థాయామున్ట జంధామనివేశక్స్వరణాంక్షుయు యనియుచమరుఁడు శధీ = కీర్తినిధి. (ని) శంక్షిబే శా స్త్రీక్రేశయసిమింగ్ కేకీర్త్యాశక్రాయుధేన్వర్గే నా నా (శ = కీర్తి, ధ = ఉండునట్టిస్థల ము) గోజ, గో = వాక్యములవిషయమై (విద్యావిషయమై యనియర్థము) అజ = బ్రహ్మదేవుఁడా, దాతా = దానశీలుఁడా! జయారామ, జయ = శత్రువిజయమునకొ కి, అ = గౌరవముగను, రామ = రామసదృశుఁడా! (ని) అకారోబ్రహ్మవిష్ణీష శకమశేన్వరు( రెంతెగస్తితే హేంతే నా. నా రాతారి = దరించినశత్రువులుగ

లప్రభువా' (ర = క్షయమును, అత = పొందిన, అతసాతత్యగమనే. ధా. కృ అరి = శత్రువులుగలవాఁడు (ని) రఃపుమాన్ పావకేకామే క్షయేవజ్రేశయేనతా. నా నా) కాజాజరా, క = బ్రహ్మవిషయమై, అజ = శివవిషయమై, అ = విష్ణువిషయమై, జ = పుట్టిన, రా = ధ్యానముకల, రామరాయా! = రామరాయప్రభూ (ని) కోబ్రహ్మాత్మనిలార్కాగ్ని చిత్తధీయమకేకిషువిష్ణావాచాతిశబ్దే యనియును అజశ్శంభౌవిష్ణుధాత్రో యనియును నానార్థరత్నమాల. ఇది చతుర్థాశ్వాసము.

గద్యము.—ఇది శ్రీమహాభారతీప్రసాదాసాదితకవితామతల్లికా
ల్లమరాజవంశజాపస్తంబసూత్రవదెల్లనార్యపౌత్ర
రంగరాయనామార్యపుత్ర హారితసగోత్ర
పవిత్ర సుకవిజనవిధేయ సుబ్రహ్మణ్యాక
వినామధేయప్రణీతం బైనభద్రాపరిణ
యం బనుమహాప్రబంధంబునందు
సర్వంబును జతుర్థాశ్వాసము
శ్రీ శ్రీ శ్రీ

సీ. శాలివాహనశక ♦ సంవత్సరము లిందు
గగనకరీందుసం ♦ ఖ్యల నెసంగ
జరుగుప్రమాదివ ♦ త్సరమార్గశిరశుద్ధ
సప్తమీశుక్రవా ♦ సరమునందు
శ్రీమహారాజభూ ♦ షితచరిత్రుండు సూ
ర్యారాయభూనాయ ♦ కాత్మజుండు
రావుగంగాధర ♦ రామరాయక్షమా
ధవుఁడు సుబ్రహ్మణ్య ♦ కవివరునకుఁ
బీరపురదుర్గసౌధంపుఁ ♦ బెద్దకొలువు
నందు భద్రాపరిణయకా ♦ వ్యంబు నంది
యధికతరమాన్యభూమి వె ♦ య్యాఱులును సు
వర్ణవలయంబులును సేలు ♦ వలు నొసంగె.